

అఖిల
అఖిల భారత పత్రిక
జనవరి 2018
వోదయానికి నాంది

సంపాదకీయం

నూతన సంవత్సరాగమన వేడుక ఒక సాంప్రదాయం. జీవిత పరమార్థ సాధనలో మన అన్వేషణలను, ప్రయత్నాలను పునః ప్రారంభించి వాటిని క్రియాశీలం గావించుటకు మరియు అభ్యుదయ పథంలో మనకు అవరోధంగా నున్న గుదిబండ లాంటి గతకాల ఆలోచనలను తొలగించుకొనుటకు దానిని అనువైన అవకాశంగా ఉపయోగించుకుందాం. మన భవిష్య కార్యక్రమాలకు రూపకల్పన గావించే రోజు ఇది. అటువంటి భావనతో శ్రీమాత తమ సంగీత సుధాస్రవంతితోను, తమ దూరదృష్టితో గ్రహించిన భవిష్య ఘటనలకు సూచికగా తమ భవిష్య వాణిని దివ్యసందేశాల రూపంలో నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. అది ఎలా గుండిందంటే ఉన్నతతర జీవితంపై ఆశలు పెట్టుకున్న వారికి రాబోయే సంవత్సరంలో గల సంభావ్యతలను గురించి, ఎదురుకాబోయే ఇబ్బందులను గురించి ఒక హెచ్చరికలా ఉండింది; ముఖ్యంగా మనం అవలంభించ వలసిన వైఖరిని గురించి.

ఈ సంచికలో శ్రీమాత ఇచ్చిన నూతన సంవత్సర సందేశాలను కొన్నింటిని, వివరణలతో పాటు ప్రచురించాము.

సర్వ వైభవోపేత, సర్వ సౌందర్యరాశి, సర్వ చైతన్యమయి, సర్వ శక్తిమయి, సర్వానందమయి అగు శ్రీమాతకు మనల్ని ప్రతి దినం, ప్రతి మాసం, ప్రతి వత్సరం చేరువగా, అతి చేరువగా చేరవేయును గాక.

సంపాదకుడు

రెండు నూతన సంవత్సర సందేశాలు

డిసెంబరు 29, 1913

ఓ ప్రభూ, ఈ సంవత్సరాంతంలో సమిష్టిగా చేయబడిన తీర్మానం మా జీవితాలలో కూడా ఎట్టి ప్రయోజనం లేని మొత్తం బంధాలను మరియు అనుబంధాలను, భ్రాంతులను మరియు బలహీనతలను అంతం చేయడానికి ఒక అవకాశం అగునట్లు అనుగ్రహించు. ప్రతి క్షణం రాలుతున్న దుమ్ము, ధూళిని దులిపివేయునట్లుగా గతాన్ని సైతం, మన ముందు అనుక్షణం బహిర్గతమౌతున్న పవిత్ర మార్గాన్ని కళంకితం చేయకుండునట్లు దులిపి వేయాలి.

మాలో గుర్తించబడి, సరిదిద్దబడిన తప్పిదాలు ఎలాంటి పర్యవసానాలు కలిగించుటకు శక్తిహీనమైన, వ్యర్థమగు ఎండమావుల లాంటివి అగు గాక. ఇకపై ఉనికి ఉండకూడని సమస్త అజ్ఞానం, అస్పష్టత, అహంకారాలపై ఉక్కుపాదం మోపుదాం. మా ప్రయాణం విశాల భావనా సీమలు మరియు దేదీప్యమాన కాంతి, మరింత అధికమైన నిష్కళంక కారుణ్యం, మరింత నిస్వార్థమైన ప్రేమ దిశగా... ముఖ్యంగా మీ వైపుగా, ధైర్యంగా సాగాలి.

ఓ ప్రభూ, మా జీవితేశ్వరా, మీకు స్వాగతం. సమస్త భూమండలంపై మీ ఏలుబడిని ప్రకటించాలని నా కోరిక.

CWM 1;42 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

(Prayers and Meditations)



సమిష్టి ఆకాంక్ష శక్తి

ఒక సామరస్యపూర్వక సమిష్టి ఆకాంక్ష పరిస్థితుల గమనాన్ని మరో దిశకు మార్చగలదు.

శాస్త్రీయ నామం:హోయ కార్నోజా


జనవరి 1, 1914

అన్ని వరాలను ప్రసాదించే మహోన్నతుడవగు మీకు, జీవితాన్ని పవిత్రీకరించి, అందమైనదిగా రూపొందించి, ఉత్తమమైనదిగా తీర్చిదిద్దటంతో దానికి సార్థకతను చేకూర్చగల మీకు, మా ఆకాంక్ష లన్నింటి యొక్క భవితవ్యానికి, గమ్యానికి అధిపతి వగు మీకు ఈ నూతన సంవత్సర ప్రథమ క్షణం అర్పించబడింది.

ఈ సమర్పణతో అది మహా మహిమాన్వితం అగు గాక; మిమ్ములను ఆశించేవారు సరియైన మార్గంలో మిమ్ములను బడయుటకు ప్రయత్నింతురు గాక; మిమ్ములను పొందగోరేవారు, మిమ్ములను కనుగొందురు గాక; బాధపడేవారు, ఉపశమనం ఎక్కడ లభిస్తుందో తెలియనివారు, వారి మసక బారిన చేతనను కప్పి వుంచిన బిరుసైన పొరను మీ తత్వం క్రమక్రమంగా చీల్చివేస్తున్న అనుభూతి పొందుదురు గాక.

అత్యంత భక్తిశ్రద్ధలతో, అమితమైన కృతజ్ఞతా భావనతో, మీ క్షేమంకర శోభ ముందు శిరసు వంచి నిలుచున్నాను; మీ అంతట మీరు ప్రత్యక్ష మైనందుకు భూమండలం తరఫున కృతజ్ఞతాభి వందనములు సమర్పిస్తున్నాను; భూమండలం తరఫుననే ఎప్పటికన్నా ఎక్కువ సంపూర్ణంగా దివ్యకాంతి దివ్యప్రేమల నిరాటంకమగు ఎదుగుదలతో, మీ అంతట మీరు ప్రత్యక్షమవాలని వేడుకుంటున్నాను.

మా ఆలోచనలకు, మా అనుభూతులకు, మా చర్యలకు అధిపతివగు రారాజుగా నుండుము.



దైవం నుండి దివ్యప్రేమ
ఒక ప్రత్యేక కేంద్ర బిందువుపై దైవం
ప్రయోగించే ప్రేమ స్పందన

శాస్త్రీయ నామం: రోజా

మీరే మా వాస్తవమైన అస్తిత్వం, ఏకైక దివ్య యదార్థత.
మీరు లేనిదంతా అసత్యం, భ్రాంతి, అంతా అంధకార మయమగు అస్పష్టత.
మీలో జీవం, వెలుగు, ఆనందం ఉన్నాయి.
మీలో పరమోత్కృష్టమగు పవిత్రత ఉన్నది.

CWM 1;43 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

నూతన సంవత్సర సందేశాలు

1933

నూతన సంవత్సర ఆవిర్భావం మన చేతన యొక్క క్రొత్త జన్మ యగుగాక. గతాన్ని మన వెనుక అతి దూరంగా వదిలేసి ఉజ్వల భవిత దిశగా పరుగిడుదాం.

1934

ప్రభూ, ఈ సంవత్సరం గతిస్తున్నది. ఇక మా కృతజ్ఞత మీకు శిరసు వంచి నమస్కరిస్తున్నది.

ప్రభూ, సంవత్సరం పునర్జన్మ నెత్తింది. మీ వైపు ప్రార్థనా పూర్వకంగా మా చేతులు లేస్తున్నాయి.

మాకు కూడా ఇది ఒక నూతన జన్మ ఉషోదయ మగుగాక!

1935

ఈ సాయంత్ర సమయాన కృత్రిమమైన దానిని, మరియు మోసపూరితమైన దానినంతా, నటించేది మరియు అనుకరించే దాని నంతా మీకు అప్పగిస్తున్నాము. అంతానికి చేరిన సంవత్సరంతో పాటు అది కూడా అంతమై పోనీ. ఏదైతే సంపూర్ణ సత్యమైనదో, నిష్కపటమైనదో, నిజాయితీ గలదో మరియు స్వచ్ఛమైనదో అది మాత్రమే ప్రారంభమౌతున్న సంవత్సరంలో నిలిచి వుండనీ.

CWM 15;165

1936

ఓ ప్రభూ, ఈ సంవత్సరం మీ విజయోత్సవ సంవత్సరంగా ఆమోదించు. ఒక సంపూర్ణ విశ్వాస పాత్రులుగా యోగ్యత పొందాలని మేము ఆకాంక్షిస్తున్నాము.

1937

ప్రతి విఘ్నం పై విజయం సాధించగల, ఓ ప్రభూ, మీకు జయమగు గాక.

మాలోనున్న దేదీ మీ కార్యానికి ప్రతిబంధకము కాకుండునట్లు అనుగ్రహించు.

1938

ప్రభూ, మాలోని ప్రతివిషయం మీ సాక్షాత్కారానికి సిద్ధపడి వుండునట్లుగా అనుగ్రహించు. నూతన సంవత్సర ప్రారంభ సందర్భంగా, ఓ ప్రభూ, మీకు అవనత శిరస్కులమై ఉన్నాము.

1939

పవిత్రీకరించు సంవత్సరంగా నుంటుంది.

ఓ ప్రభూ, దైవకార్యక్రమంలో పాలు పంచుకొనే వారంతా మిమ్ములను వేడుకొంటున్నారు: ఒక సర్వోత్కృష్ట పవిత్రీకరణ ద్వారా వారు అహం యొక్క ఆధిపత్యం నుండి విముక్తి పొందాలని.

1940

మౌనంగా నుంటూ, ఆశతో నిరీక్షించే సంవత్సరం.

ఓ ప్రభూ, మాకుగల ఆధారమంతటినీ మీ దివ్యానుగ్రహంలో మాత్రమే కనుగొందుము గాక.

CWM 15;166

1941

ప్రతికూల మరియు ఆసురిక శక్తుల దాడితో భయానికి లోనైన ఆధ్యాత్మిక జీవ

నానికై ప్రపంచం పోరాడుతున్నది.

ప్రభూ, మీ శోభ భూమండలంపై అభివ్యక్తమగుటకై పరాక్రమవంతులగు యోధుల మగుటకు మేము అభిలషిస్తాము.

1942

ఓ ప్రభూ, ప్రతి శత్రువును జయించగల మీకు జయమగు గాక.

మీ విజయంలో పాలు పంచుకొని దానిని అనుభవించే శక్తిని మాకు ప్రసాదించు.

1943

మౌలికమైన దానిని, నిశ్చితమైన దానిని ఎన్నుకోవలసిన సమయం ఆసన్న మయింది.

ప్రభూ, అసత్యాన్ని తిరస్కరించి, మీ విజయానికి అర్హతగల స్వచ్ఛమైన పరమ సత్యంలోకి ఎదగ గలిగే శక్తిని ప్రసాదించు.

ఇది సాధారణ సైద్ధాంతిక విషయానికి సంబంధించిన ప్రశ్న కాదు; విషయాల యదార్థతకు చెందిన విషయం. ఇది భౌతిక ప్రపంచంపై సార్వభౌమాధికారం చలాయించే దైవప్రతికూల అసురశక్తి. అసురుని శక్తి ప్రభావం ప్రతిచోట అనుభవ మౌతున్నది. పదార్థ ప్రపంచ మందలి ప్రతి దానిలోను కనబడుతున్నది. అయితే దాని నుండి విడివడి, స్వచ్ఛత నొంది, అసత్యము, ఆసురిక ప్రభావము తిరస్కరించ బడి, కేవలం దైవికమైన పరమసత్య వాతావరణంలో జీవించగలిగే సమయం ఇప్పుడు ఆసన్న మయింది.

CWM 15:176

1944

ఓ ప్రభూ, ప్రపంచం తనను తెలివిమాలిన బుద్ధి మాంద్యస్థితి లోకి ఎల్లప్పుడూ తిరిగి పడిపోకుండా నిరోధించమని మిమ్ములను వేడుకొంటుంది.

గుర్తించబడిన దాని పొరపాట్లు ఎప్పటికీ పునరావృతం కాకుండునట్లు అనుగ్ర హించు.

చివరిగా, దాని కార్యకలాపాలు ప్రకటించబడిన దాని ఆదర్శాల యొక్క కచ్చి

తమైన, నిజమైన వైఖరిని ప్రతిబింబించేవిగా నుండాలని అనుగ్రహించు.

CWM 15;167

1945

అంతర్జాతీయ వ్యవహారాల్లో సైతం మనుజులు తప్పకుండా శ్రద్ధగా, సత్యసంధత కలిగి వుండాలని అర్థం చేసుకొన్నప్పుడు మాత్రమే భూమండలం శాశ్వతమైన, చైతన్యవంతమైన శాంతిని అనుభవిస్తుంది. ఓ ప్రభూ, మా అభిలాష అంతా అట్టి పరిపూర్ణమైన సత్యసంధత కోసమే.

1946

ప్రభూ, మాకుండ వలసింది దైవికమైన మీ ప్రశాంత స్థితి, దానిని పోలినది కాదు. మాకుండ వలసింది దైవికమైన మీ స్వేచ్ఛాయుత వాతావరణం, దానిని పోలినది కాదు. మా కుండవలసింది దైవికమైన మీ ఐక్యతాభావన, దానిని పోలినది కాదు. ఎందుకనగా దైవికమైన మీ ప్రశాంత స్థితి, మీ స్వేచ్ఛాయుత వాతావరణం, మీ ఐక్యతా భావన మాత్రమే నేటికీ భువిపై రాజ్యమేలుతున్న అర్థంలేని దౌర్జన్యం, దంభాచారం, అసత్యాలను జయించగలవు.

ఎవరైతే ఈ దుష్ట పరిస్థితిపై మీ విజయం కోసం ఎంతో సాహసోపేతంగా పోరాడి, కష్టపడ్డారో వారు ఆ విజయంతో ప్రపంచమందు సాధించ బడిన యదార్థమైన మరియు స్థిరమైన ఫలితాలను అనుభవించునట్లుగా అనుగ్రహించు.

CWM 15;168

1947

ఏ క్షణాన ప్రతి విషయం హీన దశనుండి మరింత హీన దశకు దిగజారుతున్నట్లు కనిపిస్తుందో, అప్పుడు మన మొక పరమోత్కృష్టమగు దృఢమైన విశ్వాసంతో కార్యాచరణకు పూనుకోవాలి. దైవకృప మనలను ఎన్నడూ ఉపేక్షించదని తెలుసు కోవాలి.

CWM 15;168-69

ఉషోదయాపూర్వ ఘడియలలో ఎల్లప్పుడూ గాఢచీకట్లు అలముకొని ఉంటాయి.

స్వాతంత్రోద్యమానికి కాస్త ముందుండే కాలమందలి బానిసత్వం అన్నింటికన్నా అత్యంత బాధాకరంగా నుంటుంది.

కానీ విశ్వాసభరిత హృదయంలో దేదీప్యమానంగా నిరంతరం వెలిగే ఆశాజ్యోతి నిరుత్సాహానికి తావీయదు.

CWM 15;177

1948

పదండి ముందుకు, సదా పదండి ముందుకు!
వెలుగుంది సొరంగం చివరన...
విజయముంది యుద్ధం చివరన!

1949

ప్రభూ, నూతన సంవత్సరారంభ సందర్భంగా మిమ్మల్ని అడిగాను, నేనేం పలకాలో:

మీరు నాకు కఠినాతి కఠినమైన సంభావ్యతలను రెండు చూపారు. నన్ను మౌనం పాటించమని ఆజ్ఞాపించారు.

1950

ప్రసంగించకు - ప్రవర్తించు.
ప్రకటించకు - సాధించు.

1951

ప్రభూ, మేము ఈ పృథ్విపై మీ రూపాంతరీకరణ కార్యక్రమం నిర్వర్తించడానికి ఉన్నాము.అది మా ఏకైకమైన సంకల్పము, మేము నిర్వర్తించవలసిన ఒకే ఒక కృత్యము. అదే మా ఏకైకమైన వృత్తి కూడా అగునట్లు, మా చర్యలన్నీ మమ్ములను ఆ ఒక్క దిశగా ఉపక్రమించుటకు దోహదపడునట్లుగా అనుగ్రహించు.

CWM 15;169

1952

ఓ ప్రభూ, మా విశ్వాసం యొక్క ప్రామాణ్యతను, మా యొక్క యోగ్యతను మీ గీటురాయిపై పరీక్షించి నిర్ణయించడానికి మీరు నిశ్చయించారు. ఈ కఠిన పరీక్షలో మేము ఉన్నత స్థాయిలో, అధిక స్వచ్ఛతగల వారిగా నిరూపించబడాలని అనుగ్రహించండి.

1953

ప్రభూ, మీరు మాకు చెప్పారు, పట్టు వదలొద్దు, బిగించి పట్టుకో అని. ఎప్పుడైతే అంతా అయిపోయిందని అనిపిస్తుందో, అప్పుడే అంతా రక్షించబడేది.

1954

నా ప్రభూ, ఈ సంవత్సరానికి అందరికీ మీరిచ్చే సలహా: "దేనిని గురించీ ఎప్పుడూ బడాయి మాటలు పలకొద్దు. నీ గురించి నీ చర్యలు చెప్పాలి."

CWM 15;170

1955

చిట్టచివరకు, ఏ మానవ సంకల్పమైనా దైవసంకల్పానికి ఎదురొడ్డి గెలవలేదు. తాపీగా ఆలోచించి మనల్ని మనం పూర్తిగా దైవపక్షంగా నిలుపుకుందాం. ఇక తుదకు విజయం తథ్యం.

CWM 15;171

1957

ఒక అసుర శక్తిని మించిన దైవబలం మాత్రమే విజయం సాధిస్తుంది.

ప్రపంచాన్ని రక్షింప గలిగేది ఒక సిలువ వేయబడిన దేహంకాదు, ఒక మహిమాన్వితమగు దేహం.

CWM 15;172

1958

భౌతిక పదార్థ ప్రపంచ జననివగు ఓ ప్రకృతిమాతా, మీరు సహకరించెదమని అట్టి సహకారవైభవం అంతం లేనిదని మీరు నుడివారు.

CWM 15;173

1960

తెలుసుకోవడం మంచిది,

అలా జీవించడం ఉత్తమం,

అలా ఉండ గలగడం, సంస్కారం.

1962

పరిపూర్ణతకై మేము దాహార్థులం. అహం యొక్క పరిపూర్ణత ఏదైతే దైవికమైన పరిపూర్ణతా మార్గాన్ని ఆటంక పరుస్తుందో ఆ పరిపూర్ణతకై కాదు.

ఏ ఏకైకమైన పరిపూర్ణతకైతే శాశ్వతమగు పరమ సత్యాన్ని భువిపై సాక్షాత్కారింప జేసే శక్తి గలదో, దానిని.

CWM 15:173-74

1963

దైవ నిర్ణీత కాలానికి సంసిద్ధుల మవుదాం.

1964

మీరు సిద్ధపడి ఉన్నారా?

CWM 15:174

1966

పరమ సత్యామును సేవిద్దాం.

ఏది పరమ సత్యము? ఎవరు త్రికరణ శుద్ధిగా పరమ సత్యమును సేవించ

గోరుతారో వారు పరమ సత్యమును తెలుసుకుంటారు.
CWM 15:175

1968

యౌవనం నిలుపుకో, పరిపూర్ణతను పొందే దిశగా ఉద్యమించడం ఆపకు.
CWM 15:175

1971

ఎవరైతే దివ్యమైన భవిత దిశగా గంతు వేస్తారో, వారు ధన్యులు.
CWM 15:175

1972

మన మందరము శ్రీఅరవిందుల శత వార్షికోత్సవానికి యోగ్యత పొందే ప్రయత్నం చేద్దాం.
CWM 15:176

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

కొన్ని నూతన సంవత్సర సందేశాలపై వ్యాఖ్యలు

దివ్యానందపు అద్భుత ప్రపంచం (1961)

ఈ దివ్యానందపు అద్భుత ప్రపంచం మన ద్వారాల వద్ద మన పిలుపుకై నిరీక్షిస్తున్నది, భూమి మీదకు దిగి రావడానికై....

ప్ర: ఈ 'దివ్యానందపు అద్భుత ప్రపంచం' 29 ఫిబ్రవరి 1956 న జనించిన అతిమానస ప్రపంచము వంటిదే కదా లేదా అది వేరేనా? మీరు దానిని 'దివ్యానందపు ప్రపంచంగా' చెప్పారు కాబట్టి, అది కేవలం దివ్యానందం లేక అప్పటికే జనించిన అతిమానస ప్రపంచం యొక్క దివ్యానందం కాబోదు. దానర్థం, అతిమానస ప్రపంచం అభివ్యక్తమైన తరువాత, ఇప్పుడు మరొక నవ్య ప్రపంచం

మన భూమి మీద అభివ్యక్తం కావడానికి 'మన ద్వారాల వద్ద మన పిలుపుకు నిరీక్షిస్తున్నది' అనేనా?

స: సృష్టి ఆరంభం నుంచి అది ఎల్లప్పుడూ నిరీక్షిస్తూనే ఉన్నది.

ప్ర: ఈ దివ్యానందపు ప్రపంచమేనా క్రమానుగతంగా వరుసలో వచ్చేఉనికి అంతస్తులలో అతిమానస ప్రపంచంపైన ఉన్నది? అలా అయినట్లైతే, దానర్థం, అతిమానస ప్రపంచం అది జనించిన ఆరు సంవత్సరాల తర్వాత ఇప్పుడు పూర్తిగా భూమిమీద సుస్థాపితమై, ఇంకా ఉన్నతోన్నత ప్రపంచం అభివ్యక్తం కావటానికి సాధ్యం చేస్తున్నదనేనా?

స :అది తప్పని సరేమి కాదు.

ప్ర: పై విధంగా ప్రశ్నించటానికి కారణం, శ్రీఅరవిందుల ప్రకారం దివ్యానందపు టంతస్తు భూమిపై జరిగే పరిణామంలో అతిమానసం సుస్థాపిత మయ్యే దాకా అభివ్యక్తమవ లేదు.

స: ఇది పూర్తిగా సుస్పష్టమే.

ప్ర: "మన ద్వారాల వద్ద నిరీక్షిస్తున్నది" అనే దానికి అర్థం ఏమిటి? దానర్థం అతి సూక్ష్మ భౌతిక తలం వరకు కిందికి దిగివచ్చిందనేనా?

స: నేను అవి ఏ ద్వారాలనే దానిని స్పష్టంగా నిర్దేశించలేదు.

ప్ర: "మన ద్వారాల వద్ద మన పిలుపుకు నిరీక్షిస్తున్నది, భూమి మీదకు దిగి రావటానికై....." దానర్థం, పిలిస్తే కాని అది భూమి మీదకు కిందికి దిగి రాదనేనా?

స: కచ్చితంగా కానే కాదు.

ప్ర: ఈ దివ్యానందపు ప్రపంచాన్ని కిందికి పిలవటానికి అత్యుత్తమ మార్గం ఏమిటి?

స: అవగాహన చేసుకోవటం మరియు చిత్తశుద్ధితో ఉండడం.

ప్ర: ముద్రించబడిన మీ 5 ఫొటో కాపీలను, ప్రతిదానికి వాటి ప్రాధాన్యతతో, మీరు 21 జనవరి 1961 న అందరికీ పంచిపెట్టారు; దివ్యానందపు ప్రపంచాన్ని కిందికి పిలవటానికీ, దానికీ ఏమన్నా సంబంధం ఉందా? అవి పిలుపుకు వలసిన తోడ్పాటుకై ఇచ్చినవే అయితే, వాటిని ఆ ఉద్దేశానికి తగ్గట్టుగా ఎంత బాగా వినియోగించుకోగలం?

స: ప్రతివారు తమకు తాముగా దానిని తప్పక తెలుసుకోవాలి.

ప్ర: ఈ ప్రపంచాన్ని కిందికి పిలువటానికి మీ సందేశాన్ని ఒక ప్రార్థనగా మార్చి, నిశ్శబ్దమైన ఏకాగ్రతలో ఈ విధంగా పునశ్చరణచేస్తే, సహాయకారి అవుతుందా? " మాద్వారాలవద్ద పిలుపుకోసం వేచిఉన్న ఓ అద్భుత దివ్యానందపు ప్రపంచమా, కిందికి భూమిమీదకు దిగిరా....."

స: ఎవరైతే తటాలున అప్రయత్నంగా చేయాలనే అనుభూతి పొందుతారో, వారికది సహాయకారి.

ఎల్లప్పుడూ ఏదో ఒకటి ఉంటుంది. - చాలా విషయాలు చెప్పకుండా వదిలివేసినది.

CWM 15:177-179

భవిష్యత్తుకోసం పనిచేయడం (1970)

ప్రపంచం ఒక పెద్ద మార్పుకోసం సంసిద్ధమవుతున్నది. మీరు సహాయం చేస్తారా?

ప్ర: మీరిచ్చిన నూతన సంవత్సర సందేశం చెప్పేటటువంటి ప్రపంచంలోని పెద్ద మార్పుకు మేం ఏ విధంగా సహాయం చేయగలం?

స: కిందికి దిగివచ్చిన దివ్యచైతన్యాన్ని నీలో పరివర్తనకు పనిచేయనీయడమే అత్యుత్తమంగా సహాయం చేసే విధం.

*

ప్ర: "భవిష్యత్తుకోసం పనిచేయడం"అంటే ఏమిటి?

స: వ్యక్తిగతంగాను, జాతీయంగాను పాత అలవాట్లకు అంటిపెట్టుకొని ఉండకుండా ఉండడం అనే దానితో మొదలుపెట్టడం.

*

నిజమైన కారుణ్యం నుంచి వచ్చే ఆనందంలో ప్రకాశవంతమైన ప్రశాంతతగా ఈ సంవత్సరమంతా ఉండనీ — దివ్యకారుణ్యంయొక్క మానవ శిశువు.

ఈ సంవత్సరంకూడా మనల నందరును మళ్ళీ ఒక్కసారి దగ్గరవకుండా సాగిపో కూడదనే మన మందరం ఆశించెదము గాక.

CWM 15:181- 82

ఈ నూతన సంవత్సరపు ఉషోదయం మనకి కూడా ఒక నూతనమైన మరియు

అతిమానస అభివ్యక్తత దండోరా (1956)

నూతన సంవత్సర సందేశం (1956): "అతి గొప్ప విజయాలు ఎక్కువ సందడి చేయవు. నూతన ప్రపంచ ఆవిష్కరణ, డప్పు మోతలతో దండోరా వేసేది కాదు."

ప్ర: మాతా, ఈ సంవత్సరం ఇచ్చిన సందేశాన్ని కొద్దిగా వివరిస్తారా?

దీనర్థం, బహుశా ఎంతో సులభమైనది: విషయాల గురించి మాట్లాడకుండా వాటి మానాన వాటిని జరగనివ్వడం మంచిది అని. నన్నడిగితే, దానర్థం ఇది అని అనుకుంటున్నాను: ఏదైనా జరగటానికి ముందే దానిని గురించి ఏమీ చెప్పకపోవడం చాలా మంచిది. అలా కాని పక్షంలో, అది నేను అన్న విధంగా,"డప్పుల మోత " అవుతుంది, అలా చేస్తే, అది ప్రచారం అనిపించుకుంటుంది.

అది కొంతమంది అడుగుతూ ఉండే విధంగా, "అది ఎలా ఉంటుంది?" అన్నట్లుగానుంటుంది. ముందు ముందు మనం చూద్దాం! ఓరిమితో ఎదురు చూడు, కనీసం మనకది ఆశ్చర్యాన్ని కలిగించాలి!... ఇక నా సమాధానం, "దాని గురించి నాకు ఏమీ తెలియదు." కారణం తక్షణమే ప్రపంచం ఇప్పుడు ఎలాగైతే ఉన్నదో అలాగే ఉన్నటువంటి దాని చైతన్యంలో, దేనికైతే అసాధారణ విషయాలు జరగబోతున్నాయని ప్రకటించబడిందో, దేనినైతే పూర్తిగా ఊహించ నలవికానిదో దానికి నన్ను నేను అప్పగించుకొంటారు. కారణం, నీకు నేను ఒకసారి చెప్పాను, ఒకరు దాని గురించి ఊహించటం మొదలు పెట్టినట్లైతే, దానర్థం వారు అప్పటికే అందులో ఉన్నట్లే. నీవు దేనినైనా ఊహించటానికి ముందు, అది అక్కడ ఉండాలి, లేని యెడల నీవు ఊహించనే లేవు.

నిజమే, మన ఉన్నతోన్నత అస్తిత్వంలో అది ఏమిటనే దాని విషయంలో మనకు చాలా స్పష్టమైన, చాలా కచ్చితమైన, చాలా ప్రకాశవంతమైన అవగాహన ఉంటుంది. కాని ఒకరు భౌతిక చైతన్యంలోనికి దిగివచ్చినట్లైతే, వారు చెప్పాల్సిందల్లా, "మంచిది, దాని గురించి నాకు ఏమీ తెలియదు." అది అక్కడ ఉన్నప్పుడు, అది ఎలా ఉంటుందో నేను చెప్తాను. బహుశా నేను చెప్పాల్సిన అవసరం కూడా ఏమీ లేదు. నీవే దానిని చూడగలుగుతావు. అలా చూసే వారిలో నీవు ఒకడవని నేను

ఆశిస్తున్నాను. కారణం, అక్కడ కూడా, చూడడానికి సామర్థ్యం లేనివారు కొంతమంది ఉంటారు.

ఇప్పుడు తెలిసింది కదా, దాని వలన ఉపయోగమేముంటుంది? ప్రజలందరికీ తిరుగుతూ అదే పనిగా, "అది అక్కడ ఉంది నీకు తెలుసా, అది ఈ విధంగా ఉంటుంది" అంటూ చెప్పినందువల్ల ప్రయోజనమేముంటుంది. ఇక్కడ ప్రదర్శించబడిన నాటకంలో లాగా, "కాని నాకేమీ కనబడటంలేదు" అనే వారు సమాధానం ఇస్తారు. నీకు గుర్తుందా, ఆ 'లెపెజ్' నాటకం, అందులో వార్తాహరుడు దైవం అక్కడ ఉన్నాడు, నీవు చెప్పేది వింటున్నాడని అన్నప్పుడు నీకు గుర్తుందా? అప్పుడు ఎవరో ఒకరు సమాధానం ఇస్తారు. "కాని నాకు వారు కనిపించటంలేదు!" అది అటువంటిది.

అది ఆశ్రమం చూడటానికి వచ్చే ప్రజలు, "కాని ఇక్కడ ఆధ్యాత్మికత అంటూ ఏమీ లేదు!" అని అనే టటువంటిది. వారు ఏ విధంగా చూడగలరు? ఏ అవయవాలతో?

కాని నాకు ఇంకా ఆశ ఉంది, ఏదైనా అభివ్యక్త మైనప్పుడు నీవు దానిని చూడగలుగుతావని.

సహజంగానే అక్కడ ప్రకాశవంతమైన రూపాలు దర్శనమైనట్లైతే లేదా బాహ్య భౌతిక రూపాలు పూర్తిగా మారిపోయినట్లైతే, అప్పుడు నిజంగానే ఒక కుక్క లేదా ఒక పిల్లి కూడా లేదా మరేదైనా కానీ దానిని గుర్తించడం జరుగుతుంది. అది ఇప్పుడే జరగబోదు, అది ఎప్పుడో చాలా దూరంలో, చాలా కాలం తరువాత, దానికి ముందు చాలా గొప్పవిషయాలు జరుగుతాయి. అవి దాని కంటే చాలా ముఖ్యమైనవి. నా మాటలు గుర్తు పెట్టుకో.

కారణం, వాస్తవానికి కేవలం పూవు మాత్రమే. వికసిస్తుంది. కాని అది వికసించ టానికి ముందు, మొక్క వేళ్ళల్లో దాని ఉనికికి మూలమైన సూత్రం తప్పక ఉండాలి.

ప్ర: ఏదైనా అభివ్యక్తత ఉన్నట్లైతే, అది పూర్తిగా ఆధ్యాత్మికమౌతుందా? అనగా యోగం చేసేవారు మాత్రమే దానిని గ్రహించగలరా లేదా ప్రపంచంలోని వాస్తవికతల్లో ఏమైనా పర్యవసానాలుంటాయా?

స: నా బిడ్డా, నీవు దానిని భవిష్యత్తులోనే అని ఎందు కనుకుంటున్నావు? కొన్ని సంవత్సరాలుగా, అప్పటికే అసాధారణమైన, అద్భుతమైన పర్యవసానాలు, ప్రపం చంలో జరిగాయి. కాని ఇది చూడటానికి ఒకరికి తప్పక కొంత జ్ఞానం ఉండాలి,

లేని యెడల వారు వాటిని పూర్తిగా సహజమైనదిగా, సాధారణ విషయాల లాగానే చూస్తారు. కారణం, వారికి అవి ఎట్లా జరుగుతాయో కూడా తెలియదు.

కాబట్టి బహుశా ఇది కచ్చితంగా ఇదే విధంగా ఉండబోతుంది; విపరీతమైన మార్పులు, అద్భుతమైన చర్యలు జరిగే అవకాశం ఉంది: అప్పుడు ప్రజలు అంటారు, "కాని ఇది — సహజంగానే ఎదురుచూసిన విధంగానే అది అట్లా ఉంది!" కారణం, అది ఏ విధంగా వస్తుందో వారికి తెలియదు.

ప్రపంచంలో జరిగే చర్య అంటావా? — అది నిరంతరం జరుగుతూ ఉంటుంది. అది ఏదో వ్యాప్తి చెందుతూ, ప్రతిచోటా పనిచేస్తుంది, ప్రతిచోటా కొత్త మానసిక ప్రేరణలు, కొత్త ధోరణులు, కొత్త భావాలు, కొత్త ఇచ్ఛాపూర్వక చర్యలను వెలువరిస్తూనే ఉంటుంది — ప్రతి చోటా. కాని ఇంకా, ఒకరు అది ఏ విధంగా జరుగుతున్నదో చూడలేరు. కాబట్టి వారు అది "పూర్తిగా సహజమైంది" అని అనుకుంటారు, అలాగే చెప్తారు

అది పూర్తిగా సహజమే, కాని అది సర్వ సాధారణమైన ఒక భౌతిక మహాప్రకృతి కంటె మరొక సహజత్వంలో.

CWM 8:9-11

భౌతిక మహాప్రకృతి సహకారాలు (1958)

ఓ మహా ప్రకృతీ, భౌతిక దివ్యజననీ,
సహకరిస్తానని నీవు చెప్పావు,
మరి పరిమితి అనేది ఏమాత్రమూ లేదు
ఈ సహకార వైభవానికి,.

ప్ర: ప్రియమైన మాతా, ఈ సంవత్సరం సందేశానికి వివరణ ఇవ్వమని కోరుతున్నాను.

స: నేను కేవలం ఒక విషయం మాత్రమే చెప్తాను: నీవు ఈ అనుభవం అర్థాన్ని తప్పుగా అన్వయించుకో కూడదు. ఇప్పటి నుంచి ప్రతిదీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగిపోతుందని, మన వ్యక్తిగత కోర్కెలు తీర్చే విధంగా ఉంటుందని ఊహించుకో కూడదు. అది ఈ అంతస్తుపై కాదు. మనం వర్షం కురవకూడదనుకుంటే కురవదని అర్థం కాదు! మనం ఈ ప్రపంచంలో ఏదైనా జరగాలనుకొంటే అది

తక్షణం జరిగిపోతుందనే అర్థం కాదు; అంటే ఇబ్బందులన్నీ లేకుండా పోతాయని. ప్రతిదీ జానపద గాథలలో లాగా జరిగిపోతాయని కాదు. అది అటువంటిది కాదు. అది ఇంకా ఎక్కువ లోతైనది: మహాప్రకృతి తన శక్తుల క్రీడలో అభివ్యక్తమైన కొత్త దివ్యశక్తిని ఆమోదించింది, దానిని ఆమె తన గమనాలలో కలుపుకొన్నది. ఎల్లప్పుడూ ఉండే విధంగానే, మహాప్రకృతి గమనాలు ఒకానొక స్థాయిలో మానవ అంతస్తును మించిన అపరిమితమైన ఉన్నత స్థాయిలో, సర్వ సాధారణ మానవ చైతన్యదృష్టికి కనపడని విధంగానే ఉన్నాయి. అది ప్రపంచంలోకి వచ్చిన అంతర్గత, మానసిక సంభావ్యతే తప్ప భూసంఘటనలలో ఆకట్టుకొనే విధంగా అద్భుతంగా చూడబడే మార్పు కాదు.

ఇది నేను చెప్తున్నానంటే దానికి కారణం నీవు జానపద గాథలు భూమి మీద వాస్తవ రూపం దాలుస్తాయని విశ్వసించేటటువంటి ప్రలోభానికి లోబడతావని. దానికి ఇంకా సమయ మాసన్న మవలేదు.

విషయాలు ఎట్లా జరుగుతాయో తెలుసుకోవడానికి ఒకరికి తప్పక చాలా ఓపిక, చాలా విశాలమైన, చాలా సంక్లిష్టమైన దార్శనికత ఉండాలి.

జరగబోయే అలౌకిక సంఘటనలు, కథల పుస్తకాలలో జరిగేటటువంటి అలౌకిక అద్భుతాల వంటివి కాదు, అంటే అర్థం, కథలలో మాదిరిగా జరగవు. అవి కేవలం విషయాల యొక్క చాలా లోతైన దృష్టికి మాత్రమే దర్శనీయం — చాలా లోతైన, చాలా అవగాహనకు సంబంధించిన, చాలా విస్తృతమైన దృష్టికి.

దాని చర్యలను గుర్తించాలంటే ఒకరు తప్పక అప్పటికే దివ్యానుగ్రహ పద్ధతులను, దారులను అనుసరించ గలిగిన సామర్థ్యం కలిగినవారై యుండాలి. విషయాల గాఢతరమైన సత్యాన్ని చూడగలగటానికి ఒకరు బాహ్యంలో కనబడేవాటి వలన గుడ్డివాళ్ళు కాకుండా ఉండే సామర్థ్యాన్ని తప్పక అప్పటికే కలిగినవారై యుండాలి.
CWM 9:245-46

మహాప్రకృతి పాత పద్ధతులు — కొత్త విధానం

గంటసేపు సాగే మన తరగతులలో నేను మహాప్రకృతి యొక్క అపరిమితమైన సమృద్ధిని గురించి మాట్లాడాను. శోషించనటువంటి ఆమె సృష్టి బహు రూపాలను తీసుకొంటూ, వాటిని కలుపుతూ, తిరిగి విడగొట్టూ, వాటిని కొత్త మూసలో పోస్తూ,

పాడు చేస్తూ, నాశనం చేస్తూ, కొత్త సంయోగాల కోసం ఎప్పుడూ ముందుకు పోతూ ఉంటుంది. అది ఒక పెద్ద వంటపాత్ర అని చెప్పాను: విషయాలను లోపల కలియబెట్టూ ఉంటుంది, బయటకు ఏదో ఒకదానిని తీసుకు వస్తుంది, అది బాగా లేదనిపిస్తే, మళ్ళీ దానిని పారవేస్తుంది, మరింకోదానిని తీసుకుంటుంది.... ఒకటి, రెండు లేదా వంద రూపాలు, అనేది ఆమెకు అంత ముఖ్యం కాదు, అక్కడ వేల, వేల రూపాలున్నాయి, సంవత్సరాల విషయంలో వందలు, వేలు, లక్షలు, ఏమంత ముఖ్యం కాదు, ఆమె ముందు శాశ్వతత్వం ఉంది: దీనినంతా మహాప్రకృతి ఆనందిస్తుందనేది సుస్పష్టం, ఆమెకు తొందర ఏమాత్రమూ లేదు. లంఘించి, శీఘ్రంగా పని కావించి, ఆ పనిని కాని లేదా ఆ పనిలో భాగాన్ని కాని త్వరిత గతిన పూర్తి చేయమని ఆమెకు చెప్పడం జరిగితే, సమాధానం ఎప్పుడూ ఒకే లాగా ఉంటుంది, "నే నెందుకు చేయాలి, ఎందుకు? ఇది నీకు వినోదం కలిగించడం లేదా?"

ఈ విషయాలను గురించి మీకు చెప్పిన సాయంత్రం, నాకు నేను పూర్తిగా మహాప్రకృతితో తాదాత్మ్యం చెందాను, నేను ఆమె ఆటలో కలిసాను. ఈ తాదాత్మ్యతా గమనం ఒక ప్రత్యుత్తరాన్ని పురికొల్పింది, మహాప్రకృతికీ, నాకు మధ్య ఒక విధమైన కొత్త సన్నిహితాన్ని ఇస్తూ, వృద్ధి పొందే సన్నిహితత్వం యొక్క సుదీర్ఘమైన గమనంతో, నవంబరు 8 న వచ్చిన అనుభవంగా అది పరాకాష్ఠకు చేరింది.

హఠాత్తుగా మహాప్రకృతి అర్థం చేసుకొంది. వాస్తవంగా అప్పుడే పుట్టిన ఈ కొత్త చైతన్యం ఆమెను తిరస్కరించటానికి ప్రయత్నించకపోగా తనను పూర్తిగా ఆదరంతో ఆలింగనం చేసుకోవాలని కోరుకుంటున్నదని అర్థం చేసుకొంది. ఈ కొత్త ఆధ్యాత్మికత జీవితం నుంచి మరలిపోవడం లేదనీ, ఆమె గమనంలోని భయంకర మైన విస్తారతకు భయంతో వెనుకంజ వేయటం లేదనీ, కాని దానికి వ్యతిరిక్తంగా తన బహుముఖాలను పరిపూర్ణంగా చేయాలని కోరుకుంటున్నదనే విషయాన్ని అర్థం చేసుకొంది. అతిమానస చైతన్యం తనను తగ్గించి వేయాలని కాకుండా తనను పరిపూర్తి చేయటానికి ఇక్కడ ఉన్నదని ఆమె అర్థం చేసుకొంది.

అప్పుడు పరమోత్కృష్ట వాస్తవికత నుంచి ఈ ఆదేశం వచ్చింది, "ఓ మహాప్రకృతీ, సహకారంలోని ఆనందానికి మేలుకో". అప్పుడు మహాప్రకృతి సమస్తం

హఠాత్తుగా ఒక గొప్ప ఆనందంతో ఉప్పొంగి, "నేను అంగీకరిస్తున్నాను, నేను తప్పక సహకరిస్తాను" అంటూ ముందుకు లంఘించింది. అదే సమయంలో, దానిని దేహపాత్ర గ్రహించి నిలబెట్టుకో గలగటానికీ, భగ్న మైపోకుండా ఉండటానికీ, దేనినీ పొగొట్టుకోకుండా ఉండటానికీ, ఒక నిశ్చలత, ఒక సంపూర్ణ ప్రశాంతత వచ్చింది, అప్పుడు ఈ మహాప్రకృతి దివ్యానంద ప్రవాహం కృతజ్ఞతాపూర్వకమైన గమనంతో ముందుకు లంఘించింది. ఆమె స్వీకరించింది, ఈ అతిమానస చైతన్యం తనను ఇంకా పరిపూర్ణంగా సుసంపన్నం చేయబోతున్నదనీ, ఆమె గమనానికీ ఇంకా గొప్ప బలాన్నీ, ఇంకా ఎక్కువ గొప్పదైన విస్తారతనూ, తన క్రీడకు ఎక్కువ సంభావ్యతలనూ ఇవ్వబోతున్నదనీ ఆమె తన ముందున్న మొత్తం అనంతకాలంలో చూసింది.

అప్పుడు హఠాత్తుగా నేను భూమి అన్ని దిక్కుల నుంచి వస్తున్నాయా అని అనిపించే గొప్ప స్వరఝురులను విన్నాను. ఆ గొప్ప స్వరఝురులను ఒకరు ఒక్కొక్కప్పుడు సూక్ష్మభౌతికంలో వింటారు, అది కొద్దిగా డి-మేజర్ లో బితోవన్ సంగీత స్వరాల సమ్మేళనం లాంటిది, అది కొన్ని గొప్ప పురోభివృద్ధి క్షణాలలో వచ్చేటటు వంటిది. యాభై మంది వాద్య కళాకారులు ఒకే ఐక్యతా రాగాన్ని పొల్లు పోకుండా పలికించినట్లుగా అది వినిపించింది. పాత స్నేహితులు చాలా కాలం విడిపోయి కలుసుకోవటం లాంటిదైనటువంటి ఈ మహాప్రకృతి, ఆత్మశక్తి కొంగ్రొత్త సన్నిహిత సంసర్గం యొక్క సంతోషాన్ని అభివ్యక్తం చేయడానికి ఆ గొప్ప స్వర ఝురులు వినిపించాయి.

అప్పుడు ఈ వాక్కులు వినపడ్డాయి, "ఓ మహాప్రకృతీ, భౌతిక దివ్య జననీ, మీరు సహకరిస్తామని చెప్పారు, ఈ సహకార వైభవానికి పరిమితి అంటూ ఏమీ లేదు."

ఈ వైభవం యొక్క ప్రకాశవంతమైన సౌఖ్యాన్ని పరిపూర్ణ ప్రశాంతతలో గ్రహించటం జరిగింది.

ఆ విధంగా కొత్త సంవత్సర సందేశం ప్రభవించింది.

CWM 9:247-48

ఒక నూతన ప్రపంచ బీజాలు (1959)

అతి కఠినమై, దృఢమై, సంకుచితమై, నులిమి వేసేటటువంటిదగు అత్యంత అచేతన అట్టడుగున, నేను ఒక సర్వ శక్తివంతమైన మీటను ఢీ కొట్టాను, వెంటనే అది నన్ను నూతన ప్రపంచ బీజాలతో స్పందిస్తున్న ఒక రూపం లేని, పరిమితి లేని మహా విస్తారత లోకి విసిరి వేసింది.

'అత్యంత అచేతన అట్టడుగున అతి కఠినమై దృఢమై...' ఎందుకనంటే, సర్వ సాధారణంగా అచేతన కచ్చితంగా, ఏదో అవ్యవస్థితమై, జడమై, రూపం లేని, మందకొడితనంతో విసుగు పుట్టించే, మసకైన అభిప్రాయాలను ఇస్తుంది (పూర్వం నేను అచేతనా సీమ లోకి ప్రవేశించినప్పుడు నాకు మొట్టమొదట తారసిల్లిన విషయమది). కాని ఇది ఒక అచేతన.... అది కఠినంగా, దృఢంగా, గడ్డ కట్టిపోయి, నిరోధించడానికి గడ్డకట్టిపోయిందా అని అనిపించే విధంగా ఉంది: మొత్తం ప్రయత్నమంతా దాని ముందు జావకారి పోతుంది, దానిని స్పృశించ లేదు, దానిలోకి చొచ్చుకుపోవటం అశక్యం. అందుకనే, నేను, 'అతి కఠినం, దృఢం, సంకుచితం' అనే పదాలు వాడాను. (ఏదో అదిమి వేస్తున్న భావన, అదిమి వేయడం, నిన్ను అదిమి వేయడం), 'నులిమి వేయడం' — అవును, 'నులిమి వేయడం' మే సరైన పదం.

'...నేను ఒక సర్వ శక్తిమంతమైన మీటను ఢీ కొట్టాను, అది వెంటనే నన్ను రూపం లేని, పరిమితి లేని మహా విస్తారత లోనికి, సృష్టి నంతటిని ఉత్పత్తి చేసేదానికి విసిరి వేసింది.' అది... అవును, అది సాధారణ సృష్టి కాదని నాకు అనుభూతి కలిగింది, ఆద్యసృష్టి, కాని అతిమానస సృష్టి, కారణం ఆ అనుభూతి తిరిగి వెనుకకు పరమోత్కృష్టతకు చేరుకొనే దానికి పోలికను కలిగి లేదు — ప్రతి దానికి మూలస్థానం. నాకు అతిమానస సృష్టి మూలానికి విసిరివేయబడిన పూర్తి అనుభూతి ఉంది — ఏదో ఒకటి అప్పటికే (దానిని ఏ విధంగా వ్యక్తీకరించగలను) పరమోత్కృష్టం నుంచి రూపుదిద్ద బడింది, అతిమానస సృష్టి లక్ష్యాన్ని సుస్పష్టంగా కలిగినదై.

అది, నా అనుభూతి

నేను పొరపాటు పడ్డానని నేను అనుకోవటం లేదు, కారణం, అక్కడ ఆధిపత్యశక్తి యొక్క వెచ్చదనం యొక్క, సువర్ణం యొక్క అత్యంత సుసంపన్న మైనటువంటి

అనుభూతి ఉంది.... అది ద్రవస్థితిలో లేదు, అది ఒక పొడి రూపంలో ఉంది. వీటి ప్రతి విషయం (అవి నలుసులు లేక ముక్కలు అని పిలువలేము, అలాగని బిందువులూ కాదు, నీవు గణిత సంబంధమైన భావనతో అర్థం చేసుకో గలిగితే తప్ప, ఏ ప్రదే శాన్నీ ఆక్రమించుకొని ఉండని బిందువు) ఏదో గణిత సంబంధమైన బిందువుకు సమానం, కాని సజీవ సువర్ణం లాంటింది, నులివెచ్చని బంగారాన్ని పొడి చేసినట్లు. అది మెరుస్తున్నట్లున్నదని నేను చెప్పలేను, నల్లగా ఉందని చెప్పలేను, అది కాంతితో చేయబడిందని కూడా చెప్పలేను. రెండూ కాదు. అది, అతి చిన్న సువర్ణ బిందువుల బాహుళ్యము తప్ప వేరేమీ కాదు. అవి నా కళ్ళను, ముఖాన్ని స్పృశిస్తున్నట్లు.... అది ఎంతో సహజసిద్ధ అధిపత్య శక్తి, నులివెచ్చదనం — అది ఒక వైభవం! అప్పుడు, అదే సమయంలో, అపారతా అనుభూతి, సర్వ శక్తిమంతమైన ప్రశాంతత.... అది పుష్కలం, అది పరిపూరితం. దాని గమనం దానికదే పరాకాష్ఠ, ఒకరు ఊహించగలిగిన దాని కంతటి కన్నా అధిక వేగంకలది, అదే సమయంలో అది సంపూర్ణ ప్రశాంతత, పరిపూర్ణ ప్రశాంతత....

The Mother: Conversations with a disciple, Nov. 1958

ప్ర: ఈ మీట ఏమిటి?

స: మీటా? కచ్చితంగా దానర్థం ఇది: మహా అచేతన యొక్క లోతైన అగాధాలలో పరమోత్కృష్టమైన ప్రేరణ స్థానం ఉంది, అది మనలను పరమోత్కృష్టమును స్పృశించేటట్లు చేస్తుంది. పరమోత్కృష్టతే మనలను పరమోత్కృష్టతను స్పృశిం చేటట్లు చేయడం లాంటిదది: అది సర్వ శక్తిమంతమైన ప్రేరణ స్థానం. నీవు మహా అచేతన అత్యంత అట్టడుగుకు చేరినప్పుడు, నీవు పరమోత్కృష్టతను స్పృశిస్తావు..

ప్ర: అంటే అది చాలా దగ్గర దారి!

స: అది దగ్గర దారేమీ కాదు! అప్పటికే నాకు, మహా అచేతన అట్టడుగు తాకటం

(శ్రీమాత తరువాత తన జనవరి 1, 1959 సందేశానికి మార్పు చేశారు):

"ఒక సర్వ శక్తిమంతమైన మీట వెంటనే నన్ను నూతన ప్రపంచాన్ని ఉత్పత్తి చేసేటటువంటి ఒక రూపం లేని, అపరిమిత మహా విస్తారత లోకి విసిరి వేసింది" అనే దానికి బదులుగా శ్రీమాత "నూతన ప్రపంచ బీజాలతో స్పందిస్తున్న ఒక రూపం లేని, పరిమితి లేని మహా విస్తారత", అని పెట్టారు.

చాలా కఠినమైన పని అయింది, కాని ఇతరులకు అది అనంత కాలం తీసుకుంటుంది.

అది ఏదో శ్రీఅరవిందులు వ్రాసిన 'దైవ పరిశ్రమ' (ఏ గాడ్స్ లేబర్) ను పోలి ఉంటుంది.

ప్ర: మహా అచేతన అత్యంత అట్టడుగున ఉన్న పరమోత్కృష్టతే మిమ్మలను సూటిగా పరమోత్కృష్టతకు విసిరి వేసిందా?

స: అవును, మహా అచేతన అత్యంత అట్టడుగున పరమోత్కృష్టత ఉండటం మూలంగా అది మహోన్నతోన్నతం, అత్యంత లోతైన లోతును తాకటం లాంటింది. విశ్వం ఒక వృత్తం బోలి ఉంటుంది. అది పాము తన తోకను కరుస్తున్నట్లుగా వర్ణించి చెప్పబడింది. దాని తల దాని తోకను స్పృశిస్తున్నట్లుగా. దానర్థం, పరమోత్కృష్టమైన ఉన్నతం అత్యంత భౌతిక పదార్థాన్ని తాకుతుంది, మధ్యవర్తు లెవరూ లేకుండా. దీనిని నేను ఇప్పటికే చాలా మార్లు చెప్పి ఉన్నాను....

ఈ మహా అచేతనా దర్శనం... (శ్రీమాత ఒక్క క్షణం రెప్ప వాల్చకుండా తదేకంగా చూస్తు ఉండిపోయింది) అది మహా మానసిక అచేతన. కారణం ప్రారంభ స్థానం మానసికం. ఒక ప్రత్యేకమైన మహా అచేతన — దృఢమై, కఠినమై, నిరోధించేది — దాని నంతటి తోటి మనస్సు దానిని మన చైతన్యంలోకి తీసుకు వచ్చింది. కాని ఇది మరీ మరీ చెడ్డది, పూర్తిగా భౌతిక మహా అచేతన కంటె మరీ మరీ చెడ్డది! 'మానసికం చేయబడిన' మహా అచేతన, అది అటువంటిది. ఈ మొత్తం ధృఢత్వం, ఈ కఠినత్వం, ఈ సంకుచితత్వం, ఈ స్థిరత్వం — ఒక మహా స్థిరత్వం — సృష్టిలో మనస్సు ఉనికి మూలంగా వస్తున్నది. మనస్సు అభివ్యక్తం కానప్పుడు, మహా అచేతన ఆ విధంగా లేదు! అది రూపం లేనిదై ఏదో మృదుత్వంతో ఉంది — మృదుత్వం కాస్తా పోయింది.

మహా అచేతనలో మహా మనస్సు చర్య యొక్క ఒక భయంకరమైన ప్రతిరూపం అది.

అది మహా అచేతనను దాడి చేసే విధంగా చేసింది — ఇతఃపూర్వం అది అలా లేదు. దాడి చేసేదిగా, నిరోధించేదిగా, పెడసరంగా. అంతకు ముందు అది ఆ విధంగా లేదు.

అవును, అదీ విషయం. అది మౌలికమైనటువంటి మహా అచేతన కాదు.... మానసికం చేయబడిన దానంతటినీ మనస్సు మహా ప్రాతికూల్యత రూపంలో తీసుక



వచ్చింది — నిరోధిస్తున్నట్లుగా, కఠినమైనదిగా, దృఢతరమైనదిగా.... అది ఇతః పూర్వం నాకు కలిగిన మౌలిక మహాచేతన యొక్క అనుభవంగా లేదు. ఈ సారి వచ్చిన అనుభవం సృష్టిలో మహా మనస్సు చేత ప్రభావం పొందిన మహా అచేతనా నుభవం. అది పరిణమించింది.... అది ఇంతకు మునుపు కంటే చాలా అధికతరమైన అడ్డంకిగా అయింది. అంతకు ముందు, దానికి ప్రతిఘటించే ఆధిపత్య శక్తి కూడా లేదు, దాని కేమీ లేదు, అది నిజంగా ఎరుక లేనటువంటిది. తన మార్పును తిరస్కరించడంతో ఇప్పుడది వ్యవస్థీకరించబడిన మహా అచేతన.

అది ఒక చాలా కొత్త అనుభవం.

సరిగ్గా మనం అక్కడ ఉన్నాం.

ఈ సర్వ శక్తిమంతమైన మీట ఏమి జరుగుతున్నదనే దానికి పరిపూర్ణ ప్రతిబింబం — ఏది తప్పక జరగాలి, ఏది జరగబోతున్నది — ప్రతి ఒక్కరికి: హఠాత్తుగా ఒకరు విస్తృతం లోకి విసిరి వేయబడ్డారు.

The Mother: Coversations with a disciple: Nov 11, 1958

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

పరమ సత్యాగమనము (1965)

పరమ సత్యాగమనమునకు ప్రణామము

ప్ర: మధురమయీ శ్రీమాతా, ఈ సంవత్సరము నూతన వర్ష సందేశములో మీరు 'సత్యాగమనమునకు ప్రణామము' అని చెప్పారు. అది అత్యంత దగ్గరలో ఉందా? దానిని గుర్తించుటకు, గ్రహించుటకు 1965 వ సంవత్సరములో మమ్మల్ని మేము సిద్ధపరచుకొనుటకు ఏమి చెయ్యాలి?

స: అత్యంత ఆమోదకరమైన విషయ మేమిటంటే సత్య ప్రకాశము నుండి వచ్చువాటిని మరియు మనలో ఇమిడియున్న పాత జడత్వము మరియు అనృతముల నుండి వచ్చు కదలిక లన్నింటి మూలాన్ని తాను కనుగొన గలిగినప్పుడు సత్యప్రకాశము నుండి వచ్చువాటిని గ్రహించి, మిగిలినవాటిని తిరస్కరించవచ్చు.

అభ్యాసము వలన అతి స్పష్టముగా ఈ వ్యత్యాసం గుర్తించడం నేర్చుకోవచ్చు, కాని అది అసామరస్యత, క్రమరాహిత్యము మరియు జడత్వము వైపు దారి తీయువన్నీ అసత్యము నుండి, ఐకమత్యము, సామరస్యత, క్రమపద్ధతి మరియు చైతన్యము మొదలగునవన్నీ సత్యము నుండి ఉద్భవించుననే ఒక సాధారణ నియ మాన్ని ఏర్పరుచుకోవచ్చు.

ఈ మార్గంపై మొదటి అడుగు ఎలా వేయాలి అనే దానికి ఇది కేవలం ఒక సూచన మాత్రమే. అంతకంటె వేరేమీ కాదు.

CWM 16:311 *అనువాదం: డా. విజయలక్ష్మి*

సత్యము లేక అగాధమైన అజ్ఞానము (1967)

ప్రజలు, దేశములు, ఖండములు!
ఎంపిక మాత్రం తప్పని సరి:
సత్యమా లేక అగాధమైన అజ్ఞానమా.

ప్ర: 1967 నవ వర్ష సందేశము గూర్చి ఎంపిక సత్యము లేక అగాధమైన అజ్ఞానము మధ్యదని మీరన్నారు. ముందు కాలంలో అగాధమైన అజ్ఞానం నోరు తెరుచుకుని ఉన్నట్లుగా కాన్పించు చున్నది. అయినప్పటికీ అది మార్గము నుండి తొలగించ బడుతుందనే నమ్మక మున్నది.

స: అట్టి నమ్మకం కలగడం సబబే.

ఆ సందేశం ఇంకా నిద్రావస్థలో నున్నవారు, ఆ నిదురతోనే సంతృప్తి చెందేవారి కొరకు మాత్రమే.

*

ప్ర: మీ నూతన సంవత్సర సందేశంలోని 'అగాధము' యొక్క అర్థ మేమిటి? లేక మరొకలా చెప్పాలంటే సాధకుడు దేనికి భయపడాలి?

స: ప్రస్తుతం చాలా ఉద్రిక్తమైన రాజకీయ పరిస్థితి నెలకొని వుంది. వారంతా యుద్ధ మారంభించటానికి సమాయత్త మవుతున్నారు. అంతర్రాష్ట్రీయ సంబంధాలలో కనులు కానరాని భావోద్రేకాలకు మనుజులు తావిస్తున్నారు.

దీనంతటికి మూలం భయం, పరస్పర అపనమ్మకం మరియు (ధనం, వ్యాపారము మొదలగు) తమ ప్రయోజనాల కుపకరిస్తాయని వారి నమ్మకం. ఈ మూడింటి కలయిక. మానవజాతి యొక్క ఈ మూడు అధమాధమ భావోద్రేకాలను ఆచరణ లోనికి తెచ్చినట్లయితే, దానిని నేను 'అగాధము' అంటాను.

ఎప్పుడైతే ఆ దైవాన్ని పొందడానికి ఎవరయితే తమ జీవితాన్ని సమర్పించడానికి నిర్ణయించుకుంటారో, వారు శ్రద్ధాళువులైతే, అనగా, వారి ఆ నిర్ణయం చిత్తశుద్ధితో కూడినదై దానిని ఆ ప్రకారంగా అమలుపరిచినప్పుడు దేనికీ భయపడవలసిన అవసరం ఎంత మాత్రం లేదు, కారణం ఏది జరిగిందో లేక జరుగుతున్నదో అతనిని అతి దగ్గరి దారి ద్వారా అతని లక్ష్యప్రాప్తికి చేరుస్తుంది.

అది దైవానుగ్రహము యొక్క ప్రతిస్పందన. ప్రజలు నమ్మేది దైవానుగ్రహమంటే వారి జీవితమంతా సాఫీగా గడిచిపోయేటట్లు చెయ్యడమని. కాని అది నిజం కాదు.

దైవానుగ్రహం నీ ఆశల్ని, అపేక్షలను ప్రాప్తింప చేసుకోవడానికి దోహద పడుతుంది మరియు ప్రతీ విషయం అట్టి ప్రాప్తిని సరైన సమయంలో, అతి వేగంగా పొందగలగే ఏర్పాటు చేస్తుంది — కనుక భయ పడవలసినదేదీ లేదు.

భయం కపటంతో సంభవిస్తుంది. నీకు సుఖప్రదమైన జీవితం, అనుకూలమైన స్థితిగతులు మొదలైనవి కావాలను కున్నప్పుడు నువ్వు షరతులు, నిబంధనలు విధిస్తే అప్పుడు నువ్వు భయపడాలి.

కానీ సాధనలో అందుకు ప్రమేయం లేదు.

CWM 15;180-81

ఇది చాలా ఆసక్తికరంగా నుంటుంది — కొత్త సంవత్సరానికి ఇచ్చిన ఈ సందేశం కారణంగా (ప్రతీ వారూ, ప్రతీ చోటా ఇదే విషయం మాట్లాడుతున్నారు, ఇది మంచి కుదుపు నిచ్చింది, పాలక వర్గాలలోను, అన్ని చోట్లా ప్రతివారు తమని తాము సత్య సంరక్షకులుగా చెప్పుకుంటున్నారు.) వారు నన్ను ప్రశ్నిస్తారు. ఊహించిన విధంగా ప్రపంచములో సత్యము స్థాపింపబడ లేదని తెలుసుకొని ఆశ్చర్యపోతున్నారు. కనుక నేను సత్యము యెడల ఉన్న అన్ని దృక్పథాలకి విరుద్ధంగా సత్యము కొరకు తప్పని సరిగా యుద్ధం చెయ్యడానికనే వత్తిడికి లోనవడం ప్రారంభమైంది.

రోజువారిగా అది ఆ విధంగా చాలా తీవ్ర మవుతున్నది. ప్రతి వారు 'సత్య సంరక్షకులే'. ఒకరు కాదు! ఒకరు ఆహారం గురించి, ఇంకొకరు ధనం గురించి, మరొకరు వ్యాపారం నిమిత్తం, సంబంధాల గురించి... అలా ప్రతి ఒక్కరికి, వారిది ఆత్మసంతోషం కోసం చేపట్టే వ్యాసంగం వుంటుంది.

ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే, ఒక్కరు కూడా 'బహుశా నా అభిప్రాయాలు నిజం కాదేమో' అని చెప్పలేదు. ఒకరైనా? "బహుశా నేను చూచేదీ, అనుకునేదీ నిజం కాదేమో?" ఒక్కరైనా అనలేదు. అవన్నీ సంపూర్ణ సత్యాలేనా!

ఇది చాలా ఆసక్తి కలిగించే విషయం.

ప్ర: సత్య సంరక్షకులు తరచు సత్యము యొక్క శత్రువుల కన్నా అధములు.

స: (శ్రీమాత అవునన్నట్లు శిరస్సు పంకించారు). కాని నేను ఆ విషయమై ఏమీ చెప్పలేను. కారణం, దానికి బాధ్యురాలిని నేనే. నేనే వారికి 'సత్యానికి బద్ధులై ఉండండి' అని చెప్పాను.

కాదు, వారందరూ అదే తప్పు చేస్తున్నారు. వారు సత్యము మరియు సుగుణం ఒకటేననే భ్రాంతికి లోనవుతున్నారు. నైతిక తప్పిదం విషయంలో పొరపడిన విధంగా, అదే పొరపాటు చేస్తున్నారు.

అన్నింటిని మించి వారందరూ సత్యమనే దానిని అతి తక్కువైన, స్పష్టమైన పదాలలో వ్యక్తపరచాలని వారి కోరిక. ఆ విధంగా సత్యమంటే ఇదీ అని వారు కచ్చితంగా చెప్ప గలుగుతారు. అన్ని మతాలకు గతంలో పట్టిన దౌర్భాగ్యపు

భావన: 'ఇదే సత్యము' — కనుక మిగిలినదంతా అసత్యమని.

ఎన్ని సార్లు... ఎన్ని సార్లు శ్రీఅరవిందులు (నేను కూడా) చెప్పడం జరిగింది, "ఎప్పుడైతే ఒక విషయం నిజమవుతుందో, దానికి విరుద్ధమైనది కూడా నిజమేనని నిశ్చయించుకోవచ్చు. ఎప్పుడైతే మీ కిది అర్థమవుతుందో అప్పుడు మీరు అర్థం చేసుకోవడం మొదలుపెడతారు."

ఈ ఉదయం శ్రీఅరవిందులు రచించిన 'శ్రీమాత' లో వారు నాకు చెప్పడం కోసం వ్రాసిన ఉదాహరణతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. 'దైవకృప కేవలం పరమ సత్యములోనే పని చేస్తుంది' – ఇక దానిని నేను మరిచిపోకూడదు! (శ్రీమాత నవ్వుతారు) శ్రీఅరవిందుల రచనలో పేర్కొన్న విధంగా 'దైవకృప బదులిస్తుంది కాని అది అసత్యము లోనో లేక అబద్ధములోనో బదులిస్తుందని అనుకోవద్దు...' ప్రశంసనీయమైన వాక్యమది. అయితే, అది వారికి తెలియదు: వారు పరమ సత్యము నకు కర్తలు — అసత్యము ఇతరులది. తెలివైనవారు ఎంతో కొంత బుర్ర ఉన్నవారు ఎవరైతే అర్థం చేసుకోగలరో, వారు సైతం ఈ ఉచ్చులో పడతారు.

ఒక శిష్యునితో సంభాషణలు: మార్చి 22, 1967

*

అతిమానవ చైతన్యము (1969)

మాటలు లేవు — చేతలు మాత్రమే

అది నిశీథిలో నెమ్మదిగా వచ్చింది ఈ ఉదయం నేను మేల్కొన్నప్పుడు

అటు తరువాత సత్యము గూర్చి ఒక ప్రశ్నకి జవాబుగా శ్రీమాత వ్రాశారు "సత్యము ఒక్కసారిగా నేర్చుకుని, ఒక నియమంగా నిర్బంధ పూర్వకంగా చేసే సిద్ధాంతం కాదు. సత్యము పరాత్పరుని వలె అనంతమైనది మరియు అది ప్రతి క్షణము త్రికరణ శుద్ధి కలిగి జాగ్రత్తపరులైన వారి కోసం సాక్షాత్కారిస్తూనే ఉంటుంది"

"ఆ విధంగా అందరి ద్వారా చూడబడి అర్థం చేసుకోవడం కొరకు సత్యము సాక్షాత్కరించినట్లయితే, వారందరు వారి అజ్ఞానము మరియు అసత్య వ్యాఖ్యాన ముల విస్తృతిని చూచి భయపడతారు."

అక్కడ ఉన్నది ఒక సువర్ణ ఉషోదయం; వాతావరణమంతా అత్యంత ఆహ్లాదకరంగా ఉంది. శరీరానికి అనిపించింది, "ఓహ్! ఇది నిజంగా... నిజంగా నూతనంగా ఉంది." ఒక వెలుగు, సువర్ణ దివ్య ప్రకాశము మరియు... దయార్ద్రమైనది, నిశ్చయమైన భావనలో దయార్ద్రమైనది — ఒక సామరస్యపూర్వక నిశ్చయము. అది నూతనమైనది.

ఆ విధంగా అక్కడ

నేను జనులతో 'సంతోషకర నవ వత్సరం' అన్నప్పుడు సంతోషాన్ని నేను వారికి అందిస్తాను. ఈ ఉదయం నేను నా సమయాన్ని ఆ విధంగా నాకు నేనుగా 'సంతోషకర నవ వత్సరము, సంతోషప్రద నూతన సంవత్సరం' అంటూ గడిపాను...' ఆ విధంగా.

*

సంవత్సర ప్రారంభమది. భగవంతుని స్థాయిలో ఎవరో ఒకరు (ఎవరో ఒకరు అంటే) 'సంతోషప్రద కొత్త సంవత్సరమని' సర్వ శక్తితో దానిని సుఖప్రద వత్సరము చేస్తామని చెప్పడానికి వచ్చారు. అది ఆ విధంగా నుండింది.

దాని శక్తి కారణంగా అది చిరునవ్వు చిందిస్తున్నది, కాంతివంతమైనది మరియు అత్యంత కరుణామయమైనది. నా ఉద్దేశ్యము ఏమిటంటే సాధారణంగా మానవునిలో దయార్ద్రత అనేది ఘర్షణ పడటానికి, యుద్ధం చెయ్యడానికి ఇష్టపడని కారణంగా కొంచెం బలహీనమైనది. కాని అది అలా ఎంత మాత్రం లేదు. దయార్ద్రత తనకు తాను విధించు కొనేది. (శ్రీమాత తన రెండు పిడికిళ్ళను బిగించి కుర్చీ యొక్క చేతులాన్చు చోట ఉంచుతారు)

అది పూర్తిగా కొత్తది కనుక నాకు ఆసక్తికర మనిపించింది. ఎంతో దృఢమైనది! ఇంతగా, (శ్రీమాత తన కుర్చీ చేతులు పెట్టుకునే స్థలాలను స్పృశిస్తారు) భౌతిక చైతన్యం సాధారణంగా 'ఇతరమైనవి' అని మామూలుగా దేనిని అనుకుంటుందో అంత ధృఢమైనవి అని దాని అర్థం. ఏదో ఆంతరిక సత్త లేక మానసిక సత్త ద్వారా అది రాలేదు. అది నేరుగా శరీరంలోకి ప్రవేశించింది.

బలహీనతలు లేక మచ్చలు లేని మానవుడు: అది అంతా ప్రకాశమయం. అంతా వెలుగు, చిరుహాసం మరియు... అదే సమయంలో మధురము కూడా.

శ్రీమాత: ఒక శిష్యునితో సంభాషణలు, జనవరి 1, 1969

నీ చైతన్యాన్ని విస్తృత పరచుకో (1973)

విశ్వ మంతటిని గురించిన చైతన్యం కలిగి వుంటే, ఒకే సమయములో నువ్వు ఆ దైవం గూర్చి చేతన గలవాడి వవుతావు.

ప్రపంచం గురించి చైతన్యం కలిగి ఉంటే అది నిన్ను తనంత తానుగా దైవం యెడల చైతన్యవంతుడిని చేస్తుందన్నది నా అభిప్రాయం కాదు, కాని నీ చైతన్యం సమస్త ప్రపంచాన్ని చూడ గలిగి, దాని గూర్చి చైతన్యశీలుడ వయినప్పుడు, అప్పుడు నువ్వు సమర్థుడ వవుతావు....

అది నేనెలా చెప్పాలి?... నిర్దేశించి చెప్పడం నాకు ఇష్టం లేదు. ప్రతి ఒక్కరు వారి వారి సామర్థ్యా న్ననుసరించి అర్థం చేసుకోవాలని నేను కోరుతాను. అర్థం అయ్యిందా? నేననేది నీకు అర్థం అయిందా?

అయింది, అయింది శ్రీమాతా!

పై పై చైతన్యం కలిగి నటువంటి వ్యక్తి దాన్నలా అర్థం చేసుకుంటాడు, కాని లోతైన చైతన్యం కలిగిన వ్యక్తి దాని నిజమైన అర్థాన్ని అర్థం చేసుకో గలుగుతాడు.

శ్రీమాత: ఒక శిష్యునితో సంభాషణలు, సెప్టెంబరు 13, 1972

ప్రతి సంవత్సరము, ప్రతి క్షణము కొరకై ప్రార్థన

ప్ర: కొత్త సంవత్సరం వస్తున్నది. కాబట్టి మీరేమైనా ఈ కొత్త సంవత్సరం గూర్చి అనుకుంటున్నారా?

స: విషయాలన్నీ కట్ట కడపటి దశకు చేరుకున్నాయి. కనుక ఒక విధంగా అక్కడ ఒక వైభవోపేత దిశగా వాతావరణం ఊపందుకుంటోంది, చాలా వరకు ఊహించలేని విధంగా, అదే సమయంలో ఏ క్షణంలోనైనా ఒకరు,,, ఒకరు మరణించవచ్చు — 'మరణం' కాదు, కాని శరీరం సమసిపోవచ్చు. కనుక రెండూ ఒకే సమయంలో ఒక 'చేతన' గా రూపొందుతాయి (*శ్రీమాత శిరస్సు పంకిస్తారు*) పాత విషయాలన్నీ అవివేకంగా, బాల్య చేష్టలుగా, అచేతనగా కనిపిస్తాయి... ఆ లోపల... అది బ్రహ్మాండము మరియు అద్భుతం.

కాబట్టి శరీరం, ఈ శరీరానిది ఎల్లప్పుడూ ఒకే ఒక ప్రార్థన.

మిమ్ము తెలుసుకోవడానికి నాకు యోగ్యత ప్రసాదించుము.

మీకు సేవ చెయ్యడానికి నాకు యోగ్యత నొసంగుము.

మీలో మమైక్య మగుటకు యోగ్యత ప్రసాదించుము.

నేను నాలో ఒక పెంపొందించే శక్తిని అనుభవిస్తున్నాను... కాని అది ఒక నూతన లక్షణం గలది... నిశ్శబ్దంలో మరియు ధ్యానములో ఏదీ అసంభవం కాదు. (శ్రీమాత రెండు చేతులూ ఊర్ధ్వముఖంగా తెరుస్తారు)

CWM 11:330

కొత్త సంవత్సర సందేశం

ప్ర: శ్రీమాతా ప్రతీ సంవత్సరం జనవరి 1 వ తేదీన మీరు ఒక సందేశ మిస్తారు. అది కచ్చితంగా దేనిని సూచిస్తుంది?

స: అవును, ప్రతీ సంవత్సరం... యుద్ధ సమయంలో అది అద్భుతంగా నుండింది. ఏమి కాబోతున్నది అనే దానికి భవిష్య వాణి లాంటిదిగా నుండింది. ఇప్పుడు ఇక యుద్ధం లేదు, భవిష్యవాణి అవసరమూ లేదు! కాని అది ఎల్లప్పుడూ సాధించ వలసిన ప్రగతి కొరకై ఒక సూచన. మీరు దానిని రేపు ఉదయం అందుకుంటారు, ప్రార్థనని. కాని నేనిచ్చే సలహా ఏమిటంటే మీరు దానిని గూర్చి తీవ్రంగా ఆలోచించండి. వాస్తవంగా దానికి చాలా ప్రాముఖ్యత ఈయబడింది, చర్చించబడింది — ఇప్పుడు మన మందరం ప్రజా ప్రయోజనకారుల మవుతున్నాం. అంటే ఎంతో మంది దర్శనార్థం వస్తున్నారు, ఇక్కడ మనం ఏం చేస్తున్నాం అన్న విషయమై అనేక మందికి కుతూహలం కలుగుతోంది. వారిని కొనిపోయి, ఇప్పటి వరకు మనం ఏం చెయ్యగలిగామో, ఇంకా ఏమేమి చెస్తామో అంతా చెప్పడం జరుగుతోంది — ఇంకా చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది: "నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను, మేము ఏమేమి చేస్తున్నామో దాని గూర్చి అధికంగా మాట్లాడకండి; ఆచరించండి." అంతే.

మాటల కన్నా కూడ చేతలు ఎప్పుడూ చాలా ఉత్తమం, కనీస వివరాలైనా ఎక్కువగా చెప్పరాదు.

ఇంకొక అంతరార్థం కూడా ఉంది. చాలా నిగూఢమైనది. కాని దాని గూర్చి నేను మీతో ఇంకొక సారి ముచ్చటిస్తాను.

CWM 5:417

నవ వర్ష సంగీతం

(క్రొత్త సంవత్సరం కొరకు సునీల్ స్వరపరచిన సంగీతం వినిన తరువాత)

మీకు నచ్చిందా?

అది చాలా మనోహరంగా, శక్తివంతంగా ఉంది.

అవును కదా! ఇది ఒక వాతావరణాన్ని సృష్టిస్తుంది.

సాధారణంగా నేను అతని కోసం కొంత సంగీతాన్ని వాయిస్తాను. అతడు స్వరకల్పన చేస్తాడు. కాని ఈ సారి నేను వాయించ లేదు, కనుక అతడు ఇంతకు పూర్వం నేను వాయించిన కొన్నిటిని తీసుకుని వాటిని సమకూర్చి స్వరకల్పన చేశాడు.

ఒక సంగీత విద్యాంసుడు అమెరికా నుండి ఇక్కడికి వచ్చాడు. అతడిని నేను సునీల్ వద్దకు పంపించాను (అతడు పియోనో వాద్యకారుడు) అమెరికాలో సునీల్ సంగీతాన్ని కొంత తాను విన్నానని, మొదట ప్రజలు కొంచెం ఆశ్చర్యానికి లోనయ్యా రని, కాని అనేక సార్లు వారు దానిని వినిన తరువాత వారికి చాలా అభినివేశము కలిగిందని అతడన్నాడు.

నాకు మాత్రం అది ఒక విధమైన వాతావరణాన్ని సృష్టిస్తుం దనిపిస్తుంది. అది ఒక వాతావరణాన్ని అవరోహింప జేస్తుంది.

మరియు ఆ మానవ సుస్వరం అత్యంత సుమధురం. చక్కగా సమ్మిళితమైనది.

శ్రీమాత: ఒక శిష్యునితో సంభాషణలు, డిసెంబరు 28, 1968)

అనువాదం: డా. విజయలక్ష్మి




నవ్య నాగరిక నగరం

సంపాదకీయం: అంతులేని యుద్ధాల సుదీర్ఘ చరిత్ర మానవజాతిది. అయినప్పటికీ జాతి అంతరాంతరాలలో ఒక సంతోషకరమైన, ప్రశాంతమైన, సామరస్యపూర్వక సామాజిక జీవనానికై ఆకాంక్ష పరిఢవిల్లుతుండింది. ఈ ఆకాంక్ష మనిషియొక్క మతపరమైన, ఐహికపరమైన ఆలోచనా సరళిలో నానా విధాలుగా రూపాంతరం చెందింది. అయితే నాటి నుండి నేటి వరకు మనం కేవలం వాటి అనిత్యమైన, తాత్కాలిక ఉజ్జాయింపులకే పరిమితం కాగలిగాం గాని వాటి మధ్యనున్న అభేదిత యొక్క వాస్తవికతను అంచనా వేయలేక పోయాం. బహుశా వాటి ప్రాతిపదిక సూత్రం మనకు అంతుచిక్క లేదేమో1 కాని, ఈ మారు అతిమానస దివ్యచేతనతో ఉత్తేజితులమై నందున, ఈ ప్రయత్నం పునఃప్రారంభించటానికి సాక్షాత్కరించిన దివ్యమాత స్వయంగా పూనుకోవడం మనం చూస్తున్నాం. మరింత అధిక ప్రకాశమాన మైన, సామరస్యపూర్వకమైన, అందమైన జీవన విధానానికై జాతికి గల ఆకాంక్షను, దివ్యజనని ఆసరాతో, మార్గదర్శకత్వంతో ప్రారంభించబడిన ఒక బృహత్ప్రణాళిక అగ ఆరోవిల్ యొక్క మూలాలలో మనం చూస్తాము. అది నిస్సందేహంగా మానవ జాతి అభ్యున్నతి కోసం కన్న కలను సాకారం చేసే దివ్యప్రణాళిక, అది సర్వోత్కృష్టు డగు జగత్ప్రభువు స్వయంగా కన్న కల.

ఆరోవిల్ ఆవిర్భావ యాభైయయ్య్వ వార్షికోత్సవ సందర్భంగా ఈ సంచికను దివ్యజనని మదిలో జనించిన విశ్వనగర ప్రణాళిక రూపకల్పన యగు ఆరోవిల్లికి అంకితమిద్దాం.

— సంపాదకుడు



సార్వజనీన నగరం

ఆరోవిల్ సార్వజనీన నగరంగా, అన్ని దేశాల స్త్రీ, పురుషులు, అన్ని జాతులకు, రాజకీయాలకు, అన్ని దేశాల పౌరసత్వాలకు అతీతంగా ప్రశాంతంగా పురోగమించే సామరస్యతలో నివసించ గలగాలని కోరుకుంటున్నది.

మానవ ఐక్యతను సాక్షాత్కరించు కోవడమే ఆరోవిల్ ఉద్దేశం.

CWM 13:188

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

పరాత్పరుని స్వప్నం

1, అరోవిల్ నిర్మాణానికి ప్రేరణ ఎవరు?

పరమ ప్రభువు.

2. ఆరోవిల్ ధనసహాయంలో పాల్గొనే దెవరు?

పరమ ప్రభువు

3. ఆరోవిల్‌లో ఒకరు నివసించాలంటే, వారికి అది ఏమి సూచిస్తుంది?

పరమోత్కృష్ట పరిపూర్ణతను అందుకోవడానికి ప్రయత్నించమని.

4. అరోవిల్లో నివసించాలంటే ఒకరు తప్పక యోగ విద్యార్థి అయి ఉండాలా?

జీవితమంతా యోగం, కాబట్టి పరమోత్కృష్ట యోగమును అభ్యసించకుండా ఒక రు జీవించ లేరు.

5. ఆరోవిల్‌లో ఆశ్రమ పాత్ర ఏమిటి?

పరమ ప్రభువు ఏది కోరుకుంటే అది.

6, ఆరోవిల్‌లో విహార శిబిరాలకు, సమావేశ ప్రాంగణాలకు అవకాశం ఉందా?

అన్నీ, అవి ఎలా ఉండాలో, ఎప్పుడు ఉండాలో ఆ విధంగా ఉంటాయి.

7. అరోవిల్‌లో కుటంబజీవితం కొనసాగుతుందా?

ఒకరు ఒకవేళ దానిని దాటి ఆవలకు పోక పోతే.

8. ఒకరు తమ మతాన్ని ఆరోవిల్‌లో కొనసాగించవచ్చా?

ఒకరు ఒకవేళ దానిని దాటి ఆవలకు పోకపోతే.

9. ఆరోవిల్‌లో ఒకరు నాస్తికుడుగా ఉండవచ్చా?

ఒకరు ఒకవేళ దానిని దాటి ఆవలకు పోకపోతే.

10. ఆరోవిల్‌లో సామాజిక జీవనం ఉంటుందా?

ఒకరు ఒకవేళ దానిని దాటి ఆవలకు పోకపోతే

11. ఆరోవిల్‌లో సాంఘిక కార్యక్రమాలు తప్పనిసరియా?

ఏదీ తప్పనిసరి కాదు.

12. ఆరోవిల్‌ల్లో డబ్బు వాడకం ఉంటుందా?

ఉండదు. ఆరొవిల్‌కి ధనసంబంధం కేవలం బయట ప్రపంచంతో మాత్రమే ఉంటుంది.

13. ఆరోవిల్‌లో పని ఏ విధంగా వ్యవస్థీకరించబడి, పంచబడుతుంది?

"ధనమే సర్వోత్కృష్ట ప్రభువు ఇక ఎంత మాత్రం కాదు; వ్యక్తిగతమైన విలువకు భౌతిక విలువ కంటే, సామాజిక హోదా కంటే చాలా ఎక్కువ ప్రాముఖ్యత కలిగి వుంటుంది. అక్కడ పని చేయటం సంపాదనతో జీవించటానికి మార్గం కానే కాదు, కాని అది ఒకరు తమకు తాము వ్యక్తీకరించు కొనుటకు మార్గం; ఒకరు మొత్తం సంఘానికి సేవ చేస్తూనే, తన సామర్థ్యాలను, సాధ్యతలను అభివృద్ధి చేసుకొంటూ, దానితో పాటు మొత్తం సమాజానికి సేవ చేయడానికి, దానిలో భాగంగా అది ప్రతి వ్యక్తి యొక్క జీవనాధారాన్ని, పనియొక్క పరిధిని అందజేస్తుంది."

14. ఆరోవిల్‌లో ఉండేవారికీ, బయట ప్రపంచంలో ఉండేవారికీ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి?

ప్రతి వ్యక్తికీ పూర్తి స్వతంత్రత అనుమతించ బడుతుంది. ఆరోవిల్‌లో నివసించేవారికి బయట ప్రపంచంతో సంబంధాలు ప్రతి వ్యక్తికీ వారి వారి వ్యక్తిగత ఆకాంక్షలు, ఆరోవిల్‌లో అతని కార్యక్రమాల ననుసరించి నెలకొల్ప బడుతాయి.

15. ఆరోవిల్‌లోని భూములకు, భవనాలకు హక్కుదారు ఎవరు?

పరమ ప్రభువు.

CWM 13:188-90

ఆదర్శవంతమైన నగరం

చాలా కాలంగా నాకు 'ఆదర్శవంతమైన నగరం' ప్రణాళిక ఉండేది, కాని అది శ్రీఅరవిందుల జీవితకాలంలో, శ్రీఅరవిందులు కేంద్రంలో జీవించి ఉన్నప్పుడు. తరువాత దానిమీద నేనెంత మాత్రం ఆసక్తితో లేను. అప్పుడు వచ్చింది ఆరోవిల్ అనే ఆలోచన — ఆరోవిల్ అని నేను నామకరణం చేశాను — మళ్ళీ అది తలపోయ బడింది, కాని మరొక వైపు నుంచి రూపుదిద్దుకున్న దానికి స్థలం వెదకటానికి బదులుగా; స్థలం ముందు దొరికింది — చెరువు దగ్గర — అది రూపానికి జన్మ నిచ్చింది, అప్పటి దాకా దానిలో నేను కేవలం తక్కువ ఆసక్తి మాత్రమే కనబరచాను, కారణం నేను దేనినీ సరాసరిగా పొందలేదు. అప్పుడు మన చిన్న 'ఎ' అక్కడ చెరువు దగ్గర ఇల్లు కట్టుకోవడానికి తలపోసింది, తన ఇంటి పక్కన నాకు ఇల్లు కట్టి, నాకు నివేదిస్తానంది. ఆమె తన కలల నన్నింటిని నాకు వ్రాసింది: ఒకటి, రెండు వాక్యాలు హఠాత్తుగా పాత వాటిని నెమరు వేసి, పాత జ్ఞాపకం నుంచి ఏదో అభివ్యక్తం కావటానికి

ప్రయత్నించింది — ఒక సృష్టి — నేను చాలా యుక్తవయసులో ఉన్నప్పుడు, నేను థియాన్‌తో ఉన్నప్పుడు, అది ఈ శతాబ్ది తొలుదొలుత ప్రారంభంలో తిరిగి అభివ్యక్తం కావడానికి ప్రయత్నించడం మొదలు పెట్టింది. అప్పుడది అంతా మరచి పోయిన విషయం. అది ఈ జాబుతో తిరిగి వచ్చింది; ఒక్కసారిగా, నా ఆరోవిల్ ప్రణాళిక రూపుదిద్దుకుంది....

CWM 13;251-52

ముందటి నమూనా

నేను తయారు చేసిన పాత నమూనాలో, అక్కడ ఒక కొండ, నది ఉండవలసింది. కారణం శ్రీఅరవిందుల ఇల్లు కొండపై నుండాలి, కానీ, శ్రీఅరవిందులు అక్కడ మధ్యలో ఉన్నారు. అది నా ప్రతీక ప్రణాళిక ప్రకారం అమర్చబడింది, అనగా, మధ్యలో ఒక బిందుస్థానం, శ్రీఅరవిందులతో, శ్రీఅరవిందుల జీవితంతో సంబంధించిన దంతా, నాలుగు పెద్ద దళాలు — అవి ఈ పటంలో ఉన్న మాదిరిగా లేవు, అవి మరో విధంగా ఉన్నాయి — చుట్టూ అంతటా పన్నెండు, నగరం కూడా; దాని చుట్టూ శిష్యుల నివాసా లున్నాయి; నా ప్రతీక నీకు తెలుసు కదా: గీతలకు బదులుగా, అక్కడ పట్టీ చార లున్నాయి; ఆఖరి గుండ్రటి పట్టీచార శిష్యుల నివాసప్రాంథం, ప్రతి వారికి వారి సొంత ఇల్లు, తోట ఉంది — ఒక చిన్న ఇల్లు, ఒక తోట, ప్రతి వారికి. అక్కడ ఒక విధమైన రవాణా సౌకర్యం ఉంది, అది వ్యక్తిగత రవాణానా లేక సమిష్టిదా అనే విషయం నేను కచ్చితంగా చెప్పలేను — కొండలలో ఉండేటటువంటి టాపులేని చిన్న ట్రాము కార్ల లాంటివి, నీకు తెలుసు కదా — నగర కేంద్రం నుంచి శిష్యులను అన్ని వైపులకు తీసుకు వెళ్తూ, మళ్లీ వెనక్కు చేరుస్తూ ఉంటాయి. దాని చుట్టూ అంతటా, ఒక ప్రహరీ గోడ, ఒక ద్వారంతో, ద్వారం వద్ద కాపలాదార్లతో, అధికారిక అనుమతి లేకుండా ఎవరూ లోనికి ప్రవేశించ లేరు. అక్కడ డబ్బు లేదు — గోడల మధ్య ఏ డబ్బూ లేదు; వివిధ ప్రవేశ ద్వారాల వద్ద బ్యాంకులు, ఒక విధమైన కౌంటర్లు, అక్కడ జనం తమ డబ్బును జమ చేసుకొని, దానికి బదులుగా టిక్కెట్లు తీసుకుంటారు, వాటితో వారు ఉండటానికి గదులు, ఆహారం, ఇది, అది పొంద గలుగుతారు. కాని డబ్బు మటుకు లేదు — టిక్కెట్లు కేవలం సందర్శకులకు మాత్రమే, అధికారిక అనుమతి పత్రం లేకుండా వారు లోనికి ప్రవేశించ లేరు, అది

ఒక బ్రహ్మాండమైన వ్యవస్థ... డబ్బు లేదు, నాకు ఎటువంటి డబ్బూ అవసరం లేదు.

ప్ర: ...శిష్యులు ఇక్కడ ఉంటారా (ఆశ్రమంలో)? *CWM 13:256-57*

ఆహా! ఇక్కడ ఆశ్రమం ఉంటుంది — ఆశ్రమం ఇక్కడే ఉంటుంది, నేను ఇక్కడే ఉంటాను, అది సుస్పష్టం. ఆరోవిల్...

ప్ర: ఒక ఉపనగరం, అనుబంధ నగరం.

అవును, అది బాహ్యప్రపంచంతో సంబంధాన్ని కలిగినటువంటిది. నేను గీసిన పటంలో అది ఒక ప్రతీక కేంద్రం.

ప్ర: ఒక్క మాటలో చెప్పాలంటే, ఆరోవిల్ ఎక్కువగా బాహ్యానికని అనేగా?

ఆహ్! అవును! అది బాహ్యనగరం! పర్యవసానంగా, అది బాహ్యంలో మొత్తం సంబంధాన్ని కలిగి ఉంటుంది. భూమిమీద ఎంతో ఆదర్శవంతమైన జీవితానికి ఒక ప్రయత్నం.

CWM 13;256

భవిష్య ఆహారాన్ని కనుగొనటం

కొన్ని విషయాలు చాలా ఆసక్తిదాయకంగా ఉంటాయి; మొట్టమొదటగా, ఉదాహరణకు, ప్రతి దేశానికి ఒక ప్రదర్శనశాల (హర్మిక) ఉండాలని నేను కోరుకుంటున్నాను., దానిలో ఆ దేశానికి సంబంధించిన వంటకా లుంటాయి — అనగా, జపనీయులనే తీసుకో, వారు కోరుకుంటే వారు వారి జపాను వంటకాన్ని తినే అవకాశం ఉంటుంది. కాని నగరంలోనూ శాఖాహారులకు, మాంసాహారులకు విడివిడిగా ఆహారం దొరుకుతుంది; భవిష్య ఆహారాన్ని తెలుసుకొనే ఒక విధమైన ప్రయత్నం కూడా అక్కడ జరుగుతుంది.

నీకు తెలుసు కదా, మొత్తం జీర్ణించుకొనే ప్రక్రియ భుక్తాయాసం కలిగిస్తుంది. అది ఒక వ్యక్తియొక్క కాలాన్ని, శక్తిని అధికంగా తీసుకుంటుంది — అది ముందుగానే జరిగి పోవాలి, నీకు తక్షణం జీర్ణం అయ్యేది ఏదో, అది ఇవ్వబడాలి, ఇప్పుడు వారు తయారు చేస్తున్నవాటి మాదిరిగా; ఉదాహరణకు, విటమిను మాత్రలు, ప్రోటీనులు, సరాసరిగా జీర్ణం చేసుకో గలిగి నటువంటిది, ఏదో ఒకదానిలో ఉండే పోషకాహార మూలకాలు, ఏవైతే పెద్ద మొత్తంలో తీసుకో నక్కర లేదో — చాలా తక్కువ పరిణామములో. వంటబట్టించు కోవడానికి పెద్ద మొత్తంలో ఆహారం అవసర మవుతుంది. ఇప్పుడు వారు రసాయన శాస్త్రంలో కావలసినంత నైపుణ్యాన్ని సంపాదించారు,

కనుక దానిని తక్కువ చేసి తేలిక పరచవచ్చు.

దీనికి జనులు ఎంత మాత్రం ఇష్టపడరు, కారణం వారు తినటంలో చాలా తీవ్రమైన సుఖాన్ని పొందుతారు, కాని నీవు తినటంలో ఇక ఎంత మాత్రం ఆహ్లాదాన్ని పొందనప్పుడు కూడా నీవు దాని మీద కాలాన్ని వృథా చేయకుండానే పుష్టికరమైన ఆహారం పొందాలి. సమయం విపరీతంగా వృథా అవుతుంది — తినడంలో, జీర్ణించుకోవడంలో ఎక్కువ సమయం, తక్కినవాటిలో కూడా. అక్కడ ఒక ప్రయోగాత్మకమైన వంటశాల ఉండాలని నేను కోరుకుంటున్నాను, ఒక రకమైన ప్రయోగం చేయటానికి వంటకు సంబంధించిన పరిశోధన శాల. జనులు ఏదో ఒక చోటికి లేదా మరొక చోటికి వారి వారి అభిరుచులను బట్టి, ఇష్టాలను బట్టి వెడతారు.

CWM 13:263

నవజీవన విధానపు అధ్యయనం మరియు పరిశోధన

...వారి ఆహారానికి వారు ఏమీ చెల్లించరు, కాని వారు వారి పనిని లేక వారి ఉత్పత్తిని నివేదన చేయాలి: ఉదాహరణకు, ఎవరికైతే పొలా లుంటాయో, వారు వారి పొలాల్లో పండించిన దానిని ఇవ్వాలి; కర్మాగారా లున్నవారు వాటిలో ఉత్పత్తి చేసిన దానిని ఇవ్వాలి; లేదా ఆహారానికి బదులుగా వారు వారి శ్రమను నివేదించాలి.

ఆ విధానం దానికదే అంతర్గతంగా డబ్బు వినియోగాన్ని లేకుండా చేస్తుంది. ఈ విధంగానే మనం ప్రతిదానికీ ఇలాంటి విధానాలను కనుగొంటాం. ఈ నగరం ప్రధానంగా అధ్యయనానికి ఉద్దేశించబడింది. జీవన విధానపు అధ్యయన, పరిశోధనలతో జీవితం సుగమమై, ఉన్నతోన్నత లక్షణాలు అభివృద్ధి చెందటానికి 'ఎక్కువ సమయం ఉండే' అవకాశం ఉంది.

ఇది కేవలం ఒక చిన్న ప్రారంభం మాత్రమే.

నేను ఇది ప్రయోగమనే విషయాన్ని నొక్కి చెపుతున్నాను, అది (అరోవిల్) ప్రయోగాలు చేయటానికి ఉద్దేశించ బడింది — ప్రయోగాలు, పరిశోధన, అధ్యయనాలు.

CWM 13:263-64

వనరులను బట్టి వ్యక్తిగత భాగస్వామ్యం

"అక్కడ నివసించే వారందరూ అక్కడి జీవితంలోను, అభివృద్ధిలోను పాల్గొంటారు".

వారి వారి సామర్థ్యాలను, వనరులను బట్టి, అక్కడ నివసించే వారందరూ అక్కడి జీవితంలోను, అభివృద్ధిలోను పాల్గొంటారు, యాంత్రికంగా మటుకు కాదు — యూనిట్‌కు ఇంక అనే లెక్కలో. అదీ సంగతి, అది అవశ్యం, ఏదో ఒక సజీవమూ, సత్యమూ అయినటువంటిది; యాంత్రికమైనది కాదు; ప్రతి ఒక్కరి సామర్థ్యాలను బట్టి; అనగా, ఒకరికి భౌతిక వనరులుంటే, కర్మాగారం ద్వారా అందజేయబడినట్లుగా, దాని ఉత్పత్తిని బట్టి ఆ నిష్పత్తిలో ఇవ్వబడుతుంది, అంతేగాని ఒక వ్యక్తికి, ఒక తలకి... అది కాకుండా, "భాగస్వామ్యం ఉదాసీనం లేక క్రియాశీలం కావచ్చు"...

ప్ర: "భాగస్వామ్యం ఉదాసీనం లేక క్రీయాశీలం కావచ్చు"... అని మీరు చెప్పినదాని అర్థం, ఎవరైతే జ్ఞానులో, అంతరంగం నుండి పని చేస్తారో, వారు పని చేయవలసిన అవసరం లేదు... అనేగా?

అవును, దానర్థం అదే. ఎవరికైతే ఉన్నతోన్నత జ్ఞానం ఉంటుందో వారు చేతులతో పనిచేయ నక్కర లేదు, అదే నేను చెప్పింది.

"అక్కడ పన్ను లేమీ ఉండవు, కాని ప్రతి ఒక్కరు సమిష్టి శ్రేయస్సుకు తమ వంతు తోడ్పాటును పని, వస్తు లేదా ధన రూపేణా అందిస్తారు."

కనుక, అది స్పష్టమే: అక్కడ ఎటువంటి పన్నులూ ఉండవు, కాని ప్రతి ఒక్కరు సమిష్టి శ్రేయస్సుకు పని, వస్తు లేదా ధన రూపంలో తమ తోడ్పాటును అందించ వలసి ఉంటుంది. కేవలం ధనం మాత్రమే ఉన్నవారు ధనాన్నే ఇస్తారు. కాని యదార్థంగా సత్యం చెప్పాలంటే, 'పని' అంటే అంతరంగ పని కావచ్చు — కాని, ఒకరు దానిని చెప్పలేరు, కారణం జనులు అంత నిజాయితీ గలవారు కాదు. పని మార్మికం (అతీంద్రియం) కావచ్చు, పూర్తిగా అంతరంగ పని; కాని అందుకు అది తప్పక పూర్తిగా చిత్తశుద్ధితో, నిజంగా, దానికి వలసిన సామర్థ్యంతో ఉండాలి: నటనకి ఎటువంటి ఆస్కారమూ లేదు, కాని తప్పనిసరిగా శారీరక శ్రమే కానక్కర లేదు....

సత్య మేమిటంటే భౌతికంగా ప్రతి మానవునికి హక్కు ఉంది — కాని అది 'వాక్కు' కాదు — వ్యవస్థ ఏ విదంగా ఉండాలంటే, అమరిక ఏ విధంగా ఉండాలంటే, అందరి భౌతిక అవసరాలు కచ్చితంగా తీర్చబడతాయనే హామీ ఉంటుంది, హక్కులు, సమానత్వము అనే భావనల ప్రకారం కాదు, కాని కనీస అవసరాల ఆధారంగా. ఒకసారి గనక అది నెలకొల్పబడితే, ప్రతి ఒక్కరు దానికి తగ్గట్టుగా తమ జీవితాన్ని

వ్యవస్థీకరించుకోవడానికి స్వతంత్రులు — వారి ఆర్థిక స్తోమతను బట్టి కాదు, కాని వారి అంతరంగ సామర్థ్యాలను బట్టి.

CWM 13;265-66

మనస్సు స్థానంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతిష్టించటం

"ఏ సూత్రాలు లేదా న్యాయాలు తయారు చేయబడటం లేదు. నగర అంతర్గత సత్యం బయల్పడి, క్రమానుగతంగా రూపు దిద్దుకొన్నప్పుడు విషయాలు వాటికవే రూపాన్ని సంతరించుకొంటాయి. మనం ముందే ఊహించం".

నే నన్నదాని అర్థం, సర్వ సాధారణంగా... ఎల్లప్పుడూ, ఇప్పటి వరకు ఇప్పుడు ఇంకా ఎక్కువగా — మనుషులు వారి అభిప్రాయాలు, ఆదర్శాలను బట్టి మానసిక సూత్రాలను (నియమాలను) తయారు చేస్తారు, తరువాత వాటిని వారు ఆచరణలోకి తెస్తారు (*మనస్సు గట్టి పట్టులో ఈ ప్రపంచం ఉన్నట్లుగా చూపిస్తూ శ్రీమాత తన పిడికిలిని కిందికి దించుతారు*). అది పూర్తిగా కృత్రిమం, కేవలం ఒకరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంది, అవాస్తవం — ఫలితంగా, విషయాలు తిరుగుబాటుకు లోన వుతాయి లేదా క్షీణించి అదృశ్యమైపోతాయి.... అవి ఎంత మటుకు మలచ దగినవో, విస్తృతపరచ దగినవో అంతగా ఆ నియమాలను (సూత్రాలను) నెమ్మదిగా విస్తృత పరచుకొంటూ, ఎప్పుడూ పురోగతితో అభివృద్ధి చెందేటటువంటి జీవితం దానికదే ఇచ్చే అనుభవం అది. ఏదీ గట్టిగా స్థిరపరచబడేది కాదు.

అదే ప్రభుత్వాల పెద్ద తప్పు: వారు ఒక చట్రంలో ప్రతిదానిని ఉంచి, ఇలా అంటారు, "తెలిసింది కదా, మేము ఈ చట్రాన్ని రూపొందించాము, ఇప్పుడు మీరు తప్పక దీని ప్రకారం జీవించాలి". కాబట్టి సహజంగానే వారు జీవితాన్ని అణచివేసి, పురోభివృద్ధి నొందకుండా అడ్డం పెడతారు. జీవితం ఎక్కువెక్కువగా, క్రమానుగతంగా మహా ప్రకాశం, మహా జ్ఞానం, మహా ఆధిపత్య శక్తుల దిశగా అభి వృద్ధి నొందాలి. ఎంతగా సాధ్యమైతే అంతగా సర్వ సాధారణంగా ఉండేటట్లుగా తక్కువ తక్కువగా నియమాలను నెలకొల్పుకుంటూ పోతుండాలి; ఫలితంగా అది పూర్తిగా అవసరాన్ని బట్టి మలచ గలివేవిగా, మార్పు చేయబడేవిగా ఉండాలి — అవసరాలు, అలవాట్లు మారేటంత త్వరితంగా అవి మార్పు చెందాలి.

(నిశ్శబ్దం)



నూతన సృష్టి సౌందర్యం (ఆరోవిల్ అందం)
నూతన సృష్టి ఎక్కువగా దివ్యత్వమునకు అభివ్యక్తం చేయటానికే గట్టిగా ప్రయత్నిస్తుంది. (ఆధ్యాత్మిక ప్రాధాన్యత, వివరణ శ్రీమాతవి)
Botanical name: *Hibiscu rosa --- Sinensis 'Debbie Ann'*

నీవు ఆరోవిల్‌ని ఒక కల అని అన్నావు. అవును, అది ప్రభువు 'కల'. సర్వ సాధారణంగా ఈ 'కలలు' నిజమవుతాయి — ఎంతగా నిజమౌతాయంటే మానవులు వాస్తవాలని అంటూ పుండేవాటి కంటే ఎక్కువగా!

CWM 13:191

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

చిట్టచివరికి సమస్య ఈ దశకు చేరుతుంది: మేధోపరమైన మానసిక పరిపాలన స్థానంలో ఆధ్యాత్మిక చైతన్యం యొక్క పరిపాలన ప్రతిష్ఠాపన చేయడం.

CWM 13;267 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆరోవిల్ ఆవిర్భావం

ఫిబ్రవరి 28, 1968

(అరోవిల్ ప్రారంభోత్సవ సందేశం)

ఆరోవిల్ తరఫున సహృదయు లందరికీ శుభాకాంక్షలు.

ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలనే తృష్ణతో, అత్యున్నతమైన, సత్యమైన జీవితాన్ని కాంక్షించే వారందరికీ ఆరోవిల్ స్వాగతం పలుకుతోంది.

CWM 13:193

ఆరోవిల్ అధికారిక పత్రం

1. ఆరోవిల్ ప్రత్యేకించి ఏ ఒక్కరికీ స్వంతం కాదు, ఆరోవిల్ మొత్తం మానవాళికి చెందినది.
   కాని, ఆరోవిల్‌లో జీవించాని అనుకునేవారు తప్పనిసరిగా దైవచేతనకు స్వచ్ఛంద సేవకులుగా నుండాలి.
2. ఆరోవిల్ నిరంతర విద్యతో, స్థిరమైన ప్రగతితో, నిత్య యౌవనంతో, వార్ధక్య ఛాయలను దరిచేర నీయని ప్రదేశంగా నుంటుంది.
3. ఆరోవిల్ గతానికి, భవిష్యత్తుకు మధ్య వారధిగా ఉండాలని ఆకాంక్షిస్తుంది. బాహ్యాంతరమగు నూతన ఆవిష్కారాల వల్ల కలిగే అన్ని ప్రయోజననాలను ఉపయోగించుకుంటూ, ఆరోవిల్ భవిష్య అనుభవాల కోసం సాహసంతో ముందుకు గంతేస్తుంది.
4. ఆరోవిల్ భౌతిక మరియు ఆధ్యాత్మిక పరిశోధనలకు అనువైన ప్రదేశం, వాస్తవమైన మానవ ఐక్యతకు సజీవ నిదర్శనం.

CWM 13:193



నూతన సృష్టిని అనుభవంలోనికి తెచ్చుకొనుట (ఆరోవిల్‌ని అనుభవంలోకి తెచ్చుకొనుట) మన మంతా దాని కోసం సిద్ధంగా ఉండాలి. (దివ్యమాత ఇచ్చిన వివరణ మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యత)
వృక్షశాస్త్రి నామం: Hibiscus rosa, sinesis 'Vasco'

దైవచేతనకు స్వచ్ఛంద సేవకుడుగా నుండుటకు

ఆరోవిల్ అధికారిక పత్రం మొదటి భాగం గురించి: "ఆరోవిల్‌లో జీవించాలని ఆకాంక్షించే ప్రతి ఒక్కరు కూడా దైవిక చేతనకు స్వచ్ఛంద సేవకులు అయి వుండాలి."

ప్రస్తుతం ఆరోవిల్ గురించి జరుగుతున్న పెద్ద వివాదం ఇది. అధికారిక పత్రంలో నేను 'దివ్యచేతనను' చేర్చాను, అప్పుడు వాళ్ళంటారు 'దైవాన్ని గుర్తుకు తెస్తోంది' అని. నేను (చిరునవ్వుతో దివ్యమాత) 'అది నాకు దైవాన్ని గుర్తు తేవటం లేదు' అన్నాను.

కాబట్టి కొందరు దాన్ని 'అత్యున్నత' చేతనగా అనువదించారు, ఇంకొందరు

వేరే విధంగా చెప్పారు. నేను రష్యనులతో ఏకీభవిస్తూ అది ఇంచుమించుగా 'పరిపూర్ణమైన చేతన' అన్నాను — పేరు పెట్టలేనిది, నిర్వచించ వీలు కానిది — అదే సర్వోత్కృష్ట శక్తి. అదే ఒకరు కనిపెట్టగలిగే సర్వోత్కృష్ణ శక్తి. సర్వోత్కృష్ట శక్తి కేవలం ఒక దశ: సృష్టి నిర్మాణానికి సంబంధించినది.

CWM 13;195-96

ఎట్టకేలకు ఒక స్థలం; ఒక భిన్నమైన నగరం

ఎట్టకేలకు మనిషి తాను అభివృద్ధి చెందాలని, తనను తాను అధిగమించాలనే ఆలోచన చెయ్యడానికి అనువైన స్థానం.

ఎట్టకేలకు మనిషి ప్రశాంతంగా ఘర్షణలు లేకుండా దేశాలు, మతాలు, గాఢమైన కోరికల మధ్య పోటీలు, పోరాటాలు లేకుండా జీవించ గలిగే ప్రదేశం.

ఎట్టకేలకు ఒక ప్రదేశం, అక్కడ ఇది తప్ప వేరొకటి సత్యం కాదు అని బలవంతంగా నిర్బంధించే హక్కు లేని ప్రదేశం.

CWM 13:269

ఆశ్రమం — ఆరోవిల్

ఆశ్రమం దివ్యచేతనా కేంద్రం. ఆరోవిల్ దాన్ని బాహ్య అభివ్యక్తి. రెండు చోట్లా దైవిక కార్యక్రమాలు ఒకే విధంగా జరుప బడతాయి.

ఆశ్రమంలో ఉండే సాధకులకు, వారి కుండే పనులు వారి కుంటాయి. కనుక ఆరోవిల్‌కి సమయాన్ని కేటాయించ లేరు.

ప్రతి ఒక్కరూ, తప్పక వారి పనిలో నిమగ్నులై ఉండాలి. అది వ్యవస్థ సవ్యంగా పని చెయ్యడానికి అవసరం కుడా.

CWM 13:205

ప్ర: ఆశ్రమంయొక్క ప్రధాన లక్ష్యానికి ఆరోవిల్ ప్రధాన లక్ష్యానికి మధ్య గల మౌలిక వ్యత్యాసం ఏమిటి?

స: భవిష్యత్తును గురించిన వైఖరి, దైవసేవా దృక్పథం, ఈ రెంటి మధ్యా వ్యత్యాసం లేదు.

కాని, ఆశ్రమంలో నివసించేవారు మాత్రం వాళ్ళ జీవితాలను యోగసాధనకు

అర్పించు కున్నవాళ్ళు, విద్యార్థులు మినహా, ఎందువల్లనంటే వాళ్లు ఇక్కడికి విద్యను అభ్యసించడానికి వచ్చినవాళ్లు మాత్రమే. వారి జీవిత లక్ష్యాన్ని వారు ఇంకా నిర్ణయించుకో లేదు.

కానీ ఆరోవిల్ ప్రవేశార్హతకు మానవాళిని పురోగమ దిశలో తీసుకు వెళ్లడానికి సమిష్టి ప్రయోగం చేయాలనే సుహృద్భావన ఉంటే చాలు.

CWM 13:203-04

(UNESCO సమితికి రాసినది)

శ్రీఅరవిందుల భావిదృష్టికి నిశ్చిత రూపకల్పన గావించే పని శ్రీమాతకు అప్పగించ బడింది. ఒక సరి క్రొత్త ప్రపంచాన్ని, ఒక నూతన మానవాళిని, ఒక నవ్య సమాజాన్ని ఏవైతే నూతన చేతనను పొందుపరచి, దానిని వ్యక్తీకరించే కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. విషయ విధాన పరంగా ఒక సమిష్టి ఆదర్శాన్ని అది సూచిస్తుంది. అందుకు సమైక్య ప్రయత్నం అవసరం. అప్పుడు అది అభిన్నమైన, పూర్ణమైన మానవ సమగ్రతను అనుభవానికి తెచ్చుకో గలదు.

ఈ లక్ష్యసాధనకు మొట్టమొదటి అడుగు శ్రీమాత శ్రీఅరవిందాశ్రమాన్ని నెల కొల్పడంతో వేశారు. ఆరోవిల్ నిర్మాణం ఆ దిశలో వేసిన రెండవ అడుగు. మనుష్యుల ఉమ్మడి జీవనంలో బాహ్య ప్రపంచానికి కనిపించేలా దాని యొక్క మూలధారాన్ని విశాలపరచడానికి, దాని ద్వారా మనిషి శరీరము, ఆత్మల మధ్య, ప్రకృతి జీవాత్మల మధ్య, భూతలము స్వర్గముల మధ్య సామరస్యాన్ని సాధించడానికి వేసిన రెండవ అడుగే ఆరోవిల్.

అనువాదం: డా. టి. యస్. రాజకుమారి

UNESCO కి పంపిన సందేశం

ఆరోవిల్ భూమి మీద అతిమానస శక్తి ఆవిష్కరణను వేగిర పరచడానికి ఉద్దేశింపబడినది.

ప్రపంచం ఏ విధంగా నుండవలసిందో ఆ విధంగా లేదని కనుగొన్నవారి సహాయ సహకారాలు స్వాగతిస్తాము.

ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినది ఏమంటే పాతబడి, మరణించడానికి సిద్ధంగా ఉన్న ప్రపంచంతో సంబంధం పెట్టుకుంటారా లేక నవ్యమైన, మేలైన ప్రపంచ ప్రభావానికై పని చేస్తారో తేల్చుకొనడం

ఆరోవిల్ ఉద్దేశం

ఆసన్నమౌతున్న మహా విపత్తు — రహస్య కార్యాచరణ

బాహ్య కారణాల దృష్ట్యా ప్రపంచ దేశాలన్నీ, తమంతట తాము ఎటువంటి విచారకరమైన పరిస్థితుల్లో పడిపోయాయో చూచాను. అవి వాస్తవంగా పృథ్వికి సంబంధించిన బాధాకరమైన, విపత్కర పరిస్థితులు. ఎలా దేశాలు ప్రవర్తించినాయో, ఎలా అంతకంతకూ పెరుగుతున్న మోసపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయో, ఎలా వినాశకరమైన, బలమైన సాధనా సామగ్రిని సృష్టించుటకు తమ సృజనాత్మక శక్తిని ఉపయోగించాయో, అభివ్యక్తమయ్యే సమగ్ర దృశ్యం గోచర మయింది. వినాశనం ఎంత తీవ్రంగా నుంటుందంటే, దానిని సృష్టించే సాధనాలను వేరెవ్వరూ వాడరనే విషయం వాటికి తమ అంతర్బుద్ధిలో విదితమే. ఆ సమాగ్రి ఒక చేతన, ఒక శక్తి కలిగి వుంటుందని, అది సాకారమై తీరుతుందని. ఆ విధ్వంసకర ఆయుధాలను వినియోగించటానికి అవి ఒత్తిడి తెస్తాయని వాటికి తెలుసు. వాటిని వాడాలని మనుషులు కోరుకోకపోయినా వాళ్ల తలంపు కంటే బలమైన శక్తి ఒకటి వాటిని ప్రయోగింప చేసేలా వారిని పురికొల్పుతుంది.

ముంచుకొస్తున్న ఈ మహావిపత్తును గమనిస్తున్నప్పుడు ఈ మానవ తప్పిదాన్ని కనీసం కొంత నిర్వీర్యం గావించగల ఒకదానిని తీసుకురావాలనే ఒక పిలుపు లేక ఒక ఆకాంక్ష కలిగింది. అందుకు జవాబు వచ్చింది. దానిని నేను చెవుల్తో విన్నానని చెప్పలేను కానీ అది ఎంత సుస్పష్టంగా, ఎంత దృఢంగా, ఎంత స్పష్టంగా నుండిందంటే, అది నిర్వివాదమైనదని, రూఢి అయింది. దానిని పదాల్లోకి అనువదించడం తప్పనిసరి అయింది. అనువదించినట్లయితే దానిని ఇలా చెప్పవచ్చు: "అందుకోసమే నీవు ఆరోవిల్‌ని సృష్టించావు."

ఆరోవిల్ ఒక శక్తికి, సృష్టికి కేంద్రమై, సత్యానికి బీజమై అంకురించి, వృద్ధి చెంది, అట్టి ఎదుగుదలతో యుద్ధ పరికరాల దురుపయోగం వలన చోటు చేసుకొనే దుర్భర పర్యవసానాలకు ప్రతికూల స్పందనగా పరిణమిస్తుందనే స్పష్టమైన దూరదృష్టితో ఆరోవిల్ ఆవిర్భావం జరిగింది.

శిష్యునితో శ్రీమాత సంభాషణ, 21-9-1966

ఆరోవిల్: అంతిమ ఆశ

ఇది నాకు చాలా ఆసక్తిని కలిగించింది. ఈ 'ఆరోవిల్' పుట్టుక ఎల్లప్పుడూ జరిగే విధంగా ఒక ఆలోచన నుండి సంభవించ లేదు. అది కేవలం ఒక క్రియాశీలక శక్తి, ఒక విధమైన పరిపూర్ణ అవతరణ. అది ఎంత శక్తివంతమైనదంటే (ఆరోవిల్ భావన దానంతట అదే శ్రీమాతకి కలిగినప్పుడు) నేను జనులకు చెప్పగలిగే దాన్ని: "దీనిని మీరు నమ్మకపోయినప్పటికీ, పరిస్థితులన్నీ పూర్తిగా ప్రతికూలంగా వున్నట్లు కనిపించినప్పటికీ, ఆరోవిల్ ఏర్పడుతుంది. అది వందేళ్ళలో కావచ్చు, వెయ్యేళ్ళలో కావచ్చు నాకు తెలియదు, కానీ ఆరోవిల్ అన్నది తప్పక రూపు దిద్దుకుంటుంది. ఎందుకంటే అది తీర్మానించ బడంది". ఆ విధంగా నిర్ణయించబడింది, కాబట్టి అతి తేలికగా దైవ ఆదేశాన్ని అనుసరించి మరో తలంపు లేకుండా జరిగి పోయింది. అది నాకు ఎప్పుడైతే చెప్పబడిందో (నాకు చెప్పబడిందని అన్నాను, కానీ నా ఉద్దేశం నీ కర్థమయింది కదా) "ఇందు కోసం ఆరోవిల్‌ని సృష్టించావు. దాని గురించి నీకు తెలియదు, కానీ అందు కే..." ఎందుకంటే మహా విపత్తుకు వ్యతిరేకంగా ఇది ప్రతిచర్య చేయడానికి ఆఖరి అవకాశం. అన్ని దేశాల్లోనూ ఈ సృష్టి పట్ల కొంత ఉత్సుకత ఏర్పడితే అది కొద్ది కొద్దిగా వాళ్లు చేసిన అపరాధానికి ప్రతికూలంగా ప్రతిస్పందించే శక్తిని పుంజుకొంటుంది.

సహజంగానే, అది నాకు చూపబడినప్పుడు నేను అర్థం చేసుకొన్నాను; ఏ విధంగా ఆరోవిల్ సృష్టి ప్రచ్ఛన్నంగా, ఒక కార్యసరళిని కలిగి వుంటిందో, ఏ పని చేస్తుందో. అది భౌతికమైన బాహ్యకార్యాచరణ కాదు, కనిపించని కార్యాచరణ. అప్పటి నుండి దానిని దేశాలన్నీ అవగతం చేసుకొనేలా ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ బాహ్యంగా కాదు. ఎందుకంటే వాళ్లకేదయినా బోధిద్దామంటే వారిని వారు తెలివైన వారుగా భావించుకొంటారు. కానీ కనిపించకుండా, అంతర్ముఖంగా.

ఇదంతా కేవలం నీకు చెప్పడానికే: ఆరోవిల్ కార్యక్రమంలో అన్ని దేశాలు సహకారాన్ని అందిస్తే, అది కొంత మేరకు జరిగినా, వారి కెంతో మేలు కలుగుతుంది. వాళ్ల చర్యల దామాషాకు మించి మేలు కలిగిస్తుంది.

ఒక శిష్యునితో శ్రీమాత సంభాషణ, సెప్టెంబరు 21, 1966

దేశా లన్నింటి యొక్క సామూహిక సృష్టి

ఇక్కడ నేను ఒక వాతావరణాన్ని సృష్టించడంలో దేశాల సహకారాన్ని గూర్చి మాట్లాడుతున్నాను. అది ఆరోవిల్ సృష్టించబడిన తరువాత జరగాల్సింది కాదు. ఆ సృష్టించబడేది, మోసపూరితమైన సృష్టిలో ఏర్పడే స్పర్థకు బదులుగా పరమ సత్యంలో వేళ్ళూనినదై వుండాలి. అది ఆరోవిల్ తయారైపోయిన తరువాత కాదు. ఎప్పుడైతే ఆరోవిల్ ఏర్పడుతుందో అది తక్కిన నగరాల్లో ఒక నగరమై పోతుంది. అది తనదైన సత్యసంభరితమైన శక్తిని కలిగి వుంటుంది.... వేచి చూడాలి.

లేదు లేదు, ముఖ్యమైన విషయమేమిటంటే సత్యాన్ని పునాదిగా చేసుకొన్న దానిని నిర్మించే సంయుక్త ఉత్సాహం. (దేశాలన్నీ పరస్పర మైత్రి లేకుండా) అస త్యాన్ని ఆధారంగా చేసుకుని, వినాశకరమైన శక్తిని సృష్టించుటలో సంయుక్త ఉత్సాహం కనబరిచాయి. ఆరోవిల్ అంటే ఆ శక్తిని కొద్దిగా దారి మళ్లించడం. (అది పరిమాణంలో చాలా తక్కువ గానీ లక్షణంలో శ్రేష్టమైనది) ఇది నిజంగా ఒక ఆశ – అది ఆశపైనే ఏర్పడింది — సామరస్యత ప్రారంభమవడానికి ఏదో ఒకటి చేయాలనే ఆశ.

కాదు, ఇప్పుడే కచ్చితంగా ఇప్పుడే అది జరగాలి. దాని వృద్ధి చెందే శక్తి అపారం. అది ప్రసరణ కేంద్రానికన్నా, దాని కన్నా అధికమైనది, ప్రపంచవ్యాప్తమైనది, ఇంత వరుక కనీ వినీ ఎరుగనిది. దాని శక్తి ప్రసరణా తీవ్రత అధికం, అసాధరణం. ఆరోవిల్ పట్ల ప్రతిస్పందన సర్వత్రా వున్నది. ఆఫ్రికా నుండీ, ఫ్రాన్సునుండీ, రష్యా నుండి, అమెరికా నుండి, కెనడా నుండి, ఇటలీ నుండి, ఇలా అసంఖ్యాక దేశాల్లో ప్రతి చోటా స్పందన వెలువడుతుంది. వ్యక్తుల్లోనే కాదు, సమూహాల్లో, వైఖ రుల్లో, చర్యల్లో ఆఖరికి ప్రభుత్వాల్లో కూడా ...

శిష్యునితో శ్రీమాత సంభాషణ, 21 సెప్టెంబరు 1966

అనువాదం; సి. హెచ్ . హర్షవర్ధన రాజు

ఆరోవిల్ స్ఫూర్తి

ప్రపంచ చరిత్రలో ఆరోవిల్ సృష్టి అన్నిటి కంటె బలీయమైనదని నేను చెప్పితే ప్రజానీకం నమ్మదు. వారి దృష్టిలో ఇది ముఖ్యమైన విషయం కాదు, కేవలం ఒక భ్రమ.

మేను చాలాసార్లు ఈ విషయం చర్చించుకొన్నాము. నేను సుమారు ముప్పై సంవత్సరాల క్రిందట ఈ విషయమైన శ్రీఅరవిందులను అడిగాను (ఎందుకనగా అది ఒక ఆలోచన, ఒక అవసరం దానంతట అది ఏర్పడినది – 30, 40 ఏండ్ల క్రింద) వారు చెప్పిన దేమంటే ఒక సార్వత్రిక సంఘర్షణ లేకుండా ఉండాలంటే ఇది ఉత్తమమైన అవకాశం అని.

కాబట్టి వారు చెప్పినప్పట్నుంచీ ఈ ఆలోచనను కార్యరూపంలో పెట్టే విధానం గురించే ఆలోచిస్తున్నాను. అయితే దానిని మాటల్లో వ్యక్తపరచ లేను, కానీ అనుభ వించాను.

ఎవరికీ దానిలో నమ్మకం లేదని నాకు స్పష్టమయింది. కాబట్టి అది సబబేనా అనే అనుమానం కలిగింది. ఆరోవిల్‌ని గురించిన స్ఫూర్తి ఇంకా ధృవపడ లేదు. అది భూవాతావరణంలో ఇంకా చోటు చేసుకో లేదు. సారభూతంగా అది 'సంకీర్ణ స్థితి నుండి ఏకతను ఏర్పరచడం' అనవచ్చు. అది క్రమపద్ధతి లేకుండా, నీ కర్థ మయిందా, సంకీర్ణతలో సామరస్యతను కలిగించడం ద్వారా ఏకతను సాధించడం. సామరస్య పూరితంగా దేని ప్రత్యేకత దానికి ఉంచుతూ, అన్నిటినీ సమరూపంగా చేయడము. లోకంలో ఏదో ఒక ఆపత్కార స్థితి ఏర్పడబోతున్నదని శ్రీఅరవిందులు గ్రహించి, దాని శక్తి ప్రసరణను మళ్లించడానికి ఒక మార్గంగా భావించారు.

శ్రీమాత సంభాషణలు, అక్టోబరు 25, 1967

రూపాంతరీకరణ కేంద్రం

అతిమానస ఆవిర్భావ వాస్తవికతను శీఘ్రతరం చేయడమే ఆరోవిల్ ప్రధాన ఉద్దేశ్యము. ప్రపంచపు తీరు ఉండవలసిన పద్ధతిలో లేదు అనుకునే వారందరి సహా యము ఆదరింప తగినదే. ప్రతి ఒక్కరూ ఆవిర్భవించనున్న కొత్త మంచి లోకం కోసం పాటు పడాలనుకుంటున్నారో, లేక కూలిపోతున్న లోకం పాత ప్రపంచంలోనే ఉండిపోవా లనుకుంటున్నారో తేల్చుకోవాలి.

1 ఫిబ్రవరి, 1972 *శ్రీమాత సంభాషణలు*

ప్ర: మానవుల కష్టాలకు సంఘంలోని అస్తవ్యస్తాలకూ ఆరోవిల్ మాత్రమే ఒక పరిష్కారమా?

ఇదొక్కటే పరిష్కారం కాదు, ఇది ఒక రకమైన మార్పుకి, పరివర్తనకీ కేంద్రం

కాగలదు. అది ఎవరైతే తమంతట తాము పరివర్తన గావించుకొని ప్రపంచంలో ఒక నమూనాగా నుండ దలిచాలో అట్టివారి చిన్న సమూహం. ప్రపంచంలో అహంకారమూ, చెడు తలంపులూ ఉన్నంత కాలం సార్వత్రిక మార్పు సంభవం కాదు.

CWM 13:219 — *అనువాదం: అమరవాది ప్రభావతి*

ఆరోవిల్ – మతాలు

మనకు పరమ సత్యం కావాలి

— చాలా మంది వారు దేనిని కోరుతారో దానికే సత్యమనే ముద్ర వేస్తారు.

— ఆరోవిల్లీయులు పరమ సత్యాన్నే కోరాలో, అది ఏమైన కాని.

నిజమైన స్వాతంత్ర్యం

తనకు తాను తప్ప ఆరోవిల్ ఎవరికీ లోబడి ఉండ నక్కర లేదనుకున్నాననీ, కానీ అక్కడ చాలా నియమాలు, నిబంధనలూ ఉన్నాయనీ, తాను స్వేచ్ఛాజీవి కాబట్టి ఇవి పాటించబోవటం లేదనీ, ఒకాయన నాకు రాశాడు. నేను అతనికి ఈ విధంగా సమాధాన మిచ్చాను. "ఎవరైతే భగవంతుని చేతన కలిగి ఉంటారో, ప్రతివారిలో నిర్ణయాలు చేసేది భగవంతుడు మాత్రమే అనే స్పృహలో ఉంటారో, వారు మాత్రమే స్వేచ్ఛకు అర్హులు, అలా కానివారు వారి కోరికలకూ, అలవాట్లకూ బానిసలే". నేను ఈ విధంగా జవాబిచ్చేసరికి అతను నిర్ఉత్తరుడై పోయాడు.

నేను ఇది మాత్రమే ఇక్కడ చేర్చుదామనుకున్నాను. ప్రతి ఒక్కరిలో నిర్ణయాలు తీసుకునేది భగవంతుడు మాత్రమే అయినప్పుడు వారు స్వతంత్రులు, లేనప్పుడు అందరూ వారి కోరికలకూ, అలవాట్లకూ, అన్ని రకాల నియమనిబంధనలకూ బానిసలే అవుతారు, స్వతంత్రంగా ఉన్నామని ఎంత ఎక్కువగా అనుకుంటారో అంత ఎక్కువగా వారు కట్టుబాట్లలో ఉన్నట్లే1

శ్రీమాత శిష్యునితో సంభాషణలు, 7 ఫిబ్రవరి, 1970

అనువాదం: డా. అమరవాది ప్రభావతి

ఎవరైతే దైవికమైన దానినే ప్రాధాన్యతగా తీసుకొని జీవితం గడపా లనుకొంటారో వారికే ఆరోవిల్ ఉద్దేశింప బడింది, కానీ వారు సర్వ మతాలను పరిత్యంజినవారై వుండాలి, అవి పురాతనమైనవి, ఆధునికమైనవి, నూతనమైనవి లేక భవిష్యత్తుకు చెందినవి, ఏమైనా సరే.

కేవలం అనుభవంలో మాత్రమే పరమ సత్య జ్ఞానం అబ్బుతుంది.

దైవికమైన అనుభవం వుంటే తప్ప ఎవరూ దైవం గురించి మాట్లాడడం యుక్తం కాదు.

దైవికమైన అనుభవం పొందాలి. అప్పుడు మాత్రమే నీకు దైవం గురించి మాట్లాడే హక్కు కలుగుతుంది.

సూక్ష్మంగా పరిశీలించాలనే లక్ష్యంతో మతాలను అధ్యయనం చేయడం మావన చేతనాభివృద్ధిని గురించి చేయబడిన చారిత్రాత్మక అధ్యయనంలో ఒక భాగం అవుతుంది.

మానవజాతి చరిత్రలో మతాలు ఒక భాగం. ఈ దృష్టితోనే ఆరోవిల్‌లో అవి అధ్యయనం చేయబడుతాయి — ఒకరు వాటికి అంటిపెట్టుకొని వుండాలా వద్దా అనే నమ్మకానికి దారి తీసేవిగా కాదు, కాని మనిషిని, అతని అత్యున్నత లక్ష్యసాధనకు దారి తీసే మానవ చేతనాభివృద్ధి ప్రక్రియలో భాగంగా అధ్యయనం చేయబడతాయి.

*

మన పరిశోధన మార్మిక పద్ధతుల్లో ప్రయోజనాలను పొందాలనే అన్వేషణ కాదు.

జీవితంలోనే దైవాన్ని కనుగొనాలని మన కోరిక. దీనిని కనుక్కోవడం ద్వారానే జీవితంలో నిజమైన పరివర్తన చెందగలరు.... CWM 13:206

ఎంత కాలం అయితే మీరు కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతి కూలంగా వుంటారో అంతవరకు మీరు పరమసత్య పరిధికి ఆవలగా వున్నట్లు అవుతుంది.

మీరు మీ హృదయంలో సత్సంకల్పాన్ని, ప్రేమను స్థిరంగా నిలుపు కోవాలి. ప్రశాంత, సమత్వ భావంతో వాటిని అందరిపై వర్షింప నీయాలి.

CWM 13:21 శ్రీమాత

మార్మిక మార్గాలు అనడంలో నా ఉద్దేశ్యం సన్యాసులుగా జీవితంపై విరక్తితో మళ్ళే వారు, మఠాలలోకి తిరోగమించేవారు లేక ఇక్కడి సన్యాసులలాగ ఆధ్యాత్మిక జీవనానికై వెతుకులాటలో జీవితాన్ని త్యజించేవారు, ఎవరయితే జీవితం వేరు, ఆధ్యాత్మికత వేరు అనే తలంపుతో 'అయితే యిది లేకపోతే అది' అని నిర్ధారణకు వచ్చేవారు అనుసరించే మార్గం, అని. 'అది నిజం కాదు' అని మన మంటాం. జీవితంలో వుంటూ, అందులోనే సంపూర్ణంగా మనుగడ సాగిస్తూ ఎవరయినా ఆధ్యాత్మిక జీవనం గడపాలి. పరమోత్కృష్టమగు చేతనను తేవలసింది ఇక్కడ, అనగా జీవితంలో. కేవలం భౌతికమైన, దైహికమైన దృష్టిలో మానవజాతి పరిణామ క్రమంలో చిట్ట చివరిది కాదు. మనిషి ఏ విధంగానయితే జంతుదశ నుండి పరిణమించాడో, అదే విధంగా మరొక జీవి మనిషి దశ నుండి పరిణామం చెందాలి. అన్నది ఒకే ఒక దివ్యచేతన కాబట్టి, అదే దివ్యచేతన మనిషి అనుభవం పొందివున్న మూలంగా అధిమానవజీవి అనుభవం కూడా పొందగలదు. కాబట్టి ఒక వేళ మనం నిర్గమించితే, జీవితాన్ని తిరస్కరించితే మనం ఎప్పటికీ అది చేయడానికి సంసిద్ధులం కాలేము.

కానీ నీవు గనుక అరవిందుల రచనలు చదివి వుంటే, నీకు తెలిసి వుండేది. ఈ ప్రశ్న అడిగేవాడివి కాదు. అందుకు కారణం మేధాపరమైన దృష్టిలో ప్రయత్నం కొరవడింది. అధ్యయనం చేయకుండానే నీవు అంతా తెలుసుకోవా లనుకొంటున్నావు.

CWM 13:330-31

ఉన్నత సత్యంతో పోలిస్తే మతం ఏమిటి?

ప్ర: మతం గురించిన తలంపు తరచుగా దైవాన్వేషణతో జోడించ బడుతంది. మతం కేవలం ఈ రీతిగానే అర్థం చేసుకోబడాలా? వాస్తవానికి ఈ రోజుల్లో మతం అనేది అనేక రకాలుగా ప్రబలి వున్నది కదా?

స: ప్రపంచానికి లేదా విశ్వానికి సంబంధించిన ఏ విషయమైనా ప్రత్యేకమైన సత్యమని, దైవోన్ముఖంగా ప్రకటించబడినదని, అందువలన ప్రతి ఒక్కరూ దానిని పరిపూర్ణంగా విశ్వసించాలని తెలుపబడితే, దానికే మనం మతం అని పేరిడుతాము.

అనేక మతాలు దైవం యొక్క ఉనికిని ధృవపరిచాయి. దైవానికి విధేయులై వర్తించడానికి అవసరం అయిన నియమాలను విధించాయి. అయితే, దైవం ఉనికిని కొన్ని మతాలు, సామాజిక, రాజకీయ సంస్థలుగా పేరొందినవి, విశ్వసించవు. ఒక

ఆదర్శం లేక దేశభక్తి పేరిట నిర్దేశింపబడిన నియమాలను హక్కుభుక్తంగా అందరిపై విధిస్తాయి

పరమ సత్యాన్ని స్వేచ్ఛగా అపేక్షించడానికి, స్వేచ్ఛగా దానికి సన్నిహితంగా వుండటానికి వ్యక్తికి హక్కు వుంది, కానీ ప్రతి ఒక్కరూ తాము కనుగొన్నది తమకు మాత్రమే సముచితమైనదని, అది ఇతరులపై విధించబడ కూడదని తెలుసుకోవాలి.

CWM 13:207

దేశాల మధ్య స్పర్థలు, సామాజిక కట్టుబాట్లు, పరస్పర విరుద్ధమైన నైతిక నియమాలు, అనునిత్యం పోరాడుతుండే మతాలు మొదలగువాటి అన్నింటికి దూరంగా మనుషులు జీవించగల ఒక ప్రదేశం భూమండలానికి అవసరం. అచట, మానవజీవులు గత కాల బానిసత్వం నుండి స్వేచ్ఛను పొంది, సాక్షాత్కరించుటకు నిరీక్షిస్తున్న దివ్యచైతన్యాన్ని కనుగొని, అనుష్టించడానికి తమను తాము సంపూర్ణంగా సమర్పించుకోగలగాలి.

*

ఎవరయితే వ్యక్తిగతమైన వస్తుసంపదను వర్జించుటలో స్వేచ్ఛానందాలను అనుభవించగోరుతారో వారందరికి ఆరోవిల్ ఒక ఆదర్శప్రాయమైన ప్రదేశం.

CWM 13:202

నిజమైన ఆరోవిల్లీయుడిగా వుండాలి అంటే:

1. మొదటి అవసరం: సామాజిక, నైతిక, సాంస్కృతిక, జాతిపరమైన, వంశపారంపర్యమైన నేపథ్యంలో, తాను యదార్థంగా ఏమిటో తెలుసుకొనుటకు అంతర్గత అన్వేషణ.

   అస్థిత్వ కేంద్రంలో ఉన్నాడొక జీవి. అతడు స్వతంత్రుడు, అపారమైనవాడు, సర్వజ్ఞుడు, మన అన్వేషణకై నిరీక్షిస్తున్నాడు. అతడు ఆరోవిల్‌లో మన జీవితానికి, మన ఉనికికి, క్రియాశీల కేంద్రంగా వుండదగిన వాడు.

2. ఒకరు ఆరోవిల్‌లో నివసించేది ఎందుకంటే, నైతిక, సామాజిక కట్టుబాట్లకు, బద్దుడిగా కాక, స్వేచ్ఛగా జీవితం గడపడానికి. అయితే ఈ స్వేచ్ఛ అహానికి, దాని కోరికలకు, దాని తీవ్ర అభిలాషలకు కొత్త బానిసత్వం కాకూడదు.

   కోరికలను సంతృప్తి పరచడం అనేది అంతరంగ అన్వేషణను ఆటంక

పరుస్తుంది. అట్టి అన్వేషణ ఫలప్రదం కావాలి అంటే పారదర్శకమైన, ప్రశాంతమైన, సంపూర్ణమైన నిర్లిప్త వైఖరి అవసరం.

3. ఆరోవిల్లీయుడికి వ్యక్తిగత సంపద కలిగి వుండాలనే భావన లుప్తం కావాలి. ఎందుకనగా ప్రాపంచిక జీవిత బాటలో మన జీవితానికి, మన కార్యాచరణకు ఆవశ్యకమయినది మనం ఆచరించవలసిన స్థాయికి అనుగుణమైనట్లుగా అందుబాటులో వుంచబడ్డాయి.

మన అంతర్గత అస్తిత్వంలో మనం ఎంత అధికమైన, చేతనాయుతమైన సంబంధం కలిగి వుంటామో అంత అధికంగా అవసరం అయిన వనరలు మన కీయబడ్డాయి.

4. పని, కాయకష్టంతో కూడుకున్న పని కూడా, అంతర్గత అన్వేషణకు ఆవశ్యకం. వ్యక్తి పనిచేయకపోతే, భౌతిక పదార్థమందు తన చేతనను లగ్నం చేయకపోతే, భౌతిక పదార్థం ఎప్పటికీ వృద్ధి చెందదు. చేతనను శారీరక మాధ్యమం ద్వారా భౌతిక పదార్థాన్ని కొంత మేరకు వ్యవస్థీకరించడం సముచితం. వ్యక్తి తన చుట్టు ఒక క్రమబద్ధతను ఏర్పరచుకో గలిగితే అది అతనికి అంతర్గతంగా ఒక క్రమపద్ధతిని ఏర్పరచుకొనుటకు తోడ్పడుతుంది.

ఒకరు తమ జీవితాన్ని బాహ్యమైన, కృత్రిమమైన నియమాలకు అనుగుణంగా వ్యవస్థీకరించుకో కుండా, వ్యవస్థీకరించబడిన అంతర్గత చేతనకు అనుగుణంగా వ్యవస్థీకరించుకోవాలి. ఎందుకనగా ఒక వేళ జీవితాన్ని ఉన్నత చేతనకు లోబడి సాగనీయకుండా, విచ్చలవిడిగా కొనసాగనిస్తే, అది చపలత్వానికి దారి తీసి, వ్యక్తపరచుటకు వీలు కానిది అవుతుంది. భౌతిక పదార్థం చేతనా పూర్వకంగా వినియోగపరచక పోతే ఎలా వృధా చెందుతుందో, ఒకరి సమయం అలా వృథా అవుతుంది.

5. సమస్త భూమండంల తనకు తానుగా కొత్తజాతి ఆగమనానికి సంసిద్ధం కావాలి. ఈ ఆగమనాన్ని వేగిరపరచుటకు, చేతనా పూర్వకంగా కృషి సల్పాలని ఆరోవిల్ కోరిక

6. ఈ కొత్త జాతులు ఏ విధమయినవిగా ఉంటాయనే విషయం మనకు కొద్ది కొద్దిగా తెలియజేయ బడుతుంది. ఇంతలో వ్యక్తి తనంతట తాను దైవానికి అర్పించుకో గలగటం ఉత్తమం. *CWM 13:207-208*

సాధించవలసిన ప్రగతి సర్వదా వుంటుంది

క్రియాశీలంగా వుండటానికి ముందు గమ్యాన్ని నీవు స్పష్టంగా చూడ గలగాలి. ఎటుగా వెళ్తున్నావో నీకు స్పష్టంగా తెలియాలు. ఈ దృష్టిలో, ఉదాహరణకు, ధనాన్ని తీసుకొందాం. భవిష్యత్తులో వంద సంవత్సరాలు గడిచిన పిమ్మట ఏది ఆదర్శమో మనకు తెలియదు. ధనం ఒక శక్తిగా వుండాలి, అది ఎవరికీ స్వంతం కాకూడదు. విశ్వగతమైన వ్యావహారిక జ్ఞానంతో అది నియంత్రించ బడాలి. ఈ భూమండలం యొక్క భావి సూచికమైన, ముందు చూపుతో అంచనా వేసి, భూమం డలంలో ధనం ఎక్కడ వినిమయం కావాలో కచ్చితంగా చెప్పగలిగే ఒక వ్యక్తిని నియమించాలి — అర్థం అయ్యిందా, అటువంటి స్థితికి మనం ఆమడ దూరంలో వున్నాం, కాదంటావా? ఆ క్షణంలో మహాశయుడు 'ఇది నాది' అంటాడు; ఔదార్యం కలగగానే 'ఇది నీ కిస్తాను' అంటాడు. ఈ విధంగా వుండ కూడదు.

కానీ ప్రస్తుతం మనమే స్థితిలో వున్నాము, ఏ విధంగా వుండాలి? ఈ రెండింటి మధ్య చాలా దూరం వుంది. అందుకోసం మన వ్యవహార శైలి పరిస్థితులకు అనుగు ణంగా మలచుకొనేటట్లుగా వుండాలి, లక్ష్యం దృష్టి నుండి తొలగి పోకూడదు. ఒక్క ఉదుటున దానిని చేరలేమనే విషయం గుర్తించి, అందుకు సులభమైన మార్గం కనుగొనాలి. అది మరింత కష్టం, అంతర్గత అన్వేషణ కన్నా అధిక కష్టమైనది. నిజం చెప్పాలంటే అంటే ఆ పని ఇక్కడికి వచ్చే ముందే చేయవలసింది.

ఎందుకనగా ప్రారంభ కేంద్రమంటూ ఒకటి వుంటుంది. నీవు నీలో ఎప్పుడూ చలించకుండ, స్థిరంగా నిలిచే వెలుగును కనుకొన్నప్పుడు, నీకు కచ్చితంగా

> మానవుల మధ్య ఐక్యత ద్వారా శాంతి నెలకొనాలి:
> సమరీతిగా వుండటం ద్వారా ఐక్యత కలుగుతుందని అనుకోవడం మూఢత్వం.
> ఐక్యత సాధించటానికి తప్పకుండా అనేకులు ఏకం కావాలి.
> ప్రతి ఒక్కరు ఐక్యతలో ఒక భాగం. ప్రతి ఒక్కరు మొత్తానికి ఆవశ్యకం.
> *CWM 13:202*
>
> శ్రీమాత

'మార్గదర్శనం' చేయగలిగిన ఉనికిని నీలో కనుగొన్నప్పుడు, నీకు అర్థం అవుతుంది, జరిగే ప్రతిదానిలో నేర్చుకోవలసింది ఏదో ఒకటి కచ్చితంగా వుంటుందని, ప్రస్తుతం భౌతికపదార్థం వున్న స్థితిలో ఎప్పుడూ సాధించవలసిన అభివృద్ధి ఒకటి వుంటుందని. ఆ ఎరుకతో ఇక్కడకు రావాలి, ప్రతి నిమిషం, సాధించవలసిన ప్రగతి ఏదో తెలుసు కోవాలన్న తపనతో రావాలి. అభివృద్ధి చెందే జీవితం ఒకటి కావాలని, అది పరిపూర్ణం చెందాలనే కోరికతో రావాలి. అదే ఆరోవిల్ యొక్క సామాజిక ఆదర్శం కావాలి. 'తనంతట తాను అభివృద్ధి చెంది, పరిపూర్ణం చెందాలనే జీవితం' — అన్నింటిని మించి ప్రతి ఒక్కరూ ఆ మార్గాన్నే అనుసరించాలని కాదు — ప్రతి ఒక్కరూ తమదైన మార్గం అనుసరించవచ్చు.

CWM 13:311-12

చైతన్యాభివృద్ధికి హద్దు లేదు

సరే, ఇప్పుడు ఇక్కడ మీరు ముప్పై మంది వున్నారు. అది కష్టం, అవునా? మీరు ముప్పై వేలమంది అయినపుడు అది సులభం అవుతుంది. ఎందుకనగా సహజంగానే అప్పుడు ఎన్నో ఎక్కువ అవకాశాలు కలుగుతాయి. మీరు అగ్రగాములు, మీ కార్యం అతి కష్టమైనది, కానీ అది అత్యంత ఆసక్తిదాయకంగా వుంటుందని అనుకొం టాను. ఎందుకనగా నిజమైన ఆరోవిల్లీయుడిగా వుండటానికి నీవు దృఢంగా వుండగలిగి, దీర్ఘకాలం నిలిచి వుండగలిగే, అభివృద్ధి చెందగలిగే వైఖరిని నీవు నిలుపుకోవాలి. అందుకు అవసరమైన పాఠం అనుదినం నేర్చుకోవాలి, ఏ రోజు పాఠం ఆ రోజు నేర్చుకోవాలి... ప్రతి ఉషోదయం ఒక నూతన ఆవిష్కరణకు అవకాశం. కాబట్టి అట్టి మానసిక స్థితిలో నీవు గ్రహించ గలుగుతావు. ప్రతి ఒక్కరు చేయవలసింది అదే.

శరీరానికి చురుకైన కార్యాచరణ అవసరం, శరీరాన్ని సోమరిగా వుంచితే అది అనారోగ్యం పాలై, ఇతర అస్వస్థతలకు లోనై, పని చేయలేక, ఎదురు తిరుగు తుంది. అందువల్ల దానిని కార్యోన్ముఖం గావించడం అవసరం. పూలమొక్కలు నాటడం, గృహ నిర్మాణం లాంటి శారీరంగా శ్రమించగల పనులు అవసరం... అట్టి అనుభవం కలగాలి. కొందరు వ్యాయామం చేస్తారు, కొందరు సైకిల్ తొక్కుతారు. అటువంటి కార్యక్రమాలు లెక్క లేనన్ని వున్నాయి. ఉన్న కొద్దిమందిలో మీరు ఒక

ఒప్పందానికి రావాలి. ఆ విధంగా ప్రతి ఒక్కరు వారి స్వభావం, వారి గుణగణాలకు, అభిరుచికి అనుగుణమైన కార్యక్రమాన్ని ఎన్నుకోవచ్చు. ఇలా చేయడం ఆలోచనల విషయంలో పొసగదు. ఆలోచనలు అంత మంచివి కావు. అవి పూర్వాభిప్రాయాలను కలుగ జేస్తాయి. ఉదాహరణకు, "ఇది ఒక మంచి పని, ఆ పని చేయడం నా యోగ్యతకు సరి పడదు" లాంటి నిరర్థక భావజాలానికి తావిస్తాయి. చెడ్డ పని అంటూ వుండదు. ఏ పనినైనా సక్రమంగా చేయడం తెలిసినప్పుడు, అన్ని పనులు మంచివే. పని చేయడం ఒక విధమైన అన్యోన్య సంబంధం ఏర్పరుస్తుంది. నీవు అంతరంగ వెలుగుయొక్క చేతనగల అదృష్టవంతుడివి అయితే ఆ వెలుగు నీవు చేసే పనిలో ప్రతిబింబిస్తుంది. ఎట్లా వుంటుందంటే నీవు దైవాన్ని ఆ వస్తువులోకి దిగి రమ్మని స్వాగతిస్తున్నట్లుగా వుంటుంది. అప్పుడు పరస్పర సంబంధం మరింత దృఢతర మౌతుంది. అన్వేషించడానికి లోకమంతా అందుబాటులో వున్నట్లనిపిస్తుంది. అది ఎంతో అద్భుతం.

నీ వింకా చిన్నవాడవు, ఎంతో సమయం నీ ముందు వుంది. యౌవనం నిలుపుకోవడానికి, నిజంగా యౌవనంతో మనగలగడానికి, ఎల్లవేళలా ఎదుగుతూ వుండాలి, వృద్ధి చెందుతూ వుండాలి, పురోగమిస్తూ వుండాలి. ఎదుగుదల యవ్వనానికి చిహ్నం. చైతన్యం వృద్ధి చెందడానికి హద్దు అంటూ లేదు. నాకు ఇరవై ఏళ్ల వృద్ధులు తెలుసు, అలాగే యాభై, డభై ఏళ్ల యువకులు కూడా తెలుసు. శారీరకంగా శ్రమించేవారు చక్కటి ఆరోగ్యంతో నుంటారు

శ్రీమాత


CWM 13:312-13

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



ఆధ్యాత్మిక సౌందర్యశక్తి
(ఆరోవిల్ ఆధ్యాత్మిక అందం)
ఆధ్యాత్మికమైన అందానికి స్పర్శతో సోకే శక్తి
(శ్రీమాత ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రాశస్త్యం)

ఆరోవిల్ చిహ్నానికి ఉన్న ప్రాధాన్యత



మధ్యలోని బిందువు ఐక్యతను సూచిస్తుంది.. అది సర్వోన్నత స్థితి. అంతర వలయం సృష్టికి సంకేతం. అదే 'ఆరోవిల్' నగర భావన కూడా! చుట్టూ ఉన్న దళాలు (రేకలు) దాని వ్యక్తీకరణకు, సాధనకు సూచికలు.

CWM 13:212

ఆంతం కావటానికి ముందు అసత్యం విజృంభిస్తుంది

అయినా ప్రజలు విపత్తు తెచ్చే పాఠాలనే అర్థం చేసుకో గలుగుతారు. సత్యాన్ని తెలుసుకోవాలంటే విపత్తులు రావాల్సిందేనా?

ప్రతి మనిషి తనదైన పరిష్కార మార్గం కలిగి వుంటాడు. పెద్ద ప్రతిబంధకం అదే. పరమ సత్యస్థితిలో వుండటానికి ప్రతివారికి వారి స్వంత పరిష్కార మార్గ ముంది. అయినప్పటికి ఈ పరిష్కార పద్ధతులన్ని కలిసి కట్టుగా పనిచేయడానికి మనం ఒక మార్గం కనుగొనాలి.

కాబట్టి ఆచరణ ప్రణాళిక విస్తృతమైన, అనువైన రీతిగా మలచుటకు వీలైనది అయి వుండాలి, అందరి నుండి గొప్ప ఆదరాభిమానాలు పొంద గలగాలి. అది మొదటి నియమం — మొట్టమొదటి ప్రత్యేక నియమం — ఆదరాభిమానం. అనుక్షణం అత్యుత్తమమైన దానిని చేయడానికి తగినంత నమ్రత కలిగి వుండాలి.

CWM 13:311

అట్లా జరగకుండా వుండాలంటే మానవ ప్రయత్నం ఉండాలి గదా!

సత్యం మాత్రమే మనల్ని రక్షించగలదు. మాటలలో, చేతలలో, భావాలలో, అనుభవాలలో సత్యం ఉట్టి పడాలి. 'సత్యమా' 'వినాశమా'? ఇదే మన ముందున్న సమస్య!

CWM 13:217

ప్ర: శ్రీమాతా, ఆరోవిల్‌లో ఎలాంటి రాజకీయ వ్యవస్థ ఉండా లనుకుంటున్నారు?
స: నా కొక వింత భావన స్ఫురించింది. అదే 'దివ్యత్వపు అరాచకత్వం!' అప్పుడు దివ్యత్వం ఉంటుంది రాజశాసనం లేకుండానే! అది ఈ ప్రపంచానికి అర్థం కాదు. మానవులు తమ సహజ చేతనతో, ఒక్కసారిగా సంఘటితం కావాలి; నిబంధనలు సరళంగా వుండాలి. అదే అసలైన ఆదర్శం. ఇందుకు వ్యక్తులలో 'మానసిక' స్థాయిలో సంబంధాలు బలపడాలి. అది అనుసరణీయం కావాలి. ఆ విధంగా 'అహం' యొక్క ప్రభావం సన్నగిల్లాలి.

CWM 13:219

ఒక వినూత్న జీవన సరళి

ఆరోవిల్ అనే శిశువు జననానికి తగిన ఏర్పాట్లను ప్రస్తావించటం జరిగింది. శ్రీమాత అభిప్రాయం: "అది తండ్రికి, డాక్టరుకు సంబంధించినది" అని, ఇంకా ఏమన్నారంటే, "అన్నిటి కన్నా ముఖ్యమైనది ప్రశాంతంగా వుండటం. ప్రశాంత వాతావరణంలో దివ్యశక్తి ఏ ఒడుదుడుకూ లేకుండా దాని పని అది చేసుకుపోతుంది."

*

ఇక, వివాహ విషయం ప్రస్తావనకు వచ్చింది. వివాహ వ్యవస్థ శ్రీమాతకు 'పిల్లల ఆటలా' తోచింది. వారు ఇంకా ఏమన్నారంటే, "ఆరోవిల్‌లో వివాహాలంటూ ఏమీ ప్రత్యేకంగా ఉండవు. యువతీయువకులు ప్రేమానుబంధంతో జీవనం కొనసాగించా లంటే ఎట్టి అభ్యంతరం ఉండదు. కొన్ని కారణాల వలన విడిపోదా మనుకుంటే వారు స్వేచ్ఛగా విడిపోవచ్చు. అది వారి ఇష్టం. ఇష్టం లేనపుడు బలవంతంగా కలిపి వుంచటం ఏందుకు?"

స్వేచ్ఛగా ఉండగలిగితే వారు ఎట్లా ఉన్నా అనేక సమస్యలు ఉత్పన్నం కానే కావు. నేరాలకు తావుండదు. దాపరికంగాని, క్రూరత్వంగాని ఉండ లేవు.

నిజమైన ప్రేమ వారిలో ఉంటే వారు సహజంగానే జీవితాంతం కలసి వుంటారు. చట్టం వారిని నిర్బంధించ లేదు. ఈ కారణంగానే 'పెళ్లి తంతు' నా కొక చిన్నపిల్ల ఆటగా అనిపిస్తుంది.

ఆరోవిల్‌లో పుట్టిన పిల్లలకు ఇంటిపేర్లు ఉండవు. కేవలం అసలు పేరే ఉంటుం *(దీనిని వివరంగా శ్రీమాత ఒక లేఖలో ఉటంకించారు కూడా. ఆ లేఖను ప్రచురించవ కూడా వారు సూచించారు.)*

భౌతిక జీవనంలో వాస్తవిక అవసరాలు, కష్టసుఖాలు భార్యభర్తలు కలసి అన వించాలి, కలసి భరించాలి, జయాపజయాలను కలసి ఎదుర్కోవాలి. ఇదే వివా బంధానికి మూలం. కాని దీనితోనే అంతా ముగిసినట్లు కాదు. భావాలలో ఒకటి వుండటం, ఒకే రకమైన అభిరుచులు కలిగి యుండటం, ఒకే విధంగా స్పంది గలగటం, ఒకరికి ఒకరు ఆసరాగా వుండటం మంచిదే. కాని, అది మాత్రమే చాల

అంతర్గత సంవేదనలు ఒకటిగా వుండటం, కష్టనష్టాలు వచ్చినా అనురా చెక్కుచెదరకుండా వుండటం, ఎట్టి పరిస్థితిలోనైనా మహదానంద భరితంగా జీవి గలగటం, బైటి పరిస్థితుల ప్రభావం వలన అంతరంగంలో ప్రశాంతత గాని, అనురా గాని చెక్కు చెదరకుండా వుండటం మంచివే; చాలా మంచివే. అది తప్పని కూడా! కాని అవి కూడా సరిపోవు.

మనసులు కలవటం, ఆలోచనలలో సమరస భావం ఉండటం, ఆలోచన కూడ పరస్పర పూరకాలుగా వుండటం, మానసిక సామర్థ్యాలు, పరిశోధనా ఫలితా పరస్పరం పంచుకోవటం చాలా మంచిదే. ఒక్క మాటలో చెప్పాలంటే మనసు సంకల్పించిన కార్యక్రమాలు, పరిణతి పరస్పర అనుబంధం వలన విస్తృతం కావ మంచిదే. కానీ అది కూడా చాలదు.

అన్నిటినీ మించగల అత్యున్నత సత్యజ్యోతి అంతరాళంలో వుండాలి. ే కాల పరిస్థితులకు అతీతంగా ఆలోచించాలి. అదే కేంద్రస్థానంలో ఉండవల పరిస్థితి; అదే ఆధ్యాత్మిక వికాసానికి మూలం. అది మన జీవితాలకు మార్గదర్శ చేయాలి: మన 'విధి' ని శాసించాలి. ఆ చైతన్యంలో అందరూ ఏకోన్ముఖు కావాలి. ఆకాంక్షలోనూ, ఔన్నత్యంలోనూ మీరంతా ఒకటిగా ఉండాలి. అదే శాశ్వ మైన బంధం; ఆధ్యాత్మికత వైపుగా పురోగమించటం.

జీవిత గమనాన్ని మార్చాలి

అన్నిటి కంటే ముందు 'వ్యక్తి సంక్షేమం' స్థానంలో 'దివ్యత్వం కోసం' అనేది ప్రతిక్షేపించాలి. కార్యక్రమాలు దైవేచ్ఛను ప్రతిఫలించాలి. 'వ్యక్తిగత శాసనం' అంటూ ఏమీ ఉండ కూడదు. వ్యక్తి కోరిక అందరి కోరిక కాజాలదు. 'నాది' అనేది నీ మదిలో ఉన్నంత కాలం నీవు శాశ్వత సత్యాన్ని చూడలేవు. 'నా' అనేదాన్ని నీవు బహిష్కరించాలి. (పనికిరాదు అన్నట్లు శ్రీమాత చేతులతో సంజ్ఞ చేస్తారు) కేవలం మనమే ఒంటరిగా ఏమీ చేయ లేము. ఇది జీవితం. మనం కేవలం 'మన కోసమే' అనుకో రాదు. వ్యక్తిగత లబ్ది మాత్రమే మనం కోరుకో రాదు. దివ్యేచ్ఛ వలన మనం బ్రతుకుతున్నాము; అందుకోసమే మనం బ్రతకాలి కదా! కాని మన ప్రయత్నం లేకుండా వాటంతట 'అదే జరుగుతున్నది' అనే విధంగా మనం భౌతికానికి మొగ్గు చూపుతున్నాము. మన తాపత్రయం భౌతికం కోసమే. అది మన శత్రువు అని గ్రహించటం లేదు. అడ్డంకి అంతా అదే; మన పరిమితి అదే అని తెలుసుకోవాలి.

సంఘర్షణలు ఉత్పన్నం అవుతూనే వుంటాయి. ఇది అందరకూ వర్తిస్తుంది. అందరి అనుభవంలో ఉన్నదే. అలాంటి సందర్భాలలో మనం మన స్వలాభం గురించే ఆలోచిస్తాము. కోరికలు అంతరంగంలో ప్రవేశిస్తాయి. అవి మన ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. కొన్ని సందర్భాలలో మన కంటూ ఏ స్వలాభాపేక్ష లేకపోయినా, నీ పొరుగువాని లబ్ధి కూడా నీలో అంతర్మథనం కలిగించవచ్చు. దాని ప్రభావం నీపై పడుతుంది. ఎప్పుడూ ఇది ఇలాగే జరుగుతూ ఉంటుంది. ముందుగా ఒక వ్యక్తితో ప్రారంభం అవుతుంది. అది మరొకనిలో అదే కోరికను కలిగిస్తుంది. అది పోను పోను విస్తరించి అనంతం అవుతుంది. ఇదొక చక్రబంధం. కాంక్ష బలీయం అవుతుంది. కాని ఇదిఎందుకూ పనికిరాదు.

సాధారణంగా మనం 'దేవుని సేవలో ఉన్నాం' అని పైకి అంటాం. కాని అది మాట వరసకే! మనం చేస్తున్నామని అనుకునే పనులన్నీ నిజంగా మనం చేస్తున్నవే అవి అనుకుంటున్నారా! అవన్నీ మనలోని పరమాత్మ మన ద్వారా చేయిస్తున్న పనులు! మనం నిమిత్త మాత్రులం. ఈ సత్యం మనం గ్రహించలేము.

ఎలా గ్రహించగలం! నీలో 'నేను', 'నాది' అనే భావన ఉన్నంత కాలం ఇది అర్థం కాదు.అది లేకుండా పోయిన నాడే అసలు విషయం అర్థం అవుతుంది.

జీవిత సరళిని రూపాంతరీకరించుకోవాలి. అలా అని జీవితం నుండి పారిపొమ్మని కాదు. ఇప్పటి వరకూ 'దివ్యత్వాన్ని' చేరుకోవాలనుకున్న వారంతా సాధారణ జీవితాన్ని పరిత్యజించిన వారే. వారి ఉద్దేశంలో జీవితం ఒక పెద్ద అడ్డంకి. 'దివ్యత్వాన్ని పొందాలంటే భౌతిక జీవితానికి దూరంగా ఉండాల్సిందే', అని వారి భావన. ఈ విధంగా మన దేశంలో 'ఆధ్యాత్మికత', సన్యాసంతో మడివడి ఉంది. ఐరోపాలోనూ సాధువులూ, సన్యాసులూ ఉన్నారు. వారు ప్రస్తుతం సాధారణ జీవనానికి దూరంగా వుంటే ఉండవచ్చు. కాని మరో జన్మ అంటూ ఉంటే మళ్లీ జీవితం ప్రారంభం కాకుండా ఉంటుందా? ఈ చక్రభ్రమణం ఇంతటితో ఆగుతుందా? అంత తేలికగా ఆపటం వీలవుతుందా?

CWM 13;332-34

అసలైన ఆరోవిల్ నివాసి

ప్ర: అసలైన 'ఆరోవిల్ నివాసి' అనిపించుకోవాలంటే ఎలా ప్రవర్తించాలి? అని మీరు ప్రశ్న వేసారు. అసలైన ఆరోవిల్ నివాసి ఎలా ఉండాలి? (ఎ ని ఉద్దేశించి) *నీ కు ఏమైనా అభిప్రాయాలు ఉన్నాయా?*

ఎ సమా: నా ఉద్దేశ్యంలో నిజమైన ఆరోవిల్ నివాసి పూర్తిగా దివ్యత్వానికే అంకితం అవుతారు.

శ్రీమాత: అవును, అవునవును. అది మంచిదే. కాని అలాంటివారు అరుదు. (జి తో) నా కొంక కాగితం ఇవ్వండి. దాన్ని మొదటి అర్హతగా వ్రాస్తాను.

(శ్రీమాత వ్రాస్తారు) "ఆరోవిల్ యొక్క నిజమైన నివాసిగా ఉండాలంటే" ఉండాల్సిన అర్హతలలో దాన్ని నేను ప్రథమంగా చెబుతాను. 'ఆరోవిల్లీయుడు' అని ఏకవచనంలో సంభోదించడం నేను ఉద్దేశపూర్వకంగానే చేసాను.

ఇక మరో దాన్ని గురించి ఆలోచిద్దాం.

ప్రవర్తన విషయానికి వస్తే — అంటే దైనందిన విషయాల్లో — మనం స్థానికంగా వుండే సాంఘిక, నైతిక కట్టుబాట్లకు దూరంగా ఉండాలని అనుకుంటాం. ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. దూరంగా అంటే అతీతంగా అని అర్థం చేసుకోవాలి. అంతే కాని వాటిని ఖాతరు చేయకుండా విశృంఖలంగా ప్రవర్తించమని కాదు. కోరికలను త్యజించాలి. వాటి స్థానంలో దివ్యత్వానికి విధేయులుగా ఉండటం జరగాలి.

మనం శరీరధారులం. శరీరం అనవసరమైనది కాదు. కాని దీని ఔన్నత్యం పెంచాలి: ఉదాత్తం కావాలి. ఇది ఆరోవిల్ యొక్క ముఖ్యమైన లక్ష్యం. మానవదేహం పరిపూర్ణం కావాలి. అది అతిమానస చేతనను వ్యక్తం చేయగలగాలి. అప్పుడే వ్యక్తి 'అతీత మానవుడు' అనిపించుకుంటాడు. శరీరాన్ని నిర్లక్ష్యం చేసినంత కాలం ఇది నెరవేరదు కదా! శరీరం శక్తితో, తేజస్సుతో తన స్వతస్సిద్ధమైన సామర్థ్యాన్ని పుంజుకోవాలి. ఇది స్వలాభానికి కాదు. సమున్నత చేతననూ, సౌందర్యాన్ని వ్యక్తం చేయటానికి మాత్రమే ఈ అనుకూలత. దీని కోసమే శారీరక వ్యాయామానికి ప్రత్యేకమైన స్థానాన్ని కేటాయించాలి. శరీరం దృఢంగా మారటం అద్భుతాలు చేయటానికి కాదు. ఊర్ధ్వ చేతననను వ్యక్తపరచ గలగటమే దీని ఉద్దేశ్యం. మీ జాబితాలో దీనికి కూడ ప్రముఖ స్థానం వుండాలి. కోరికల విశృంఖలత్వానికి ఆరోవిల్ బానిస కాకూడదు. ఇదే ప్రము ఖమైన నియమం.

CWM 13:336-37 శ్రీమాత

అనువాదం: కె. ఆర్ . ఎల్. నరసింహారావు

చైతన్యాన్ని క్షీణింప జేసే అలవాట్లు

మీ అస్తిత్వాన్ని ముక్కలు ముక్కలు చేసినట్లుగా చైతన్యానికి హాని చేసే, చైతన్యాన్ని క్షీణింప జేసే పొగత్రాగటం, మద్యం గ్రోలటం, మత్తుమందులు గైకొనటం లాంటి పాత క్రొత్త అలవాట్లను ఆరోవిల్‌లో నివసించేవారు పాటిస్తూ వుంటారు. ఆశ్రమంలో అవి కూడదని చెపుతుంటాను. మనం చైతన్యాన్ని పెంపొందిచుకోవాలే గాని కోరికల ఊబిలో కూరుకు పోవాలని తలచకూడదు. నేటి కంటె రేవు శ్రేష్టమైనదిగా నుంటుంది అని ప్రపంచానికి చూపించి కొంగ్రొత్త ప్రగాఢమైన, పరిపూర్ణమైన జీవితాన్ని ఆవి ష్కరించటమే ఆరోవిల్ ఉద్దేశ్యమని అర్థం చేసుకోవటం నిరాకరించేవారికి చెపుతుం టాను.

పొగత్రాగటం, మందు గ్రోలటం రేపటి జీవితంలో ఒక భాగమని కొందరు భావి స్తుంటారు. అది వారి వ్యవహారము. వారు వారి వ్యవహారాన్ని కొనసాగించా లనుకుంటే కొనసాగించ వచ్చు. అయితే వారు కోరికలకు తమంత తాముగా బందీ లవుతున్నా మని తెలుసుకోవాలి. ఏమైనా నేను నీతి బోధకురాలిని కాదు. ఏమాత్రం కాదు. ఇది వారి స్వంత వ్యవహారం. ఆ వ్యవహారాన్ని కొనసాగించా లనుకుంటే వారు

కొనసాగించ వచ్చు. అయితే అందుకు ఈ ఆశ్రమం చోటు కాదు. ఆశ్రమంలో జీవితం మరొక విధంగా వుంటుందని మేము తెలుసుకున్నాం. కోరికలను సంతృప్తి పరచటం నిజమైన జీవితం కాదు. మత్తుమందు వల్ల కలిగే అనుభవాలు, ప్రచ్ఛన్న ప్రపంచంతో కలిగే అనుబంధం మత్తుమందులు లేకుండానే మరింత మంచిగా, స్పృహతో, నియంత్రణతో పొందవచ్చని దృఢంగా చెప్పగలను. అయితే ప్రతి ఒక్కరు తమను తాము నియంత్రించుకోవాలి. అది విషం మింగటం కంటె కష్టమైనది. అయితే నేను నీతులను వల్లె వేయటం లేదు.

కోరికలను జయించడంతో ఉన్నత శక్తులకు మార్గాలు తెరచి. మన ఆరోవిల్ ఉన్నత జీవితానికి ఒక ఉదాహరణ అయితే మనం ఎక్కడికైనా వెళ్లవచ్చు. ఆరోవిల్ వాసులు జ్యోతులై ప్రపంచంలో తిరుగాడుచున్నవారికి ఈ ప్రపంచం సాదర స్వాగతం పలుక గలదు.

CWM 13:345

నిజమై స్వేచ్ఛ కోరికలను సంతృప్తి పరచటానికి అనుమతి కాదు

నేను న్యాయబద్ధత గురించి, చట్టాలను గురించి చెప్పటం లేదు. నాకు కావలసింది మెరుగైన దివ్యజీవితమే కాని పశుప్రాయమైన జీవితం కాదు.

మన మిక్కడున్నది కోరిక లన్నింటిని త్యజించి భగవంతుని వైపు దృష్టి మరల్చి, భగవంతుని లోనే నిమగ్న మవటానికి. మనం అన్వేషించే భగవంతుడు ఎంతో చేరుకోలేనంత దూరాన లేడు. తాను గావించిన సృష్టిలో అంతర్యామిగా వుంటు న్నాడు. అతన్ని కనుగొనాలని మనల్ని కోరుతున్నాడు. పరివర్తన చెందడంతో అతనిని తెలుసుకొని, అతనితో ఐక్యమయి, చివరకు అతని చేతనలో ప్రత్యక్ష పరచుకోగల, వ్యక్తీకరించుకో గల వ్యక్తిగతమని కోరుతున్నాడు. మన ఉనికికి నిజమైన కారణం మనంతకు మనం ఆ కార్యానికి సమర్పించు కోవటమే. ఉన్నతమైన సాక్షాత్కార దిశగా మనం వేసే మొదటి అడుగు అధిమానస చైతన్యాన్ని సాక్షాత్కా రించు కోవటం.

పద్ధతికి, సామరస్యతకు, సౌందర్యానికి ప్రయత్నించటం

మనం క్రమపద్ధతి కోసం, సామరస్యం కోసం సౌందర్యం కోసం ప్రయత్నించాలి.

అది సామూహిక ఆశయమై ఉండాలి — ప్రస్తుతం లేని వాటిని, వ్యవస్థాపకులుగా మనం నెలకొల్పునట్లు చూడాలి, ఇతరులు ఏమి చేయాలని మనం అనుకుంటున్నామో దానిని మనం చేసి చూపటమే మన పని. వ్యక్తిగత స్పందనలకు మించి ఎదగాలి. దివ్యేచ్ఛతో శృతి కలపాలి. ఆ దివ్యేచ్ఛకు వినయవిధేయతలు గల సాధనాలుగా వుండాలి — మనం ఎటువంటి వ్యక్తిగత స్పందనలు లేక నిష్పాక్షికంగా నుండాలి.

దివ్యేచ్ఛ ఏమి కోరుకుంటుందో అదే జరగనీ. మనం సద్భావనతో ఉండాలి. మనం అలా ఉండగలిగితే, మనం ఎలా వుండాలో అలా వుండ గలుగుతాం. మిగతా వారికి — మనం చేయగలిగినంత మంచిని చేస్తాం.

అది అంత సులభతరం కాదని నాకు తెలుసు. కాని సులభమైన కార్యాలు చేయటానికి మన మిచట లేము. సులభమైన జీవితం కావాలనుకునే వారికి ఈ యావత్ ప్రపంచం వుండనే వుంది. ఆరోవిల్‌కు వచ్చేవారు సులభమైన జీవితం కోసం వస్తున్నారని అర్థం కాదు. వారి పురోగతికి బృహత్తర కృషి చేయడానికి వస్తున్నారని దానర్థం. పరిస్థితులు అలా ఉండాలి. పురోగతికి, అస్తిత్వం దైవికం కావడానికి ఎంతో తీవ్రత కలిగి వుండాలి. దివ్యత్వంతో మనలేనివారు, పురోగతి అవసరం లేనివారు వారంతకు వారే ఆరోవిల్ వదలి వెళ్ళాలి. 'ఇది నే నాశించినది కాదు కదా' అని సులభమైన జీవితం కావాలనుకునేవారు, వారి ఇష్టం వచ్చినట్లు వుండా లనుకునేవారు ఆరోవిల్‌కు రావాలని అనుకోకూడదు. ఆరోవిల్‌కు వచ్చేవారు మానవాతీత ప్రయత్నం చేయాలని తెలుసుకోవాలి.

మన దృక్పథం, మన కృషిపై వున్న శ్రద్ధ పరిస్థితులను మారుస్తుంది. అశ్రద్ధ, అసత్యానికి ఇచట చోటు లేదని వారు తెలుసుకోవాలి. — ఆ లక్షణాలు ఇక్కడ పని చేయవు. దివ్యత్వానికి తమ యావత్ జీవితాన్ని అర్పించుకున్నవారిని మోసపుచ్చ లేవు. ఒప్పించగల మార్గం ఒకటే — ఆ విధంగా నుండ గలగటమే. అప్పుడు మనం బలంగా, దృఢంగా నిలబడ గలుగుతాము. దివ్యశక్తి మన వైపు వుంటుంది.

ప్ర: వివిధ విలువ లుండేవారు సామరస్యంగా వుంటూ ఎలా పని చేస్తారు?

స: పరిష్కారం అంతర్ము మవడంలో వుంది. అక్కడ బేధాలన్నీ కలిసి ఏకమైన ఒక ప్రధానమైన శాశ్వత ఏకతగా పరిణమిస్తాయి.

CWM 13:201 శ్రీమాత

అతిమానస మానవజాతిని సమాయత్త పరుచుటకు మన మిచట ఉన్నాం. కోరికల ఊబిలో పడి సుఖజీవితం గడపటం కోసం కాదు — కానే కాదు.

అనువాదం: ఆకుల కృష్ణ

మాతృమందిరం — ఆరోవిల్ ఆత్మ

ప్రార్థనా పూర్వక మూగ విన్నపంతో ఏర్పడిన, ప్రకాశమానమైన నిశ్చల స్థితిలో కానరాని ఎత్తుల దిశగా అది దృష్టిని సారించింది, తాను విడనాడలేని ఆకాంక్షభరిత లోతుల నుండి ఆత్రంతో అపేక్షించింది. అతని అపారమైన, నైతికమైన పారవశ్యతలో, బంధవిముక్త స్థితి నుండి పతనావస్థకు చేరు మార్గ మధ్యంలో, దైవికమగు పగటకి మృతమగు రేయికి మధ్య అడ్డుగా నిలుస్తూ, ఆరాధనే తన ధర్మంగా అంగీకరిస్తూ, దివ్యానందమే అన్ని విషయాలకు మూల కారణమని సమ్మతిస్తూ, ఎవరూ పాలు పంచుకోలేని కఠోర నియమపాలనలో గల ఆనందాన్ని తిరస్కరిస్తూ, కేవలం ప్రశాంత తను నిలుపుకొనుటకే జీవించి వున్న ప్రశాంతతను తిరస్కరిస్తూ, ఎవరి కోసం తాను ఉండాలని సంకల్పించిందో, ఆమె వైపుకు అది మళ్లింది. ఏకాంతమందు కన్న కలలో గలిగిన మనోభావనలోని మూతబడిన ప్రార్థనామందిర నిశ్శబ్దంలో పవిత్రమైన ప్రాంగణ మున్నట్లుగా అది పడి వుంది. నిశ్చలంగా ప్రకాశిస్తున్న కాంతి కిరణ మొకటి ఆ ప్రదేశంలో వెలుగును విరజిమ్ముతున్నది. కంటికి కనిపించని ఒక దైవికమైన ఉనికి అక్కడ ప్రార్థనా పూర్వకంగా మోకరిల్లి వున్నది. శాంతిమయమైన స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్న ఒక లోతైన గుండెపై మిగిలినదంతా నెమ్మదించి సంతృప్తి చెంది వున్నది. దానికి మాత్రమే తెలుసు, సత్యం ఒకటి ఆవల నున్నదని. మిగతా భాగాలన్నీ సంతృప్తి చెంది, మాట లుడిగి దీర్ఘ మైన నిద్రలోకి జారుకున్నాయి. ఇష్టాపూర్వకంగానే లోకపు పొరపాట్లను, అగచాట్లను, విషాదాన్ని, జగత్సంబంధమైన సుదీర్ఘ ఆలస్యాన్ని సైతం సహిస్తూ, కాలాన్ని లెక్క చేయకుండా, ఓర్పుతో సంవత్స రాల తరబడి దివ్యమాత ఆగమనాన్ని నిరీక్షిస్తున్నాయి. ఆమె ఆగమనాన్ని కోరింది భూమి కోసం, జనుల కోసం. ఇప్పుడు ఆమెను పిలువడానికి గల మూల కారణం అదే.

శ్రీఅరవిందులు

సావిత్రి: *332*

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మాతృమందిరం

(మాతృమందిర శంఖుస్థాపన సందర్భంగా శ్రీమాత ఇచ్చిన సందేశం)

"ఆరోవిల్‌కి దైవంపై గల ఆకాంక్షకు మాతృమందిరం సజీవ చిహ్నమై ఉండాలి."

*

మాతృమందిరం ఆరోవిల్ ఆత్మగా నుంటుంది.
ఎంత తొందరగా ఆత్మ అక్కడ చేరితే, ప్రతి ఒక్కరికి అంత మేలు, ముఖ్యంగా ఆరోవిల్లీయులకు.

*


మనిషి ఆకాంక్షించు పరిపూర్ణతకు దైవం ఇచ్చే సమాధానానికి మాతృమందిరం చిహ్నంగా నుండ కోరుతుంది.

అది పురోగతి చెందుతున్న మానవజాతి ఐక్యతలో అభివ్యక్తమగు దైవంతోటి సంయోగం.

CWM !3:223-24 — *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

పట్టణ కేంద్రం

పట్టణ కేంద్రం ఒక ద్వీపంగా ఉండాలి. దాని చుట్టూ ఎల్లపుడు నీళ్లు ప్రవహిస్తూ ఉండాలి. ఈ నీరే పట్టణ మంతకు కావలసిన నీరు సరఫరా చేయాలి. తరువాత ఈ నీటిని పంపుహౌస్‌కు పంపుతారు. అక్కడి నుండి పట్టణం చుట్టూ వున్న వ్యవసాయ భూములకు పంపుతారు. చిన్న ద్వీపంగా ఉన్న ఈ పట్టణ కేంద్రాన్ని 'మాతృమందిర్' అని పిలుస్తాము. ఇది కాళీగా ఉండే ఒక పెద్ద గదిగా నేనెప్పుడూ చూస్తాను. అక్కడ పైనుంచి కాంతి కిరణాలు ఎల్లప్పుడూ పడ్తూ వుండాలి, రాత్రి, పగలు కూడ. అలా కాంతి కేంద్రీకరించి పడే చోటు ఏదైనా ఉంచవచ్చు. మొదట్లో శ్రీఅర విందులు గుర్తు ఉంచుదా మనుకున్నాము. సూర్యునితో పాటు కిరణాలు కూడ తిరిగి తిరిగి అక్కడ పడే ఏర్పాటు చేయాలి. అలా అయితే మంచిది. దాని దిగు వన జనం కూర్చుని ధ్యానం చేస్తారు లేదా కేవలం విశ్రాంతి తీసుకుంటారు. వాళ్లు అలసట లేకుండా ఏదైనా సౌకర్యంగా వుండే దానిపై కూర్చోవాలి. బహుశా



(నాల్గు స్థంభాల ప్రాముఖ్యం)
ఉత్తరం మహాకాళి, తూర్పు మహాలక్ష్మి
దక్షిణం మహేశ్వరి, పడమర మహాసరస్వతి

*

(పంద్రెండు భూగర్భ గదుల ప్రాముఖ్యం. ఇవి వికిరణం చేస్తాయి మాతృమందిర పునాది నుండి)

నిజాయితీ, అణకువ, కృతజ్ఞత, పట్టుదల, ఆకాంక్ష, గ్రహింపు శక్తి, పురోగతి, ధైర్యము, మంచితనము, ఔదార్యం, సమానత్వం, శాంతి.

జూలై 1972

(మాతృమందిరం చుట్టూ వున్న పంద్రెండు వనముల ప్రాముఖ్యం)

అస్థిత్వం, చైతన్యం, ఆనందం, కాంతి, జీవం, శక్తి, ఐశ్వర్యం, ఉపయోగం, పురోగతి, యవ్వనం, సామరస్యం, పరిపక్వత

CWM 13:226

కొన్ని స్తంభాల ఆధారంగా. ఆ గది ఎత్తుగా ఉండాలి, సూర్యకిరణాలు ఎల్లవేళలా ప్రవేశించే టట్టుండాలి, దినమంతా సమయం ప్రకారం ఆ కిరణం అక్కడి కేంద్రాన్ని తాకుతూ ఉండాలి. ఆ కేంద్రం ఎత్తుగా నుండాలి అందరికీ కనిపించేటట్లు. చుట్టూ చదునుగా నుండాలి, వెలుతురును పూర్తిగా గ్రహించడానికి అక్కడ ఏదైనా చిహ్నం ఉంచవచ్చు. అయితే ఇది మతపరమైనది కాకూడదు, ఎట్టి పరిస్థితుల్లోనైనా.

అంతర్భాగం

నేను స్పష్టంగా, చాలా స్పష్టంగా చూస్తున్నా... ఈ స్థలంలో లోపలి భాగాన్ని (కాలాతీత తలాన్ని సూచించే సంజ్ఞ)

దాని లోపలి భాగం — ఒక స్థూపం లోపలి భాగంలో కన్పడే ఒక పెద్ద గది లేక హాలు. దానికి కిటికీ లుండవు. కృత్రిమ వాయుసంచారం ఏర్పాటు చేయాలి యంత్రా లతో (ఎ.సి) పై కప్పు మాత్రమే వుండాలి.

స్థూపానికి పైన మూసి వుంచాలి. కాని సూర్యుడు కేంద్రాన్ని ఢీకొడుతూ ఉండాలి.

సూర్యుడు లేనప్పుడు రాత్రులు, విద్యుత్ కిరణం కేంద్రాన్ని ఢీ కోవాలి.

ఇక్కడ నా ఆలోచన ఏమంటే ఒక వందమంది జనం పట్టే నమూనా హాలు నిర్మించడం. పట్టణం నిర్మింపబడి అనుభవం వచ్చాక, ఇంకా పెద్ద హాలు, ఒక వెయ్యి రెండు వేలు జనం పట్టేదానిని నిర్మించుకోవచ్చు. ఈ రెండవ దానిని మొదటిదాని చుట్టూ నిర్మించాలి. రెండవ నిర్మాణం పూర్తయే వరకు మొదటి దాని ని తీసివేయ రాదు. ఇది నా ఆలోచన.

అది పన్రెండు ముఖాల ఒక శిఖరం. దాని ఒక్కొక్క ముఖం సంవత్సరంలో ఒక్కొక్క నెలను సూచిస్తుంది. దాని పైకప్పు ఇలా ఉండాలి (శిఖర పక్కల నుండి కేంద్రం వైపుకు, ఎగువకు వాలుగా వుండాలి, అని సూచిస్తూ సంజ్ఞ)

తరువాత దాని లోపలి భాగం ముందు గోడల తరువాత పన్రెండు స్థంభాలు ఉండాలి. కేంద్రం వద్ద నేలపై నా చిహ్నం, దానిపై శ్రీఅరవిందుల నాల్గు గుర్తులు — ఒక చతురస్రంగా కలుపబడిన నాల్గు గుర్తులు — దానిపై ఒక పారదర్శక గోళము — దానిలో కాంతి ఉండొచ్చు, లేకపోవచ్చు — కాని సూర్యకిరణం గోళాన్ని ఢీ కొంటూ ఉండాలి — అన్ని నెలల్లో, కాలాల్లో (సూర్యుని కదలిక సంజ్ఞ).

అర్థమయిందా? పైకప్పులో సూర్యకిరణం ప్రవేశించడానికి ఎల్లప్పుడు కొంత తెరవబడి ఉండాలి — చెల్లాచెదురు కాంతి కాదు — సూర్యకిరణం, అగ్ని గోళాన్ని ఢీకొంటూ ఉండాలి.

ఈ విధంగా జరగడానికి సాంకేతిక పరిజ్ఞానం కావాలి. ఒక ఇంజనీరును సంప్రదించి ఒక నమూనాను తయారు చేస్తా.

తరువాత దాని లోపల కిటికీలు, దీపాలు ఉండకూడదు. దానిలో ఒక విధమైన మసక కాంతి ఉండాలి — పగలు సూర్యుని వల్ల, రాత్రి కృత్రిమ దీపం వల్ల.

నేలపై ఏమీ ఉండకూడదు. కేవలం ఇటువంటి నేల (శ్రీమాత గది). మొదట చెక్క, తరువాత దానిపై దళసరి, అతి మెత్తని ఫొమ్ రబ్బరు, దానిపై ఒక తివాసి అంతటా, ఒక్క కేంద్రంలో తప్ప, కప్పబడి ఉండాలి. అక్కడ ప్రతి చోట జనం కూర్చొగలిగి వుండాలి. అక్కడి పండ్రెండు స్థంభాలు, జనం అవసరమైతే ఆనుకుని కూర్చొడానికి.

CWM 13;280-81 శ్రీమాత



నూతన సృష్టి పురోగతి (ఆరోవిల్ పురోగతి)

ప్రతివారు తమ పురోగతికి అనుకూలమైన పనిని కనుక్కోవాలి. (ఆధ్యాత్మిక ప్రాముఖ్యం — శ్రీమాత వివరణ)

శాస్త్రీయ నామం — హిబిస్కస్ రోజా సినన్‌సిస్

అనువాదం: యస్. వై. సోమయాజులు

మౌనంగా ఏకాగ్రతలో వుండేందుకు ఒక ప్రదేశం

అది ఒక విధమైన గోపురం, దాని పన్నెండు క్రమకోణాలు సంవత్సరంలోని పన్నెండు నెలలకు సూచనలు. అది పూర్తిగా ఖాళీ... అది వంద నుంచి రెండు వందల మంది వుండగలిగేలా వుండాలి. అటు పైన, పైకప్పుకు ఆధారంగా లోపల పంద్రెండు స్తంబా లుండాలి (బయట వైపు కాదు). సరిగ్గా మధ్యలో , కేంద్రీకరించవలసిన వస్తువు ... సూర్యుని సహకారంతో అక్కడ సంవత్సరమంతా సూర్యకిరణాలు ప్రవేశిస్తూ వుండాలి. వెలుతురు మసకబార కూడదు. వెలుతురు కిరణాలుగా ప్రవేశించే విధంగా ఒక ఏర్పాటు చేయాలి. సంవత్సరం లోని మాసం, రోజు యొక్క సమయానికి అనుగుణంగా కిరణం మళ్లుతుంది. ఆ విధంగా కిరణం కేంద్రంపై ప్రసరింప బడు తుంది. కేంద్ర మందు శ్రీఅరవిందులవారి చిహ్నం ఒక గోళానికి ఆధారంగా నిలు స్తుంది. ఆ గోళాన్ని ఏదైనా స్పష్టంగా కనిపించేటటువంటి నిర్మలమైన స్ఫటికం లేదా ఆలాంటి మరేదయినా వస్తువుతో తయారు చేయాలి. అది ఒక పెద్ద గోళం. ఇక మనుషులు కేంద్రీకరించడానికి లోపలికి అనుమతించ బడతారు. (అమ్మ నవ్వుతూ) కేంద్రీకరించడం నేర్చుకోడానికి! ధ్యానం ప్రత్యేకించి ఒక దానిపై వుండాలనే నియమం లేదు. కానీ వారందరు నిశ్శబ్దంగా వుండాలి — నిశ్శబ్దంలో, ఏకాగ్రతలో.

కానీ, ఆ ప్రదేశం పూర్తిగా సాధ్యమైనంత సామాన్యంగా వుండాలి. ఇక అక్కడి నేల పై, జనులు హాయిగా, ఏమాత్రం ఇబ్బంది పడకుండా, కూర్చోగలగాలి. ఇక నేల మధ్యన నా చిహ్నం. నా చిహ్నం. చిహ్నం మధ్యలో నాలుగు భాగాలుగా, ఒక చతురస్రంలా, నాలుగు శ్రీఅరవిందుల చిహ్నాలు, నిలువుగా, స్పష్టంగా కనిపించే గోళానికి ఆధారంగా వుండాలి.

ఒకరు తమ చేతనను దర్శించుకోగల ప్రదేశం

ఇక అక్కడ ద్వారాలు వుండవు (కానీ క్రిందికి పోతూ మళ్లీ పైకి రాగానే ఆలయం లోపలికి వస్తారు) గోడ క్రిందుగా వెళ్లి మళ్లీ లోపలికి ప్రవేశిస్తారు. మళ్లీ అది ఒక చిహ్నం. ప్రతిదీ చిహ్నం యొక్క ప్రతీక.

అక్కడ ఏ సామాను వుండదు. కానీ ఆ నేల మీద, ఇక్కడలా గానే, మొదటి చెక్క, ఆ చెక్క మీద ఒక దట్టమైన (డన్‌లప్) మెత్త, ఇక్కడున్నట్లుగా, దాని మీద

ఒక తివాచి, ఇక్కడి మాదిరిగా. రంగింకా ఎంచుకోబడ లేదు. ప్రదేశమంతా తెల్లగా వుంటుంది. శ్రీఅరవిందుల చిహ్నాలు తెలుపులో వుండాలా అని ఇంకా నిర్ణయానికి రాలేదు. అలా వుండాలనుకోను. నాకు అవి తెల్లగా కనిపించ లేదు. వర్ణింప వీలుకాని రంగులో, బంగారు, నారింజ రంగుల మధ్యలో వున్న రంగు లాంటిదిగా చూసాను. అవి నిటారుగా వుంటాయి. అవి రాతితో చెక్కబడాలి. ఇక ఒక గోళం, అది పారదర్శకం గాదు కానీ, కాంతిని ఒక పక్క నుండి మరొక పక్కకు ప్రసరించే వీలు కలిగినదిగా వుంటుంది. ఆ గోళం క్రింది భాగంలోకి వెలుగు ప్రవేశంచే విధంగా వుంటుంది, అది ఊర్ధ్వముఖంగా మళ్లించ బడుతుంది. ఆ వెలుగు గోళం లోకి వ్యాపిస్తుంది. బయట నుంచి కాంతికిరణాలు కేంద్రభాగంపై పడుతూ వుంటాయి. ఇతర దీపాలు ఉండవు. కిటికీ లుండవు. విద్యుత్తు ద్వారా వాయు ప్రసరణ వుండదు. ఒక్క సామాను కూడా వుండదు, ఏదీ వుండదు, అదో స్థలం, తమ చైతన్యాన్ని కనుగొనేందుకు ప్రయత్నించే స్థలం.

బయట ఇలా వుంటుంది. (అమ్మ మరొక పటాన్ని పరుస్తారు) పైకప్పు పూర్తిగా మొనతేలి ఉంటుందో లేక అది సామాన్యమైనదిగా వుంటుందో తెలియదు. అందులో రెండొందల మంది ఉండగలుగునట్లు ఉంటుంది.

CWM 13:289

: అనువాదం: యస్. వై. సోమయాజులు

చంపక్‌లాల్ దర్శనాలు

స్వర్ణాకారం

ఈసారి నేను చూసిన మాతృమందిరం దివ్యంగా నుండింది, అద్భుతంగా నుండింది, ఊహాతీతమైనది. మాతృమందిరం పైగా ఆకాశంలోనికి ఒక పెద్ద ఆకారం స్వర్గలోకాలకు విస్తరించి, మొత్తం ఆరోవిల్‌ని ఆవరించి నట్లుండింది. అది రాచరికం ఉట్టిపడుతూ, దివ్యంగా, అపరిమితంగా, విశాలంగా, బ్రహ్మాండమైన పరిణామంతో మిక్కిలి ప్రకాశవంతమై, తళతళ మెరుస్తూ బంగారు రంగులో, దేదీప్యమానంగా, మంత్ర ముగ్ధమైన ఆకారంతో నుండింది.

లెక్కలేనన్ని చేతులు ఒక్కటొక్కటిగా ఆ ఆకారంలోని ప్రతి భాగాన్నించి పైకి లేవటం ఆరంభ మయింది. ఆ ఆకారం పైపైకి ఎదగసాగింది. అప్పుడు దాని క్రింది భాగంలో కూడా చేతులు కనిపించాయి. కొంత సేపటి తర్వాత ఆ ఆకారం క్రమంగా క్రిందికి దిగడం ప్రారంభించింది. ఇపుడు దాని అరచేతులు అన్నీ విప్పారి ఆకాశంలో విస్తరించాయి. అరచేతుల నుండి ఒక స్వచ్ఛమైన ద్రవం అంతటా వ్యాపిస్తూ వుండింది. అది చాలా కాంతివంతమైన ద్రవం. అది మాతృమందిరాన్నంతా కప్పివేసి, మాతృమందిరంలో నుంచి స్వచ్ఛమైన ద్రవపు ఏరులుగా వెలువడటం ప్రారంభించింది. ఆరోవిల్ మొత్తం ఆ ద్రవంతో నిండిన పెద్ద సరస్సుగా మారి పోయింది.

ఎంతో దూరంలో లెక్కలేనంత మంది పురుషులు, బాలురు, బాలికలు నాలుగు వైపులా కన్పించారు. వారు సంతోషంగా స్వచ్ఛ ద్రవ సరస్సును చూస్తున్నారు. ఎట్టకేలకు, వాళ్లంతా ఒక్కరొక్కరుగా ఆ సరస్సులోకి ప్రవేశించడం మొదలు పెట్టారు. కొంతమంది దాని పైన తేలియాడారు, మరి కొంత మంది దానిలో మునిగారు. కానీ ఆ ద్రవం మాత్రం పారదర్శకంగా వుండటంతో వారంతా కనిపిస్తున్నారు.

అప్పుడు అనేక చేతులు గల ఆకారం సరస్సు నుంచి బయటకు వచ్చింది. కానీ ఈసారి, చేతులకు బదులు, ఆ ఆకృతి నిండా నేత్రా లున్నాయి. ఆ తర్వాత ఆ ఆకారం ఒక బంగారు కాంతి రూపంగా పైకి ఎదగటం ప్రారంభించి మార్గమధ్యంలో నిశ్చలంగా ఆగింది. అప్పుడు సూర్యకిరణాల్లాగా, ఆ ఆకృతి నుంచి ఒక బంగారు కాంతి ప్రసరించి ఆ ప్రాంతాన్నంతా చుట్టేయడం ప్రారమభ మయింది.

చూడు! ఆశ్చర్యం! అక్కడ సరస్సు లేదు. ఆ ప్రదేశంలో, ఒక అందమైన తోట వుంది. వేర్వేరు ప్రదేశాల్లో, భవనాలన్నీ బంగారు కాంతితో మెరుస్తున్నాయి. వాతావరణ మంతా అనేక పుష్పాల పరిమళాలతో నిండిపోయింది. దీనితో పాటు ఎన్నో ఘంటల మ్రోత తీయని సంగీతంతో మిళితమై వినిపించ సాగింది.

Visions of Chapaklal: 88-89

ఆరోవిల్ శంకుస్థాపన ఉత్సవ దర్శనం

అమ్మని ఆమె దివ్యమైన తీయని చిరునవ్వులో, తమ ప్రేమనంతా వొలక బోస్తుండటం చూసాను. ఆ విశాలమైన గది ఒక గొప్ప దివ్యమైన ప్రేమతో నిండి పోయింది. కొన్ని సెకన్ల పాటు అమ్మ లాలనగా రెండు చేతులతో నా తలను నిమిరారు. నా నుదుటి మీద తమ ముద్రని మెత్తని ముద్దు ఉంచారు. ఆ గదిలో దేదీప్యమానమైన బంగారు కాంతి తప్ప వేరొకటి కన్పించ లేదు. అమ్మ నా రెండు కళ్లని తమ అరి చేతులలో మూసినట్లు అనుభూతి పొందాను — భౌతిక శరీరంలో వున్నప్పుడు చూసే విధంగా.

అమ్మకి ఆరోవిల్ శంకుస్థాపన వేడుక ఎలా జరిగిందో ఆమెకు చెప్తున్నట్లుగా, నేను విన్నాను. 28 ఫిబ్రవరి 1968 నాడు జరిగింది నేను చూసాను, కానీ ఇప్పుడు అంతటిని ఒక ఆంతరిక ప్రాముఖ్యతలో చూసాను. నేను శ్రీమాతను ఆ శంకుస్థాపన వేడుకల్లో పాల్గొన్న ప్రతి యువత పైగా చూసాను. ఆమె తనదైన, మహదానందమైన చిరునవ్వు చిందిస్తూ ఉండినారు. దేదీప్యమాన బంగారు కాంతిని, తమ దివ్యప్రేమను ప్రసరింప జేసారు. నా కది శ్రీకృష్ణుడి రాసలీలని గుర్తుకు తెచ్చింది. పాల్గొన్న ప్రతి ఒక్కరు సింహం పైన, తన దేశ పతాకాన్ని ఒక చేత్తో పట్టుకొని, మరో చేత్తో తన దేశపు మట్టిని పట్టుకొని శంకుస్థాపన కలశం వైపు వెళ్తున్నారు. ఆ దృశ్యమంతా దివ్యంగా నుండింది. ఆ సింహాలన్నీ అందంగా వున్నాయి. మెరుస్తున్న బంగారు రంగులో రాచరిక మొలకబోస్తూ కనిపించాయి. వాటి పొడుగాటి జూలు నేలను తాకుతూ ఉంది. ఆ వాతావరణమంతా కానరాని పదార్థంతో ఆవరించి వుంది. 28 ఫిబ్రవరి 1968 ప్రపంచ చరిత్రలోనే ఒక ప్రత్యేకతని సంతరించుకొన్న రోజు. పురాతన సంస్కృత నానుడిలో వ్యక్తీకరించ బడినట్లుగా 'న భూతో న భవిష్యతి!'


Visions of Champaklal: 92

అనువాదం: తుమ్మల లక్ష్మి

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2018



చతుర్విధ తపస్సులు — పూర్ణయోగము

విషయసూచిక

సంపాదకీయం:

తపస్సు అంటే అమితమైన ఓర్పుతో చేసే ఉపవాసాలు. జాగరణము మొదలగు కష్టమైన ఆచార వ్యవహారాలని పొరపాటు పడడటం పరిపాటి. కానీ తపస్సు అనే పదానికి ఒక లోతైన అంతరార్థం ఉంది — ఆత్మ ప్రక్షాళణ అనబడే ఏకాగ్రతతో కూడిన ప్రయత్నం ద్వారా ఆకాంక్ష అనే అగ్నిని జ్వలింప జేయడం. అప్పుడు బాహ్యమందలి అవసరాలను పరిత్యజించడం, మనో ప్రాణ శరీరాలను శోషింప జేయటం లాంటి త్యాగసూచకమగు చేష్టలు చేపట్టడానికి బదలు ఆలోచనలలో, అనుభూతులలో, ఆచరణలలో ఇష్టాయిష్టాలను, కోరికలను, అహంకారాలను పరిత్యజించడంతో ఒకరు తపస్సు ఆచరించగలరు.

ఈ విషయంపై శ్రీమాతయొక్క అద్భుతమైన దృక్పథాలను, మార్గదర్శకాలను పాఠక లోకమంతా పంచుకుంటున్నాము.

సంపాదకుడు

చతుర్విధ తపస్సులు — చతుర్విధ మోక్షములు

కఠోర నియమపాలన, శరీర శోషణము కాదు

అతిమానస సంసిద్ధికి మార్గదర్శియగు సంపూర్ణ విద్య నభ్యసించుటకు అవసరమైన ముఖ్య విషయములు నాలుగు తపస్సులు, అవి సాధించు నాలుగు మోక్షములు.

తపస్సనగా శరీరమును శోషింప జేయు ప్రక్రియ అని ప్రజలలో సామాన్యమైన ఒక దురభిప్రాయ మేర్పడి యున్నది. ఎవరైనను తపస్సును గురించి ప్రసంగించ దలచినప్పుడు సన్న్యాసాశ్రమమును స్వీకరించిన వారవలంబించు కఠోర నియమములని మనము భావింతుము. సన్న్యాసి, శారీరక, ప్రాణిక, మానసిక జీవితములను ఆధ్యాత్మికములుగ మార్చుటకు అవసరమైన శ్రమను తప్పించుకొనుటకు గాను, అవి ఆధ్యాత్మిక పరిణామము నందుట కనువైనవి కావని ప్రకటించును. అవి ఆధ్యాత్మికాభివృద్ధికి అవరోధము లనియు, బంధము లనియు, ఒట్టి మొండివనియు, వ్యర్థములైన భారము లనియు భావించి నిర్దాక్షిణ్యముగ త్రోసిపుచ్చును. మరియు ప్రకృతియో, లేదా దైవమో నీపై దయ దలచి నీకు మరణమును ప్రసాదించు వరకు నీవేదో విధముగా వాటి నానందముతో భరింప వలెనను ఆపోహలో నున్నారు. ఈ పృథివిపై జీవనము ఆధ్యాత్మిక సాధనకు రంగస్థలము మాత్రమే నని భావించి అవసరమైనంత వరకు చక్కగ దానిని వినియోగించుకొని, తొందరగ సిద్ధినంది, అటు పిమ్మట ఇది యొక అవాంఛనీయమైన క్లేశముగ దాని నంత మొందించుటయే మంచిదని భావించు చున్నారు.

కాని, మన దృష్టిలో జీవన సమస్య వేరు. ఈ భౌతిక జీవితము ఒక మార్గము, ఒక ఉపకరణము మాత్రమే కాదు, పరిణామము ద్వారా ఇదియొక లక్ష్యము, ఒక సంసిద్ధి కావలయునని తలంచు చున్నాము. కనుక, తపస్సని నప్పుడు, శరీరము పట్ల ఒక నిరసన భావముతో గాని, దాని నేదో విధముగ వదల్చుకొన వలెనను భావముతోగాని కాక దానిని వశపరచుకొని, దానిపై స్వామ్యము కలిగి యుండుట అవసరమను భావముతో ఆ తపస్సును గురించి చెప్పుచున్నాము. సన్న్యాసి ఆచరించు శారీరక తపస్సుకంటె విలక్షణమైనదియు, సంపూర్ణమైనదియు, మరియొకటి బహు క్లిష్టమైన తపస్సు కలదు. ఆ తపస్సు పరిపూర్ణ పరివర్తనమున కవసరము; అదియే చతుర్విధ తపస్సు. అది అతీతమానస సత్త నావిర్భవింప జేయుటకు

వ్యక్తిని తయారు చేయును. ఈ విధముగ శారీరక పూర్ణత్వమును సిద్ధింప జేయుటకై వ్యాయామ శిక్షణ కోరు తపస్సు, ఇతర తపస్సు లంత కఠినమైనది కాదని ఎవరైనను ఉదాహరణమునకు చెప్పవచ్చును. ఈ విషయమును గురించి సమయోచితముగ తిరిగి వివరించుకొందము.

ఈ చతుర్విధ తపస్సులను గురించి ప్రసంగించుటకు ముందు, సాధారణముగ అనేకమంది అపార్థము చేసుకొని, మనస్సులో గందరగోళమును సృష్టించు ఒక మౌలికమైన ప్రశ్నను సుస్పష్టముగ వివరించ వలసి యున్నది. అది సన్యాసులు, తమ అనుష్ఠానము నందలి ప్రక్రియలను ఆధ్యాత్మిక శిక్షణలుగ భావించుటకు సంబంధించినది. సన్యాసము నందు ఆత్మను శరీర బంధము నుండి విముక్తము చేయవలెనని చెప్పుదురు; కనుక శరీరమును నీచభావముతో చూచు అభ్యాసముల నాచరింతురు. అవి ఆధ్యాత్మిక శిక్షణలకు విషయవ్యామోహములు సృష్టించు వికార రూపములు. 'కష్టపడుటవసర' మనే విపరీత బుద్ధి ప్రభావముచే సన్యాసానుష్ఠానమందు దేహమును నిర్లక్ష్యము చేసి బాధించుట, ఆత్మను శోషింప జేయుట ఒక భాగమై పోయినది. సాధువులు, పైకి పొడుచుకొని యున్న మేకులపై పరుండుట, క్రైస్తవుల కొరడాల ప్రయోగము, బొచ్చుచొక్కాల (hair-shirts) వినియోగము ఇవన్నియు ఇంచుమించుగ తెరచాటునుండి బహిరంగముగ ప్రకటింప బడనివియు — ప్రకటించుటకు తగనివియునగు హింసను ప్రేమించు విపరీత ప్రవృత్తులకు (sadistic tendencies) చెందినవే. ఇది యొక విధమైన అనారోగ్య వాంఛ లేదా అధశ్చేతనము ఆరాటము, తీవ్రమైన ఇంద్రియ స్పందన. నిజమునకు ఈ అభ్యాసము లన్నియు ఆధ్యాత్మిక జీవితమునకు సంబంధము లేక చాలా దూరము నున్నవి. ఏలన, ఇవి వికారము, నైచ్యము, అంధకారము, అనారోగ్యములతో నిండి యుండగ, ఆధ్యాత్మిక జీవితము వీటికి వ్యతిరేకమైన వెలుగు, అందము, ఆనందము, సామరస్యములతో నిండి యున్నది. ఇవి భౌతిక దేహము పట్ల మనఃప్రాణములకు గల క్రౌర్యముచే కనిపెట్టబడి కొనియాడ బడినవి. క్రూరప్రవృత్తి అజ్ఞానలక్షణ మగుటచే, అట్టి క్రౌర్యమును స్వీయ శరీరముపై చూపినను అది క్రూరత్వ మనిపించుకొనునే గాని, మరియొకటి కానేరదు. అజ్ఞాన స్వభావము తీవ్రమైన ఆవేశానుభవములను వాంఛించును. తీవ్రత లేని ఆవేశములు, అచేతనాప్రకృతులకు రుచింపవు. మరియు క్రూరత్వ మనునది తీక్షణమైన ఇంద్రియ స్పందనలను కలిగించు ఒక విధమైన మానసిక రోగమే యగును.

ఈ అభ్యాసము వలన కలుగు ప్రయోజన మేమన, ఇంద్రియముల సంక్షోభమును పూర్తిగ అంతరింప జేసి, తాను పరబ్రహ్మ సాక్షాత్కారమునకు తీయు పరుగులో (చేయు ప్రయత్నములో) భౌతిక శరీరము అడ్డురాకుండ చేయుట. కాని యిట్టి శిక్షణ యొక్క ఉపలబ్ధి సందేహాస్పదము. ఏ వ్యక్తియైనను తొందరగ, అభివృద్ధి పొందవలెనన, కష్టముల నెదుర్కొనుటకు వెనుదీయ రాదను సత్యము సర్వసమ్మతమే. కాని, కష్టమైన పనులను సర్వదా చేయవలెనని కోరుకొనుట వలన, అతని సంకల్ప బలము, శరీర ధార్ఢ్యము (నరముల శక్తియును) పటిష్ఠమగుటకు అవకాశము తానంతట అదే వచ్చును. ఎక్కువ సంతోషదాయకమైన స్వేచ్ఛాజీవితమును, అందువలన కలుగు మౌఢ్యమును అదుపులో నుంచుటకు, తీవ్రమైన వైరాగ్యము నవలంబించి నిరోధించ వచ్చును; కాని మితిమీరకుండ, సంతులనాత్మకముగ, తొందరపాటు లేని నిర్మలత్వముతో జీవితమును నడుప గలుగుటకు అంతకంటె ఎక్కువ కష్టతరమైన పని. భౌతిక కాయమును కాదని, దాని నాశనము సంభవించు వరకు దానిని నిరసించి నిందించుట కంటె, దానిని సామరస్యముతో, శాంతియుతమైన నిరాడంబరమైన వాతావరణముతో క్రమవికాసము నొందునట్లు చేయుట మిక్కిలి కష్టతరమైన పని. శరీరమునకు అవసరమైన పుష్టి, పోషణ, పరిశుద్ధతల నివ్వక దానిని శుష్కింప జేసి నియమబద్ధముగ జీవించు చున్నామని డంబాచారములు చెప్పుకొనుట కంటె కోరికలు లేకుండ ప్రశాంతమైన జీవితమును గడపుట చాల కష్టమైన పని. శారీరక అనారోగ్యమును నిర్లక్ష్యము చేసి, పట్టించుకొనక దాని నిష్టమొచ్చినట్లు శరీరనాశనము చేయుటకు విడిచి పెట్టవచ్చును. కాని, శరీరమునకు రోగము రాకుండునట్లు గాని, వచ్చినచో దానిని బాహ్యాంతర సామరస్యముతో నివారణ చేసి విజయము సాధించుట గాని, బహుకష్టముతో కూడిన పని. శారీరక చేతన స్థాయి దిగజారి అసుర ప్రకృతి ప్రభావమునకు లోను కాకుండునట్లు దాని నత్యున్నత స్థాయిలో నిలబెట్ట గలుగుట, వీటి యన్నిటి కంటె అసాధ్యమైన పని.

ఈ కారణము చేత, మనలో నాలుగు విధములైన స్వేచ్ఛలను స్థాపించు చతుర్విధ ఉపాసన లిచ్చుట ఉద్ఘాటింప బడినవి. ఈ చతుర్విధ తపస్సుల ఆచరణ విధానము నీ క్రింది నాలుగు విధములుగ పేర్కొనవచ్చును.

1. ప్రేమ తపస్సు (ప్రేమోపాసన)
2. జ్ఞాన తపస్సు (జ్ఞానోపాసన)

3. శక్తి తపస్సు (శక్త్యుపాసన)

4. సౌందర్య తపస్సు (సౌందర్యోపాసన)

ఈ ఉపాసనలు ఒక క్రమములో పైనుండి క్రిందికి చెప్పబడనవి. దానిని బట్టి వాటిలో క్రిందికి మొదటిది గొప్పదని, రెండవది తక్కువదని భావించుటకు వీలు లేదు. అదే విధముగ దీని తర్వాత ఇది ఆచరించ వలెనని చెప్పుటకు కూడ అవకాశము లేదు. ఏది ప్రధానమో, దేని తరువాత నేది ఆచరించవలెనో, ఆ వ్యక్తి తన సామర్థ్యము, ఆవశ్యకత ననుసరించి యుండునే గాని, అందుకొక స్థిరమైన సిద్ధాంతము (నియమావళి) లేదు. తన శక్తి సామర్థ్యములను బట్టి ఎవరికి వారు నిర్ణయించుకొనవలెను.

కనుక, ఇక్కడ వీలైనంత పరిపూర్ణముగ ఒక సామూహిక దృక్పథముతో ఏర్పాటు చేయబడిన ఆదర్శప్రాయమైన విధానమే వివరింప బడెను. ఎవరికి వారు తమ కనుకూలమైన, తా మాచరించగల విధానమును చేపట్ట వలెను.

CWM 12:48-50 శ్రీమాత

అనువాదం: మానాప్రగడ శ్రీరాములు

ఉన్నత చేతనకు సరిపడు శరీర నిర్మాణము

నీకు ఒక పిలుపు ఉంది, బహుశా నీవు యోగానికి తగినవాడవని తెలియవచ్చు. కానీ, ఇతర మార్గాలెన్నో వున్నాయి. ప్రతి మార్గం యొక్క లక్ష్యం, గమ్యం వేరుగా నుంటాయి. అయితే అన్నింటి ఆదర్శం మాత్రం ఒకటే — కోర్కె లన్నింటినీ జయించి, సామాన్య జీవిత సంబంధ బాంధవ్యాలను త్రోసిరాజని, అనిశ్చిత స్థితి నుండి చిరస్థాయిగా నిలువగలిగే నిశ్చితమైన స్థితిని చేరుకోవడం. నిద్రావస్థ, స్వప్నావస్థ, ఆకలిదప్పులు మొదలగువాటిని కూడా జయించడానికి ప్రయత్నించవచ్చు, కానీ నా యోగమార్గంలో లోకంతోటి లేక జీవితంతోటి సంబంధం తెంచుకోవడం లేక ఇంద్రియ సంవేదనలను అంతమొందించటం లేక వాటి కార్యాచరణను నిరోధించటం లాంటి కార్యక్రమాలకు తావు లేదు. ఈ యోగలక్ష్యం జీవితంలోకి దివ్య వెలుగును, దివ్యశక్తిని, దివ్యానందాన్ని, తత్సంబంధిత క్రియాశీల దృఢవిశ్వాసాలను కొనివచ్చి జీవితాన్ని పరివర్తన గావించటం. ఈ యోగం లోకబహిష్కరణను శాసించే సన్యాసయోగం కాదు. ఇది దివ్యజీవన యోగం. నీ లక్ష్యం నెరవేరాలంటే ఈ మా

ర్గానికి భిన్నంగా నీవు సమాధి స్థితిలోకి ప్రవేశించి ప్రాపంచిక సంబంధాలన్నింటినీ దానిలో లయం చేయాలి.

ఇక్కడ అనుసరించబడే యోగమార్గానికున్న ప్రయోజనం ఇతర మార్గాల కున్న ప్రయోజనానికి భిన్నమైనది. ఎందుకనగా దాని లక్ష్యం కేవలం సామాన్య అజ్ఞాన మయమైన ప్రాపంచిక చేతన నుండి మేల్కొని దివ్యచేతనలోకి ఎదగటమే కాక దివ్యచేతనయొక్క అతిమానసశక్తిని అజ్ఞానబంధురమైన మోర ప్రాణశరీరాల లోనికి కొనివచ్చి, దైవాన్ని వాటిలో సాక్షాత్కరింప చేయడం ద్వారా పదార్థంలో దివ్యజీవన స్రవంతిని ఏర్పరచడం.

ఈ లక్ష్యం అతి దుష్కరమైనది. ఈ యోగం కూడా కష్టతరమైనది. చాలా మందికి అది అసాధ్యమైనదిగా తోస్తుంది. సాధారణ అజ్ఞానమయ జీవిత చేతన యొక్క నియమిత శక్తులన్నీ దానిని ప్రతికూలం, దానికి ఆటంకపరచటానికి ప్రయత్ని స్తాయి. సాధకుడు తన సాధనలో అతని మనోప్రాణ శరీరాలు అత్యంత కఠినమైన ప్రతిబంధకాలుగా గుర్తిస్తాడు. ఈ ఆదర్శాన్ని హృదయపూర్వకంగా ఆదరించగలిగి, కష్టా లన్నింటిని ఎదుర్కొని, వాటి గతాన్ని, బంధాలను విస్మరించి, ఈ దైవికమైన అవకాశాన్ని అందుకొనుటకు సర్వాన్ని త్యజించడానికి, సర్వస్వాన్ని పణంగా పెట్ట డానికి సిద్ధపడినప్పుడు మాత్రమే నీకు అనుభవపూర్వకంగా దాని మరుగున ఉన్న పరమ సత్యాన్ని కనుగొనగలిగే అవకాశం లభిస్తుంది.

ఈ యోగసాధన ఎటువంటి నిర్ధారిత మానసిక ఉపదేశాలు, ధ్యానమార్గాలు, మంత్రోపదేశాలు మొదలగు విధానాలతో కొనసాగదు. అందుకు తీవ్రమైన అభిలాష, అంతర్ముఖంగానో లేక ఉర్ధ్వముఖంగానో కేంద్రీకరించుట, ఒక దైవిక ప్రభావానికి హృదయంలో దైవికమైన ఉనికికి, ఉన్మీలనం చెందుట, వీటన్నింటికీ అన్యమైన వాటిని తిరస్కరించుట అవసరం. కేవలం విశ్వాసం, ఆకాంక్ష, సమర్పణ ద్వారా మాత్రమే తనంతట తాను ఉన్మీలనం చెందుట సంభవమౌతుంది.

CWSA 29:19-20

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సౌందర్యోపాసన

ఉన్నత చేతనకు సరిపడు శరీర నిర్మాణము సౌందర్యోపాసన, శారీరక తపస్సు ద్వారా స్వేచ్ఛగల క్రియావిధానమునకు దారి చూపును. అందమైన రూపముగల శరీరము, సామరస్య సమేతమగు అంగవిన్యాసములు, మృదుత్వము, చురుకుదన ము గల కదలికలు, శక్తివంతమైన క్రియాశీలత, చెక్కుచెదరని ఆరోగ్యము, ప్రత్యంగ సంచలనములు గల శరీరమును రూపొందించుట దీని ప్రాథమిక కార్యక్రమము.

వీటిని సాధించుటకు, భౌతిక జీవితమును వ్యవస్థీకరించుట యందు సహాయకారు లగు కొన్ని అలవాటుల నేర్పరుచుకొని సాధారణ పద్ధతిలో ఉపయోగించుట మంచిది. ఏలన, నియమబద్ధమైన చక్రములో దేహము పనిచేయుటకు బాధపడదు. కాని, మ న అలవాట్లు ఎంత మంచివైనను వాటికి బానిసలము కాకూడదు. అలవాట్లు ఎంత మెత్తనివై యుండవలెనన, అవసరము వచ్చిన వెంటనే తేలికగా మార్చుటకు అవి వీలుగ నుండవలెను.

సమయము వచ్చినప్పుడు, ఓర్చుకొని పనిచేయుటకు, ఉక్కువంటి నరములను, శక్తివంతమైన కండరములను రూపొందించుకొన వలెను. కాని, దేహము వృద్ధి పొందుట కవసరమైన మేరకే కష్టపెట్టుట తెలిసి, మిక్కిలిగ ఆశించక జాగరూకతతో ప్రవర్తించ వలెను. శరీరమును ఎక్కువ అలసట పెట్టి, తుదకు క్షీణించి శిథిలమై పోవునట్లు చేయు శ్రమను వర్గీకరించి విడిచి పెట్టవలెను.

శరీరము ఉత్తమ చైతన్యముయొక్క పనిముట్టుగా తయారు చేయుటకు దాని వ్యాయామప్రణాళిక యందు, కఠోరమైన అలవాట్లను రూపొందించవలెను. నిద్ర, ఆహార, విహారాది కార్యము లందు, కాలనియమమును చాలా శ్రద్ధగా పాటించవలెను. శరీరావసరములను ఎవరికి వారు నిర్ధాక్షిణ్యముగ పరిశీలించుకొని — ఏలన మనిషికి అవసరములు వేరువేరుగా నుండును — లోటుపాటులు, వైపరీత్యములు లేకుండ ఒక సామాన్య నియమావళి నేర్పాటు చేసుకొనవలెను. ఒకసారి అట్లు చేసిన తరువాత చాపల్యము చేత గాని, సోమరితనము వలన గాని మార్పుచేయక, పట్టుదలతో, దీక్షతో దాని ననుసరించ వలెను. ఆ నియమములకు 'ఈ ఒక్కసారిలే' అను ఎట్టి స్వల్ప మినహాయింపులు కూడ చేయరాదు. ఒక్కసారి అన్నది చాలా సారులగును. ఏలన 'ఒక్కసారి' అను ప్రలోభమునకు లొంగిన, నీ సంకల్ప బలముయొక్క నిగ్రహాశక్తి

తగ్గి, ప్రతి కార్యమునందును, పరాజయమునకు తలుపులు తెరచినవాడ వగుదువు కనుక అట్టి బలహీనతలను పూర్తిగ విడనాడ వలెను. రాత్రుల యందు దుశ్చేష్టలు చేసి అలసి సొలసి వచ్చు, ఆరోగ్యమును చెడగొట్టి జీర్ణకోశమును పాడుచేయు విందుభోజనములు చేయుట, త్రాగుట పనికి రాదు. వినోదముల కొరకు పరుగులిడుట, అక్కరకు మానలి పనులు చేయుట, సంతోషము కొరకు దేవులాడుట మానవలెను. వీటి వలన అనవసరమైన దేహశ్రమ కలిగి, నిత్యసాధనకు శక్తిలేని వాడవగుదువు. క్రమబద్ధమైన జీవితమునకు శరీరమును మలచి, తన దృష్టిని దేహదారుఢ్యముపై కేంద్రీకరించి భౌతిక శరీరము వీలైనంత పరిపుష్టి నందునట్లు చేయవలెను. ఆదర్శ ప్రాయమైన యీ లక్ష్యము నందుటకు, చిన్న పెద్ద అను వివక్షత లేక సర్వకర్మల యందును, పాపప్రవృత్తియు మితిమీరిన ప్రవృత్తియు, కచ్చితముగా వర్జించవలెను, పొగత్రాగుట, మత్తుపదార్థములను సేవించుట మానుకొనవలెను. అవి నెమ్మదిగ తలకెక్కు విషములు. వాటికి అలవాటుపడిన అవి తప్పనిసరియగు అవసరములై నెత్తికెక్కి, జ్ఞాపకశక్తిని, సంకల్పశక్తిని నెమ్మదిగా నాశనము చేయును. ప్రతి మానవు నకును — మేధావులకు కూడ — ఆహారపదార్థములను తయారుచేయు విధానములు, వాటిని సేవించి, అనుభవించు సందర్భములు అమిత ఆసక్తిదాయకమైన వ్యాపార ములు. కాని ఈ వ్యాపారముల స్థానే, శాస్త్రీయమైన రసాయనిక విజ్ఞానముతో, శరీరమునకు అవసరమైన, యోగ్యమైన విధానముల నాచరించుటలో ఒకానొక తపస్సు నవలంబించ వలెను. విశ్రాంతి నిచ్చు నిద్ర, ఆహార విషయములో ననుసరించ వలసిన తపస్సునకు (నియమములకు) నిద్ర విషయంలో నవలంబంచ వలసిన తపస్సును (నియమములను) జోడించవలెను. ఆ నియమము అసలే నిద్ర లేకుండుట కాదు, ఎట్లు నిద్రపోవలెనో తెలియుట. నిద్రపోవుట యన, స్పృహలేక పడియుండుట కాదు. అందువలన శరీరము తేలికగ, ఉత్సాహవంతముగ నుండుటకు బదులు బలువెక్కును. కావలసిన మోతాదులో భోజనము చేసి, అతిని విసర్జించిన యెడల, ఎక్కువ కాలము నిద్రపోవలసిన అవసర ముండదు. నిద్రపోవుటలో కాలపరిమితికంటె ఎట్లు నిద్రపోవలె నను అంశమే ప్రధానము. శరీరాయాసమును తగ్గించు చక్కని నిద్ర పట్టవలెనన, నిద్రపోవుటకు ముందు ఒక కప్పు పాలుగాని, పండ్లరసముగాని, సూప్ గాని త్రాగవలెను. తేలికగా భోజనము చేసిన, ప్రశాంతమైన నిద్ర పట్టును. పొట్టనిండ భోజనము చేసిన, కలవరములకు గురై గుండెలపై నేదియో ఎక్కినట్లుండును

(nightmare) లేదా ఒళ్ళంత బరువుగ బద్ధకముగ, కదలుట కిష్టము లేక కొండచిలువ వలె పడి యుండును. ఇందు ముఖ్యమైన విషయము మనస్సును ఉద్రేకములేక నిర్మలముగ నుంచుట. ఈ ఉద్రేకములకు వెనుక, అనేక వాంఛలు, భావములు, సంచరించు చుండును. నిద్రపోవుటకు ముందు ఎక్కువగ మాట్లాడినను, ఒక తీవ్రమైన వాగ్వాదమును జరిపినను, లేదా మిక్కిలి ఆసక్తిదాయకమైన ఏదైన గ్రంథమును చదివినను, మొదట కొంచెము విశ్రాంతి తీసుకొని, మనస్సును కుదుటపరచుకొని, నిద్ర పోవలెను. ఏలన, శారీరకావయవము లన్నియు నిద్రలో మునిగియుండగ, మెదడు మాత్రము అనేక వికృత భావములను రగుల్కొలుపు చుండును. ధ్యానమునకు అలవాటుపడిన సాధకులు, శాంతిదాయకమగు ఒక ఉన్నత భావముపై మనస్సును లగ్నము చేసి కొన్ని క్షణములు ఉన్నతము, విశాలము నగు చైతన్యము నాకాంక్షించుచు ఏకాగ్రతతో ధ్యానము చేయవలెను. దానివలన నిద్ర జడస్వభావము లోనికి దిగజారక, సారవంతము, ఫలవంతము కాగలదు.

కర్మాచరణ, వ్యాయామం

రాత్రి సమయములో నిద్రావస్థలో ప్రశాంతతతో నిశ్చలముగ విశ్రమించుటకు పాటించవలసిన తపస్సు తెలిసిన పిమ్మట, వివేచనతో వ్యవస్థీకరించబడిన పగటివేళ తపస్సు వచ్చును. మరి దినచర్యలను ఒక వైపు శారీరక సంస్కారమున కనువైనవిగను, రెండవ వైపు మనము ఏపని చేయ పూనుకొందుమో ఆ పని కనువైనగిగను పురోగమనశీలము గల రెండు రకములైన అభ్యాసములు (కర్మలు) శారీరక తపస్సునందలి భాగములు కాగలవు. ఆ విధముగ భాగములు కావలెను కూడ. అభ్యాసముల విషయములో ఎవరికి వారు, తమ శరీరమున కనువైన వ్యాయామ ప్రక్రియల నెన్నుకొనవలెను. సాధ్యమైనచో, ఈ శాస్త్రము నందలి నిపుణుని సంప్రదించి, వాని సలహాలను తీసికొనవలెను. అతడు ఏయే వ్యాయామములను సమకూర్చుకొనిన, ఎక్కువ లాభదాయకమో చెప్పగలడు. ఈ వ్యాయామ ప్రక్రియలను ఎన్నుకొనుటలో గాని, ఆచరించుటలో గాని, మోహము పనికిరాదు. తేలికైనదని గాని, తమాషాగా నున్నదని గాని, ఏదో ఒక దానిని చేయకూడదు. వ్యాయామ శిక్షకుడు అవసరమని యెంచి, శిక్షణ విధానమును మార్చినప్పుడు మాత్రమే దానిని (ఆ కార్యక్రమమును) మార్చవలెను. తన శరీరమును పూర్ణము, బలిష్టము నైనదిగ తయారు చేసికొన:

సమస్యకు పరిష్కారమును, ఏ వ్యక్తి కా వ్యక్తి అన్వేషించి నిర్ణయించుకొనవలెను. ఇందులకు మిక్కిలి ఓర్పుతో, పట్టుదలతో వ్యాయామమాచరించుట, కాలనియమ మును పాటించుట చాలా అవసరము. జన బాహుళ్య మెట్లు భావించినను, మల్లుని జీవితము వినోదము, వేడుకలతో నిండినది కాదు. అది ఒక క్రమనిష్ఠతో, కఠోరమైన అలవాట్లతో కూడిన తపస్సు లక్ష్యసిద్ధిలేని వ్యర్థ వినోదముల కచ్చట తావు లేదు.

కర్మ నాచరించుటలో కూడ ఒక నిష్ఠ కలదు. ఆ నిష్ఠ ఎట్టిదనిన, తాను చేయు ప్రతి పని యందును పరిపూర్ణమైన శ్రద్ధాసక్తులు కలిగి యుండవలెనే గాని, కొన్నిటి యందు మాత్రమే అభిమానము, ఆసక్తి కలిగి యుండరాదు. ఆత్మాభివృద్ధి నాశించు వానికి, 'గొప్ప పని, కొద్ది పని' అని గాని, ప్రధానమైనది, అప్రధానమైనది అని గాని లేదు. ఆత్మాధిపత్యమును, ఆత్మాభివృద్ధిని సాధించ వలెనను ఆకాంక్ష గలవారు, ప్రతి పనిని సమభావముతో, సమాన శ్రద్ధతో చేయవలెను. సాధారణముగ, ఆసక్తిగల పనులనే బాగుగ చేయుదురను లోకోక్తి కలదు. అది నిజమే కాని, అంతకు మించిన సత్యమేమన, తాను చేయు ప్రతి పనిని శ్రద్ధతో, ఆసక్తితో చేయుట నేర్చుకొనవచ్చును. చివరకు జీవనోపాధికై ఒకరి యింట జీతమునకు చేయు పనులను కూడ ఆసక్తితో, శ్రద్ధతో చేయవచ్చును. ఇందలి రహస్య మేమన, స్వశక్తిని పూరించుకొని, పూర్ణత్వమును సాధించుటయే. ఏ వృత్తి నీకు సంప్రాప్తమైనను, ఏ కార్యము నీ పాల పడినను, దానిని ఆత్మాభివృద్ధి కొరకు హృదయ పూర్వకముగ, చిత్తశుద్ధితో చేయవలెను. ప్రతి పనిని శక్తివంచనలేక చక్కగ చేయుట మాత్రమే గాక, పరిపూర్ణతను సాధించవలెన నను ప్రయత్నములో దాని నెక్కువ నేర్పుతో చేయుటకు యత్నించవలెను. ఈ విధముగ పనులు కొనసాగించుట వలన ప్రతి పని — దాసీపని మొదలు కళాత్మకము, బుద్ధియుక్తమునగు పనులన్నియు — ఎట్టి మినహాయింపు లేకుండ శ్రద్ధాసక్తులతో చేయుట యలవడును. అభివృద్ధికి అంతు లేదు; ఎంత చిన్నపని నైనను ఈ విధముగ చేయవచ్చును.

కర్మాచరణయందు విమోచన

ఇది సహజముగ, కర్మాచరణ యందు విమోచనమునకు త్రోవ తీయును. మన కర్మాచరణ, సాంఘిక సంప్రదాయముల నుండియు, నైతిక పక్షపాతముల నుండియు దూరముగ నుండవలెను. దాని భావము చెడ్డనడత, (దుర్వినియోగము

చేయబడు స్వేచ్ఛ) నియమరహిత జీవనము కాదు. కాని ఇందుగు భిన్నముగ, తనకు తానే, సాంఘికమైన అన్ని కట్టుబాట్లకు మించిన కఠోర వ్రతములను నియ మించుకొని, వాటికి బద్ధుడై యుండవలెను. ఏలన, స్వయంకృత నియమమునందు మోసము సహింపబడదు. పరిశుద్ధమైన, పరిపూర్ణమైన చిత్తశుద్ధి యుండవలెను కదా! శరీరము నందలి సర్వాంగములను, సమతూకములో వృద్ధి పొంది, శరీర సౌష్ఠవమును, బలమును పెంచి, శరీరమున కొక సుందర రూపమును ఆపాదించునట్లు, శారీరక కర్మ లన్నిటిని వ్యవస్థీకరించ వలెను. దానిని సాధించుటకు భోగలాలసత్వమును సంపూర్ణముగ స్త్రీ సంభోగముతో సైతము — దూరముగా నుంచవలెను (విసర్జింప వలెను). ఏలన ఒక్కసారి స్త్రీతో సంభోగించిన, ఒక్క అడుగు మృత్యుముఖము వైపు వేయుటయే యగును. ఈ కారణము వలననే, చిరకాలము నుండియు, మతపరమైన పరమ పవిత్ర శాస్త్రములలోను, గుప్తవిద్యలలోను, అమరత్వమును ఆకాంక్షించు సాధకుల విధానములలోను ఇది పూర్తిగా నిషేధింపబడెను. సంభోగా నంతరము మనిషి చైతన్యస్థాయి దిగజారి ఏదో కొంతకాలము అచేతనస్థితిలో నుండి, దుష్టశక్తుల, దురభ్యాసముల ప్రభావము ప్రవేశించుటకవకాశ మేర్పడును; చైతన్య పతనము సంభవించును. కాని, ఈ అతిమానస ఆధ్యాత్మిక జీవనమును నడుపుట కుత్సుకత కలవారు, సుఖము పేరిటగాని, విరామము, విశ్రాంతి పేరిటగాని, తమ చైతన్యము అధోగతి పాలు కాకుండునట్లు (నీచవృత్తులలో ప్రసరించకుంటునట్లు) జాగ్రత్తగా కాపాడుకొనవలెను. చైతన్యముయొక్క శక్తి వెలుగుల బాటలలోనే, విశ్రాంతి స్థితి (relaxation) పొందవలెను గాని, తామసముతో నిండిన బలహీనత, అంధకార ములలో కాదు. అభివృద్ధి నాశించు వారందరు శారీరక బ్రహ్మచర్యమును ప్రధాన నియమముగ పాటించవలెను. అతిమానస ఆవిర్భావమునకై యత్నించువారు ఈ నిగ్రహశక్తితో విషయవ్యామోహమును విడనాడ వలెను. అంటే జితేంద్రియులు కావలెను కాని, ఈ ఇంద్రియ నిగ్రహము బలవంతముగా గాని, పట్టుపట్టి అణచిపెట్టుట వలన గాని జరుగ రాదు. ఒకానొక రసాయినిక శక్తి వంటి అంతశ్శక్తి తేజశ్శక్తిగ మారి, సమగ్రమైన అభివృద్ధిని, రూపాంతరమును సాధించవలెను. సంపూర్ణమైన ఫలితము నందవలెనన, కామప్రేరణలను, వాంఛలను, మానసిక, ప్రాణిక చైతన్యము నుండి నిర్విశేషముగను, సమూలముగాను తొలగించవలెను. అదే విధముగ భౌతిక సంకల్పము నుండి కూడ ఈ వాంఛలను తీసి పారవేయ వలెను. స్థిరమైన, సమూలముగ

యదార్థమైన రూపాంతరము లోపలి నుండి బయటకు ప్రసరించు చుండును. అనగా బాహ్యముగ గోచరమగు మార్పు ఈ సాధన కృషిలో సహజము, అనివార్యము కావలెను.

మన మిప్పుడు ముఖ్యముగ నిర్ణయించుకొనవలసిన విషయము: ప్రకృతి ప్రయోజనముల ననుసరించి, ప్రకృతి కోరిన విధముగ, శరీరమును, మానవజాతి ప్రస్తుతమున్న స్థితిలోనే శాశ్వతముగ నడుచుకొనుటకు మాత్రమే వినియోగించు టయా? లేక దానిని, నూతనముగ సృష్టించబడనున్న జాతి ఆవిర్భావమునకు ఒక మెట్టు కాగలుగుటకు తయారు చేయుటలో వినియోగించుటయా? — అనునదియే నిశ్చయించ వలసిన విషయము. ఏలన, పై రెండు పనులను ఏకకాలములో సాధించ నలవి కాదు. అనుక్షణము మానవుడు, తాను గతకాలమునకు చెందినవాడుగా నుండవలెనా? లేక భావికాలపు మానవాతీతుడుగ నుండవలెనా? — అను విషయము నిర్ణయము చేసుకొను చుండవవలెను.

ఆదర్శానుగుణమైన జీవితమును నుడువగోరి, అందు నీవు ఒక ప్రతిభ గల క్రియాశీలమైన పాత్రను వహించవలెనని కోరుచో, ప్రస్తుత జీవిత విధానముల కనుకూలముగ ప్రవర్తించుట గాని, ఇందు విజయమును సాధించుటకై యత్నించుట గాని విడనడావలెను.

సమగ్రమైన సౌందర్య సామరస్యములు గల సత్తయొక్క ఆనందమున కున్ముఖుడ వగుటకు, నీ బోగలాలసతను (pleasure) త్రోసిపుచ్చ వలెను.

CWM 12:50-55 శ్రీమాత

అనువాదం: మానాప్రగడ శ్రీరాములు

లోకం లోనికి దివ్యప్రేమను, దివ్య సౌందర్యాన్ని, దివ్యానందాన్ని కొనితేవడం మన యోగానికి తుది మెరుగు. అది మన యోగం యొక్క అంతఃస్ఫూరం. కానీ దానికి ఆధారంగా, పునాదిగా, రక్షణగా ఉండేది పరమ సత్యం — దేనినైతే నేను అతిమానసం అని పిలుస్తానో దానితో పాటు దాని దివ్యశక్తి కూడా తోడుగా వస్తే తప్ప అది సాధ్యపడేది కాదని నాకు సర్వదా అనిపిస్తుంది. అలా కాక పోతే ఈ ప్రస్తుత చేతన స్థాయి యొక్క గందరగోళ స్థితి కారణంగా గృఢ్డిదైన దివ్యప్రేమ దాని మానవ ఆశ్రయాలలో తడబడ వచ్చు. అలా కాకపోయినా తనకు గుర్తింపు దక్కలేదని, తిరస్కరించ బడినానని లేక మనిషి నిమ్నస్వభావం యొక్క దుర్బల

స్థితిలో వేగంగా క్షీణిస్తూ అంతమొంద వచ్చు. కానీ ఎప్పుడైతే అది పరమ సత్యంలోకి, దివ్యశక్తిలోకి ప్రవేశిస్తుందో అప్పుడు, ముందుగా దివ్యప్రేమ సర్వోత్కృష్టమై, విశ్వవ్యాప్తమై దిగివస్తుంది. అట్టి సర్వోత్కృష్ట, విశ్వవ్యాప్త స్థితిలో తనంతట తానుగా వ్యక్తులకు దివ్యసత్యం, దివ్యసంకల్పానుసారం అనువర్తిస్తుంది. ఆ విధంగా మానవ మనస్సు గాని లేక హృదయంగాని ప్రస్తుతం ఊహించలేనంతగా అపారమైన, ఉన్నతమైన, స్వచ్ఛమైన వ్యక్తిగత ప్రేమను సృష్టిస్తుంది. ఒకడు ఎప్పుడైతే ఈ అవరోహణ యొక్క అనుభూతి చెందుతారో అప్పుడు వారు ప్రపంచంలో దివ్యప్రేమ ఆవిర్భావానికి, దాని కార్యాచరణకు ఒక నిజమైన ఉపకరణం కాగలరు.

CWSA 29:333 *శ్రీఅరవిందులు*

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శక్త్యుపాసన

ఇది మనలను సహజముగ ప్రాణ తపస్సు — శక్త్యుపాసన — ఇంద్రియ నిగ్రహమునకు గొనిపోవును. ప్రాణసత్త ప్రబలమైన ఉత్సాహము, శక్తులకు కేంద్రము. ఈ శక్తికేంద్రమైన ప్రాణమునందే ఆలోచన, సంకల్పశక్తిగ పరిణామము చెంది, కార్యవిధానములో క్రియాశీలమగు యంత్రముగ మారును. ఈ ప్రాణక్షేత్రమే అన్ని కోరికలకును, ఉద్రేకములకును స్థానము. తీవ్రమైన ఆవేశములకును, హింసాపూరితమైన ప్రతిఘటనలకును, నిస్పృహతో కృంగిపోవుటకు కూడ యదార్థముగ నిదియే మూలస్థానము. సాధారణముగ వాటిని నిరోధించుటకు ప్రాణశక్తిని నొక్కిపట్టి కృశింప జేయుటయో, ఇంద్రియవ్యాపారముల సరికట్టి ప్రాణశక్తిని పస్తు పెట్టుటయే చికిత్సగా భావింతురు. ఏలన ఇంద్రియానుభవములే ప్రాణికశక్తి కాహారము. ఇంద్రియవ్యాపాలముల నరికట్టిన, ప్రాణశక్తి నిద్రపోవును. క్రమేణ క్షీణించి మొద్దువారును; తుదకు నిరాహారియై మరణించును.

ప్రాణశక్తికి బలము, జీవనాధారము మూడు క్షేత్రముల నుండి చేకూరును. మొదటిది అధోభూమిక, అనగా ఇంద్రియముల ద్వారా భౌతికశక్తుల వలన శ్రమ లేకుండ సులభముగ సంప్రాప్తమగునది.

రెండవ ఆధారము, తనదే యగు ప్రాణభూమిక. ఇక్కడ ప్రాణశక్తి విస్తరించుకొని,

గ్రహణశీలియై, విశ్వమయ ప్రాణశక్తులతో స్పర్శనంది వాటి ప్రభావముల కున్ముఖ మైనప్పుడు కలుగును.

ఇక మూడవది, ఒకానొక అభివృద్ధికై అఱ్ఱులుచాచు ఉత్కృష్టమైన ఆకాంక్ష. ఊర్ధ్వభూమికల నుండి ఆధ్యాత్మిక శక్తులు, ప్రేరణలు దాని నావేశించి, ప్రవేశించి పని చేయునప్పుడు ఈ యాకాంక్ష కలుగును.

ఈ మూడు మూలాధారములకు తోడు మరియొక ఆధారమును మానవుడు సర్వదా ఎక్కువగానో, తక్కువగానో కలుపుటకు సమాయత్త పరచును. అదియే వానియొక్క కష్టములకు, దురదృష్టములకు కారణ మగుచుండును. అది తోటి మానవులతో కలసి పరస్పర సంబంధ మేర్పరచుకొని నప్పుడు సంభవించును. సాధారణముగ ఇరువురు జంటగ చేరి, ప్రేమించుకొనుచున్నా మనుకొందురు. వారి ప్రాణశక్తులు ఒకానొక ఆకర్షణచే పరస్పర ఆదాన పరదాన లీ (ఇచ్చిపుచ్చుకొనే) యందొక సుఖ మున్నదని భావించి అట్లు చేయుదురు. వారు ఇదియే ప్రేమ యని భ్రమింతురు. కాని అది రెండు ప్రాణశక్తుల మధ్య ఏర్పడిన ఆకర్షణ మాత్రమే.

అందువలన, మన ప్రాణశక్తిని ఆకలితో చంపదలచక పోయిన, ఇంద్రియ వ్యాపారములను నిరోధించుట గాని, సంఖ్యలోను, తీవ్రతలోను తగ్గించుట గాని చేయరాదు. వాటి నుండి వైదొలగ రాదు. వాటని విచక్షణతో, విజ్ఞానముతో వినియోగించుకొన వలెను. విద్యకును, విజ్ఞానమునకుకు ఇంద్రియములు చక్కని సాధనములు. వాటిని సత్క్రమ ప్రయోజనములకు వినియోగించుకొన వలెనన, స్వార్థపూరితమైన స్వసుఖ మునకు వాటిని వినియోగించ రాదు. అజ్ఞానాంధకార మయమగు ఆత్మతృప్తి నన్వేషించుట కుపయోగించ రాదు.

అసహ్యము, అసుఖము లేకుండ, ఇంద్రియములు సర్వ విషయములను సహనముతో భరించగల బలమును కలిగి యుండవలెను. కాని ప్రతి విషయము యొక్క గుణగణములను, మూలములకు, అవి కలిగించు సంచలనములను పరిశీలించి అందు ఏవి శరీరమునకు, ప్రాణమునకు ఆరోగ్యకరమై సామరస్యమును, సౌందర్యమును సంపాదించునో, ఏవి హానికరములో, అభివృద్ధి నిరోధకములో గ్రహించు శక్తిని క్రమక్రమముగా సంపాదించి, వృద్ధి చేసుకొనవలెను. ఇంతేగాక, భౌతిక, ప్రాణిక ప్రపంచములను, అందలి క్లిష్ట వ్యూహములను పరిశీలించి తెలిసికొనుటకు పనిముట్టుగ ఇంద్రియము లివ్వబడెనని గుర్తించి, ఆ పనికై వినియోగించ వలెను.

అప్పుడు, ఆ ఇంద్రియములు తమ యథార్థస్థానము నధిష్ఠించి గొప్పదగు పరిణామ ప్రయత్నములో తమ పాత్రను చక్కగ నిర్వహించ గలవు.

ఈ విధముగ ప్రాణశక్తులను శుద్ధిచేసి, బలపరచి వెలుగుతో నింపవలెనేగాని, బలహీనమొనర్చ రాదు. అప్పుడే అవి అభివృద్ధి దాయకము లగును. శరీరమునకు ఆహారము పెట్టక నిరోధించిన, శరీరమున కెంత కీడు వాటిల్లునో, అట్టే ప్రాణశక్తి నిరోధము వలన ప్రాణశక్తి కంత సంకటము సంభవించును. ఆహారమును నిర్ణయించుటలో మనమెంత విజ్ఞానముతో శ్రద్ధగ శరీరపోషకములైన వాటిని ఎంచుకొనుచున్నామో, అటులనే, ప్రాణశక్తికి సంబంధించిన కోరికలు, ఆశలు మొదలుగాగల వాటిని ఎన్నుకొనుటలో శాస్త్రసమ్మతమైన నియమములను పాటించి, ప్రాణశక్తి — గొప్ప క్రియాశీలకమైన యంత్రముగ — పెంచి పూర్ణత్వము నిచ్చు విషయములనే ఆచరించ వలెను. మానవాభ్యుదయమునకు, అన్ని యితర భాగముల వలెనే, దాని వృద్ధి (ఈ ప్రాణశక్తి యొక్క అభివృద్ధి) కూడ చాల ప్రధానమైనది.

ప్రాణశక్తిని విజ్ఞానవంతము చేయుట వలనను, దానిని వెనుకటి కంటె పరిశుద్ధమైనదిగను, తీక్షణమైనదిగను, సూక్ష్మ మైనదిగను — అనగా, నాజూకైన సంస్కారము (మనోజ్ఞత) కలదిగను — సంసిద్ధము చేయుట వలనను, దానికి సహజమైన పశుత్వము, క్రౌర్యము (ఏవి నిజముగ, అజ్ఞానము, మోటుతనము, అరసజ్ఞతలకు యథార్థ స్వరూపములో) లను ఆధిగమించ వచ్చును.

యదార్థమును, ఏ విధమైన సత్సంస్కారము గాని, శిక్షణగాని లేనిదై విశృంఖలముగ విడువబడిన ప్రాణశక్తి, అహంకార ప్రేరితమై మూర్ఖత్వముతో అకస్మాత్తుగ సహజ పామరత్వముతో ప్రవర్తించును. కాని, క్రమశిక్షణ కలిగి విజ్ఞానముతో ప్రకాశించు స్వభావముగల ప్రాణశక్తి అంత సహజముగ, అప్రయత్నముగ నిస్వార్థత, ఉదారత, వీరత్వములు గల స్వభావము కలిగి ప్రవర్తించును. కనుక సుఖాన్వేషణ చేయు ప్రవృత్తిని, అతిమానస సమృద్ధి నాకాంక్షించు ప్రవృత్తిగ మార్చు విధానమును తెలిసికొనుటయే ప్రతివారును చేయవలసిన పని. ప్రాణశక్తియొక్క శిక్షణ, దీర్ఘముగ, పట్టుదలతోను, నిజాయితీతోను, తగినంత కాలము సాగించ గలిగినచో, కొంత కాలమునకు, జీవిత లక్ష్యము యొక్క గొప్పతనమును, సౌందర్యమును గుర్తించి, ఆ దివ్యానందము సిద్ధించ గలుగుటకు, అల్పత్వము, అపభ్రమలతో కూడిన ఇంద్రియ

లోలత్వమును విడనాడు ముహూర్త మసన్న మగును.

CWM 12: 55-57 — శ్రీమాత

అనువాదం: మానాప్రగడ శ్రీరాములు

సాధనాక్రమంలో ఈ విధమైన అలసట ఏర్పడటానికి నానావిధములైన కారణాలున్నాయి:

1. భౌతికం జీర్ణించుకో గలిగిన దానికన్నా అధికంగా స్వీకరించుట మూలంగా ఏర్పడవచ్చు. అప్పుడు ఎరుక కలిగిన నిశ్చలమైన విశ్రాంతి పొందినట్లయితే స్వస్థత చేకూరుతుంది. కానీ, ఆ విశ్రాంతిని బలం తిరిగి పుంజుకోవడానికి వినియోగించాలి తప్ప వేరొక ప్రయోజనానికి వాడకూడదు.

2. అది స్తబ్దత (మందికొడిగా నుండుట) జడత్వంగా తయారు గావడం వల్ల కూడా ఏర్పడవచ్చు. జడత్వం చేతనను సాధారణ భౌతిక స్థాయికి దిగజార్చడంతో తొందరగా ఆయాసపడి తమోమయ స్థితికి చేరే ఆస్కారముంది. ఈ స్థితిలో నివారణ నిజమైన చేతానస్థితికి తిరిగి చేరుకొని విశ్రాంతి పొందుటతో లభిస్తుంది కానీ, కదలక మెదలక పడి వుండటంతో కాదు.

3. అది శరీరాన్ని అధికంగా ఆయాసపెట్టడంవల్ల కూడా సంభవింప వచ్చు, అనగా శరీరానికి తగినంత నిద్ర లేక విశ్రాంతి ఈయక పోవడం. యోగానికి ఆలంబన శరీరం. అయితే దాని జవసత్వాలు అపరిమితం కావు. మితంగా వాడుకోవడం అవసరం. విశ్వగతమైన దివ్య ప్రాణికశక్తిని రాబట్టుకోవడంతో వాటిని తిరిగి సమకూర్చుకోవచ్చు. కానీ జవసత్వాలను పుంజుకోవడానికి సైతం పరిమితి ఉంది. అభివృద్ధిని సాధించాలనే ఆతురతలో కూడా మితంగా వ్యవహరించడం అవసరం. మితంగా వ్యవహరించటమనగా ఉదాసీనత లేక బద్ధకం కాదు.

CWSA 31:399

మానవుని సామాజిక సహజీవన మిశ్రణంలో ప్రాణికశక్తులను ఒకరి నుండి మరొకరికి మళ్లించడం ఎల్లప్పుడూ జరుగుతుంటుంది. అది యాంత్రికంగా చోటు చేసుకొనే ప్రక్రియ. ప్రేమించటం ఒకరి ప్రాణికశక్తిని ఒకరు పరస్పరం రాబట్టుకొనడానికి అత్యంత శక్తివంతమైన మార్గం — లేక ఒకరి యొక్క ప్రాణికశక్తిని మరొకరు లాగుకోవడం. ఇది కూడా తరచుగా ఏకపక్షంగా, వేరొకరికి హాని కలిగించేదిగా సాగుతుంది. ఈ మార్గంలో అనేక సంఘటనలు జరుగుతాయి — మంచివి, చెడ్డవి, ఉప్పొంగటం, బలపడ్డామనే అనుభూతులు, పరిపూర్ణ మొందామనే భావన, ఆధారం లభించిందనే

ఆనందం, బలహీన పడ్డామని లేక ఏదో కోల్పోయమనే విచారం, మంచి లేక చెడు లక్షణాలు వ్యాప్తి చెందడం, మానసకి భావాలు, స్థితులు, కదలికలు సహాయపడే లేక హానికరమయ్యే ఊహలు, అధైర్యం, నిస్త్రాణ, మొదలగు విషయాలు. సాధారణ చేతనావస్థలో వ్యక్తికి ఈ విషయాలు తెలియవు. పరిణామాలు పైకి కనిపిస్తాయి. ఈ పరస్పర మార్పు గ్రహించ వీలు కానిది. రహస్యమైనది కాబట్టి కార్య కారణాలు రెండూ తెలియకుండా, గుర్తించబడకుండా ఉండిపోతాయి. అది అవచేతన అనబడే మాధ్యమం ద్వారా చోటు చేసుకుంటుంది. అవచేతన ద్వారా అనడం కన్నా ఉపరి తలంలో జాగృతమౌతున్న మనస్సుచే మరుగుపరచ పడిన చేతన ద్వారా అనవచ్చు. ఎప్పుడైతే ఒక విధమైన యోగిక చేతనలోకి చేరుకున్నప్పుడు ఈ రహస్య పరిణామం గురించి వివరంగా తెలుస్తుంది. అయితే ఈ రహస్య పరిణామం పరస్పర మార్పిడికి, చర్య ప్రతిచర్య లన్నింటికి శీఘ్రంగా ప్రభావిత మౌతుంది. కానీ, ఇది ఒక అనుకూల్యత కలిగిస్తుంది. ఒకరు చేతనా పూర్వకంగా వీటి తాకిడిని తట్టుకోగల అడ్డుగోడలాంటిది నిర్మించుకో గలరు. అందుచేతన అతడు వాటిని నిరాకరించవచ్చు, వాటికి సమ్మతిం చక పోవచ్చు. ఉపయుక్తమైన వాటినే అంగీకరించ వచ్చు, హానికరమైనవి, ప్రతిబంధక మైనవి విసర్జించ వచ్చు. వ్యాధులు సైతం ఈ మాదిరిగా ఒకరి నుండి మరొకరికి సోక గలవు — వైద్యపరంగా స్పర్శతో గాని, లేక గాలి, నీరు మొదలగు వాటితోగాని వ్యాపించని వ్యాధులు సైతం. ఇచ్ఛాపూర్వకంగా కూడా ఒకరి వ్యాధిని తమలోనికి రాబట్టుకో గలరు, మాసిటోన్ కుమారుడగు డిమెట్రియన్ మరణాన్ని ఆంటిగోవస్ తనలోకి స్వీకరించినట్లుగా. ఇట్టి ప్రాణికపరమైన మార్పు ఒక వింతగా, పరిచయం లేనిదిగా కనిపించవచ్చు కానీ అభిప్రాయాలు, అనుభూతులు ఆచరణయోగ్యం కావు అనే విషయం నిజం కాదని, వాటి మట్టుకు అవి ఆచరణ సాధ్యమవుతాయని తెలుసుకో గలిగినప్పుడు అది సవివరంగా తెలుస్తుంది. వాటి కదలికలను వ్యక్తి మనస్సుకు లేక శరీరానికి పరిమితం చేయకుండా, విజ్ఞానశాస్త్రం పేర్కొన్నట్లుగా వాటిని 'తరంగాలు' గా పరిగణించి, ఎవరైనా వాటిని స్వీకరించగలిగే పరికరంలా వ్యవహరించినట్లయితే అవి వారికి తమకు తాముగా సమాచారం అందిస్తాయి.

CWSA 31;336

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

జ్ఞానోపాసన

భాషణపై నియంత్రణ

మానసిక తపస్సనగా, దీర్ఘకాలము ధ్యానము చేసి, చిత్తవృత్తులను నియమించి, అంతశ్శాంతిని నెలకొల్పుటయని స్ఫురించును. యోగశిక్షణలోని యీ విభాగమును గురించి అందరకు తెలియును గాన, ఎక్కువ వివరించవలసిన అవసరము లేదు కాని, ఈ శిక్షణకు మరియొక ముఖము కూడ కలదు. దాని యెడల శ్రద్ధ మిక్కిలి తక్కువ. అది వాక్కు నియమము ఇష్టము వచ్చినట్లు మాట్లాడుటను అరికట్టుటకు ఏ కొన్ని సందర్భములందో తప్ప, సంపూర్ణ మౌనము అవలంబింప బడుచున్నది. కాని పూర్తిగ వాక్కును నిరోధించుట కంటె, వాక్కును అదుపులో పెట్టి మాట్లాడుట ఎక్కువ ఫలప్రదమైన తపస్సు.

సృష్టిలో, మానవుడు, శబ్దమును వినియోగించి మాట్లాడ గలిగిన మొదటి పశువు (జీవి) అందువలన, మానవుడు తనకు లభించిన యీ శక్తికి గర్వపడును. ఆలోచనగాని, విచక్షణగాని లేకుండ, విశృంఖలముగా దేని నుపయోగించు చున్నాడు. ప్రపంచమును తన శబ్దఘోషతో నింపి, వృక్ష సామ్రాజ్య మందలి సామరస్యముతో నిండిన శాంతి సంపదను కొన్ని వేళలలో కోల్పోవు చున్నాడు.

అంతేగాక, మానసిక దౌర్బల్యము మాటకారితనమును పెంచునను విషయము సార్వజనీన సత్యము. విద్యాగంధము లేని ఆదిమజాతి మానవులు మాటలతో తప్ప యోచించ లేరు. వారు తమలో తాము గొణుగుకొనుచు మాట్లాడుకొనుట గమనార్హము. దీనికి కారణము వారు పైకి మాట్లాడుచు మాత్రమే తమ ఆలోచనాధారను కొనసాగించ గలరు.

ఈ మానసిక దౌర్బల్యము, విద్యావంతులు పెక్కుమంది తాము మాట్లాడిగాని, తమ భావమును నిరూపించుకొన లేనివారు కలరు. ఈ కారణముచేత వారు అతి వాగుడుకు అలవాటుపడి, ఎదిరివారిని విసిగింతురు. వారు ఎక్కువ మాట్లాడి తమ భావమును తేటతెల్లము చేసికొందురు. అందువలన వారు విషయమును విశదీకరించుటకు చెప్పినదే చెప్పుచుందురు.

కొందరు వారు చెప్పదలచుకొనిన విషయము, ముందుగ ఆలోచించుకొనకుండ చెప్పలేరు. కొందరు నెమ్మదిగ ఆలోచనకు వ్యవధి కలుగ జేసుకొనుచు, సరియైన

పదములను కూర్చుకొని, చెప్పవలసి వచ్చుచుండును.

కొందరు వాక్చాతుర్యముగల ఉపన్యాసకులై యున్నారు. వాక్కు వారి వశములో నుండును. వారు చెప్పదలచుకొనిన విషయమంతయు కరతలామలకమై అందు కవసరమైన చక్కని భాష దానంతటఅది స్ఫురించి, సుబోధకముగ వెలువడును.

ఇదంతయు మానసిక తపస్సు దృష్టిలో వ్యర్థ ప్రసంగము క్రింద జమకట్ట బడును. ఏలన, విధిగ మాట్లాడవలసిన పలుకులు తప్ప మిగిలిన మాట లన్నియు వ్యర్థ ప్రసంగములని నా యభిప్రాయము. విధిగ ఏది ఎంతవరకు మాట్లాడవలెనో నిర్ణయించు టెట్లు? అని అడుగవచ్చును. ఈ నిర్ధారణకు ముందు మాట్లాడు మాటలను కొన్ని సామాన్య తరగతుల క్రింద విభజించ వలెను.

సామరస్యత, పురోగతి సాధించాలంటే ఆలోచించి మాట్లాడాలి

మొదటిది: భౌతికసీమలో, ప్రాపంచికావసరములకు కావలసిన పదము లన్నియు మనకు చేకూరి యున్నవి. అవి అసంఖ్యాకములు; బహుశః సాధారణ జీవితమునకు చాల ప్రయోజనకరములు.

దైనందిన జీవితములో ఎడతెగని మాటల గందరగోళము అనివార్యము. కాని, అతిగ మాట్లాడుటను అదుపులో పెట్టుకొనుటకు ప్రయత్నించినచో, నిశ్శబ్దతలో పనులు తొందరగాను, బాగుగాను జరుగ గలవని గ్రహింతుము. ఇది అంతరాత్మిక ప్రశాంతికిని, ఏకాగ్రతకును విశేషముగ దోహము చేయును.

నీవు ఒంటరిగా లేక పదిమందితో కలసి సహజీవనము చేయువాడవైన, ఎక్కువగ మాట్లాడక, మౌనము పాటించుట అలవాటు చేసుకొనవలెను. దీని వలన, ఒకరినొకరు అంతరంగ స్ఫూర్తితో అర్థము చేసికొని, సామరస్యముతో ప్రవర్తించుట నలవరచుకొన గలరని క్రమక్రమనుగ గోచరించును. అప్పుడు మీరు, మాటలను, పరిమితముగ నుపయోగించి, క్రమేణ మాటలు లేని సంభాషణ చేయగలుగుదురు. ఈ బాహ్య మౌనము ఆంతరంగిక ప్రశాంతతకు లెస్సగా సహకరించును. పిమ్మట, సౌహార్ద్రత, పట్టువిడువని ఆకాంక్ష కలవారై, చక్కని సామరస్యముతో నిండిన, అభివృద్ధిదాయకమగు వాతావరణమును సృష్టించుకొన గలరు.

సామాజిక జీవితములో, ప్రాపంచిక జీవన వ్యాపారముల కవసరమగు మాటలు మాత్రమే గాక, భావస్ఫురణలను, భావావేశములను ఇంద్రియ స్పందనలను ప్రకటించు

మాటలను కూడ తప్పక చేర్చవలెను. ఇచట, బాహ్యమౌనమును పాటించు అలవాటు, విలువైన సహాయకారిగ పనిచేయును. ఏలన, నీవు ఉప్పెనవలె పొంగు ఉద్రేకములకు గాని, ఇంద్రియ కల్లోలములకు గాని, గురియైన సమయములో, ఈ అలవాటు, ఆలోచించుకొనుటకు వ్యవధిని కలుగ జేయును. నీ భావములను, బాధలను మాటలలో వెలిబుచ్చుటకు పూర్వము, తొందరపాటుతనమును నిగ్రహించుకొని, స్వస్థత గలవాడవగుదువు. ఈ విధముగ అనేకములగు వాదవివాదములు అరికట్టబడ గలవు. అనేక పర్యాయములు, అవేశముతో పరవశుడవై, నోటికి నచ్చినదెల్ల వాగుట వలన సంభవించు మానసిక సంక్షోభములను నివారించ గలుగుదువు.

అట్టి తీవ్రస్థితికి పోక నీ మాటలు నీ వశమందుండ వలెను. కోపోద్రేకముతో గాని, దురుసుతనముచేత గాని, నోరును అదుపులో నుంచుకొని యిష్టము వచ్చినట్లు మాట్లాడుటను అరికట్ట వలెను. ఏమి సంభవించినను నోరు మూసుకొని కూర్చొనుట యని దీని భావము కాదు. దుష్ఫలితములు నిచ్చునది, కేవల మొక తగువులాడుటయే కాదు, నోటికి వచ్చినట్లు మాట్లాడి, వాతావరణము లోనికి దుష్టభావ తరంగములను వ్యాపింప జేయుట కూడ దుర్వ్యాపారమే. మాటలు సృష్టించునట్టి శబ్దతరంగముల కంటె, వ్యాపకశీలమైన అంటువ్యాధి వేరొకటి లేదు. ఇట్టి చలనములను సృష్టించుట వలన అవి తమకు తామే, వ్యాపించి నీ యందును, ఇతరుల యందును సుస్థిరమైన ఆవాస మేర్పరుచుకొనును. విమర్శించడం, వ్యర్థప్రసంగం అవాంఛనీయం. అవాంఛనీయమైన వ్యర్థ ప్రసంగములలో ఇతరులను గురించి ఉబుసుపోక చెప్పుకొను మాటలను గూడ జేర్చవలెను.

నీవు ఒక సంఘమునకు బాధ్యతగల ప్రతినిధి వైనప్పుడు, కొందరు వ్యక్తులకు సంరక్షకుడవైనప్పుడు, ఒక ఉపాధ్యాయుడవైనప్పుడు లేదా ఒక వ్యవస్థ కధికారివైనప్పుడు తప్ప, మిగిలిన సందర్భములలో, ఇతరులేమి చేయుచున్నారు? ఏమి చేయుట లేదు? అను విషయమును పట్టించుకొనవలసిన అవసరము లేదు. నీవు ఇతరుల చర్యలను గురించి ఉలకరాదు పలకరాదు. నీవు వారిని గురించి గాని, వారి చేష్టలను గురించిగాని, ఒక అభిప్రాయమును వెల్లడించ రాదు. అభిప్రాయ పడరాదు. ఇతరులు వెల్లడించిన భావములను గాని చెప్పిన మాటలను గాని, నీవు తిరిగి ఇతరుల వద్ద ఉచ్చరించుటకూడ తగదు.

ఒక వేళ నీ వృత్తిధర్మముచేత, ఒకానొక సంస్థయందు, లేదా శాఖయందు,

ఒక సామూహిక కార్యమునందు ఏమి జరుగుచున్నదో తెలుపవలసిన ధర్మమున్న యెడల, నీవు తెలుపునట్టి విషయము జరిగిన విషయమునకు సంబంధించి యుండ వలసినదే గాని, అది ఇతర విషయములను స్పృశించ రాదు. పూర్తియైన బాహ్య విషయ వివరణ మాత్రమే అందుండవలెను. నీ స్వీయ అభిప్రాయముగాని, నీ అభీ ష్టముగాని, నీ ద్వేషముగాని అందు చోటు చేసుకొనకూడదు. నీవు యివ్వబడిన పని యందు, ముఖ్యముగ స్వార్థ కలుషితమైన నీ పట్టుదలను, ద్వేషమును చొర నివ్వరాదు

ఇతరులను గురించి, సాధారణముగ ఎక్కువగా మాట్లాడకుండుటను — వారిని స్తుతించుటయే యగు గాక — ఒక నియమముగ పెట్టుకొని, అనుసరించుట మంచిది. నీ అంతరంగములో సంభవించుచున్న సంచలనములే నీకు తెలియని పరిస్థితిలో, ఇతరుల మనస్సులో ఏమి ఉన్నదో నీకెట్లు రూఢిగా తెలియగలదు? అందువలన నీవు ఇతరులను గురించి, ఎట్టి అభిప్రాయమును కలిగి యుండరాదు. అభిప్రాయపడితివో, అది తప్పక తెలివితక్కువదైనది, లేదా ద్వేషపూరితమైనదై యుండును.

వాక్కు, శబ్దముల ప్రభావము

ఒక యోచనను, వాగ్రూపములోనికి తెచ్చిన, ఆ శబ్దస్పందన కొక గణనీయమైన శక్తి యుండును. అది భౌతిక పదార్థము నందొక పటిష్టమైన రూపమును నెలకొల్పును. అందువలన, ఇతరులను గురించి గాని, ఇతర విషయములను గురించి గాని ఎన్నడును చెడు పలుకరాదు. అట్లే ఈ ప్రపంచము ఆధ్యాత్మికాభివృద్ధిని నిరోధించు వాటిని గురించి కూడ మాట్లాడ కూడదు. ఇది సార్వజనీనమైన ముఖ్య సూత్రము. దీనికి కూడ ఒక మినహాయింపు గలదు. నీవు ఎవరి యందైనను దోషారోపణ చేయునెడల, నీవు వారిని సరిదిద్ది, నీ శక్తి సంకల్పముతో వారిని సరియైన మార్గములో పెట్టగలిగిన పక్షమున, నీవు వారియందా దోషమును ఆరోపించి, చూపవచ్చును. అట్టి చైతన్యశక్తికి, క్రియాశీలమైన సంకల్పమునకు భౌతిక పదార్థములోని దుష్టభావ స్పందన నెదుర్కొని నిరోధించగల సామర్థ్యము కలదు. ఈ విధముగ దుష్టతరంగ ప్రభావము వలన భౌతిక పదార్థముపై నెట్టి ఒత్తిడి రాకుండ నిరోధింపబడును.

ఈ చర్యను ఎట్టి ప్రమాదముగాని, అపాయము గాని లేకుండ నిర్వహించగల

వ్యక్తి, అతీంద్రియజ్ఞాన సీమల యందు విహరించుచు, పరమాత్మ జ్యోతితో ప్రకాశించు మానసిక శక్తులు, సత్యసామర్థ్యములు కలవాడై యుండవలెను. ఇట్టి దివ్యకర్మాచరణ పరుడే యిష్టానిష్టములకు దూరముగ నుండి విషయాసక్తి లేనివాడై యుండును. అతడు, అహంకారమును అడ్డగోడలను బ్రద్దలుకొట్టి, ప్రపంచములో పరాత్పరుని కర్మ చేయుటకై వ్యక్తిరాహిత్యమైన, స్వచ్ఛమైన యంత్రముగ రూపొందును.

ఉద్రేకపూరిత చర్చ వర్జనీయం

చదువుటవలన, ఆలోచించుటవలన, మనకు కలిగిన భావములను, అభిప్రాయములను వెలిబుచ్చుటకు తగిన అనేక శబ్దములు కలవు. ఇక్కడ మనము బౌద్ధిక క్షేత్రములో నున్నాము. సాధారణముగ, మనిషి బుద్ధిస్థాయిలో, ఎక్కువ సంయమనము కలిగి సమంజసముగ నుండుననియు, ఇక్కడ అంత కఠోర తపస్సు అనివార్యము కాదనియు ననుకొందము. కాని సత్యము దీనికి భిన్నము. ఈ భౌద్ధిక రంగమునందు దాక్షిణ్యము లేని కఠోర నియమములను పాటించుట అత్యావశ్యకము. కాని మానవుడు ఈ బుద్ధి సీమలో కూడ — ఈ భావ ప్రపంచ, జ్ఞానభూమికలోనికి కూడ — తన నిశ్చయముల యొక్క తీవ్రతను వర్గీకృత, తన మతాభిప్రాయముల అసహనతను, తను నమ్మిన భావములయొక్క ఆవేశమును, ప్రవేశపెట్టును. కనుక, ఈ మేధో భూమికలో కూడ మానసిక తపస్సు నవలంబించి, ఇతరులతో భేదాభిప్రాయములకు దోవతీసి, అవసరమైన వివాదములను కల్పించు వైషమ్యములను సృష్టించు చర్చలనుండి జాగ్రత్తగ తప్పుకొనవలెను. ఈ చర్చలు, తగవులు, మానసిక సంకుచితత్వము వలన సంభవించునవే. కనుక మానసిక స్థాయిలో ఒక ఉన్నత జ్ఞానము నందుకొనినచో, వీటిని తేలికగా తప్పించవచ్చును.

ఏ భావమైనను, పూర్తిగ సత్యముతో నిండి లేదు. ప్రతి యోచన పాక్షిక సత్యమే. సత్యముయొక్క ఒక దృక్పథము మాత్రమే కాగలదు. మాటలలో కూర్చబడిన యాలోచన, వాక్కున కందరాని అతీతస్థితి, విషయముయొక్క ఒకానొక రూపమై యున్నది. ఈ విషయమును గ్రహించని వర్గీకృత భావవాదిగ, ఒక మతవాదిగ నుండుట సంభవము.

విషయముల పరస్పర సంబంధ జ్ఞానము మాట్లాడుట యందు సమతులనము కలిగి యుండుటకు, వెనుక ముందు ఆలోచించి హుందాతనము గల మితభాషిత్వ

ముండుటకు, ఒక బలమైన సహాయకారి పూర్వకాలము నందొక విజ్ఞానవంతుడైన రహస్య తత్త్వవేత్త యిట్లు నుడివెను.

"సృష్టియందే వస్తువు వస్తుతః చెడ్డది కాదు. కాని, ఏ వస్తువు తన స్థానములో లేదు. ప్రతి వస్తువును దాని యదార్థస్థానము నందుంచినచో ప్రపంచ మంతయు సామరస్యముతో విరాజిల్లును."

అయినను, క్రియాత్మక దృష్టితో పరిశీలించిన, భావముయొక్క విలువ దాని యందలి క్రియాశక్తి ననుసరించి యుండును. ఈ క్రియాశక్తి ఎవరి యందు పనిచేయునో, ఆ విశిష్ట వ్యక్తుల ననుసరించి మారుచుండునను విషయ మందరకును విశదమే. ఒకానొక భావము ఒక వ్యక్తిని తీవ్రముగ కదలించును. అదే భావము మరియొక వ్యక్తిపై నెట్టి సంచలనమును కలిగించదు. కాని భావాశక్తి బహువ్యాపకమైనది. కొన్ని కొన్ని భావములు ప్రపంచమునే రూపాంతరీకరించు నట్టివి గలవు. అట్టి భావములనే తప్పక వెల్లడించవలెను. అదియే ఆధ్యాత్మికాకాశమునందు ధృవతారలై విరాజిల్లుచు, ఈ భౌతిక ప్రపంచమును దాని పరమ లక్ష్యము నందుకొనుటకు మార్గదర్శకత్వము వహించును.

బోధనార్థం వాడబడే పదాలు

తుది అంశము: విద్యను బోధించుటకు మనకెన్నియో మాటలు కలవు. ఇవి చిన్న పిల్లల శిక్షణ మొదలుకొని విశ్వవిద్యాలయ మందలి ఉన్నత శిక్షణల వరకు వ్యాపించినవి. మానవుడు సృష్టించిన కళాత్మక, సాహిత్య సృజనలు (రచనలు) వానిలో చేరునట్టివి ఉన్నవి. అవి మనోరంజకములు, విజ్ఞానదాయకములునై యుండును. ఈ రంగములో, సృష్టించబడిన వస్తువుపై నెక్కువగా నాధారపడి యుండును. కాని ఈ విషయము బహు వ్యాపకము కలదగుటచే నిక్కడ వివరించుటకు సాధ్యము కాదు. అధునిక కాలములో విద్య ఎడల ఎక్కువ శ్రద్ధ చూపబడుచున్నదను విషయము క్రొత్తగ కనుగొనబడిన భౌతికవిజ్ఞానమును, విద్యావిధానములలో చొప్పించుటకు ప్రశంసనీయమైన ప్రయత్నములు చేయబడుచున్నవను విషయము యదార్థమే; ఈ సందర్భములో కూడ, సత్యాన్వేషకునకు ఒక విధమైన తపస్సు అవసరము.

విద్యాభ్యాస కార్యక్రమములో, పిల్లలకు గాని, పెద్దలకు (వయస్సు వచ్చిన వారికి) గాని, దాని భారమును సడలించుటకు, ఆహ్లాదకరములు, వినోదకరములునగు

సరళమైన రచనలు, హాస్య కార్యక్రమములు అవసరమని సామాన్యముగ అందరును గుర్తించిన విషయమే. ఒక కోణము నుండి పరిశీలించినచో ఇది నిజమే. కాని, ఈ సదుపాయమును అదునుగ తీసికొని, పశుప్రాయము, నీచమైన మానవ స్వభావమును వికృత మొనర్చు, అధోముఖముగ లాగికొనిపోవు కార్యక్రమములు, కోకొల్లలుగ ప్రవేశపెట్టుటను సమర్థించు చున్నది. అతిహేయమైన ప్రేరణలను, పాశవిక అభిరుచు లను ప్రకటించి ప్రోత్సహించునట్టియు, మానవ స్వభావము యొక్క సౌమ్యతనే విస్మరించి, మోటుగ ప్రదర్శించు కార్యకలాపములు, ఈ సదుపాయము నొక సాకుగ పెట్టుకొని, తప్పనిసరి యైన అవసరముల వలె బలవంతముగ చోటుచేసికొను చున్నవి. కాని, విద్యావ్యాసంగ శ్రమభారము తగ్గించునవి యీ తెగకు చెందిన వెన్నడును కావు. మానవుడు కామలంపటుడు కాకయే విశ్రాంతి పొందవచ్చును. అతడు తన స్వభావమునకు సంబంధించిన స్థూల పదార్థములను పైకి రానీయకయే విశ్రాంతిని పొందవచ్చును. కాని తపోదృష్టి కలవారి విషయములో ఈ అవసరములు కూడ తమ స్వభావమును మార్చుకొనుట తప్పనిసరి యగును. విశ్రాంతి ఆంతరిక ప్రశాంతిగను, బాహ్యవిశ్రాంతి ధ్యానముగను, వినోదము అంతరానందముగను పరిణామము చెంది అనుభవింపబడును.

సర్వ సామాన్యముగ అంగీకరించి గుర్తింపబడిన ఈ వినోదము యొక్క ఆవశ్యకత, అనగా ప్రయత్నమును శ్రమ నుండి విరామమును కోరుట, జీవిత లక్ష్యమును దాని అస్తిత్వ ప్రయోజనములను, కొంత కాలము, లేక చిరకాలము పూర్తిగా విస్మరిం చుట జీవితములో స్వాభావికమని గాని, అనివార్యమని గాని భావించుట సత్య సమ్మతము కాదు. ఇది యొక బలహీనత. మన ఆకాంక్ష యందు తీవ్రత, సంకల్పము నందు స్థిరత్వము సన్నగిల్లినప్పుడు, అజ్ఞానము, తామసములు ఆవరించి, తెలివి లోపించినప్పుడును పైన చెప్పిన జీవిత లక్ష్యమునే విస్మరింపజేయు వినోదములు, విశ్రాంతి అవసరమని భావింపబడును. ఈ భావములను సమర్థించక, వీటికి చోటు నిచ్చుట నిరాకరించినచో, అవి అనవసరములని తొందరగ గుర్తింపగలవు. అంతే కాదు, అట్టి భావములను హేయములుగ నిరసింతువు. అప్పుడే మానవ నిర్మిత ప్రాపంచిక వ్యవహారములు బాహ్యముగ వినోదములుగ తోచినను, నిజమునకు నీచవృత్తి ప్రలోభములగుటచే, వాటి యందు ఆసక్తి తగ్గిపోవును. అప్పుడవి ప్రోత్సా హము లేనివై, నశించి పోవును.

అయినను, వాక్కు యొక్క విలువ సంభాషించు విషయముపై నాధారపడి యుండునని భావించరాదు. సాధారణ సందర్భములలో వలెనే, ఆధ్యాత్మిక విషయములలోకూడ కాలక్షేపమునకై చేయబడు వృధా సంభాషణ లుండవచ్చును. ఇవి చాల ప్రమాదకరమైనవి. ఉదాహరణకు, క్రొత్తగ సాధన ప్రారంభించిన సాధకుడు తాను నేర్చిన విషయములను ఇతరులకు చెప్పవలెనని కుతూహల పడుచుండును. కాని, సాధనలో ముందునకు పోవు కొలది, తనకు తెలిసిన విషయము ఎక్కువ కాదనియు, చాల అల్ప మనియు, ఇతరులకు బోధించుట కంటె తాను తెలుసుకొనిన దానిని రూఢము చేసికొనుట అవసరమనియు క్రమక్రమముగ, అతనికి అవగత మగును. చివరకు, వివేకవంతుడై కొన్ని క్షణములు సార్థకముగ మాట్లాడవలెనన, దానికి ముందు కొన్ని గంటలు నిశ్చలమైన ఏకాగ్రతతో నుండుట అవసరమని గ్రహించును. అంతేగాక, అంతర్దృష్టి, ఆధ్యాత్మికసాధనయందు నిష్ఠ కలవానికి వాక్కును, గట్టి అదుపులో పెట్టి నిరోధించుట చాల అవసరము. మాట్లాడుట తప్పనిసరి అయినప్పుడే మాట్లాడవలెను.

నీకు కలిగిన ఆధ్యాత్మికానుభూతులు, నీ అభివృద్ధికై నిర్దేశించబడినవి. వాటిని ఇతరులకు చెప్పరాదు. అట్టు చెప్పుట మొదలుపెట్టిన యెడల ఆ యనుభూతుల యందు గర్భితమైన శక్తి క్రమక్రమముగ దిగజారి అంతర్థాన మగును. ఈ విషయ మందరకును అనుభవవేద్యమే. కాని యీ నియమము గురువు పట్ల మాత్రము వర్తించదు. ఏలన, నీ అనుభూతియొక్క అర్థమును, అది సూచించు సత్యమును, అందుండి నీవు నేర్చుకొన వలసిన విషయమును నీవు గురువు వద్ద నుండియే తెలుసుకొనవలసి యున్నది. గురువుతో చెప్పుటలో ప్రమాదమేమియును లేదు. అనుభూతిలోని మంచి విషయములను నీ పురోభివృద్ధికై మలచి, ఆ విషయములను, అనుభూతులను నూతనమైన ఉన్నత భూమికల నందుకొనుటకు సోపానములుగా చేయగల శక్తి, జ్ఞానములు నీ గురువు నందు గలవు.

గురువుకూడ వ్యక్తిగతముగ తనకు సంబంధించిన విషయములలో ఈ సూత్ర మును పాటించి, మౌనము వహించునను విషయము సత్యము. ప్రకృతిలో ప్రతి వస్తువు, కదలి సాగుచునే యుండును. కనుక, ఏది ముందుకు సాగక ఆగిపోవునో,

అది నేలకూలవలసినదే, గురువుకూడ శిష్యునివలె వృద్ధి పొందుచుండ వలెను. కాని గురువుయొక్క పురోగతి, శిష్యుని అభివృద్ధి వంటిది కాదు. వారు వేర్వేరు భూమికలపై అభివృద్ధి పొందు చుందురు. ఆయన కూడ (గురువు కూడ) తన అనుభూతులను గురించి చెప్పుట మంచిది కాదు. అనుభూతిని మాటలలోనికి దించిన అందలి అభి వృద్ధిదాయకమగు క్రియాశీల శక్తి క్షీణించిపోవును. కాని మరియొక దృష్టితో చూచిన తన అనుభూతులను శిష్యులకు వివరించి చెప్పుట వలన వారి తెలివి పెరిగి అభి వృద్ధి చెందుదురు. అందువలన గురువు తన విజ్ఞాన సంపత్తితో ఎంత వరకు శిష్యులకు చెప్పవలెను, ఎక్కడ ఆగవలెను — అనగా, తాను త్యాగమెంత మేర వరకు చేయవలెనను విషయమును నిర్ణయించుకొన వలెను. ప్రగల్భములు గాని, వృథా గొప్పలుగాని ఆయన మాటలలో చోటు చేసికొనిన యెడల, ఆయన యందు గురుస్థానము పోయి, మాయలమారితనము చోచు చేసికొనును.

గురుశిష్యుల వ్యవహారం

శిష్యుని విషయములో నేనొక్కటి నొక్కి వక్కాణించు చున్నాను.

"నీ గురు వెవరైనను, నీవు ఆయన యెడల సర్వదా విశ్వాసము కలిగి యుండు ము. నీ వెంత వరకు వెళ్లగలవో ఆయన అంతవరకు తీసికొని పోవును. ఈ అదృష్టము బాగుండి, భగవంతునే నీవు గురురూపమున పొందినచో నీ సిద్ధికి అవధు లుండవు."

అయినను ఆ దివ్యతత్త్వమే భూలోకములో అవతరించినను, ఈ ప్రగతి నియమము లకు అది లోబడి యుండును. తానభివ్యక్తమగుటకు, తాను ధరించిన భౌతికదేహము నిత్య నిరవధిక ప్రగతిశీల మగు స్థితిలో నుండవలెను. దివ్యతత్త్వముయొక్క స్వీయ ఆత్మాభివ్యక్తి విధానము సర్వ సామాన్య భౌతికాభివ్యక్తి విధానముతో అనుబంధించి యుండును. ఈ విధముగా, మానవులు, పరిపూర్ణత నర్థము చేసికొని అంగీకరించుటకు సిద్ధముగ లేనంత వరకు, దేహధారియైన భగవంతుడు కూడ, భూలోకములో పరిపూర్ణుడు కాలేడు, మన మిప్పుడు భగవంతుని యెడల కర్తవ్యధర్మమును బుద్ధితో చేయుచున్న కర్మ లన్నియు భగవంతుని యెడల దివ్యప్రేమ భావముతో చేసినప్పుడు ఆ స్థితి కలుగును. అప్పుడు మానవాభ్యుదయము, పరిశ్రమగాక, సంతోషదాయకమగు కార్యక్రమ మగును. కచ్చితముగ నుడువ వలెనన, ఈ అభివృద్ధి సంపూర్ణమైన మానవసత్తాతో దైవమును ఆలింగనము చేసుకొనుటతో నేర్పడు ఆనందము ద్వారానే

కలుగును. కాని, మిక్కిలి శ్రమతోను, కొన్ని సమయములలో అమిత భాధలతోను నిండిన అహంకార ప్రతిఘటనను, బలవంతముగ అణచిపెట్టుట వలన కలుగును.

పర్యవసానములో (చివరకు) నేను చెప్పునదేమన: నీ మాట సత్యమునే ప్రకటించ వలెను, భాగవత శబ్దశక్తి కలిగి యుండవలెనని భావించినచో, మాట్లాడదలచిన దానిని ముందుగా ఆలోచించకుము. చెప్పబోవు దాని బాగోగులను గురించి ముందుగనే నిర్ణయించుకొనకుము. నీ పలుకుల యొక్క ఫలితమును, ప్రభావమును భావింపకుము. నిశ్చల మనస్సుతో నుండుము. ఆ విధముగ, యథార్థ స్వభావములో అచంచలుడవై నిలువుము. అప్పుడు విశ్వ విజ్ఞానమును విశ్వచైతన్యమును, విశ్వవివేకము నాకాంక్షించు శక్తి నీ ప్రకృతి కలవడును. నీ యాకాంక్ష యదార్థమైనచో, 'పని చక్కగ నెరవేర్చి విజయము నొందవలెనను వాంఛకు' అది యొక ముసుగు కానిచో, అది పరిశుద్ధము-స్వతస్సిద్ధము-సమగ్రమునైనచో, అప్పుడు నీవు నిర్మలమైన సహజ స్వభావముతో అనాయాసముగ భాషింతువు. ఎక్కువ తక్కువలు లేని పదములతో సమయోచితముగ మాట్లాడుదువు. అవి చక్కని సృజనాత్మకములై క్రియాశీలములై యుండును.

CWM 12:57-64 శ్రీమాత

అనువాదం: మానప్రగడ శ్రీరాములు

ఆవరించి వున్న ఈ వాతావరణమందు సాగుతున్న చర్చల మధ్యలో మానసికమైన ఇంద్రియ నిగ్రహం పాటించాలి అనడంలో అర్థం:

1. నీవు చెప్పదలచుకొన్న విషయాన్ని సమర్థించడానికి వాడే భాష తీవ్రత యొక్క ప్రభావం అనాలోచితంగా మాట్లాడటానికి దారి తీయకూడదు. నీ భాష తీరుపై ఎల్లప్పుడు చేతనాయుతమైన నియంత్రణ కలిగి వుండాలి. ఎంత అవసరమో, ఏది ఉపయుక్తమో దానినే మాట్లాడాలి.

2. చర్చించడం, వాదించడం, ఉద్వేగంతో మాట్లాడటం మానాలి. మామూలుగా చెప్పవలసిందేదో చెప్పి అక్కడ వదిలేయాలి. నీవు చెప్పేదే నిజం, ఇతరులు చెప్పేది తప్పు అనే మొండి పట్టుదల కూడదు. నీవు చెప్పిందేదో అసలు విషయం యొక్క నిజానిజాల నిర్ధారణకు తోడ్పడాలి. 'X' అన్నది వాస్తవం. నీవు అన్నది కూడా వాస్తవమే అని నీవు నాకు తెలియ జేయడంలో నా కేమనిపిస్తుందంటే అసలు ఆ విషయంలో వివాదమే లేదని.



3. భాషణలో స్వరాభావం, పదగుంభనం మృదు మధురంగా నుండాలి. పిడి వాదంగా స్ఫురించ కూడదు.

4. ఇతరులు ఉద్రేకపడినా, విభేదించినా, నెమ్మదిగా అలజడి చెందకుండా నుండాలి. నీ మాటలతీరు విషయాలు సాఫీగా సాగడానికి దోహదపడాలి.

5. ఇతరులపై పుకార్లు, తీవ్రమైన విమర్శలు (ముఖ్యంగా సాధకులకు సంబంధించి) ఉననప్పటికీ, వాటితో గొంతు కలుప కూడదు. ఎందుకనగా అవి ఏ విధంగాను ఉపయోగ పడవు, పైపెచ్చు చేతనను నిమ్నస్థాయికి దిగజారుస్తాయి.

6. ఇతరులను నొప్పించేది లేక హాని చేసేదాని నంతా వర్జించాలి.

CWSA 3:87

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ప్రేమ తపస్సు

తపస్సు లన్నిటిలో చాల కష్టమైన తపస్సు భావమునకు, హృదయ స్పందనలకు సంబంధించినది. ఇదియే ప్రేమ తపస్సు.

నిజమునకు 'విధికృత' మను ఒకానొక భావము, అన్ని యితర రంగములలో కంటె మానవుని భావసీమయందు ఎక్కువగ భాసించును. అది, అతనికి, అనివార్యమై, దుర్భేధ్యమై తప్పించుకొనుటకు వీలు లేనిదై, తన నాక్రమించి వశపరచుకొని నట్లుగ కనిపించును. ప్రేమ (సాధారణముగ మానవులు ప్రేమ అని భావించునది) ప్రధానముగ రాజసముగల ప్రభువు. దాని నిరంకుశ చాపల్యము నెవరును నివారింప లేరు. అది తన యిష్టము ననుసరించి ప్రవర్తించుచు, నీ కిష్టమున్నను లేకపోయినను నిన్నొక బానిసగ చేసి తన యాజ్ఞాపాలనము చేయునట్లు నిన్ను నిర్బంధము చేయును. ప్రేమ పేరుతో అనేక దారుణములు చేయబడినవి, ఘోర పాతకము లాచరింప బడినవి.

అయినను, మానవుడు, ఈ ప్రేమవేగము సరికట్టి, సాధువుగ మార్చి, అదుపులో, పెట్టవలెనను ఆశతో అనేకములైన నైతిక, సాంఘిక సూత్రములను, ధర్మములను సృష్టించెను. కాని, ఆ నియమములు అన్నియు భంగింపబడుటకే ఏర్పాటు చేయ బడినట్లు అనిపించును. ప్రేమభావముయొక్క స్వేచ్ఛా విహారములను నిరోధించు అడ్డంకులు అన్నియు దాని ఉజ్జ్వల ఉద్రేకమును వృద్ధి పొందించు నవిగనే కన బడుచున్నవి. ఏలన, ప్రేమప్రవాహము నడ్డుకొని క్రమశిక్షణలో పెట్టగల శక్తి, సూత్రము లకు గాని, నిబంధనలకు గాని లేదు. విశృంఖల, అధోముఖ ప్రేమోద్వేగములను, దానియొక్క (ప్రేమయొక్క) ఉన్నతమైన, అధిక సత్యసమ్మతమైన ఊర్ధ్వముఖ భావనాశక్తి మాత్రమే అదుపులో నుంచగలదు. ప్రేమయే తన విజ్ఞానము, పరిణామశక్తి, ఉన్నత భావనా పటిమచే, తనను తాను నియమించుకొన గలదు. ఏలన, ఇక్కడ కూడ, ఇతర సందర్భములలో కంటె ఈ సందర్భములో ముఖ్యముగ నియమించుట అనగా, అణచిపెట్టుట గాని, నిర్మూలనము చేయుటగాని కాక, మార్పు చెందించుట యను అర్థమును గ్రహించవలెను. ఇది యొక ఘనమైన రసాయన రహస్యము. ప్రపంచములో పనిచేయు శక్తులన్నిటిలో ప్రేమయే బలవత్తరమైన శక్తి కలదై, అమోఘమై విరాజిల్లుచున్నది. ప్రేమలేని ప్రపంచము అంధకార బంధురమైన అజ్ఞానమయమగు

నిశ్చేతనాస్థితి లోనికి దిగజారిపోవును.

ఈ విశ్వమును సృష్టించునది చైతన్యమే: కాని దీనిని రక్షించునది ప్రేమజ్ఞాన సమేతమైన అనుభవమే. ప్రేమయొక్క స్వరూప స్వభావములను, ఉద్దేశ్యములను, విధానములను, దిఙ్మాత్రముగ గోచరింప జేయును. ఆ చైతన్యానుభూతిని మాటలలో ప్రకటించిన, అది, సర్వవిధముల అనిర్వచనీయమగు ఒకానొక భావమునకు, మనస్సు కల్పించిన వికృతరూపమే యగును. తత్వవేత్తలు, గుప్తవిద్యా దురంధరులు (mystics), రహస్య విద్యావేత్తలు (occultists) ప్రేమకు నిర్వచనము చేయ పూనుకొని విఫలులైరి. అంతటివారు శక్తిహీనులైన విషయములో నేను విజయము సాధించగలనను దురభిమానము నాకు లేదు. కాని వారి నిర్వచనములలో నిరూపింప దలచిన దాని క్లిష్టతరమైన స్వరూపమును, వీలైనంత తేలిక పదములలో వివరించుటకు ప్రయత్నించెదను. నా మాటలకు లక్ష్యము మిమ్ము ఆ చేతనానుభవ జీవితమున కున్ముఖులుగ జేయుటయే. చిన్న పిల్లలను కూడ సజీవము, జాగృతము నయిన ఆ మార్గములో నడిపించ గలరని నా నమ్మకము.

ప్రేమ వస్తుతః, ఏకాత్మతానందము, ఐక్యానందమునందే ఆ ప్రేమ చరమాభివ్యక్తిని పొందును. ఈ రెండు లక్ష్యముల మధ్య విశ్వావిర్భావము యొక్కఅన్ని స్థితులు, అంతర్భూతములగును.

ఈ సృష్టియొక్క ఆరంభములో, ప్రేమ తన ఆవిర్భావముయొక్క పవిత్రతలో రెండు ప్రవాహములుగ ఆవిర్భవించినది. ఈ రెండును విభిన్న కేంద్రములలో బయలుదేరి, ఒకదాని నొకటి పూరించుకొనుచు, ఏకత్వము దిశగా సాగు మార్గములు, ఒక వైపున అది, ఆకర్షణయొక్క పరమశక్తిగను, రెండవ వైపున పరమోత్కృష్టమైన ఆత్మార్పణయొక్క అనివార్యమగు ఆవశ్యకతగను ఉన్నది. ఆదిలో సర్వజ్ఞుడైన పరమాత్మ నుండి, అజ్ఞానముచే నావరింపబడి జీవుడైన కారణమున సంకుచిత మొందినది. చైతన్యము నందేర్పడిన అగాధమును అంతరింప జేయు శక్తి ప్రేమకు మించి మరియొక దానికి లేదు.

ఏకత్వతత్త్వము దేశకాలములలో విసిరివేయబడి (projected) యీ ప్రపంచము సృష్టింపబడినది. అదే తత్త్వము యీ సృష్టిని నాశనము చేయక, తనలోనికి తీసికొని రావలసి యున్నది. అందు నిమిత్తము ఏకత్వము యొక్క ఏకైక ప్రబల శక్తయైన ప్రేమతత్త్వము పొంగి ప్రవహించినది.

ఆ ప్రేమతత్త్వము అంధకారము, నిశ్చేతన చుట్టూ తిరుగుతూ ఉన్నది. అది తనను గాఢాంధకార గర్భములో విరజిమ్ముకొనినది. ఖంఖండములుగ చెసికొనినది. అప్పటినుండే మెలకువ, ఆరోహణము ఆరంభమైంది. నెమ్మది నెమ్మదిగా జడతత్త్వ సృష్టి దాని అనంత వికాసము ఆరంభమైంది. భ్రాంతిపూర్ణముగ, చీకటిగ భౌతిక, ప్రాణిక ప్రకృతి యందలి అన్ని ప్రేరణలతో కలిసిపోయి యున్నది ఆ ప్రేమతత్త్వము కాదా? మరియు, ప్రతిక్రియ వైపుకి, ప్రతి సామూహికరణము వైపుకి ప్రేరేపించునది ఆ ప్రేమతత్త్వము కాదా? వృక్షప్రపంచమునందు ఇది స్పష్టముగా కన్పడుతుంది. వృక్ష, లత, గుల్మాదులలో ఎక్కువ వెలుతురు, ఎక్కువ గాలి, విశాలమైన ఆవరణము పొందుటకు దీని అవసరము ఎంతైనను గలదు, అటులనే పుష్పములలో ఈ ప్రేమతత్త్వమే సౌందర్యము, పరిమళములతో ప్రస్ఫుటితమవుతుంది.

ఇక జంతువులలో, ఆకలిదప్పుల వెనుకను, వ్యాపించ వలెనను బుద్ధి వెనుకను, ప్రతి వస్తువును తనదిగ చేసుకొన వలెనను ప్రవృత్తి వెనకను, స్వజాతీయోత్పత్తి వాంఛ (సంతానాభివృద్ధి వాంఛ) వెనుకను ఉన్నది యీ ప్రేమతత్త్వమే. సంగ్రహముగ చెప్పవలెనన, తెలిసిగాని, తెలియకగాని ప్రతి కోరిక వెనుక నున్నది ప్రేమతత్త్వమే. ఉన్నత జాతులలో, స్త్రీజాతి తన బిడ్డలకై త్యాగబుద్ధితో చేయు సేవలన్నిటి వెనుక నున్నది కూడ నిదియే. ఇది సహజముగ మనలను మానవజాతి విషయమును గురించిన పరిశీలనకు తీసికొని పోవును. విజయముతో విర్రవీగు మానసిక శక్తుల ఆగమనముతో ఈ ప్రేమసంసర్గము దాని ఉన్నత శిఖరముల నందుచున్నది. ఏలన, ఇక్కడ అది ఎరుక గలదై తన కార్యము లన్నియు బుద్ధిపూర్వకముగ జేయును, నిజమునకు, భౌతికాభివృద్ధికి ఇట్లు అవకాశము దొరకగనే, ప్రకృతి యీ ప్రేమతత్త్వము యొక్క మహోన్నత శక్తిని, ప్రజాభివృద్ధి యను సృష్టి కార్యముతో ముడిపెట్టి, దానిని వినియోగించినది. ఈ ముడి (సంబధము) అత్యంత సన్నిహితము, తాదాత్మ్యము పొందినది. దీనివలన మానవులలో ఈ సంతానాభివృద్ధి కార్యకలాపము, ప్రేమవ్యాపారము వేర్వేరు విషయములను విచక్షణ జ్ఞానము లుప్తమై పోయినది. వాటిని ఒకదానితో రెండవదానికి సంభంధము లేకుండ అనుభవించి వచ్చునను వివేకము గలవారు అతి స్వల్ప సంఖ్యాకులై యున్నారు. ఈ విధముగ ప్రేమతత్త్వము అధోగతికి దిగజారి, పశుస్వభావముగ దిగజారి పోయినది.

తదాది, ప్రకృతి ప్రక్రియలలో అనేకమైన క్లిష్ట సామూహిక సంఘటనల (సంఘీ కరణముల) ద్వారా, దశలవారిగ క్రమేణ, అది పూర్వస్థితియగు ఏకత్వమునకై సమర్థవంతముగ స్థిరమైన సంకల్పముతో పని చేయుచున్నట్లు కనబడుచున్నది. ఇరువురు మానవులను కలిపి ఒక జంటగ ఏకము చేయుటకు, ప్రేమభావము నందలి శక్తిని వినియోగించి, మొదటి సాంఘిక వర్గమగు కుటుంబమునకు పునాదులు వేసి, వ్యక్తిగతమైన సంకుచితమగు అహంకారమును భేదించినది. ప్రకృతి మొదట ఇరువురను ఏకము చేసి, ఇరువురితో కూడిన వర్గాహంకారమును సృష్టించినది. వారికి సంతానము కలుగగా, వారితో కలిపి క్లిష్టమైన కుటుంబాహంకారమును రూపొందించినది. కొంత కాలమునకు అనేక కుటుంబవర్గము లేర్పాటు కాగా ఆ కుటుంబములలో, రక్తసంబంధము వ్యక్తి సంబంధముల మిశ్రములతో పెద్దవైన సంఘము లేర్పాటు అయ్యెను. అవి గోత్రములుగ, వంశములుగ, జాతులుగ, కులములుగ, వర్గములుగ రూపొందుచు, ఒక దేశముగ ఏర్పడినవి. ఇట్టి సంఘనిర్మాణ కార్యక్రమము ప్రపంచము నందంతట, భిన్నభిన్న స్థానములలో ఏకాకాలములో విస్తరించుచు చివరకు వివిధ జాతులుగ సంతరించుకొన్నది. ప్రకృతి మానవైక్యము సమకూర్చుటకు భౌతికముగ సత్యసమ్మతమగు పునాదులను వేయు ప్రయత్నములో, ఈ జాతులను కూడ సమ్మిళితము చేయును.

జనబాహుళ్యముయొక్క దృష్టిలో, ఈ కార్యక్రమ మంతయు, యాదృచ్ఛికముగ కనిపించ వచ్చును. వారికి సంపూర్ణమైన విశ్వప్రణాళిక గోచరముకాదు. వారి వారి స్వభావముల ననుసరించి, యీ సంఘటనలు శుభదాయకములని గాని, దుఃఖదాయకములని గాని భావించుచు, కొందరు సంతృప్తి అనుభవించు చుందురు. మరికొందరు అసంతృప్తిని అనుభవించు చుందురు.

సంతృప్తి నందువారిలో ఒకతెగ, ప్రకృతి విధానములకు పూర్తిగ కట్టుబడి యుందురు. వీరే ఆశావాదులు (optimists). వారికి చీకటిరాత్రు లుండట వలన, పగళ్లు ప్రకాశవంతముగ కనిపించును, ఛాయ లుండుట వలన రంగులు విస్పష్టమైన ప్రకాశముతో గనిపించును, దుఃఖముండుటచే సంతోషమునందొక తీవ్రమైన ఆప్యాయత గోచరించును, దుఃఖము ఉండుట వలన సుఖము నందొక రమ్యమైన ఆహ్లాదము ననుభవింతురు. రోగ ముండుట వలన ఆరోగ్యమున కొక విలువ కనబడు చుండును. తమ మిత్రుల మంచితనముయొక్క గణనీయతను గ్రహించుటకు శత్రువులుండుట

అవసరమని భావించునట్టి కొందరిని కూడ నే నెరుంగుదును. కాని వీరందరికి విధిగ కావలసినది, అతిమనోహరమైన లైంగిక వ్యాపారము, జీవితములో అనుభవింప తగినది మృష్టాన్న భోజనము అయి యున్నది. పుట్టిరి గనుక చచ్చుట సహజ మనియు, దీర్ఘకాలము బ్రతికిన భారమగు ననియు గనుక జీవితయాత్రకు మరణ మొక అంతమనియు భావింతురు.

సంగ్రహముగ చెప్పవలెనన, జరుగుచున్న జీవితముతో వీరు తృప్తి చెందుచు జీవితమున కొక లక్ష్యమున్నదని గాని, ఒక ప్రయోజన మున్నదను విషయమునుగాని తెలియనివారై, ఇతరుల బాధలను పట్టించుకొనక, అభివృద్ధి యందు ఆశ లేనివారై బ్రతుకుచుందురు.

ఇట్టి వారిని మార్చుటకు ప్రయత్నము చేయరాదు. అదియొక ఘోరమైన తప్పిదము కాగలదు. నీ మాటలు విను నంతటి దురదృష్టము వారికి సంభవించినచో వారు ప్రస్తుత మనుభవించుచున్న సామరస్యమును కోల్పోవుటయే గాక, జీవితములో ఎట్టి నూతన సామరస్యము కనుగొనలేక బాధపడుదురు. వారు ఆంతరిక జీవితమునకు సిద్ధముగ లేరు. కాని, వారు ప్రకృతియొక్క ప్రియమైన బిడ్డలు; ప్రకృతితో సన్నిహిత సంబంధములు కలిగి జీవింతురు. ఆ స్థితినుండి వారిని వ్యర్థముగ తొలగింపరాదు.

లోకములో సంతృప్తిగల మానవులలో పైవారికంటె కొంచెము తక్కువ తరగతికి చెందిన, అందరికంటె తక్కువ కాలము స్థిరమైన సంతోషముగల మరియొక వర్గము కలదు. వారి తృప్తి ప్రేమయొక్క మాయామోహ ప్రభావము వలన సంభవించినది. వ్యక్తి తన అహంకారముచే బంధితమై యున్న సంకుచిత పరిధిని నిరంతరము భగ్నము చేయుచుండును. ఆత్మసమర్పణము వలన నతడు స్వేచ్ఛావాయువులలో సంచరించును. తోటి మానవుని కొరకు గాని, తన కుటుంబము కొరకు గాని, దేశము కొరకు గాని, లేదా తాను నమ్మిన మతము కొరకు గాని, అహంకారముచే బంధింపబడిన సంకుచితత్వమును త్రెంచుకొని తాను చేపట్టిన కార్యమును నిర్వహించిన ప్రతి సమయములో స్వార్థమును విస్మరింప చేయు మహత్తరమైన ప్రేమతత్వముయొక్క ఆనందమును పూర్తిగ చవిచూచుచుండును. ఈ అనుభవమే అతనిని పరమాత్మ స్పర్శ నందిట్లు నూహింప జేయును. కాని, తరచు, ఈ భావము స్థిరమైదిరి గాక, క్షణికమై యుండును. ఏలన, మానవునిలో ప్రేమ అంకురించి నంతనే అహంకారముయొక్క అధఃప్రవృత్తులు దాని నావరించి నీచత్వములోనికి

దిగలాగు చుండును. అది, పరిశుద్ధముగ నుండగలిగినను, భగవంతునితో దాని సంస్పర్శ ఎక్కువ కాలము నిలువలేదు. ఏలన, ప్రేమకూడ భగవంతుని దివ్యగుణము లలో నొకటి మాత్రమే. మిగిలినవాటి వలెనే ఈ ప్రపంచములోనికిక దిగివచ్చినంతనే అనేక వికృతులకు లోనగుచున్నది.

సాధారణ మానవునకు, అనగా, ప్రకృతిచే వాని సహజమైన మామూలు పద్ధతిలో, పడుచుచు, లేచుచు భవిష్యత్తులో ఏకత్వమునకు గొనిపోబడు, మానవునకు, ఈ అనుభూతము లన్నియు మేలు చేయునవే, ప్రయోజనకారులే. కాని తొందరగ ముందుకుసాగి ఒక నూతనజాతిని అనగా, అతిమానస చేతనా సత్యమును పృథ్వీ తత్త్వములో అభివ్యక్తము చేయగల జాతిని సృష్టించ వలెనను ఆకాంక్ష గలవారిని, ఇవి సంతృప్తిపరచ లేవు. వారు ఇంతకంటె సూటియైనవియు, చురుకైనవియు నగు నూతన మార్గముల ననుసరించుటకు ఆకాంక్షింతురు. ఆ మార్గము వారిని సాధారణ మానవ ప్రకృతి బంధముల నుండియు, దాని అనంత గమనముల నుండియు విముక్తి నందించి, ఆధ్యాత్మిక పురోగమనములో పాల్గొనునట్లు చేయును. అతి విరళముగ లభించు ఆ విశిష్టాత్ములు, మానవుల మధ్య నెలకొను ప్రేమతత్త్వము — అది ఎంత పరిశుద్ధము సుందరము నైనను — పూర్తిగ నిరసించవలెను. ఏలన, అది భగవంతునితో ప్రత్యక్ష సంబంధమును త్రెంచివేయును., మానవులతో అది ఒక విధముగా అల్ప పరిధి మండలములను సృష్టించును.

దివ్యప్రేమ తత్త్వము నెరిగినవారికి మిగిలిన ప్రేమస్వరూపము లన్నియు, అహంకారము, అంధకారము, సంకుచితత్వములలో సమ్మిళితములై అస్పష్టముగ మాలిన్యభూయిష్టములై గోచరించును; అవి అధికారము కొరకును, స్వామిత్వము కొరకును, నిరంతరము సలుపు పోరాటమువలె, బేరమువలె కనిపించును. మానవులలో, శ్రేష్టమైనవారి యందు కూడ ఈ ప్రేమ, అపార్థములతో, ఉద్రిక్తలతో, రాపిళ్లతో, అర్థరాహిత్యముతో నిండి యుండును.

అంతేగాక, మనము దేనిని ప్రేమింతుమో తత్సదృశ రూపములోనికే పెరుగు దుమను విషయము అందరకును బాగుగ తెలిసినదే. కనుక నీవు పరమేశ్వరునివలె కావలెనని కోరుచో, ఆ పరమేశ్వరునే ప్రేమించుము. భగవంతునితో సాయుజ్య పారవశ్య మందుటలోని మాధుర్యమును, ఆనందమును, రుచిని మరిగినవారికి, మిగిలిన విషయములతో పోల్చి చూచినపుడు, అవి మిక్కిలి నిర్జీవములు, రసహీన

ములు, అల్పములుగ తోచును. ఈ పారవశ్యము నందుటకు చాల సునిశితమైన శిక్షణ కావలెను. దీనిని పొందుటకు, ఎన్ని కష్టములుగాని, ఎంతటి శ్రమగాని, ఎంత కాలముగాని గొప్పవి కానేరవు. ఏలన, ఈ ప్రేమానంద పారవశ్యము అభివ్యక్తు లన్నింటి కంటె అనిర్వచనీయమైన స్థితి.

ఈ అద్భుత స్థితినే మనము భూమిపై చరితార్థము చేయ వాంఛించు చున్నా ము. ఇదియే. భౌతిక ప్రపంచమును పరివర్తన మొనరించి దానిని భాగవత సత్త స్థిరమైన ఆవాసయోగ్య భూమిగ చేయగలదు. అప్పుడే పవిత్రమైన, సత్యమైన ప్రేమ, ఈ శరీరము నందవతరించును. అంతట ఈ శరీరము దానికి వేషముగగాని, ముసుగుగాగాని ఉండ నేరదు. మానవుని సాధనను అతి సరళము చేయుటకు స్పష్టముగ ననుభవించదగు ఘనిష్ఠతను కలిగించుటకు పరమేశ్వరుడు తన పరమోత్కృష్టమైన ప్రేమస్వరూప స్థితిలో మానవ స్వరూపముతో సమానమైన భౌతిక శరీరమును సృష్టించుకొన నాకాంక్షించెను. కాని, సదా జడపదార్థము యొక్క స్థూలస్వరూపములలో బంధింపబడుట వలన, ఆయన ఒక వికృత రూపమునే ప్రకటించు కొన గలిగెను. మానవుడు తన చైతన్యములో, శరీరములో ఒక అనివార్యమైన అభి వృద్ధి సాధించినపుడే భగవంతుడు తనయొక్క సంపూర్ణ సమృద్ధ రూపములో తనను అభివ్యక్తము చేసికొనగలడు. ఏలన, మానవుని అల్పత్వముతో నిండిన దంభము, మూర్ఖత్వముతో నిండిన అహంకారము, మానవ రూపములోనికి దిగివచ్చిన, ఆ దివ్యప్రేమను ఒక అశక్తతకును, పరాధీనతకు, ఆవశ్యకతకు ప్రతీకగ భావించి అపార్థము చేసికొనును.

అయినను, మానవునకు ఆదిలో అస్పష్టముగ తెలిసినను, క్రమక్రమముగ తాను పరిపూర్ణత దిశగా పురోగమించుచున్న కొలది, ప్రేమతత్వ మొక్కటే, సర్వ సంసార దుఃఖనివారక మగు జ్ఞానము అతనికి విస్పష్టమగును. అనిర్వచనీయమైన ఆనంద స్వరూపమగు ప్రేమతత్త్వ మొక్కటియే, ఈ విశ్వమును దహించుచున్న వియోగ బాధను తుడిచివేయ గలదు. ఏలన, పరమోత్కృష్టమైన తాదాత్మ్యానంద పరవశతలోనే ఈ సృష్టి, తన పరమ లక్ష్యమును, సంసిద్ధిని గుర్తించ గలదు.

అందువలన, దివ్యతత్త్వము, పదార్థమునందు రూపుదాల్చినచో, దానిని మరుగు పరచజాలని విధముగ భౌతిక పదార్థమును, ప్రకాశమానము, పరిశుద్ధము, పరిపూర్ణముగ పరివర్తన మొనరింప వలెను. దానికై చేయు, నెంతటి ప్రయత్న మైనను కష్టతరము

కాదు, ఎంతటి తపస్సును కఠోరము కాదు. అప్పుడు ఆ అద్భుత ప్రేమ తనను ఈ విశ్వములో అభివ్యక్తము చేసికొన గలదు. జీవితమును మధుర ఆనంద స్వర్గముగ పరివర్తింప జేయగల సామర్థ్యము ఈ దివ్యప్రేమకే గలదు.

ఇదియే పరమావధి, పరమ లక్ష్యము, ప్రయత్నము సాధించవలసిన మకుటాయమానగు తుది విజయము అని మీ రనవచ్చును. కాని, దీనిని సాధించుట కేమి జేయవలెను? ఏ మార్గము ననుసరించవలెను? ఆ మార్గములో మొదటి అడుగు ఎట్లు వేయవలెను?

మనము, భగవంతునితో వ్యక్తిగత సంబంధము నేర్పరచుకొనుటకు, అద్భుత ప్రతిభగల ప్రేమ, కలిగి యుండవలెనని నిర్ణయించితిమి. కనుక, మనము ఇతరులతో పెట్టుకొను సంబంధములో ప్రేమకు బదులు, అహంకార రహితమైన దయ, సుహృద్భావము, ప్రతిఫలముగాని, కృతజ్ఞతగాని, గుర్తింపుగాని అపేక్షించని సద్భావము కలిగి యుండవలెను. అది స్థిరము, అచంచలము, సంపూర్ణము అయి యుండవలెను. అది స్థిరము, అచంచలము, సంపూర్ణము అయి యుండవలెను. ఇతరులు ఏ విధముగ నీ యెడల ప్రవర్తించినను, నీవు ఎన్నడును ఉద్రేకమునకుగాని, ఉద్వేగములకుగాని లోను కారాదు. అట్టితరి పరమేశ్వరుని యందు నీకు పరిశుద్ధము, పవిత్రమైన ప్రేమ కలదు గనుక, అతడే విధముగ నిన్ను సమర్థించి ఇతరులకు నీ యెడల కలిగిన అపోహలను, దుర్భావములను తొలగించి రక్షించవలెనో, ఆ పరమేశ్వరుని నిర్ణయమునకే వదలివేయుము.

నీవు నీ సంతోషము, ఆనందములకై భగవంతుని మీదనే ఆధారపడి యుండుము. అతడే నీకు రక్షకుడని భావించి సేవింపుము. అతడున నిన్ను సర్వదుఃఖములందు నాదుకొనును, మార్గదర్శకుడై తోవ చూపును. ఎదురుదెబ్బలు తగిలి పడిపోయిన లేవనెత్తును. నీవు అలసి నిరాశ చెందిన, నిన్ను తన బలమైన ప్రేమమయ బాహువుల లోనికి తీసికొని తన మధురమైన దివ్యప్రేమతో ముంచి, అనునయించును.

ఈ సందర్భములో, సాధారణముగ కలుగు అపార్థమును తొలగించుటకై ఒక మాట చెప్పవలసి యున్నది. నేను వ్రాయుచున్న భాష యందలి యిబ్బందులు కారణముగ, దైవము గురించి చెప్పినప్పుడు, పుంలింగ రూపమునే వాడి యుంటిని. కాని నిజమునకు, నేను వివరించిన యథార్థ ప్రేమతత్త్వము, స్త్రీపుం భేదముల కతీతమైనది. మరియు, అది మానవ శరీరము లోనికి అవతరించినప్పుడు, స్త్రీ

పురుష భేదములేక, జరుగవలసిన కర్తవ్యము ననుసరించి యుండును.

సంగ్రహముగ, 'భావతపస్సు' అనగా భావావేశ పూరితములైన రాగబంధము లన్నిటిని, వాటి స్వభావ మెట్టిదైనను, అనగా వ్యక్తిగతమైనవిగాని, కుటుంబ సంబంధ మైనవిగాని, దేశసంబంధమైనవిగాని, లేదా మరెట్టి సంబంధము గలవైనను, పూర్తిగ విడనాడవలెను. ఏలన, పరాత్పర దివ్యతత్త్వము పట్ల నీ అనుబంధమును గొనిపోయి, పృథ్విపై అతీత మానవ సాక్షాత్కారమునకు సాధన మగును.

CWM 12:64-71 శ్రీమాత

అనువాదం: మానాప్రగడ శ్రీరాములు

సాధకు లందరూ ఒకరి నుంచి ఒకరు దూరంగా నుండాలి, ఒకరిపై నొకరు కారాలు మిరియాలు నూరుకొనేలా ఉండాలి అనేది ముందుగా అనాలోచితంగా ఏర్పడిన అభిప్రాయం. దానికి వశం కాకూడదు. యోగిక జీవన నియమం ఐకమత్యం గాని పోరాటం కాదు. ఈ అపోహ బహుశా నిర్వాణం జీవిత లక్ష్యంగా గతంలో భావించ బడిన నందున కలిగి వుండవచ్చు. ఇక్కడ లక్ష్యం దివ్యజీవన సాఫల్యత, జీవితంలో దైవత్వం సిద్ధింప జేసుకొనుట. అందుకు సంయోగం, ఏకత్వం అత్యావశ్యకాలు....

యోగం యొక్క ఆదర్శం సర్వం దైవంలోను, దైవం చుట్టూ కేంద్రీకరించ బడాలి అని. సాధకుల జీవితం ఆ పునాదులపై నిర్మాణం కావాలి. వారి వ్యక్తిగత సంబంధాలలో సైతం దైవమే కేంద్రం కావాలి. అదీ గాక, సంబంధాలన్నీ ప్రాణిక ప్రాతిపదకి నుండి ఆధ్యాత్మికత ప్రాతిపదికగా మారాలి. ప్రాణికం ఆధ్యాత్మికతకు ఒక విధమైన పరికరంగా మాత్రమే ఉండాలి. దాని అర్థం వ్యక్తుల మధ్య సంబంధాలు ఏ విధంగా నన్నా ఉండనీ. వాటి నుండి అసూయ, జగడం, ద్వేషం, అయిష్టత, వైరం మొదలగు ఇతర దుర్మార్గపు ప్రాణిక భావనలు తొలగింప బడాలి. ఎందుకనగా అవి ఆధ్యాత్మిక జీవన శైలిలో భాగం కాలేవు. అదే విధంగా అహంకారయుతమగు ప్రేమలు, స్నేహబంధాలు అంతం కావాలి. అహంకార దర్పం ప్రదర్శించడానికి మాత్రమే ప్రేమించబడే ప్రేమ ఏదైతే అహం దెబ్బతినగానే అసంతృప్తి చెంది ప్రేమించడం మానేస్తుందో లేక ద్వేషం, పగ సైతం పెంచుతుందో, అట్టి ప్రేమ కూడా అంతం కావాలి. ప్రేమ వెనుక ఆధారంగా ఒక వాస్తవమైన, సజీవమైన, శాశ్వతమైన ఏకత్వ భావన ఉండి తీరాలి. స్త్రీపురుష సంబంధాలలో సైతం కల్మషం అంతరించాలి.

అది ఆదర్శం కావాలి. అయితే దానిని సిద్ధింప జేసుకొనే మార్గాలు మనుషులను బట్టి మారవచ్చు. ఒక మార్గం కేవలం దైవాన్ని మాత్రమే అనుసరించడానికి సర్వాన్ని త్యజించడం. దాని అర్థం ప్రపంచం పైన గాని, జీవితం పైన గాని, అయిష్టతను పెంచుకో కూడదు. అది గాక వేరెవరి పైన కూడా అయిష్టతను పెంచుకో కూడదు, జీవితం పైన, లోకం పైన కూడా. దాని అర్థం ఒకరు ఏర్పరుచుకొన్న ప్రధాన లక్ష్యంలో వారు పూర్తిగా విలీనమై పోవడం. ఒక్కసారి అది సిద్ధించిందంటే ఇతర సంబంధా లన్నింటినీ నిజమైన పునాదులపై నిర్మించడం సులభమౌతుంది. ఇతరులతో హృదయపూర్వకమైన, ఆత్మీయమైన, ప్రాణప్రదమైన ఐక్యత సాధించటం సులభ మౌతుంది. ఆధ్యాత్మిక సత్యతలోను, దైవంతో సైతం కలిసిపోవడం సాధ్యపడుతుంది. వేరొక మార్గ మేమిటంటే ఒకరు తాము ప్రస్తుతమున్న స్థాయి నుండి, ప్రధానంగా దైవాన్ని ఆకాంక్షిస్తూ, మిగతా దానినంతా దైవాధీనం గావిస్తూ ముందుకు సాగడం. కానీ మిగతాదాని నంతా పూర్తిగా విస్మరించుటకు బదులు, ఏవైతే మార్పు చెందగలవో వాటిని క్రమక్రమంగా అభివృద్ధి పథంలో రూపాంతరీకరించాలి. అక్కర లేని విషయాలన్నీ — కలుషితములు, అసూయ, కోపం, అహంకారపూర్వక అభ్యర్థన లాంటివి అంతర్జీవి పవిత్రంగా ఎదిగినకొద్దీ రాలిపోతాయి. వాటి స్థానే, ఒక జీవాత్మ మరొక జీవాత్మతో ఏకమవడంతోను, దైవికమైన చట్రంలో సాగే సామాజిక జీవితంలో ఒకరితో ఒకరు బాధ్యతాయుతంగా కలవడంతో ఏర్పడే ఏకత్వము చోటు చేసుకుంటుంది.

చిత్తశుద్ధితోను, సంపూర్ణంగాను ఈ సమర్పణా మార్గాన్ని నీవు అనుసరించి నట్లయితే ప్రమాదం గాని, తీవ్రమైన కష్టంగాని వాటిల్లవు. మనఃపూర్వకంగా చేస్తున్నావా, లేదా అనేదే ప్రశ్న. మనఃపూర్వకంగా చేపట్టకపోతే యోగం ప్రారంభించ వద్దు. నీవు వ్యవహరించేది మానవ సంబంధిత వ్యవహారాలలోనైతే మోసానికి పాల్పడే అవకాశ ముంది. కానీ దైవసంబంధిత వ్యవహారాలలో నైనట్లయితే ఎక్కడ కూడా మోసానికి తావుండదు, నీ ఏకైక లక్ష్యం దైవాన్ని సిద్ధింప జేసుకోవడమే అయితే, దైవసంకల్పాను సారమే నీ కదలికలన్నీ నియంత్రింప బడితే, నీ అంతరంగంలో నిష్కపటంగా, దైవానికి ఉన్మీలనమై ఉన్నట్లయితే నీవు దివ్యపథంలో నిర్భయంగా సాగవచ్చు.

CWM 3:5

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దైవం సర్వం చేయగలడు. ఒకరు తమను తాము దైవానికి ప్రగాఢ విశ్వాసంతో, గట్టి నమ్మకంతో సమర్పించుకో గలిగితే హృదయం, స్వభావం పరిశుద్ధ పరచబడు తుంది. అంతఃశ్చేతన జాగృత మౌతుంది, అడ్డుగా నున్న తెరలు తొలగి పోతాయి. ఒకేసారి ఆ విధంగా పూర్తిగా చేయలేక పోయినప్పటికీ, ఆ విధంగా ఎంత ఎక్కువగా అంత ఎక్కువగా అంతరంగంలో నుండి సహాయం, మార్గదర్శకం లభిస్తాయి, దైవంతో సంపర్కం, దైవానుభవం లోలోపల వృద్ధి చెందుతాయి. ప్రశ్నించే మనస్సు మొద్దుబారి చురుకుదనం సన్నగిల్లి, నమ్రత, సమర్పించు కోవాలనే సంకల్పం నీలో పెరిగినట్లయితే ఇది సంపూర్ణంగా సిద్ధిస్తుంది. అప్పుడు వేరొక బలంగాని, తపస్సుగాని అవసరం కావు, ఒక్క ఇది తప్ప.

CWSA 29;69

సమర్పణ ప్రక్రియ స్వయంగా ఒక తపస్సు. అంత మాత్రమే కాదు. అది ఒక ద్వి విధ తపోప్రక్రియ, సమర్పణను వృద్ధి చేస్తూ చిరకాలం కొనసాగుతుంది, సమర్పణ బాగా ఆరంభమై నప్పటికీ. కానీ దైవ సాన్నిధ్యాన్ని, దైవశక్తిని ఒకరు అతి తరచుగా అనుభూతి చెందే సమయ మొకటి ఆసన్న మౌతుంది, అప్పుడతడు అదే అంతా నెరవేరుస్తుందని అధికాధికంగా భావిస్తాడు — తత్కారణంగా బలీయమై కష్టాలు ఈ భావనను అస్థిరపరచ లేవు, ఇక వ్యక్తిగత ప్రయత్నం సైతం ఇకపై అవసర ముండదు, సాధ్యపడదు కూడ. అది స్వభావం పూర్తిగా దైవానికి పూర్తిగా హస్తగత మయిందనుటకు సంకేతం. కొందరున్నారు, వారు ఈ అనుభవం పొందక ముందే విశ్వాసంతో ఈ స్థితిని పొందుతారు. కానీ అందరూ ఈ స్థితిని మొదటి నుండి అనుభవించ లేరు. ఇక కొందరి విషయంలో అది ప్రమాదకరం అవుతంది. ఎందుకనగా వారు తమంతట తాము ఒక దుష్టశక్తి చేతిలో పడవచ్చు, దానిని దైవశక్తిగా పొరపాటు పడి. చాలా మందికి తపస్సు ద్వారా సమర్పణా స్థితికి ఎదగటం అవసరం.

CWSA 29:82 శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

రెండు సంభావ్యత లున్నాయి. ఒకరు వ్యక్తిగత ప్రయత్నంతో పరిశుద్ధ మవడం. దీనికి అధిక సమయం పడుతుంది. వేరొకటి వడిగా పనిచేసే దైవానుగ్రహం యొక్క ప్రత్యక్ష జోక్యం ద్వారా. ఈ రెండవ ప్రక్రియకు సంపూర్ణ సమర్పణ, ఆత్మార్పణ అవసర మౌతాయి. అందుకోసం పూర్తిగా నిశ్చలంగా నుండగల మనస్సు కావాలి.

దానికి అండగా అడుగడుగునా అంటిపెట్టుకొని వుంటూ, కార్యాచరణ గావించగల దివ్యశక్తి అవసరం. ఈ రెండవ స్థితికి శ్రీరామకృష్ణ పరమహంస పేర్కొన్న పిల్లిపిల్ల వైఖరిని అనుసరించటం కష్టం. వారు చేసే పనుల్లో చురుకైన తమ ఆలోచననా సరళి కదలికలను, సంకల్పాన్ని అనుసరించుటకు అలవాటు పడ్డవారికి, వారి కార్యాచరణను ఆపి మానసికమైన ఆత్మార్పణలోని నిశ్చలతను పాటించడం చాలా కష్టం. దాని అర్థం వారు యోగం చేయలేరని గాని లేక ఆత్మసమర్పణ స్థాయిని చేరలేరని గాని కాదు. అయితే, పవిత్రీకరణ ద్వారా, ఆత్మార్పణ ద్వారా కార్యం నెరవేర్చడానికి చాలా కాలం తీసుకుంటుంది. అంతే కాని ఈ పని చేపట్టడానికి ఓర్పు, నిలకడగా నుండగలిగే పట్టుదల, దృధ నిశ్చయం ఉండాలి.

CWSA 29:83 — శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

Statement about ownership and other particulars concerning
'AKHILA' AKHILA BHARATA PATRIKA Magazine

Form No. IV

(1) *Place of Publication*: Sri Aurobindo Society, 11, Saint Martin Street, Puducherry – 605 001; (2) *Periodicity of Publication*- Monthly; (3) *Printer's Name, Nationality, and Address*: Swadhin Chatterjee, Indian, Sri Aurobindo Ashram Press, Puducherry - 605002; (4) *Publisher's Name, Nationality, Address*: Pradeep Narang, Indian, Sri Aurobindo Society, 11, Saint Martin Street, Puducherry – 605 001; (5.) *Editor's Name, Nationality, Address*: A. Kailasapathi, Indian, Plot No. 25, Door No. 5-7-23, B.N. Reddy Colony, Behind Vanasthalipuram, R. R. District, Hyderabad – 500070, Telangana; (6) *Names and addresses of individuals who own the Newspaper and partners or shareholders holding more than one per cent of the total capital*: Sri Aurobindo Society, No. 11, Saint Martin Street, Puducherry – 605 001

I, Pradeep Narang hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1 March 2018 — (Sd) Pradeep Narang
Signature of Publisher

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2018



వితకు బీజాలు

సంపాదకీయం:

శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రం తన 75 వ వార్షికోత్సవాన్ని 2018 లో జరుపుకుంటుంది. ఈ సంచికలో విద్యాబోధనపై శ్రీమాత తమ రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా వెలిబుచ్చిన వెలుగుల వెల్లువ ఏదైతే నేటి మానవజాతిని రేపటి అతిమానవ జాతిగా తీర్చిదిద్దగలదో, దానిని పాఠకలోకంతో పంచుకుంటున్నాము

సంపాదకుడు

శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రం

2, డిసెంబరు 1943 న, శ్రీమాత లాంఛనప్రాయంగా ఒక పాఠశాలను, దాదాపు 20 మంది పిల్లల కోసం తెరిచారు. అందులో స్వయంగా ఆమెయే ఒక ఉపాధ్యాయురాలిగా ఉన్నారు. తరువాతి ఏడేండ్లలో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది.

24 ఏప్రిల్ 1951 న, శ్రీమాత ఒక సమావేశానికి అధ్యక్షత వహించారు. దానిలో ఒక 'అంతర్జాతీయ విశ్వవిద్యాకేంద్రం' స్థాపించాలని నిశ్చయించబడింది. 6 జనవరి 1952 న ఆమె 'అంతర్జాతీయ విశ్వవిద్యాకేంద్రం' ఆరంభించారు. 1959 లో దాని పేరు 'శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రం' గా మార్చబడింది.

ఈ విద్యాకేంద్రం పట్టాలను, యోగ్యతాపత్రాలను ప్రసాదించదు. కారణం, దాని ప్రయత్నం విద్యార్థుల్లో విద్యను నేర్చుకోవడంలోని ఆనందాన్ని, అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను, బాహ్య ప్రలోభాలకు లోబడకుండా అంకురింప జేయడం.

CWM 12:110

అనంతశక్తి, మహాప్రకృతి, మాయ లేదా మహాశక్తి విశ్వం అంతటా వ్యాపించి ఉంది. ప్రతి నామంలోను, రూపంలోను, మట్టిపెళ్లలోను, మొక్కలోను, కీటకంలోను, జంతువులోను, మనిషిలోను, కేవలం ఈ మహాబలశక్తియొక్క హెచ్చు, తగ్గులతో కూడిన ఆధారములైన వాటి ఇంద్రియాలతో కూడిన ఉనికిలోను అది తనను తాను కుమ్మరించుకుంటూ ఉంటుంది. మనం ప్రతి ఒక్కరం ఒక డైనమో. అందులోకి ఆ బలశక్తి అలలు ఉత్పాదన చేయబడి, నిల్వచేయబడతాయి. ఆ విధంగా అవి నిరంతరం పోషించబడతాయి, వినియోగించబడి తిరిగి నింపబడతాయి. ఏ శక్తి అయితే నక్షత్రాలను, గ్రహాలను కదిలిస్తున్నదో అదే మనలోను ఉన్నది. మన అన్ని ఆలోచనలు, చేతలు కేవలం దాని క్రీడ మాత్రమే, దాని సంక్లిష్ట చర్యల ఉద్భవాలు మాత్రమే. కొన్ని పద్ధతు లున్నాయి. వాటి ద్వారా మనిషి ఒక ఆధారంలాగా తన సామర్థ్యమును ఎక్కువ చేసుకోగలడు. కొన్ని ఇతర పద్ధతు లున్నాయి, వాటి ద్వారా మనిషి తనకూ, సార్వజనీన బలశక్తికి సంసర్గ మాధ్యం మధ్యలో అవరోధాలు కలిగించేవాటిని లేకుండా చేసుకోగలడు. ఎక్కువెక్కువగా దాని నిల్వలను తన ఆత్మలో, మెదడులో, శరీరంలో కుమ్మరించేటట్లుగా తీసుకు రాగలడు. ఆధారంయొక్క ఈ నిరంతర అభివృద్ధీ, ఎరిగించే శక్తియొక్క చేతన ద్వారా పరిమాణంలో, కార్యాచరణాల సంక్లిష్టతల్లో వృద్ధీ, పరిణామంయొక్క మొత్తం లక్ష్యం. మనిషి ఆధారం, సామర్థ్యం కలిగినంత మేరకు ఆ బలశక్తి దాని రీతిలో అత్యున్నతంగాను, పెద్ద మొత్తంలో అత్యంత సమృద్ధిగాను అయినప్పుడు, ఆధారం తనకు తానే లోనికి తోసుకువచ్చి, క్రీడించె బలశక్తిని భరించటానికి పూర్తిగా శిక్షణ పొంది ఉన్నప్పుడు అప్పుడు మనిషి సిద్ధుడు, సుసంపన్న మైన లేదా పరిపూర్ణమైన మానవుడు అవుతాడు. అతడి పరిణామం పూర్తి అవుతుంది. కొన్ని యుగాలుగా మానవజాతి మొత్తం దేనికైతే శ్రమిస్తున్నదో, ఆ పరమమైన అభివృద్ధిని అతడు వ్యక్తిలో పరిపూర్తి చేసిన వాడవుతాడు. ఈ సిద్ధాంతం సరైనది అయితే, బుద్ధి ప్రక్రియ ఆధారం వద్ద నున్న బలశక్తి తప్పకుండా మనలో ఉండి తీరాలి, ఆది తప్పకుండా అధికతరమైన విస్తృతికి, ఆచరణాత్మకంగా అపరిమితంగా సమృద్ధమైన వినియోగానికి తప్పకుండా సామర్థ్యం కలిగిన దవుతుంది. ఇది కూడా తప్పకుండా యుక్తమైనటువంటి సిద్ధాంతమే. మనం ఎంత ఎక్కువగా, సమృద్ధంగా బలశక్తిని ఎక్కువ చేస్తామో, అంత అధికతరంగా మన మనస్సు పని పాటవాల అంతర్నిహితశక్తి పరిధీ, ఆధిపత్య శక్తీ, కార్యాచరణలూ, పర్యవసానంగా

నూతన విద్యా బీజాలు

దృఢమైన పునాదిని వేయటం

ఒక గొప్ప మేధోపరమైన ఉపరితల నిర్మాణానికి మొట్టమొదటి ఆవశ్యకత దానిని భరించగల ధృఢమైన పునాది. తగినంత జ్ఞానంలేని మనుషుల నుంచి మొదలైన బోధనా వ్యవస్థ, విద్యార్థికి ఆ కాలపు మానవ సంస్కృతిలోని అత్యుత్తమమైన భాగంతో కూడిన విస్తృతమైన లేదా బాగా ఎంపిక చేసిన అనేక విషయాల సమాచార రాశిని సరఫరా చేసినప్పుడు, కావలసినంత పునాదిని ఏర్పాటు చేశామని వారు తలంచుతారు. పాఠశాల విషయాలకు సంబంధించిన సరంజామాను సమకూరుస్తుంది, వాటిని వినియోగించుకొనే బాధ్యత విద్యార్థిది. ఇదే ప్రధాన సూత్రం. కాని ఇక్కడ దోషం ప్రాతిపదికలోనే ఉంది.

సమాచారమే మేధకు పునాది కాలేదు, అది కేవలం విషయంలో భాగం, దాని నుంచి తెలుసుకొనేవాడు (జ్ఞాత) జ్ఞానాన్ని నిర్మిస్తాడు, అదే ప్రారంభ స్థానం, తాజా ఆవిష్కరణయొక్క విస్తరించిన సృష్టియొక్క కేంద్రకం. కేవలం జ్ఞానాన్ని మటుకు అందించటానికి కట్టుబడిన విద్య విద్యే కాదు. స్మృతి, న్యాయాన్యాయవిచారణ, కల్పన, గ్రాహ్యత, హేతుబద్ధత అనేవాటియొక్క అనేక నైపుణ్యాలు జ్ఞాతకు ఆలోచన మరియు జ్ఞానాల పెద్ద భవంతిని నిర్మిస్తాయి, వాటితో పాటు కేవలం వాటి యోగ్యత, చాలినన్ని పనిముట్లు, విషయాలు తప్పకుండా సమకూర్చబడి ఉండటమే కాకుండా, తాజా విషయాలను వెలుగులోకి తీసుకురావడానికై స్వాధీనంలో ఉన్నవాటిని నైపుణ్యంతో వినియోగించడానికి శిక్షణను పొందబడి ఉండాలి. వారు నిర్మించవలసిన నిర్మాణంయొక్క పునాది, కేవలం నిరంతరం వృద్ధిపొందే జ్ఞాపకశక్తి, వివేచనాశక్తి, సృజనాశక్తుల కార్య క్షేత్రాలు హక్కుగా కోరుకొనేవాటిని భరించడానికి సరిపడా పోగుచేసుకొని నిల్వచేసుకొన్న శక్తి, బలము మాత్రమే కాగలదు.

CWSA 1:368-70

మనిషి విశ్వం నుంచి వేరుగా లేడు

ప్రాచీన ఆర్యులు మనిషి విశ్వం నుంచి వేరుగా లేడని తెలిసినవారు, అతడు కేవలం ఒక సజాతీయ భాగం మాత్రం, సముద్రంలో అల భాగమైన విధంగా. ఒక

విరూపం చేయడమవుతుంది. అది మానవ ఆత్మ మీద స్వార్థపూరితమైన క్రూర కృత్యం, దేశానికి ఒక గాయం, ఒక మానవుడు అతడు ఇవ్వగలిగిన అత్యుత్తమమైన మేలును అది కోల్పోయేటట్లు చేయడం మరియు దానికి బదులుగా ఏదో అపరి పూర్ణమైన, కృతకమైన, తక్కువ రకానికి చెందిన, యాంత్రికమైన, సర్వసాధారణమైన దానికి ఒప్పుకొనేటట్లుగా బలవంతం చేయడమే అవుతుంది. ప్రతి ఒక్క మనిషిలోను అతనిలో దివ్యత్వమైనది ఏదో ఉంటుంది, ఏదో అతడి సొంతమైనది, యాదృచ్ఛికమైన బలం, పరిపూర్ణత అది ఎంత అల్ప పరిధిలోని దైనప్పటికీ, భగవంతుడు అతడికి స్వీకరించడానికి గాని లేదా తిరస్కరించడానికి గాని ఇచ్చినదై ఉంటుంది. విధాయకమైన పని దానిని కనుగొనడం, దానిని అభివృద్ధి చేయడం, దానిని వినియోగించడం. విద్య ప్రధాన లక్ష్యం, వృద్ధిపొందే ఆత్మ, తనలో ఉన్న అత్యల్పమైనదానిని బయటకు తీసుకురావడానికి సహాయం చేయడం, ప్రశస్తమైనదానికి దానిని వినియోగించడం.

మూడవ ప్రధాన సూత్రం దగ్గర నుండి దూరందానికి పని చేయడం, ఉన్నదాని నుంచి అవబోయేదానికి. మనిషి ప్రకృతికి చాలా మటుగు ఎల్లప్పుడూ ఆధారమైనది అతడి ఆత్మ యొక్క గతంతోపాటుగా, అతడి వారసత్వ సంక్రమణం, అతడి పరిసరాలు, అతడి జాతీయత, అతడి దేశం, అతడు ఏ భూమినుంచి తన పోషణను పరిగ్రహిస్తున్నాడో అది, అతడు పీల్చే గాలి, అలవాటుపడిన అతడి దృక్కులు, ధ్వనులు, అలవాట్లు. అవి అతనిని తక్కువ శక్తితో తీర్చిదిద్దేవేమీ కావు, కాకపోతే అవి అత్యంత సూక్ష్మ మై తెలియబడనివి. కాబట్టి అక్కడనుంచి మనం తప్పక ప్రారంభించవలసి ఉంది. ప్రకృతిని భూమి నుంచి కూకటి వేళ్లతో సహా, అక్కడ పెరుగవలసి ఉన్నదానిని మనం అవశ్యం పెరికి వేయకూడదు లేదా సహజంగా సంచరించవలసిన మనస్సును విలక్షణమైన పరాయి రూపాలతోను, జీవిత భావాలతోను చుట్టుముట్ట కూడదు. ఏదైనా బయట నుంచి లోపలకు తీసుకురావలనుకొంటే, దానిని తప్పక నివేదించవలసి ఉంటుంది, మనస్సు మీద బలవంతంగా రుద్దడం కాకుండా, సిసలైన అభివృద్ధికి నిబంధన ఒక స్వేచ్ఛాయుతమైన, సహజమైన వృద్ధి.
CWSA 1:384-85

కొన్ని ఆత్మలు సహజంగానే తమ పరిసరాలపై తిరుగుబాటు చేయడం జరుగుతూ, వేరే యుగానికి, ప్రాంతానికి చెందినవనిపిస్తాయి. వారి అభిరుచిని అనుసరించే స్వేచ్ఛలోనే వారిని ఉండనీ; కానీ కృత్రిమమైనటువంటి పరాయి ఆకృతిలో

మన మేథయొక్క ఉద్దతీ, మనం సాధించినదాని ఉత్తమోత్తమ స్థితీ ఉంటాయి. ప్రాచీన ఆర్యులు వారి విద్యాబోధనకు ఆధారంగా చేసుకొన్న మొట్టమొదటి సూత్రం ఇది. బలశక్తి నిల్వను వృద్ధి చేయటానికి వారు వినియోగించిన ప్రధానమైన ప్రక్రియలలో ఒకటి, బ్రహ్మచర్యమును పాటించడం.

CWSA 1:369-71

విద్యయొక్క మూడు ప్రధాన సూత్రాలు

అసలైన బోధనయొక్క మొట్టమొదటి ప్రధాన సూత్రం, దేనినీ బోధించ సాధ్యం కాదు. ఉపాధ్యాయుడు బోధకుడు లేదా గట్టిగా పనిచేయించేవాడు కాదు, అతడు సహాయకుడు, మార్గదర్శకుడు. అతని వ్యవహారం సలహా ఇవ్వడమే కాని దానిని బలవంతంగా రుద్దడం కాదు. అతడు నిజంగా విద్యార్థి మనస్సుకు శిక్షణను ఇవ్వడు. అతడు కేవలం విద్యార్థికి అతని జ్ఞానోపకరణాలను ఏ విధంగా పరిపూర్ణత కావించ వచ్చనే దానిని మాత్రమే చూపిస్తాడు. ఆ ప్రక్రియలో అతనికి సహాయం చేసి, ప్రోత్సహిస్తాడు. అతడు అతనికి జ్ఞానాన్ని అందించడు, అతడికి తనంత తానుగా జ్ఞానసముపార్జన ఏ విధంగా చేయవచ్చో చూపిస్తాడు. అతడి అంతరంగ జ్ఞానాన్ని బయటకు రప్పించడు. అతడు కేవలం అది ఎక్కడ ఉన్నదో, దానిని బయటకు రప్పించటానికి అతడు ఏ విధంగా అభ్యాసంతో అలవాటుగా చేయగలడో దానిని మాత్రమే చూపిస్తాడు....

రెండవ ప్రధాన సూత్రం, మనస్సును దాని స్వీయవృద్ధి కోసం సంప్రదించడం. తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుడు తాము కోరుకొన్న విధంగా రూపుదిద్దడానికి పిల్లవానిని తమ భావన ప్రకారం అదే పనిగా శ్రమించేటట్లు చేయడమనేది ఆటవికమైన, అజ్ఞానమైన మూఢవిశ్వాసం. అతడు తనంత తానుగా అతని సొంత ప్రకృతికి అనుగుణంగా విస్తరించుకోవటానికి అతడిని తప్పక ప్రేరేపించవలసి ఉంటుంది. తన పుత్రుడు తప్పకుండా ప్రత్యేక లక్షణాలతో, సామర్థ్యాలతో, భావాలతో, అభివృద్ధి చెందాలని, లేదా ముందస్తుగానే నిర్ధారించుకొన్న జీవనోపాధికి సంసిద్ధమవాలని ముందుగానే సమాయత్తతపరచడం కంటే అధికతరమైన తప్పు మరొకటుండదు. ప్రకృతిని దాని సొంత ధర్మాన్ని త్యజించడానికి బలవంతం చేయడం దానికి శాశ్వతమైన హాని కలిగించడమే, దాని వృద్ధిని ఛిన్నాభిన్నం చేసి, దాని పరిపూర్ణతను

మలచబడితే గనక అధిక శాతం కృశించిపోతారు, జ్ఞానశూన్యు లవుతారు. మానవజాతి ఒక ప్రత్యేక దేశానికి, యుగానికి, సమాజానికి చెందినవారై ఉండటమమేది, గతానికి చెందిన బిడ్డలై ఉండటం, వర్తమానాన్ని వశం చేసుకున్నవారై, భవిష్య సృష్టికర్తలు కావడమనేది భగవంతుడు మానవజాతికి చేసిన అమరిక. గతం మన పునాది, వర్త మానం మన సామగ్రి, భవిష్యత్తు మన ధ్యేయం, పరాకాష్ఠ. జాతీయ వ్యవస్థా విద్యవిధానంలో ప్రతిదానికీ దానికి అర్హ మైన, సహజమైన స్థానం తప్పకుండా ఉండి తీరాలి.

*

విద్య సంపూర్ణం కావాలంటే దానికి తప్పక మానవ అస్తిత్వానికి సంబంధించిన ఐదు ప్రధాన కార్యకలాపాలకు అనుగుణమైన ఐదు ప్రధాన దృక్పథాలు ఉండాలి: భౌతికం, ప్రాణికం, మానసికం, చైత్యం, ఆధ్యాత్మికం. సర్వ సాధారణంగా, ఐదు దశలు వ్యక్తి వృద్ధిని, క్రమానుగతంగా ఒకదాని తరువాత మరొకటిగా అనుసరిస్తాయి; ఇవి ఉన్నప్పటికీ, దానర్థం అవి ఒకదాని స్థానాన్ని మరొకటి ఆక్రమించాలని కాదు, కాని జీవితం చిట్టచివరి వరకు ఒకటి మరొక దానిని పూర్తి చేస్తూ అన్నీ తప్పక కొన సాగాలని.

CWSA 1:384-85

పిల్లవానికి శిక్షణ నివ్వటానిక తనకు తాను శిక్షణ పొందాలి.

చాలామంది తల్లిదండ్రులు, అనేక కారణాల మూలంగా, పిల్లలకు అందించవలసిన నిజమైన విద్యాబోధన విషయంగా ఎక్కువగా ఎటువంటి ఆలోచననూ చేయరు. వారు శిశువును ప్రపంచంలోనికి తీసుకువచ్చిన తరువాత, అతనికి ఆహారమిచ్చి, అతని భౌతిక అవసరాలను సంతృప్తిపరచి, కొంత హెచ్చుతగ్గులతో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూడటంతో వారి కర్తవ్యమును వారు సంపూర్తిగా నెరవేర్చా మనుకుం టారు. తరువాత అతనిని పాఠశాలకు పంపి, అతని విద్యాబుద్ధులకు సంబంధించిన బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగిస్తారు. కొంతమంది ఇతర తల్లిదండ్రు లుంటారు. వారికి వారి పిల్లలు తప్పక చదువుకోవాలని తెలుసు, దాని కోసం వారు తాము చేయగలిగిన ప్రయత్నమంతా చేస్తారు. వారిలో కూడా చాలా కొద్దిమందికే, చాలా పట్టుదలతో, చిత్తశుద్ధితో ఉన్నవారికి మాత్రమే, మొదటగా కావలసినదేమిటో వారికి



శ్రీఅరవిందుల స్మారక సభ (శ్రీఅరవిందో మెమోరియల్ కన్వెన్షన్) ప్రారంభ సందేశం

శ్రీఅరవిందులు మన మధ్యనే ఉన్నారు. ఆయన తన సృజనాత్మక ప్రతిభయొక్క మొత్తం ఆధిపత్యశక్తితో విశ్వవిద్యాలయ కేంద్ర నిర్మాణానికి అధ్యక్షత వహిస్తున్నారు. భూమిపై కొత్త కాంతిని, శక్తిని, జీవితాన్ని అభివ్యక్తం చేస్తూ ఈనాటి శ్రేష్ఠజనులను పరివర్తన చేయబోయే అతిమానస ప్రకాశాన్ని అందుకోవటానికి భవిష్య మానవజాతిని తయారుచేయటానికి ఇది అత్యుత్తమమైన సాధనంగా అనేక సంవత్సరాలుగా ఆయన తలంచుతూ వచ్చారు. ఆయన ఎంతగానో ఆదరించేటటువంటి ఆదర్శాల లోని ఒక దానిని సాక్షాత్కరించుకొనే ఉద్దేశంతో సమావేశమవుతున్న ఈ సభను నేను ఆయనకు బదులుగా ప్రారంభిస్తున్నాను.

24 ఏప్రియల్ 1951 అనువాదం; డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

త్రణ కోల్పోకూడదంటే, తానెప్పుడూ వారి పట్ల తన మానసిక నియంత్రణను కోల్పోకూడదు; "మొరటైన ఆట ఏడుపుతో ముగుస్తుంది" అని వారితో చెప్పే హక్కు ఉండాలంటే, అతడు వారెవరిమీదా ఎన్నడూ చేయి నెత్తకూడదు.

ఇవి ప్రాథమికమైన, ముందస్తు విషయాలు. వీటిని పాఠశాల లన్నింటిలో మినహాయింపనేది లేకుండా తప్పకుండా ఆచరించి తీరాలి.

CWM 12:10

మానవ అధికారం ఒక లాంఛనం

చూడు, ఒక వ్యక్తి మానవీయ అధికారం గలవాడిగా, కుటుంబంపై అధికారం గల తండ్రిలా, ఒక బోధకుడిగా, ఒక రాష్ట్రాధికారిగా నుండటం అంతా లాంఛన ప్రాయమే. వారికి నిజంగా అధికారం లేదు, అధికారం వారికి ఇవ్వబడింది. వారు సామాజిక జీవితంలో సమర్థవంతంగా తమ పాత్రను సుసంపన్నం చేయడం కోసం, ఇప్పుడున్న విధంగా, అనగా, అనృతం మీద స్థాపించబడిన ఒక సామాజిక జీవితం, ఏ మాత్రం సత్యం మీద కాకుండా. కారణం, సత్యం అంటే ఐక్యత, కాని సమాజం విభజన మీద స్థాపించబడింది. కొంతమంది వారి పాత్రను పోషిస్తారు, వారు చేయ వలసిన పనిని నెరవేరుస్తారు, వారి ప్రతీకను నిరూపించు కుంటారు, కొంత హెచ్చు తగ్గులతో — ఎవరూ దోషరహితులు కాదు, ఈ ప్రపంచంలో అంతా కలగాపులగం. కాని ఎవరైతే తమ పాత్రను తీవ్రంగా పరిగణిస్తారో, దానిని సాధ్యమైనంత నిజాయి తీతో పోషించే ప్రయత్నం చేస్తారో, వారు బహుశా సాధారణ మానవునికంటె తమ పాత్రను ఇంకా ఎక్కువ వాస్తవంగా సమర్థవంతంగా పోషించటానికి ప్రేరణలు అందుకోవచ్చు. మార్కులు ఇచ్చే ఉపాధ్యాయుడు తన మనస్సులో తనకు తాను దివ్యసత్యానికి ప్రతినిధిని అని అనుకొంటే, అతడు నిరంతరం దివ్యేచ్ఛ శ్రుతిలో ఉండటానికి, తనకది సాధ్యమైనంత రీతిలో, తగినంత శ్రమ తీసుకొంటే, అది చాలా ప్రయోజనకారిగా ఉంటుంది; కారణం, సాధారణ ఉపాధ్యాయుడు తన వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాల ప్రకారంగా పని చేస్తుంటాడు — అతడికి ఏది ఇష్టం లేదో, ఏది ఇష్టం ఉందో మొదలైనవి — అతడు అంతటా సర్వసాధారణంగా ఉండే టటువంటి అనృతానికి చెందినవాడు, కాని మార్కులు ఇచ్చే సమయంలో, ఉపా ధ్యాయుడు గనక, చిత్తశుద్ధితో తన అల్ప సంకుచిత చైతన్యానికంటే ఎక్కువ

తెలుసు. పిల్లవానికి శిక్షణ నివ్వటానికి తామే శిక్షణ పొందాలని, తమకు తాము ఎరుకతో, ప్రవీణులై ఉండాలని, ఆ విధంగా ఎన్నటికీ పిల్లవానికి చెడ్డ ఉదాహరణ కాకుండా ఉండాలని వారికి తెలుసు. కారణం అన్నింటికంటె ఉదాహరణ ద్వారానే విద్యాబోధన సమర్థవంత మవుతుంది. తాము బోధించేదానికి తాము ఉదాహరణగా నిలబడకపోతే, మంచిమాటలు చెప్పటం, పిల్లవానికి వివేకవంతమైన సలహా నివ్వటం అనేది చాలా తక్కువ ప్రభావం కలిగన దవుతుంది. చిత్తశుద్ధి, నిజాయితీ, ముక్కు సూటిదనం, ధైర్యం, స్వప్రయజనాపేక్ష లేకపోవటం, నిస్వార్థత, శాంతం, సహనశీలత, పట్టుదల, ప్రశాంతత, నిశ్చలత్వం, ఆత్మనియంత్రణ అనేవన్నీ చక్కని ఉపన్యాసాల కంటే, ఉదాహరణ ద్వారా అత్యుత్తమంగా బోధించవచ్చు. తల్లిదండ్రులకు చాలా ఉన్నతమైన ఆదర్శాలుంటాయి, ఎల్లప్పుడూ దాని ప్రకారం ప్రవర్తిస్తూ ఉంటారు, నెమ్మది నెమ్మదిగా మీ చిన్నపిల్లవాడు ఆ ఆదర్శాన్ని తనలో ప్రతిఫలించటాన్నీ, అప్రయత్నంగా తనకు తానే మీరు చూడదలచుకొన్న లక్ష్యాన్ని అతని స్వభావం వ్యక్తీకరించడాన్నీ మీరు చూస్తారు. పూర్తిగా సహజంగానే పిల్లవానికి తన తల్లి దండ్రులంటే గౌరవము, మెప్పు ఉంటాయి; వారు పూర్తిగా పనికిమాలిన వారైతే తప్ప, వారు పిల్లవానికి ఎల్లప్పుడూ దేవతల లాగానే కనపడుతూ, వారిని తాను ఎంత బాగా అనుకరించగలడో అంత బాగానూ అనుకరించే ప్రయత్నం చేస్తాడు.

CWM 12:9-10

ఉదాహరణే అత్యుత్తమ ఉపాధ్యాయుడు

ఉదాహరణయే అత్యంత శక్తిమంతమైన గురువు. నీవు అనువర్తించలేని క్రమ శిక్షణను పాటించమని పిల్లవానిని ఎన్నడూ గట్టిగా కోరవద్దు. ప్రశాంతత, సమత్వం, సరైన క్రమం, పద్ధతి, అనవసరమైన మాటలు మాట్లాటకుండా ఉండటమనే వాటిని ఉపాధ్యాయుడు నిరంతరం పాటిస్తూ, కావాలనుకొంటే వాటిని అతడు వారి మనస్సుల లోకి ఎక్కించవచ్చు.

ఉపాధ్యాయుడు ఎల్లప్పుడూ సమయ నియంత్రణను పాటిస్తూ, ఎల్లప్పుడూ సక్రమమైన వేషధారణతో, తరగతి మొదలవటానికి కొన్ని నిమిషాలు ముందుగానే రావాలి. అన్నింటినీ మించి, విద్యార్థులు అబద్ధం చెప్పకుండా ఉండాలంటే, అతడు తనకు తానెప్పుడూ అబద్ధమాడకూడదు; విద్యార్థు లెప్పుడూ వారి మానసిక నియం

గురువులో అనుభూతి నొందితే, వారు నిన్ను విధేయతతో ఆలకిస్తారు. ప్రతి ఒక్కరికి చేటు కలిగించే ధోరణి అయినటువంటి, ఒక రోజు నీవు మంచి మానసిక స్థితిలో ఉండటం, మరుసటి రోజు ఉండకపోవటం అనేది జరుగుతుంటే గనక అటువంటిది నీకు దొరకదు.

ఒక నవ్య తలంపుకు ఒక నవీన విద్యాకేంద్రం

ఒక నవ్యతలంపు ఒక నవీన విద్యాకేంద్రాన్ని సూచిస్తుంది.

మన విశ్వవిద్యాలయాలలో ప్రాబల్యంలో ఉన్న వ్యవస్థ మనిషి మనస్తత్వాన్ని విస్మరిస్తున్నది, అది విషయాలను చిన్న చిన్న పొట్లాలలో జాగ్రత్తగా కచ్చేరిలలో పాటించే పాలనా నియమావళి పట్టికతో కట్టి ప్రయాసతో మనస్సును బాగా దట్టించి వేస్తుంది, ఈ విధంగా దట్టించివేసే పద్ధతులను వాడటం జరిగితే, అది వేటి ద్వారానైతే మనిషి ఇముడ్చుకొని, సృజన చేస్తూ, మేథ, మనుష్యత్వం, బలశక్తులలో వృద్ధి పొందుతూ ఉంటాడో, అటువంటి ప్రావీణ్యాలనూ, పనిముట్లనూ నశింప జేయడంగాని లేదా కృశింప జేయడంగాని చేస్తుంది.

CWSA 1:368

...ఈ దేశంలో విద్యను కేవలం ఒక కథాభాగంగా మాత్రమే పరిగణించే చాలా మితిమీరిన ధోరణి ఉంది, ఒకసారి డిగ్రీ పూర్తయిపోతే, అది ముగిసిపోయినట్లే ననేది. కాని విశ్వవిద్యాలయం ఒక మనిషి విద్య పూర్తయిందని అనే సాహసానికి ఒడిగట్టబోదు లేదా ఒడిగట్టదు; అది కేవలం కొంత సామగ్రిని అతని చేతికిస్తుంది లేదా అతను నడవటానికి కొన్ని దారులను సూచిస్తుంది, అతడితో అంటుంది, — "ఇదిగో, ఈ సామగ్రిని నీ చేతులలో పెడుతున్నాను, నీ సామర్థ్యం మేరకు వాటిని వినియోగించుకోవడం నీ చేతులలో ఉంది."; — లేదా — "ఈ దారులలో ప్రయాణించటానికి నిన్ను సమాయత్తం చేశాను; చివరి వరకు వాటిలో నడవటం అనేది నీవే చేయాలి, వాటిలో నీ విజయం, ప్రపంచం ముందు నన్ను యోగ్యమైన దానినిగా ప్రమాణపూర్వకంగా నిలబెట్టుంది."

అందువలన మీ భవిష్య జీవితంలో ఈ విషయాలు గుర్తు పెట్టుకోమని అడుగుతున్నాను. కాలేజి శిక్షణ సామర్థ్యాలు ఇక ఏ మాత్రం అవసరం లేదని వాటిని వదలివేయ కూడదు, కాని, మీ దారులలో ఉత్కృష్టతకు, గొప్పతనం కోసమూ శ్రమించాలి,

లోతైన సత్యానికి సామరస్యతతో తనను తాను ఉంచుకుంటే, అతడు ఈ సత్యానికి మధ్యవర్తిగా పని చేయగలడు, అదే విధంగా విద్యార్థులను వారి అంతరంగంలో ఉన్న వారి సత్యంతో ఎరుకలోకి రావటానికి వారికి సహాయం చేసిన వాడవుతాడు. *CWM 4:92-93*

విద్య ఒక పౌరోహిత్యం

నీకు చెప్పదలచుకొన్న వాటిలో కచ్చితంగా ఇది ఒకటి: విద్య ఒక పౌరోహిత్యం; బోధన ఒక పౌరోహిత్యం, ఒక రాష్ట్రానికి ముఖ్య అధికారిగా ఉండటం ఒక పౌరోహిత్యం. అటువంటప్పుడు, ఈ పాత్రను సంపూర్ణంగా పోషించేవారు దానిని అత్యున్నత రీతిలోనూ, అత్యంత సరియైన విధంగానూ సుసంపన్నం కావించాలని ఆకాంక్షిస్తే, ప్రపంచంయొక్క సర్వసాధారణ స్థితి ఇంకా మెరుగ్గా ఉంటుంది. దురదృష్టవశాత్తు, చాలామంది దీని గురించి ఎన్నడు ఎంతమాత్రమూ ఆలోచించరు, ఏదో ఒక విధంగా వారు తమ పాత్రను పోషిస్తారు — కేవలం ధనం సంపాదించడానికి మాత్రమే పనిచేసే వారి గురించి అసలు మాట్లాడనే అక్కర లేదు, కాని ఈ విషయంలో వారి కార్యకలాపాలు, సహజంగానే చాలా మటుకు అవినీతిమయం. ఆశ్రమం స్థాపించడానికి ఇదే నా అసలైన మొట్టమొదటి ప్రాతిపదిక: ఇక్కడ చేసే పని దైవార్పణంగా నుండాలని, ఒకరు తన ప్రకృతి, తన చిత్తవృత్తి ప్రవాహంలో తనకు తాను కొట్టుకుపోవడాన్ని అనుమతించడానికి బదులుగా, ఒకరు తప్పకుండా నిరంతరం తన మనస్సులో తాను పరమోత్కృష్ట జ్ఞానానికి, పరమోత్కృష్ట దివ్యసత్యానికి, పరమోత్కృష్ట దివ్యధర్మానికి ప్రతినిధిననే అనుభూతిని నింపుకుని, ఒకరు తప్పక దానిని అత్యంత నిజాయితీతో, అత్యంత చిత్తుశుద్ధితో తనకు సాధ్యమైనంత రీతిలో అమలుపరచాలి. అప్పుడు ఒకరు తమకు తాము గొప్ప ప్రగతిని పొందుతారు, ఇతరులను కూడా పురోగమించేటట్లు చేయగలుగుతారు. అంతే కాకుండా, ఒకరు గౌరవించబడతారు, తరగతిలో ఇక ఎటువంటి క్రమశిక్షణారాహిత్యమూ ఉండదు, కారణం, ప్రతి మానవ అస్తిత్వంలోను, నిజమైన గొప్పతనాన్ని గుర్తించి, దాని ముందు తలవంచేది ఏదో ఉంటుంది. మిక్కిలి చెడ్డ నేరస్థులు కూడా ఒక ఉదారమైన, నిరాసక్తమైన పనిని మెచ్చుకోగల సమర్థులే. అందువలన పిల్లలు సత్యానికి అనుగుణంగా పనిచేసే ఇటువంటి గాఢమైన ఆకాంక్షను ఒక ఉపాధ్యాయుడిలో, ఒక పాఠశాల

ఈ పిల్లలు అక్కడ ఉంటారు. ఈ దివ్యకార్యములో ఈ రోజు ఎవరైతే సహకరిస్తున్నారో వారు ఇంతటి అరుదైన కార్యసాధనలో పాలుపంచుకున్నందుకు ఆనందించి గర్వ పడతారు.

CWM 12;111-12 శ్రీమాత

చైతన్యం కొరకు ఒక నూతన విద్య – దాని వాస్తవిక ప్రయోజనం, లక్ష్యం

ప్రశ్న: మన విద్యా కేంద్రము యొక్క వాస్తవిక ప్రయోజనం, లక్ష్యం ఏమిటి? అది శ్రీఅరవిందుల రచనలు బోధించుట కొరకా? ఇవి మాత్రమేనా? సంపూర్ణ రచనలనా లేక కొన్ని మాత్రమేనా? లేక శ్రీమాతారవిందుల రచనలు చదవడానికి విద్యార్థులను తయారు చెయ్యడమా? ఇది ఆశ్రమ జీవితం కొరకు వాళ్లని తయారుచెయ్యటానికా లేక బాహ్యాజగత్తులోని వృత్తి ఉద్యోగాల కొరకు కూడానా?

సమా: ఈ రచనలను లేక ఇతర రచనలను చదవడానికి తయారు చేయడమన్నది ఇక్కడ ప్రశ్న కాదు. అట్టి రచనలను చదవగల సమర్థత గలవారిని సాధారణ మానవ సహజ ఆలోచన, ఆచరణా సరళి నుండి విముక్తులను గావించడం; ఇక్కడ నున్న వారికి సాధారణ మానవులు ఆలోచించే తీరు, ఆచరణ విధానానికి గల బానిసత్వం నుండి విడుదల కల్పించడానికి అన్ని అవకాశాలను కల్పించడం; వినగోరే వారికి శ్రీఅరవిందులు బోధించిన జీవన విధానం, నిజమైన మానవజీవిగా ఎదగగలిగే మార్గం అనబడు వేరొక యదార్థమైన జీవన విధానం ఒకటున్నదని బోధించటం; ఇక్కడి విద్యాబోధన లక్ష్యం పిల్లలను అట్టి జీవితం గడపటానికి తయారు చేయడం.

సగటు మానవ జీవన విధానాలు, ఆలోచనలు ఉన్న మిగతా వారందరి కోసం ఈ విశాలమైన ప్రపంచంలో ప్రతి ఒక్కరికి చోటు ఉంది. మనకి కావలసింది సంఖ్య కాదు, ఎంపిక; మనకి కావలసింది తెలివైన విద్యార్థులు కాదు, జీవంతో తొణికిసలాడే అంతరాత్మలు.

CWM 12:117-18

మీ పేరుప్రఖ్యాతుల ద్వారా మీ సామర్థ్యాలను మొట్టమొదట పెంచి పోషించిన గృహానికి తళతళలాడే కాంతినీ, మీ మేధకు క్రమపద్ధతిలో సమకూర్చిపెట్టి, మనుషులుగా తీర్చిదిద్ది, మీరు ప్రపంచానికి యోగ్యులుగా ఉండగలిగినటువంటి సామాజిక జీవితాన్ని ఇవ్వటానికి శ్రమించినటువంటి దాని జ్ఞాపకాలను ప్రేమతో పదిల పరచుకోవాలి. చిట్టచివరిగా నేను మిమ్ములను రాబోయే కాలంలో మీరు దానితో తెగతెంపులు చేసుకోవద్దని, కాని, ఒక వేళ, మీరు దూరంగా ఉంటే, దాని పూర్వ విద్యార్థులను కలసినప్పుడు సోదరప్రేమతో వారిని ఆహ్వానించాలని, ఒక వేళ మీరు దగ్గరలో ఉంటే, దానితో సంబంధం కలిగి ఉండాలని, మీకు, దాని భవిష్య విద్యార్థులకూ మధ్య వయస్సును పరిగణించవద్దని, కాని వారితో కలసి ఉండమని, ఇటువంటి సామాజిక సమావేశాల వంటి సందర్భాలలో విచ్చేసి, గతంలో అది మీకు చేసినదాని కంతటికీ మీ కృతజ్ఞతలను మీ చేతల ద్వారా నిరూపించమని అడుగుతున్నాను.

CWSA 1:356

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీఅరవిందుల అంతర్రాష్ట్రీయ విద్యాకేంద్రముయొక్క చిహ్నము — దాని ప్రాముఖ్యత

శ్రీఅరవిందుల ప్రగతిశీల కార్యప్రణాళికలోని ఒక ముఖ్యమైన నూతన అంశం ప్రపంచమంతటా ఉన్న విద్యార్థిలోకానికై పుదుచ్చేరిలో అంతర్రాష్ట్రీయ విశ్వవిద్యాలయ కేంద్రాన్ని స్థాపించడం.

*

ఇక్కడ నెలకొల్పబడిన ఈ విశ్వవిద్యాలయము, పృథ్విపై అతి గొప్ప జ్ఞానపీఠంగా రూపొందుతుందనేది నాకు నిశ్చయమని ధృఢ నమ్మకం కలిగి ఉండటంలో నాకు మనసులో ఇసుమంతయు సందేహము లేదు. అందుకు బహుశా 50 సంవత్సరాలు పట్టవచ్చు లేదా 100 సంవత్సరాలు పట్టవచ్చు. నేనక్కడ ఉంటానా అని మీరు సందేహించవచ్చు. నేను అక్కడ ఉన్నా లేకున్నా, నా పనిని నడిపించడానికి నా

సమా: సుమారు నూరు సంవత్సరముల నుండి మానవజాతి ఒక వ్యాధితో బాధపడుతోంది. అది అత్యధికముగా వ్యాపిస్తూ ప్రస్తుతం ఒక పతాక స్థాయికి చేరుకుంది. దానిని మనం 'ఉపయోగితావాదము' అని పిలువవచ్చు. మనుషులు, వస్తువులు, పరిస్థితులు, కార్యకలాపాలు అన్నీ కేవలం ఈ దృష్టితోనే చూడబడి విలువ కట్టబడుతున్నట్లనిపిస్తుంది. దేనికైనా ప్రయోజనముంటే తప్ప దానికి విలువ ఉండదు. ఉపయోగపడేది నిశ్చయంగా ఉపయోగపడని దానికంటె ఉన్నతమైనది. కాని మొదట మనం దేనిని ఉపయోగపడేది అని అనుకుంటామో దానిని నిశ్చయించాలి. ఎవరికి, దేనికి, ఎందుకోసం ఉపయోగపడుతుంది అని నిర్ధారించాలి.

నాగరికులమని అనుకునే జాతులు ధనాన్ని ఏది ఎక్కువగా ఆకర్షిస్తుందో, సంపాదిస్తుందో లేక ఉత్పత్తి చేస్తుందో దానిని ఉపయోగకారి అని భావిస్తాయి. ఆర్థిక దృక్పథంతోనే ప్రతీదీ నిర్ణయించబడి, వెల కట్టబడుతోంది. దానినే నేను ఉపయోగితావాదము అంటాను. ఈ జబ్బు తీవ్రమగు అంటువ్యాధి, ఎందుకనగా చివరకి పిల్లలు కూడా దానికి అతీతులు కారు. సౌందర్యం, గొప్పతనం, సంపూర్ణత్వం గూర్చి కలలు గనవలసిన వయస్సులో సాధారణ తెలివితేటలకు ఆ కలలు ఉన్నతమైనవిగా కనిపించవచ్చు, కానీ అవి సాధారణ మాంద్యత కన్నా ఎంతో ఉపయుక్తమైనవి. పిల్లలు ఇప్పుడు ధనం గురించి కలలు కని దానిని ఎలా సంపాదించడమా అని ఆందోళన చెందుతున్నారు.

కనుక వారు వారి చదువుల గురించి ఆలోచించినప్పుడు, వారు వారికి ఏది ఉపయోగపడుతుంది అనేదాని గురించి ఎక్కువ ఆలోచిస్తున్నారు, వారు ఎదిగినప్పుడు అపారమైన ధనం సంపాదించుకో గలుగుతారు. వారికి అత్యంత ప్రధానమైన విషయం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి యోగ్యతా పత్రాలు, కితాబులు పొందడంలో సఫలీకృతులైతే మంచి పదవులు పొంది చాలా డబ్బు సంపాదించడ మవుతుంది.

వారి దృష్టిలో చదువుకి వేరే అవసరం, వేరే అభిరుచి లేదు.

CWM 12:351

జ్ఞాన సముపార్జనకై నేర్చుకోవడం, జీవితానికి, ప్రకృతికి సంబంధించిన రహస్యాలను తెలుసుకోవడానికై చదవడం, తన చేతనని పెంపొందించుకోవడానికై విద్య నార్జించడం, నిగ్రహశక్తి నలవరచుకుని తన మీద తాను ఆధిపత్యం వహించడానికి క్రమశిక్షణను అలవరచుకోవడం, తన బలహీనతల్ని, అసమర్థతలని, అజ్ఞానాన్ని జయించడం

విద్యయొక్క ఆదర్శం

మన విద్యాలయములోను, విశ్వవిద్యాయములోను శ్రీఅరవిందుల ఆదర్శాను సారం చదువు గరపబడుతుందని ప్రతిపాదించబడింది. కాని ఇప్పటి వరకు ఇక్కడ నేర్పబడుతున్న విద్య మిగతా పాఠశాలల్లో లాగే ఉంది. బోధనా కార్యక్రమం దానిని అనుసరించే ఉంది.

అవును, ఇంకొక విధంగా ఉండాలని నేను ఏళ్ల తరబడి పోరాడుతూనే ఉన్నాను. ఎప్పుడు మీరు, ఇక్కడ ఉన్న పిల్లలు — మీరు ఎప్పుడు ఎదిగి పెద్దవాళ్లయి బోధించడానికి సిద్ధపడతారో, అప్పుడు మీకు కొత్తవారికి సరియగు విధానంలో సరియైన విషయాన్ని బోధించే బాధ్యత అప్పచెప్ప బడుతుంది. ప్రస్తుతానికి ఇది విద్యార్థుల కోసం నడిపే పాఠశాల అనడం కన్నా, ఉపాధ్యాయుల కొరకు ఉద్దేశింపబడిన విద్యాలయము అనవచ్చు! కావలసిందేమిటంటే అందరికీ తెలిసినది నేర్చుకోవడం ద్వారా మిమ్మల్ని మీరు తయారు చేసుకోవడం. ఎందుకంటే అందుకు ఒక ఆవశ్యకమైన కారణం ఉంది. అది గొప్పదేమీ కాదు, వివరణాత్మకమైనదీ కాదు, లేక చాలా లోతైనదీ కాదు, కాని సాధారణ మానవుని జ్ఞానానికి సంబంధించిన అవసరమైన మూలమది. ఒకమారు మీకు అది లభించి, దానితో పాటు ఇక్కడ ఉన్న ప్రభావంతో లబ్ధి పొంది, ఆ కోణంలో, ఆ దృష్టితో అనగా సత్యమైన జీవన దృక్కోణంలో చూడగలిగేటంతగా చదివి అర్థం చేసుకోగలిగి మీకు అదంతా తెలిసినప్పుడు బయట నుండి వచ్చే విద్యార్థులకు మీరు నేర్చుకున్నది బోధించమని ఆదేశించబడతారు. అది పనిలో ఒక భాగము. ఎప్పుడో ఒకసారి చోటు చేసుకొనే ఆక్షేపణలు మినహా సాధారణ సిద్ధాంతాల ననుసరించి బోధన గరపబడుతుందన్నది నిజం. నాకు అది తెలుసు. కాని ఉదాహరణకు మరొక విధంగా చేయాలనుకుంటే ఉపయోగించే పుస్తకాలు, ఇక్కడ ఎంపిక చేయబడిన భాగాలతో తయారు చేయబడాలి.

*

ఉపయోగితావాద మనబడే జాడ్యము

ప్రశ్న: విద్యా కేంద్రముయొక్క విద్యార్థులకు యోగ్యతా పత్రములు ఎందుకు ఈయరు?

కనుక ప్రతి ఒక్కరు వారి వ్యక్తిత్వ నిర్మాణానికి అవసరమగు పూర్తి అనుభవం అంచెలంచెలుగా తమకు తామే సంపాదించు కోవాలంటే వారి జీవితం ప్రారంభించ డానికి ముందే ముగిసిపోతుంది.

శతాబ్దాలుగా సంపాదించుకున్న అనుభవంతో ఇలా చెప్తారు, "సరే, మీరు త్వరగా వెళ్లాలనుకుంటే, శతాబ్దాలుగా ఏదయితే నేర్చుకోబడిందో దానిని కొన్ని సంవత్సరాలలోనే తెలుసుకోవాలని ఉంటే, ఇది చెయ్యండి!" చదవండి, నేర్చుకోండి, అధ్యయనం చెయ్యండి, తరువాత ఈ భౌతిక క్షేత్రంలో ఆ పని ఈ విధంగా నిర్వ ర్తించాలని మీకు నేర్పబడుతుంది (చేష్టల ద్వారా) మీకు కొంచెం తెలిసిన తరువాత, మీకు తెలివితేట లుంటే మీ పద్ధతిని మీరు కనుక్కోగలరు. కాని మొదట ఎవరి కాళ్ల మీద వారు నిలబడి నడవడ మెలాగ అన్నది తెలుసుకోవాలి. ఒంటరిగా నేర్చుకోవడం చాలా కష్టం. ప్రతివారికి అది అలాగే ఉంటుంది. ఒకరు తమంతట తాము రూపొందిచు కోవాలి. కనుక చదువు చాలా అవసరం. అదీ విషయం!

CWM 6:261

శతాబ్దాల తరబడి సాగిన అభిలాష మనల్ని ఇక్కడకు తీసుకుని వచ్చింది

"ఇక్కడికి వచ్చినట్లు చేసింది మనలో ఏముంది?"

జవాబు మనలోనే ఉంది. బయట ఏమీ లేదు. మీరు లోతుగా అంతర్ముఖులైతే మీకు చాలా స్పష్టమైన జవాబు దొరుకుతుంది. (నిశ్శబ్దం) చాలా ఆసక్తికరమైన సమాధానం. మీరు అంతర్లీనులై, పూర్తిగా బాహ్య విషయాలనుండి దూరంగా చాలి నంత సంపూర్ణ, నిశ్శబ్దతలోనికి ప్రవేశిస్తే, నేను తరచుగా ప్రస్తావించే ఆ జ్యోతిని మీలో చూడ గలుగుతారు. ఈ జ్యోతిలో మీరు మీ భవితను చూడ గలుగుతారు. శతాబ్దాల తరబడి క్రమేణా కేంద్రీకృతమైన ఆకాంక్ష మిమ్మల్ని లెక్కలేనన్ని జన్మల ద్వారా 'సిద్ధి' అనే గొప్ప దినం దిశగా నడపడం చూస్తారు — వేల సంవత్సరాల నుండి జరుగుతున్న ఆ తయారీ తన తుది దశకు చేరడాన్ని, మీరు దీనిని కనుగొన డానికి ఎంతగానో అంతర్ముఖులు అయినందు వలన, మీ అసమర్థతలన్నీ, బలహీనత లన్నీ మీలో తిరస్కరించి అర్థం చేసుకో లేనివన్నీ, అవన్నీ — అది మీరు కాదని, అది కేవలం ప్రస్తుతానికి అవసరార్థం మీరు ధరించిన వస్త్రం లాంటిదని మీరు

కోసం, అత్యంత ఉదాత్తమైన, బ్రహ్మాండమైన, ఔదార్యంగల, మిక్కిలి సత్యమైనటు వంటి లక్ష్యం దిశగా పురోగమించే జీవితం కొరకు తనని తాను తయారు చేసుకోవడం... వాటిని గురించి వారు అసలు ఆలోచించరు, సరి కదా అవన్నీ ఊహాతీత విషయాలు అనుకుంటారు. వాళ్లకి కావలసినదంతా చాలా వ్యావహారికమైనది, ఎక్కువ ధనం ఎలా సంపాదించాలన్నది నేర్చుకోవడానికి తమని తాము తయారు చేసుకోవడమే.

ఈ వ్యాధి సోకిన పిల్లలకి ఆశ్రమ విద్యా కేంద్రంలో చోటు లేదు. ఈ విషయం వారికి స్పష్టంగా తెలియడం కోసమే వాళ్లని మేము అధికారికమైన ఏ పరీక్షలకి, పోటీలకి తయారుచెయ్యము, బాహ్యప్రపంచంలో వారికి ఉపయోగపడే ఏ యోగ్య తాపత్రాలు, కితాబులు ఇవ్వము.

ఒక ఉన్నతమైన మంచి జీవితాన్ని అభిలషించేవారిని, జ్ఞానానికి, పూర్ణత్వానికి ఆర్తి కలిగినవారిని, సత్యపూరితమైన అభ్యుదయ భవిష్యత్తుకై ఆశగా ఎదురు చూచే వారిని మాత్రమే మేము ఇక్కడ కావాలనుకుంటాము.

మిగతావారి కోసం ప్రపంచంలో కావలిసినంత స్థలముంది.

CWM 12:351-52

విద్యాభ్యాసం ఒక ప్రణాళికను సమకూరుస్తుంది

పాఠశాలకి మిమ్మల్ని పంపించడం, వ్యాయామాలు మీ చేత చేయించడం వగైరా మిమ్మల్ని వేధించి ఆనందించడానికని మీరు అనుకుంటున్నారా? ఓహ్, కాదు. అది మిమ్మల్ని మీరు మలచుకొనడానికి అనువైన ఒక ప్రాతిపదిక మనస్సులో ఏర్పడటం మీకు తప్పనిసరి కనుక. మీరు మీ ప్రత్యేకతను ఏర్పరచుకునే కార్యాన్ని, సంపూర్ణ పరిపూర్ణతను పొందే కార్యాన్ని మీ అంతట మీరుగా ఒక మూల ఒంటరిగా కూర్చుని స్వయంగా మీకు మీరుగా తయారవగల మంటే మిమ్మల్ని అడిగేదేమీ ఉండదు. కాని అది మీరు చెయ్యరు, చెయ్యలేరు. అలా చేసే పిల్లవాడు ఒక్కడు కూడా లేడు. అతనికి అది ఎలా చెయ్యాలో, ఎక్కడ మొదలుపెట్టాలో కూడా తెలియదు. ఒక పిల్లవానికి బ్రతకడ మెలాగో నేర్పకపోతే అతను బ్రతక లేడు, అతనికి ఏది ఎలా చెయ్యాలో తెలియదు, ఏదీ కూడా. నేను అసహ్యాకరమైన వివరాలను గురించి మాట్లాడాలనుకోవడం లేదు, కాని అతి చిన్న, సాధారణ ప్రాథమిక పనులని కూడా ఎలా చెయ్యాలో అతనికి నేర్పకపోతే అతను వాటిని సరియగు రీతిలో చెయ్యలేడు.

వుంటుంది. అంతే కాదు అది చాలా ముఖ్యమైన విషయం కూడా. అది బాహ్య చైతన్యాన్ని పూర్తిగా తప్పించుకుంటుంది. మీరు వెలుగు, అభిలాష, నిజమైన అవగాహన, ఆవశ్యకమైన పవిత్రత నిండిన చేతనాముద్రలో మునిగిపోతారు. మీరు కావాలనుకున్నా లేకపోయినా అది జరుగుతుంది. తమ బాహ్య చైతన్యంలో బంధీలై ఉన్నవారు సైతం నృధాగా నిదురపోలేరు

ఇచ్చట నిదురలో కూడ చాలా గణనీయమైన కార్యాచరణ ఉంది. కాబట్టి దాని ప్రభావం ఉంటుంది, అది స్పష్టంగా కనిపిస్తుంది. పూర్తిగా బయటనుండి వచ్చిన ఏమీ తెలియని వ్యక్తుల్ని నేను చూశాను (కేవలం వారు తమ జీవితాలను తమ పిల్లల కోసమే బ్రతికారు) సరే, ఈ బయటనుండి వచ్చిన అతిథుల, కేవలం వచ్చి పోయే, వారి అభిప్రాయం... వారు చాలా ఆశ్చర్యపోయారు! "కాని ఇక్కడ ఉన్న పిల్లల వంటివారిని మేమెక్కడా చూడలేదు". మనకు సంబంధించినంత వరకు, మనము దానికి అలవాటు పడ్డాము కదా? వారు తమకు తాము స్వాభావికంగా అలా ఉన్నారు. కాని చైతన్యంలో జాగృతి ఉంది, ఒక విధమైన అంతర్గత స్పందన, వికసనమొందుతున్నామన్న భావన, ఇంకెక్కడా లభించని ఆంతరిక స్వాతంత్ర్యము ఉన్నాయి. ఇక్కడకి వచ్చే కొంతమంది పిల్లల పెంపకం అత్యంత అద్భుతం — ఎంతో వినయంతో, ఎంతో చక్కని పెంపకం, మీకు వారు అలాగే జవాబు చెప్తారు. వారిని చూసిన మీకే మనిపిస్తుందంటే వెలుపల తుడిచి, బాగా మెరుగు పెట్టి తయారు చెయ్యబడి, కొంచెం ప్రాణముండి కూడా జవాబు చెప్పలేని చిన్న చిన్న మరబొమ్మలని

విద్యార్థుల ప్రార్థన

మేము ఆకాంక్షించే వీరయోధులుగా మమ్మలను తయారుచేయుము. కొనసాగాలని ప్రయత్నిస్తున్న గతానికి వ్యతిరేకంగా రాబోయే గొప్ప యుద్ధం లో విజయవంతముగా పోరాడి, నూతన విషయాలు ఆవిర్భవించినప్పుడు మేము వాటిని స్వీకరించుటకు సిద్ధమగుదుము గాక.

CWM 12:112 శ్రీమాత

భావానువాదం: డా. విజయలక్ష్మి

భావిస్తారు. కాని మీరు చెయ్యాలనుకున్నది చెయ్యడం కోసం, ఇన్నాళ్లు ఏది చెయ్యాలని మీరు ఉబలాట పడ్డారో అది చెయ్యడానికి కలిగిన అవకాశంతో లాభం పొందగల శక్తిని పొందడానికి మీరు క్రమేపి వెలుగుని, చేతనని, సత్యాన్ని ఆ బాహ్య వస్త్రింయొక్క నిగూఢమైన అంశాలలోనికి తీసుకుని వస్తే, మీరు ఇక్కడ ఎందుకు ఉన్నారన్నది మీరు బహుశా సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. మీరు దానిని అర్థం చేసుకోవడమే గాక దానిని ఆచరించవచ్చు కూడా. శతాబ్దాలుగా ఇది మీలో తయారు చెయ్యబడింది, దీనిలో కాదు (శ్రీమాత తమ ముంజేతి చర్మంపై గిచ్చుకుంటారు) ఇది పూర్తిగా కొత్తది, కదా?... కాని నీ నిజమైన నీలో.

శతాబ్దాలుగా అది ఈ అవకాశం కోసం ఎదురు చూస్తోంది.

అప్పుడు నువ్వు ఆ మహాద్భుతం లోనికి ప్రవేశిస్తావు. అది ఎంత మేరకు అసాధారణమై వున్నది నువ్వు చూస్తావు... ఇన్ని సంవత్సరాలుగా ఆశించిన విషయాలు, అంతగా ప్రార్థించిన విషయాలు, ఎంతగానో చేసిన ప్రయత్నాలు అవన్నీ నిజమయ్యే క్షణం అకస్మాత్తుగా వస్తుంది. ఎన్నో మహత్వ సంఘటనలు జరిగే క్షణమది. ఆ అవకాశాన్ని ఎవరూ వదులుకో కూడదు.

CWM 6:271-72

వాతావరణంయొక్క శక్తి

సంక్షిప్తంగా చెప్పాలంటే, చిన్నప్పటి నుండి ఇక్కడ పెరిగిన ఎవరో ఒకరు, అతి చిన్నవయస్సులోనే అంతః చేతనలో విషయాల అనుభూతిని పొందినవారు ఏది ఏమైనప్పటికి... అది ఒక గురుతును మిగిలిస్తుంది. ఏ ప్రభావం చూపకుండా అది ఊరికే పోదు: ఇక్కడ పెరిగిన పిల్లలను, బయటనుండి వచ్చే పిల్లల సరసన చూసినప్పుడు నిజంగా చాలా గొప్ప భేదం కనిపిస్తుంది. (బహుశా బయటకి కనిపించే యాంత్రికమైన శిక్షణలో కాకపోవచ్చు, కాని అర్థం చేసుకోవడంలో, తెలివితేటలలో, ఆంతరిక జాగృతిలో) చెప్పుకోదగిన తేడా ఉంది. కొత్తవారికి ఈ స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. పుస్తకాలకు అతీతమైన స్థితి ఇది, మీరు గమనించ లేదూ? స్వచ్ఛమైన వాతావరణంలో నివసిస్తూ, గుండె నిండా పరిశుభ్రమైన గాలిని పీల్చేవారికి, కలుషిత వాతావరణంలో ఊపిరి తీసుకున్న ప్రతిసారి విషపూరితమయ్యే వారికి మధ్యన ఉండే భేదమిది. చేతనాపరమైన దృష్టిలో కూడా ఈ విధంగానే

ప్రగతిలోని ఉద్దేశం దివ్యచేతనను స్వీకరించి దానిని తిరిగి ప్రకటించడానికై నీ సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసమని. నీ వంతుగా దీనిని నిన్ను నీవు ఒప్పించుకో గలిగితే సహజంగానే కార్యం ఎంతో మంచిగా, ఎంతో వేగంగా చేయబడుతుంది. నిజం చెప్పాలంటే, ఇది నాకు అత్యంత ప్రాథమికమైన దనిపిస్తుంది. అలా కాకపోతే ఈ విధంగా వ్యవస్థీకరించబడి ఏర్పాటు గావించబడిన ఆశ్రమంలో నీ ఉనికికి అర్థం లేదు. ఇక్కడ నీ వున్నది ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం. ఎందుకనగా వేరెక్కడా కనిపించని చేతనను, పురోగతిని అందుకోగల అవకాశం ఇక్కడ ఉంది. దీనిని పొందడానికి నిన్ను నీవు సిద్ధపరచుకోకపోతే నీ కందిన అవకాశాన్ని చేజేతులా జార విడుచుకుంటావు, *CWM 6:269*

సాధ్యమైనంత అత్యున్నత స్వేచ్ఛ నిచ్చే సూత్రం

> *ప్రశ్న: మీరన్నారు, మే మిక్కడ ఉన్నందున, మాకు అవసరమైనదంతా కలిగి ఉన్నందున, స్వేచ్ఛ ననుభవించడం మాకు సహజం అని. అయితే ఎందుకని ప్రయత్నం చేసే లక్షణం కూడా సహజంగానే అబ్బదు?*

సమా: ఎందుకంటే, శ్రీఅరవిందులు వ్రాసినట్లుగా, సామాన్య మానవుల భౌతిక స్వభావం తామసికం. అందువలన ప్రయత్నం చేయకపోవడం దాని సహజ లక్షణం. కానీ, ప్రాణికం ప్రయత్నిస్తుంది. అయితే, మామూలుగా అది ప్రయత్నించడం దాని స్వయంతృప్తి కోసం. అయినప్పటికి దానికి ప్రయత్నం చేయగల శక్తి ఉంది, కారణం అది దాని స్వభావం గనుక. నిజంగా, నీవు ఎటువంటి ప్రయత్నం చేయవని నేను అనలేను. నీవు అనేక విషయాలు గురించి ఎంతగానో ప్రయత్నిస్తుంటావు. అయితే అది నీకు ఇష్టమొచ్చినప్పుడు చేస్తావు లేదా ఏదో ఒక కారణంతో అది అవసరమని తోచినప్పుడు చేస్తావు. నీ ఉద్దేశం యోగం విషయంలో ఎడతెగని ప్రయత్నం చేయడం గురించి కదా? ఇక్కడ యోగం గురించి వచ్చినవారు కూడా ఉంటారు, కనీసం అందుకోసం వచ్చామనైనా అనుకుంటారు, గాని ఎక్కువగా ప్రయత్నం చేయరు, సమస్యలను తేలికగా తీసుకుంటారు. భౌతిక స్వభావాన్ని దాని ఇష్టాయిష్టాలకు దానిని వదిలేస్తే, స్వతస్సిద్ధంగా ఏ పనినైనా చేయడానికి పూనుకుంటుందని నే ననుకోను. దానికి కొంత శారీరక శ్రమ అవసరం. కానీ అది కొద్దిగానే ఉంటుంది. విద్యాభ్యాసంయొక్క మూలాలను పరిశీలిస్తే, అది స్వేచ్ఛను

— కాని అంతరంగంలో స్పందన కొరవడింది. ఇక్కడ అసాధారణమైన మర్యాదకి ఉదాహరణ ఇస్తున్నానని నే ననలేను! కాని ప్రజలనుకునే కొంచెం కొంచెం పాటి 'చెడు పెంపకం' అది. కాని అందులోను ఎంతో జీవకళ! అక్కడ జీవితంలోని ఒక చేతన స్పందిస్తున్నది. అన్నిటికంటె అత్యంత ప్రధానాంశ మది — దీని గురించి ఎవరూ మాట్లాడరు, ఎందుకంటే అది ఎవరైనా చెయ్యవలసింది, కాని మాట్లాడవలసిన విషయం కాదు. ఈ విషయం గురించి మాట్లాడే అవకాశం గల రోజు ఒకటి రావాలి. నిజానికి ఇన్ని సంవత్సరాలుగా మీరు ఇక్కడ ఉన్నప్పటికీ, నాకు అవకాశం కలగడం ఇది మొదటిసారి.

CWM 5:416-17 శ్రీమాత

అనువాదం: డా. విజయలక్ష్మి

నూతన మార్గము

ప్రశ్న: శ్రీమాతా, ఉదారణకు, వ్యాయామ పోటీలలో ఒకరు అధిక దూరం, అంతకు మించి మరింత దూరం దూకేందుకు ప్రయాస పడతారు, అయితే, దైవకార్యం ఎలా నిర్వహిస్తారు?

సమా: ఏమిటి? క్షమించాలి. దూరం దూకటం ఆనందం అనుభవించటం కోసం కాదు, శరీరం పనిచేసే తీరుని మెరుగుపరచడం ద్వారా అది దివ్యశక్తులను స్వీకరించి వాటిని తిరిగి ప్రకటించడం కోసం అనువైన ఉపకరణంగా రూపొందించడాని కని. అంతెందుకు, ప్రతి పని, ఇక్కడ చేసే ప్రతి పని, ఈ స్ఫూర్తితో చేయబడాలి. లేనట్లయితే నీ కందించబడిన అవకాశంతో, కల్పించబడిన పరిస్థితులతో కనీస ప్రయోజనం కూడా పొందలేవు. గతంలో ఒక రోజున నీకు వివరించాను దివ్యచేతన ఇక్కడ ఉన్నదని, అన్ని విషయాల్లోకి అది చొచ్చుక పోతున్నదని, అన్ని కదలికల్లో అది ప్రకటించబడటానికి ప్రయత్నిస్తున్నదని. అయితే నీవు చేస్తున్న ప్రయత్నం, నీవు సాధిస్తున్న

ఎవరిలోనైతే పురోగతి చెందాలనే అవసరం ఏర్పడి, అది వారి జీవితాన్ని సంస్కరించాలనే చేతన దృఢపడిందో, అట్టి వారిని గుర్తించి, ప్రోత్సహించడం ఈ పాఠశాల యొక్క ప్రయోజనం. ఇది మీకు తెలియాలు, అంతే కాదు, దానిని వెల్లడించడానికి జంకగూడదు.

CWM 17:306

చింతిస్తాడు, అశాంతికి లోనౌతాడు. ఇంత కన్నా మించిన శిక్షే వేరేమి కావాలి? కాబట్టి ఈ పరిణామా లన్నింటికి ఆంతరిక ఆధ్యాత్మికాభివృద్ధి పరంగా, బాహ్యా నిబంధనల ఫలితంగా కలిగినవాటి కన్నా, అపారమైన ఉన్నత విలువ ఉంటుంది.

CWM 6:431-32

స్వేచ్ఛ — క్రమశిక్షణ

ప్రశ్న: శ్రీమాతా, సాధారణంగా చదువుల్లో యోగ్యత కొరబడటానికి కారణం క్రీడలకు, శారీరక వ్యాయామానికి అధిక ప్రాధాన్యత నీయడం అని కొందరి అభిప్రాయం. ఇది నిజమా?

సమా: అలా అని ఎవరన్నారు? శారీరక వ్యాయామం ఇష్టపడని వారా? వయసు మళ్లిన, అవయవ పటుత్వ ముడిగిన, వ్యాయామం చేయలేని ఉపాధ్యాయులా? వీళ్లా? నేను పేర్లు అడగటం లేదు! మంచిది, నేనలా అనుకోను.

బులెటిన్ పత్రికలో శ్రీఅరవిందులు వ్రాసిన మొదటి వ్యాసం జ్ఞాపకముందా? అలా ప్రశ్నించిన వారందరికీ ఆయన కచ్చితమైన సమాధాన మిచ్చారు. యోగ్యత కొరవడటానిక వారు అనుకున్నది సరైన కారణం కాదు అని కచ్చితంగా చెప్పగలను. దానికి బదులు నా నమ్మిక ఏమంటే — తప్పంతా నా పైనే వేసుకుంటాను — మీకు అసాధారణమైన స్వేచ్ఛ ఈయబడిందని. ఓహ్! పిల్లలు ఇంత స్వేచ్ఛగా నుండగల ప్రదేశం ప్రపంచంలో మరెక్కడా లేదనుకుంటా. నిజానికి, అటువంటి స్వేచ్ఛను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవడం చాలా కష్టం.

ఏదేమైనా, ఈ ప్రయోగం ప్రయత్నించడం ప్రయోజనకర మనిపించింది. నీవు అది గ్రహించలేవు, ఎందుకనగా ఆ స్వేచ్ఛ లేనప్పుడు ఎలా ఉంటుందో నీకు తెలియదు. అది సహజమని నీకు అనిపిస్తుంది. కానీ వారి స్వేచ్ఛను వారు స్వయంగా ఎలా క్రమబద్ధీకరించుకోవాలో తెలుసుకోవడం చాలా కష్టం. అయినా, దానిని తెలుసు కోవడంలో కృతకృత్యుడ వైనట్లయితే, నీకు కావలసిన క్రమశిక్షణను నీవే సమకూర్చుకో గలిగితే — పరీక్షల్లో ఉత్తీర్ణుడవు కావాలనో, జీవనోపాధిని పొందాలనో, నీ ఉపాధ్యా యుణ్ణి సంతృప్తి పరచాలనో, బహుమతులు పొందాలనో కాదు, లేక పిల్లల కుండే చిన్న చిన్న సాధారణ కారణాలు, మందలించబడ కూడదని, శిక్షించబడ కూడదనే లాంటివి కాక ఉన్నతమైన కారణాల కోసం నిన్ను నీవు క్రమశిక్షణలో నుంచుకో గలి

వినియోగించే సూత్రమని తెలుస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే జీవితమంతా దాని కదలికలలో, అనగా నడవడిలో, సాధ్యమైనంత మేరకు స్వేచ్ఛను కలిగి యుండా లనే సిద్ధాంతంపై వ్యవస్థీకరించబడింది. అనగా నియమాలు, నిబంధనలు, చట్టాలు అతి కనిష్ట స్థాయికి చెందినవిగా నుండాలి. దీనిని నీవు తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచే విధానంతో పోలిస్తే, అనగా ఎడతెగకుండా, 'ఇది చేయొద్దు', 'అది చేయి' అనడంతో పోలిస్తే, నీకు తెలుసుగా, ఉత్తరువులు, నియమాలు మొదలైనవి, గణనీయ మైన వ్యత్యాసం కనిపిస్తుంది.

పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రతి చోటా ఇక్కడి కన్నా కఠినమైన నియమనిబంధన లుంటాయి. అయితే, నీవు అభివృద్ధి చెంది తీరాలి అనే నిబంధనను నీపై ఎవరూ విధించరు కాబట్టి నీకు ఇష్ట మనిపించినప్పుడు దాని కోసం పాటు పడతావు, లేనప్పుడు దాని జోలికి పోవు, విషయాలను వీలైనంత తేలికగా తీసుకుంటావు. కొంద రుంటారు — నేను ఇది గట్టిగా చెప్పను — ప్రయత్నం చేసేవారు కొంద రుంటారు, కాని వారు తమంత తాము, ఏ ఒత్తిడి లేకుండా ప్రయత్నిస్తారు. నిస్సంశయంగా, ఆధ్యాత్మిక దృష్టిలో ఇది చాలా మెరుగైన విధానం. ఎందుకనగా, పురోగతి చెందాలనే అవసరం నీలో నీకు స్వతస్సిద్ధంగా ఏర్పడింది కాబట్టి. అది అనాలోచితంగా ఏర్పడిన నిన్ను ముందుకు త్రోసే ప్రేరణ కాబట్టి, ఒక నియమంగా అది నీపై విధించబడలేదు కాబట్టి, ఈ పురోగతి ఒక ఆధ్యాత్మిక దృష్టిలో ఎంతో ఉన్నతమైనది. నీలో ఉన్నది ఏ దైతే పనులను చక్కగా నెరవేర్చాలని ప్రయత్నిస్తుందో, అది స్వతసిద్ధంగా చిత్తశుద్ధితో చేస్తుంది. అది ఏదో నీలో నుండి తనకు తానుగా పైకి ఉబికి వచ్చే ప్రేరణ; మంచిగా చేస్తే బహూకరించ బడతావని, లేనట్లయితే శిక్షించబడతావని ఎవరో వాగ్దానం చేసినందు వలన కాదు. మా పద్ధతి ఇటువంటి విధానాలపై ఆధార పడదు. ఏదో ఒక క్షణాన ఏదో జరిగి నీవు చేసిన ప్రయత్నం మెచ్చుకోబడిందనే భావన కలిగింది, కానీ నీవు ఆ ప్రయత్నం మెప్పును దృష్టిలో నుంచుకొని చేయలేదు. అనగా ఆ వాగ్దానాలు ముందుగా చేయబడ లేదు. ఇక్కడి పద్ధతి ఆ విధంగా నుండదు. సాధారణంగా విషయాలు ఎలాంటివి, ఎలా ఏర్పాటు చేయబడతాయి అంటే పని బాగా చేసినందు వలన కలిగే సంతృప్తి అన్నింటి కన్నా గొప్ప బహుమానంగా భావించ బడుతుంది. పని సక్రమంగా జరగకపోతే, ఒకరు తమను తాము శిక్షించు కుంటారు. ఏ విధంగా నంటే అతను దుఃఖపడతాడు, అసంతృప్తికి లోనవుతాడు,

వ్యక్తిగత అనుభవంతో నీకు చెప్పగలరు, "కాదు, ఈ విధంగా నుంటుంది లేదా ఆ విధంగా నుంటుంది, నీవు చేయాల్సింది ఇది, ప్రయత్నించాల్సింది అది," అని. కాబట్టి, సిద్ధాంతాలను, నియమాలను లేక ఆచరణాత్మకంగా జ్ఞానాన్ని బోధించి, వాటిని అర్థం చేసుకోమని నిన్ను బలవంతం చేసే కన్నా నీకు విషయాలను వివరించి, అవి భౌతికమైనవో, ఆధ్యాత్మికమైనవో అయినప్పటికీ, వారి శక్తి మేరకు, వారి అవగాహన పరిధి మేరకు నీకు సరైన సమాచార మీయడానికి వారు సిద్ధంగా నుంటారు.

CWM 8:183-84

స్వేచ్ఛను అర్థం చేసుకోవడం

ప్రశ్న: శ్రీమాతా, విద్యార్థికి పూర్తి స్వేచ్ఛ నీయాలని మీరన్నారు. కొందరు దానిని విద్యార్థి తనకేది ఇష్టమో దానిని చేయడానికి, తన ఇష్టానుసారం తరగతులకు హాజరు కావడానికి అనుకూలంగా నుండటం కోసం తరగతులను ముందస్తుగా నిర్ధారించబడ కూడదనే అర్థాన్నిస్తున్నారు. అట్టి పరిస్థితిలో నిర్ధారించబడిన సమయం ప్రకారం తరగతులను ఏర్పాటు చేయడం కష్టమవుతుంది. తరగతులను ఎలా నిర్వహించాలి?

సమా: అసలు సాధ్యపడదు. కానీ, విద్యార్థి తరగతికి హాజరు కావాలా లేదా అనే స్వేచ్ఛ అతని కుండాలని నేనెప్పుడు చెప్పాను?... క్షమించాలి, మీరు విషయాలను వక్రీకరించ కూడదు. నేను ఒకసారి చెప్పాను, మళ్లీ చెప్తున్నాను. ఒక వేళ విద్యార్థి ఒక పాఠ్యాంశం పట్ల విముఖత కనబరిస్తే, ఉదాహరణకు, అతనికి సాహిత్యం, కవితల పట్ల అభిరుచి ఉన్నదని, గణితం పట్ల లేదని నాతో అంటే, వీల్లేదు, గణితం తరగతికి నీవు వెళ్లాల్సిందే, తప్పదు అని నే ననలేను. కాని ఒక విద్యార్థి ఒక పాఠ్యాంశంపై శ్రద్ధ కనబరచి, ఆ తరగతికి వెళ్లాలని నిశ్చయించుకున్నట్లయితే, అతను దానిని అనుసరించడం, ఆ తరగతికి క్రమం తప్పకుండా వెళ్లడం, సక్రమంగా వ్యవహరించడం అతని ప్రాథమిక కర్తవ్యం. అది చేయలేకపోతే అతడు పాఠశాలకు వెళ్ళడానికే అర్హుడు కాడు. నేనెప్పుడూ ఎవరినీ తరగతులు నడుస్తున్న సమయాల్లో బయట తిరగడానికి గానీ, ఒక రోజు వచ్చి, మరునాడు రాకపోవడాన్ని గాని ప్రోత్సహించ లేదు, ఎప్పుడూ చేయలేదు. ఎందుకంటే, ఆవశ్యకమైన ఈ ప్రాథమిక క్రమశిక్షణకు కట్టుబడ లేకపోతే, అతడు తనపై తాను కనీస మాత్ర నియంత్రణను ఎప్పటికీ

గితే — ప్రతి ఒక్కరు వారిదైన క్రమశిక్షణను వారు పాటించగలరు, ఇతరుల దానిని పాటించ నవసరం లేదు — కేవలం ఆ పురోగతి చెందాలనే కోరికతో, నీ లోని ఔన్నత్యాన్ని వెలికి తీయాలనే ఆకాంక్షతో ఒక క్రమశిక్షణను పాటించితే... ఓహ్! పాఠశాలలోని సాధారణ క్రమశిక్షణ పాటించేవారి కన్నా ఎంతో మెరుగైన వాడి వవుతావు.

నేను ప్రయత్నించా లనుకున్నదని అదే. గుర్తుంచుకో. నేను విఫలమయ్యానని అనను. ఇట్టి అసాధారణ అవకాశంతో ప్రయోజన మెలా పొందాలో నీవు తెలుసుకో గలవనే గొప్ప ఆశ నాకు ఇంకా ఉంది. ఏమైనప్పటికీ నీవు తప్పకుండా కనుగొనా ల్సింది ఒకటుంది; అది అంతర్గత క్రమశిక్షణయొక్క ఆవశ్యకత. క్రమశిక్షణ లేకుండా నీవు ఏ గమ్యాన్ని చేరలేవు, సాధారణ మానవుడు జీవించే సాధారణ జీవితం కూడా గడపలేవు. కాని సామాన్య సమాజాలలో, సంస్థలలో పాటించబడే సాంప్రదాయక మైన క్రమశిక్షణకు మారు నీకుగా నీవు రూపొందించుకున్న క్రమశిక్షణను పాటించడం నేను ఇష్టపడతాను. సంపూర్ణతపై గల ప్రేమతో పాటు నీ స్వయం సంపూర్ణతపైన, నీ అస్తిత్వంయొక్క సంపూర్ణతపైన గల ఆసక్తితో నీవు నీ కోసం రూపొందించుకున్న క్రమశిక్షణను నీవు పాటించాలని నే నిప్పటికి కాంక్షిస్తాను.

కానీ, అది లేనప్పుడు... గమనించు, ఒకరు తన శరీరాన్ని తాను క్రమశిక్షణలో నుంచకపోతే అతడు కనీసం తన కాళ్లపై తాను నిలువలేడు, చంటిపిల్లాడిలా కాళ్లు చేతులతో నేలపై పాకుతాడు. నీవు ఏ పని కూడా చేయలేవు. నిన్ను నీవు క్రమశిక్షణలో నుంచుకోవడం నీ విధి. లేకపోతే నీవు సమాజంలో బ్రతుకలేవు, కనీసం జీవించలేవు, ఏకాకిగా ఒక అరణ్యంలో తప్ప. అప్పుడైనా కొనసాగగలవో లేదో నాకు తెలియదు. క్రమశిక్షణ ఎట్టి పరిస్థితులలోను ఆవశ్యకం. నీకీ విషయం ఎన్ని సార్లు చెప్పానో నాకు తెలియదు. సామాజిక, ఇతర సాంప్రదాయక కట్టుబాట్లు అంటే నాకు చెప్పలేని అయిష్టత. దాని అర్థం నీవు కట్టుబాట్లన్నింటినీ తిరస్కరించాలని కాదు. ప్రతి ఒక్కరు వారి స్వంత క్రమశిక్షణను అనుసరించాలని నా ఇష్టం. అది మనస్ఫూర్తిగా, ఆంతరిక ఆకాంక్షతో, స్వయం సాఫల్యతను సాధించాలనే సంకల్పంతో కూడి వుండాలి. ఇది తెలిసినవారు ఉపాధ్యాయులైనా, శిక్షకులైనా లేక ఎవరైనప్పటికీ, వారి లక్ష్యం, వారి ఉద్దేశం, ఆ విషయాన్ని మీకు తెలియ జేయడం, మీకు సహాయ పడటంగా నుంటుంది. నీకు ఏదైనా క్లిష్ట పరిస్థితి ఏర్పడితే, నీ సమస్యను అట్టి వారికి నివేదిస్తావు. వారి

నేర్చుకోవాలనుకోకపోతే, నేర్చుకోకుండా వుండటానికి వాళ్లకు హక్కు వుంది. వాళ్లకు ఇలా చెప్పవలసిన బాధ్యత మనది "ఇప్పుడు నీ మెదడు సంసిద్ధమవుతున్న కాలంలో నువ్వు వున్నావు. ఇది ఏర్పడబోతూ వున్నది. నువ్వు చదువుతున్న ప్రతి విషయం నీ మెదడులో ఇంకో చిన్న ఆందోళనను తయారు చేస్తుంది. నువ్వు ఎంత ఎక్కువ చదివితే, ఎంత ఎక్కువ ఆలోచిస్తే, ఎంత ఎక్కువ పునరాలోచిస్తే, ఎంత ఎక్కువ పనిచేస్తే, నీ మెదడు తన చిన్న కంపనాలలో అంత ఎక్కువ సంక్లిష్ట మవుతుంది. పరిపూర్ణ మవుతున్న నీవు ఇంకా వయస్సులో చిన్నవాడివి గనుక ఈ కాలంలో అది చేయడం ఉత్తమం." అందువల్లనే నేర్చుకోవడానికి యవ్వనం అనుకూలమైన దశ గనుక, యువతను అందుకు ఎన్నుకోవడం సాధారణ మానవ నైజం. ఎందుకంటే ఇది అత్యంత సులభం. బిడ్డ తన గురించి తాను కొంచెమైనా చైతన్యవంతం అయ్యే వరకూ ఒక నిర్దిష్ట నియమానికి ఆధీనంలో వుండాలన్నది సుస్పష్టం. ఎందుకంటే బిడ్డకు తనకై తాను ఎంపిక చేసుకునే సామర్థ్యం ఇంకా వుండదు.

ఎంపిక చేసుకోవటాన్ని పిల్లలకు బోధించడం

వయసు అస్థిరమైనది. అది మనుష్యుల మీద ఆధారపడి ఉంటుంది. ప్రతి వ్యక్తి మీద ఆధారపడి వుంటుంది. కానీ ఏడు నుండి పద్నాలుగు సంవత్సరాల మధ్య నున్న ఏడు సంవత్సరాల కాలంలో వివేచించే వయసుకు చేరడం ప్రారంభ మవుతుంది. సహాయం అందితే ఆ వయసులో వివేచనగల వ్యక్తిగా తయారవుతాడు.

ఏడు సంవత్సరాల వయసుకన్నా ముందు మేధావులు వుంటారు — ఎప్పటికీ, అన్ని చోట్ల, మేధావులు వుంటారు — కానీ సాధారణ నియమం ప్రకారం బాలుడు తనను గురించిన చైతన్యంతో వుండదు. అలాగే, విషయాలను ఎందుకు చేయాలి, ఎలా చేయాలి అన్నది తెలియదు. అతడిలో శ్రద్ధను పెంచే సమయం అదే, తాను చేస్తున్నదాని మీద ఏకాగ్రత పెట్టడాన్ని బోధించడం, పూర్తిగా ఒక చిన్న జంతువులా కాకుండా వుండటానికి తగినంత చిన్న ఆధారాన్నిచ్చి, ఒక ప్రాథమిక మేధా వృద్ధితో మానవజాతికి చెందేట్లుగా చేయటం. అటు తర్వాత ఎంపిక చేసుకోవడం బోధించే ఏడు సంవత్సరాల కాలం వుంటుంది — తను కోరుకునే దానిని ఎంపిక చేసుకోవడానికి, ఒక వేళ బిడ్డ గొప్పదైన, సంక్లిష్టమైన బాగా వృద్ధి చెందిన మస్తిష్కం కలిగి, తన పని విధానంలో శక్తివంతంగా వుండగలదానిని పొందాలని ఎంపిక చేసుకుంటే, పని

అలవరచుకో లేడు, తనలో రేకెత్తే భావావేశాలకు ఏప్పటికీ బానిస అవుతాడు. ఒక ప్రత్యేక శాస్త్రం అభ్యసించ కూడదనుకుంటే, మంచిదే, ఎవరూ అది చేయాలని నిర్భందించ లేరు. కానీ, జీవితంలో ఏదైనా చేయాలని నిశ్చయించుకుంటే అది నిజాయితీగా, క్రమ శిక్షణతో, క్రమానుసారంగా, పద్ధతిగా చేయాలి. చాపల్యం పనికి రాదు. ఎవరు కూడా వారి మానసిక ప్రేరణలకు, ఊహాగానాలకు కీలుబొమ్మలై పోవడం నేనెప్పుడూ ఆమోదించ లేదు, ఎప్పటికి అందుకు ఆమోదం నా నుండి పొందలేవు. ఎందుకనగా, ఆ విధంగా నున్నప్పుడు ఎవరైనా ఒక మానవ జీవిగా నుండరు, ఒక జంతువుగా నుంటారు. ఇక్కడితో ఒక సమస్య ఏ విధమైన చర్చ లేకుండా పరిష్కరించ బడింది.

CWM 8:357 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

అజ్ఞానంలో నిలిచి వుండే హక్కు

ఇంతకు మునుపు జరిగిన దానిని, ఇతరులు చేసిన దానిని అనుసరించే ఒక శోచనీయమైన అలవాటు మనుష్యులకు వుంది. చాలా కాలం క్రితమే ఇది మీకు నేను చెప్పాను. వారి వాదన ఎలా వుంటుందంటే "ఇది తప్పనిసరిగా చేయాలి, ఎందుకంటే ప్రతి చోటా జరిగినది ఇదే" — దానికి నేను అంటాను "అందువల్లనే అది చేయకూడదు. ఒకవేళ అందరూ దానిని చేస్తున్నట్లయితే, దానినే ఇక్కడ కూడా చేయడం వలన ఉపయోగ మేమిటి?"

ప్రశ్న: కానీ మీ జోక్యం లేకుండా మేము ఏదైనా ఎలా చేయగలం?

అది నన్ను ఎందుకు అడుగుతారు? మీరు ముందుగా మీ విద్యావిధానాన్ని అతిమనసు సిద్ధాంతానికి తగినట్లుగా మార్చాలి. కనీసం ప్రయత్నం చేయాలి. మీరు అడగకూడదు, చేయాలి. అదే పద్ధతిలో మీరు ముందుకు పోతే, ఎల్లప్పటికీ అందులోనే కొనసాగుతారు. అందులో నుండి బయటకు రావడానికి ప్రయత్నించాలి. ఇదే అంశం మీద నేను నిరంతరం చర్చిస్తూనే వున్నాను. ఒక వేళ అజ్ఞానంలో నిలిచి వుండటమే సంతోషాన్ని ఇస్తే ప్రతి ఒక్కరు అజ్ఞానంలో వుండే హక్కు కొరకు అభ్యర్థిస్తున్నాను. ఆధ్యాత్మిక దృక్పథంలోని అజ్ఞానం గురించి నేను మాట్లాడటం లేదు. మనం నివసిస్తున్న అజ్ఞాన ప్రపంచం గురించి మాట్లాడటం లేదు.విద్యకు సంబంధించిన ప్రాణిక భావనల అజ్ఞానం గురించి మాట్లాడుతున్నాను. ఒక వేళ మనుష్యులకు నేర్చుకోవడం ఇష్టం లేకపోతే,

పాటుగా భారాన్ని మోయకూడదు, గతానికి చెందిన కృంగదీసే భారమైన తిరగలిని లాగ కూడదు. కేవలం ఒక ఉన్నత చైతన్యంలో, జ్ఞానంలో ఉన్నప్పుడు మాత్రమే ఈ భవిష్యత్తు తనను తాను చూపించడం ఎక్కడ ప్రారంభమైనది అన్న అంశాలను కనుక్కోవడానికి వెనక్కి చూడడం మంచిది. మొత్తం చిత్రపటాన్ని మనం చూడ గలగాలి, మనకు ఒక విశాలమైన విశ్వ దృక్పథం వుంటే, రాబోవు కాలంలో సాధించబడేది ముందుగానే ప్రకటించబడింది అన్నది తెలుసుకోవటం ఆసక్తికరంగా వుంటుంది, ఏ విధంగా నంటే శ్రీఅరవిందుల దివ్యజీవనం భూమి మీద ప్రకటిత మవుతుంది అన్నారు, ఎందుకంటే అది అప్పటికే పదార్థ లోతులలో చిక్కుకుని వుంది గనుక. ఈ దృక్పథం నుండి వెనక్కు చూడటం గాని, క్రిందకు చూడటం గానీ ఆసక్తికరంగా వుంటుంది, — ఏం జరిగింది తెలుసుకోవడానికి కాదు, లేదా మనుష్యులు ఏమి తెలుసుకున్నారు అన్నది కాదు: అది పూర్తిగా నిష్ప్రయోజనం.

పిల్లలకు ఇలా చెప్పాలి: అద్భుతమైన విషయాలు ప్రకటించబడ వలసి వున్నాయి, వాటిని అందుకోవటానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. అప్పుడు, అర్థం చేసుకోవడానికి వారు సులభమైన, దృఢమైన సమాచారం కావాలంటే నువ్వు ఇలా చెప్పవచ్చు: శ్రీఅరవిందులు ఈ విషయాలను తెలియజేయడానికే వచ్చారు; మీరు వారిని చదువ గలిగితే, అర్థం చేసుకుంటారు అని. అది అప్పుడు వారిలో శ్రద్ధను, నేర్చుకోవాలనే కోరికను మేల్కొల్పుతుంది.

చదువు పట్ల వైఖరి

ప్రశ్న: శ్రీమాతా, ఒక ప్రశ్న ఉద్భవిస్తుంది, ఎందుకంటే పాఠశాలలో మా చదువుల్లో కొన్ని సార్లు ఒక గొప్ప అయిష్టతను అనుభవిస్తూ వుంటాము, "వీటన్నిటి వలన ప్రయోజనం ఏమిటి?" అని మమ్ములను మేము ప్రశ్నించు కుంటాము. కనుక ఎటువంటి దృక్పథంతో మేము చదవాలి?

సమా: కండరాల మీద వ్యాయామాలు చూపించే ప్రభావాన్నే చదువులు మెదడు మీద చూపిస్తాయని నేను ఎప్పుడూ చెబుతూ వుంటాను. ఉదాహరణకు మన మానసిక కార్యశీలతను మృదువుగా చేయడానికి దానిని బలవర్థకం చేసి పోషించడానికి, దానికి అవగాహన చేసుకునే ఒక సూక్ష్మతను ఆపాదించడానికి, మానసిక వ్యాయామాలు అవసరం. వాస్తవానికి చాలా కాలంగా నేను గమనిస్తున్నాను, ఉదాహరణకు నేను

చేయడం బోధించాలి. ఎందుకంటే పని చేత, అది ప్రతిఫలించడం చేత, అధ్యయనం చేత, వివరణ చేత మెదడు ఏర్పడుతుంది. పదునాలుగు సంవత్సరాల వయసులో నువ్వు ఏమి కావా లనుకుంటున్నావు అన్నది తెలుసుకోవడానికి నువ్వు సిద్ధంగా వుంటావు, తప్పకుండా సిద్ధమవుతావు. అందువలన నేను అంటాను: ఒకవేళ ఆ వయసులో కొంతమంది పిల్లలు "మేధోపరంగా వృద్ధిచెందడం నాకు అసలు ఆసక్తి కలిగించదు, నేను నేర్చుకోవాలని అనుకోవడం లేదు, నేను అజ్ఞానంయొక్క సాధారణ రీతిలో అజ్ఞానంలోనే వుండా లనుకుంటున్నాను" అని నిరపేక్షంగా ప్రకటిస్తే, ఏ హక్కుతో వాళ్ల మీద చదువులను రుద్దగలము? అసలు వాళ్లను ప్రామాణికంగా తీర్చిదిద్దే అవసరమేమి?

CWM 8:180

పాతకాలంలో నున్న వ్యతిరేకత

చరిత్రలో జ్ఞానరూపాత్మకమైన స్ఫూర్తి వుంది; విజ్ఞానశాస్త్రంలో జ్ఞానరూపాత్మక మైన స్ఫూర్తి వుంది — పరమ సత్యం ప్రతి చోటా వుంది. అవసరమైన దేమంటే దానిని న్యాయబద్ధమైన విధానంలో బోధించడం....

'ఆధ్యాత్మిక జీవితం' అంటూ లేదు! అది ఇప్పటికి పాత భావనే. సన్యాసి, సాధువు ప్రతిబింబించేది ఆధ్యాత్మిక జీవితం అని, ఇతరులది సాధారణ జీవితం అనే భావన. ఇది నిజం కాదు, ఇది అసలు సత్యం కాదు. ఒక వేళ ఈ రెండింటి మధ్యన ఒక వైరుధ్యం అవసర మనుకుంటే – సత్యానికి అసత్యానికి మధ్యన ఒక వైరుధ్యాన్ని తీసుకోనివ్వడం కొంత మేలు. అది పరిపూర్ణమని నేను చెప్పను, కానీ కొంచెం మేలు. ఆ విధంగా అన్ని విషయాల్లో సత్యము, అసత్యము మిళితమై వుంటాయి. 'ఆధ్యాత్మిక జీవితం' అని మనం పిలిచేదాంట్లో, సన్యాసుల్లో, స్వామీజిలలో, భూమి మీద దివ్యజీవితాన్ని ప్రతిబింబిస్తున్నామని భావించే వారందరిలో ఒక సత్య, అసత్యాల సమ్మేళనం వుంటుంది. కనుక ఎటువంటి విభజన చేయకపోవడం మంచిది.

(నిశ్శబ్దం)

పిల్లలకు, ఎందుకంటే వాళ్లు పిల్లలు కనుక, వాళ్లలో భవిష్యత్తును జయించే సంకల్పాన్ని పుట్టించడం అత్యుత్తమం, ఎప్పుడూ ముందుకు చూసే సంకల్పం, ఎంత వేగంగా ముందుకు కదలాలని అనుకుంటారో అంతగా... కానీ వారు వాళ్లతో

ఎప్పుడూ తప్పు చేయొద్దు
ఎన్నడూ సహనం కోల్పోవద్దు
ఎల్లప్పుడూ అర్థం చేసుకోవాలి.

ఎందుకు యిలా అనిపిస్తుంది? ఎందుకు ఈ ఉద్వేగం కలిగింది? అని స్పష్టంగా తెలుసుకొని, విషయాన్ని దర్శించటానికి, పసివాడి ఆంతరంగిక వ్యవస్థ ఎలా ఉంది? అక్కడ సరి చేయవలసిన దేమిటి? ముందుకు తీసుకు రావలసిన దేమిటి? — యిదే చేయవలసినది. ఆ తరువాత వాళ్లని వదిలేయండి, వికసించటానికి వదిలేయండి. వాళ్లకి అనేకమయిన విషయాలను చూసే అవకాశం యివ్వటం, అనేకమయిన వాటిని స్పృశించ నివ్వటం. సాధ్యమయినన్ని ఎక్కువ పనులు చేయనివ్వటం. అది చాలా సరదాగా ఉంటుంది. అన్నింటికి మించి, మీకు తెలుసు, అనుకున్నదానిని వారిపై రుద్దకుండా ఉండటం చాలా ముఖ్యం. పిల్లల్ని తిట్టవద్దు, అర్థం చేసుకోండి. అతను సిద్ధంగా ఉంటే విషయాన్ని వివరించండి. మీ వివరణలను వినటానికి సుముఖంగా లేకపోతే, మీరు స్వయంగా సంసిద్ధంగా ఉంటే , అసత్యమైన ప్రకంపనల స్థానే సరియైన వాటిని సమకూర్చండి. కానీ యిది ఉపాధ్యాయులకు సవాలు లాంటిది. ఎందుకంటే అటువంటి పరిపూర్ణత వారిలో అరుదుగా ఉంటుంది.

అధ్యాపకులకు ఒక కార్యక్రమాన్ని రూపొందించటం ఆసక్తికరంగా ఉంటుంది — అట్టడుగు నుండి అధ్యయనానికై నిజమైన కార్యక్రమం. అది ఎంతో నమనీయమై, ఎంతో లోతైన భావాలను స్వీకరిస్తుంది. వారికి చిన్న వయసులోనే కొన్ని సత్యబిందువులను యిచ్చినపుడు వాళ్లు ఎదిగే కొలదీ ఎంతో సహజంగా వికసిస్తారు. అది అందమైన కార్యం.

CWM 12:405

ఒకరు తమ స్వభావాన్ని తమ నియంత్రణలో ఉంచుకో గలిగినప్పుడే పిల్లల మనస్తత్త్వాన్ని నియంత్రించ గలరు.

కొంత తాత్వికపదాలతో మీకు చదివి వినిపించలేకపోతే లేదా తాత్త్వికదృక్పథంతో మీతో మాట్లాడలేకపోతే మీరు అనుసరించ లేరు. ఎందుకంటే మీరు ఎటువంటి తాత్విక వ్యాయామాలు చేయలేదు కనుక. దాని అర్థం మీరు మేధావులు కారని కాదు, మీకు దానిని అర్థం చేసుకునే సామర్థ్యం లేదని కాదు; అది మీరు యుక్తమైన వ్యాయామాలు చేయకపోవడం వలన. ఇదే విషయాన్ని నేను ఇంకో విధంగా చెప్పవచ్చు: మీరు భాషను నేర్చుకోలేదు. కానీ అదే పదాలు వాటి మధ్యన కొంచెం భిన్న అనుబంధంతో, శైలితో, భిన్న మలుపులతో, విషయాల పట్ల భిన్న మానసిక దృక్పథంతో ఉపయోగించవచ్చు. వైఖరిలో ఇటువంటి తేడాను దానికి సంబంధించిన వ్యాయామాలు చేస్తే తప్ప మీకు కలుగదు. ఈ ఉదాహరణను అవగాహన చేసుకోవడం మీకు సులభంగా ఉంటుంది, ఎందుకంటే శిక్షణ లేకుండా మీరు ఎటువంటి భౌతిక వ్యాయామాలు చేయలేరు. ఒకవేళ మీకు ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నప్పటికీ, మీకు సహజ ప్రతిభ వున్నప్పటికీ, అభ్యాసం చేస్తూ మీకు మీరు శిక్షణ నిచ్చుకోకపోతే మీరు వాటిని చేయలేరు. చురుకుగా చేసే అభ్యాసాలన్నింటినీ పరిశీలించండి. ఒక వేళ వాటిని చేయమని మిమ్మలను మొదటిరోజు అడిగితే మీరు చేయలేరు, అది పూర్తిగా అసాధ్యం అని మీకు బాగా తెలుసు. ఒక వేళ ఎవరైనా యాదృచ్ఛికంగా, 'ఇప్పుడు ఇది చేయి' అని ఒక రకమైన దూకడాన్ని, తలక్రిందులుగా ఎగిరే మొగ్గ వేయమంటే, మీరు అంటారు "ఈ వ్యక్తి న్యాయవిరుద్ధంగా ఉన్నాడు. అది చేయటం అసాధ్యం!" నిజానికి ఇది కూడా అంతే. ఒక వేళ నేను కొన్ని పుస్తకాలు తీసుకుని మీకు చదివి వినిపించానంటే వాటిని మీరు అనుసరించ లేరు. ఎందుకంటే మీరు తత్వ సంబంధిత మానసిక వ్యాయామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇది ఖచ్చితంగా ఎలా వుంటుందంటే లెక్కలు అసలు చేయని వాళ్లను ఒక గణితపరమగు కారణాన్ని అనుసరించ మన్నట్లుగా వుంటుంది — అతడికి చేసే సామర్థ్యం వుండదు.... అందువలన దీని అర్థం మీ అస్తిత్వంలోని లోతైన సత్యాన్ని మీరు పూర్తిగా ప్రకటించుకోవాలంటే, మీ తత్వంలోని భాగాలన్నీ ఇలా ప్రత్యేక ప్రయోజనకర వ్యాయామాలతో పూర్తిగా వృద్ధి చెందినప్పుడే దానిని ఇంకా ఎక్కువ సమృద్ధిగా, ఇంకా సంపూర్ణంగా, ఇంకా వైవిధ్యంతో, ఎక్కువ సృజనాత్మకంగా ప్రకటిస్తారు.

అనువాదం: సునీత శేఖర్

అది మిమ్మల్ని విశిష్టమయిన ప్రయత్నం చేయటానికీ, సాధారణ పరిమితులను కొంత అధిగమించటానికి వత్తిడి చేస్తుంది.

అన్యధా అచేతనంగా ఉండిపోయే మీలోని ఎన్నో కదలికలను చైతన్యవంతం చేయటానికి కచ్చితంగా అది ఒక మంచి అవకాశం. సహజంగానే అదొక సదవకాశం, ప్రగతికి సాధనం అనే విషయాన్ని మీరు మరచిపో కూడదు. మీరు యధాలాపంగా సాధారణ వైఖరితో వెళ్లి ఆడాలనుకుంటే మీరు మీ సమయాన్ని వృధా చేసుకుంటున్నట్లే. ఇది కేవలం క్రీడలకే కాదు అన్నిటికీ వర్తిస్తుంది, చదువైనా, మరి దేనికైనా, ఏ పనైనా మనం ఏలా చేసామనే దానిపై ఆధారపడి వుంటుంది. ఏ పని చేసామనేదాని కంటే ఎటువంటి స్ఫూర్తితో చేసామనేది ముఖ్యం. మీరంతా యోగులయి మీరు చేసే ప్రయత్నా లన్నిటినీ మీ యావచ్ఛక్తీ, సాధ్యతలు వినియోగించి చేయగలిగినంత ఉత్తమంగా చేసినపుడు, ఎల్లప్పుడూ మరింత బాగా చేయాలనే భావనతో చేసినప్పుడు పోటీలు, బహుమానాలు, సన్మానాల అవసరం ఉండదు. కానీ శ్రీఅరవిందులు వ్రాసినట్లుగా పసిపిల్లలను యోగులు కావాలని ఆశించ కూడదు. ఆ రీతిగా చేయడానికి సంసిద్ధమయ్యే సమయంలో భౌతికమయిన చేతనకు, ఆ ప్రగతి కోసం ప్రయత్నించ టానికి కొంత ప్రేరణ అవసరమౌతుంది. ఈ బాల్యావస్థలోనుండే కాలం చాలా సంవత్సరాలు కొనసాగవచ్చు. నేను పోయినసారి బులెటిన్ పత్రికలో వ్రాసినది సరియైన ఆదర్శ మౌతుంది. మీరది చదివారో లేదో నాకు తెలియదు. అందులో యిలా వ్రాసాను.

అతిగా అభిలషించ వద్దు.

అన్నింటిని మించి... నటించ వద్దు.

ప్రతి క్షణం ఎరుకలో ఉండాలి.

సాధ్యమయినంత పరిపూర్ణంగా ఉండాలి.

సమగ్ర జీవనంలో అది ఆదర్శ ప్రాయమైన స్థితి — ఎవరు ఏ పని చేసినప్పటికీ అది గ్రహించినప్పుడు పరిపూర్ణతా మార్గంలో మీరు చాలా ముందుకు వెళ్లినట్లే. అయితే దీనిని మనస్ఫూర్తిగా చేయడానికి ఆంతరిక పరిపక్వత అవసరం. మీరు దీనిని ఒక శిక్షణా కార్యక్రమంగా స్వీకరించవచ్చు.

CWM 9:97-98

ప్రశ్న: అమ్మా! ఈ క్రీడల పోటీలు మన పురోగతికి అవసరమా?

సమా: నైతిక విద్యా దృష్టితో చూస్తే అది చాలా అవసరం. ఎందుకంటే ఒకరు సరైన స్ఫూర్తితో క్రీడలలో పాల్గొన్నప్పుడు వారి అహంపై ఆధిపత్యం సాధించటానికి అది చాలా ఉత్తమమైన అవకాశం. ఒకరి బలహీనతలను, నిమ్న స్వభావాన్ని అధిగమించ టానికి ప్రయత్నించకుండా క్రీడల్లో పాల్గొంటే, వాటి వలన ఏ మాత్రం లబ్దిని సాధించ లేరు. దాని వలన మంచి ఏమీ జరగదు. కానీ సరియైన స్ఫూర్తితో ఆడాలని సంక ల్పించినప్పుడు దురుద్దేశం, అసూయ, లాలసలను వదిలి న్యాయసమ్మతమైన వైఖరితో ప్రయత్నాన్ని చేస్తు, ఫలితం గురించి పట్టించుకోకుండా ఉండటం, యావచ్ఛ క్తినీ వినియోగిస్తూ విజయం ప్రాప్తించనపుడూ, పరిస్థితులు సానుకూలంగా లేనపుడూ ఏమాత్రం చలించకుండా ఉండగలిగితే అది చాలా ఉపయోగకరం అవుతుంది. ఈ పోటీల వలన ఒక వ్యక్తి మహత్తరమైన ఆత్మనిగ్రహంతో, ఫలితం పట్ల విరాగంతో బయటకు రావచ్చు. ఇది ఒక అసాధారణమైన వ్యక్తిత్వాన్ని మలచుకోవటానికి తోడ్పడుతుంది. ఆ క్రీడలనే సాధారణ రీతిలో, సహజమైన ఉద్వేగాలు, వికారమయిన లక్షణాలతో ఆడినపుడు అది మీకు ఏమాత్రం ఉపయోగ పడదు. అది ఏ క్షేత్రమైనా, మేధాపరమైన లేదా క్రీడా సంబంధమైన సామాన్య చేతనతో పని చేసినపుడు తమ సమయాన్ని వ్యర్థపరచుకున్నట్లే. కానీ ఆడేటపుడు లేదా పోటీలలో పాల్గొనేటపుడు సరైన స్ఫూర్తితో చేసినట్లయితే అది చాలా మంచి శిక్షణ అవుతుంది. ఎందుకంటే

ప్రశ్న: ఒక పిల్లవాడిని శిక్షించవచ్చా?

శిక్షించటమా? శిక్షించటమంటే మీ ఉద్దేశ్యం? క్లాసులో అల్లరి చేస్తూ మిగతావారిని పని చేసుకోనీయకుండా చేస్తుంటే అతడిని సరిగా ఉండమని చెప్పాలి. చెప్పినా వినకుండా అలాగే ప్రవర్తిస్తుంటే తరగతి గది నుండి బయటకు పంపించి వేయవచ్చు. అది శిక్ష కాదు, అతని ప్రవర్తనకు సహ జమైన పరిణామం. కాని శిక్షించటం! మీకు శిక్షించే హక్కు లేదు.

CWM 12:378

మీరు ఎన్నుకున్న మార్గాన్ని అనుసరించటానికి కూడా స్పష్టత అనేది అనివార్యం. మీరంతా పండితు లయిపోవాలని నేను కోరుకోవటం లేదు. అందుకు భిన్నంగా భావిస్తాను. ఎందుకంటే దాని వలన మీరు మరో కొసకు పడిపోతారు. మీ మెదడును ఎక్కువ అంశాలతో నింపివేయటం వలన అక్కడ ఉన్నతమయిన వెలుగుకు స్థానం ఉండదు. కానీ బెండులా కాకుండా ఉండటానికి కొంత కనీసమయిన విషయజ్ఞానం అవసరం.

CWM 8:183

పాఠ్యాంశాలను తయారు చేయటం

ప్రశ్న: అమ్మా, పాఠశాలలో సంవత్సర కాలంలో కొన్ని పాఠ్యాంశాలు పూర్తి చేయవలసి ఉంటుంది. కొన్ని సార్లు కొంత తొందరగా చేయవలసి వస్తుంది. ఒక ప్రశ్న అర్థమయే లోపల తరువాతి అధ్యాయానికి వెళ్లవలసి వస్తుంది.

సమా: నిజమే, నేను నీతో పూర్తిగా ఏకీభవిస్తాను. అది సబబు కాదు. దానిని మనం పూర్తిగా మార్పు చెయ్యాలి. ఎందుకంటే ఒక పుస్తకాన్ని ఒక సంవత్సర కాలంలో కంగారుగా పూర్తి చేయ నవసరం లేదనేది నా అభిప్రాయం. అది అంత సమంజసమైన పద్ధతి కాదు. ఒక అధ్యాయం పట్ల పూర్తి అవగాహన ఏర్పడే వరకు దానిని వదిలిపెట్ట కూడదు. ఆ తరువాతే వేరే అధ్యాయానికి వెళ్లాలి. ఒక అధ్యాయం పూర్తి అయింది అంటే అయిపోయినట్లే., లేదంటే కానట్లే. వాస్తవానికి ఒక అధ్యాపకుడు పాఠ్యపుస్తకాలపై ఆధారపడకుండా పాఠ్యాంశాలను తానే స్వయంగా తయారు చేసేందుకు శ్రమించాలి. అందుకు కావలసిన జ్ఞానాన్ని కలిగి, పాఠ్యవిషయాన్ని రోజువారీ పద్ధతిలో శ్రమించి తయారు చేసుకోవాలి. పాఠ్యాంశాన్ని ఈ విధంగా ఎప్పుడు ముగిస్తాడంటే — తరగతిలో విద్యార్థు లందరికీ అర్థమయినపుడే అని నేను అనను. ఎందుకంటే అది అసాధ్యం. కనీసం తరగతిలో శ్రద్ధ వహించే విద్యార్థులకు అవగాహన కలిగిందని అనుకున్నప్పుడు ముగించవచ్చు. ఆ పై తరువాతి అధ్యాయాన్ని ప్రారంభించాలి. అలా కాకుండా ఒక ప్రత్యేక పాఠ్యాంశం ఒక సంవత్సరానికి బదులు, రెండు సంవత్సరాలు లేదా సంవత్సరమున్నర కాలానికి పొడిగింపవలసి వస్తే, ఫరవాలేదు. ఎందుకంటే అది అతను స్వయంగా రూపొందించి, తన తరగతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తాను రచించినది. బోధనా విధానంపై నా అభిప్రాయ మిది.

వివేచనను ఉపయోగించుకోవటం

మీ మెదడు నిర్మాణ స్థితిలో ఉన్నప్పుడు దానిని యథాలాపంగా ఏదో అలవాట్లతో, లక్షణాలతో రూపొందించకుండా దానికి కచ్చితంగా, సున్నితంగా వ్యవహరించడం ఏకాగ్రతా సామర్థ్యం, ఎన్నుకోవటం, నిర్ణయించుకోవటం, వస్తువులను, విషయాలను క్రమబద్ధీకరించటం, హేతువును ఉపయోగించటం వంటి లక్షణాలను పెంపొందించునట్లు చేయాలి.

హేతువు మానవుని అత్యున్నత సామర్థ్యం కాదని, దానిని అధిగమించాలనేది అందరికి తెలిసిన విషయమే. కానీ వివేచన లేకపోతే మీరొక అసంగతమైన, అర్థంలేని జీవితాన్ని గడుపుతారనీ, హేతుబద్ధంగా వ్యవహరించట మెలాగో కూడా తెలుసుకోలేరన్నది తేటతెల్లమే. చిన్న చిన్న విషయాలే మిమ్మల్ని అతలా కుతలం చేస్తాయి. దానికి కారణం మీకు తెలియదు, పరిష్కారం అంతకన్నా తెలియదు. చురుకైన, స్పష్టమైన ఆలోచనా పటిమను కలిగి ఉండే వ్యక్తి అన్ని విధాలయిన ఎదురు దెబ్బలను, ఉద్వేగ సంబంధమయిన ప్రతిఘటనలను, పరీక్షలను ఎదుర్కో గలుగుతాడు. ఎందుకంటే జీవితమంతా వీటితోనే నిండి ఉంటుంది — అయిష్టత, విసిగిపోవటం చిన్నవే అయినప్పటికీ వాటిని అనుభవించే వ్యక్తికి అనురూపంగా ఉండి సహజంగా అతనిచే బృహత్తరమైనవిగా భావించ బడతాయి. మంచిది. వివేచనను కొంత సేపు పక్కన పెట్టి దాని వైపు చూసి నవ్వుతూ అనండి "లేదు అంత చిన్న విషయం గురించి అంత ఎక్కువ హడావిడి చెయ్యవలసిన అవసరం లేదు" అని.

మీకు వివేచనాశక్తి లేకపోతే మీ పరిస్థితి తుఫాను వచ్చినప్పటి సముద్రంలో ఒక బెండులా ఉంటుంది. బెండు తన స్థితికి వ్యథ చెందుతుందో లేదో నాకు తెలియదు కానీ అది అంత సంతోషంగా ఉన్నట్లు నా కనిపించదు.

ఇదంతా చెప్పాక — ఒకసారి కాదు నేను మీకిది చాలా సార్లు చెప్పానని అనుకుంటున్నాను. మీకు ఎన్నిసార్లంటే అన్ని సార్లు తిరిగి చెప్పటానికి నేను సిద్ధంగా ఉన్నాను — ఇదంతా చెప్పాక మిమ్మల్ని పూర్తిగా స్వతంత్రంగా వదిలేస్తున్నాను. మీరు చేరుకోవాలనుకున్న గమ్యానికి నడచి వెళ్లటానికి మీకు స్పష్టమైన, కచ్చితమైన అవగాహనను, సరిపడినంత జ్ఞానాన్ని కలిగి ఉండా లనుకుంటున్నారా లేదా తుఫాను వచ్చిన సముద్రంలో బెండులా కొట్టుకొని పోవాలనుకుంటున్నారా?

ఒక తెలివి తక్కువ, యాంత్రికమయిన బుద్ధిగల వాడికి మంచి జ్ఞాపకశక్తి ఉంటే పరీక్షలో బాగానే సమాధానాలు యివ్వగలడు. కానీ నిశ్చయంగా భవిష్య మానవుడికి కావలసిన లక్షణాలు యివి కావు. కేవలం పాత అలవాట్ల పట్ల, సహనంతోనే పరీక్షలు కావాలనుకొనే వారి కోసం వాటిని నిర్వహించటానికి నేను అంగీకరించాను. కానీ ముందు ముందు ఈ రాయితీ అవసరమవ కూడదని నేను ఆశిస్తున్నాను. పరీక్షలను రద్దు చేసినపుడు ఒక విద్యార్థి ఉత్తమమయిన వాడో కాదో తెలుసుకోవటానికి అధ్యాపకుడికి మరింత ఆంతరంగిక సంస్పర్శ, మానసిక విజ్ఞానం అవసరమౌతాయి. మన అధ్యాపకు లందరూ యోగసాధన చేయవలసి ఉంటుంది. కనుక వారి కది కష్టం కాకూడదు.

CWM 12:201

ప్రశ్న: శ్రీమాత, నియమానుసారం వచ్చే సంవత్సరం నుండి విధిగా పిల్లలందరూ సంస్కృతంతో పాటు, వారి మాతృభాషను అభ్యసించాలని అనుకుంటున్నాం. మీ అభిప్రాయం?

సమా: అవును సంస్కృతం ఉపకార వేతనం దృష్టిలో నుంచుకొని కాకూడదు.... ఎలా చెప్పాలి? సంస్కృతం భారతీయ భాష లన్నింటికీ ద్వారాలను తెరుస్తుంది. అది అనివార్యం అనుకుంటాను. కొన్ని సంవత్సరాల తర్వాత సంస్కృతం భారతీయ ప్రాతినిధ్య భాషగా, వాడుక భాషగా పునరుజ్జీవింప జేయడం ఆదర్శం గావాలి. భారతీయ భాష లన్నింటి వెనుక సంస్కృత మూలాలు ఉన్నాయి. కనుక అదే కావాలి. సంస్కృతం ఆ విధంగా మాట్లాడ గలగాలి.

అందుకని యిక్కడ సరళమైన సంస్కృతాన్ని నేర్పాలని నా కోరిక. ఎంత సరళంగా వీలయితే అంత సరళంగా. కానీ 'విశదపరచటం' కాదు. దాని మూలాలకు వెళ్లటం ద్వారా సరళీకృతం కావాలి. ఈ శబ్దాలన్నీ పదాలకు మూలాలయిన ధాతువులు, ఏవైతే తదుపరి రూపాందించబడ్డాయో.

CWM 12:415


అనువాదం: డా. సరోజా ప్రసాద్

ఇందులో కొన్ని యిబ్బందులు ఉన్నాయి. కానీ అదే సరైన విధానం. ఎందుకంటే ఒక పాఠ్యాపుస్తకాన్ని అనుసరిస్తున్నప్పుడు, ముఖ్యంగా అది విద్యార్థులకే మాత్రం తగినది కానపుడు — ఎందుకంటే ఒక నిర్దిష్టమైన పాఠ్యాంశము అందరికీ సరిపడక పోవచ్చు. అందరినీ సంతృప్తి పరచటం అసాధ్యం. కానీ కొందరు ప్రయత్నం చేయాలనుకునే వారుంటారు. మీరు వీరిని గురించి ఆలోచించాలి. బద్ధకస్తులు, ఒళ్లు వంగని వాళ్లు, నిద్రపోయే వాళ్లని వారి మానాన వారిని వదిలివేయాలి. జీవితమంతా నిద్ర పోవాలనుకుంటే ఏదైనా వాళ్లని చాలినంతగా కుదిపే వరకూ నిద్ర పోనివ్వండి. కానీ ఒక తరగతిలో ఆసక్తికరమైన విషయ మేమిటంటే నేర్చుకోవాలనే అభిలాష కలిగిన పక్షం — ఎవరైతే నిజంగా నేర్చుకోవాలని కోరుకుంటున్నారో అలాంటి వారి కోసం బోధన జరగాలి. మీరు చూశారా? ప్రస్తుత విద్యావిధానం ఒక విధమయిన సమానత్వం తీసుకు రావాలని ప్రయత్నిస్తుంది. ప్రతి ఒక్క విద్యార్థీ మిగిలిన అందరితో సమస్థాయిలో ఉండాలి. మితిమీరిన తెలివిగల వారమని తల లెగరేసే వారి పొగరు అణచాలి. తెలివితేటలు కొరవడి నందున తలలు వాల్చిన వారిని పైకి తేవాలి. కానీ దాని వలన అంత మంచి జరగదు. పైకి వచ్చే వారిని పరిగణనలోకి తీసుకోవాలి. మిగిలిన వారు స్వీకరించ గలిగినంత స్వీకరిస్తారు. నిజానికి అందరు ఒకే విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నేననుకోను. ఎందుకంటే అది సహజమైనది కాదు. ఎవరైతే తెలుసుకోవా లనుకుంటారో, తెలుసుకో గలరో, ఎవరైతే పని చేయాలో, వారికి పని చేయటానికి తగిన వనరులను సమ కూర్చాలి, ఎంత వీలయితే అంతగా పైకి తీసుకురావాలి, వారికి ఎల్లప్పుడూ కొత్త విషయాలను బోధించాలి. వారు విషయ పరిజ్ఞానానికై ఆకలితో నున్నవారు, వారిని తృప్తి పరచాలి. నాకే సమయం ఉంటే నేనొక తరగతికి బోధిస్తాను. అది నాకు ఆసక్తికరంగా నుంటుంది, ఏ విధంగా బోధించాలో చూపించడం. అయితే ఒక వ్యక్తి అన్ని చోట్లా ఒకేసారి ఉండటం సాధ్యం కాదు కదా!

CWM 5:106

పరీక్షలు అనేవి కాలం చెల్లిన పద్ధతులు

విద్యార్థులు తెలివైనవారు, ఆసక్తిగల వారు, శ్రద్ధగల వారు అనే విషయం తెలుసుకోవటానికి పరీక్షలు నిర్వహించే పద్ధతి నిష్ప్రయోజనకరమైనది, పురాతనమైనది.



ఆధారం కాబట్టే ఇది తప్పక జయిస్తుంది. దీనికి వ్యతిరేకమైన శక్తులన్నీ పరాజయం పొందాల్సిందే. ఇదే శాశ్వతంగా ప్రపంచానికి ఆధారభూతంగా వుంటుంది.

ఈ విషయం చిన్నపిల్లలకు వేదాంత పరంగా చెపితే వారికి అర్థం కాదు. కాని వారి అంతరంగానికి సంతృప్తిని, ఆనందాన్ని ఇచ్చే విధంగా ప్రయత్నించాలి. అంతరంగంలోని సత్యానికి అనుకూలంగా నడుచుకుంటే వచ్చే ఆనందం ఎలా వుంటుందో, అలాంటి ప్రాతిపదికగా వారి విద్యాభ్యాసం కొనసాగాలి. సునిశిత అంతరాత్మ ప్రబోధానికి వ్యతిరేకంగా ఏం చేసినా వారికి ఎలాంటి అలజడి కలుగుతుందో అర్థం కావాలి. ఇదే నిజమైన, శాశ్వతమైన సంతృప్తి అనీ, ఇది లేకపోతే ఏదీ శాశ్వతంగా మనజాలదని వారు గ్రహించ గలగాలి.

తమను తాము తెలుసుకునేలా వారికి బోధించటం

ముందుగా తమను తాము తెలుసుకొనేలా శ్రద్ధగా వారికి అవగాహన కలిగించాలి. ఎవరికి వారు తమ భవిష్యత్తును వారే ఎంచుకునే విధంగానూ, వారి గమ్యాన్ని, మార్గాన్ని వారే నిర్ణయించుకునే విధంగాను వారిని తయారు చేయాలి. తమ

అభివృద్ధి చేయవలసిన మరొక స్వభావము

పిల్లలలో చాలా చిన్నతనం నుండే అభివృద్ధి చేయవలసిన స్వభావం మరొకటి ఉన్నది. అదే 'చేయరాని పని చేసినపుడు లోలోన బాధపడే' లక్షణం. ఇది దానంతట అదే వారిలో సహజంగా కలగాలి. శిక్షణవలన కానీ, దండిస్తారనే భయం వలన కానీ కాకుండా తప్పు జరిగినప్పుడే సహజంగానే వారి అంతరంగంలో ఈ భావం ఉద్భవించాలి. ఒక్కొక్కసారి పిల్లలు తమ స్నేహితులకు బాధ కలిగించే పనులు చేస్తారు. అదే సమయంలో వాళ్ల స్వభావం సహజమైనదిగా నుంటే వాళ్ల అంతరంగంలో కూడా ఏదోతప్పు చేశాము అన్న బాధ కూడా కలగాలి. ఆ భావన దానంతట అదే ఏర్పడాలి. వారి అంతర్గత సత్యానికి వ్యతిరేకం జరిగిందన్న భావం వారిలో పుట్టాలి.

మనం బోధించే విషయాలతో ప్రమేయం లేకుండానే, ఆలోచనలకు అతీతంగా మనలోనే నిగూఢంగా ఒక సత్యం, ఒక పరిపూర్ణత దాగి వుంటుంది. దానికి వ్యతిరేకంగా ఏదైనా జరిగితే అది కూడా దానిని వ్యతిరేకిస్తుంది. బయటి వాతావరణం వలన బిడ్డలు చెడిపోకుండా వుంటే, ఈ అంతర్గత భావనకు వ్యతిరేకంగా ఏమి జరిగినా ఏదో తెలియని ఆందోళన వారి మనసులను కలత పెడుతుంది. దీని ఆధారంగానే వారిలో ముమ్ముందు జరగబోయే అభివృద్ధి ఆధారపడాలి.

ఒకే ఒక నిజమైన మార్గదర్శి

ఒకే ఒక నిజమైన మార్గదర్శి 'అంతరంగం'. అది మానసిక చేతనకు (ఆలోచనలకు) అతీతమైనది. ఒక శిశువుకు విపత్కారంగా అనిపించే విద్యను బోధిస్తే ఈ అంతర్గత సత్యభావన బలవంతంగా పోగొట్టిన వారం అవుతాము. క్రమంగా శిశువునకు ఆ శక్తితో ఉన్న బంధం బలహీనపడి మంచిచెడ్డల విచక్షణ అనే గుణాన్ని శిశువు కోల్పోతుంది. అందు కే నేను నొక్కి వక్కాణించేది ఏమిటంటే పిల్లలు వారిలోని అంతర్గత పరిపూర్ణ సత్యభావనను పెంపొందించుకునే విధంగా మనం వాళ్లను తీర్చి దిద్దాలి. ఆ భావన భువిలోనూ, దివిలోనూ, విశ్వంలోనూ అంతటా వున్నదని వారికి తెలియాలి. ఈ కారణంగానే అవి ఉనికిని పొందాయి. పిల్లలలో ఇది లేకపోతే బాల్యానికి అర్థమే లేదు. వారిలో చేతన ఎలా క్రమంగా వచ్చిందో అలాగే కరిగిపోతుంది. ఇది విశ్వానికి

మనసులు ఇలాగే సంశయస్థితిలోనే వుంటాయి. స్పష్టత ఉండదు; కచ్చితంగా ఆలోచించ లేవు. మసకలో చూస్తున్నట్లు అంతా అస్పష్టంగా కనపడుతుంది. ఏవో కొన్ని అభిప్రాయాలు కలుగవచ్చు. కాని అవి స్పష్టమైన విషయ పరిజ్ఞానం మాత్రం కాదు.

చూట్టానికి అట్లాగే వున్న భావాలతోనూ, ఒక దానికి మరొకటి వ్యతిరేకంగా వుండే ఆలోచనలతో, అభిప్రాయాలతో, సంవేదనలతో భావోద్రేకాలతో మనం నిండిపోతాము. అవి నిజమైన, స్పష్టమైన భావాలు కావు. కేవలం అర్థం లేని పోకడలు. ఏ విషయం పైన అయినా మీకు నిర్దిష్టమైన, పారదర్శకమైన అభిప్రాయం ఏర్పడాలంటే మీరు ధృడచిత్తంతో ప్రయత్నించాలి. అచంచలంగా, స్థిరంగా పూనుకొని, ఏకాగ్రతతో కొనసాగించి సాధించాలి. మొదట్లో కొంత బాధ కలుగుతుంది. అది సహజం. అందులో శ్రమ కూడా వుంటుంది. కాని, క్రమంగా అలవాటు చేసుకోకపోతే జీవితాంతం ఏ అవగాహనకూ రాలేరు. ఇక ఆచరణాత్మక విషయంలో — అంటే, మీకు ఎదురయ్యే సమస్యలలో (సమస్యలు తప్పక అందరకూ ఎదురౌతాయి). అన్ని సమస్యలను ఒక దగ్గరకు తెచ్చి, వాటిని అన్ని కోణాల నుంచి నిశితంగా పరీక్షించి, వాటికి అతీతంగా ఆలోచించి పరిష్కారాలను కనుక్కోవలసిన సందర్భాలలో, ఏదీ స్పష్టంగా కనిపించక పోవటం, అంతా చెల్లాచెదురుగా వుండటం చాలా చికాకే! తలలో సాలెపురుగులు గూళ్లు కట్టుకొని అటూ, ఇటూ పరిగెత్తుతున్నట్లు అనిపిస్తే సమస్యకు పరిష్కారం చేజారి పోతుంది. నేను దేశం గురించి కాని, ప్రపంచం గురించి కాని మాట్లాడటం లేదు. కేవలం సాధారణంగా నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే వాటిని గురించే మాట్లాడుతున్నాను. అవి ఎప్పటికీ అంతుచిక్కని సమస్యలు కూడా కాదు! కాకూడదు!

CWM 8:181-82

అంతర్గత సత్యం స్మృతి పథంలో ఉండాలి

ప్రశ్న: పెద్దల వలె పసివారు తమ అంతరంగంలో సత్యాన్ని గ్రహించ గలరా?

సమా: చిన్నపిల్లలకు ఇది స్పష్టంగా తెలుస్తుంది. మాటలు గాని, ఆలోచనలు గాని దీన్ని సంక్లిష్టం చేయలేవు. అందులో సౌలభ్యం ఉంది, సంక్లిష్టతా వుంది. పరిస్థితి తీవ్రంగా ఉంటే ఇది ఆనంద హేతువు అవుతుందా, దుఃఖహేతువు అవుతుందా

అంతరంగంలోనికి తాము చూచుకొని తమను తాము అర్థం చేసుకొనేలా వారిని తయారు చేయాలి. వాళ్లు ఎలా వుండాలో వారే నిర్ణయించుకో గలగాలి. విషయ పరిజ్ఞానం కంటే వారికి ఇదే ముఖ్యమైనది. జరిగిపోయిన చరిత్ర గాని, విశ్వం ఎలా ఆవిర్భవించింది అనే విషయంగాని, సాధారణ జీవితం గడపటానికి అవసరమైన ఇతర విషయాల పరిజ్ఞానం కాని, దీని కంటే ముఖ్యం కాదు. ఒక వేళ ఎవరైనా వారిని చూచి హేళనగా వీడికి ఏమీ రాదు, వీడొక మొద్దు అని అన్నా నష్టం ఏమీ లేదు.

ఇక ఎప్పుడైనా, ఏ వయసులోనైనా నీకు చదువుకోవాలని అనిపిస్తే నీవు పుస్తకాలను చదువవచ్చు. చక్కగా విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. పాఠశాలలకు వెళ్లవలసిన అవసరమే లేదు. ప్రతి విషయంలోను సరియైన అవగాహన కల్గించటానికి ప్రపంచంలో బోలెడు పుస్తకాలు ఉన్నాయి. అవసరాలకు మించి కూడా ఉన్నాయి. గ్రంథాలయాలకు పోయి వాటి నన్నిటినీ చదువుకొని మేధోపరమైన ఆనందాన్ని పొందవచ్చు. నీ తృష్ణ తీర్చటానిక అనేకమైన అనేక గ్రంథాలు సిద్ధంగా వున్నాయి. (శ్రీమాత సంజ్ఞ చేస్తారు) ముఖ్యమైన విషయం, కావలసిన దాన్ని సరిగా ఎంచుకోవటమే. దీనికి మాత్రం కొంత స్వేచ్ఛ అవసరం. నీ మీద ఒత్తిడి కాని, నీకు మొగమాటం కాని ఉండకూడదు. హృదయపూర్వకంగానే నీవు నిర్ణయాలు చేయగలగాలి. అవకాశాన్ని స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. ఈ విషయంలో ఏ మాత్రం బద్ధకించినా ఫలితం రాను రాను నీకే తెలుస్తుంది. ఇవాళ బద్ధకిస్తే, రేపు పదింతలు చెయ్యవలసి వస్తుంది! అంతే కాదు, కొన్నాళ్ల తరువాత చేయవలసి వస్తే నీ నైపుణ్యం కూడా తగ్గవచ్చు. ఇటువంటి విషయాలు కేవలం అనుభవం ద్వారా తెలుసుకో వలసినదే. ఒకళ్లు చెపితే వచ్చేవి కావు.

మనసును అదుపులో ఉంచే విద్య

అదుపులేని మనసు ఊగిస లాడుతుంది; కచ్చితంగా ఉండలేదు. దేని మీదైనా కేంద్రీకరిస్తే తప్ప అది నిశ్చలంగా ఉండలేదు. నిరంతరం పచార్లు చేస్తూనే వుంటుంది. దానికి అంతు లేదు, అర్థం లేదు. ఇందువలన ఒకదాని మీదనే కేంద్రీకరించాల్సి వస్తే అది శ్రమించవలసి వచ్చి, బాధ పడుతుంది. అందువలన మనం దేని మీదా ధ్యాస పెట్టలేము. ఎప్పుడూ అనిశ్చిత స్థితిలో ఉంటాము. అంతే. చాల మంది

వేయగల అనుభవం గలవారికి లోపల మనసులో ఏం జరుగుతుందో తెలుస్తుంది. 'కళ్లే ఆత్మయొక్క దర్పణాలు' అని అంటూ ఉంటాము గదా!

కళ్లను చూచి మీరు కనిపెట్ట లేకుండా ఉన్నారంటే మీరు ఎవరిని చూస్తున్నారో వారి మనసులో, ఈ సత్యత ఎక్కడో మరుగున పడి ఉన్నదన్న మాట. అనేక దైనందిన ప్రాపంచిక విషయాలు దాన్ని వెనుకకు నెట్టివేసి ఉంటాయన్న మాట.

పసిపిల్లల కళ్లలోకి పరీక్షగా చూడండి. మీ కొక తేజస్సు కనబడుతుంది. అది వారిలోని నిజమైన, స్వచ్ఛమైన ఆనందమే! వారి కళ్లలో అద్భుతమైన ఆశ్చర్యం గోచరిస్తుంది. చిన్నారుల కళ్ళు ప్రపంచాన్ని ఆశ్చర్యంగా తిలకిస్తూ ఉంటాయి. వాళ్లకు బాహ్య ప్రపంచం పెద్దగా అర్థం కాక పోవచ్చు. వారింకా ప్రపంచానికి అల్లంత దూరంలోనే వున్నారు. కాని వాళ్ల కళ్లలో వ్యక్తమయ్యేది మాత్రం వారి మానసికంలో ఉన్న అద్భుత భావనయే! ఇది చిన్నపిల్లల్లో సహజంగానే వుంటుంది. కాని వారు పెరిగి పెద్దవారవుతున్న కొద్దీ, విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న కొద్దీ, ఇది మారిపోతుంది. వారిలో ఆలోచనలూ, కోరికలూ, అనుభవాలూ, ఆవేశాలూ, వ్యతిరేక భావనలూ ప్రవేశిస్తాయి. చిన్ననాటి అమాయకత్వం, అప్పటి నిష్కల్మషమైన వెలుగు వారిలో కనుమరుగై పోతుంది. తెలివితేటలు మనసును ఆక్రమించటంతోనే అమాయకత్వము, ఆత్మశక్తి అంతరిస్తుంది.

అంతగా అభివృద్ధి చెందని మానసిక శక్తులు ఉన్న పిల్లల్లో కూడా అభిమానం, సంరక్షణ, ఆసక్తి, ఓదార్చటం లాంటివి స్పష్టంగా గ్రహించగల శక్తి ఉంటుంది. మన స్పందనలను వారు ఇట్టే గ్రహించ గలుగుతారు. దానికి వారు ప్రతిస్పందనను వ్యక్తం చేయగలరు కూడా! ఇదే సాధారణ కుటుంబాలలోని సుమారు పదునాలుగు సంవత్సరాలున్న బాలుడిని తీసుకోండి. అందులోనూ తగిన ఆలనా పాలనా అంతగా లేని బాలుని విషయంలో ఈ సున్నితత్వం బాగా వెనుకబడి ఉంటుంది. మన స్పందనలకు వారు సరిగా ప్రతిస్పందించ లేరు. కీలుబొమ్మల్లా అచేతనంగా నిలబడతారు.

CWM 4:26-27

నిత్యజీవితమే పాఠశాల

ప్రతి క్షణం, ప్రతి దినం జీవితమే ఒక పాఠశాల. అందులోని వైవిధ్యము,

చెప్పలేము. కాని పిల్లలలో ఇది పెద్దలలో కంటే మరింత స్పష్టంగా ఉంటుంది. పెద్దలలో మనసంతా ఆలోచనలతో నిండి ఉండటం వలన ఇది అంత స్పష్టంగా ఉండలేదు.

పిల్లలకు సిద్ధాంతాలు బోధించటం అనవసరం. వారు పెద్దవారై, వారి మనసులు వికసిస్తున్న కొద్దీ మన సిద్ధాంతాలలో ఉన్న అనేక పరస్పర విరుద్ధ విషయాలు తెలుస్తాయి. వారికి తెలిసినది కూడా సరియైనది కావచ్చు గదా!

చిన్నపిల్లలలో నిగూఢంగా ఉన్న ఈ సత్య భావన అంతర్గత మానసికంలోని దైవత్వ ఛాయయే! ఇది జంతువులలోనూ, వృక్షాలలోనూ కూడా ఉంటుంది. వృక్షాలలో అచేతనంగా వున్నా, జంతువులలో ఇది పైకి తెలుస్తూనే ఉంటుంది. పసిపిల్లలలో అది ఇంకా ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. నా అనుభవంలో నాలుగైదు సంవత్సరాల పిల్లలలో ఈ లక్షణం పద్నాలుగు, పదిహేను సంవత్సరాల పిల్లలలో కంటేను, ఎక్కువగా ఉండటం గమనించాను. ఇరవై ఐదు సంవత్సరాలు వచ్చేసరికి ఇంకా తగ్గిపోతుంది. ఇక చదువులలో ముందుకు పోతున్నకొద్దీ వారికి విషయ పరిజ్ఞానం పైననే దృష్టి అంతా కేంద్రీకృతం అవడం వలన విజ్ఞాన సముపార్జనే వారి మేధాశక్తిని అంతా ఆక్రమించటం వలననూ సత్యాన్ని గ్రహించగల ఈ మానసిక లక్షణం మరుగున పడిపోతుంది. కళ్లలోనికి సూటిగా చూచి మానసిక శక్తిని అంచనా

ప్రశ్న: శ్రీమాతా, 'స్వేచ్ఛగా పురోగమించటం' (ఫ్రీ ప్రోగ్రెస్) అంటే వివరిస్తారా?

సమా: అది ఆత్మ పరిపక్వతను బట్టి ఉంటుంది. విషయ పరిజ్ఞానాన్ని బట్టి గాని, అలవాట్లు, సాంప్రదాయాలను బట్టి గాని, పూర్వపు భావనలను బట్టి గాని ఉండదు.

ఆలోచనాశక్తి, అభ్యాసశక్తి, పురోగమనశక్తి, సూక్ష్మబుద్ధి పిల్లలలో వృద్ధి చెందాలి. పాఠశాలలో పిల్లలు అందు నిమిత్తం తయారవుతారు.ఆ పని కేవలం పాఠశాలకే పరిమితం కాకూడదు, జీవిత కాలమంతా చేయబడాలి.

CWM 12:177

కాని చదువంటే అయిష్టత కనబరచే వారిని మరో దిశగా మరలించాలి.

CWM 17:306

పిల్లవాడికి మంచిమాటలు చెప్పడం, బుద్ధి గరిపే సలహాల నివ్వడం అతనిపై అతి తక్కువ ప్రభావం కనబరుస్తుంది. బోధించేవాడు గనక ఉదాహరణగా నిలవకపోతే విధేయత, నిజాయితీ, ముక్కు సూటిగా నుండటం, ధైర్యం, నిష్పక్షపాతం, సహనం, నిలకడ, స్థిరత్వం, ప్రశాంతత, నెమ్మది, స్వయం నియంత్రణ, ఇలాంటివన్నీ ఉపయుక్తం కావు. ఉపయుక్తం కావాలంటే అందమైన ప్రసంగాల ద్వారా కాదు, ఆచరణలలో చూపితేనే ఉత్తమమైన బోధన అవుతుంది.

CWM 12;10

పిల్లవాడిని ఎపుడూ దూషించ కూడదు. తల్లిదండ్రుల్ని ఈ విషయంలో నేను విమర్శించినప్పుడు నన్ను 'దోషి' గా చేసారు. కానీ నేను వాళ్లను ఆ విధంగా ప్రవర్తిస్తున్నప్పుడు చూసాను. పిల్లవాడు తప్పు చేసి, దానిని తాను తెలుసుకొని స్వచ్ఛంధంగా ఒప్పుకోవడానికి వచ్చినప్పుడు, తొంభై శాతం తల్లిదండ్రులు, "నీవు దుర్మార్గుడివి, వెళ్లిపో" అని గద్దిస్తారు. ఇది నాకు తెలుసు. అతను చెప్పేది సహనంతో విని, తప్పు ఎక్కడుందో, అతను ఎలా ప్రవర్తించి ఉండాల్సిందో చెప్పడానికి బదులు పై విధంగా మాట్లాడుతారు. అప్పుడు ఎంతో సదుద్దేశంతో వచ్చిన ఆ పిల్లవాడు బాధపడి వెళ్లిపోతాడు, ఇలా అనుకొంటాడు. "నాతో ఎందుకిలా ప్రవర్తించారు" అని. వారికి సంస్కారం లేదని, వారు తప్పు చేసారని గుర్తించి, "నన్నెందుకు దూషించారు? వారూ నా లాంటివారే కదా" అని వాపోతాడు.

CWM 4:28

ప్రేమ, సాధుత్వ వాతావరణంలో పిల్లల బోధన సాగాలి.

హింసాయుత వాతావరణం పనికి రాదు — ఎప్పుడూ దూషించటం తగదు — సర్వదా సున్నితమైన దయాస్వభావంతో మెలగాలి.

పిల్లవాడు తప్పనిసరిగా అలవరచుకో వలసిన సద్గుణాలకు ఉపాధ్యాయుడు సజీవ ఉదాహరణగా నుండాలి.

పిల్లలు పాఠశాలకు పోవడానికి, నేర్చుకోవడానికి సంతోషం చూపాలి.

సంక్లిష్టత, ఊహించలేని పరిణామాలు, పరిష్కారాలు జీవితంలో ఎన్నో ఎదురౌతాయి. అవే బాగా తెలిసే ఉదాహరణలు, స్పష్టమైన పర్యవసానాలు. పిల్లలలో వీటిపై ఉత్సాహాన్ని కలిగించాలంటే వారి ప్రశ్నల కన్నిటికీ మనం ఓపికగా, తెలివిగా, స్పష్టంగా సమాధానం చెప్పాల్సిందే! వారిలో ఎవరికైనా సంతృప్తికరమైన సమాధానం ఇచ్చామంటే, మిగతావారు కూడా నిర్భయంగా అడుగుతారు. ఆ విధంగా శ్రద్ధగా వినే ప్రతి పిల్లవాడు ప్రత్యేకమైన బోధన లేకుండానే చాల విషయాలను అర్థం చేసుకుంటాడు. జాగ్రత్తగా ఎంపిక చేసిన పాఠ్యాంశాలు కూడా వారిని ఉత్సాహ పరుస్తాయి. వారికి ఈ విధంగా విషయ పరిజ్ఞానం కూడా అబ్బుతుంది. శిశువులలో ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ కలిగించి, వారిలో కొత్త ఊహలను రేకెత్తించే విషయాలను అందించటంలో మీరు నిర్భయంగా వ్యవహరించాలి. ఊహలు సృజనాత్మకతను మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయి. ఇలా చేస్తే విద్య వినోదంగానూ, జీవం ఉట్టి పడే లాగాను ఉంటుంది.

పిల్లలలో సున్నితంగా, సమగ్రంగా మేధ పెరగాలంటే వారిని జాగ్రత్తగా గమనించాలి. వారు అనేక విషయాలపై ఆసక్తి కనపరచటం మాత్రమే కాకుండా, ప్రతి విషయాన్ని అనేక కోణాల నుండి పరిశీలిస్తారు. అందువలన సమస్యను అనేక విధాలుగా ఎలా పరిష్కరించాలో నేర్చుకుంటారు. వారి ఆలోచన సరళతరం అవుతుంది. ఇంకా తెలివిగా, ఇంకా సున్నితంగా వారు ఆలోచించ గలుగుతారు. క్లిష్టమైన పరిష్కారాలు, సరళము, సమగ్రము అవుతాయి. ఇలా వారిలో మనోవికాసం, పరస్పరానుగుణ్యంగాను, మెల్ల మెల్లగాను జరిగి మెరుగైన సత్యాన్వేషణ వారిలో ఉదయిస్తుంది.

CWM 12:26-27

శ్రీమాత

అనువాదం: కె. ఆర్ . ఎల్ నరసింహారావు

విద్యాసూత్రాలు

నేను అందరి పిల్లల్ని ఒకే విధంగా చూడను.ఇది ఒక విధమైన సమాన స్థాయిని కలుగ జేస్తుంది. వెనుకబడిన వారికి ఉపయోగ పడుతుంది గాని ఎదగగలిగే సామర్థ్యం గలవారికి హానికరమౌతుంది.

ఎవరైతే పని చేస్తూ చదువు కోవాలనుకుంటారో వారిని తప్పక ప్రోత్సహించాలి.

తెలుసుకోవడం, తనలో జరిగేదంతా ఎందుకు, ఎలా సంభవమౌతున్నదో తెలుసుకోవడం. తనపై తాను ఆధిపత్యం సాధించడ మంటే తాను చేయాలనుకున్నది చేయడం, అది తప్ప వేరొకటి చేయక పోవడం, మానసిక ప్రేరణలను, కోరికలను, ఊహాగానాలను అనుసరించక పోవడం.

ఒక పిల్లవాడికి నైతిక ధర్మాన్ని నేర్పడం ఆదర్శనీయమైన విషయం కాదు కానీ అది జేయకుండా ఉండటం కూడా కష్టమే. పిల్లవాడు ఎదిగిన కొద్దీ నైతిక, సాంఘిక ధర్మాల మధ్య తారతమ్యాన్ని బోధించవచ్చు. ఆ విధంగా అతను తనంతట తానుగా ఒక ఉన్నతమైన, సత్యవంతమైన ధర్మాన్ని తనలో నిలుపుకో గలుగుతాడు. కానీ ఇక్కడ ఒకరు ఆ సత్యవంతమైన ధర్మాన్ని కనుగొనుటకు కష్టపడవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పటానికి శ్రద్ధ వహించాలి. ఎవరైతే మానవ ధర్మాలను పాటించడానికి నిరాకరించి, 'వారిదైన జీవితాన్ని వారు' జీవించడానికి వారికి స్వాతంత్ర్య మున్నదని అది వారి నిశ్చయమని చాటుతారో, వారు అలా చేసేది అతి సాధారణమైన ప్రాణిక ప్రేరణలకు దాసులైనందున. చేసిన దానిని తమ కళ్లకు గాకపోయినా ఇతరుల కళ్లకు సమర్ధనీయమైనదని మభ్య పెట్టడానికి, వారు నైతికతను కాల దన్నుతారు. కారణం అది వారి స్వాభావికమైన అల్ప కోరికలను తీర్చడంలో అవరోధం అవుతుంది కాబట్టి.

నైతిక, సామాజిక ధర్మాలపై న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించటానికి ఎవరికీ హక్కు లేదు, అట్టి వారు ఆ ధర్మాలను మించిన ఉన్నత స్థాయిలో ఉంటే తప్ప. ఒకరు వాటిని విశృంఖలత్వంతో త్యజించ లేరు, వాటి స్థానే వాటి కన్నా ఉన్నతమైన వాటిని నిలుపుకుంటే తప్ప. అది అంత సులభం కాదు.

ఏ సందర్భంలో నైనా, ఒకరు పిల్లవాడి కీయగల చక్కని బహుమతి ఏదనగా అతనికి తనను తాను ఏ విధంగా తెలుసుకో గలడో, తనపై తాను ఆధిపత్యం ఏ విధంగా పొందగలడో బోధించటం.

CWM 12:166

శ్రీమాత

అనువాదం: తుమ్మల లక్ష్మి

ఉపాధ్యాయుడు వారికి మంచి నేస్తంగా, వారు అలవరచుకో వలసిన లక్షణాలకు ఉదాహరణలా ఉండాలి.

CWM 12:194

నేను ఏ స్వేచ్ఛను గురించి మాట్లాడుతున్నానో, అది ఆ ఆత్మసంకల్పాన్ని అనుసరించగల స్వేచ్ఛ, మానసికమైన, ప్రాణికమైన చాపల్య ధోరణులను పాటించే స్వేచ్ఛ కాదు; అన్ని బలహీనతలను, నిమ్నస్థాయికి చెందిన అజ్ఞానపు కోరికలను అధిగమించడానికి తగిన సూచన నిచ్చే కఠోర సత్యం; అత్యున్నతమైన, అతి ఉదారమైన, అతి దైవికమైన ఆకాంక్షతో తనను తాను సంపూర్ణంగా, ఎట్టి మినహాయింపు లేకుండా సమర్పించుకో గలగుటకు స్వేచ్ఛ.

మీలో ఎవరు ఆ మార్గాన్న హృదయపూర్వకంగా అనుసరిస్తారు? చెప్పడం సులభమే కాని అర్థం చేసుకోవడం కష్టం, సిద్ధింప చేసుకోవడం మరీ కష్టం.

CWM 12:391

రెండు పనులు చేయాలి, అవి చిన్నపిల్లలకు తప్పనిసరిగా బోధించవలసినవి:

1. అబద్ధం చెప్పకుండా ఉండటం, ఎట్టి పరిస్థితులలోనైనా.
2. హింసను, ఉద్రేకాన్ని, కోపాన్ని నియంత్రించుకోవడం.

ఈ రెండూ చేయగలిగితే వారిని అతిమానవజాతి దిశగా నడిపించవచ్చు. ఒకరు సాంప్రదాయాలను, కట్టుబాట్లను తెంచుకో గలిగితే వారు సాధారణ మానవీయ పరిమితుల నుండి స్వేచ్ఛను పొందుతారనే భావన ఒకటుంది. కానీ అది తప్పు. అతిమానవుడిగా ఎదగటానికి ఆ రెండు పనులను తప్పక సాధించాలి — అబద్ధాలు చెప్పకపోవటం, తనను తాను నియంత్రించుకోవడం. దైవానికి సంపూర్ణ శరణాగతిని చేయటం చివరి నియమం కానీ ఆ రెండింటిని ముందు సాధించి తీరాలి.


*

నేర్చుకోవడంపై ప్రేమ కనబరచటం అనేది ఒకరు పసి పిల్లవాని కివ్వగల అత్యంత విలువైన బహుమతి, సర్వదా, సర్వత్రా.

*

తనను తాను తెలుసుకొనుట, తనపై తాను ఆధిపత్యం నెరుపుకోవడం తెలుసుకో గలుగుటయే ప్రతి ఒక్క జీవికి అమూల్యమైన సంపదగా నుంటుంది. తనను తాను తెలుసుకోవడ మనగా తాను చేసే చర్యలు, ప్రతిచర్యలు వెనుక నున్న ఉద్దేశాలను

మే 2018



బుద్ధుని మార్గము

సంపాదకీయం

బుద్ధుడు దాదాపు 2500 సంవత్సరాల క్రితం లేక అంతకు పూర్వం జీవించారు. అయినా నేటికీ భువి పైన, మానవజాతి పైన అతని ప్రభావం కొనసాగుతున్నది. శ్రీమాతకు స్వయంగా బుద్ధునితో ఆంతరిక పరిచయం కలిగింది. ఈ విషయం 'ప్రార్థనలు, ధ్యానములు' అను పుస్తకంలో ప్రస్తావించబడిన ఆమె అనుభవాలలో ఒకటిగా అతి సుందరంగా పొందుపరచబడింది. ఆమె శ్రీఅరవిందులతో కూడి వర్థిల్లజేసిన పూర్ణయోగం మానవజాతికి అందించడానికై పాండిచ్చేరికి విచ్చేయుటకు పూర్వమే ఆమె బౌద్ధ సాంప్రదాయ యోగంలోను, గీతాసాంప్రదాయ యోగంలోను నిష్ణాతురాలు. అయినప్పటికీ ఈ పూర్వకాల యోగాభ్యాసాలు కొన్ని శ్రీఅరవిందులు రూపొందించబూనిన ఉన్నతతర యోగానికి గట్టి పునాదిని ఏర్పరచుటలో తోడ్పడ్డాయి. కాలంతో పాటు బుద్ధుని బోధనలు కూడా, ఇతర ఆధ్యాత్మిక బోధనలు వికృతం గావించబడినట్లుగానే, వేరే రంగును పులుముకున్నప్పటికీ, ఆశ్రమ జీవిత తొలి దశలో శ్రీమాత దమ్మపథంలోని భాగాలను బోధించటం కేవలం కాకతాళీయం కాదు.

ఈ నేపథ్యంలో మహాజ్ఞాని, మహోన్నతుడు అగు బుద్ద భగవానుడు ప్రతిపాదించిన ఉదాత్తమైన సత్యంకు ఈ సంచికను అంకితం చేస్తున్నాము.

— సంపాదకుడు



భారతదేశానికి రాక పూర్వమే శ్రీమాత బౌద్ధ, గీత సాంప్రదాయ యోగాలలో నిష్ణాతులు. ఆమె యోగం ఈ రెండు యోగవిధానాల దివ్యమైన సంయోజనం దిశగా సాగుతుండింది. అటు తరువాత, ఆమె ఇక్కడికి రావటం సహజం. నా యోగానికి ఒక నిర్దిష్ట పద్ధతిని రూపొందించటంలో ఆమె తోడ్పడింది, ఇంకా తోడ్పడుతున్నది. ఆమె సహకారం లేకుండా ఇది సాధ్యపడేది కాదు.

ఈ యోగమార్గంలోని రెండు విశిష్ట దశలలో ఒకటి శ్రీమాత ఆశ్రయం పొందటం.[1]

---

1 కొంతకాలం తరువాత ఒక సందర్భంలో శ్రీఅరవిందులను రెండవ దశ ఏమిటి అని ప్రశ్నించినపుడు వారిచ్చిన సమాధానం: "దివ్యజీవనానికై సాధకుడి ఆకాంక్ష".

CWSA 33:36 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

బుద్ధుడు

ఒక పరిపూర్ణ మానవుడు, సిద్ధుడు లేదా బుద్ధుడు, సార్వజనీనుడై సమస్తమును కరుణతో, ఏకత్వంతో ఆలింగనం చేసుకొన్నవాడై, తనను తాను తనలో చూసుకొన్నట్లుగా ఇతరులలో తనను చూస్తాడు. ఆ విధంగా చేయడం ద్వారా, అదే సమయంలో, సార్వజనీన ఓజస్సుయొక్క అనంత శక్తిలో ఏదో ఒకదానిని తనలోనికి లాక్కుంటాడు. అటువంటిది, తరతమ భావం లేనటువంటి భారతీయ సంస్కృతీ ఆదర్శం.

CWSA 20:254

కష్టాల వలన మనుషులు పొందుతున్న శోకం నుంచి బయట పడటానికి వారి కష్టాలను తొలగించడానికై కలిగే గట్టి ప్రేరణయే కారుణ్యం అని పిలవబడుతుంది. ఇతరుల కష్టాలను చూసినా లేదా ఆలోచించినా కలిగే దుర్బలత్వంతో కూడిన నిస్సహాయత వలన కలిగిన అనుభూతి జాలి అవుతుంది. దుర్బలమైన నిస్సహాయస్థితి వలన పొందేది కరుణ కాదు, అది జాలి పడటం అవుతుంది. కరుణ వహించడం అనేది బలవంతుల విధానం, జాలి పడటం అనేది దుర్బలుల ధోరణి. కారుణ్యంతో కదలిపోయినవాడై మహారాజు బుద్ధుడు తన భార్యను, బిడ్డను, తల్లిదండ్రులను, స్నేహితులను, బంధువులను వదలివేయగా, వారంతా శోకసముద్రంలో మునిగిపోగా, ప్రపంచంలోని కష్టాలను తొలగించివేయడానికి ఆయన పయనమైపోయాడు. తీవ్రకారుణ్యంతో, క్రోధితమైన కాళీమాత శోకం నుంచి సర్వులకు విమోచనం కలిగించడానికై లోకాలలో ఉన్న రాక్షసులను సంహరించి, భూమిపై వారి రక్తపు టేరులు పారించింది.

Writings in Bengali by Sri Aurobindo, p. 153

యోగంయొక్క సర్వసాధారణ విధానం సత్త్వం ద్వారా పయనించడం, పతంజలి యమనియమాలతో లేదా ఇతర యోగాల, ఇతర సాధనాలతో సంసిద్ధతను, పరిశుద్ధిని పొందడం, ఉదాహరణకు, భక్తి మార్గాలలోని సాధుత్వం, బౌద్ధమతంలోని అష్టాంగ మార్గం మొదలైనవి. మన యోగంలో సత్త్వము ద్వారా పొందే పరిణామం సమచిత్తాన్ని (సమత) అలవరచుకోవడంతోను మరియు చైత్యపరివర్తనతోను పునఃప్రతిష్ఠ చేయబడుతుంది.

CWSA 23:424

పరిణామంతో సంబంధించి ఉండకపోతే అవతార ప్రయోజనం నెరవేరదు. ఒకదాని తరువాత ఒకటిగా క్రమంలో వచ్చిన హిందూ దశావతారాలు, చెప్పాలంటే, ఆ క్రమం ఒక పరిణామ గాథ. మొదటిది మత్స్యావతారం, తరువాత నేలకు, నీటికి మధ్య తిరుగాడుతూ రెండింటికీ చెందిన జంతువుగా, తరువాత నేల మీద జీవించే జంతువుగా, తరువాతది నర-సింహ అవతారం, ఆ తరువాత మనిషి మరుగుజ్జుగా, చిన్నవాడుగా, పెరుగుదల లేని శరీరం గలవాడుగా సహజంగా ఉన్నప్పటికీ తనలో దైవత్వాన్ని కలిగి సృష్టినంతటినీ తన స్వాధీనంలోకి తీసుకొనేవాడుగా, తరువాతది రాజసిక, సాత్త్విక, నిర్గుణ అవతారాలు, మానవ అభివృద్ధికి దోహదం చేస్తూ ప్రాణిక రాజసం నుంచి సాత్త్విక మనస్సుగల మనిషి వరకు, ఇంకా అధిమానసిక అతిమానవుని వరకు. కృష్ణుడు, బుద్ధుడు, కల్కి అవతారాలు ఆఖరి మూడు దశలను చూపిస్తాయి. అవి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన దశలు — కృష్ణుడు ఊర్ధ్వమనస్సు (అధి మనస్సు) సంభావ్యతను వెల్లడి చేశాడు, బుద్ధుడు పరమోత్కృష్ట విమోచనను దాటి ఆవలకు పోయే ప్రయత్నం చేశాడు, కాని, ఆ విమోచన, ఇంకా నకారాత్మకమే అయినటువంటిది, తిరిగి భూమి మీదకు రాకుండా సకారాత్మకంగా పరిణామాన్ని పూర్తి చేయనటువంటిది. కల్కి దైవసామ్రాజ్యాన్ని భూమి పైకి తీసుకువచ్చి, వ్యతిరేకించే అసురశక్తులను నాశనం చేసి దీనిని సరి చేయవలసి ఉంటుంది. ఈ పురోగమనం గమనించ తగ్గది, స్పష్టమైనది.

*

కృష్ణుడు ఊర్ధ్వమనో (అధిమనస్సు) సాధ్యతను దాని రెండు పార్శ్వాలైన చల, అచల సాక్షాత్కారాలతో వెల్లడి చేశాడు. బుద్ధుడు మనస్సు నుంచి సర్వోత్కృష్టునిలోని నిర్వాణానికి గురిపెట్టే ప్రయత్నం, ఆయన తర్వాత శంకరుడు మరొక విధంగా చేసినట్లుగానే, చేశాడు. ఇద్దరూ ఇతర దశలను (స్థితులను) ఉపేక్షించి దాటిపోవటానికే ఏకీభవిస్తూ, నామరహిత, రూపరహిత కేవలమును పొందే ప్రయత్నం చేసినవారే. అయితే, కృష్ణుడు మటుకు సహజ పరిణామక్రమం ద్వారా ముందుకుపోయే దారి చూపించాడు. తరువాతి సహజసిద్ధమైన అడుగు రూపరహితమైన నిరపేక్షమునకు కాదు, కాని అతిమనస్సుకు. ఈ విధంగా అతిక్రమించిపోయే ప్రయత్నం నేను

పరిగణనలోనికి తీసుకుంటున్నాను. బుద్ధుడు, శంకరుని వలెనే విమోచనంయొక్క క్రియాశీల స్థితిని తెగతెంపివేస్తూ పొరపాటు చేశాడు. కాబట్టి కల్కి ద్వారా అది సరి చేయబడవలసి ఉంది.

CWSA 28:487-88

బుద్ధుని పరిత్యాగం

ఏకమైన పరమాత్మ దర్శనం అన్ని వ్యత్యాసాలను దూరం చేస్తుంది. ఒక అపార ప్రశాంతత, ఒక అపార ప్రేమ, ఒక అపరిమిత దాతృత్వం, ఒక అపరిమిత సహనం, భగవద్దర్శనం చేసిన ధృఢ ఆత్మయొక్క వాస్తవిక ప్రకృతి. పాపము, మాలిన్యము, వ్యాధి, ప్రపంచ కల్మశం అతని మనస్సును మలినపరచ లేవు సరి కదా పెంటకుప్పలో పొర్లాడుతున్న పాపిని లేపటానికి అతడు వంగినప్పుడు అతని దయను తిప్పికొట్టలేవు — స్వయం తన చేతులు మలంవలన మలినమైనా దాని నుంచి అతడు వెనక్కి మరలిపోడు. కష్టాలతో పీకల లోతు కూరుకుపోయి శోకంతో బిగ్గరగా రోదిస్తున్నవారిని ఆ నరకకూపం నుంచి పైకి లేవనెత్తుతున్నప్పుడు కన్నీళ్ళతో అతడి కళ్ళు మసక బారవు. బురదలో కాలుజారి పడిపోయి ఏడుస్తున్న పిల్లవానిని లేవతీసే తండ్రిలాగా వారిని అతడు లేవతీస్తాడు. పిల్లవాడు దెబ్బ తగిలిందని దానినే పట్టుకుని ఏడుస్తూ ఉండటానికే ఇష్టపడతాడు; అతనికి నిజంగా దెబ్బ తగలలేదని తండ్రికి తెలుసు, అందువలన అతడు దుఃఖించడు, అంతే కాకుండా అతడు తన పిల్లవానికి చీవాట్లు సైతం పెట్టడు, సరి కదా అతడు అతడిని పైకి లేవదీసి, మూర్ఖత్వంతో అతగాడి మనసు కల్పించిన బాధ నుంచి ఓదారుస్తాడు. అటువంటి ఆత్మ దైవంగా పరిణమించి, సహాయం చేయటానికీ, రక్షించటానికీ శక్తివంతమై, ప్రేమించే దయింది, అంతే కాని బలహీనతతో బావురుమని రోదించదు, మానవుల కన్నీళ్ళ శోక సంద్రాన్ని తన సొంతవాటితో పెంపుచేయదు. ప్రపంచంలోని కష్టాలను చూసినప్పుడు, బుద్ధుడు విలపించ లేదు. అతడు రక్షించటానికి బయలువెడతాడు. అటువంటి ఆత్మ అతడి బాహ్య ఆత్మకు బయటి ప్రపంచం కొట్టే పిడిగుద్దులకు కచ్చితంగా దుఃఖించదు. కారణం, విశ్వమంతా తానే అయిన అతడు ఏ విధంగా దుఃఖించగలడు? అల్పమైన వ్యక్తిగత మహదాత్మ శోకం ఇక ఎంత మాత్రం అతని చైతన్యానికి ఉండదు, ఏ విధంగా అయితే, దేశాల విధిని తన భుజస్కంధాలపై మోసే రాజుకు తన ఉద్యాన

వనంలో విలాసంగా విహరిస్తున్నప్పుడు ఒక చీమ ఆయన కాలి కింది నలిగిపోయి నప్పుడు ఉండే బాధ కంటే ఎక్కువ ఉండదు. బాధ అనేది అతడికి ఉన్నా తనకు తాను అతడు శోకాన్ని పొందలేడు, ఎందువల్లనంటే, అతడు నివారించవలసి నటువంటి మొత్తం ప్రపంచంయొక్క బాధ అతడికి ఉంది. అతడి సొంత ఆనందం అతడికి తృణప్రాయం, ఎందువల్లనంటే అతడి అధీనంలో మొత్తం విశ్వంయొక్క ఆనందం ఉంది.

CWSA 17:146

బౌద్ధమతంలోని సృజనాత్మక ప్రేరణ

జీవితపు విలువల మీద, మొట్టమొదట వాస్తవంగా దానికదే సందేహం వెలిబుచ్చిన సిద్ధాంతం బౌద్ధమతమే, కాగా అది కేవలం దానిని మేధోపరంగా మాత్రమే వెలి బుచ్చినది; దాని క్రియాశీల భాగాలలో దాని నీతివ్యవస్థ మరియు ఆధ్యాత్మిక పద్ధతుల ద్వారా అది నూత్న విలువలకు శ్రీకారం చుట్టింది. జీవితానికి తీక్షణమైన జవసత్త్వాలను పెంపు చేసింది, అయినప్పటికీ మానవ జీవితానికి మృదుతరమైన ఆధ్యాత్మిక తాత్త్వికత నిచ్చింది. ఆ విధంగా అది జీవితాన్ని విడమరచి చెప్పే కళలు మరియు సామాజికం, రాజకీయం రెండింటిలోను శక్తివంతమైన సృజనాత్మకత కలిగి ఉంది. ఆత్మసత్యాన్ని బాగా సన్నిహితంగా సాక్షాత్కారం చేసుకోవడంతో పాటు, జీవితాన్ని శీఘ్రగతిన, కొత్త నమూనాలోకి ప్రతిష్ఠించటమనేది సహజసిద్ధమైన భారతీయ మనో గతం. కనుక, అన్నిరకాలై నటువంటి దాని స్వస్థత, గొప్పదనము, క్రియాశీల ఉద్ధతి దశలల్లో దానికి ఎల్లప్పుడు తప్పకుండా అది వెనక్కి మరలిపోవలసినదే.

CWSA 20:23

బౌద్ధమతం కేవలం నిర్వాణం, శూన్యం, సృష్టిలో లేకుండా పోవటం మరియు కర్మసిద్ధాంతం ప్రతిపాదించే క్రూరమైన నిరర్థక అస్పష్ట శుద్ధి ప్రక్రియల కోసం పుటం పెట్టడం మాత్రమే కాదు. అది భూమి మీద మానవ జీవితానికి గొప్ప శక్తివంతమైన నియమావళి నిచ్చింది. సమాజం మీద, నైతికత మీద బ్రహ్మాండమైన దాని గుణాత్మక ప్రభావాలు మరియు కళలకు, ఆలోచనలకు, కొంత తక్కువగా సాహిత్యానికి అది అందించిన సృజనాత్మకమైన ప్రేరణ దాని విధానంలోని ధృఢమైన ప్రాణశక్తికి తగి నంత ఋజువు. ఇటువంటి గుణాత్మకమైన మలుపు కట్ట కడపటి వరకు ఖండనం

చేసే దాని తాత్త్విక సిద్ధాంతంలో ఉన్నప్పుడు అది ఇంకా విస్తారంగా భారతీయ సంస్కృతి సమస్తంలోనూ ఉన్నదే.
CWSA 20:239

బౌద్ధకళలో ఆధ్యాత్మిక భావన

ఉదాహరణకు, మనం చాలా సమయం, బుద్ధుని ముందు ఆరాధనాపూర్వకంగా ఉన్నవారితో పాటుగా తల్లీ బిడ్డా ఉన్న, అత్యంత గాఢమైన వాటిలో ఒకటైన, సుకుమార మైన, ఉదాత్తమైన, ఉత్తమ అజంతా కళాఖండాన్ని చూస్తే, మనం తీవ్రమైన పవిత్రాను భూతి ప్రభావమును దర్శించడంతో పాటు, అక్కడ గుమికూడిన వారందరి ఉద్వేగ మును కేవలం బాహ్యంలో అత్యంత తేలికగా గీసిన సర్వసాధారణమైన చిత్రలేఖనం మాత్రమే మనకు కనబడుతుంది. లోతుగా దృష్టిని మరింతగా ప్రసరిస్తే, అది ఎంతో గాఢమై అనుగ్రహపూర్వకమైన, ప్రశాంతమైన ఆ అనిర్వచనీయునికి మానవజాతి ఆత్మ ప్రేమతో మరలుతూ, బుద్ధుని సార్వజనీన కారుణ్యంలో అది దానికదే మనకు భావనాపూర్వకమై, మానవత్వాన్ని చూపిస్తున్నది. ఆత్మగమనం యొక్క ఉద్దేశాన్ని ఆ చిత్తరువు మనకు వివరిస్తున్నది, అందులో బిడ్డ జాగృతమనసు అంకితభావాన్నీ, రాబోయే యువ మావవజాతినీ, దానిని అప్పటికే తల్లి ఆత్మ దర్శించటానినీ, తన ఆధ్యాత్మికానందమును స్థిరపరచుకోవటానికి జ్ఞానం సంపాదించుకోవటాన్నీ మనకు వివరిస్తున్నది. ఆ స్త్రీ ముఖంలోని కన్నులు, కనుబొమలు, పెదిమలు, వదనము, భంగిమ అన్నీ ఈ ఆధ్యాత్మిక ఉద్వేగంతో నిండిపోయినాయి. ఆ ఉద్వేగం చైత్య విడుదల నిరంతర స్మృతి, స్వాధీనతకు, నిలకడతో కుదురుకున్న ప్రశాంత హృదయ భావంతో, అనిర్వచనీయ మృదుత్వంతో నిండిపోయింది. సుపరిచితమైన గాఢత లైనప్పటికీ విస్మయంతో అవి ఇంకా కదులుతూనే ఉన్నాయి. ఎల్లప్పుడూ ఏదో అనంతమైనదానికి ప్రార్థిస్తూనే ఉన్నాయి. శరీరము, ఇతర భాగాలు అనేవన్నీ ఈ ఉద్వేగంయొక్క ద్రవ్యరాశులు కాగా, వాటి భంగిమ దానికి ప్రాథమికమైన రూపధార అయింది. అలా ఉండగా, తన బిడ్డను ముందు పెడుతూ, శాశ్వతుని కలుసుకోవటానికి చాపబడిన చేతులు అంకిత భావముతో దానిని విస్తరిస్తున్నాయి. ఈ విధమైన మానవుని, శాశ్వతుని సంపర్కం ఆ అతిచిన్న చిత్తరువుతో నిగూఢంగా, ధృఢంగా సూచించే ఒక మార్పుతో తిరిగి చూపబడింది. ఇంకా, సంతోషంతో, పసిపిల్లవాని

నవ్వులాంటి జాగృతి రాబోయే గాఢతలకు వాగ్దానం చేస్తున్నది. కాని అది ఇంకా స్వాధీనంలో లేదు. గ్రహించటానికీ, నిలుపుకోవటానికీ చాచబడిన చేతులు మరియు శరీరము దానిలోని వంపులతోనూ, ఊగిసలాటలతోనూ ఆ ప్రాధాన్యతతో సామరస్యా పూరకంగా ఉన్నాయి. వారిద్దరూ ఒకరినొకరు, తమకు తాము మరచిపోయారు, వారు ఆరాధించే, ధ్యానించే దానితో చాలా మటుకు ఒకరి నొకరు స్మృతి లేనివారుగా లేదా కలిపేసుకుంటున్నట్లుగా అనిపిస్తున్నారు. అయినప్పటికీ, ఏకకాలంలో చూపించే మాతృత్వం, ఆధ్యాత్మిక అర్పణపు హావభావాలతో అంకితం చేస్తున్న చేతులు తల్లీబిడ్డను ఒకే చేతలో, అనుభూతిలో ఏకం చేస్తున్నాయి. రెండు ఆకృతులు ప్రతిస్థానంలోను ఒకే లయను కలిగి యున్నాయి, కాని విశేషమైన తేడాతో. మనకు ఇక్కడ కనబడే నిరాడంబరతలోని గొప్పతనము, ఆధిపత్యశక్తి, ఆత్మసంయమం, నిగ్రహం, ఏకాగ్రత వలన కలిగే ప్రబలమైన వ్యక్తీకరణలోని నిండుతనం అనేవి భారత శాస్త్రీయ చిత్రకళారీతిలోని పరిపూర్ణమైన పద్ధతి. ఈ పరిపూర్ణత వలన బౌద్ధ చిత్రకళ మతాన్ని కేవలం చిత్రాలలో వివరించటమూ, దాని ఆలోచనా మరియు దాని ధార్మికానుభూతి, చరిత్ర, ఇతిహాసాల వ్యక్తీకరణ మాత్రమే కాకుండా, బౌద్ధమతం యొక్క ఆధ్యాత్మిక భావననూ, భారతీయ ఆత్మకు దాని నిగూఢార్థాన్నీ బయటపెట్టే వివరణగా కూడా అయింది.

CWSA 20:309-11

బుద్ధుని బోధనలోని సారాంశం

అంతరంగంలో పూర్తిగా కదలిక లేని వ్యక్తిత్వరహితమైన, శూన్య ప్రశాంతత, బాహ్యంలో శాశ్వత వాస్తవికతలు దివ్యప్రేమ, దివ్యసత్యం, దివ్య ధార్మిక కర్మలను చేయడం బహుశా బుద్ధుని బోధయొక్క నిజమైన సారాంశం అయి ఉండవచ్చు — అహంకారానికీ, వ్యక్తిగత కర్మల పరంపరకు, మార్పుచెందే రూప, భావ తాదాత్మ్య తకు ఈ విధమైన ఆధిక్యతను కలిగి ఉండటమే కాని, భౌతిక జన్మ ఇబ్బందులు, కష్టాల నుంచి పారిపోవటమనే అల్ప ఆదర్శం మటుకు కాదు. ఏ విధంగా చూసినా, ఏ విధంగా అయితే పరిపూర్ణ మానవుడు తనలో నిశ్శబ్దమును, క్రియాకలాపాలను కలుపుతాడో, అదే విధంగా పూర్తిగా ఎరుక కలిగిన ఆత్మ సంపూర్ణ స్వతంత్రతకు, మహా-అస్తిత్వరహితానికి వెనక్కి చేరిపోతుంది, దాని మూలంగా అది మహా ఉనికి

మీద, విశ్వం మీద పట్టును కోల్పోదు. ఆ విధంగా అది దాని లోపలనే నిరంతరంగా విశ్వంలో దివ్య ఉనికియొక్క శాశ్వత అద్భుతాన్ని పునరుత్పత్తి చేస్తుంది, అయినా, ఇంకా ఎల్లప్పుడూ దానికి ఆవలగా, సమంగా, వాస్తవంలో, దానికదే ఆవలగా కూడా.

CWSA 21:34 అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

నిర్వాణము

నిర్వాణ మనగా ఏమిటి

పూర్వాచార బౌద్ధమతంలో అది అఖండత్వం కోల్పోవటాన్ని సూచిస్తుంది. అయితే ఆత్మ యొక్క శిథిలావస్థను కాదు, కారణం బౌద్ధమతంలో ఆత్మకు స్థానంలేదు. కాని కలగూరగంపలో లాగా మనసులో పోగయి కదలాడుతున్న సంబంధాలు లేక సంస్కారాలు ఏవైతే మనల్ని మనంగా నిలిపాయని భ్రమ పడుతున్నామో అది ముక్కలై పోవడాన్ని సూచిస్తుంది. మాయను ప్రతిపాదించే వేదాంత భావనలో అది ముక్కలై నాశనమొందటం కాదు, కానీ మోసపూరితమైన అవాస్తవ మైన వ్యక్తి ఆత్మ అంతరించి ఒక సత్యమైన జీవాత్మగా లేక బ్రహ్మన్, గా ప్రత్యేకమవటం ఆవిధంగా కనుమరుగై అంతరించేది వ్యక్తిత్వ భావన. అనుభవం-దీనిని మనం ఒక బూటకపు జ్యోతి ఆర్పబడి, (నిర్వాణం) ఒక వాస్తవమైన దివ్యజ్యోతిగా

సందేహం లేకుండా బౌద్ధమతం దేశానికి అపారమైన మంచినే చేసింది, అయినప్పటికీ, తక్కువ నష్టం జరగలేదు. కారణం, సన్యాసమార్గం ప్రతి చోటా వ్యాప్తి చెందడం, యోధుల వర్గం (క్షత్రియులు) వారి కర్తవ్యకర్మను త్యాగం చేయడం; చిట్టచివరకికి, దానికదే దేశం నుంచి వెడలగొట్ట బడింది. ఈ తప్పును నూతన యుగంలోని కొత్త విధివిధానం తప్పక అనుమతించనే కూడదు.

BW:82-83 అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రకటితమవడం అనవచ్చు. ఆధ్యాత్మికపరమైన అనుభవంలో, కొన్ని మార్లు దానిని వ్యక్తిత్వభావన తన ఉనికిని యావత్తు ఒక అప్రమేయమైన విశ్వ చేతనలో లయమొందించడం అనవచ్చు.

వ్యక్తిగా ఉన్నవారు విశ్వచేతన, విశ్వశక్తి వాటి కార్యాచరణకు ప్రసరణకు మాధ్యంగా లేక కేవలం ఒక కేంద్రంగా ఉంటాడు. లేదా దానిని వ్యక్తిగతమైన చేతన ఒక అతీతమైన అస్తిత్వంలోను, చేతనలోను లయమొందిన అనుభవంతో, విశ్వభావన, వ్యక్తిత్వభావన అంతరించడం అనవచ్చు; లేక విశ్వకార్యాచరణను గురించి ఎరుక కలిగి, దానికి ఆధారభూతమై వున్న ఒక సర్వోత్కృష్ట స్థితిలో లయ మొందడం కూడా కావచ్చు. కాని 'వ్యక్తి' అని అనడంలో అర్థమేమిటి? సర్వ సాధారణంగా మనమా పేరుతో పిలిచేది ఒక సహజమైన అహాన్ని, అది మహా ప్రకృతియొక్క కార్యక్రమాన్ని మనసులోను, శరీరంలోను జతగా కలిపి వుంచుతుంది. ఈ అహం అంత మొందించబడాలి. లేనట్లయితే సంపూర్ణవిముక్తి సాధ్యపడదు; కాని ఒక ప్రత్యేకవ్యక్తిగాని, ఆత్మగాని ఈ అహం కాదు. వ్యక్తి యొక్క ఆత్మ అనేది ఒక ఆధ్యాత్మిక అస్తిత్వం. కొన్ని మార్లు దైవానికి ఒక శాశ్వతమైన భాగంగా వర్ణించబడింది. దైవమే స్వయంగా అనేకముగా ప్రకటితమవటానికి ఆధారభూతమైన దిగా కూడా వర్ణించబడింది. సత్యమైన ఆధ్యాత్మిక జీవి ఇదే. మన అహాన్ని అవాస్తవమైన ప్రత్యేకపరచు వ్యక్తిత్వ భావనను త్యజించినప్పుడు అతీతుడు సర్వాతీతుడు, సర్వేశ్వరుడు అగు పరమాత్మునితోను, సర్వజీవులతోను ఏకత్వభావన సిద్ధింపజేసుకున్న ప్పుడు ఈ సత్యమగు ఆధ్యాత్మిక జీవి తన సంపూర్ణ వాస్తవికతలో ప్రకటితమౌతాడు. దివ్యజీవనం సాధ్యపడునట్లు చేసేది ఇదే. నిర్వాణదిశగా వేయబడే అడుగు ఒకటి ఇదే; అవాస్తవమగు ప్రత్యేకపరచు వ్యక్తిత్వం అంతరించడం మన శాశ్వతమైన, సత్యమైన అస్తిత్వం సిద్ధింపచేసుకొనుటకు దైవంలో దివ్యమైన జీవితం గడపటానికి అవశ్యం పాటించవలసిన నియమం. అయితే ఇది మనం జీవితకాలంలో, ప్రాపంచిక జీవితంలో సాధించగలం.

CWSA 29: 305-306

బౌద్ధమత పరమగు నిర్వాణము

బౌద్ధమత బోధనలు అంతరంగ జీవినిగాని ఆత్మనుగాని ఒప్పుకోవు. క్షణక్షణం

సాగే చైతన్య స్రవంతి మాత్రమే గుర్తింపు పొందబడింది. చైతన్యం కేవలం చక్రంతో పరిభ్రమింప బడేదిగాను భావించబడింది. ఈ కలయికలు మూటను విప్పి వాటిని చెల్లాచెదరుగా పడవేస్తే, (కలయికలను, సంస్కారాలని కూడా అంటారు) ఆ మూట విడిపోతుంది; నేను అనే భావన లేక మనిషి ఉనికి శాశ్వతం అనే భానవ అంతమొందు తుంది. దానితో చైతన్య స్రవంతి ఆగిపోతుంది. కర్మ చక్ర భ్రమణం ఆగిపోతుంది. కొందరి ప్రకారం ఒక శూన్యం, ఒక నిగూఢమైన ఉనికి లేని స్థితి, ఒక అభావం దేని నుంచైతే ఉద్భవిస్తుందో అది మాత్రం మిగులుతుంది. మరికొందరు ఒక రహస్యమైన మహా శాశ్వతత్వం దేనిలో నైతే మనిషికి ఉనికి ఉండదో అదే మిగులుతుంది. ఇదే నిర్వాణము. బుద్ధుడు స్వయంగా విశ్వం ఉనికికి ఆవల ఏ మున్నదో చెప్పడానికి ఎప్పుడూ నిరాకరించాడు. దైవం గురించిగాని, ఆత్మను గురించిగాని పరం బ్రహ్మను గురించి గాని మాట్లాడలేదు. వాటిని గురించి చర్చించడం నిష్ప్రయోజనమనే వాడు. ఈ అసంతుష్టమైన ఐహికమైన ఉనికికి గల కారణాలను, దానిని రద్దు పరచే విధానాలను తెలుసుకోవడం మాత్రం అవసరం అని అన్నాడు.

*

బౌద్ధమతం ప్రతిపాదించిన నిర్వాణం, అద్వైతంలోని మోక్షం రెండూ ఒకటే. దాని అనుభూతి ఎలాంటిది అంటే ఒకరు తాను ఒక ప్రత్యేకతగల వ్యక్తిగా, ఫలానా పేరు ఆకారం గల వాడిగా కాకుండా, ఒక అనంతమైన,శాశ్వతమైన ఆత్మ అఖండమైన బ్రహ్మాండమందున్నప్పుడు నిరాశ్రయుడిగా కాలమందు కొనసాగుతున్నప్పటికీ అంతులేని వాడిగా నున్నట్టు అనుభూతిని పోలినట్లుంటుంది. గమనించతగ్గ విషయమేమిటనగా, ఒక వ్యక్తి సమాధి స్థితిలో మాత్రమే పొందగల ప్రయోజనాన్ని, అట్టి స్థితిలో సైతం కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వర్తించి పొందగలడు.

*

బుద్ధుని నిర్వాణం, గీతలో ప్రవచించబడిన నిర్వాణం రెండూ సమానమే. గీత నిర్వాణాన్ని బ్రహ్మైక్యంగా అభివర్ణించింది కానీ బుద్ధుడు నిర్వాణం దేనిలోకి చోటుచేసుకున్నదో అనే విషయం గురించి ఏమీ చెప్పలేదు. దానికి ఎలాంటిపేరు పెట్టడానికి మొగ్గు చూపలేదు. తరువాతి కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన బౌద్ధమత సాంప్రదాయాలు దానిని మహాశూన్యమని, చైనీయుల టావోకు సమానమైన ఉనికి

లేనిదిగా ఏదైతే సర్వము అనబడిందో, దానిగా వర్ణించబడింది.

CWSA 29: 428- 29- 431

శ్రీఅరవిందుల — నిర్వాణము

నిర్వాణ స్థితిని చేరుకోవడం నా యోగం యొక్క మౌలిక ఫలితం. అది నన్ను అకస్మాత్తుగా ఎటువంటి మానసిక లేక ప్రాణిక ప్రేరణచే కలుషితమొందని ఆలోచనా శూన్యమైన అంతకు మించిన స్థితిలోనికి పడవేసింది. అక్కడ అహం లేదు. వాస్తవమైన ప్రపంచం లేదు. దాని ప్రశాంతతత స్తంభించిన ఇంద్రియ సంవేదనల నేపథ్యంలో గమనించినప్పుడు సారాంశంలోని సత్యదూరమైననటువంటి అర్థరహితమగు ఆకారాలు, చీకటి కోణాల సంకలనం దాని ప్రశాంత నిశ్శబ్ద స్థితిని ప్రభావితం చేసినట్లుగా అర్థమయింది. అక్కడ ఏకమైనవాడులేడు. ఏకం, అనేకమైనవాడు సైతం లేడు. కేవలం సత్యమైనటువంటి ఆ 'సత్', మాత్రం ఉంది. దానికి విశిష్టిత లేదు. సంబంధబాంధవ్యాలు లేవు. పారదర్శకత ఉంది. అది వర్ణనా తీతమైనది. ఆలోచనలకు అందనిది, స్వచ్ఛమైనది, అయినప్పటికీ పరమోత్కృష్టమైన వాస్తవికతగల ఏకైక వాస్తవం. ఇది మానసిక అనుభవం ఏ మాత్రం కాదు. లేక ఊర్ధ్వసీమలలో యెక్కడో కలిగిన క్షణికమైన దర్శనం కాదు ఊహా మాత్రమైన అంశం కాదు. అది నిశ్చయమైనది. ఏకైక నిశ్చయమగు వాస్తవికత భౌతికప్రపంచంలా కనిపించేదాని నంతటా వ్యాపించి ఎట్టి మినహాయింపులూ లేకుండా ఆక్రమించి, లేక ఇంచుమించుగా వరదలతో ముంచెత్తినట్లుగా కనిపించే అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్త అనగా సర్వ వ్యాప్తమగు భౌతిక ప్రపంచం కాదు. వాస్తవమైనది అది మాత్రమే. వేరేదీ కాదు, వేరేదానిని వాస్తవమైనదిగా నిశ్చయమైనదిగా, ధృఢమైనదిగా కనిపించుటకు అవకాశమీయదు. నా కప్పుడు కలిగిన అనుభవం, సంవత్సరాల తరువాత నేను పొందిన వర్ణనాతీతమైన పరమానందం. నన్ను ఉల్లాసభరితం చేసిందని, పారవశ్యానికి లోను చేసిందని చెప్పనుగాని నాకు చెప్పనలవికాని పరమ ప్రశాంతతను, ఒక బ్రహ్మాండమైన నిశ్చల స్థితిని ఒక నిర్బంధం నుండి విడుదలపొందిన అపారమైన స్వేచ్ఛానుభవాన్ని కలిగించాయి. నేనా నిర్వాణస్థితిలో రాత్రింబవళ్ళు గడిపాను. ఇతరవిషయాలు దానిని అస్థిరపరచడం దానిలో మార్పును కలిగించడం మొదలిడక పూర్వం. హృదయాంతర్గతమైన ఆ అనుభవం దాని నిరంతర జ్ఞాపకాలు, ఆ

అనుభూతి మరల మరల కలగటం కొనసాగించే వరకు పైనుండి వచ్చిన అతి చేతనలోనికి అంతర్థానమొందింది. అయితే ఈ లోపల ఒక అనుభవం మరొక అనుభవానికి తోడై దానంతట అది ఈ మొట్టమొదట అనుభవంతో మేళవించింది. ప్రారంభదశలో ప్రపంచం కేవలం భ్రమ అనే భావన స్థానే అట్టి భ్రమ,[1] కేవలం ఒక స్వల్పమైన పైకి కనిపించే విషయమని దాని వెనుక ఒక బ్రహ్మాండమైన దైవిక వాస్తవికత దాని పైన ఒక సర్వోత్కృష్టమైన దైవిక వాస్తవికత ఉన్నదని తెలియవచ్చింది. ప్రాథమికంగా కేవలం చలన చిత్ర రేఖా రూపంగానో, లేక ఛాయగానో కనిపించిన తీవ్రమైన దైవిక వాస్తవికత ప్రతిదానికి హృదయాంతర్గకంగా నున్నదని కూడా తెలియవచ్చింది. ఇది ఇంద్రియ సంవేదనలలో మరోసారి బందీ అవడం కాదు, పరమోత్కృష్ట అనుభవం నుండి క్రిందికి పడిపోవడం గాని తగ్గిపోవడంగాని కాదు. దానికి బదులు పరమసత్యాన్ని నిశ్చింతగా ఉన్నత స్థాయికి ఎదిగేదిగా, విస్తృతం చెందేదిగా అరుదెంచింది. లక్ష్యాలను దర్శించినది ఆత్మ, ఇంద్రియ సంవేదనలు కాదు. పరమ ప్రశాంత స్థితి, నిశ్శబ్దస్థితి, అనంతత్వం లోని స్వేచ్ఛాయుత స్థితి, ప్రపంచంలో లేక ప్రపంచాలన్నింటిలో కేవలం దైవంయొక్క అనంతమైన శాశ్వతత్వంలో నిరంతరం చోటు చేసుకొనే సంఘటన మాత్రమే.

CWSA 35: 249-250

ఈ యోగం యొక్క అనుభవం నిర్వాణానికన్నా లేక నిర్వికల్ప సమాధికన్నా తక్కువైనది కాదు. ఉన్నతమైనది.

CWSA 29: 433

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

---

[1] వాస్తవానికి ఈ భ్రమ ఏదో నిరాధారమైనది. అవాస్తవమైనది. చేతనపై బలవంతంగా మోపబడినట్లుగా భావించరాదు. అది చేతనాపూర్వక మనస్సుతో, సంవేదనతో అపార్థం చేసుకోబడిన విషయం; ప్రత్యక్షమైన ఉనికిని అవాస్తవమైనదిగా దుర్వినియోగ పరచబడినది.

CWSA 35: 249-50

బౌద్ధమతం

గౌతమ బుద్ధుడు ఈ ప్రపంచాన్ని విడిచి దూరంగా వెళ్లాడు. తన సమయాన్ని ధ్యానంలో గడిపాడు. ఆ ధ్యానంలో భౌతిక జీవనంలో ఎదురౌతున్న బాధలకు, పాపాలకు, దుఃఖాలకు, ఆకలిదప్పులకు, ఆఖరికి మరణానికి కారణం ఏదో అన్వేషించాడు. వాటిలో నుండి బయటపడే తరుణోపాయాన్ని తెలుసుకున్నాడు. తనకు తెలిసిన ఆ సత్యాన్ని తన శిష్యులకు, అనుయాయులకు బోధపడేలా చేయటానికి విశేష కృషి చేశాడు.

కాని బుద్ధుని జీవితకాలంలోనే ఆయన బోధనలు వక్రీకరింపబడి ప్రచారం చేయబడ్డాయి. ఆయన మరణానంతరం అవి ఒక సమగ్రమైన మతసిద్ధాంతంగా రూపొందాయి. క్రమంగా ప్రజాదరణ పొందాయి కూడా.

కాలగమనంతో పాటు బుద్ధుని శిష్య పరంపర ఆ మత సూత్రాలపై తమకు బోధపడిన విధంగా అన్వయాలు చేసి అనేక విభిన్న వ్యాఖ్యానాలకు, శాఖలకు కారణ భూతు లైనారు. ఈ విధంగా అసలు బుద్ధ భగవానుడు ఏమి చెప్పాడో అది క్రమంగా కనుమరుగైంది. దక్షిణాపథానికి, ఉత్తరాపథానికి, దూర ప్రాచ్య దేశాలకు వేరు వేరుగా శాఖలు ఏర్పడ్డాయి. దేనికి దానికి, అదే అసలైనదిగా ప్రచారం లోనికి వచ్చాయి.

ఇదే విధంగా క్రైస్తవం కూడా విభిన్న ప్రాంతాలలో, విభిన్న రూపాలను సంత రించుకున్నది. ఈ నాడు ఏసుక్రీస్తే గనుక తిరిగి వస్తే తాను ఆనాడు చెప్పినదీ, ఈనాడు ప్రచారంలో ఉన్నదీ ఒకటి కానే కావని ఇట్టే గ్రహించగలడు. ఇటువంటి భ్రష్టత్వమే బౌద్ధమతానికి కూడా వచ్చి పడింది. ఈనాడు గౌతమ బుద్ధుడే వచ్చి తన పేరు మీద స్థాపితం అయిన మతం ఈ విధంగా రూపాంతరం చెందటం చూచి కలత చెంది 'నిర్వాణానికి' దారి చూచుకుంటాడు! అన్ని మతాలదీ ఇదే కథ. ఎక్కడో ఒక మహా ప్రవక్త జన్మిస్తాడు; తాను గడించిన అనుభవాన్ని పురస్క రించుకొని ఒక 'దివ్యసత్యం' బోధిస్తాడు. అది మతంగా మారిన తరువాత క్రమంగా ఆ మతం పేరున వ్యాపారం జరగటం మొదలౌతుంది. క్రమంగా అదొక రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. దానికి ఒక నిర్వాహక వ్యవస్థ, చట్టాలు, సూత్రాలు, ఆచరణ విధానాలు వచ్చి చేరుతాయి. కర్మకాండ, పూజాదికాలు చోటు చేసు కుంటాయి. ఇక అన్నీ ఆచరణీయాలే, అన్నీ శాశ్వత సత్యాలే. నియమాలను నిజా

యితీగా అనుసరిస్తే సత్ఫలితాలు, ఉల్లంఘిస్తే దుష్ఫలితాలు వస్తాయనే నమ్మకం బలపడుతుంది.

CWM 3;76-77

బౌద్ధంలోని విభిన్న శాఖలు

రకరకాల బౌద్ధమతాలు ప్రచారంలో వున్నాయి. అందులో 'నిరీశ్వర' శూన్యవాదం కూడా ఒకటి. చాలా వరకు బౌద్ధం 'శాశ్వతత్వాన్ని' అంగీకరిస్తుంది. అది 'కర్మ' లకు, 'సంస్కారాలకు' అతీతంగా వుంటుంది. శూన్యవాదులు 'శూన్యం' 'లావోసే' అనే జపాన్ వేదాంతి చెప్పిన 'టావో' మార్గమే! 'శూన్యమే' పరిపూర్ణత. అదే విధం గా 'ఉన్నత మానసం' వేదాంతపరమైన క్రమశిక్షణను అందుబాడులోనికి తెచ్చేదే! ఇదే 'బౌద్ధం' లోని వేదాంతం. బౌద్ధం వ్యక్తిలోని నిమ్నప్రకృతిపై విజయం సాధించటం అనేదానికి ప్రతీక అని చెప్పవచ్చు.

CWSA 29:433

'హీనయానం', 'మహాయానం' అంటే ఏమిటి

ఈ రెండూ 'పాళీ' భాషను అనువదించటంలో పుట్టిన పదాలు. నాకు తెలిసినంత వరకు 'ఉత్తరాది'లో ప్రచారంలో ఉన్న శాఖను 'మహాయాన' మనీ, 'దక్షిణాది'లో ఉన్న శాఖను 'హీనయాన' మనీ అంటారు. 'హీనయానం' అందుబాటులో ఉన్న బుద్ధుని బోధలను యథాతథంగా అనుసరించాలని ఆశిస్తుంది.

బుద్ధుడు 'తాను దేవుడను కాదు' అన్న విషయం మీకు గుర్తుండే ఉంటుంది. ఇందులో 'అహం' ఉంటే అవకాశమే లేదు. అదే విధంగా తాను ఊర్ధ్వ లోకాలకు చెందిన 'అవతార పురుషుడను' అనే సూచన కూడా లేదు. అసలు ఇలాంటి అనేక నమ్మకాలను ఆయన విశ్వసించ లేదు.

దక్షిణాది మతాలు ఈ మిథ్యావాదాన్నే సమర్థించాయి. 'నేతి', 'నేతి', 'నేతి' అనే ప్రశ్నించే సాంప్రదాయమే దీనికి ఆధారం. ఉత్తరాదిలో — ముఖ్యంగా టిబెట్టు, చైనాలలో — అనేకమంది 'బోధిసత్వులను' ఆరాధిస్తారు. 'బోధిసత్వులు' విజ్ఞులైన దైవస్వరూపాలుగా గుర్తింప బడ్డారు. ఆ దేశాలలో దేవాలయాలను దర్శించిన అనుభవం మీకు ఉందో, లేదో నాకు తెలియదు. నేను మాత్రం చైనా, జపాన్‌లలో అనేక దేవా

లయాలు దర్శించాను. అక్కడి దేవాలయాలలో ప్రవేశించగానే అనేక 'బోధిసత్వ' విగ్రహాలు దర్శనం ఇచ్చాయి. ఆ 'బోధిసత్వులు' బుద్ధుని శిష్య, ప్రశిష్యులే. కొన్ని ప్రకృతి శక్తులు కూడా 'బోధిసత్వులై' వెలిశాయి. లెక్కకు మిక్కుటంగా ఉన్న విగ్రహాలు చూసేసరికి నాకు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. కాని దక్షిణాదిన బౌద్ధ దేవాలయాల్లో ఒక్క విగ్రహమూ కనబడదు. దీన్ని బట్టి 'మహాయానం' లో విగ్రహాలకు ప్రముఖ స్థానం ఉందనీ, తక్కువగా ఉన్నచోట 'హీనయానమనీ' భావించారేమో తెలియదు.

CWM 4:257-58

ఉత్తరా పథం, దక్షిణా పథం

ప్రశ్న: (నళిని) గ్రంథాలు కూడా చాలా వున్నాయి కదా! ఉత్తరాది వారిది వేరు, దక్షిణాది వారిది వేరుగా వున్నాయి.

సమా: అవును, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో భావసారుప్యం లేదు. దక్షిణాదివారు అంత సరళంగా ఆలోచించరు. ఇక్కడ ఏ రకమైన (బౌద్ధ) విగ్రహారాధన లేదు. ఉత్తరాదిన ఎక్కడ చూచినా లెక్కలేనన్ని దేవతా విగ్రహాలు! అవన్నీ 'పూర్వపు బౌద్ధులు' అన్న మాట. వారు అలా దైవస్వరూపాలుగా (బోధిసత్వులుగా) ఇంకా మారుతూనే ఉన్నారు. ఈ పరిణామమే చైనాకు, అక్కడి నుంచి జపాన్‌కు వ్యాపించింది. జపాన్‌లోని బౌద్ధ దేవాలయాలలో వేల కొలది బుద్ధ విగ్రహాలు కనపడతాయి. అవన్నీ చెక్కిన శిలా విగ్రహాలే. ఆలయంలో అన్నిటి మధ్య ప్రధాన విగ్రహం పరివేష్టితం అయి వుంటుంది. చుట్టూ ఉండేవన్నీ వివిధ రూపాలలో, పెద్దవి, చిన్నవి కలిగి యుంటాయి. అవన్నీ దైవస్వరూపాలుగానే తలపిస్తాయి. ఇక పీఠం క్రింది భాగంలో చిన్న, చిన్న విగ్రహాలు కూడా అమర్చబడి వుంటాయి. కొన్ని విగ్రహాలు జంతువుల ఆకారంలోనూ మలచబడ్డాయి. అవన్నీ ఆరాధించబడిన వారి ప్రతిమలు అనుకోవచ్చు.

దక్షిణ ప్రాంతంలో దీనికి భిన్నంగా ఉంటుంది. అది ఒక విధంగా 'ప్రొటెస్టెంట్' బౌద్ధమతమని చెప్పవచ్చు. అందులో విగ్రహాలు, దైవస్వరూపాలు ఏమీ ఉండవు. ఆ దేవాలయాలను దర్శించినపుడు 'కోరికలే కోరికల ప్రపంచానికి మనను తీసికొని వస్తాయనీ, వాటిని జయించటమే' 'నిర్వాణము' అనీ భావన వస్తుంది.

బౌద్ధంలో సృష్టికర్త ఎవరూ ఉండరు. నాకు అంతకంటె పెద్దగా తెలియదు.

దక్షిణాదిన శాసలాం 'పాళీ' భాషలో వ్రాయబడి ఉన్నాయి. ఉత్తరాహులు వాడింది మాత్రం సంస్కృతం. టిబెట్, చైనా, జపానులలో సహజంగానే ఆయా భాషలలోనే ఉపయోగించారు.

CWM 5:325

శ్రీమాత బుద్ధునితో సంభాషించుట

(ధ్యానసమయం తరువాత సాయంత్రం 5-30 కు పంపిన సమాచారం)

"నీవు నా గురించి ధ్యానిస్తున్నావు. అందువలన నేను నీతో మాట్లాడుతున్నాను. నీ హృదయంలో బంగారు వర్ణంలో ఉన్న ఒక వజ్రం ఉంది. అది ఒక వ్యక్తియొక్క ప్రేమకు చిహ్నం కాదు. కాని దానిని నీ అంతరంగంలోనే ఎరుపు రంగు పరదాల క్రింద దాచుకున్నావు. పైనున్న ఆచ్ఛాదన నీలివర్ణంలో ఉంది. అది కాళరాత్రియొక్క మేలి ముసుగు! నీలో ఉన్న ప్రకాశం దాచుకోటానికేనా? దాన్ని ప్రకాశించనీ; 'తుఫానులకు' భయపడవద్దు. ఇప్పటికే తీరం నుండి గాలుల వలన చాలా దూరం కొట్టుకు వచ్చాము. ఇంకా నీ మెతక ధోరణినే కొనసాగిస్తావా?

"ప్రేమ జనించింది అనంతంలోనే. ఎవరైనా అపార్థం చేసుకుంటారన్న భయం ఉందా? కాని నీవు దివ్యత్వాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవు. ఆ శాశ్వతత్వం మీలో వ్యక్తం కావాలనుకుంటే మిగతా విషయాలను మర్చిపోండి.

"నీవు సురక్షిత ప్రదేశం వీడి బయటకు వస్తున్న బాటసారివి. నీ గుమ్మం ముందే పెద్ద జనసందోహం వుంది. అందువలన నీలో దాచుకొని యున్న ఆ అనర్ఘ రత్నాన్ని బయటపెట్టటానికి సందేహిస్తున్నావు. కాని నీకూ అటువంటి పరిస్థితి ఎదురైంది. అదే సందర్భంలో నేను చెప్పబోయేది ఏమిటో, దాని పర్యవసానం (ఫలితం) ఎలా ఉండబోతుందో నేమ ఊహించగలను. చెప్పాలంటే నాకున్న పరిపూర్ణత చాలదు. అదీ గాక అర్థం చేసుకునేవారికి కూడ అంత తేలిక కాదు. అయినా సంకోచించకుండా నేను నా సందేశాన్ని ప్రజలకు వినిపించాను. నీవు కూడా వాళ్లవైపు చూడు. చెప్పవలసింది నిర్భయంగా చెప్పు. ఇదే నీ మనసులోని ఆరాటం అనుకుంటాను. అలా చేస్తే దప్పికగొన్న వారికి మధుర పానీయం ఇచ్చినట్లవుతుంది.

"నీవు ఇంత కాలం గుప్తంగా దాచి యుంచిన అనర్ఘరత్నం భద్రంగా వుండుగాక! దానికి తిరుగు లేదు. దాని ప్రకాశమే అనేక హృదయాల్లో వెలుగును నింపుతుంది.

నీ శక్తిపై నీకు నమ్మకం లేదు కాని, నీ అజ్ఞానం వలన నీకు ధైర్యం చాలటం లేదు. అవునా? ఇదే నీ అంధకారపు పొరలకు కారణము. ఒక అద్భుత ద్వారం ముందు నీవు నిలబడి ఉన్నావు, తటపటాయిస్తున్నావు. నీకు సంకోచంగా వుంది. అది భయంకర మైనది. కాని నీకు సంకోచం వద్దు. నిర్భయంగా, ధైర్యంగా నీ అంతరాళంలోని ఆజ్ఞను అనుసరించు. ఇదే నా వాక్కు, ఆదేశం. నీకు ఏ మాత్రం అనుమానం రాకుండా ఉండాలనే స్వయంగా ప్రత్యక్షం అవుతున్నాను. నీలో ఉన్న అనంత శక్తిని నీకే కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాను. ఇక నీ జీవిత సత్యాన్ని నీవు గ్రహించగలవు. ఇప్పటికీ ఇది నీకు కష్టంగానే అనిపిస్తుందా? 'నేను ఇలా అనుకోలేదే' అని ఆశ్చర్యపడే రోజు ఎంతో దూరంలో లేదు!

CWM 1;332-33

బుద్ధుని బోధనలు — వాటి ప్రయోజనాలు

మానవాళి పురోగతికి దోహదపడేది ఏదైనా గానీ, అది సహాయమే అవుతుంది. దీనికి విరుద్ధమైనది ఏదైనా అది అడ్డంకియే.

మనం 'దమ్మపథం' చదువుతున్నాము. దానిపై ధ్యానం చేస్తున్నాము. అందుకే నీకు ఈ అనుమానాలు వస్తున్నాయి. ఈ 'దమ్మపథం' ఒక స్థాయిలో ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. స్పష్టమైన సూత్రరూపంలో వ్రాసినవన్నీ క్రమశిక్షణకు సహకరించేవే. వీటిని సరిగా, ప్రయోజనకరంగా ఉపయోగించటమే మన కర్తవ్యం. ఆ విధంగానే ప్రయోజనం చేకూరుతుంది. లేకపోతే నేను ఈ గ్రంథాన్ని ఎంచుకునే దాననే కాదు. ఇక ప్రయోజనం మాత్రం అనుసరించే వ్యక్తి మీద ఆధారపడుతుంది. ఆ ప్రయోజనం ఎలా అంది పుచ్చుకోవాలో సాధకులే నిర్ణయించుకోవాలి.

CWM 9:197 *అనువాదం:* కె. ఆర్. ఎల్. నరసింహారావు

బౌద్ధమతం మరియు ఇతర యోగాలు

ఈ యుగానికి చెందిన బృహత్తరమైన మానసిక యిబ్బందులలో ఒకటి

ఒక లేఖకు సమాధానంగా నేను మీకు శ్రీఅరవిందుల గురించి చెప్పిన వాక్యం యొక్క ఖచ్చితమయిన ప్రతిని తీసుకొని వచ్చాను. మీకు తెలుసు ఈ మానసిక మయిన అలవాటు, (దేనినయితే జనులు మానసికమయిన ఆధిక్యతగా భావిస్తారో) అన్నిటినీ కలగలపి ఒకే స్థాయిలో ముద్దగా చేయటం; అన్ని బోధనలు, అందరు ప్రవక్తలు, అన్ని శాఖలు, మతాలు — ఆ అలవాటు మొత్తం అన్నింటినీ ఒకే స్థాయిలో కలపడం. మీకు తెలుసు "మాకు ఏమాత్రం పక్షపాత వైఖరి లేదు. ఎటువంటి ప్రీతి, యిష్టాలు లేవు. అదంతా ఒకటే." అంతా ఒక భయంకరమైన ఊబి లాంటిది.

ఇది ఈ యుగానికి సంబంధించి అతి పెద్ద మానసికమయిన సమస్య. ఏదేమైనా ఈ అర్థం లేని సమస్యకు సమాధానంగా నేను చెప్పాను, "మీ పొరపాటు ఏమిటంటే — ఖచ్చితంగా చెప్పాలంటే — ఉదాహరణకి, క్రైస్తవ గ్రంథాలు, లేదా బౌద్ధ సిద్ధాంతాలు లేదా శ్రీఅరవిందుల పుస్తకాలు ఒకే లక్ష్యం సూచించే 'తొలి పలుకుల' తో చదివి మీకు థియోసాఫికల్ సొసైటీకి వెళతారు. అందువలన మీరొక అయో

విశ్వంయొక్క ఆవిర్భావం గురించిగాని, అంతం గురించి గాని వేయబడిన తాత్వికపరమైన ఏ ప్రశ్నకు సూటిగా సమాధానమీయడానికి బుద్ధుడు ఎల్లప్పుడు నిరాకరించేవాడు. అతను అనేవాడు: ఒకే ఒక్క విషయం ప్రధానమైనది: మహాపథంలో పురోగమించడం, అనగా వ్యక్తి తనను తాను అంతర్గతంగా పవిత్రీకరించుకోవడం తనలోని అహంకారపూరిత కోరికను ఆసాంతం నిర్మూలించడం.

CWM 2: 88 శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మయంలో, బురదలో కూరుకుపోతారు. దానితో మీకు దేని గురించీ, ఏమీ అర్థం కాదు”

అపుడు నాకు సమాధానం చాలా బలంగా వచ్చింది. నన్నేదో ఆవరించి నేనిలా రాయటానికి ప్రేరపించ బడ్డాను. “ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందులు ప్రాతినిధ్యం వహించేది ఒక బోధన, ఒక దర్శనము మాత్రమే కాదు. అది పరమాత్మ నుండి నేరుగా వచ్చిన ఒక నిర్ణయాత్మకమైన కార్యం.”

అది నా నుండి కాదు. ఆయన నుండి వచ్చింది (మదర్ పైకి చూపిస్తారు). కానీ అది నాకు సంతోషాన్ని కలిగించింది.

అజెండా ఫిబ్రవరి 28 1961

ప్రపంచం గురించి మూడు సంభావ్యతలు

1. బౌద్ధ, శంకర సాంప్రదాయాలు:

ప్రపంచ మొక భ్రాంతి, అజ్ఞానము నుండి జనించిన తమోభూయిష్టమగు దుఃఖమయ క్షేత్రం. చేయయవలసినదల్లా సాధ్యమైనంత త్వరగా దీని నుండి బయటపడి అసలైన అవ్యక్త, నిర్గుణస్థితిలోకి నిష్క్రమించటం.

2. సాధారణంగా అర్థం చేసుకోబడే వేదాంతధోరణి: ఈ విశ్వం భగవత్స్వరూపం. ఎందుకంటే భగవంతు డిక్కడ సర్వత్రా ఉన్నాడు. కానీ దాని బాహ్యవ్యక్తీకరణ వక్రీ కరించబడి ఉంది. అస్పష్టంగా, అజ్ఞానమయంగా, సత్యదూరంగా ఉంది. చేయ వలసినదల్లా అంతరంగంలోని దైవ చైతన్యాన్ని కనుగొని, ప్రపంచం గురించి ఆలో చించకుండా ఆ చేతనలోనే నిమగ్నమై ఉండటం. ఎందుకంటే ఈ బాహ్యప్రపంచం మార్పు చెందదు. అది తన సహజమయిన అచేతన అజ్ఞానాలలోనే నిలిచి ఉంటుంది.

శ్రీఅరవిందులశ్రీమాత దృక్పథం:

ఈ ప్రపంచం ఉన్నదున్నట్లుగా భగవద్భావనకు అనుగుణమైనది కాదు, దాని యొక్క అస్పష్టమూ, వక్రీకరించబడిన వ్యక్తీకరణ. ఇది భగవంతుని చేతనా, సంకల్పాల నిజవ్యక్తీకరణ కాదు. కానీ యిది అలా కావటానికే ఉద్దేశించబడింది. ఇది భగవంతుని అన్ని రూపాలలో, లక్షణాలలో ఆవిష్కరణ కోసం సృష్టించబడింది — వెలుగు, జ్ఞానం, శక్తి, ప్రేమ, సౌందర్యం.

ఇది దానిని గురించి మన దృక్పథం. ఇదే మనం అనుసరించే గమ్యం.

CWM 14:33

యోగంయొక్క రెండు గమ్యాలు

యోగం లక్ష్యం ఆత్మసిద్ధి. కానీ ఆత్మ పరిత్యాగం కాదు.

యోగిక రెండు మార్గాలున్నాయి. ఒకటి ఈ విశ్వం నుండి వైదొలగటం, రెండవది ఈ విశ్వంలో పరిపూర్ణతను సమకూర్చడం. మొదటిది తీవ్ర వైరాగ్యం వలన సంభవిస్తుంది. రెండవది తపస్సు వలన సాధ్యపడుతుంది. మొదటిది మనం సృష్టిలో దైవాన్ని కోల్పోయినపుడు మనలను స్వీకరిస్తుంది. రెండవది మనం సృష్టిలో భగవంతుడిని ప్రతిష్టించుకున్నప్పుడు పొందబడుతుంది. మనది పరిపూర్ణం గావించే మార్గం కావాలని ఆశిద్దాం. పరిత్యాగం చేసే మార్గం కాకూడదు. మన ధ్యేయం ఈ యుద్ధంలో విజయం సాధించటం కావాలి. కానీ ఘర్షణల నుండి తప్పించుకోవటం కాకూడదు.

బుద్ధుడూ, శంకరులు ప్రపంచాన్ని సమూలంగా అసత్యమూ, దుఃఖభూయిష్టమైనదిగా భావించారు. అందువలన ప్రపంచం నుండి తప్పించుకోవటమే వారికి అత్యుత్తమ జ్ఞానంగా అనిపించింది. కానీ ఈ విశ్వం బ్రహ్మం, ఈ విశ్వం భగవంతుడు, ఈ విశ్వం పరమ సత్యం, ఈ విశ్వం పరమానందం. మన అసత్య మానసిక అహంకారంతో ప్రపంచాన్ని అపార్థం చేసుకోవట మనేది అసత్యానికి కారణం; భగవంతునితో మన సంబంధాన్ని సరిగా అర్థం చేసుకోకపోవటమే దుఃఖానికి కారణం. మరే విధమయిన అసత్యమూ లేదు. మన దుఃఖానికి వేరొక కారణం లేదు.

CWSA 12:96

రెండు మార్గాలు

దుఃఖం, మరణం, పరిమితుల నుండి తప్పించుకోవటానికి మనం ప్రపంచాన్ని త్యజించాలి. పరమానందం, స్వేచ్ఛ అమృతత్వాన్ని ఆస్వాదించాలంటే మనంతట మనం భగవంతునితో పొందు సంపాదించాలి. భగవత్సంకల్పం ఈ విశ్వంలో తాను ఆవిష్కృతం కావటమేకానీ దీనిని నాశనం చేయటం కాదు. కాబట్టి ఆ దివ్యానందాన్ని, భగవంతుని ద్వారా ఈ విశ్వంలో అనుభవంచాలికానీ భగవంతునిలో కాదు — విశ్వంలో జీవించడం పక్కన పెడితే, ఇదే బౌద్ధమత పరిష్కారానికీ, బౌద్ధ

మత ఆలోచనా విధానంతో ప్రభావితమైన ఇతర పరిష్కార మార్గాలకు — మాయా వాదం, క్రైస్తవ సన్యాసం లాంటివి మానవజీవన సమస్యలకు పురాతనకాలంలో వాటికి హిందూమత మిచ్చిన సమాధానానికి మధ్య గల తేడా. జీవితాన్ని అంతా నాది అనే భావనను, ఆనందం అనుభవించాలనే కోరికను వదిలేయాలి. పూర్తిగా సన్యసించట మొక్కటే ముక్తికి మార్గం అని ఒక మతం అంటే, ప్రపంచాన్ని వదిలివేయాలి, తద్వారా పరమాత్మను పొంది ఆత్మానందాన్ని అనుభవించాలి అని మరొకటి అంటుం ది. ఒకటి పలాయన మార్గమయితే మరొకటి తుళ్ళిపడి పోరాటానికి దారి తీసే మార్గం . ఒకటి పరిత్యాగం మరోటి రాజీపడటం. రెండు మార్గాలు వీరోచితమయినవే. ఒకటి కష్టతరమూ, వెనుతిరిగి పరారయ్యే వీరత్వం, మరొకటి మహా శక్తివంతమయిన ఆత్మ పరిపూర్ణత, విజయం. ఒకటి 'శతసహస్ర' పలాయనం మరొకటి సీజర్ థిరా షియమ్ నుండి ఫార్సాలస్‌కి పయనించటం. ఒక మార్గం బుద్ధుడిలో పరాకాష్టకు చేరుకొంది. మరొకటి శ్రీకృష్ణుడిలో, జనకునిలో పరాకాష్టకు చేరుకొంది.

CWSA 17:450

బుద్ధుడి మార్గం — ఋషుల మార్గం

అయితే శ్రీమాతా1 భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ కర్మ నుండి పలాయనం చిత్తగించటమే సిద్ధాంతంగా ఎదుకు ఎంచుకున్నారు?

ఎందుకంటే యిదంతా జీవితం భ్రమ అనే బోధనపై ఆధారపడి ఉంది కనుక. అది, సృష్టి, కోరికనుండి జనించిందని, బాధలు, దుఃఖం, కోరికల నుండి బయటకు రావ టానికొకే ఒక మార్గం ఈ జీవితం నుండి నిష్క్రమణ అని బుద్ధుని ప్రవచనాల నుండి ప్రారంభమయింది. ఇదే ధోరణి శంకరునితో కూడా కొనసాగింది. శంకరుడు ఈ జగత్తు కోరిక ఫలితమే కాదు, పూర్తిగా భ్రాంతి అని. ఈ భ్రాంతిలో ఉన్నంత కాలం భగవంతుణ్ణి తెలుసుకోలేమని దానికి జోడించారు. బుద్ధుడికి దైవం కూడా లేడు... నాకు తెలిసినంత వరకు....

ఋషుల బోధనల వైపుకు మళ్లితే, ఉదాహరణకి, ఈ ప్రపంచం నుండి పారిపోవటం మనేది లేదు. వారికి ఆత్మ సాక్షాత్కారం ఈ భూమి పైనే.. వారు ఒక స్వర్ణయుగాన్ని దర్శించారు. దాని ప్రకారం ఆత్మసాక్షాత్కారం భువి పైనే జరుగుతుంది. కానీ భారతదేశపు జీవనంలో జీవశక్తి సన్నగిల్లటం ఆరంభమవటంతో బహుశా ఒక భిన్నమయిన

అవగాహన కలగడంతో, చూశారూ.... ఖచ్చితంగా అది బుద్ధుడి బోధనలతోనే ఈ పలాయనవాదం ప్రారంభమయింది, అదే భారతదేశపు జీవశక్తిని అధోక్రాంతం చేసింది, కారణం జీవితం నుంచి వేరుపడటానికి శ్రమించాల్సి వస్తుంది. బాహ్యమైన వాస్తవం ఒక అసత్యమయిన భ్రమగా మారిపోవడంతో దానితో ఏమీ చేయవలసిన పని లేకపోయింది. అందువల్ల, వ్యక్తి విశ్వశక్తి నుండి వేరుచేయ బడ్డాడు. ఇక జీవశక్తి క్షీణించటం ప్రారంభమై దానితో పాటు ఆత్మసాక్షాత్కార సంభావ్యతలన్నీ తగ్గు ముఖం పట్టాయి.

CWM 7:288-90

సత్యం పలాయనంలో కాకుండా రూపాంతరం చెందటంలో ఉంది

శ్రీఅరవిందులు చరిత్రకు సంబంధించిన వారు కాదు. వారు చరిత్రకు అతీత మయినవారు.

శ్రీఅరవిందుల జననం వరకూ మతాలు, ఆధ్యాత్మికతలు గత కాలపు వ్యక్తుల చుట్టూ కేంద్రీకృతమైనాయి. వారు భూమిపై జీవితాన్ని నిరాకరించటమే గమ్యంగా చూపారు. కాబట్టి మీరు రెండు విషయాల మధ్య ఎంపిక చేసుకోవలసిన అవకాశం ఏర్పడింది. ఒకటి ఈ లోకంలో చిన్న చిన్న సుఖదుఃఖాలు, సంతోషాలు, బాధల మధ్య జీవనం — మీరు సరిగ్గా ప్రవర్తించనపుడు నరకం లేదా మరో లోకం లోనికి పలాయనం — స్వర్గం, నిర్వాణం, మోక్షం.

ఈ రెంటి మధ్య పెద్దగా ఎంపికకు ఆస్కారం లేదు. రెండు సమానంగా చెడ్డవే.

భారతదేశం హీనస్థితికి దిగజారటానికి ముఖ్య కారణం యిదే అని శ్రీఅరవిందులు అంటారు. బౌద్ధమతం, జైనమతం, మాయావాదం ఈ దేశపు శక్తిని పీల్చి వేయటానికి సరిపోయినై. నిజమే ప్రపంచంలో భారతదేశ మొకటే పదార్థానికి అతీతమయిన దొకటి ఉన్నదనే ఎరుకను ఇంకా కలిగి ఉంది. మిగతా దేశాలు పూర్తిగా ఈ విషయాన్ని విస్మరించాయి. యూరప్, అమెరికా, యితర దేశాలలో అదే జరిగింది. అందుకనే భారతదేశానికి తాను భద్రపరచి ప్రపంచానికి అందించ వలసన ఒక సందేశం ఉంది. కానీ ప్రస్తుతమామె బురద నీటిలో ఈదుతూ తచ్చాడుతూ ఉంది.

ప్రాపంచిక జీవనం నుండి పారిపోవటంలో సత్యం లేదు. అందులో ఉంటూ

దానిని పరివర్తన చెందించటంలో, దివ్యమయం చేసుకోవటంలోనే సత్యం ఉంది. ఈ విధంగా దైవం ఈ భౌతిక ప్రపంచంలో ఆవిష్కృత మవగలడని శ్రీఅరవిందులు చెప్పారు.

CWM 12:210-11

కోరికలు లేనప్పుడు మీకు అంతకు ముందు దురదృష్టకరం అనిపించిన విషయాలు ఏమాత్రం దురదృష్టకరం అనిపించవు అని బుద్ధుడు బోధించాడు.. దీనితో మనకు ఈ విధంగా తెలుస్తుంది: మనకు ఒక విషయమై కలిగిన ఆలోచన అది దురదృష్టకరమా కాదా అనే భావనను కలిగిస్తుంది. ఒక సంఘటన సంతోషకరం అని మీరు భావించినపుడు అది మీకు ఆనందదాయక మవుతుంది. నిజానికది అలాగే ఉంటుంది. అనేక సంవత్సరాలలో ఏ కారణం చేతనైనా ఆలోచన ఒక విషయం ఈ విధంగా నుండ వలసింది అని ఒప్పుకున్నప్పుడు, ఇక అది ఏమాత్రం అసంతుష్టిని కలుగ చేయదు. ఎప్పుడైతే ఆలోచన దానిని ఒప్పుకోదో, అది అసంతుష్టిని కలిగిస్తుంది. కాబట్టి మీరు భావోద్రేకాలు, నమ్మకాలు, భావాల క్షేత్రంలో ఉన్నంత వరకూ యిదంతా వాస్తవమే. అనగా 'అసంతుష్టి' అనే భావన ప్రపంచంలోకి ప్రవేశించి విషయాలను దురదృష్టకరమైనవని భావించే స్థితిని కలిగించాయి.

CWM 4:292 *అనువాదం: డా. సరోజా ప్రసాద్*

సముతుల్యత చాలా అవసరం. విభేదించే విపరీత ధోరణులను జాగ్రతగా తప్పించుకొనే మార్గం చాలా అవసరం. అతి తొందర, ప్రమాదకరం. అసహనం మీ పురోభివృద్ధిని నివారిస్తుంది. అదే సమయంలో జడత్వం నీ పాదాలను కదలకుండా చేస్తుంది. అన్ని విషయాలకు సంబంధించి బుద్ధుని మధ్యే మార్గం ఉత్తమమైనది.

CWM 8:285

దమ్మపథంలో రత్నాలు

(శ్రీమాత సాయం సంభాషణలు ఏప్రిల్ 1957, సెప్టెంబరు 1958 — దమ్మపథంలో బుద్ధుని బోధనలపై శ్రీమాత వ్యాఖ్యలు)

బుద్ధిని అదుపులో ఉంచుట

సాధారణ మానవ జీవితాన్ని బుద్ధి పరిపాలిస్తోంది. అందుకే ముఖ్య విషయం బుద్ధిని అదుపులో ఉంచుట. దమ్మపథంలో చెప్పినట్లు మన మొక 'అనుబంధ' క్రమశిక్షణను దీనికొరకు పాటించాలి.

నాల్గు రకాల బుద్ధి చాంచల్యాలున్నాయి. అవి ఒకదాని వెంట ఒకటి వస్తాయి. కాని చివర్లో అన్నీ ఒకే మారు రావచ్చు.

1. ఆలోచనలను గమనించుట 2. వీటిని నిశితంగా పరిశీలించుట, 3. వీటిని అదుపులో పెట్టుట, 4. వాటిపై పట్టు సాధించుట. ఇవన్నీ దుష్ట బుద్ధిని వదిలించుకొందుకే. దుష్ట బుద్ధితో పనిచేసేవాడు లేదా మాట్లాడేవాని వెంటనంటే వస్తాయి బాధలు. ఎలా అంటే, బండిలాగే ఎద్దు గిట్టలను బండిచక్రం వెంబడించినట్లు లేదా నాగలి దున్నే ఎద్దు గిట్టలను నాగలిముల్లు వెంబడించినట్లు.

CWM 3:183

సమతూకం, సామరస్యత, విధేయత, నిజాయితీ

బౌద్ధం మలినాలని చెప్పేవి ముఖ్యంగా 1. అహంకారం, 2. అజ్ఞానం. బౌద్ధుల దృక్పథంలో అన్నింటికంటె ముఖ్యమైన మలినం 'అజ్ఞానం' ఇది బాహ్యవిషయాలకు సంబంధించినది లేదా పాఠశాలలో నేర్పే విషయాల అజ్ఞానం కాదు. విషయాల మిక్కిలి లోతైన 'సత్యం' గురించిన అజ్ఞానం; సిద్ధాంతం ధర్మం గురించి అజ్ఞానం.

బౌద్ధం చెప్పే రెండు లోపాలు గమనార్హం. 1. స్వయం నియంత్రణ లేకపోవుట 2. విధేయత లేకపోవుట. ఇక్కడ విధేయత అంటే నిజాయితీ, దమ్మపథం ఎక్కువ కఠినంగా శిక్షించేది కపటత్వాన్ని. ఆధ్యాత్మిక జీవనం కోరుతున్నట్లు నటించి, అలా జీవించకపోవడం సత్యాన్నే అన్వేషిస్తున్నట్లు నటించి అలా చేయకపోవడం, దివ్య జీవనాన్ని అంకితమైనట్లు పచ్చనిదుస్తులు ధరించుట వంటి బాహ్య ప్రదర్శనలు చేయుట. కాని వాస్తవంలో స్వార్థానికి, స్వార్థ ప్రయోజనాలకు అంకితమగుట.

దమ్మపదంలో ఆసక్తికర విషయం, స్వయం నియంత్రణకు అత్యంత ప్రాముఖ్యత నివ్వడం. బౌద్ధ బోధ ప్రకారం అన్ని విషయాలు అతిగా చేయుట తప్పు. దేని వైపూ ఎక్కువ మొగ్గు చూపడం మంచిది కాదు. మధ్యే మార్గం మంచిది. ఎల్లప్పుడూ సమతూకం పాటించాలి. అన్ని విషయాలలో సమరసభావంతో ఉండాలి. ఆధ్యాత్మిక జీవనానికి అర్హత నిచ్చే విషయం, అంతరంగ సమతుల్య వాతావరణంలోను అన్ని విషయాలలోను సమతూకం, నిజాయితీ, విధేయత. అందుకే మనం ధ్యానించవలసిన విషయం. సమతూకం, సామరస్యత, విధేయత, నిజాయితీ.

CWM 3:190

బుద్ధిని ప్రశాంత పర్చుట

బౌద్ధంలో లెక్కలేనన్ని, చిన్నకులాలున్నాయి. చైనా, జపాన్, బర్మాలో అన్ని రకాల కులాలు ఉన్నాయి. ప్రతిదానికి ఒక సొంత పద్ధతి ఉంటుంది. కాని ఎక్కువ ప్రచారంలో ఉన్నది, బుద్ధిని ప్రశాంత పర్చుట. వారు రోజా పగలు, రాత్రి కొన్ని గంటలు కూర్చుని బుద్ధిని ప్రశాంత పరుస్తారు. ఇదే అన్ని సాధనలకు, సాధ్యాలకు, తాళంచెవి వంటిది. ఒక ప్రశాంతబుద్ధి చలనం లేకుండా గంటల తరబడి ఉండడమెలాగో తెలిసిన ప్రశాంతబుద్ధి. ఇది సులభం అనుకోవద్దు. వారికి ఇతర లక్ష్యాలేవీ లేవు. ఏ ఆలోచన పైనా వారు దృష్టికేంద్రీకరించరు. ఎక్కువ బాగా అర్థం చేసుకొందుకు, తెలుసుకొందుకు ప్రయత్నించరు. బుద్దిని ప్రశాంత పరిచే మార్గం మొకటే వారికి తెలుసు. ఈ ఫలితం పొందేందుకు కొన్ని సంవత్సరాలు పాటు కూడా శ్రమిస్తారు. ఎందుకంటే దమ్మపథంలో చెప్పబడింది. బుద్ది సమతూకం లేకపోతే అనేక ఆలోచనలు. ఒకదాని వెంట ఒకటి ప్రవేశిస్తాయి. చైతన్యంలోకి, ఒక్క ఎలా అంటే ఇంటి కప్పుకు చిల్లు పడితే, నీరు ఇంట్లోకి ప్రవేశించినట్లు. చైతన్యంలోకి అనేక అక్కరలేని ఆలోచనలు ప్రవేశిస్తాయి.

ఏది ఏమైనా ఈ సాధన ప్రతివారికి చెప్పతగ్గది. ప్రతిరోజూ కొన్ని గంటలు కేటాయించి బుద్ధిని ప్రశాంత పర్చడం. ఎవ్వరూ వ్యతిరేకించలేని వాస్తవమేమంటే బుద్ధి ఎంత బాగా అభివృద్ది చెందితే, అంత త్వరగా గెలుపొందుతారు. బుద్ది ఎంత తక్కువ ప్రాథమిక దశలో ఉంటే గెలుపు అంత కష్టం.

CWM 3:194- 195

నిజంగా సంతోషంగా ఉండుట:

అంతరంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగి ఉంటేనే తప్ప తాను చేసినపని ఎంతో అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉన్నది, అని తెలుసుకోలేరు. అందము, ఔదార్యము ఉదారత, అంటే ఏమిటో కొంతముందు చూపు లేక సహజ జ్ఞానం తమలో ఉంటేనే తప్ప అవి తమలో వాస్తవంగా లేవని బాధ పడలేరు.

చేయకూడదని తెలిసిన పనిని తరచుగా చేయడంవల్ల శాంతి, ప్రశాంతత, సంక్షేమ భావనలు పోతాయి. నిరంతరం అసత్యం పల్కేవారు తమ అసత్యం ఎప్పుడు బయట పడుతుందోనని భయపడుతూ, విశ్రాంతిగా ఉండలేరు. తప్పుడు గా నడిచినవారు తను బహుశా శిక్షింప బడతాననే ఆందోళనతో, ఉంటాడు. మోసగించ టానికి ప్రయత్నించిన వానికి తన మోసం బహుశా బయట పడుతుందని శాంతి లేకుండా ఉంటాడు.

నిజం చెప్పాలంటే, మంచిచేయడం, మంచిగా ఉండడం, సూటిగా, నిజాయితీగా ఉండడం, అహంకార కారణాల వల్లనైనా సరే, ప్రశాంతంగా, శాంతిగా, మిక్కిలి తక్కువ ఆందోళనతో ఉండడానికి సాధనాలు.

వీటికి తోడుగా అనాసక్తిగా, స్వప్రయోజనం, అహంకారం లేకుండా ఉండగలిగితే నిజంగా సంతోషంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

నీ చర్యలవల్ల ఏర్పడ్డ వాతావరణాన్ని నీవు నీలో, మోసుకుపోతూ ఉంటావు. నీ చుట్టు కూడా నీవు చేసేది అందంగా, మంచిగా, సామరస్యంగా ఉంటే నీలోను, నీ చుట్టుపట్ల ఉండే వాతావరణం కూడా అలానే ఉంటుంది. అలాకాకుండా నీవు కఠినమైన, అసహ్యకరమైన స్వార్థంతో, జంకులేని స్వలాభాపేక్షతో, దయలేని దుష్టబుద్ధితో నివసిస్తే అదే శ్వాసిస్తావు ప్రతిక్షణం, నీ జీవితంలో అని దీని అర్థం. దైన్యం, స్థిర అస్వస్థత, జుగుప్స దీనివల్లనిరాశ, నిస్పృహ, నీ జీవితంలో .
CWM 3:197-198

మనం మోసుకుపోతాం - మన స్వంత వాతావరణాన్ని

నీవు మంచిగా, ఉదారంగా, ఔదార్యంగా, నిరాపేక్షతో, దయతో, ఉన్నప్పుడు నీవు నీలోపల, నీ చుట్టూకూడ ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టిస్తావు. ఇది ఒక

రకమైన ప్రకాశాన్ని, విడుదల చేస్తుంది. నీవు శ్వాసిస్తావు. సూర్యకాంతిలో పుష్పంలా విచ్చుకుంటావు. నీలో బాధాకరమైన దైన్యం, తిరుగుబాటు బాధలు ఉండవు. వాతావరణం ప్రకాసవంతమౌతుంది. సహజసిద్దంగా నీవు పీల్చేగాలిసంతోషకరంగా ఉంటుంది. ఇదే గాలిని నీవు శ్వాసిస్తావు. నీ శరీరంలోను, శరీరం బయట నిద్రావస్థలో, జాగ్రతావస్థలో నీ జీవితంలో నీ జీవితం ఆవలకూడ. అంటే భూమిపై జీవితం వదలి కొత్త జీవితంలో ప్రవేశించేవరకు.

ప్రతి తప్పుడు చర్య చైతన్యంపై ప్రభావం చూపుతుంది. ఈదురుగాలి చెల్లా చెదురు చేసినట్లు చల్లదనం గడ్డ కట్టించినట్లు, మంటలు అన్నింటిని నాశనంచేసి మింగేసినట్లు. ప్రతి తప్పుడుచర్య మన చైతన్యంపై ప్రభావం చూపుతుంది.

అలాగే ప్రతి మంచి చర్య, దయతోకూడిన చర్య కాంతిని, విశ్రాంతిని, పువ్వులు వికసించే సూర్యకాంతిని తీసుకువస్తాయి.

CWM 3:199- 200 *అనువాదం: ఎస్. వై. సోమయాజులు*

జాగరూకత

జాగరూకత అంటే మెళకువ కలిగియుండి తమను తాము కాపాడుకుంటూ, చిత్తశుద్ధి కలిగి, ఆశ్చర్యానికి ఎప్పుడూ లోనుకాకుండా ఉండడం. మీరు సాధన చెయ్యాలని కోరుకున్నప్పుడు మీ జీవితంలోని ప్రతిక్షణం మీ ముందు మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక అడుగు ముందుకు వెయ్యడానికి మరియు నిద్రలోకి జారుకోవడానికి లేక కొన్ని సమయాలలో తిరోగమనం పాటిస్తూ, దారిలో చతికిలబడి మిమ్మల్ని మీరు "ఓహ్, తరువాత, వెంటనే కాదు" అని అనునయించు కోవడం అనే రెండు విషయాలమధ్య ఎంపిక ఉంటుంది.

జాగరూకత అన్నది మిమ్మల్ని అణగద్రొక్కే వాటిని కేవలం ప్రతిఘటించడమే కాదు. కాని అన్నిటిని మించి ప్రగతికొరకు దొరికే ఏ అవకాశాన్ని జారవిడచుకోకుండా బలహీనతల్ని అధిగమించడానికి ఇవ్వబడే ఏ అవకాశాన్ని వదులుకోకుండా, తన విపరీత ఆకర్షణలని నిరోధించుకోవడం, ఏదైనా నేర్చుకోవడానికి ఇవ్వబడిన అవకాశాన్ని ఉపయోగించుకోవడం దేనినైనా సరిచేసుకోవడం, ఏ విషయంలోనైనా పట్టు సంపాదిం చడం. మీరు జాగరూకులై ఉంటే సంవత్సరాలు పట్టే విషయాన్ని కూడా కొద్ది రోజులలోనే చెయ్యగలరు. మీరు జాగరూకులై ఉంటే మీ జీవితంలోని ప్రతి పరిస్థితిని

ప్రతి చర్యను ప్రతి కదలికను మీ లక్ష్యానికి దగ్గరగా కొనిపోయే అవకాశంగా మార్చుకో గలుగుతారు.

జాగరూకత క్రియాత్మకము, క్రియారహితము అనే రెండు రకాలుగా ఉంటుంది, ఒక రకమైన జాగరూకత క్రియారహిత జాగరూకత: అది మీరు ఏదైనా తప్పు చెయ్యడానికి లేదా తప్పు ఎంపిక చేయడానికి లేక మీరు బలహీనంగా ఉన్నా లేక మీరు దేనికైనా ఆకర్షింపబడడానికి ముందే మిమ్మల్ని హెచ్చరిస్తుంది. క్రియాత్మక జాగరూకత అన్నది ప్రగతిపథంలో పయనించడానికి అవకాశాన్ని అన్వేషిస్తూ, ప్రతి పరిస్థితిని త్వరితగతిన ముందుకు సాగడానికి ఉపయోగించుకోవాలనుకుంటుంది.

మీరు దిగజారిపోకుండా అడ్డుకోవడానికి, త్వరిత గతిని ముందుకు సాగడానికి మధ్య భేదం ఉంది.

రెండుకూడా అనివార్య అవసరాలే. జాగరూకుడు గాలేని వ్యక్తి మరణించిన వాడే, అతడు జీవితానికి, తన ఉనికి యొక్క జీవితంయొక్క పరమాత్మతో సంబంధాన్ని కోల్పోయాడు.

కనుక సమయం పరిస్థితులు, జీవితం వృధాగా గడిచి, పోతాయి. ఏదీ సమకూరదు. నువ్వు నీ నిద్రనుండి మేల్కొనేసరికి తప్పించుకోవడానికి చాలా కష్టమైన ఒక కన్నంలో ఇరుక్కుని ఉంటావు.

CWM 3:202-03

పరిత్యాగము - భౌతిక వాదము

ఈ బోధనంతటిలో గుర్తించవలసిన విషయం ఏమనగా మంచిగా జీవించడానికి మంచిగా ఆలోచించడానికి ప్రయాసపడడం ఒక పరిత్యాగంవల్ల లభించే ఫలితమని మీకు ఎప్పుడూ చెప్పబడలేదు. పైగా అది అన్ని బాధలను నశింప చేసే ఒక ఆనందదాయకమైన అవస్థ అని చెప్పబడింది. బుద్ధుని కాలంలో ఆధ్యాత్మిక జీవితం గడపడం అనేది ప్రాపంచిక కష్టాలన్నింటినుండి అన్ని బాధలనుండి అన్ని చింతలనుండి విముక్తం చేసి నిన్ను సుఖంగా, సంతృప్తిగా, జీవనం గడిపే ఆనందప్రద, అత్యంత సంతోషప్రదమైన అందమైన దశ అని చెప్పబడింది.

ఆధునిక కాలపు బౌతికవాదం ఆధ్యాత్మిక ప్రయాసను ఒక కష్టప్రదమైన పోరాటంగా ఒక పరిత్యాగంగా మార్చి జీవితంలోని సంతోషాలనబడే వాటి నన్నింటిని ఒక

బాధాకరమైన పరిత్యాగంగా మార్చింది.

భౌతిక ప్రపంచ మందలి శారీరక ఆనందాల, శారీరక సంతోషాల, భౌతిక సంపాదనల ఆవశ్యకత మానవ నాగరికతయొక్క భౌతిక ప్రవృత్తుల పరిణామము. పురాతన కాలంలో ఇది, ఆలోచించతగ్గ విషయం కాదు. అందుకు భిన్నంగా జీవితం నుండి ఉపసంహరణ, ఏకాగ్రత, అన్ని భౌతిక విషయవాంఛల నుండి విడుదల, ఆధ్యాత్మిక ఆనందానికి సమర్పణ అన్నదే నిజమైన సంతోషప్రదమైనది అని భావించబడింది. ఈ సృష్టిలో మానవజాతి పురోగమించ లేదన్నది తథ్యం. ఈ ప్రపంచంలో ఇటువంటి భౌతిక సభ్యత, సంస్కృతుల వ్యవస్థలో జన్మించినవారు వారి అంతశ్చేతనలో ఈ భౌతికపరమైన నిజాలే అసలైన నిజాలు అని నమ్ముతారు. భౌతిక విషయంతో సంబంధం లేనివి త్యాగమనే అత్యద్భుతమైన రసస్ఫూర్తి గలిగిన గొప్ప ప్రయత్నాలు అని భావిస్తారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు కలిగే చిన్న చిన్న భౌతిక సంతృప్తులతో, ఇంద్రియ సంవేదనలతో, భౌతిక వృత్తివ్యాపారాలలో మునిగి ఉండడమన్నది చెప్పుకోతగ్గ ఉత్సాహానికి నిదర్శనం. ఒకరికి ఈ విషయం గుర్తుండక పోవచ్చు కాని ఆధునిక నాగరికత అంతా ఈ భావన పైనే ఆధారపడింది — "ఓహ్, నువ్వు దేనినైతే స్పర్శించ కలుగుతావో, అది నిజమన్నది నీకు నిశ్చితం, నువ్వు దేనినైతే చూడ గలుగుతావో అది నిజమన్నది నీకు నిశ్చితం, నువ్వు ఏదయితే తింటావో దానిని తిన్నావన్నది నీకు కచ్చితంగా తెలుస్తుంది — కాని మిగిలినదంతా ఉత్తదే! అవి కేవలం వ్యర్థమైన కలలో కాదు అన్నది మనకు కచ్చితంగా తెలియదు. మనం సత్యాన్ని అసత్యం కోసం వదులుకుంటున్నామా అన్నది తెలియదు, భ్రాంతి కోసం అసలు పదార్థాన్ని వదులుకుంటున్నామా అన్నది తెలియదు. చివరకి నీకు కలిగే ప్రయోజన మేమి? కొన్ని కలలా? కాని నీ జేబులో కొన్ని రూకలు ఉంటే మాత్రం అవి అక్కడ ఉన్నాయన్నది నువ్వు కచ్చితంగా నమ్ముతావు!"

CWM 3:203-204

మార్గానుసరణలో పోగొట్టుకున్న సమయమంతా బాధాకరం

మార్గానుసరణలో సమయాన్ని పోకొట్టుకుకొన కూడదని ప్రయత్నించిన వ్యక్తికి, ఏ కొద్ది సమయం వృథా అయినా, అది బాధాకరమే గాక దానిలో ఎటువంటి ఆనం

దం లభించదు. ఒకసారి నువ్వు ఆ స్థితిలో ఉంటే, ప్రగతికై పరివర్తన చెందడానికై నీవు చేసే ప్రయత్నం నీ జీవితంలో అత్యంత ఆవశ్యక మవుతుంది. దాని కోసమే నువ్వు సర్వదా ఆలోచిస్తుంటావు. అప్పుడు నువ్వు శాశ్వత అస్తిత్వము వైపు, నీ అస్తిత్వం యొక్క వాస్తవికత దిశలో ఉన్నట్లవుతుంది.

నిశ్చయంగా ఆంతరిక పెరుగుదలలో ఒక క్షణకాలం ఏకాగ్రత వహించకుండా ఆలోచనలో మునిగిపోకుండా సత్యాన్వేషణలోను, దాని ప్రకటనలోను నిమగ్న మవ కుండా దేనినయితే బౌద్ధులు ధ్యాన మంటారో — అందుకు వ్యతిరేకంగా నీవు ఒక విధమైన విమోచననను, ఉపశమనమును, విరామమును, సంతోషమును అనుభవిస్తావో, వాటి నుండి విడివడి ఆవశ్యకమైన వాటిపై ధ్యాస పెట్టకుండా, కాలం వృధా అవుతున్న ట్లనిపిస్తే అది చాలా బాధాకప మౌతుంది. దైవానికై సేవాభావంతో సమర్పింపబడే అత్యావశ్యక కార్యకలాపాలకు తప్ప మిగిలిన బాహ్య కార్యక్రమాలన్నీ తగ్గిపోతాయి. వ్యర్థమైన, పనికిరాని సమయము, ప్రయాస, వ్యర్థమనిపించే టుటువంటివన్నీ సంతృప్తిని సమకూర్చే బదులు వృధా అనిపిస్తాయి, అసౌకర్యాన్ని, అలసటని కలిగిస్తాయి. వాస్తవానికి నువ్వు నీ లక్ష్యం పై దృష్టి నిలిపినప్పుడే సంతోషంగా ఉండగలవు.

అప్పుడు నీవు నిజంగా దారిలో ఉన్నట్లు లెఖ్ఖ.

CWM 3:209

నువ్వు ఏమవ్వాలనుకుంటున్నావో దాని పైనే కేంద్రీకరించు

చాలా మంచి తెలివైన కొన్ని సిఫారసులు ఉన్నాయి. ఉదాహరణకి, ఇతరులు ఏం చేస్తున్నారు లేక వారు చేసిన తప్పులు ఏమిటి అన్నవి పట్టించుకోకుండా ఉండి తమ స్వంత తప్పులు అజాగ్రత్తలు ఏమిటన్నవి తెలుసుకుని వాటిని సరిదిద్దు కోవటం. మరొక తెలివైన సలహా ఏమిటంటే అనర్గళంగా శబ్దచాతుర్యంగల పదాలను ఆచరణాత్మకంగాని వాటిని వాడకూడదు — తక్కువ మాట్లాడాలి, గొప్పగా ఆచరిం చాలి — అందమైన పదాలు కేవలం పదాలుగా మాత్రమే మిగిలిపోతే వాసనలేని పూవుల వంటివని అంటారు.

చివరిగా, స్వయంకృతాపరాధాలతో నీవు నిరుత్సాహపడ కూడదు. దమ్మపథం నీకు ఈ ఓదార్పు నిస్తుంది. అతి స్వచ్ఛమైన లిల్లీకి పుష్పము రోడ్డు పక్కనున్న చెత్తకుప్పలో పుట్టగలదు. అనగా అతి పవిత్రమైన అనుభవ ప్రాప్తికి జన్మ నివ్వలేనంతటి

కుళ్ళిపోయినటువంటి దేదీ లేదు.

గతమెటువంటి దైనా సరే, తప్పులు ఏమి చేసినా సరే, ఎటువంటి అజ్ఞానస్థితిలో బ్రతికినా సరే, ప్రతి ఒకరు తన అంతరాంతరాలలో అత్యద్భుతమైన అనుభవప్రాప్తిగా పరిణతి చెందే పరమోత్కృష్ట పవిత్రతను కలిగి ఉంటారు.

కావలసిం దేమిటనగా దానిని గురించి ఆలోచించడం, దాని పై కేంద్రీకరించడం, ఎదురయ్యే కష్టాలను, విఘ్నాలను, ఆటంకాలను పట్టించుకోకుండా ఉండడం.

నువ్వేమి అవ్వాలనుకుంటున్నావో కేవలం దాని మీదే కేంద్రీకరించు. నువ్వేమి కాకూడదనుకుంటున్నావో దాని గురించి వీలయినంత పూర్తిగా మరిచిపో.

CWM 3;215

తన తప్పిదాలను గుర్తించడానికి కావలసిన వాస్తవిక దృక్పథము

విచారపడి "ఓహ్, ఇంకా మరొక తప్పిదమా" అని నువ్వు చెప్పుకోవడానికి బదులు, నీకు మరొక అద్భుతమైన నిధి లభించిందని ఆనందించు, కారణం, నీ పురోగతిని ఆటంకపరుస్తున్న విషయాలలో ఒకదానిని ఇప్పుడే గుర్తించ గలిగావు. ఒకసారి దానిని పట్టుకున్నప్పుడు దానిని పెరికి వేయి! ఎందుకనగా ఒక యోగమార్గంలో సాధన చేసేవారు ఒక విషయం అలా ఉండకూడదని తెలిసిన క్షణంలో దాన్ని తీసి వేయగల, వదిలివేయగల, నిర్మూలించగల శక్తి ఉన్నది భావిస్తారు.

ఒక తప్పుని గుర్తించడం ఒక సంపాదన. ఇప్పుడే పారద్రోలబడిన చీకటి స్థానంలో వెలుగుల వెల్లువ చోటు చేసుకున్నట్లుంటుంది.

నువ్వు ఒక యోగవిద్య నభ్యసిస్తున్నప్పుడు ఈ బలహీనతని, ఈ నీచత్వాన్ని ఈ సంకల్పరాహిత్యాన్ని అనుమతించ కూడదు. దాని అర్థం జ్ఞానాన్ని వెంటనే శక్తి అనుసరించ లేదని. ఒక విషయం ఆ విధంగా నుండకూడదని తెలిసినప్పటికీ, దానిని కొనసాగనివ్వడం ఎంతటి బలహీనతయొక్క లక్షణమంటే అది ఎటువంటి రకమైన సాధనలను అనుమతించదు. అది కపటం అంచులవైపుగా మొగ్గు చూపే సంకల్ప రాహిత్యం. అది ఆ విధంగా ఉండకూడదని నాకు తెలుసు. అది తెలిసిన క్షణంలో అది ఇక ఉండకూడదని నిర్ధారించేది నీవు. ఎందుకనగా జ్ఞానము శక్తి వాటి పదాలలో ఒకటే, అనగా నీవు నీ అస్తిత్వపు ఏ భాగంలోను ఈ దుస్సంకల్పంయొక్క నీడను కూడ పడనీయకూడదు. ఎందుకనగా అది పురోగతి చెందాలనే ప్రధాన సంకల్పానికి

విరుద్ధమైనది. నువ్వు నాశనం చెయ్యవలసిన దుష్టశక్తి ఎదుట నిన్ను శక్తి హీనునిగా, ధైర్యహీనునిగా నిర్వీర్యునిగా చేస్తుంది.

అజ్ఞానంలో పాపం చెయ్యడం పాపం కాదు. అది ప్రపంచంలోని సాధారణ దుర్నడతలోని భాగమే అవుతుంది. కాని పాపమని తెలిసికూడా పాపం చేస్తే అది చాలా తీవ్రమైనది. తప్పిదంలో దాని అర్థం ఏమిటంటే ఏదో ఒక చెడు ఆలోచన లేక తలంపు పండులోపల పురుగు వలె ఎక్కడో దాగి ఉన్నదన్నమాట. దానిని వేటాడి ఎలా అయినా సరే నాశనం చెయ్యాలి. ఎందుకనంటే అటువంటి విషయంపై ఏ మాత్రం బలహీనత అయినా సరే. కొన్ని సమయాలలో కష్టాలకి కారణమవుతుంది. అటు తరువాత అది చక్కదిద్దబడనిది అవుతుంది.

CWM 3;221

నీవైపు శ్రద్ధగా చూసుకో

నువ్వు ఎంతో మంచివాడవని, దయార్థ్రహృదయుడవనీ, మంచి నడవడిక కలిగి అన్నీ మంచి భావనలు కలిగి ఉన్నవాడవని నీ నమ్మకం. ఎవరికీ నువ్వు కీడు తలపెట్టవు. మంచినే కోరుకొంటావు. ఇదంతా సంతోషంగా నీకు నువ్వు చెప్పు కుంటావు. కాని నీ యెడల నిజంగా నిన్ను నువ్వు అనుకుననట్లుగా దృష్టి సారిస్తే నువ్వు నీ మెదడులో నీకు కూడా తెలియని అప్పుడప్పుడు అతి భయానకమైన ఆలోచనల సముదాయమున్నట్లు గమనిస్తావు.

ఉదాహరణకు ఏదైనా నీకు ఇష్టం లేనిది జరిగినప్పుడు నీ ప్రవర్తన: నీ స్నేహితు లను, బంధువులను, తెలిసినవారిని అందరికీ తరిమి కొట్టాలనున్నట్లుంటుంది! నీకు తెలియకుండానే వారందరికోసం నీ మనస్సు చెడు కోరుకుంటుంది! నువ్వు అంటావు, "అది అతడికి ఎలా ఉండాలో తెలియచెబుతుంది." నువ్వు విమర్శించినప్పుడు అంటావు. "అతడికి అతని తప్పుల్ని తెలియచెప్పాలి." నీ ఆలోచనల్ని అనుసరించి ఎవరైనా ప్రవర్తించినపుడు నువ్వు అంటావు. "అతడిని దానికై శిక్షించాలి" వగైరా.

ఆలోచనా విధానంలో నిన్ను నీవు పరీక్షించుకోకపోవడం వలన అది నీకు తెలి యదు. అది కొంత బలపడినపుడు కొన్ని సమయాలలో నీకు తెలుస్తుంది. అది కేవ లం మామూలుగా జరిగిపోతే దానిని నువ్వు గమనించవు కూడా. అది వస్తుంది, ప్రవేశిస్తుంది. నిష్క్రమిస్తుంది. నువ్వు నిజంగా పరిశుద్ధంగా పరమసత్యము పక్క

ఉండాలనుకుంటే దానికి అసాధారణమైన జాగరూకత, శ్రద్ధ, ఆత్మశోధన, ఆత్మ నిగ్రహం కావాలి. అప్పుడు నిజమైన శ్రద్ధాళువుగా ఉండటం కష్టసాధ్యమని తెలుసుకోవడం మొదలౌతుంది.

కేవలం నీకు సద్బుద్ధి, సదభిప్రాయాలు మాత్రమే గలవని నువ్వేమిచేసినా మంచి కొరకే చేస్తావని నిన్ను నువ్వు ప్రసంసించుకుంటావు. అవును అది కేవలం చైతన్యము, నిగ్రహము నువ్వు కలిగి ఉన్నంత వరకు, కాని ఏ క్షణంలో అయితే నువ్వు పూర్తిగా సావధానుడివై ఉండవో నీకు తెలియని, బాగులేని, అన్ని రకాలైన విషయాలు నీలో జరుగుతాయి.

CWM 3;231 *అనువాదం: డా. వి.విజయలక్ష్మి*

స్వార్థ చింతన లేక పువ్వులా వికసించాలి.

తనను గురించిన బాధ్యత తనకు లేకుండా తన గురించి తాను ఆలోచించకుండా ఉండగలగడంలో చెప్పనలవికానంత ఆనందం ఉంది. తాను ఆలోచించుకోవడం ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అని విచారించడం ఏది మంచి, ఏది చెడు అని తర్కించడం, ఏది పాటించాలి, ఏది పాటించకూడదు అని విమర్శించుకోవడం దేనిని విస్మరించాలి దేనిని కొనసాగించాలి అని ఆలోచించడమంత నిరుత్సాహం, ఎంతటి విసుగు, ఎంత నిస్సారంతో కూడిన పని. అలా ఉండటం ఎంత విసుగోకదా! సర్వము తెలిసిన సర్వము నొనరించగల నిన్ను వశం చేసుకోగల ఆ దివ్య చైతన్యం దివ్యజ్ఞానం, దివ్యప్రకాశం, దివ్య ప్రేమ, ముందు సూర్యకాంతిలో విరబూసిన పువ్వ వలె జీవించివుండే వాచారాలు దరిచేరవు. అది ఆదర్శమైన స్థితి.

అలా ఎందుకు చేయలేకపోతున్నాం?

దీన్ని గురించి ఎవరూ ఆలోచించరు. ఆచరించటం మరచిపోతారు. పాత అలవాట్లే తిరిగి ప్రత్యక్షమవుతున్నాయి. అన్నింటిని మించి అచేతనలో నీ అవచేతనలో ఈ నయవంచన అనుమానం నీ చెవుల్లో గుసగుసలాడుతుంది. ఓష్ నీవు జాగ్రత్తగా లేకున్న ఏదో దురదృష్టంనీకు దాపురించవచ్చు. నిన్ను నీవు గమనించుకోవడం మరచిపోతే, నీకేమి సంభవిస్తుందో తెలియదు. నీవు ఎంత అవివేకంతో, ఎంత అజ్ఞానంతో ఎంత మూర్ఖత్వంగా దానిని వింటావంటే దానితో సర్వము నాశన

మవుతుంది. నీపై నీవు శ్రద్ధ చూపించడం మొదలిడుతావు.

నీ కణజాలంలోకి ఒకింత వివేకాన్ని ఒకింత తెలివిని చొప్పించడం ప్రారంభించి మరొకసారి విచారించకుండా వుండటం నేర్చుకోవాలి.

CWM 3;256-57

మంచిగా వుండటం కోసం ఒకరు తప్పక మంచిగా ఉండాలి.

సరైన మార్గంలో వెళ్ళాలనుకొంటే నమ్రతగా వుండాలనుకొంటే పవిత్రతను పాటించాలనుకుంటే, అనాసక్తంగా ఉండాలనుకుంటే ఏకాంతంలో గడపాలనుకుంటే, విషయాలు సులభతరం అవుతాయి. అనేది ఒట్టి భ్రమ. దానిని కొనసాగించకూడదు. అసలు జరిగేది దీనికి విరుద్ధంగా వుంటుంది. బాహ్యాంభ్యంతర పరిపూర్ణత వైపు పయనించడం ఆరంభిస్తేకష్టాలు అదే సమయంలో పొడ సూపుతాయి.

ప్రజలు ఇలా చెప్పుకోవటం తరచుగా వింటూంటాం. ఓష్, నేను మంచిగా వుండాలని ప్రయత్నిస్తున్నాను కాబట్టి ప్రతి ఒక్కరు నాకు చెడుగా కనిపిస్తున్నారు. కేవలం ఏదో కావాలన్న ఉద్దేశ్యంతోను ఇతరులు నీతో మంచిగా ఉండాలి కాబట్టి నీవు వారితో మంచిగా నుండాలి అనే భావనతోను, మంచిగా నుండకూడదు. కేవలం మంచిగా ఉండటంకోసమే మంచిగా ఉండాలి. ఈ పాఠాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఫలితం ఆశించకుండా సాధ్యమైనంతవరకు మంచిగా చేయాలి. ఫలితం దృష్టిలో నుంచుకొని చేయకూడదు. మంచిపనిచేస్తే, మంచి ప్రతిఫలం దక్కుంతుందనే ఆశతో మంచిగా వుండటం ఎందుకంటే జీవితం సుఖవంతంగా వుండేటందుకనే ఆశతోను జీవితం ఇక సుఖవంతం అవుతుందనే వైఖరి ఉన్నట్లయితే, గమనించి పనిచేసినందువల్ల చేకూరే విలువ లేకుండాపోతుంది. న్యాయంపై మక్కువతో న్యాయంగా వుండాలి. పవిత్రతపై మక్కుతో పవిత్రంగా వుండాలి. అనాసక్తత పై మక్కువతో అనాసక్తంగా ఉండాలి. అపుడే పురోగతి చెందేపథంలో తప్పక ముందు కెళ్ళగలవు.

CWM 3;264-65

పరమానందస్థితిని పొందటం

నీతి సూక్తుల వల్లగాని వాటి విస్తృతజ్ఞానంవల్లగాని మక్కువతో ధ్యానాచరణవల్ల

గాని ఏకాంత జీవనంవల్ల గాని చింతనవల్లగాని పరమానందస్థితి సిద్ధించదు. కోరికలు త్యజించినపుడే సిద్ధిస్తుంది. అది అంత సులభంకాదు. అయితే సిద్ధించటానికి జీవితకాలం పట్టవచ్చు. వాస్తవానికి అది ప్రతికూలమార్గంగా తోస్తుంది. అయినప్పటికీ తన్ను తాను మోసగించుకొనడానికి ఇష్టపడినట్లయితే, అభివృద్ధి దశ ఒక స్థాయిలో అది పాటించవలసిన ఉపయోగపడేదిగా క్రమశిక్షణగా ఉంటుంది. ఆచరించటం తప్పనిసరి అవుతుంది. ఎందుకనగా ప్రథమంగా పెద్ద కోరిక లన్నింటిని త్యజించడం ఆరంభించాలి. అది చాలా స్పష్టం. ఇబ్బందిపెట్టేవి వాటిని గురించి ఎలాంటి భ్రమ చెందాల్సిన అవసరంలేదు. ఆ తరువాత అవసరమైన సూక్ష్మ కోరికలు ఏవైతే నెరవేర్చబడాలో వాటిని వదిలించుకోవాలి. కొన్ని సార్లు అంతర్గతంగా వెలువడే ఆదర్శాలను సైతం వదిలించుకోవల్సి వస్తుంది. అయితే అందుకు సమయం పట్టవచ్చు. దానికి తోడు శ్రద్ధ కూడా అవసరమే. చివరకు భౌతిక ప్రపంచంలోని తుచ్ఛకోరికలను బాహ్యవస్తువుల లోని అనుభూతుల క్షేత్రంలోని, ఉద్దేశాలలోని భావవృత్తులలోని, మానసిక క్షేత్రంలో భావాలకు సంబంధించిన వాటిని సైతం నిర్మూలించుకోవాలి. అవును ఆధ్యాత్మిక ప్రపంచంలో వాటిని నిర్మూలించుకోవాలి. అవి సూక్ష్మ మైనవి. చాలా ప్రమాదకరమైనవి. చొచ్చుకొనిపోయేవి. అవి కనిపించనివి. సాధుత్వముసుగుతో వ్యక్తమైవున్నందువలన వాటిని కోరికలనిపిలిచే సాహసం చేయలేము.

వీటన్నింటినీ కనుగొని తొలగించుకున్నప్పటికీ నిర్వర్తించవలసిన పనిలో వ్యతిరేకార్థమగు వాటిని మాత్రమే చేసినట్లవుతుంది.

CWM 3;264-65 *అనువాదం: శ్రీఆకుల కృష్ణ*

అతి శీఘ్రంగా అహంకారాన్ని విడిచే విధానం

కోరికలను జయించటం ద్వారా మనిషి అలౌకిక ఆనందాన్ని పొందుతాడనిబుద్ధుడు చెప్పాడు లేదా చెప్పేలా చేసారు. అది తొందరగా సాధించడం సాధ్యం కాకపోవచ్చు అని నాకనిపిస్తోంది. పైగా ఆ ఆనందం శుష్కించి ఆరిపోయి ఉంటుంది.

కోరికలను జయించడమనేది నిరాశ, బాధలతోకూడిన కఠినమైన సుదీర్ఘ ప్రయత్నం. ఈ సమస్యను ఆదిలోనే భౌతికంగా వశపరచుకోవాలంటే అందులోకి ధైర్యంగా, దృఢసంకల్పంతో దూకడమే సరైన విధానం, కానీ దానికి మనిషి తనను సిద్ధపరచుకొని అతి సామాన్యంగా షరతులు లేకుండా త్వరగా ఫలితాన్ని ఇస్తుందా లేదా అన్న

ఆలోచన, లెక్కలు లేకుండా, పరమసత్యానికి పరమేశ్వర ఇచ్ఛకు, పరబ్రహ్మ చేతులలోకి తనని తాను సంపూర్ణంగా సమర్పణ చేసుకోవాలి. ప్రాణులు అహాన్ని విడనాడి సంపూర్ణ ఆకస్మిక వృద్ధి సాధించడానికి అదే వేగవంతమైన మౌలికమైన విధానం. ఇది క్లిష్టమైనదిగా మనుషులు భావించవచ్చుకానీ, అందులో ఒక ఆతృత ఆత్మీయత, ఉత్సాహం, కాంతి, సౌందర్యం, పట్టుదలతో కూడిన సృజనాత్మక జీవితం ఉంది.

కోరికలను జయించిన నాడు అహం కొనసాగడానికి ఏ విధమైన ఆస్కారం ఉండదనేది సత్యం. మనిషి భావన ఏమిటంటే ఎప్పుడైతే చైతన్యం దృఢపడి అహం మట్టిలో కలిసిపోతుందో అప్పుడు మనిషిలోని తనవి అన్న విషయాలు కూడా మట్టిలో కలిసిపోతాయి. అప్పుడు ఆ జీవి నిర్వాణస్థితిలోనికి ప్రవేశించడానికి సిద్ధపడతాడు.

సత్యమైన నిర్వాణదశలోకి ప్రవేశించడం అంటే పరబ్రహ్మ తేజస్సులో అహం పూర్తి లయమొందటం. నా భావనలో ఇది సంపూర్ణ ఆత్మ సమర్పణ, — సమగ్రమైనది, నిర్దుష్టమైనది, ఏ విధమైన దాపరికం లేని బేరసారాలు లేని సంపూర్ణ సమర్పణ సరియైన విధానం.

జీవి ఎప్పుడైతే తనను గురించి ఆలోచించకుండా, తనకోసం తను బ్రతకకుండా, తనకి ఏ విధమైన అన్వయింపులు చేసుకోకుండా పరమ సౌందర్యం తోకూడిన, కాంతివంతమైన సంతోషకరమైన, శక్తివంతం, కరుణామయ అనంతంగురించి ఆలోచిస్తాడో అందులో అత్యంత గంభీరమైన ఆనందం నిండి ఉంటుంది. దాన్ని ఇక దేనితోనూ సరిపోల్చలేము.

ఈ విధానం ఒక్కటే అర్హత కలిగినది, ప్రయత్నించడానికి యోగ్యమైనది, మిగతావన్నీ కాలానికి గుర్తులుగా మిగిలిపోతాయి.

ఈ రెండు విధానాల మధ్య వ్యత్యాసం ఎటువంటిదంటే, ఒక శిఖరాన్ని అధిరోహించడానికి నెమ్మదిగా చుట్టూ తిరుగుతూ ఒక్కొక్క మెట్టూ కష్టపడి ఎక్కుతూ వందల సంవత్సరాలు గడపడం లేదా కనపడని రెక్కలు విస్తరించుకుంటూ ఒక్కసారిగా ఆ ఆకాశంలోకి ఎగిరి శిఖరాన్ని అందుకోవటం లాగా ఉంటుంది.

CWM 3;268- 69

సమస్యలనుండి పారిపోవడం అనేది ఎప్పటికీ పరిష్కారం కాదు.

సర్వ సాధారణంగా అడవులలో ఒంటరి జీవనం గడిపే వారికి అక్కడ ఉన్న జంతువులతోటి, వృక్షాలతోటి స్నేహం ఏర్పడుతుంది. కానీ కేవలం ఒంటరి జీవనం గడపడంద్వారా అంతః చేతనలోకి ప్రవేశించిపరమసత్యంతో సహజీవనం గడపగల శక్తి లభిస్తుందనేది నిజంకాదు. ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో నీకు వేరే పనిలేకుండా ఉంటే అది సులభమేమో, కాని నేను అలా జరుగుతుందని అనుకోను. నా దృష్టిలో ప్రతి మనిషి ఎప్పుడూ ఏదో ఒక విధమైన పనిని కల్పించుకోవచ్చు. ఇది నా జీవితానుభవం కూడా. అయితే ఎవరైనా కష్టకాలంలో తన నైజాన్నిఅణచుకోగలిగి, ఒంటరి జీవితం, శాశ్వతశక్తితో గడపడానికి ప్రయత్నం చేస్తూ, ఆ శక్తి ప్రసాదించిన పరిసరాలను నిలబెట్టుకోగలిగితే, దాని ద్వారా కలిగే అనుభూతి చాలా స్థిరమైన గంభీరమైన, అనంతమైన పరమ సత్యం.

కష్టాలను అధిగమించడానికి వాటినుండి పారిపోవడం పరిష్కారం కాదు. అది ఆకర్షణీయమనిపిస్తుంది. ఎవరైతే ఆధ్యాత్మిక జీవితం గడుపుతారో వారిలో ఏదో శక్తి వారికి ఈ విధంగా ఉపదేశాలను ఇస్తుంది. "ఒక వృక్షం క్రింద వంటరిగా కూర్చుని ధ్యానంలో నిమగ్నమై, మాట్లాడాలి, ఏదో చెయ్యాలి అన్న ఆకర్షణకు లోను కాకుండా ఉంటే ఎంత బాగుంటుంది!" ఆ దిశలో వెళ్ళడమనేది దృఢమైన నిర్ణయమే కానీ అది ఊహాజనకమైనది.

అకస్మాత్తుగా చేసే ధ్యానం అత్యంత ఉన్నతమైనది. ఎందువలనంటే అది నిన్ను అత్యావశ్యక అవసరంగా తన ఆధీనంలోకి తీసుకుంటుంది. నీకు వేరే అవ కాశంలేదు కాబట్టి ధ్యానం మీద కేంద్రీకరిస్తావు, ప్రత్యేకంగా కనిపించే వాటికి అతీతంగా ఉన్నవాటి మీద దృష్టి సారిస్తావు. అందుకు ప్రశాంత ఏకాంత అడవులలో ఆవాసం అవసరంలేదు. అది నీలోని అంతఃకరణ సిద్ధపడినపుడు, సమయం ఆసన్నమయినపుడు, నిజమైన అవసరం వచ్చినప్పుడు, దైవానుగ్రహం నీ మీద కలిగినపుడు మాత్రమే జరుగుతుంది.

నా దృష్టిలో మానవజాతి కొంత ప్రగతి సాధించింది కానీ జీవితంలోనే నిజమైన విజయాన్ని సాధించవలసిఉంది.

ఎటువంటి పరిస్థితులమధ్య ఉన్నా ఆద్యంతాలు లేని అనంతమైన ఒటరి జీవితం

ఎలా గడపాలో నువ్వు తెలుసుకోవాలి.నీ వృత్తిని నువ్వు నిర్వర్తించుకుంటూ కూడాస్వేచ్ఛగా, సర్వశ్రేష్ఠ సహచరుని తో కలిసి ఎలా జీవించాలో తెలుసుకోవాలి. అదే అసలైన విజయం.

CWM 3;276 *అనువాదం: డా. టి.ఎస్. రాజకుమారి*

త్రికరణ శుద్ధిగల నీతి నిజాయితీ

నీ గురించి ద్వేషపూరితమగు తెలివి మాలిన మాటలు ప్రజలు మాట్లాడినప్పుడు నీవు వ్యాకుల పడి దుఃఖపడి లేదా నిరుత్సాహానికి లోనయితే నీవు మార్గంలో ముందుకు సాగలేవు. అలాంటి విషయాలు నీకు ఎదురవుతాయి. నీవు దురదృష్టవంతుడవో, లేదా నీ కర్మ సంతోషకరమైనది కానందుకో కాదు, కానీ, అందుకు విరుద్ధంగా దివ్యచేతన, దివ్యకృప నీ నిశ్చయాన్ని దృఢమైనదిగా పరిగణించి నీ మార్గంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకోగల శక్తి నీకు వున్నదా అని చూడటానికి.

అందువల్ల, ఎవరయినా నిన్ను, ఆక్షేపించినా, లేదా సహించలేనంతగా దుర్భాషలాడినా నీవు చేయవలసినది నీలోకి నువ్వు చూచుకొని అట్లాంటి పరిస్థితికి దారితీసిన బలహీనతలు లేదా లోపాలు ఏవయినా అలాంటివి జరగడానికి దోహద పడ్డాయా.అని పరిశీలించాలి. నీకు అత్యంత విలువైనవిగా తోచిన విషయాలు వారు ప్రశంసించలేదని. నీవు దుఃఖపడకూడదు. కోపగించుకోకూడదు. విచారపడకూడదు. అందుకు విరుద్ధంగా నీవు దైవకృపకి సర్వదా కృతజ్ఞతగా వుండాలి. ఎందుకంటే అది నీలో వున్న లోపాన్ని, బలహీనతలను లేదా అపార్థాన్ని, ఏవైతే నీవు సరిచేసుకోవాలో, వాటిని ఎత్తి చూపాయి గనుక.

అందువల్ల విచారంగా వుండటానికి బదులుగా, నీవు పూర్తిగా సంతృప్తిపడి నీకు హానికరం కావాలని తలపెట్టిన దాని వలన కృంగిపోకుండా గొప్ప ప్రయోజనాన్ని రాబట్టుకోవాలి.

అదీ గాక, నిజంగా నీవు ఈ దారిలో వెళ్ళాలని యోగసాధన చేయాలని అనుకొనేది గౌరవం కోసమో మెప్పుదల కోసమో కాదు, అది నీ అస్తిత్వానికి అత్యావశ్యకం కాబట్టి, మరో విధంగా నీవు సంతోషంగా నుండలేవు కాబట్టి. ఎవరయినా నిన్ను మెచ్చుకొంటారా, మెచ్చుకోరా, అనేది ముఖ్యంకాదు. దాని కసలు ఎలాంటి ప్రాముఖ్యత లేదు. నువ్వు ముందుగా నీకు నీవు చెప్పుకోవాలి. నువ్వు సాధారణ మానవులకు

సాధారణ మానవ జీవన శైలికి దూరంగా జీవించే వారికి ఎంతదూరంగా నుంటే అంత తక్కువగా నిన్ను జనులు ప్రశంసిస్తారని. అది సహజం. ఎందుకనగా వారు నిన్ను అర్థం చేసుకోలేదు. నేను మళ్ళీ చెప్తున్నాను. దాని కెలాంటి ప్రాముఖ్యత లేదు.

త్రికరణ శుద్ధి గల నిజాయితీ అంటే నీవా మార్గంలో ముందుకు సాగటం, కారణం, నీవు మరోవిధంగా నుండలేవు. నిన్ను నీవు దివ్యజీవనానికి అర్పణ చేసుకోవాలి. కారణం, నీవు మరో రకంగా చేయలేవు. నీ అస్తిత్వాన్ని నీవు పరివర్తన గావించుటకు ప్రయత్నించి వెలుగులోనికి రావాలి. కారణం నీవు మరోరకంగా చేయలేవు. అంతేకాదు అది నీ జీవిత పరమార్థం.

అది అలావున్నప్పుడు నువ్వు తప్పని సరిగా సరయిన మార్గంలో వున్నావను కోవచ్చు.

CWM 3;282- 83 *అనువాదం: తుమ్మల లక్ష్మి*

నాలుగు ఉన్నత సత్యాలు

ఇది దుఃఖ నిర్మూలనకు దారితీసే నాలుగు గొప్ప సత్యాలకు అష్టాంగమార్గాలకు సంబంధించినది మూల గ్రంథంలో యిచ్చిన వివరాలు.

నాలుగు ఉన్నత సత్యాలు:

1. జీవితం - సాధారణ జీవితంతో అజ్ఞానమయ అసత్య జీవితం వేరు చేయ లేనంతగా బాధతో ముడివడింది. అది శారీరక బాధ, మానసిక వేదన.

2. వేదనకు కారణం కోరిక. అది ప్రత్యేకత గల జీవిత స్వభావం గురించిన అజ్ఞానం కారణంగా కలుగుతుంది.

3. బాధనంతంచేయడానికి బాధను తప్పించుకోవడానికి మార్గమొకటి ఉంది.

4. అజ్ఞానాన్నుండి మనసును క్రమంగా ప్రక్షాళన చేసే అష్టాంగమార్గ శిక్షణననుసరించి ఈ విముక్తిని పొందవచ్చు. నాల్గవసత్యాన్ని అష్టాంగమార్గ విధానమంటారు.

CWM 3;248

అష్టాంగములతో కూడిన ఉత్తమమార్గం

ఉత్తమమార్గం క్రింద పేర్కొనబడిన ఎనిమిది స్థాయిలలో శిక్షణను పొందడంతో కూడి ఉంటుంది.

1. సమ్యక్ దృష్టి: విషయాలను ఉన్నవి ఉన్నట్లుగా చూడడం, అంటే స్వచ్ఛమయిన ఖచ్చితమయిన దృష్టి, ఉత్తమమయిన దృష్టితో ఉనికి లక్షణం మూడు స్థితులతో కూడి ఉంటుంది. బాధ, ఆశాశ్వతత్వం, స్థిరమయిన ఓ అహం లేకపోవడం. ధర్మపథం అలా చెప్తుంది. కానీ బొత్తిగా అది మాత్రమే కాదు.స్థిరమయిన దీర్ఘకాలం పాటుండే ప్రత్యేక వ్యక్తిత్వం మానసిక రాశిలో ఉండకపోవడం, వ్యక్తిగత చేతనలో నిజమయిన కొనసాగుదల అనబడు లక్షణాలు కూడా అవసరం. ఈ కారణంగానే ఉదాహరణకు సాధారణ స్థితిలో ఒకరు తమ జీవితాలను గుర్తుంచుకోలేరు. వారి జీవితాలన్నింటిలో చేతనా పూరితమయిన కొనసాగుదల అన్న భావనను నిలుపుకోలేదు.

అప్పుడు మొదటి అంశమేమిటంటే, సరిగా చూడడం. సరిగా చూడడమంటే, సాధారణ జీవితం బాధతో ముడివడిఉంటుందని, విషయాలను అశాశ్వతమనీ వ్య కి
్తగతచేతనతో కొనసాగుదల ఉండడవన్నది. గ్రహించడం

2. సరైన సమ్యక్ ఉద్దేశ్యము లేక కోరిక: 'కోరిక' అన్న పదాన్ని వాడకుండా ఉండవలసింది, ఎందుకనంటే ఇప్పుడే కోరిిక ఉండకూడదని చెప్పబడింది. అది సరైన ఆకాంక్ష గావచ్చు. అనే దానికి బదులుగా 'ఆకాంక్ష' ఉండాలి

"బంధాలనుండి విముక్తమవ్వాలి ఉనికితో ఉన్న వాటన్నింటిపట్ల దయార్ద్రి అభిప్రాయం ఉండాలి." నిరంతరం దయగల స్థితిలో ఉండాలి. అందరికీ ఎల్లప్పుడూ మంచి జరగాలనే భావన ఉండాలి.

3. ఎవరినీ నొప్పించని సవ్యమయిన భాషణ: ఎప్పుడూ వృథాగా మాట్లాడకూడదు. ద్వేషపూరితంగా మాట్లాడడం ఖచ్చితంగా వర్జించాలి.

4. సవ్యమైన ప్రవర్తన: శాంతమయిననిజాయితీగల ప్రవర్తన కేవలం పదార్థ పరంగానే గాక, నైతికంగా, మానసికంగా కూడా అన్ని విషయాలలో అలా ప్రవర్తించాలి. మానసిక నిజాయితీని సాధించడం అన్నింటికంటే అత్యంత కష్టమయిన వాటిలో ఒకటి.

5. సవ్యమైన జీవన శైలి: ఏ జీవికి కీడు చేయకపోవడం లేక ఏ జీవి అయినప్పటికీ

ప్రమాదం కలిగించకపోవడం దీనిని సాపేక్షంగా అర్థం చేసుకోవడం సులభం. కొంత మంది ఈ సూత్రాన్ని సమయస్ఫూర్తిగా విరుద్ధంగా అతిశయం గావిస్తారు. ఉదాహరణకు క్రిములను మ్రింగకుండా ఉండడంకోసం నోటిపైన చేతి రుమాలునుంచుకొనేవారికి వారి ముందున్న మార్గంపై నుండే క్రిమి మీద అడుగుపడకూడదని ఆ మార్గాన్ని సుభ్రంగా ఊడ్చి ఉంచాలని తెలియదు. నాకు ఇది కొంత అతిగా అన్పిస్తుంది. ఎందుకంటే వర్తమానంలోని జీవితమంతా వినాశనంతో కూడివున్నది. కాని మూల గ్రంథాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే హాని చేసే సాధ్యతలన్నింటిని తొలగించుకోవాలి. ఏ జీవినైనా ప్రమాదానికి గురి చేయకూడదు. ఇక్కడ సజీవంగా ఉన్న అన్ని జీవులను కలుపుకోవాలి. ఈ శ్రద్ధను, ఈ దయను విశ్వాసంతో జీవిస్తున్న ప్రతి దానిపై సారించితేరో మీ అంతరంగ అభివృద్ది కెంతో సానుకూలంగా ఉంటుంది.

6. సవ్యమైన ప్రయత్నం: పనికిరాని వాటికోసం వృథా ప్రయాసలు చేయవద్దు. అజ్ఞానాన్ని జయించడం కోసం, అసత్యాన్నుండి ముక్తి కోసం మీ శక్తినంతటినీ కూడగట్టుకోవాలి. అయితే దాని నెప్పటికీ ఎక్కువగా చేయలేవు.

7. ఏడవసూత్రం ఆరవదానిని దృఢపరుస్తుంది. చురుకైన జాగరూకత. మీకు చురుకైన జాగరూకతగల మనసుండాలి. సగం నిద్రలో సగం మరపులో జీవించకండి. సాధారణంగా జీవితంలో ఏమి జరిగినా మిమ్మలను మీరు అనాయాసంగా, నిశ్చింతగా నుంచుకుంటూండాలి. ప్రతి ఒక్కరూ చేసేదిదే. అప్పుడప్పుడు మేల్కొంటూ, మీ సమయాన్ని వృథాచేసినట్లు తెలుసుకుంటారు. అప్పుడొక పెద్ద ప్రయత్నం చేసి తిరిగి వెనక్కు పడిపోతారు. ఓ నిముషం తర్వాత బద్ధకం ఆవరిస్తుంది. తక్కువ తీక్షణతతో ఎక్కువ నిలకడగా ఉండడం బాగుంటుంది.

8. చివరికి సరైన ఆలోచన: అహంలేని ఆలోచనతో విషయాల సారం మీద అంతర్ సత్యంమీద చేరవలసిన లక్ష్యం మీద కేంద్రీకరించాలి.

CWM 3;248-50

బాధనుండి విడుదల

ఇక్కడ దమ్మపథంలో ఊసులేనిది ఒకటి ఉన్నది. అది మహత్తమమగు నిరాసక్తత, మహోన్నతమగు విమోచన, ఆత్మ పరిపూర్ణత అనబడు క్రమశిక్షణను పాటించడం పురోగతిలో వృద్ధి సాధించడం - ఇక్కడ వర్ణించబడిన నిర్వాణమనే విముక్తిని దృష్టిలో

నుంచుకొని కాదు. కానీ ఈ పురోగతిలో వృద్ధి చెందడం అనేది ఒక దృఢమైన నియమం. ప్రాపంచిక జీవనపరమార్థం, సమస్త సృష్టి ఉనికి యొక్క వాస్తవికత కాబట్టి. దానికి తోడు నిన్ను నీవు యధేచ్ఛగా దానితో సమన్వయపరచుకుంటావు. కాబట్టి ఫలితం ఏమైనప్పటికీ.

దివ్యకృపలో ప్రగాఢమైన నమ్మకం దివ్యసంకల్పానికి ఒక సంపూర్ణ సమర్పణ. దివ్యప్రణాళికకు సంపూర్ణంగా అంటిపెట్టుకొని ఉండడం అన్నది ఫలితంపై దృష్టి నిలుపకుండా చేయాల్సిన పనిని చేయిస్తుంది. పరిపూర్ణమైన విముక్తి అంటే ఇది.

పరిపూర్ణమయిన విముక్తి :

నిజానికిది వేదనను తుడిచి పెట్టడం. చేతన మొత్తం మార్పు చెందని ఆనందంతో నిండిపోతుంది. మీరు వేసే ప్రతి అడుగు దేదీప్యమాన అద్భుతాన్ని ఆవిష్కరిస్తుంది.

మానవాభివృద్ధికోసం అది తీసుకువచ్చారు.అందుకు బుద్ధుడికి కృతజ్ఞులము. నేను ఆరంభంలో చెప్పినట్లు మనకాయన బోధించిన సుందరమయిన విషయాలన్నింటినీ కొంతయినా గ్రహించడానికి ప్రయత్నించాలి. అయితే మన లక్ష్యాన్ని, ప్రయత్న ఫలితాన్ని మన అవగాహననంతటినీ మించి ఉండే ఉత్తమ వివేకానికి వదిలివేయాలి.

CWM 3;297

అనువాదం: అరుణా మోహన్

శ్రీమాతచే పునశ్చరణ చేయబడిన బుద్ధుని గాథ

ఒక యువ బ్రహ్మచారి మేధావి, ఆ విషయం అతనికి తెలుసు. అతను తన నైపుణ్యతలను పెంచుకోగోరాడు. అలా అయితే ప్రతివారు తనను ప్రశంసిస్తారనే భావంతో అతడు దేశాలన్నీ తిరగసాగాడు. బాణములను తయారుచేసే వాని వద్ద, వాటిని తయారుచేయడం నేర్చుకున్నాడు. ఇంకా నావలను ఎలా తయారుచేయాలో, వాటిని ఎలా నడపాలో కూడా నేర్చుకున్నాడు. ఇంకో చోట గృహములను ఏ విధంగా నిర్మించాలో నేర్చుకున్నాడు. ఇతర చోట్లలో నానా విధములైన నైపుణ్యతలను ఆర్జించినాడు. ఈ విధంగా పదహారు వేర్వేరు దేశాలను దర్శించాడు. తరువాత స్వగృహానికి తిరిగి చేరుకొని చాలా ఘనంగా ప్రకటించాడు, "ఈ పృథ్విపై నా అంతటి నేర్పు గలవారు వేరొకరున్నారా!" అని, అపుడు బుద్ధ భగవానుడు అతనిని చూచి అతను గతంలో నేర్చుకున్న విద్యల కన్నా ఉత్తమమైనదానిని బోధించాలని తలచి ఒక ముదుసలి యతిగా ఒక బిక్షాపాత్రను చేత ధరించి అతని ముందు నిలిచాడు. బిక్షగాడిలా ఆ నవ యువకుడి ముందు నిలుచున్నాడు.

"ఎవరు నీవు?" అని బ్రహ్మచారి అడిగాడు.

"నా దేహమును నా అదుపులో వుంచగలిగే సామర్థ్యమును గల మనిషిని."

"నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"విలుగాడు తన బాణములను గురి పెట్టగలడు" అని బదులిచ్చాడు బుద్ధుడు.

"చుక్కాని తిప్పువాడు నావను నడిపిస్తాడు, స్థపతి గృహముల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తాడు. కాని జ్ఞాని తనను తాను అదుపులో ఉంచుకొంటాడు."

"ఏ విధంగా?"

"అతను ప్రశంసించబడినపుడు అతని మనస్సు చలించకుండా ఉంటుంది. అతను నిందించబడినప్పుడు కూడ అతని మనస్సు అచంచలంగా ఉంటుంది. అతడు సత్యమార్గం అనుసరించటానికి మక్కువ చూపుతాడు, అతడు జీవితం ప్రశాంతంగా గడుపుతాడు."

CWM 2:177-78

శ్రీమాత

అనువాదం: కవితా శ్రీధర్

అఖిల

అఖిల భారత పత్రిక – జూన్ 2018



యోగః పునరావిష్కారము


మొదటి భాగము

విషయసూచిక

సాంప్రదాయక యోగం: ఒక సమీక్ష

భారతీయ యోగా ఆవిర్భావం

అన్ని రకాలైన మన ఆలోచనలు, క్రియాకలాపాలు అన్నింటిలో, ఏదైనా ఉపయోగ కరమైన బలమైన శక్తి లేదా అంతరించిపోకుండా కొనసాగగల ఏదైనా రహస్య సుగుణం స్వయంగా వాటిలో ఉంటే, వాటన్నింటినీ ఒక సర్వోత్కృష్టమైన, పరీక్షకు గురిచేసి వాటికి తిరిగి జన్మించే అవకాశం యిస్తూ ప్రసవవేదనతో నొప్పులు పడుతున్నటువంటి యుగంలో మన మిప్పుడు ఉన్నాం. ప్రపంచం ఇప్పుడు ఒక బ్రహ్మాండమైన మోదియా (గ్రీకు కథలోని యుక్తులు, కుయక్తుల స్త్రీ) కడాయి లాగా కుతకుత ఉడుకుతూ ఉంది. అందులో సమస్తమూ ముక్కలై హరించుకు పోవటానికి గాని, తిరిగి తిరిగి కలుపుతూ కొత్త రూపాలకు చెల్లాచెదురైన పదార్థంగా అవ్వడానికి లేదా పరివర్తన జరిగి యవ్వనంతో వెలువడి ఒక తాజా మనుగడ సాగించడానికి పరిశోధన జరుగుతోంది. భారతీయ యోగం సారతః అభివ్యక్త ప్రకృతి గొప్ప శకుల ఒక ప్రత్యేక చర్య లేదా రూపం. దానికదే ప్రత్యేకత కలిగినదై, విభజించబడి, అనేక విధాలుగా రూపొందించ బడినది. మానవజాతి భవిష్య జీవిత క్రియాశీలమైన మౌలికాంశాలలో అంతర్నిహితశక్తి పరమైనవాటిలో యోగం, ఒకటి స్మృతి కంద నటువంటి పురాతన యుగాలలో ప్రభవించిన బిడ్డ. దాని జవసత్త్వంతో, సత్యంతో భద్రపరచబడి, మన ఆధునిక కాలానికి అందించబడింది. అది ఇప్పుడు తాను ఆశ్రయం పొందిన రహస్య సాంప్రదాయ మార్గాలు, సన్యాస ఆశ్రమాల నుంచి బయల్పడుతూ,



జయాపజయాల ప్రస్తుత అర్థాలు మారిపోతాయి. అపజయమనేది లేదు. ఎందుకనంటే, యేది జరిగినా అది ప్రపంచాధిపతి ఉద్దేశ్యమే, అదే అంతిమం కాదు, ఆయన దారి మీద అదొక అడుగు, అదొక వ్యతిరేకతగా, ఒక ఓటమిగా, ఒక తిరస్కృతిగా, ఉప కరణాత్మక జీవి ముందుంచబడిన లక్ష్యాన్ని మొత్తంగా తిరస్కరించడంగా ఓ క్షణం పాటు కన్పించినా, అది పైకి మాత్రమే అలా కన్పిస్తోంది, తరువాత ఆతని చర్యకు సంబంధించిన లావాదేవీలలో తన యథార్థ స్థానంలో కన్పిస్తుంది — ఒక నిండైన అతిమానస దృష్టి, వెంటనే లేక ముందుగా కాలక్రమంలో ప్రాప్తించే ఫలితానికి, దానికి గల దాని ఆవశ్యకతను యదార్థ సంబంధాన్ని సైతం చూడ గలుగుతుంది. ఆ ఫలితాని కిది యెంతో విరుద్ధంగా, బహుశా తప్పక నిషిద్ధమైనదిగా కన్పించవచ్చు.

CWSA 24: 726-27

అనువాదం: కె. వి. రావు

భవిష్యత్తుకు సంబంధించిన సజీవన మానవశక్తుల, ప్రయోజనాల మొత్తంలో తన స్థానాన్ని పొంద గోరుతున్నది. కాని అది తనను తాను తిరిగి కనుగొనాలి. తన అస్తిత్వంలోని తన అత్యంత లోతైన కారణాన్ని ఆ సర్వ సాధారణ సత్యంలో ఉపరితలానికి తీసుకు రావాలి. అది ప్రాతినిధ్యం వహిస్తున్న ముగింపు లేని మహాప్రకృతి ఉద్దేశాన్ని బాహ్యంలోకి పైకి తేవాలి. ఈ నూతనమైన ఆత్మ-జ్ఞానం, ఆత్మ-ప్రశంస (గుణాగుణ వివేచన) లనబడే వాటి ఆధారంగా అది స్వయం తనదైనటువంటి, తిరిగి స్వాధీనము చేసుకొనేటటువంటి, విస్తృతతరమైన సంయోజనమును కనుగొనాలి. తనను తాను తిరిగి వ్యవస్థీకరించుకుంటూ, అది ఎక్కువ తెలివిగా, శక్తివంతంగా పునర్వ్యవస్థీకరించ బడినటువంటి జాతి జీవితంలో ప్రవేశించగలుగుతుంది. దాని ప్రక్రియలు అవి ప్రకటించే అంతరంగంలోని దాని అత్యంత రహస్య మూలస్థానం లోనికి, ఊర్ధ్వముఖంగా, సృష్టి మూర్తిత్వాల ఉన్నతోన్నత ఔన్నత్యాలకు నడిపిస్తాయి.
CWSA 23: 5- 6

యోగం వ్యక్తి పరిణామ కాలాన్ని కుదించివేస్తుంది

జీవితం, యోగం రెండింటి సరియైన దృక్పథంలో జీవితమంతా ఎరుకగల లేదా ఉపచేతన ఎరుకగల ఒక యోగమే. ఈ పదానికి మన అస్తిత్వంలో నిద్రాణంగా ఉన్న రహస్యమైన అంతర్నిహితశక్తులను అభివ్యక్తం చేయడంద్వారా, ఆత్మ - పరిపూర్ణత కోసం క్రమపద్ధతిలో చేసే ప్రయత్నం అనే అర్థాన్ని చెప్పుకుంటాం. ఆ ప్రయత్నం లో సాధించిన అత్యున్నత స్థాయి అది. విశ్వజనీనమూ, విశ్వాతీతము అయిన 'సత్ ' తో మానవ వ్యక్తి ఐక్యత, మనిషిలోను, జగత్తులోనూ, పాక్షికంగా ప్రకటితం కావడం మనం చూస్తాం. కాని, మనం దాని ఆకారాల వెనక్కివెళ్ళి చూస్తే, జీవితం సమస్తం చేతనలోను, ఉపచేతనలోను తన పరిపూర్ణతను ఇంకా నిజం చేసుకోబడని అంతర్నిహితశక్తులయొక్క ఎప్పటికీ పెరిగిపోతూ ఉండే వ్యక్తీకరణను నిజం చేసుకోవడానికీ తనదైన దివ్య సత్యతతో ఐక్యం కావటానికీ అభివ్యక్త ప్రకృతి విశాలమైన యోగంగా కనబడుతుంది. మనిషిలో ఆలోచనాపరుడైన మనిషిలో ఆమె మొట్టమొదటిసారిగా ఈ భూమిమీద స్వయం ఎరుకతో చేసే విధానాలను, ఇచ్ఛాపరమైన పథకాల క్రియాకలాపాలను ఆమె కల్పించింది. బహుశా వాటిద్వారా ఈ మహాలక్ష్యం ఇంకా శీఘ్రంగాను, గొప్పశక్తితోనూ, సాధ్యపడవచ్చు. స్వామి

వివేకానంద చెప్పినట్లుగా, యోగం ఒక వ్యక్తి పరిణామాన్ని ఒక జీవితకాలం లేదా కొన్ని సంవత్సరాలు లేదా కొన్ని నెలల ఐహిక మనుగడలోనికి కుదించివేస్తుంది. అప్పుడు ఒక ఎంపిక లేదా ఒక కుదింపుకాకుండా, సర్వసాధారణ విధానాలయొక్క తీవ్రతతో కూడిన ఎక్కువ శక్తివంతమైన రూపాలను కలిగి ఉండాలి. ఇప్పటిదాకా అవి ఆషామాషీగా, చాలావరకు తీరుబడిగా సాధన సంపత్తి, శక్తులు, పైకి బాగా వ్యర్థమౌతున్నట్లు కన్పించేటట్లు వాడబడుతున్నాయి. కాని అవి ఆ ఉదారమైన దివ్యజనని ద్వారా నిస్తృతంగా పైపైకి తీసుకుపోయే ఆమె ప్రయాసలో ఎక్కువ సంపూర్ణమైన మేళవింపుతో ఉన్నాయి. ఇటువంటి యోగదృక్పథం మాత్రమే కేవలం భద్రమైన, హేతుబద్ధమైన యోగవిధానాల సంయోజనమునకు ఆధారం కాగలదు.
CWSA 23: 6-7

యోగవిధానాలు - వైజ్ఞానిక శాస్త్రం

యోగవిధానాలకూ వాడుకలోని మనిషి మానసిక క్రియాకలాపాలకూ ఉండే సంబంధం ఎటువంటిదంటే వైజ్ఞానికంగా విద్యుచ్ఛక్తి లేదా ఆవిరి ఉపయోగానికీ మహాప్రకృతిలో వాటి సర్వసాధారణ ప్రక్రియలకూ ఉండే సంబంధం లాంటిదే. అవికూడా, వైజ్ఞానికశాస్త్రం ప్రక్రియవలెనే జ్ఞానాభివృద్ధి మీద రూపుదిద్దబడి క్రమబద్ధమైన ప్రయోగాలతో, ఆచరణాత్మక విశ్లేషణలతో, స్థిరమైన ఫలితాలతో రూఢీపరచబడినవే. ఉదాహరణకు, రాజయోగమంతా మన అంతరంగ మూలకారకాలు, కలయికలు, విధులు, శక్తులను వేరుచేయగలగటం, లేదా విలీనం చేయగలగటం కొంగ్రొత్త కలయికలను చేయగలగటం, నూతనమైనవి. ఇతఃపూర్వం అసాధ్యమైననటువంటి చర్యలను స్థిరపరచటం లేదా పరివర్తన చేసి స్థిరమైన అంతరంగపద్ధతులద్వారా వినూత్నమగు సర్వసాధారణ సంయోజనంలోనికి నిర్ధారించగలగటం అనేటటువంటి ఈ ప్రత్యక్ష జ్ఞానం, అనుభవం మీద ఆధారపడినదే. అదే విధంగా, హఠయోగం కూడా, ప్రాణశక్తులకు, విధులకు సర్వసాధారణంగా లోబడిపోయిన మన జీవితంలో, వేటి సర్వసాధారణ ప్రక్రియలు స్థిరమైనవిగా అనుల్లంఘనీయమైనవిగా మనకు అనిపిస్తుంటాయో, అటువంటి వాటి గ్రాహ్యత, అనుభవం మీద ఆధారపడి ఉంది. వాటిమీద ఆధిపత్యం సాధించి, ప్రక్రియలను మార్చటం లేదా తాత్కాలికంగా కొంతకాలం నిలిపి ఉంచటం చేయగలం. దాని ఫలితాలు మరొక విధంగా అసాధ్యం. ఎవరైతే వాటి పద్ధతుల కారణాలను

గ్రహించుకోలేరో వారికది అద్భుతంగా అనిపిస్తుంది. ఇంకా మరికొన్ని దాని ఇతర రూపాలలో యోగంయొక్క ఈ లక్షణం తక్కువగా కనబడుతున్నదంటే, కారణం అవి ఎక్కువగా అంతర్బుద్ధికి చెంది, తక్కువ యాంత్రికతతో భక్తియోగంవలె దివ్యమైన పారవశ్యంలోని లేదా జ్ఞానయోగంవలె చైతన్యం అస్థిత్వాల దివ్య అనంతంలోనికి ఎక్కువగా సన్నిహితంగా తీసుకువెళ్ళేవి కావటంమూలంగానే. అయినప్పటికీ, అవి కూడా మనలోని ఏవో ఒక ప్రధానమైన మేథోసామర్థ్యాన్ని విని యోగించుకోవటంతో ఆరంభమౌతాయి. వాటి దారులు, ముగింపులు అప్రయత్నంగా తటాలున జరిగే వాటి దైనందిన క్రియాకలాపాలలో చూడగలిగేవికాదు. పద్ధతులన్నీ యోగం అనే సామాన్య నామం క్రింద వర్గీకరించబడ్డాయి. అవన్నీ, ప్రత్యేకమైన మానసిక ప్రక్రియలు, అపరా ప్రకృతి నిర్ధారించిన సత్యం, వృద్ధి మీదనూ, సర్వసాధారణ ప్రక్రియల, ఆధిపత్యశక్తుల ఫలితాలలో నుంచీనూ, స్థాపించబడ్డాయి. అవన్నీ ఎప్పుడూ అంతర్నిహితంగా దాగి ఉన్నవే, కాని ఆమె సర్వసాధారణ గమనాలు వాటిని తేలికగా లేదా తరచుగా అభివ్యక్తం చేయవు.

CWSA 23:7

జీవితమంతా యోగమే

ఏ యోగసంయోజనమైనా, దాని లక్ష్యంలో, విమోచనం పొందిన, పరిపూర్ణత చెందిన మానవ జీవితంలో భగవంతుని, ప్రకృతిని తిరిగి ఆయనతో ఐక్యం చేయనటువంటిదీ, లేదా దాని పద్ధతులలో మన అంతరంగ బాహ్య క్రియాకలాపాలలోను, అనుభవాలలోనూ రెండింటిని దివ్యపరిపూర్ణత నొందించటంలో కేవలం సమ్మతిని ఇవ్వటానికే కాకుండా, సామరస్యతకుకూడా అనుకూలించక పోయినటువంటిదీ అయినప్పుడు, అది ఎటువంటిదైనప్పటికీ మనలను సంతృప్తిపరచలేదు. కారణం మనిషి ఖచ్చితంగా ఉన్నతమైన దివ్యుడనికికి వ్యక్తీకరణగా, ప్రతీకగా భౌతిక ప్రపంచంలోకి అవతరించటం జరిగింది. అందులో నిమ్నతరమైనది దానికదే రూప పరివర్తనను పొంది ఉన్నతోన్నతమైన దాని ప్రకృతిని ధరించటం, ఉన్నతోన్నతమైనదీ దానికదే నిమ్నతరమైన ఆ రూపాలలో బయల్పడటం సంభవమే. ఈ సంభావ్యతలను సాక్షాత్కారించుకోకుండా అతని కివ్వబడిన జీవితమును పరిహరించడమనేది ఎప్పటికీ అనుల్లంఘనీయమైన స్థితికాదు. సరికదా, సర్వోత్కృష్టమైన అతని ఉద్యమంలో సకలమూ,

చిట్టచివరిదీ అయిన విషయమూకాదు. లేక అతని ఆత్మసాఫల్యతలో అత్యంత శక్తి వంతమైన సాధనమూ కాదు. అది కేవలం నిర్దుష్టమైన పరిస్థితులలో మాత్రమే తాత్కాలికంగా ఆవశ్యకమైనది కాగలదు. లేదా జాతికి మహత్తరమైన సర్వసాధారణమైన సాధ్యతను సంసిద్ధం చేయడానికై, ఒక ప్రత్యేక ప్రయోజనం ఆశించి వ్యక్తిమీద రుద్దబడిన అంతిమ ప్రయత్నం మాత్రమే కాగలదు. కేవలం అపరా ప్రకృతిలోని ఉపచేతస్సుతో జరిగే యోగంలాగా మనిషిలోనూ ఎరుకతో కూడిన యోగంగా అయినప్పుడు, బాహ్యంలోని జీవితంతో ముడివడి ఉన్నదైనప్పుడు మాత్రమే యోగం యొక్క నిజమైన, సంపూర్ణలక్ష్యం మరియు ప్రయోజనం సాధించబడగలదు. అప్పుడు, మరియొకసారి, ఆ మార్గమునూ సాధించినదానినీ చూసినవారమై పరిపూర్ణమైన తేజోమయమైన భావనతో మనం అనగలం:" జీవితమంతా యోగమే," అని.

CWSA 23: 8

హఠయోగం

హఠయోగంలోని ప్రధానమైన పద్ధతులు ఆసనము, ప్రాణాయామము. దాని అనేక ఆసనాలు లేదా స్థిరమైన భంగిమలతో అది మొదట శరీరానికుండే వ్యాకులతను నివారిస్తుంది. ఏదైతే సార్వజనీన జీవన మహాసముద్రంనుంచి గ్రుమ్మరిల్లుతుండే,

ఆత్మ ప్రబోధం అని మనం అనేది ఈ ఆత్మ వాణిని కాదు. కారణం అది కేవలం మానసికం, తరచుగా లోకంలో పరిపాటిగా జరుగుతూ ఉండే ఒకదానికి బదులుగా మరొకదానిని పరిగ్రహించే దోషం, అది ఇంకా లోతైన, ఎక్కువ అరుదుగా వినే వాణి, అయినప్పటికీ విన్నప్పుడు దానిని అనుసరించడం అత్యంత వివేకవంతమైన పని. అయినా కూడా హేతువు ఆధారంతో, బాహ్యం లోని నైతిక సలహాదారుని అభిప్రాయంతో స్పష్టంగా కనబడేవైపు సూటిగా వెళ్ళడంకంటే ఒక వ్యక్తి తనయొక్క ఆత్మ పిలుపును వినడానికి తహతహ లాడుతూ పరిభ్రమించడం మంచిది.

CWSA 23:153-154 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

ప్రాణికశక్తులను, కర్మలో గమనంలో వాటిని వినియోగియకుండా నిలిపివుంచుకోవడంలోని అశక్తతకు ఆ వ్యాకులత ఒక సూచన.అంతేకాక, శరీరానికి అసాధారణమైన ఆరోగ్యాన్ని, శక్తిని మృదుత్వాన్ని ఇస్తుంది. భౌతిక అభివ్యక్త ప్రకృతి సర్వసాధారణ అలవాట్లకు లోబడిపోయి, ఆమె సాధారణప్రక్రియల సంకుచితమైన హద్దులలో ఉండే శరీరానికి వాటినుంచి విమోచనం కల్పించటానికి అది ప్రయత్నిస్తుంది. ప్రాచీన హఠయోగ సంప్రదాయంలో ఈ విధమైనటువంటి విజయం చాలావరకు గురుత్వాకర్షణశక్తిని కూడా వశం చేసుకొనే పర్యంతం ప్రయత్నం జరగాలని ఎల్లప్పుడూ భావించడం జరిగింది. తరువాత, విస్తృతమైన అనేక అనుబంధ ప్రక్రియలను హఠయోగ శరీరాన్ని అన్ని అపరిశుద్ధతలనుంచి విముక్తి చేయడానికి నిర్వహిస్తాడు. అతడి ముఖ్య ఉపకరణాలైన ఉచ్ఛ్వాస నిశ్వాస సంబంధమైన అభ్యాసాలతో అడ్డంకులనుంచి వ్యవస్థకు విముక్తి కలిగిస్తాడు. ఇవి శ్వాసను లేదా ప్రాణికశక్తిని నియంత్రించడం ప్రాణాయామంగా పిలువబడతాయి. ఎందువల్లనంటే, శ్వాసయే ప్రాణికశక్తుల ప్రధానమైన భౌతిక కార్యం కనుక ప్రాణాయామం హఠయోగులకు రెండువిధాలుగా ఉపయోగపడుతుంది. మొదటిది అది శరీరంయొక్క పరిపూర్ణతను పూర్తి చేస్తుంది. భౌతిక ప్రకృతియొక్క అనేక సర్వసాధారణ ఆవశ్యకతలనుంచి జీవశక్తి విమోచనం కావించబడుతుంది. దృఢమైన ఆరోగ్యం, పొడిగించబడిన యవ్వనంతో పాటుగా తరచుగా ఒక అసాధారణ దీర్ఘాయుష్షుగా ప్రాప్తిస్తుంది. అంతే కాకుండా, ప్రాణాయామం ప్రాణికకోశంలో చుట్టలు చుట్టుకొని పడుకొని ఉన్న ప్రాణిక క్రియాశీల సర్పాన్ని మేల్కొల్పుతుంది. యోగికి చైతన్య క్షేత్రాలను, అనుభవాల శ్రేణులను, సర్వ సాధారణ జీవితానికి నిరాకరించబడిన అసాధారణనైపుణ్యాలను విదితం చేస్తుంది. అదే సమయంలో అతడికి అప్పటికే అధీనంలో ఉన్నటువంటి నైపుణ్యాలను, శక్తులను గొప్పశక్తితో అత్యధికం చేస్తుంది.

CWSA 23: 34

రాజయోగం

రాజయోగంలో ప్రారంభ ప్రయత్నంగా అప్రమత్తమగు స్వయం-నియమావళితో నిమ్నతరమైన ఉద్రేకపూరితమైన అస్తిత్వం విచ్చలవిడిగా పాల్గొనే కట్టుబాటులేని కదలికలకు బదులుగా మంచి అలవాట్లను చొప్పించడం జరుగుతుంది. సత్యాచరణంద్వారా, స్వార్థపూరిత అహంకారం కోరుకొనే అన్నిరకాల రూపాలను త్యజించడం

ద్వారా, ఇతరులకు హాని తలపెట్టే కార్యాలకు దూరంగా ఉండటం ద్వారా పరిశుద్ధ తతో, నిరంతర ధ్యానంతో, మానసిక సామ్రాజ్యానికి నిజమైన ప్రభువైనటువంటి దివ్యపురుషునికి మొగ్గు చూపడంద్వారా, ఒక పవిత్రమైన సంతోషదాయకమైన, నిర్మలమైన మానసిక, హృదయ పరిస్థితులను నెలకొల్పటం జరుగుతుంది.

ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే. తరువాత, సర్వసాదారణమైన మనస్సు, ఇంద్రియాల కార్యక్రమాలను తప్పక పూర్తిగా నిశ్చలం చేయాలి. ఫలితంగా అంత రాత్మ స్వతంత్రమై ఉన్నతోన్నతచైతన్య స్థాయిలకు ఆరోహించి, పరిపూర్ణ స్వేచ్ఛకు, తనమీద తన ఆధిపత్యానికి ప్రాతిపదికను సంపాదించుకుంటుంది. కాని సాధారణమైన మనోవైకల్యాలు ఉద్రేకపూరిత నాడీవ్యవస్థ మరియు శారీరక ప్రతిక్రియలకు లొంగిపోయి ఎక్కువగా ముందుకు సాగుతూ ఉంటాయన్న సంగతిని రాజయోగం మరువదు. కనుక అది హఠయోగవ్యవస్థనుంచి దాని ఆసన, ప్రాణాయామములను స్వీకరించి అమలు పరుస్తుంది. కాని దాని బహువిధాలైన విస్తృతమైన రూపాలను ప్రతి ఒక్కదానిని ఒక్క అత్యంత సరళమైన అత్యంత సూటియైన సమర్థవంతమగు పద్ధతిగా తన సొంత తక్షణ లక్ష్యానికి తగినంతగా తగ్గించివేస్తుంది. ఆ విధంగా హఠయోగ సంక్లిష్టత, జంఝాటాలనుంచి అది తప్పించుకుంటుంది. అయినప్పటికీ, అది చురుకై, శక్తివంతమై, సమర్థవంతమైన దాని విధానాలను శారీరక, ప్రాణిక కార్యాల నియంత్రణకూ, యోగపరిభాషలో కుండలిని అని ఉదహరించబడినటువంటి లోన చుట్టచుట్టుకుని నిద్రిస్తూ ఉండే మహా సర్పశక్తి ద్వారా, నిగూఢంగా దాగి ఉండి, సాధారణతకు మించిన నైపుణ్యపు సంపూర్ణత అయిన అంతర్గత క్రియాశీలతను మేల్కొల్పటానికీ వాడుకుంటుంది. ఇది చేయబడిన తర్వాత ఆ వ్యవస్థ వ్యాకుల మనస్సును పరిపూర్ణంగా నిశ్చల పరచటానికీ మరియు దానిని మానసికశక్తి ఏకాగ్రత ద్వారా ఏ క్రమానుగత దశలైతే అత్యంత అంతరంగ ఏకాగ్రతకు లేదా సమాధి అని పిలువబడే చైతన్యంయొక్క కూడగట్టిన స్థితికి దారితీస్తాయో అటువంటి ఉన్నతోన్నత అంతస్తును ఉద్ధరించటానికీ సిద్ధమౌతుంది.

CWSA 23: 36 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

జ్ఞానయోగం

జ్ఞానమార్గం ఏకైక పరమాత్మను సాక్షాత్కరించుకోవడమే లక్ష్యంగా కల్గి వుంటుం

ది. బౌద్ధికమైన ఆత్మ విచారణతో, సరియైన విచక్షణ వివేకం కూడిన విధానంతో ముందుకు పోతుంది. ఈ మార్గం మన ఈ కనిపించే పాంచభౌతికమైన జీవుడి విభిన్న మూలతత్వాంశాలను గమనిస్తూ ప్రతిదానితో తాదాత్మ్యతను నిరాకరిస్తూ అవన్నీ ప్రకృతిలోని విభిన్న భాగాలేనని దృగ్గోచర ప్రకృతికి చెందిన మాయా కల్పితాలని, ఈ కనిపించే చైతన్యానికి సంబంధించినవి అనే ఒక సాధారణ అభిప్రాయానికి వచ్చేస్తుంది. కాబట్టి ఎప్పటికీ మారని, నశించని, ఈ భౌతికమైన వాటిద్వారా, వాటి కలయిక ద్వారా కూడా ఏ విధంగానూ నిర్ధారించి చెప్పలేని, విశుభ్ర ఏకమాత్ర ఆత్మలో సరిగ్గా తాదాత్మ్యం చెందగలగడ మన్నదే దీని ధ్యేయం. దీనిని బట్టి ఈ మార్గాన్ని అనుసరించడం మన చేతనలో నుండి ఈ కనిపించే భౌతిక ప్రపంచాలను త్రోసిపుచ్చి ఈ వైయక్తిక అంతరాత్మ మళ్ళీ తిరిగి రాకుండా పరమాత్మతో మమేకమై పోవడమే దీని లక్ష్యంగా తోస్తుంది.

CWSA 23:38

భక్తియోగం

భక్తియోగం సర్వ శ్రేష్టుడైన పరమేశ్వరుని ప్రేమానందాలను అనుభవించడమే లక్ష్యంగా వుంది. సాధారణంగా పరమ ప్రభువుగావున్న పరమాత్మ విశ్వాసానికి దివ్యప్రేమికుడు, ఆనందభోక్త అన్న భావంలో తీసుకుంటుంది. అప్పుడు ఈ లోకం సర్వేశ్వరునికి ఒక ఆట. ఈ ఆటలో ఆత్మకు సంబంధించిన వ్యక్త అవ్యక్త దశలను అనుసరిస్తూ ఈ మానవ జీవితం కడపటి వేదికగా గ్రహించబడుతుంది. భక్తి మార్గ సిద్ధాంతం మానవ జీవితంలోకి, కొన్ని సాధారణ సంబంధాల్లోకి భావుకతను చేర్చి, ఇక వాటిని ఈ ప్రాపంచిక, క్షణిక, లౌకిక అనుబంధాలుగా కాక సర్వ సౌందర్యమయుడి, సర్వ స్నేహమయుడి, సర్వ ఆనందమయుడి ఆనందం నిమిత్తమే ఉపయోగిస్తుంది. ఇక్కడ ఆరాధన, ధ్యానాదులు దివ్యబాంధవ్యం, ప్రగాఢ మవ్వడానికి, సంసిద్ధ మవ్వడానికి వినియోగించ బడతాయి. ఈ యోగం అన్ని భావాత్మక అనుబంధాలను ఉపయోగించుకోవడంలో సర్వజన సమ్మతమైంది. దీని వలన దైవం పట్ల వైరం, వ్యతిరేకత కూడా తీవ్రమైన, అసహనంతో కూడిన (ఆయన పట్ల) వికృత ప్రేమ రూపంగానే పరిగణించబడుతుంది. ఇది భగవత్ సాక్షాత్కారానికి, మోక్షానికి సాధ్యమైన సాధనా విధానంగా భావించబడింది. ఈ మార్గాన్ని అవలంబించడం చేత

అది ప్రాపంచిక అస్తిత్వం నుండీ ఒక లయ స్థితి లోనికి తీసుకుపోతుంది. అద్వైతం కంటే భిన్న మైన విశ్వాతీత, లోకోత్తర స్థితికి నడుపుకు పోతుంది.
CWSA 23:39

కర్మ యోగం

కర్మ యోగం మానవుని ప్రతి కార్యాన్ని పరమేశ్వరుని సంకల్పానికి సమర్పించు కోవడమే లక్ష్యంగా కల్గి వుంది. మనం పనులు చేయడంలో అహంభావ త్యాగం, లౌకిక ప్రతిఫలాపేక్ష, స్వార్థంతో పనికి పూనుకోవడం వదిలి పెట్టడంతో ఈ యోగం మొదలవుతుంది. ఈ విధమైన త్యాగప్రవృత్తి మనస్సును, సంకల్పాన్ని పరిశుద్ధం చేస్తుంది. తద్వారా ఉత్కృష్టమైన విశ్వశక్తియే మన పను లన్నింటినీ చేసే నిజమైన కర్త అని చాలా తేలికగా గ్రహించ గల్గుతాం. విశ్వప్రభువే ఆ శక్తికి అధిపతి అని, ఈ కార్యకలాపాల నిర్దేశకుడని, శాసకుడని ఈ మనిషి ఆ పరమ ప్రభువుకు పై తొడుగులా, ఒక ఉపకరణంగా లేదా ఆయన కార్యనిర్వహణకు ఒక సచేతనమైన కేంద్రంగా, కనిపించే అనుబంధంగా మనం గ్రహిస్తాం. ఈ యోగంలో కర్మకు సంబంధించిన స్వేచ్ఛ, మార్గదర్శనానికై భగవంతుని సంకల్పానికి, విశ్వశక్తికి యింకా యింకా సచేతనంగా సమర్పించుకోవడ ముంటుంది.

ఆ శక్తికే పనిచేయడం, ఆ పని వలన వచ్చే ఫలితాలను ఆఖరికి ఆ శక్తికే వదల డముంటుంది. ఈ యోగలక్ష్యం కూడా ఈ జగత్తు నుండీ ఈ లౌకిక కార్యకలాపాల ప్రతిక్రియల నుండీ ఆత్మను విడుదల చేసుకోవడమే అయి వుంది.

కర్మ యోగం కూడా తక్కిన మార్గాల వలెనే భౌతిక అస్తిత్వం నుండి ముక్తిని పొంది పరమాత్మలోకి ప్రయాణం కట్టడానికే ఉపయోగించ బడింది.
CWSA 23:40

తంత్రం

మనం గమనించినట్లైతే భారతదేశంలో ప్రసిద్ధమైన ఈ యోగవిధానం నేటికీ కొనసాగుతోంది. స్వభావరీత్యా ఇది సమన్వయ మూలకమైనది. ఇది ప్రకృతికి చెందిన గొప్ప ఉత్తేజకర శక్తిలో నుండి ప్రకృతియే గొప్ప మూలసూత్రంగా ఆరంభ మౌతుంది. కాని అది దానికదే ఒక యోగం. ఇతర యోగసంప్రదాయాల సమన్వయ

విధానం కాదు ఇది. తంత్రమార్గంలో చోటు చేసుకున్న విస్తృత పురోగతి వలన నిజమైన తాంత్రికులు, కాని వారి ద్వారా అపకీర్తిని మూట గట్టుకుంది. ముఖ్యంగా అది వామాచార మార్గంలో ఏర్పడిన అవాంఛనీయమైన పరిణామాల కారణంగా జరిగింది. ఈ వామాచార మార్గంలో పాపపుణ్యాలనే ద్వంద్వాన్ని అధిగమించడంలో తృప్తి చెంది వాటిని సక్రమమైన సహజ సిద్ధమైన కార్యసరళిలోకి భర్తీ చేయడానికి బదులుగా వ్యక్తిగత స్వార్థానికి సామాజిక అనియంత్రిత, అనైతిక కార్యాలకు తోడ్పడే విధానంగా మారింది. అయినప్పటికీ మూలతః తంత్రం అన్నది కొన్ని యథార్థ భావనలపై స్థాపించిన గొప్ప శక్తివంతమైన విధానం. వామాచార మార్గం, దక్షిణాచార మార్గం అని రెండుగా చీలికతో ఉన్నా ఇది ఒక నిర్దిష్టమైన, లోతైన జ్ఞానం నుండి ప్రారంభమౌతుంది. దక్షిణ, వామ అనే శబ్దాల్లోని ప్రాచీన సంకేతాత్మక దృష్ట్యా జ్ఞానమార్గం, ఆనంద మార్గమనే భేద మున్నది. అది మనిషిలోని ప్రకృతి తనలోని శక్తి యందు సమ్యక్ వివేకాన్ని కల్గి వుండి తన స్వంత సామర్థ్యాలు, మౌలికాంశాలు, శక్యతలతో సాధన చేస్తూ తనంతట తానుగా విముక్తి చెందడం, మనిషిలోని ప్రకృతి తనలోకి శక్తిని సహర్షంతో స్వీకరించి తన స్వంత సామర్థ్యాలు, మౌలికాంశాలు, శక్యతతో సాధన చేస్తూ తనంతట తానుగా విముక్తి చెందడం. కానీ ఈ రెండు

మనం దృష్టిలో వుంచుకో వలసిన సూత్రం — ఆత్మసమర్పణం. భగవంతుని ఆనందం, శక్తి, చైతన్యానికి ఇచ్చి వేసుకోవడం.మానసిక జీవి అయిన మనిషి అంతరాత్మలో సమస్త అంశాల సంయోగం జరగాలి. తద్వారా దైవమే తనకు తానుగా నేరుగా ఎలాంటి అడ్డుతెర లేకుండా ఈ ఉపకరణాన్ని స్వాధీన పర్చుకొని దీనికి అధిపతి కావాలి. దివ్యజీవనం కోసం ఆయన సన్నిధి మార్గదర్శనం. వెలుగులో తన ప్రకృతికి సంబంధించిన సకల శక్తుల్లోనూ పరిపూర్ణం కావాలి.

CWSA 24:613 — శ్రీఅరవిందులు

మార్గాల్లోనూ ఆఖరికి సైద్ధాంతికమైన అస్పష్టత, ప్రతీకల వక్రీకరణ, పతనమే తట స్థిస్తుంది.

CWSA 23:42-43

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్

పూర్ణయోగసూత్రం

పూర్ణయోగ సాధనకు అనుసరించవలసిన విధానం

ఇక్కడ అంతరాత్మిక వాస్తవికత ఏమిటంటే, ప్రగతి కోసం అహాన్ని సమర్పణ చేయడం, అది కూడా అహంయొక్క అన్ని క్షేత్రాలు, అన్ని పరికరాలతో కలిపి, అహాన్ని మించి ఏదైనా ఉంటే దాని సమర్పణ కూడా — ఇది అనంతమైన, విస్తారమైన, అనివార్య ప్రక్రియ. ఇది యోగసాధనకు ఖచ్చితంగా అతి సులువైన, దగ్గర మార్గం మాత్రం కాదు. దానికి దృఢమైన నమ్మకం, సంపూర్ణ ధైర్యం, వీటన్నింటికన్నా అత్యంత సహనం చాలా అవసరం. ఈ విధానం మూడు స్థితులను సూచిస్తుంది. అందులో ఒక్క ఆఖరి దశ మాత్రమే వేగవంతమైనది, ఇంకా సంపూర్ణ ఆనందదాయక మైనది — అహం దివ్యశక్తితో బంధాన్ని ఏర్పరుచుకోవడానికి చేసే ప్రయత్నం అతి పెద్దది మరియు సంపూర్ణమైనది. అందుకే దిగువ స్థాయి నుంచి దైవిక క్రియల (చర్యల) ద్వారా పైస్థాయికి దైవశక్తిని స్వీకరించటానికి లేదా పైస్థాయికి చేరుకుని చివరగా పరివర్తన చెందడం దుస్సాధ్య ప్రయత్నం అయినప్పటికీ, నిజానికి సాధార ణంగా, అంతర్లీనంగా తెర వెనుక ఉండే దైవశక్తి మనలోని బలహీనతలను తొలగించి మనకి అండగా ఉండి మన నమ్మకంలోని లోపాలను తొలగించి ధైర్యాన్ని, మనః ప్రశాంతతను పెంపొందిస్తుంది. అది గుడ్డివాళ్లను చూసేలే చేస్తుంది. దాని ద్వారా మేలైన విధానం కోసం పట్టుబడుతుంది. అదే ఆదుకుంటుంది; హృదయం మాట్లాడు తుంది, అన్నిటికీ ప్రభువు, మనిషి నేస్తం లేదా విశ్వజనీనమాత మనం ఏ విధంగానూ జారిపోకుండా రక్షించుకుంటుంది. అందువలనే ఒకానొక సమయంలో ఈ మార్గం ఎంతో సంక్లిష్టమైనదిగా అనిపించినా, ఆలోచింప చేసినా కాని ఈ ప్రయత్నంయొక్క

పరిమాణం, దాని లక్ష్యం చూస్తే ఇది చాలా తేలికైన మరియు తప్పనిసరిగా సిద్ధి ప్రసాదించేదిగా తెలుస్తుంది.

CWSA 23:45-46

పూర్ణయోగం యొక్క మూడు విశిష్ట లక్షణాలు

పైస్థాయి చర్యలు దిగువన ఉన్న స్వభావం మీద సంపూర్ణంగా పని చేసేటప్పుడు మూడు లక్షణాలను కలిగి ఉంది. మొదటగా, ఇది ఒక ఖచ్చితమైన విధానంలో పని చెయ్యదు, ప్రత్యేక యోగవిధానంలో ఉన్న క్రమం కూడా ఉండు. కానీ ఏ వ్యక్తి నడిపించడానికి పని చేస్తోందో ఆ వ్యక్తి స్వభావాన్ని గుర్తించి దానికి అనుగుణంగా, ఒక విధమైన స్వేచ్ఛ శకలాలైన లేదా క్రమంగా తీవ్రమయ్యే ఆ వ్యక్తి స్వభావం అందించే ఉపయోగకర పదార్థాలు పరిశుద్ధ మవడానికి, పరిపక్వతని సాధించడానికి వచ్చే ఆటంకాలను ఎదుర్కొనడానికి తోడ్పడుతూ పని చేస్తుంది. అంటే ఈ మార్గంలో వెళ్లే ప్రతి వ్యక్తికీ తనదైన యోగవిధానం ఒక్కటి వుంటుంది. రెండవది, ఈ ప్రక్రియ సమగ్రమైనది కనుక మన గత పరిణామం తీర్చిదిద్దిన మన ప్రకృతిని స్వీకరిస్తుంది. సారతః అవసరమైనవాటిని వేటినీ తిరస్కరించకుండా మొత్తం అన్నీ ఒక దివ్యమైన పరివర్తనానికీ లోనయేటట్లు చేస్తుంది. మన సర్వస్వాన్ని అతిశక్తివంతమైన శిల్పి చేతిలోనికి తీసుకొని అదిప్పుడు దేని కోసం తబ్బిబ్బు పడుతూ వెతుకుతుందో దానికి ఒక స్పష్టమైన రూపాన్నిస్తుంది. ఈ నిమ్న అభివ్యక్తి, అందులోని సమస్తం యెలా నిర్మితమైనాయో, ఆ విషయాన్ని యీ నిరంతర పురోగమన అనుభవంలో మనం గ్రహించనారంభిస్తాం. అది పైకి ఎంత వికృతంగా లేక అల్పంగా లేక నికృష్టంగా వున్నట్లు కంటికి కనిపించినా, అది దివ్యప్రకృతి సామరస్యతలో, హెచ్చు, తగ్గులుగా, వికృతమైన అపరిపూర్ణమైన అంశము లేక కర్మ ఆకృతియే....

మూడవది మనలోని దైవశక్తి జీవనాన్ని పూర్ణయోగ సాధనకు ఒక పనిముట్టుగా వాడుకొంటుంది. ప్రతి అనుభవంతో, మరియు ప్రతి బాహ్యసంబంధం మన ప్రాపంచిక -పర్యావరణం అవి ఎంత నిష్ప్రయోజనమైనవి, ఎంత విపత్కరమైనవయినా అది ఉపయోగించుకొంటుంది. మన ఆంతర అనుభవాలు అని ఎంత బాధతో తిరస్కరింప బడేవయినా, ఎంత అవమానకరమైనవయినాఅవి పరిపక్వతను చేరుకొనే మార్గానికి ఒక మెట్టు. మనం మనలో ప్రపంచంలో దైవవిధానాన్ని అతని కార్యాన్ని కళ్ళు

తెరచుకొని గుర్తించగల్గుతాం. చీకటిలో వెలుగు బలహీనులు, పతితులలో బలం దుఃఖితులు, దీనులలో ఆనందాల కార్యమేమిటో మనం చూడగల్గుతాం. నిమ్న ఉన్నత కార్యవిధానంలో ఒకే దివ్య పద్ధతిని మనం చూస్తాం. ఒక దాన్లో అది, ఆ లక్ష్యంకోసం మందకొడిగా, అస్పష్టంగా ప్రకృతిలో అధోచేతనా స్థాయినుండి పని చేస్తుంది. మరోదాన్లో అది, తనకు తెలిసి వేగంగా తయారవుతుంది. గురువు హస్తంను అంగీకరించి నడుస్తుంది.

CWSA 23:45-46

గ్రంథాలలో వ్రాసి ఉన్న వాటిని మించిపోవుట

ఏ సాధకుడైతే పూర్ణయోగానికి పాటుపడుతున్నాడో అతను గుర్తుంచుకోవలసిన విషయములు, ఏ విధమైనలిఖితశాస్త్రాలు అయినా, ఎంత పెద్ద రచయిత అయినా, ఎంత ఎక్కువ స్ఫూర్తి దాయకమైన రచన అయినా అది ఆద్యంతరహిత జ్ఞాన పాక్షిక వ్యక్తీకరణకన్న అధికం కాదు. అతను ఆ గ్రంథాన్ని వాడుకుంటాడుగాని దానికి తనను తాను కట్టిపడేసుకోడు. ఆ గ్రంథం ఎంత గంభీరమైనది విస్తారమైనది మతపరమైనదైనాసరే ఆ సాధకుని మీద ఒక అత్యున్నత మంగళకరమైన దానికోసం ఆ గణనీయ ప్రాముఖ్యతగలదాని కోసం ప్రభావం చూపవచ్చు. శిఖరాయమానమైన వాస్తవాలకు మేలుకొనే అతని అనుభవానికి, ఉన్నతోన్నతఅనుభవాల సాక్షాత్కారంలో అతని కది సహాయపడవచ్చు.అతని యోగసాధనను ఏదో ఒక గ్రంథం లేదా కొన్ని గ్రంథాలు — ఒకదాని తరువాత ఒకటి చాలా కాలంపాటు — సాంప్రదాయమార్గంలో వున్న భగవద్గీత, ఉపనిషత్తులు, లేదా వేదాలు కావచ్చు. లేదా అతని అభివృద్ధి మార్గంలో సత్యాన్వేషణలో అనేక గ్రంథాలు సత్యాన్ని గురించి అందించిన భిన్న అనుభవంతో గతానికి సంబంధించిన ఉత్తమమైన దాన్నంతటినీ కలిపి అతన్ని భవిష్యత్తులో భాగ్యవంతుడిగా చేయవచ్చు: కాని చివరకు అతను తన స్థానాన్ని లేక యింకా ఉత్తమమేమిటంటే అతను చేయగలిగితే, మొదట నుంచి ఎల్లప్పుడు తన ఆత్మలో తను ఉపయోగించే మంత్రం పరిమితులకావల నిలుపడం, జీవించడం. భగవద్గీతలో ఎప్పుడూ చెప్పబడింది యోగి తన పురోగతిలో, లిఖింపబడిన సత్యం కన్నాఅతీతంగా పోవాలి. 'శబ్దబ్రహ్మ అతి వర్తతే', తను విన్నవాటికి వినబోయే వాటికి "శ్రోతవ్యచ శ్రుతస్యచ". ఎందువల్లనంటే అతను ఒక గ్రంథం లేదా కొన్ని

గ్రంథాల సాధకుడు కాదు, అతను అనంతం కోసం సాధన చేస్తున్నవాడు.

CWSA 25:55- 56

శాశ్వత వేదం, ఈ యోగం పరమగురువు

పూర్ణయోగంయొక్క సర్వోచ్ఛశాస్త్రం ప్రతి మనిషి హృదయంలో రహస్యంగా ఉన్న శాశ్వతవేదం. అందువల్లనే, దాని సర్వోత్కృష్ణ గురువు మార్గదర్శి, జగద్గురువు. మనలో రహస్యంగా వున్నాడు. ఆయన తన జ్ఞాన ఉజ్వలకాంతితో మనలోని చీకటిని తొలగిస్తారు. మనలో అధికమౌతుండే ఆత్మ ఆవిష్కార వైభవంగా మనలో అవుతుంది. ఆయన తన స్వేచ్ఛ పరమానందం, ప్రేమ, శక్తి, అమృత అస్తిత్వాన్ని క్రమంగా మనలో బహిరంగపరుస్తారు. ఆయన మన పైన మనకి ఆదర్శంగావైన ఒక దివ్యమైన ఉదాహరణను నిలిపి మన నిమ్న అస్తిత్వాన్ని మనం ఏది సాధించడానికి తలపెట్టామో దాన్ని ప్రతిబింబించేలా రూపాంతరీకరణ చేస్తారు. ఆయన ప్రభావాన్ని, ఉనికిని మనలోనికి గ్రుమ్మరించడంద్వారా ఆయన వ్యష్టి అస్తిత్వాన్ని విశ్వవ్యాప్త, విశ్వాతీత తాదాత్మ్యతను సాధించడానికి తగిన శక్తివంతునిగా చేస్తారు.

ఆయన విధానం మరియు క్రమం ఏమిటి? ఆయనకు ఏ విధానం లేవు. ప్రతి విధానమూ ఉంది. ప్రకృతికి సాధ్యమైనంతమేర అత్యున్నత ప్రక్రియలను గమనాన్ని సహజరీతిలో జరిగేటట్లు చూడడము, ఆయన విధానము. పెద్దపెద్ద విషయాలకు ఎంత సంపూర్ణ, ప్రధానమైన జాగ్రత్త చర్యలు తీసుకొంటారో అంతే జాగ్రత్తలు అతి సూక్ష్మ వివరాలకు తన ఉనికి పరిగణనలోనికి తీసుకోలేని వాటికి కూడా ఇవ్వ గలిగిననాడు చివరికి అందరికీ వెలుగు చూపుతూ వెలుగువైపుకి పరివర్తన చెందగలడు. ఆయన యోగవిధానంలో అతి చిన్నవాటిని ఉపయోగించాలి, అతి పెద్దవాటిని ప్రయత్నించాలి, ఎలాగంటే ఒక గురువు యొక్క సేవకునికి మరియు సాధకునికి గర్వం, అహంకారం చూపించవలసిన అవసరంలేదు. ఎందువల్లనంటే వాళ్ళకోసం అవి అంతా పైనుంచే అతీత శక్తి చేసింది. అందువలన అతనికి తన స్వంతలోటుపాటులు లేదా జారుడు స్వభావం గురించి నిరాశపడే హక్కు లేదు. తనలో పనిచేసే శక్తి వ్యక్తి గతమైనది కాదు. అతీతశక్తి మరియు అనంతమైనది.

CWSA 23:61-62 *అనువాదం: డా. టి. యస్. రాజకుమారి*

అహంకారం దైవకార్యాన్నర్థం చేసుకోలేదు

(శరీరానికే పరిమితమైన 'నేను' అనబడే) అహంకారిక మనస్సు కాదు, కోరు కొనేది, ఆమోదించేది కాదు, దైవకార్యం. ఎందుకంటే అది తప్పును ఉపయోగిస్తుంది. సత్యాన్ని చేరుకొందుకు, అది బాధను ఉపయోగిస్తుంది. సంతోషాన్ని చేరుకుందుకు, అపరిపక్వతను ఉపయోగిస్తుంది. పరిపక్వతను చేరుకుందుకు.

అహంకారం చూడలేదు, తాను ఎటు నడపబడుతుందో. అది తనను నడిపే దానిపై ఎదురు తిర్గుతుంది. ఆత్మవిశ్వాసం కోల్పోతుంది. ఈ బలహీనతలు లెక్క లోనికి రావు. ఎందుకంటే మనలో ఉండే దివ్యమార్గదర్శి కోపగించడు. మన తిరుగు బాటుపై నిరుత్సాహపడడు. మనలోని అపనమ్మకంపై, వెనుకకు తోయబడడు, మనలోని బలహీనతలపై అతనికి ఉన్నాయి, తల్లి సంపూర్ణ ప్రేమ, బోధకుని పూర్తి సహనం. ఈ మార్గదర్శనానికి మన అనుమతిని వెనుకకు తీసుకోవడం ద్వారా నష్ట పోతాం మనం. మన చైతన్యాన్ని, ఎరుకను, అంతా కాకపోయినా దాని లాభాలను. ఇలా మన అనుమతిని ఎందుకు వెనుకకు తీసుకుంటాం అంటే మన ఉన్నత ఆత్మకు, దాని దిగువున ఉన్న అంతరాత్మకుగల బేధాన్ని మనం గుర్తించలేకపోవడంవల్ల; ఏ అంతరాత్మను సంసిద్ధం చేసి దాని ద్వారా (ఉన్నత ఆత్మ) తనని తాను ఎరుకపర్చు కోవా లనుకుంటున్నాడో, ఆ అంతరాత్మకు గల బేధాన్ని. ప్రపంచంలో లాగే మనలో కూడా దైవాన్ని మనం చూడలేము. ఎందుకంటే అతని పనులు ముఖ్యంగా మనలో అతని పనులు మన నైజం ద్వారా మాత్రమే జరుగుతాయి. కాని హేతుబద్ధత లేకుండా వచ్చే అద్భుతాల పరంపరవల్ల కాదు.

తనలో విశ్వాసం కల్గడానికి, మనిషికోరుతాడు అద్భుతాలను. తాను చూడ గల్గడానికి తన కళ్ళు మిరుమిట్లు గొలపాలని కోరుతాడు. మన అసహనం, అజ్ఞానం ఇంకా ఎక్కువ ఆపదకు, విధ్వంసానికి దారిసతీయవచ్చు.

మనం మనని నడిపే దైవానికి ఎదురుతిరిగి మన ఉద్వేగాలను కోరికలను ఇంకా బాగా సంతృప్తిపర్చే తప్పుదారి పట్టించే వేరే శక్తిని మనం కోరుకుంటే పిలిస్తే, దానినే మార్గదర్శనం చేయమని కోరుకుంటే — దానికే దైవం అని పేరు పెడ్తే — అది ఇంకా ఎక్కువ ఆపదకు, విధ్వంసానికి దారితీయవచ్చు.

CWSA 23: 64- 65

యోగా ఒక కొత్త పుట్టుక

యోగా ఒక కొత్త పుట్టుక. బుద్ధిపరమైన, ఒక సాధారణ మనిషియొక్క పదార్థ జీవనంనుండి ఒక ఉన్నతతర ఆధ్యాత్మిక చైతన్యంలో అధికతర దివ్యసత్తాలోకి పుట్టుక. ఇటువంటి విశాల ఆధ్యాత్మిక అస్తిత్వంలోకి మేల్కొన వలసిన ధృఢమైన అవసరం ఉంటేనే తప్ప — ఏ యోగాన్ని తీసుకుని విజయవంతంగా అనుసరించ లేము.

ఇటువంటి లోతైన, విశాలమైన అంతరంగ మార్పునకు పిలుపునందుకున్న ఆత్మ, అనేక మార్గాల ద్వారా చేరవచ్చు ఈ దశకు. తన మొదటి ప్రస్థానం నుండి అది రావచ్చు ఈ స్థితికి. తన ఎరుక లేకుండానే తాను సొంతంగా అభివృద్ధి చెందడంవల్ల ఒకమతం లేదా తత్వశాస్త్రి ప్రభావంవల్ల తాను నెమ్మదిగా ప్రకాశవంతం అవటంవల్ల ఒకహఠాత్ స్పర్శ లేదా దిగ్భ్రాంతి చర్యవల్ల అది ఒకేసారి దూకవచ్చు ఈ స్థితికి.

2. బయట పరిస్థితుల ప్రభావంవల్ల లేదా తనలోని మూతను (అవి) బద్దలు చేసే ఒకే పదంవల్ల లేదా ఎక్కువకాలం ఈ విషయం పై ధ్యానించడం వల్ల లేదా ఈ మార్గంలో ప్రయాణించిన వ్యక్తి పరిచయం లేదా ఉదాహరణవల్ల ఏది ఏమైనా వ్యక్తి నైజము , పరిస్థితులు వీటికి అనుగుణంగా వ్యక్తి ఆత్మకు ఈ పిలుపు వస్తుంది

ఏ మార్గం గుండా ఈ పిలుపు వచ్చినా — అక్కడ ఉండవలసింది — తప్పని సరిగా — ఒక నిశ్చయము — బుద్ధియొక్క, ఇచ్ఛయొక్క నిశ్చయము; దీని ఫలి తంగా వచ్చే — ఒక సంపూర్ణ, ఫలవంతమైన ఆత్మసమర్పణ; సత్తాలో ఒక నూతన, ఆధ్యాత్మిక భావనాశక్తి, ఒక ఊర్ధ్వ ఇచ్ఛచే గట్టిగా పట్టుకోబడిన ఒక నూతన ప్రకాశము, పరివర్తన, ఒక హృదయ ఆకాంక్ష, — ఈప్రముఖ చర్యలోనే ఉన్నాయి, యోగము ఇవ్వగల ఫలితాలన్నీ — విత్తనంలో అన్నీ ఉన్నట్లు. కేవలం ఒక భావం — లేదా — ఏదో ఒక ఉన్నతమైనదాని కొరకు — బుద్ధియొక్క అన్వేషణ, ఆకాంక్ష. వీటితో అది ఎంత గాఢంగా గ్రహింపబడినప్పటికీ — అది నిష్ప్రయోజనం — దానిని హృదయం కోరకపోతే. అదే, ఆ ఒక్కటే, కోరతగ్గది, పట్టుకోతగ్గది — అని హృదయం, ఇచ్ఛ, కూడ, అనుకోకపోతే.

ఎందుకంటే, ఆత్మ-సత్యం — కేవలం ఆలోచనకు చెందినది కాదు; ఆత్మసత్యంలో

జీవించాలంటే సత్తాకు సంబంధించిన ఒక ఏకీకతత యేక మనస్కత కావాలి.

యోగాకు అవగతమైన గొప్ప మార్పు — విభక్త ఇచ్ఛతో గాని, శక్తిలో చిన్నభాగం వల్లగాని, సంశయాత్మక బుద్ధివల్ల గాని, సాధ్యం కాదు. దైవాన్ని అన్వేషించేవాడు — తప్పనిసరిగా, దైవానికి — ఒక్క దైవానికి మాత్రమే — అంకితమవ్వాలి.

CWSA 23:69c70 *అనువాదం: యస్. వై. సోమయాజులు*

మొట్టమొదటి ఆవశ్యకత

ప్రధానమైన ఆవశ్యకత యేమిటంటే గతానికి బాహ్యీకరించబడిన విషయక్రమంలో మనసు తన ప్రగతినీ, సంతృప్తినీ, తన ఆసక్తులపై ఏకాగ్రపరచటంలో కేంద్రీకతృమైన విశ్వాసాన్ని, అవలోకనాన్ని కరిగించి వేయటం. ఈ ఊహాతలంలోని అవగాహనను కేవలం భగవంతుణ్ణి కోరుకొనే, దైవాన్నే చూడగల మరింత లోతైన విశ్వాసం, దర్శనంతో వినిమయం చేయడం తప్పనిసరి. తరువాత అవసరం మన నిమ్న ప్రకృతి ఈ సరికొత్త నమ్మకానికి, ఉన్నత దర్శనానికి వందనీయమై ఉండటం. మన ప్రకృతి సర్వస్వం సమగ్రంగా సమర్పణ అవ్వాలి. ప్రతిభాగంలో ప్రతి కదలికలోను ఆ పరమాత్మకు నివేదనం కావాలి. అది తనను తాను సంస్కరించుకొనలేని యింద్రియ మనస్సుకు భౌతిక ప్రపంచం యిందులోని వస్తువులకన్నా అసత్యంగా గోచరించి నప్పటికీ మన అస్తిత్వ సర్వస్యం. ఆత్మ, మనస్సు, యింద్రియాలు, హృదయం, సంకల్పం, ప్రాణం, శరీరం,. తమ శక్తులన్నింటినీ పూర్తిగా ఏ విధంగా సంపూర్ణంగా దైవానికి సమర్పించాలంటే అది భగవంతునికి తగినటువంటి వాహనంగా మారిపోవాలి. ఇది అంత సులువైవ పని కాదు. ఎందుకంటే ప్రపంచంలో ప్రతీదీ తమ స్థిరమైన అలవాట్లను తమ స్వాభావికన్యాయంగా కలిగి సమూలమైన మార్పును నిరోధిస్తుంది. మరియు యే మార్పుకూడా పూర్ణయోగంలో అభిలషించే విప్లవాత్మక మయిన మార్పుకన్నా సమూలంగా ఉండదు. మనలోని ప్రతి అంశాన్ని మన కేంద్రీయ విశ్వాసం సంకల్పం, దృష్టి వైపు నిరంతరం వెనుకకు పిలవబడాలి. ఉపనిషత్ పరిభాషలో ప్రతి ఆలోచన, స్పందన కూడా తత్ మాత్రమే దివ్యబ్రహ్మము. యిక్కడ మనుషులు ఆరాధించేది కాదని గుర్తుంచుకొనేటట్లు చేయాలి. ప్రతి ప్రాణ నాడికి తనను దాని స్వంత అస్తిత్వంగా చూపుకొన్న దానంతటి యెడల సంపూర్ణ వైరాగ్యం కలిగి ఉండేటట్లు ఒప్పించాలి. మనస్సు, మనస్సుగా ఉండడం మాని

తాను అతీతమయిన దానితో ప్రకాశమయం కావాలి. ప్రాణము మరింత విశాలము, శాంతము, తీవ్రతరము బలోపేతం కావాలి. అల్పమైన కోరికలు, ఉద్వేగాలతో తన పాత అంధము, సంకుచితమయిన స్వభావంతో తనను తాను గుర్తించకూడదు. శరీరం కూడా పరివర్తనకై నివేదన కావాలి. ఇప్పుడున్నట్లు ఇకపై గగ్గోలు పెట్టే జంతువు లేక నిరోధించే గుదిబండగా ఉండకూడదు. దానికి బదులుగా ఒక చైతన్యంవంతమైన సేవికగా, జ్వాజ్వల్యమానమైన ఉపకరణంగా ఆధ్యాత్మ సజీవమైన రూపంగా మారాలి.

CWSA 23:72-73

మనం ఆరాధించే దైవం

మనం ఆరాధించే దైవం కేవలం సుదూరమైన విశ్వాతీతమయిన సత్యమే కాకుండా ఈ జగత్తులో మనకు సన్నిహితమయిన సగం ముసుగు వేసుకున్న అభి వ్యక్తి కూడా. జీవనం ఆ సంపూర్ణ దివ్య అభివ్యక్తి క్షేత్రం. ఇక్కడ జీవనంలోనే ఈ భూమిపైనే ఉపనిషత్తులు నొక్కి చెప్పినట్లుగా మనం తెర తొలగించి ఆ దివ్యత్వాన్ని ప్రకటింపచేయాలి. తన విశ్వాతీత మహత్తు, వెలుగు మాధుర్యాలను మన చేతనకు నిజం చేయాలని యిక్కడ పొంది వీలైనంతవరకు వ్యవస్థీకరించాలి. మన యోగంలో జీవనాన్ని పూర్తిగా రూపాంతరీకరించటానికి మనం అంగీకరించాలి. ఈ అంగీకారం మన ఘర్షణకు కష్టాలను జోడిస్తుందని మనం వెనుతిరగటం నిషిద్ధం. మనకు లభించే రాయితీ ఏమిటంటే మన మార్గం వడిదుడుకులతో కూడుకున్నదయినా ప్రయత్నం క్లిష్టమూ, విచలితం చేసేంతకష్టతరమూ అయినప్పటికీ ఒక నిర్దిష్టమైన స్థితి తర్వాత మనం అనంతమయిన లబ్ధిని పొందుతాం. ఒకసారి మన మనసు కేంద్రదర్శనంపై నిలచినపుడు మన సంకల్పాలన్నీపూర్తిగా ఒకే అన్వేషణకు మళ్ళించబడినపుడు జీవితమే మనకు సాయం చేస్తుంది.

CWSA 23:73-74

మానవతకు ప్రతినిధి

ఈ జీవితాన్ని అంగీకరిస్తూ కేవలం ఆత్మ భారాన్ని మోయటంకాక తన బరువుకు తోడు ఈ ప్రపంచం యొక్క అధికభారాన్ని కూడా మోయవలసివస్తుంది. అందువలన అతని యోగం మిగిలిన వారి యోగాలవలేకాక ఒక రణంలా ఉంటుంది. కాని

యిది ఒక వ్యక్తిగతమైన యుద్ధం కాదు. ఇది ఒక అనల్పమైన దేశముపై సాగించే సమిష్టి యుద్ధం. అతను అసత్యమైన అహంకార శక్తులను, అస్తవ్యస్తతను తనలో జయించటమే కాక ఈ ప్రపంచంలో అవే శక్తులకు ప్రాతినిధ్యం వహించి అనంతమయిన అసుర శక్తులను కూడా జయించాలి. వాటి ప్రాతినిధ్య వైఖరి వాటికి మరింత మొండిగా ప్రతిఘటించే శక్తిని అంతులేకుండా పునరావృతం అయ్యే హక్కుని యిస్తుంది. తన వ్యక్తిగతమైన సమరాన్ని పట్టువిడువక జయించినప్పటికీ అతను మళ్ళీ మళ్ళీ ఆ ఎడతెగని యుద్ధాన్ని గెలవాల్సి ఉంటుంది. ఎందుకంటే అతని ఆంతర అస్తిత్వం ఎంతగానో విస్తృతి చెందింది. అందులో అతని స్వీయ అస్తిత్వమేగాక దానితోపాటు చక్కగా నిర్వచించబడిన దాని అవసరాలు, అనుభవాలుకూడా వున్నాయి. కాని అతని అస్తిత్వం యితరుల అస్తిత్వంతో ఒకటై వుంది. ఎందుచేతనంటే స్వయంగా అతనిలో విశ్వాన్నే కలిగి వున్నాడు.. అందరు ఆధ్యాత్మాన్వేషకులలాగా, హేతుబుద్ధి వ్యతిరేకతలు, ఇంద్రియాల వీడని పట్టు, హృదయాల అలజడులు, కోరికల దేహబుద్ధి భౌతికదేహ ప్రతి బంధకం. అన్నీ పరిష్కారం కోరుతూ ఆతని ముందు నిలుస్తాయి. వాటి పరస్పర, ఆంతరిక వైరుధ్యాలతోనూ, తన లక్ష్యంచేరకుండా తనను వెనుకకు లాగే వాటితోను అతడు మరో విధంగా వ్యవహరించవలసి వుంటుంది. ఈ తిరుగుబాటు చేసే విషయాన్నంతట్నీ పరిష్కరించటానికి అతను అనంతంగా, అధిక కష్టతరమైన, పరిపూర్ణత స్థితికి చేరాలి.

వాటిని భగవత్సాక్షాత్కారానికి అవతరణకూ, అవసరమైన ఉపకరణాలుగా అంగీకరిస్తూ వాటి మధ్య వైషమ్యాలను చిక్కటి అంధకారాన్ని దీపితం చేయటానికి వాటిని వేరు వేరుగానూ అన్నింటినీ కలిపి రూపాంతర మొనర్చి ఒక దానితో మరొక దానిని సామరస్యపరచి సమగ్రంగా ఒక రేణువు ఒక పోగు లేదా ప్రకంపనను వదలకుండా ఎక్కడా చిన్న అణువంత అపరిపూర్ణతకు తావివ్వకుండా మళ్ళించవలసి ఉంటుంది. ఒక మినహాయింపులేని ఏకాగ్రత, లేదా ఏకాగ్రతా పరంపర అతని సంకీర్ణమయిన కార్యంలో ఒక తాత్కాలికమయిన వీలు మాత్రమే. దాని ప్రయోజనం అయిపోయిన వెంటనే దానిని వదిలివేయాలి. కష్టసాధ్యమైన సర్వసమీకరణా ఏకాగ్రత వైపు అతడు కృషి చేయవలసి ఉంటుంది.

CWSA 23:77 -78

ఏ యోగానికైనా ఏకాగ్రతే తొలి నియమం

ఏకాగ్రత ఏ యోగానికైనా మొదటి దశ, కానీ పూర్ణయోగ స్వభావంలో అది ఒక సర్వ స్వీకరణ ఏకాగ్రత కావాలి. ఆలోచనలను, ఉద్వేగాలను సంకల్పాలను వేరు వేరుగా ఒకే విషయంపై పటిష్టంగా ఒకే విషయంపై వస్తువుపై స్థితిపై, ఆంతరంగికచలనం లేదా సూత్రంపై స్థిరపరచటం నిస్సంశయంగా యిక్కడ కూడా అవసరమే. కాని యిది ఒక సహాయకరమైన పద్ధతి. ఒక విస్తృతమయిన, వికసనం, అన్న భాగాలు తమ సర్వశక్తులతో సర్వమూ అయిన పరమాత్మపై ఒక సమగ్రమయిన, సామరస్యమయిన ఏకాగ్రతను సాధించడం ఈ యోగంయొక్క బృహదాశయమై ఉంది. అది లేకుండా ఈ యోగం అసాధ్యం. ఎందుకంటే చైతన్యం ఏకం అయిన దానిలో విశ్రమిస్తుంది. ఆ చైతన్యం మనం ఆకాంక్షించే అందరిలోనూ పనిచేస్తుంది. మనం దీనినే కోరుకొంటున్నాము. మనలోని ప్రతి అంశంలోను, మన స్వభావపు ప్రతి చలనంలోను, ఆ ప్రభావం ఉండాలని మనం కోరుకుంటున్నాం. ఈ విస్తృతమైన ఏకాగ్రమయిన సంపూర్ణత్వం సాధన యొక్క ఆవశ్యక గుణం కావాలి. ఆ గుణమే సాధనను నిర్ణయించాలి.

CWSA 23:78-79

కార్యప్రారంభానికి ఊర్ధ్వం నుండి ఆ వెలుగు అభిలషించేది

ఒక సజీవమైన సిద్ధిలోకి దారితీసే ఏకాగ్రత నిరంతరం మనం ఎక్కడ కల్గినా అన్నింటి యందు ఆ ఏకైక సత్యం యొక్క ఉనికి అనుభవాలు. వీనినే జ్ఞానంచే యోగమనీ జ్ఞానంకోసం చేసే ప్రయత్నమని అంటాము. కేవలం శాస్త్రాలు పురాణాలు చదవడం లేదా బుద్ధితో భగవంతుణ్ణి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించటం తాత్త్విక చింతన చేయడం చాలదు. ఎందుకంటే ఈ సుదీర్ఘ మానసిక పరిశ్రమ చివర్లోమనం శాశ్వతుని గురించి చెప్పినదంతా తెలుసుకోవచ్చు. ఆ అనంతుని గురించి ఆలోచించినదంతా వశం చేసుకొంటాం. అయినప్పటికినీ ఆతని అసలేమీ తెలుసుకోనే లేదు. శక్తివంతమైన యోగంలో ఈ బుద్ధ్యాత్మకమయిన సంసిద్ధత మొదటిదశ కానీ యిది తప్పని సరి కాదు. ఈ మెట్టు అందరికీ అవసరంలేదు. లేదా అందరూ దీనిని స్వీకరించాలని పిలవాల్సిన పనిలేదు. కేవలం సవితర్క లేదా సవిచార ధ్యానంలో పొందిన

బుద్ధి రూపజ్ఞానమే. అనివార్యమయిన లేదా ప్రాథమికమయిన అవసరమే అయితే చాలా కొద్దిమందికి తప్ప తక్కిన వారికి యోగం అసాధ్యం. పైనున్న వెలుగు తన పని ప్రారంభించినా అని మనలని అడగడం అంటే, అది అంతరాత్మ నుండివచ్చిన పిలుపు, ఆ పిలుపే మన మనస్సులో దానికి చాలినంత ఆధారం. ఈ ఆధారాన్ని ఆలోచనలలో నిరంతరం దైవాన్ని నిలిపి ఉంచుకోవడం.చైతన్యవంతమయిన భాగాలలో అందుకు తగిన సంకల్పం, ఒక ఆర్తి, విశ్వాసం హృదయంలో ఒక ఆవశ్యకత ద్వారా చేరుకోవచ్చు.

వీటిలో ఏదో ఒకటి నడిపించవచ్చు. లేదా అన్నీ ఏకమై లేక సమలయలో ఉద్యమించలేకపోతే యేదో ఒకటి పైచేయి సాధించి నడుపవచ్చు. ప్రారంభంలో సరిపడినంతా ఉండకపోవచ్చు. ఆకాంక్ష సంకుచితం అపరిపూర్ణం అయివుండవచ్చు. విశ్వాసం కాంతిహీనంగా ఉండవచ్చు. జ్ఞానమనే శిలపై స్థాపితమై ఉండకపోవచ్చు. ఊగుతూ అనిశ్చితంగా, తేలికగా, క్షీణిస్తూ తరచుగా పూర్తిగా ఆరోపోనూవచ్చు. తుఫాను గాలిలో కాగడాలా మళ్ళీ కష్టతరంగా ప్రజ్వలింప చేయవలసి ఉంటుంది. కానీ ఒకసారి హృదయపు లోతులనుండి దృఢమైన ఆత్మ నివేదన, ఆత్మ పిలుపు జాగృతమైతే ఈ ఈ అసంపూర్ణమయిన అంశాలే దైవకార్యానికి ఉపకరణాలుగా పని చేస్తాయి. జ్ఞానులంతా మానవులకు దైవాన్ని చేరే మార్గాలను పరిమితం చేయటానికి యిష్టపడరు. ఎంత యిరుకైన మార్గమైనా ఎంత నీచమయినదయినా ఎంత అంధకారమయమయిన పెరటిదారే అయినా ఎంత వినమ్రమయిన ప్రక్క ద్వారమయినా అతని ప్రవేశానికి తెరిచే ఉంటుంది. ఏ పేరైనా, ఏ రూపైనా, ఏ సంకేతమయినా ఏ నివేదన అయినా సరిపోతుంది. దానితోపాటు ఆత్మ సమర్పణ తోడయినప్పుడు. ఎందుకంటే భక్తుడి ఎదలోని, భగవంతుడికి తెలుసు ఆయన ఆ యజ్ఞాన్ని స్వీకరిస్తాడు.

CWSA 23:81-82

కామనాంతరాత్మకు తపనచెందే ప్రాణ-శక్తికి శిక్షణ

మనలోని ఈ కామనాత్మను, తపనచెందే ప్రాణశక్తిని మొదటగా అంగీకరించాం. కేవలం పరివర్తన చెందటానికి ముందునుండే కోరికలన్నింటినీ త్యజించి భగవతునిపట్ల మోహన్ని ఏకాగ్రతను కలిగి ఉండాలి. ఒకసారి ఈ ముఖ్యమయిన విషయం సాధించాక తనకై కోరుకోవటం మాని ఈ ప్రపంచంలోని దైవానికి మనలోని దైవానికై కోరుకోవటం

వీటికి నేర్పాలి. తన కొరకై ఏ వ్యక్తిగత ఆధ్యాత్మిక శక్తులను ఆశించరాదు. మనలో యితరులలో జరుగవలసిన మహత్తరకార్యం పైన రాబోయే ఉన్నత ఆవిష్కరణ ఈ ప్రపంచంలో భగవంతుని అవతరణ, నెరవేరడమనే వైభవోపేతంగా జరుగబోయే ఉన్నత అభివ్యక్తిపైన మనం జీవించవలసిన అభిలషించవలసిన శాశ్వతంగా పట్టాభిషిక్తం కావలసిన సత్యం పైన కేంద్రీకరించాలని వాటికి బోధించాలి. అన్నిటికన్నా చివరగా దానికి అతి కష్టమయినది, సరైన ఉద్దేశ్యంతో అభిలషించటం కన్నా కష్టమైనది, సరైన పద్ధతిలో అభిలషించడం నేర్పాలి. తన స్వీయ అహంకారపు మార్గంలోకాక, భగవంతుని మార్గంలో కోరుకోవటం నేర్పాలి. అది ఒక బలమైన వేరైన సంకల్పం పట్టు పట్టినట్లుగా తన తృప్తితోను, తన స్వప్నాలను నిజం చేసుకోవటానికి తనకు సరి అనిపించినది. కావాలనిపించడం కాక, అది ఒక బృహత్తరమూ, మహత్తరమూయైన సంకల్పాన్ని ఫలవంతం చేసుకోవటానికి అభిలషించాలి. అనాసక్తము, అజ్ఞానమయము కానటువంటి దార్శనికతకై వేచివుండటానికి అంగీకరించాలి. మానవునికి గొప్ప అసహన భయములకు కారకం సమస్యకారి అయిన కోరిక అన్ని ఒడిదుడుకులకు కారణభూతం అయినది తన దివ్య స్వరూపానికి రూపాంతరం చెందటానికి అర్హత పొందుతుంది.
CWSA 23:83- 84

దివ్య మానవత లేదా అతి మానస జాతి నిర్వచనం

మన యోగం యొక్క ధ్యేయం పరిమితమైన బాహ్యదృష్టికల అహంకారాన్ని తొలగించి దాని స్థానే ప్రకృతిలో వసించి పాలించే దైవానికి పట్టాభిషేకం చేయటం. దీని అర్థం ముందుగా కోరికని పూర్తిగా వదిలి కోరికలను అనుభవించడమనే ధర్మం మానవుని యిష్టంపై పాలించటం ఏ మాత్రం అంగీకరించకుండా ఉండడం ఆధ్యాత్మిక జీవితం తన మనుగడ కవసరమైన సారాన్ని కోరికనుండి కాక నిర్మలము స్వార్థ రహితము రసాత్మకమయిన ఉనికి యొక్క ఆధ్యాత్మిక ఆనందం నుండి పొందు తుంది. కేవలం కోరికల ముద్రగల ప్రాణిక చేతన మనలోని మానసిక కోశం నుండి ఒక కొత్త జన్మను రూపాంతరీకరణను పొందాలి. విభజించబడిన అహంకార పూరిత మయిన పరిమితమయిన ఆలోచన, బుద్ధి అదృశ్యమై పోవాలి. వాటి స్థానే నీడలు లేని స్వయంభువైన దివ్యతేజస్సుయొక్క సత్యచేతనను స్థాపించాలి.వెదకులాడే అర్థ సత్యం నుండి, పడుతూలేస్తూ, పొరపాట్లునుండి విడివడిన అస్పష్టమైన అహంకార

కేంద్రమయిన యిబ్బంది పెట్టే స్వల్పమైన ఆశయాల సంకల్పాలు మాని వేగవంతము శక్తివంతమూ స్వచ్ఛమూ, స్వయం చలనమైన భగవంతునిచే కదిలించబడి, నడిపించబడే భగవత్ శక్తికి స్థానం కల్పించాలి. మన చేతనలన్ని కలసి ఒక ఉన్నతమయిన వ్యక్తిగతం కాని తడబడని తొట్రుపడని ఆ దైవ సంకల్పంతో సమస్యలేకుండా ఏకీకృతమయిన సంకల్పాన్ని పాదుకొల్పి చైతన్యవంతం చేయవలసి ఉంది. తృప్తి చెందని మన అల్పఅహంకార జనిత ఉద్వేగాలను పెరికి వేయాలి. వాటిస్థానే తన సమయంకోసం వేచి ఉన్న గుహ్యమైన, లోతైన విశాలమైన చైత్య సత్త హృదయాన్ని నాటాలి. మన భావనలన్ని దైవం వశించే ఈ అంతర హృదయం నుండి ప్రేరితమై శాంతము, అతిశయించిన భావాలయిన దైవికప్రేమ, బహువిధ ఆనందాలలోకి పరివర్తన చెందు తుంది. ఇది దివ్యమానవతకు లేదా అతిమానస జాతికి నిర్వచనం. ఇది మానవ బుద్ధి, చేతలకు అతిశయించిన లేదా ఉదాత్తమయిన శక్తి కాదు. ఇది యోగంతో మనలన్ని పరిణామం చెందించుకునే అతి మానస మనిషి రూపం

CWSA 23:90-91 *అనువాదం: డా. సరోజాప్రసాద్*

దివ్యకర్మ యోగం

నిరంతర అంతరంగ స్మృతి

ఒక కేంద్రీయ విమోచనాత్మక జ్ఞానాన్ని నిరంతర అంతరంగ స్మృతిని యోగాభ్యాసం కాంక్షిస్తుంది. ఆ స్మృతిని తీవ్రతరం చేసేందుకు ఒక నిరంతర సక్రియాత్మక బాహ్యీకరణ, కర్మల ద్వారా జరుగుతుండాలి. సర్వమందు ఒకే ఆత్మ వుంది, ఒకే దైవం సర్వమూ, సర్వమూ దైవంలో వున్నాయి. సర్వము దైవమే, విశ్వంలోమరేదీ లేదు. ఈ ఆలోచన లేక విశ్వాసం కర్మచేసే వ్యక్తి మొత్తం చేతనా ద్రవ్యం అయ్యేంత వరకు అతని మొత్తం నేపథ్యం అయి వుండాలి. ఈ విధమైన ఒక స్మృతి, తనను తాను క్రియోన్ముఖం చేసుకొనే ధ్యానం, చివరకు ఒక ఉదాత్తమైన, అవిచ్ఛిన్న దృష్టి, ఒక స్పష్టమైన సర్వాన్నీ ఆలింగనవం చేసుకొనే చేతనగా తప్పక మలుపు తిరగాలి. మనం దేనిని యెంతో శక్తివంతంగా గుర్తుంచుకొంటున్నామో, లేక దేనిపై మనం నిరంతరం ధ్యానిస్తూన్నామో దానిని అవిచ్ఛిన్నంగా చూచే దృష్టిగా దాని సర్వాలింగక చేతనగా తప్పక మలుపు దిరగాలి.

ఎందుకనంటే, ప్రతిక్షణం సమస్త అస్తిత్వానికి, సంకల్పాన్ని కర్మకు మూలంతో సదా సంప్రదిస్తూవుండాలని వత్తిడి చేస్తుంది. అదే సమయంలో సమస్త ప్రత్యేక రూపాలు ఆకారాలు వాటి కారణం, పోషకుడు అయిన "తత్ " లో ఆలింగనం చేసుకోవడం, వాటిని దాటిపోవడం కూడా వుంటుంది.

మనం దేనిని చూచినా, విన్నా, మనం దేనిని తాకినా, గ్రహించినా మనకు తెలిసిన దానినంతా మనం పూజించే సేవించే "తత్ " గా మనం తెలుసుకోవాలి. అనుభూతి చెందాలి. సమస్తం దైవత్వపు ప్రతి రూపంలోనికి మార్పు చెందాలి. ఆతని భగవత్తత్వపు ఆవాస స్థలంగా భావించబడాలి. ఆ శాశ్వత సర్వ వ్యాపకతతో ఆవహించబడాలి.

CWSA 23:112- 113

అహంకారపు ఆంతరిక ఆధారాలనన్నింటినీ త్యజించాలి

చివరగా, యజ్ఞయోగాభ్యాసం, అహంకారపు ఆంతరిక ఆధారాలనన్నింటినీ త్యజించమని మన పై వత్తిడి పెడ్తుంది. వాటిని మనస్సు, సంకల్పం, కర్మలనుండి తొలగించి పారెయ్యాలని, దాని బీజాన్ని దాని ఉనికిని దాని ప్రభావాన్ని మన స్వభావం నుండి తీసివేయాలని మనపైన వత్తిడి పెడ్తుంది. సర్వం చేయవలసింది దైవంకోసం, సర్వం దైవం వైపు నిర్దేశించబడాలి, మనల్ని మన మొక ప్రత్యేక అస్తిత్వంగా భా వించి మనకుగా మనం యితరులకోసం యేదీ చేయకూడదు. వారు పొరుగువారైనా, మిత్రులైనా, కుటుంబమైనా, దేశమైనా లేక మానవ జాతియైనా లేక యితరజీవులైనా కేవలం అవి మన వ్యక్తిగత జీవితానికి ఆలోచనకు మనోభావానికి సంబంధించిన వైనందున, లేక వాటి సంక్షేమంలో అహం ఆసక్తి మొగ్గుచూపుతున్న దనేకారణంతో మనం దేన్నీ చేయకూడదు. ఈ విధంగా సమస్త కర్మలను చేయడం చూడడం, దైవాన్ని తన స్వంత బృహత్తర జగదస్తిత్వపు హద్దులు లేని దేవాలయంలో జరుగుతుండే ఒక దైనందిన శక్తివంతమైన పూజగా, సేవనంగా తయారవుతుంది.

CWSA 23:113- 114

సమస్త కార్యకలాపాలలో యోగి లక్ష్యం

ఎందుకనంటే సమస్తం ఒక యజ్ఞంగా నిర్వహించబడాలి. సమస్త కార్యకలాపాలు

యేకైక దైవాన్ని తమలక్ష్యంగా, తమ మనుగడ అర్థానికి కేంద్రంగా చేసుకోవాలి. జ్ఞానంకోసం తయారైన విజ్ఞాన శాస్త్రాల్లో యోగి లక్ష్యం, మనిషిలో, జీవుల్లో, వస్తువుల్లో, క్రియాశక్తుల్లో, ఆమె సృజనాత్మక విశిష్టతంలో, మార్మికతల నిర్వహణలో దైవచేతన బలమైన శక్తి కార్య విధానాలను ఆవిష్కరించడం, అర్థం చేసుకోవడం అవ్వాలి. అవి మానసిక, భౌతిక మైనవైనా లేక గుహ్యామైన, అంతరాత్మకమైన ఆచరణకు సంబంధించిన విజ్ఞానశాస్త్రంలో ఆధ్యాత్మ అధికారానికి ఆనందానికి ఆత్మ - సాఫల్యతకు సంబంధించిన ఒక సచేతన, దోషరహిత, ప్రకటనకోసం, ఆ జ్ఞానాన్ని ఉపయోగించడానికి వీలుగా మనకివ్వబడిన కార్యం నిమిత్తం, సాధన సామగ్రిని సాధనోపాయాలను తెలుసుకొనేందుకు దైవ విధానాలలోనికి ఆతని ప్రక్రియలలోనికి ప్రవేశించడం యోగి లక్ష్యం. కళలలో యోగి లక్ష్యం కేవలం సౌందర్యారాధన, మానసిక లేక ప్రాణిక సంతృప్తికాదు. కాని దైవాన్ని ప్రతిచోటా దర్శించడం, తన స్వంత కార్యాల అర్థాన్ని వివేకంతో ఆరాధించడం, ఒకే ఒక దైవాన్ని ఆదర్శ రూపాలలో వ్యక్తం చేయడం, యేకైక దైవాన్ని సూత్రాలలో క్రియాశక్తులలో, ఏకైక దైవాన్ని దేవతలలో, మానవుల్లో, జీవుల్లో, వస్తువుల్లో వ్యక్తం చేయడం యోగి లక్ష్యం.

యోగికి, యితరులకు మధ్య ఉండే తారతమ్యం యిది. యోగి ఒక ఉన్నత విశాలతర ఆధ్యాత్మిక చేతనలో నివసిస్తాడు. అపుడు జ్ఞానసంబంధ, లేక సృష్టి సంబంధం ఆతని కార్యమంతా అచటి నుండే పెల్లుబుకుతుంది. అది మనస్సుతో తయారవ్వదు. ఎందుకనంటే అది మానసిక మానవుడు వ్యక్తం చేయవలసివున్న లేక విశేషించి అతనిద్వారా అతని కర్మలను అతని వ్యక్తిగత సంతృప్తికోసంగానికి ఒక ద్వివ్యకార్యం కోసం వ్యక్త అవ్వాలని వత్తిడి చేసే మహనీయ సత్యం, దర్శనం.
CWSA 23:142- 143

చైత్యపురుష ఆవిర్భావం

తన మానసిక నిశ్చితత్వాల, సామర్థ్యం మీద ప్రతి అడుగులో స్వయంగా ఆధారపడవలసిన అవసరం లేకుండా చాలినంతగా ప్రశాంతమైనపుడు, తన దూకుడుగల సంకల్పం మీద, అభ్యర్థన మీద, కోరికమీద యిక నెంతమాత్రము నిరంతరంగా వత్తిడి చేయకుండా ప్రాణికం స్థిరపరచబడినప్పుడు మచ్చికైనప్పుడు తన బాహ్యాం వైపు మొగ్గుదల అస్పష్టత లేక తమస్సు రాశి క్రింద ఆంతరిక జ్వాలను పూర్తిగా

పాతిపెట్టలేనట్లు మార్పుకు లోనైనపుడు, లోలోతున ఉన్న ఒక అస్తిత్వం అరుదైన దాని ప్రభావాలలో మాత్రమే తెలుస్తూ యెంతోకాలం నుండి దాగి వున్నది. ముందుకు రాగలిగి తక్కిన దానిని ప్రకాశమయం చేసి, సాధనకు నాయకత్వం వహిస్తుంది. దాని లక్షణం దైవం వైపు, లేక అత్యున్నతమైనదాని వైపు యేకాగ్రదృష్టి నిలుపడం. ఒకే ఏకాగ్రదృష్టి అయినప్పటికీ, కర్మలోను, కదలికలోను మెతక ధోరణి కలది. అది ఒకే దృష్టిగల బుద్ధిలాగా లేక రాజరిక భావనమౌఢ్యం లేక ఒకే దృష్టిగల ప్రాణికశక్తి ప్రేరణలకా దివ్యాన్ని సృజించదు. ప్రతిక్షణం మృదువైన కచ్చితత్వంతో పరమసత్యం వైపుకు దారి చూపుతుంది. అప్రయత్నంగా మంచి చెడులను గ్రహిస్తుంది. ఆ దివ్యమైన దైవం వదలకుండా పట్టుకొనివుండి మిశ్రమం నుండి దివ్యమైన దానిని భగవంతుని వైపుకుండే చలనాన్ని విడదీస్తుంది.

స్వభావంలో మార్పు చెందవలసివున్న దాన్నంతట్నీ చూపించే ఒక కరదీపిక లా దాని చర్యవుంటుంది. సిద్ధిపై పట్టుబట్టే సంకల్పజ్యోతి దానిలో వుంది. ఆంతరిక, బాహ్య మనుగడనంతటినీ పరునవేదిలా మార్చివేయడంమీద పట్టుబట్టే సంకల్పజ్యోతి దానిలో వుంది. ప్రతిచోట అది దివ్యత్వాన్నే దర్శిస్తుంది. కాని కేవలం ముసుగును, మారువేషం వేసుకొన్న రూపాన్ని తిరస్కరిస్తుంది. అది పరమసత్యంపై పట్టు బడుతుంది. సంకల్పంమీద, బలంమీద ఆధిపత్యంమీద సంతోషం మీద దివ్యప్రేమమీద, సౌందర్యంమీద పట్టు బడ్తుంది. కాని అవిద్యకు సంబంధించిన కేవల వ్యవహారిక క్షణిక సత్యాన్ని అధిగమించిపోయే విద్యను యెడబాయనిపరమసత్యం మీదే పట్టు బడ్తుంది. ఒక అంతరంగం వైపు సాగే ఆనందం, మీదేగాని కేవల ప్రాణికానందంమీద కాదు, అది పట్టుబట్టేది. ఎందుకనంటే అది దిగజార్చే సంతృప్తులను గాక శుద్ధి చేయడానికి బాధ కలిగించే దానిని విషాదాన్ని యిష్టపడుతుంది. పైకెగిరేప్రేమ రెక్కలపైననేగాని, అహంకారిక వ్యామోహ కట్టుగొయ్యకు కట్టుబడినదానిపై గాదు లేక దాని పాదాలు బురదలో కూరుకుపోయినదానిపై గాదు, అది పట్టుబట్టేది. శాశ్వ తత్వాన్ని ఆరాధనీయం చేసే నిర్వచనమయ్యే సౌదర్యంపై అహానికిగాక ఆధ్యాత్మకు ఉపకరణాలయ్యే బలం, సంకల్పం ఆధిపత్యం మీద అది పట్టుబడ్తుంది. జీవితాన్ని దివ్యీకరించడం దాని సంకల్పం, దాని ద్వారా ఒక ఉన్నతసత్యాన్ని వ్యక్తం చేయడం, అది అంకితమయ్యేది దైవానికి, శాశ్వతునికి.

CWSA 23:154- 155 అనువాదం: కె.వి.రావు

చైత్యపురుషుని అత్యంత స్వాభావిక లక్షణం

అయితే పవిత్రప్రేమ, ఆనందం, ఏకతల ద్వారా దైవదిశగా వత్తిడి కలిగించడం చైత్యపురుషుని అత్యంత స్వాభావిక లక్షణ. అది అమితంగా కోరుకొనేది ఓ దివ్య ప్రేమను, దానికి ప్రేరణ దైవం యెడల ప్రేమ మనలో నూతన జన్మ ధరించిన దైవశైశవ లేక అస్పష్ట ఊయల గుహపై దేదీప్యమానంగామెరుస్తూవున్న సత్యతారదాని గమ్యం. ఎదుగుతూ అపరిపక్వ ఉనికితోఉన్న తొలి సుదీర్ఘదశలో అది లౌకిక ప్రేమపైన వాత్సల్యం, మృదుత్వం సహృదయ సంకల్పం, కరుణ దయల మీద; సౌందర్యం, సాధుత్వం, శుద్ధత, వెలుగు, దారుఢ్యం, స్థైర్యాల మీద; మానవుని స్థూలస్వభావాన్ని సాధారణతను సంస్కరించడం కోసం, స్వచ్ఛంగా చేయడం కోసం సహాయపడ గల్గిన వాటన్నింటి పైన అది ఒరిగి ఉన్నది; కాని మానవుల ఉత్తమ, అధమ స్థితులలో చలనాలు ఎంత మిశ్రమంగాను, అహంతో తనను తాను మోసగించుకునే భావోద్వేగ అసత్యంతో ఎంతగా దిగజారి ముద్రవేయబడినది, ఆత్మగమనాన్ని అనుసరించుతూ, అది స్వీయ లాభం పొందడం దానికి తెలుసు. ఒక్క పెట్టున ఉత్పన్నమవుతూ పాతబంధా లన్నింటిని ఛేదించి ఓ ఉత్తమ ఆధ్యాత్మిక ప్రేమ అనే సత్యాన్ని ఏక తను వాటి స్థానంలో ఉంచడం కోసం సిద్ధమై ఆతృత పడుతున్నది. మానవరూపాలను, గమనాలను, యింకా అంగీకరించవచ్చేమో గాని వాటిని యేకైకం వైపు మాత్రమే త్రిప్పాలనే షరతు మీదనే ఆమోదిస్తుంది. అది కేవలం సహాయపడి బంధాలను, గురువు పట్ల హృదయపూర్వక, మనఃపూర్వక గౌరవాన్ని, దైవాన్వేషకుల కలయికను, ఈ మూర్ఖ పశుప్రపంచం పట్ల, అందలి మనుషుల పట్ల గల ఓ ఆధ్యాత్మిక కరుణను, ప్రతి చోటా దైవాన్ని చూడడం వలన వచ్చే ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, సౌందర్య సంతృప్తులను మాత్రమే ఆమోదిస్తుంది. అది స్వభావాన్ని హృదయకుహరంలోని రహస్య కేంద్రంలో అంతస్థమయి ఉన్న దైవాన్ని కలుసుకోవడం కోసం లోపలి వైపుకు మునిగేటట్లు చేస్తుంది. ఆ పిలు పక్కడున్నప్పుడు అహంకారం ఎదురు తిర గడం వుండదు. కేవలం పరహితం స్వధర్మం, దానం, సేవ అనే బాహ్యప్రకటనల మోసా లుండవు. ప్రక్క దారి పట్టించడా లుండవు. లోనున్న దైవత్వం పట్ల గల ఆక ర్షణకు విధేయంగా ఉండడాన్నుండి మళ్ళించడ ముండదు. జీవిని సర్వోత్కృష్ట మయిన పారవశ్యత వైపు లేవనెత్తుతుంది. ప్రపంచపు అధోముఖ లాగుడు నుండి

ఉన్నతోన్నత ఏకతను చేరడం కోసం పైకెగసే రెక్కలను విదళించడం కోసం సిద్ధంగా ఉన్నది; కాని ఏవగింపు, పోరాటం, విభజన జేయడం కోసం, సమూలంగా మార్చడం కోసం ఈ సర్వోత్కృష్టమయిన ప్రేమను సౌందర్యాన్ని గూడ క్రిందికి పిలుస్తుంది. ఇది విశ్వజనీన ప్రేమ, విస్తారమయిన కరుణ, ఆందరి మంచి గురించిన ప్రగాఢమయిన, అపారమయిన సంకల్పం కోసం, విశ్వమాత ఆలింగనం కోసం, ఆమె బిడ్డలను ఆదరిస్తూ, ఆమె చెంతకు చేర్చుతూ, విశ్వనిశ్చేతన నుండి ప్రపంచాన్ని విముక్తం చేయడం కోసం నిశీధిలోనికి మునక వేసిన దివ్యభావోద్వేగానికి తెరచుకొని ఉంది.

CWSA 23:155-56

ఆరాధన రూపంలో నున్న ప్రేమంతటికి వెనుక ఓ ఆధ్యాత్మిక వత్తిడి వుంది.

ప్రేమ కంతటికి, వెనుక అంటే వాస్తవంలో ఆరాధనకు వెనుక ఓ ఆధ్యాత్మిక వత్తిడి ఉన్నది. దానిని అజ్ఞానంతో, పరిమిత లక్ష్యానికై అర్పించినప్పటికీ ఆచారకర్మ, దాని నుండి పర్యవసించేవి సరిగా వ్యక్తం చేయలేనివాటి ద్వారా దాని వైభవం యెంతో కొంత కనిపిస్తుంది. ప్రేమకు అంటే పూజకు ఓ ఆకాంక్ష, ఓ సంసిద్ధత ఒకే మారుంటాయి: దాని అజ్ఞానంలో, అల్పమయిన పరిమితులలో ఎంత హెచ్చు, తగ్గులుగా, గ్రుడ్డిదీ, పాక్షికమూ అయినప్పటికీ ఈ షణ్మాత్ర దర్శనం కూడా ఆశ్చర్యం గొలిపే సాక్షాత్కారం అవుతుంది. ఎందుకంటే మనలో ప్రేమించేది ప్రేమించబడుతూ ఉండేదీ ఆ యేకైకుడే అనిపించే క్షణాలు కొన్నుంటాయి. ఈ అనంత ప్రేమ ప్రేమికుల ఈషణ్మాత్ర దర్శనంతో మానవ భావోద్వేగం కూడా ఉన్నత మవగలదు., మహిమాన్విత మవగలదు. ఈ కారణంగా భగవదారాధనను, విగ్రహారాధనను, మానవ ఆకర్షణను లేదా ఆశయాన్ని తృణీకరింప గూడదు: ఎందుకంటే ఆ ఆనందమయ భావోద్వేగం వైపు అనంతత్వ పారవశ్యం వైపు మానవజాతి చేస్తున్న గమనంలోని మెట్లు అవి. అవి అనంతాన్ని పరిమితం చేయడంలో సైతం, ప్రకృతి మన అడుగుల కోసం చెక్కిన నిమ్న మెట్లను సైతం యింకా ఉపయోగించవలసి వున్నందున,

మన పురోగతిని దశలుగా అంగీకరించవలసి వున్నందున మన అపరిపూర్ణ దృష్టికవి, ప్రకటిత మౌతాయి.

CWSA 23:159

మంచిచెడుల కావల

ఆధ్యాత్మలో విముక్తమయి ఉండాలంటే, ఉత్తమ సత్యానికి మాత్రమే అధీనమయి ఉండాలంటే అనంతత్త్వాన్ని మన మానసిక నైతిక నియమాలు బంధిస్తున్నాయనే భావాన్ని వదిలిపెట్టాలి. లేదా మన సౌశీల్యతా ప్రమాణాలలో ఏది ఉనికిలో నున్నప్పటికీ అది ఉన్నతమయిన వాటితో సహా పరమ పవిత్రము, పరిపూర్ణము లేదా అనంతము కాగలదు. అవసరం మేరకు గొప్ప గొప్ప తాత్కాలిక ప్రమాణాలను తయారు చేయడం ప్రపంచంలో అతడి నడకలో దైవాన్ని సేవించడం కొరకే; పరిపూర్ణమయిన ప్రమాణాన్ని మొండిగా నిలిపి వుంచితే అది అనంతంగా ప్రవహిస్తున్న జలాలకు ఓ అడ్డుకట్ట కట్టే విరుద్ధ ప్రయత్నము అవుతుంది.

ఇప్పటి చెడు విషయాన్ని ప్రస్తుత రూపంలో కాదంటున్నప్పటికీ అది తప్పుడుదైనా సహాయకారే, సాధారణ వ్యక్తిగత అభివృద్ధికి అవసరమయినదే. మన మిప్పుడు చెడుగా పరిగణిస్తున్న ఆ మరో విషయం మరొక రూపంలో అమరికతో, ఏదో పరి పూర్ణతతో భవిష్యత్తులో ఒక మూలకం గావచ్చు ఆధ్యాత్మిక స్థాయిలో ఈ భేదాన్ని గూడ దాటి పోతాం; ఎందుకంటె మంచి చెడు అంటున్న ఈ విషయాలన్నింటి ఉద్దే శాన్ని దివ్యంగా ఉపయోగించుకోవడానిని కనుగొంటాము. అప్పుడు మంచివి అనే వాటిలోని అసత్యాన్ని, వక్రీకరణను, మూఢతను కూడా మనం చెడు అనే దాన్ని తిరస్కరించడం కన్నా తక్కువ గాకుండా తిరస్కరించాలి.

CWSA 23:191

పరిపూర్ణ అతిమానస కర్మ

పరిపూర్ణ అతిమానస కర్మ ఒక సూత్రాన్నో పరిమిత నియమాన్నో అనుసరించదు. అహంభావికో సంస్థాగతమయిన సామూహిక మనసుకో చెందిన ప్రమాణాన్ని తృప్తి పరచాలనుకోదు. సానుకూల ఆచరణశీలియయిన ప్రాపంచిక మానవుని కయినా, నియత నైతికవాది కయినా, దేశభక్తుని కయినా, భావోద్వేగపూరితుడయిన దాత

కయినా, ఆశయాత్మక తాత్త్వికుని కయినా కట్టుబడి ఉండదు. శిఖరాగ్రాల నుండి నిరాఘాటంగా జాలువారుతున్న దాని ననుసరిస్తుంది, ఎంపిక జేసుకోబడిన లెక్క గట్టబడిన ప్రామాణిక క్రియను గాదు. బౌద్ధికి కారణమయినా, నైతిక సంకల్పమయినా సాధింప గల్గినదంతా అదే. దాని ఏకైక లక్ష్యం మనలో నున్న దివ్యత్వ వ్యక్తీకరణ, జరుగువలసిన వ్యక్తీకరణ దిశగా ప్రపంచాన్ని దాని అభివృద్ధిని కలిపి ఉంచడం.
CWSA 23:206

కర్మ ఆరంభింపజేసే ప్రేరణను రూపాంతరీకరించడం

నిజాయితీగా కర్మల మార్గంలో ఎవరు ప్రవేశించినా మన కర్మలకు మొదటి నియమాలయిన అవసరం, కోరిక అనే దశను వెనుకనే వదలివేయాలి. ఎందుకంటే యోగం ఉత్తమ లక్ష్యాన్ని ఆమోదించి ఉంటే అతడి నింకా ఏ ఏ కోరికలు యిబ్బంది పెడుతున్నా వాటిని తీసివేసి దైవం చేతుల్లో పెట్టేయాలి. సాధకుని మంచి కోసం అందరి మంచి కోసం వాటితో ఉన్నత శక్తి తలపడుతుంది. ఫలితంగా ఒక్కసారి ఈ సమర్పణ చేస్తే — తిరస్కారణలో నిజాయితీ ఎప్పుడూ వుంటే — గత స్వభావ ప్రేరణ క్రింద కొంతకాలం పాటు అహంకారిక కోరిక తిరిగి యథేచ్ఛగా రావచ్చు గాని అది కేవలం అది వరకే పొందిన ఉరవడిని తగ్గించడం కోసం, కోరిక ప్రతిక్రియ వలన, దుఃఖం అవిశ్రాంతతల వలన బోధింపబడ జాలని నాడీ ప్రాణిక ఉద్వేగ స్వభావ భాగాలకు విరుద్ధంగా ఉన్నత శాంతి, దివ్యానందపు అద్భుత చల నాల నిశ్శబ్ద సమయాల గురించి బోధించడం కోసమని అలా జరుగుతోందని గ్రహి స్తాము. విముక్తి నుండి తన సహజ దివ్యస్వభావాన్ని ఆకాంక్షిస్తున్న ఆత్మకు కోరిక ఒక నియమం గాదు. తర్వాత ఆ ప్రేరణలలోని కోరిక కన్న మూలకం పూర్తిగా త్రోసివేయ బడుతుంది. అది, పట్టు విడువక నిరంతరం కాదనడం వలన మార్పుకు లోను జేస్తున్న వత్తిడి వలన తొలగింప బడుతుంది. చేసే ప్రతి కర్మలోనూ, సమా నమయిన ఆనందాన్ని పొందడం వల్ల వారిలో పవిత్రమయిన క్రియాశక్తి న్యాయసమ్మత మవుతుంది. ప్రేరణాత్మకంగా వచ్చిన ఫలితం లేదా పైనుండి విధించబడిన ఫలితం చిట్టచివరకి పరిపూర్ణతకు చెందిన ఆనంద సామరస్యతలో కాపాడబడుతుంది. నీ అస్తిత్వ సాధారణ నియమం పని చేయడం ఆనందించడం; కాని వ్యక్తిగత కోరికతో క్రియను ఆనందాన్ని ఎంపిక జేసుకోవడం కేవలం అజ్ఞాన సంకల్పమే గాని దాని

హక్కు గాదు. ఎంపిక చేయవలసినది ఉన్నత దివ్యసంకల్ప మొక్కటే, ఆ సంకల్ప గతిశీల గమనంగా కర్మ మారాలి; వేడుక స్థానంలో పవిత్రమయిన ఆధ్యాత్మిక ఆనందపు క్రీడ జరగాలి. వ్యక్తిగత సంకల్పమంతా కేవలం ఉన్నతాన్నుండి ఒక తాత్కాలిక ప్రతినిధిగానూ, మూర్ఖ అసురుని అన్యాయాక్రమణతోనూ ఉంటుంది.

CWSA 23:209-10 *అనువాదం: అరుణా మోహన్*

దైవప్రేరిత కార్యము

అనన్యత లేక తాదాత్మ్యతకి ఆ ఉన్నత ఆవశ్యక ప్రేరేపణ వలెనో, ఒక దైవప్రేరిత కార్యము వలెనో పరమేచ్ఛ ఏదో ఒకటి మనలో మూర్తీభవించినపుడు మనం ఒక ఐచ్ఛిక ఆత్మ నిర్ధారిత శక్తితో పని చేస్తాము కాని సంపూర్ణ, అర్థమును గురించిన జ్ఞానము, లక్ష్యము అటు తరువాతే ఉద్భవిస్తాయి. పని చేయడానికి కావలసిన ప్రేరేపణ మనస్సులో కాక విశేషించి శరీరంలోను హృదయంలోను ఒక ఆవేశము వలెకాక అవలీల అంతః స్ఫురణంగా కూడా రావచ్చు. ఇక్కడ ఒక ప్రభావాత్మకమైన దృశ్యం ప్రవేశిస్తుంది. కాని సంపూర్ణసరియగు జ్ఞానము ఇంకా భిన్నంగానే వుండి ఒక వేళ వస్తే, అటు తరువాత వస్తుంది. ప్రకాశవంతమైన ఒకే ఒక ఆదేశమువలె అటు తరువాత వస్తుంది. కాని ఒక తేజోమయమైన ఒకే ఒక ఆదేశంలా, లేక ఒక సంపూర్ణ అవగాహన లేక, సంకల్పంలాగా, ఆలోచనలాగా దేనిని చేయాలనేఅవిచ్ఛిన్న ఒక అవగాహనా ప్రవాహంలా, లేక నిమ్నాంగాలచే అప్రయత్నంగా నెరవేర్చబడే ఒక దిశానిర్దేశంగా దివ్య ఇచ్ఛ కూడా దిగిరావచ్చు. యోగసాధన అరకొరగా ఉన్న ప్పుడు ఇలా కేవలం కొన్ని పనులు మాత్రమే చెయ్యవచ్చు లేకపోతే ఏదో ఒక సాధారణ కార్యము ముందుకు సాగవచ్చు కాని కేవలం పారవశ్య పూరిత మరియు కాంతి మయ సమయాలలో మాత్రమే. అలా సాగుతుంది. యోగసాధన పరిపూర్ణమైన దైనపుడు కర్మ అంతా ఈ రకంగానే ఉంటుంది. మనం వృద్ధి చెందుతున్న ప్రగతిని మూడురకాలుగా విభజించగలము. దాని వలన మొదటిది వ్యక్తి గత ఇచ్ఛ అన్నది అప్పుడప్పుడుగాని లేక తరచుగా గాని ఉన్న చైతన్య క్రియాశక్తిచే గాని లేక దానికి ఆవలఉన్న దైవేచ్ఛచే ప్రకాశవంతము గావించబడటం లేక నడుపబడు డము జరిగి చివరకి స్థానభ్రంశముచెంది, ఆ దైవశక్తి ప్రేరిత కార్యముతో తాదాత్మ్యం చెంది అందులో లీనమవుతుంది. మొదటిదశలో మన మింకా మన బుద్ధిచే, హృదయా

లచే, ఇంద్రియములచే శాసించబడి ఇవి ఆ దైవప్రేరణకోసం అన్వేషిస్తాం లేక చూస్తూ ఉంటాయి. సదా అవి దానిని కనుగొనలేవు, లేక అందుకోలేవు. రెండవదశలో మానవజ్ఞానము అత్యంత ప్రకాశవంతమైన లేక అంతః స్ఫురణాత్మక మనస్సుచే, బాహ్యమానవ హృదయము ఆంతరిక అంతరాత్మిక హృదయముచే, ఇంద్రియములు పవిత్రమైన, స్వార్థములేని ప్రాణిక శక్తిచే అధికముగా స్థానభ్రంశము చెందుతాయి. మూడవదశలో మనం ఆధ్యాత్మీకరించబడిన మనస్సును కూడా అధిగమించి అతి మానస స్థాయిలకు చేరుకుంటాము.

CWSA 23: 218- 219

సమత్వము

సమత్వము అంటే ఒక తాజా అజ్ఞానమో, అంధత్వమో కాదు, అది దృష్టిని మసకబార్చడంగాని, పిలుపు నివ్వడంకాని లేక మిగతా అన్ని రంగుల ఛాయలనూ, తుడిచెయ్యడం కాని చెయ్యదు. అక్కడ తారతమ్యత ఉంటుంది. అభివ్యక్తిలో హెచ్చు తగ్గులుంటాయి. ఈ హెచ్చు తగ్గుల్ని మనం ప్రశంసించాలి. మన కళ్ళు పక్షపాతంతో తప్పు చేస్తుంటే, ప్రేమ- ఏహ్యతలను, మెచ్చుకోలు తృణీకారాలను, సహానుభూతి -ద్వేషములను, ఆకర్షణ- వికర్షణలను ప్రశంసించిన దానికన్నా హెచ్చుగా యుక్త రీతిని ప్రశంసించాలి. కాని ఈ హెచ్చు తగ్గుల వెనుక మనం ఎల్లప్పుడూ దానిలో వసించే ఆ సంపూర్ణుని, నిర్వికారుని చూడాలి, అనుభూతిచెందాలి. తెలుసు కోవాలి. లేకపోతే కనీసం అది మననుండి దాగుకున్నా సరే ఆ ప్రత్యేక అభివ్యక్తికి సంబంధించిన దివ్య అవశ్యకతలో విజ్ఞతగల కార్యంలో ధృఢనమ్మకం ఉండాలి. అది మానవ ప్రమాణానికి సుసంబద్ధమైనది గాను, పరిపూర్ణమైనదిగాను ఉన్నా లేక అపరిష్కృతము మరియు అసంపూర్తిగాను ఉన్నా లేక అసత్యమైనా చెడ్డదైనా సరే ఆ ప్రత్యేక అభివ్యక్తి వివేకవంతమైన కార్యంలో, ఆవశ్యకతలో నమ్మకముంచాలి. అలాగే దుఃఖభరితమైన ఆనందదాయకమైనా, జయాపజయాలైనా మానవమానాలైనా, గౌరవ అగౌరవాలయినా, అదృష్ట దురదృష్టాలైనా ఏది సంభవించినా అన్ని విషయా లలోను మన మనస్సు, ఆత్మ ఒకేరకమైన సమత్వాన్ని పాటించాలి. కారణం, జరి గే వాటన్నింటిలోని అన్ని పనులలోని పరిణామాలలో మనం ఆ దైవేచ్ఛని చూసి ఆ భగవంతుని వికాసాభివ్యక్తిలో ఒక మెట్టుని గమనిస్తాం. అన్ని విషయాలలోను, అన్ని

ప్రాణులలోను అన్ని క్రియాశక్తులలోను వాటి క్రీడను, పరిణామానాన్ని కూడా చూడ గలిగిన అంతః చక్షువులు గలవారికి అతను తనను తాను సాక్షాత్కారింప జేసుకొంటాడు. అన్ని విషయాలూ ఆ దైవఘటన దిశలోనే ముందుకు కదులుతాయి. ప్రతి అనుభవము, దుఃఖ సంతోషాలకన్న తక్కువ కాని ప్రతి కోరికా, విశ్వగమనంలోని ఒక అవసరమైన అనుసంధాన కొక్కెం, దానిని అర్థం చేసుకోవడం, దానిని బలపరచడం మన పని. ఎదురుతిరగడం, తిరస్కరించడం, దుఃఖించడం మన సంస్కారహీనమైన, అజ్ఞానపు స్వభావము ప్రేరేపణ. మిగతా వాటిలాగే ఎదురుతిరగడం కూడా దైవ వికాసముయొక్క అద్దాని సమయంలో అద్దాని స్థితిలో ఆటలో అవసరమైనదే కాక ఉపకారికూడా, దాని ప్రయోజనాలు దానికి ఉన్నాయి. కాని అజ్ఞానపు తిరుగుబాటు తనం అంతరాత్మ బాల్యదశకు లేక మూఢమైన యౌవనదశకు చెందుతుంది.

పరిపక్వ అంతరాత్మ దేనినీ తిరస్కరించక అర్థం చేసుకోవడానికి, దాని మీద ఆధిపత్యం వహించడానికి చూస్తుంది. దుఃఖించకుండా విషయాన్ని అంగీకరించి దానిని అభివృద్ధి పరచి, సరి చెయ్యాలని ప్రయత్నిస్తుంది. లోపల్లోపల ఎదురు తిరగక దానిని ఒప్పుకొని పూర్తి చేసి మార్పు చెందించడానికి శ్రమిస్తుంది. కనుక మనం అన్ని విషయాలను భగవంతుని చేతులనుండి సమఅంతరాత్మలో గ్రహించాలి.

CWSA 23: 224- 225

నిరాశ చెందకుండా విశ్వాసంతో యోగసాధన చెయ్యండి

ఈ మార్గంపై ఎవరైనా స్థిరంగా దూరం పయనిస్తే, మనస్సులోని విశ్వాసం ఘోరాతిఘోరమైన ప్రతికూల వొత్తిడిలో ఉంటుంది. అది దాగి ఉన్నా లేక ప్రస్ఫుటంగా కాన్పించినా అది తిరిగి ఉద్భవించడానికి వీలయినంత తొలి అవకాశాన్ని వెతుక్కుంటుంది. బుద్ధి లేక హృదయంకన్నా ఉన్నతమైన దాని కోసం ఎన్ని భయంకరమైన ఆటంకాలు ఉన్నా సరే, అటువంటి సుదీర్ఘ ఓటమి ద్వారా హృదయవిశ్వాసం నిలుపు కొంటుంది. కాని అనుభవజ్ఞులైన సాధకులకు కూడా అటువంటి తడబాటు లేక మబ్బులు క్రమ్ముట వారి ప్రగతిలో అవాంతరాలు తీసుకువస్తాయి. అవి కొత్తవారికి చాలా ప్రమాదకరం కూడా. కనుక ఈ మార్గముయొక్క అత్యంత కఠినతర కష్టాన్ని ప్రారంభ దశ నుండి అర్థం చేసుకుని స్వీకరించడం చాలా అవసరం. అంతేకాక ఒక విశ్వాసము లేక నమ్మికయొక్క అవసరంకూడా ఉందని అనుకోవాలి. అది బుద్ధికి అంధ విశ్వాస

మనిపించవచ్చు. కాని అది మన హేతు బుద్ధి కంటె తెలివైనది. ఎందుకంటే విశ్వాసమనేది ఊర్ధ్వం నుండి లభించే ఆధారం. తెలివితేటలకు తత్సంబంధమైన లెక్ఖలకు అందని ఒక రహస్య కాంతిచే వెదజల్లబడిన ఒక తేజోవంతమైన ఛాయ అది; కంటికి వెంటనే కాన్పించు దృశ్యాల దయకి వదిలిపెట్టబడని గుప్త జ్ఞానముతో నిండిన హృదయమది. మన విశ్వాసము పట్టిన పట్టు వదలనిది. వాటి వాటి పనుల ద్వారా నిర్ణయింపబడి చివరకు దివ్యజ్ఞానము యొక్క ఆత్మాభివ్యక్తి లోనికి పరివర్తన చెంది పరిణితి పొందుతాయి. మన మెల్లప్పుడూ భగవద్గీత యొక్క ఈ ఆజ్ఞకి కట్టువడి ఉండాలి. నిరాశతో కృంగిపోవడంనుండి విముక్తి చెందిన హృదయముతో యోగసాధన నిరంతరం అనుష్టించాలి. ఎల్లప్పుడూ మనం సంశయాస్పదబుద్ధికి భగవంతుని ఆ వాగ్దానాన్ని గుర్తు చెయ్యాలి. మీ అన్ని పాపాల నుండి, చెడులనుండి నేను మిమ్మల్ని తప్పక ఉద్ధరిస్తాను, విచారించకండి. చివరగా విశ్వాసముయొక్క ఆ అల్లల్లాట అంతమవుతుంది. కారణం మనం ఆ దైవాన్ని దర్శిస్తూ, ఎల్లప్పుడూ ఆ దివ్య ఉనికిని అనుభవించ గలుగుతాం.

CWSA 23: 244- 245

మన పనులన్నింటికీ యజమాని

మన పనులన్నీ ంటికీ యజమాని అయిన ఆ దైవం వాటిని రూపాంతరం చెందించే సమయంలో కూడా మన స్వభావాన్ని ప్రకృతిని ప్రేమిస్తూనే ఉంటాడు. అతడు ఎటువంటి నిరంకుశ చపల చిత్తత ద్వారా కాక ప్రకృతి ద్వారానే పనిచేస్తాడు. మన అపరిపూర్ణ ప్రకృతి మన పరిపూర్ణతకు అవసరమైన సామగ్రితో కూడి ఉంటుంది. కాని అర్థములేని వికారమైన పూర్తి అక్రమ పద్ధతిలో విసరివేయబడి లేక అతి తక్కువ శ్రమపద్ధతి తో ఉంటుంది. ఈ సామగ్రినంతా సహనంతో పూర్తిగా శుద్ధిచేస, సక్రమరీతిలో అమర్చి, కొత్తగా పోతపోసి రూపాంతరీకరించాలి. ఖండించి, మలచి, పాతర లేక భిన్నాభిన్నము చేసికాదు. సాదారణ నిర్బంధము మరియు కాదనడము ద్వారా మరచిపోయేటట్టు చేసికాదు. ఈ ప్రపంచం మరియు దానిలో జీవించే మనం అతని సృష్టియే. అభివ్యక్తియే. అతడు దానితో, మనతో ఎలా వ్యవహరిస్తాడంటే మన సంకుచిత అజ్ఞాన బుద్ధి నిశ్శబ్దత నలవరచుకొని దివ్యజ్ఞానమునకై తెరచుకుంటే తప్ప దానిని అర్థం చేసుకోలేదు. మన తప్పులలో దేవులాడే మన తెలివికి తన

అర్థాన్ని తెలియచెప్పాలని శ్రమించే ఒక సత్యసారముంది. మానవుని బుద్ధి తప్పులిన్ని దానితోపాటు సత్యాన్ని కూడా ఖండించి వేస్తూ, దానిని మరియొక అర్థ సత్యంతోను, అర్థ తప్పుతోను యధావిధిగా ఉంచుతుంది. ప్రతి అసత్యపు ఆచ్ఛాదన క్రింద దాగియుండి రక్షింపబడుతున్న సత్యము వద్దకు చేరుకొనే వరకు మనం ఎడ తెరిపిలేకుండా చేసే తప్పులవలన ఆ దివ్యజ్ఞానము బాధపడుతూనే ఉంటుంది. ఏ అన్వేషణాశక్తి యొక్క తప్పటడుగులు మన పాపాలు తరచు కురూపియైన వేషము నుండి వెలికి తీసి రూపాంతరము గావించగల గుణము యొక్క ముసుగులు ఇవన్నీ. లేకపోతే విషయాలన్ని సంపూర్ణ విధి విధానములో ఉంటే వాటి అస్తిత్వానికి మనుడగకి అవి ఇలా బాధపడేవికావు. మన పనుల యజమాని తప్పులు చేసేవాడు, నిర్లిప్త ద్రష్ట, అవసరంలేని దుర్మార్గములయొక్క వైభవాలకి సంబంధించిన విలాస వంతుడు కాదు. మనకున్న సద్గుణాలకిమించి మన హేతుబుద్ధి కంటె ధీశాలి అతడు.

CWSA 23: 245- 246

సుదీర్ఘ మార్గంపై కొన్ని తొలిమెట్లు

ఈ సుదీర్ఘమార్గంపై తొలిమెట్టు మన పనులన్నీ ఒక యజ్ఞంగా మనలోని, మన ప్రపంచంలోని ఆ దైవానికై అర్పించడం ఇది మస్తిష్కానికి, హృదయానికి చెందిన ఒక దృక్పథం. దానిని ఆరంభించడం అంత కష్టతరమైనది కాదు, కాని సంపూర్ణ శ్రద్ధాభక్తులతో ఎల్లడలా దీనిని ఆచరించడం చాలా కష్టం. దాని రెండవమెట్టు మన కర్మ ఫలితం యెడల అనురక్తిని వదిలిపెట్టడం, కారణం అది త్యాగముయొక్క అత్యంత కావలసిన ఫలితము, నిజమైనది, తప్పనిసరియైనది, ఒకే ఒక అవసరము. ఆ దైవఅస్తిత్వము దివ్యచైతన్యము మనలోని ఆ శక్తి అదే పొందగలిగినప్పుడు మిగతాదంతా కలిసివస్తుంది. ఇది మన ప్రాణిక సత్త, మన కామ్యాత్మ, కామన స్వభావం లోని అహంకారిక ఇచ్ఛ రూపాంతరీకరీకరణం. ఇది మరోదాని కన్నా చాలా కష్టసాధ్యమైనది. మూడవమెట్టు కేంద్రీభూత అహంకారంనుండి మరియు పనిచేస్తూన్నానన్న అహం నుండి విముక్తి పొందడం. అన్ని రూపాంతరీకరణముల కంటె అది చాలా కష్టతరమైనది. మొదటి రెండు మెట్లు దాటలేనప్పుడు అది చక్కగా చెయ్యలేము. అలాగే మూడవది వచ్చి అహంకారమును నిష్క్రిమింపచెయ్యడం,

కోరికను సమూలంగా తుది ముట్టించడం వంటి వానితో ఈ ప్రక్రియ కంతటికీ శీర్ష భాగాన ఉండనప్పుడు ఈ తొలిమెట్టు కూడా ఎక్కడం పూర్తికాదు.

CWSA 23: 247- 248

ఉపకరణాన్ననే అహంకారము యెడల జాగ్రత్త!

ప్రతి వ్యక్తి తెలిసో తెలియకో ఆ వైశ్వికశక్తియొక్క సాధనమే, ఆంతరిక దివ్యసన్నిధి నలా వుంచితే ఒక పనికి మరొక పనికి మధ్య ఒక ఉపకరణానికి మరో దానికి మధ్య అహంకారిక గర్వం బుద్ధి తక్కువతో సమర్థించే సారతః భేదమేమీ వుండదు.

జ్ఞానమునకు అజ్ఞానమునకు మధ్య భేదము శక్తియొక్క కృప మాత్రమే, ఆ దైవశక్తి యొక్క ఊపిరి ఈ రోజు ఒకరిని యెంచి ఆ దిశగా వీచి నింపితే రేపు ఇంకొ కరిని మాటతో గాని లేదా కార్యముతో గాని అనుగ్రహించవచ్చు — కుమ్మరి ఒక కుండని ఇంకొక కుండకన్న ఎక్కువ బాగా తయారుచేస్తే ఆ గొప్పతనం ఆ పాత్ర లో కాదు, చేసినవానిలో ఉంటుంది. మన ఆలోచన, దృక్పథము 'ఇది నా శక్తి' లేదా 'భగవంతుని శక్తి నాలో వుంది' అని కాకుండా 'ఒక దివ్యశక్తి నా మస్తిష్కంలో శరీరంలో పని చేస్తుంది, అదే శక్తి అంతమంది మానవులలోను, జంతువులలోను, వృక్షములలోను, లోహములలోను, చైతన్యశీల ప్రాణులలోనే గాక అచేతన జడ పదార్థాలలో కూడా నిండి ఉంది' అనుకోవాలి. సమస్త ప్రాణులలోను, విశ్వమంతటా ఆ ఒక్క దివ్యశక్తే ఆ దైవకార్యం, క్రమ ఆత్మ — ప్రకటవ జరిపించడానికి సమాన ఉపకరణ రూపంలో పనిచేస్తున్నదనే విశాల దృక్పథం కలిగినప్పుడు, అదే మన సంపూర్ణ అనుభవమయినప్పుడు, అది మన రజోగుణయుక్త అహంకారాన్ని మన నుండి పారద్రోలడానికి సహాయపడటమే గాక మన సాత్విక అహంభావము కూడా మన స్వభావం నుండి దూరమవడం మొదలవుతుంది.

CWSA 23:250

మన స్వామి మనతో నడుస్తారు

కాని ఇది ఒక సుదీర్ఘ కష్టతర యాత్ర చివర్లోనే జరుగుతుంది. కాని మనకి పనులను విధించే ఆ యజమాని యోగమార్గంపై నడిచే ఆ అన్వేషకుని కలుసుకోవడానికి అతని జీవితం పైనా, పనుల పైనా తన రహస్య లేక సగం కన్పించేటట్లు చేసే తన

చేతిని అతని మీద, అతని జీవితం, కర్మల మీద అప్పటిదాకా వేచి వుండడు. అతనదివరకే ప్రపంచంలో అచేతన యొక్క దట్టమైన ముసుగు వెనుక కర్మలను పుట్టించువానిగా, స్వీకర్తగా జీవనశక్తిలో దాగి, మనస్సుకు సంకేతరూప దైవరూపాలు, దైవశక్తి లేక దైవత్వము ద్వారా గోచరిస్తాడు. బహుశా ఈ మారువేషాలలోనే అతను మొదట పూర్ణయోగ సాధనా మార్గానికై ఉద్దేశించబడ్డ అంతరాత్మను కలుసుకుంటాడు. లేక ఇంకా అస్పష్టమైన ముసుగులను ధరించి అతడు మనకు ఒక ఆదర్శంగానో లేక ప్రేమశక్తి, శివం, సుందరం లేక జ్ఞానరూపంగా మానసీకరించబడిన అమూర్తశక్తిగా మనకు ఊహకు కన్పిస్తాడు. లేక మనం ఆ దారి దిశగా అడుగు వేసినప్పుడు అతడు మానవజాతి పిలిపు అనే ముసుగులో రావచ్చు. లేక అంధకారం, అనృతత్వం, మృత్యువు, బాధ — అవిద్యకు సంబంధించిన గొప్ప చతుష్టయం — పట్టు నుండి ప్రపంచాన్ని విడిపించడం వైపు నడిపించే, వస్తువులలోని పరమ ఇచ్ఛగా మన దగ్గరకు వస్తాడు. మనం ఆ మార్గం లోనికి ప్రవేశించినప్పుడు, అతడు తన విశాల శక్తివంతమైన ముక్తి నొసగు ఆవైయ్యక్తికత ద్వార చుట్టుముట్టడమో లేక ఒక వైయ్యక్తిక దేవతారూపాన్ని, ముఖాల్ని ధరించి మనకు దగ్గరగా కదలి వస్తాడు. మన యందు, మన చుట్టుపక్కల మనల్ని కాపాడి, రక్షించి అనుభవైకవేద్యమైయ్యే ఒక శక్తి మన అనుభవం లోనికి వస్తుంది. మనకి దారి చూపే ఒక స్వరం వినబడుతుంది, మనకంటె గొప్పదైన ఒక చైతన్యపర ఇచ్ఛ మనల్ని శాసిస్తుంది, మన పనులను, మన ఆలోచనలనే కాక మన శరీరాన్నే ఒక తప్పించుకోలేని అద్భుత శక్తి నడుపుతుంది. ఎల్లప్పుడూ విస్తృతమౌతుండే చేతన మనదాన్ని స్వాహా చేస్తుంది, జ్ఞానము యొక్క ఒక దైవిక కాంతి అంతర్గతంగా మనల్ని ప్రకాశింప చేస్తుంది; లేక ఒక దీవన మనల్ని ఆక్రమిస్తుంది. ఒక ఘనిష్ట, ప్రబల, అపారమైన బలము పైనుండి మనలను నొక్కిపెట్టి మనలోనికి చొరుచుకొనిపోయి మన స్వభావ అసలు ద్రవ్యంలోనికి ప్రవేశిస్తుంది. ఒక శాంతి, ఒక కాంతి, ఒక బలము ఒక ఆనందము, ఒక గొప్పతనము అక్కడ నెలకొని ఉంటాయి లేక అక్కడ ఇదే జీవితమను రీతిలో ప్రేమంత మధురమైన, ఆకాశము వలె ఆవరించియున్న లోతైన జలధి లాంటి లోతులా వ్యక్తిగత, ఘనిష్ట సంబంధా లుంటాయి. మనకి తోడుగా మన పక్క నడిచే ఒక స్నేహితుడు,మన హృదయ రహస్యంలో వసించే ఒక ప్రేమికుడు, మన పనులలోను, ఇబ్బందులలోను

దారి చూపే గురువు, సమస్త వస్తువుల సృష్టికర్త మనలను తన సాధనంగా మలచుకుంటాడు. మనం ఆ శాశ్వత శ్రీమాత చేతులలో ఉన్నాం.

CWSA 23:261-62 *భావానువాదం: డా. విజయలక్ష్మి*

దివ్యగురువు, ఆయన శక్తియందు ప్రగాఢ విశ్వాసం

మన స్వభావం సంకల్పంలో పొరపడేదే గాక, జ్ఞానంలో, అజ్ఞానయుతమైన దేగాక శక్తిలో బలహీనమైందికూడా. కాని దైవ క్రియాశక్తి వుంది, దానియందు మనకు ప్రగాఢ విశ్వాసముంటే అది మనల్ని నడుపుతుంది. అది మన లోపాలను, శక్తులను దివ్య కార్యానికి ఉపయోగిస్తుంది. మన తక్షణ లక్ష్యాన్ని అందుకోలేక పోతే, అందుకు కారణం మన ఓటమిని ఆయన ఉద్దేశించాడు గనుకనే. తరచుగా మన కందుబాటులో వుండే తక్షణ, సంపూర్ణ విజయం కంటే యధార్థతరమైన పరిష్కారానికి సరియైన దారిగా మన ఓటమి లేక దుష్ఫలితం, అవుతుంది. మనం బాధ పడ్తున్నాం అంటే అర్థం మనలో ఏదో ఒక అరుదైన ఆనందం ప్రాప్తించటానికి సన్నద్ధం కావలసి వున్నదన్నమాట. మనం తడబడ్డామంటే, మరింత చక్కగా నడవటానికి గల రహస్యాన్ని మనం నేర్చుకొనడానికి అన్నమాట. మనం శాంతిని శుద్ధతను పరిపూర్ణతను సైతం సంపాదించడానికి కోపంతో ఊగిపోతూ తొందరపడకూడదు. శాంతి మన దవ్వాలి. తప్పదు. కాని అది ఒక శూన్య లేక నాశనం చేసే స్వభావం కలది లేక చిత్రమైన లేక మనం వాటి తీవ్రతను, ఉత్సాహాన్ని వత్తిడిచేసే శక్తిని అసమర్థమైన వాటిగా తయారుచేసాం. కనుక, యితరమైన వాటిమీద ఆధారపడకుండా వుండే, అంగవైకల్యం చేయబడిన సామర్థ్యాలు గల శాంతికాదు మనకు కావలసింది. పరిశుద్ధత, మన లక్ష్యం, కాని నిరర్థకమైన లేక ఒక నిస్తేజమైన, కఠిన నిర్జీవ పరిశుద్ధత కాదు. మన నుండి పరిపూర్ణతకోరబడింది. తన పరిధిని సంకుచిత పరిమితుల మధ్యకు కుదించు కొన్నందు చేతనే మన గలిగే పరిపూర్ణతగాదు. లేక అనంతుని అంతులేని విధంగా వెలువడుతుండే ఆత్మ విస్తారతకు సంశయాస్పదంగా ముగింపు పలికే పరిపూర్ణతగాదు. మన ఉద్దేశ్యం దివ్య స్వభావంలోనికి మార్చడం, కాని దివ్యస్వభావం ఒక మానసిక నైతిక మైనది గాక అదొక ఆధ్యాత్మికస్థితి, సాధించడం కష్టం, మన మేధస్సుచే

దానిని ఊహించడం కూడా కష్టం. మన కార్యానికి మన యోగానికి గురువైన వానికి జరుగవలసివున్నది తెలుసు, ఆతనికున్న స్వంత ఉపాయాలద్వారా, అతని స్వంత రీతిలో మనలో ఆయన పనిచేయడానికి మనం తప్పక ఆయనను అనుమతించాలి.

CWSA 23:246-247 — అనువాదం: కె.వి. రావు.

వ్యక్తిగత మోక్షానికై ఆరాటపడకండి

వ్యక్తిగత మోక్షం ఎంత ఉన్నతమైనదైనా అది "అహం" లోనుండి జనించినదే! అది వ్యక్తి శ్రేయస్సుకు, స్వభావానికి లేదా వ్యక్తిగత మోక్షానికి మాత్రమే సంబంధించినది. కాని అదే జీవిత పరమావధి అని అందరూ అనుకుంటారు. ఇది కూడా ఒక విధంగా స్వలాభాపేక్షయే. కాని 'అహాన్ని' వదిలించుకోవాలంటే 'స్వలాభాన్ని' కూడా వదిలించుకోవాలిగదా! అసలైన దైవారాధనలో దైవత్వ భావనే కాని వ్యక్తిగత ప్రయోజనం ఏ కొంచెం ఉండకూడదు. జీవితలక్ష్యం దైవాన్ని చేరుకోవటమే కాని దైవాన్ని స్వప్రయోజనం కోసం ఉపయోగించటం కానే కాదు. ఇదే ఆధ్యాత్మికత అంతరంగ సత్యం.

ఇంతేకాదు, 'ముముక్షువులు' నిజంగా కోరాల్సింది కూడా ఇదే. బుద్ధుని కథలు కూడా దీనినే ప్రభోధిస్తాయి. తనకు "నిర్వాణం" సిద్ధించే తరుణం దరికి రాగానే బుద్ధుడు ఈ కోరికనే కోరాడు. అంటే "సర్వమానవ కళ్యాణం". ఇదే ఆయన ఆకాంక్షించినది. ఏ ఒక్క జీవి దుఃఖంలో కృంగి పోయినా తనకు సిద్ధించనున్న "నిర్వాణం" వృధా అయినట్లేనని ఆయన విశ్వసించాడు. ఇతర జీవులు భాధలు దుఃఖాలు లేని నాడే తాను నిర్వాణాన్ని ఆహ్వానిస్తానని ప్రమాణం కూడా చేసాడు. భాగవత సారాంశము ఇదే. "అష్టసిద్ధులను కాని అమరత్వం కాని నేను కోరను. నా చుట్టూ ఉన్న ప్రాణుల కష్టాలను నావిగా నేను స్వీకరిస్తాను. ఆ విధంగా వాటి దుఃఖం అంతం చేయాలనుకుంటున్నాను." ఇదే భాగవతంలోని ఒకానొక శ్లోక సారాంశము.

CWSA 23:269-70



శ్రీమాత సూక్తులు

తొలిమెట్టు ఇదే. జీవాత్మలను ప్రాపంచక ఆకర్షణలలో పడకుండా మరలించుటయే యోగం యొక్క పరమలక్ష్యం. అసలు 'అహం' యొక్క చేతన ఎలా వుంటుందో, ప్రాపంచిక ఆకర్షణలలో అది ఎలా మునిగితేలుతుందో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు.

వ్యక్తులు బాహ్య ప్రపంచంలోని ఆకర్షణలకు సహజంగానే లోనౌతారు. వారి చేతన బయట ప్రపంచంలోనే తిరుగాడుతూ ఉంటుంది. మనం చూస్తున్నవీ, చేస్తున్నవీ, తెలుసుకోవాలను కునేవి మనలోని సత్యంవైపు మనసును మళ్ళించకుండానూ, దైవసాక్షాత్కారాన్ని కోరకుండానూ చేస్తుంది. అది, మనసు, బాహ్యప్రపంచం వైపే చూస్తూవుంటుంది. ఇదే దాని ప్రాథమిక చలనం.

మన పనులలో మనం మునిగిపోతాం. చుట్టూ ఉన్న వారితో కాలక్షేపం చేయుట లోనే కాలం గడుస్తుంది. దైనందిన జీవనమే లక్ష్యం అనుకుంటాం. తినటం సంభాషించటం, నిద్రించటం, ఏదో పని చేయటం మధ్య మధ్య సరదాగా గడపచం మనకు కాలక్షేపం. ఇదే మరల మరల పునరావృత్తం అవుతుంటాయి.

ఇక "వాళ్ళేమనుకుంటారు, వీళ్ళేమనుకుంటారు ఇంకా ఏం చేయాలి" అనే

వాటిపై ధ్యాసంతా ఉంటుంది. అదే విదంగా బాగున్నారా? ఆరోగ్యం ఎలా వుంది? అనే ప్రశ్నలు కూడా మామూలే. అందరి ఆలోచనలూ ఇవే!

ఇక మనం ప్రాధమికంగా చెయ్యాల్సింది మాట్లాడుకుందాము. ఈ విషయం అంత తేలికైనది అనుకోవద్దు. ముఖ్యంగా తెలుసుకోవాల్సింది ఏమిటంటే మనం ఎందుకు జన్మించాము. ఎందుకు జీవిస్తున్నాము; మన ఉనికికి అర్థం ఏమిటి? అవే మన ప్రశ్నలు అని తెలుసుకోవాలి. మన ఉనికి, ఉనికి కోసమే అనేది సరియైన భావనకాదు. బాహ్యప్రపంచానికి సంబంధించిన ఆలోచనల నుండి క్రమంగా ఉపసంహరించుకోవాల్సిందే. ఇదే ఇక్కడి సాధన.

బాహ్యప్రపంచాన్ని గమనించండి. కాని దాన్ని చేతనలో వెనుకకు పంపించండి. జీవితానికి లక్ష్యం ఏమిటో దాన్ని ఎలా సాధించాలో అన్న సమస్యపై ధ్యాస పెట్టండి. ఇదే తొలి అడుగు. జీవించటం కంటే జీవిత లక్ష్యాన్ని సాధించటమే మన ముఖ్య కర్తవ్యం. బాహ్యప్రపంచ ఆకర్షణలనుండి క్రమంగాను, పూర్తిగాను చేతనను ఉపసంహరించి, శోధించి సాధించాల్సిన సత్యాన్ని గురించి అన్వేషించండి. ఇదే మన మొదటి గమనం.

పరోక్షంగా ఉన్న దానిని గమనించండి.

శ్రీ అరవిందుల మాటలనే ఉటంకిస్తాను. దివ్యత్వపు పనితీరు అహం చే కప్పబడిన మన సాధారణమనసుకు అర్థం కాదు. భ్రమ ప్రమాదాలకు గురి యౌతూనే మనం సత్యాన్ని పరిపూర్ణత్వాన్ని, శాంతిని ఆకాంక్షిస్తున్నాము. అక్రమం ద్వారా సక్రమానికా, అదెలా సాధ్యం? లోపభూయిష్టమార్గం సత్యానికి ఎన్నడూ దారి చూపదు!

మనం ఎల్లప్పుడూ పాత అలవాట్లు, భావాలతోనే పెరుగుతున్నాం. మనం చేస్తున్నవన్నీ అలవాటుగా మనలో స్థిరపడ్డ భావాలే. ఇది ఇలాగే ఉంటుంది. కాబోలు అని అనుకుంటాం. మనకు ఏదీ వింతగా కనపడదు. అలవాట్లు అయిన పిదప వింతగా ఏదీ తోచదు!

మాట వరుసకు చెపుతున్నాను: ఈ అలవాట్ల నుండి బయటపడి క్రొత్త కోణంలో ఆలోచించటం మొదలుపెట్టగలిగితే, మనం చేస్తున్నది మనకే ఎంతో క్రొత్తగా

తోస్తుంది. వెనుకటి అలవాట్ల ప్రకారం మామూలుగా వున్నవి, ఈ విభిన్న కోణం నుండి చూస్తే వింతగా కనిపిస్తాయి.

కార్య, కారణ, సంభంధాల విషయంలోనూ మన ఆలోచనలు వేరు. వాటి మధ్య ఉన్న సంబంధాల (అనుబంధాలు) విషయంలో మనకు అవగాహన ఉండదు. మనకు తెలిసినదంతా మన వాతావరణంలో నుండి వచ్చిందే కావటం వలన వాటిని గురించి ప్రత్యేకంగా ఆలోచించనే ఆలోచించము. ప్రతిదాన్ని తేలికగా తీసుకుంటాము. కాని బయట ప్రపంచం నుండి వచ్చిన వారి వలె మనం కూడా ఆలోచించ గలిగితే, మనలో మనకే ఇవి వింతగా కనబడుతాయి. ప్రపంచం ఒక విధంగా భౌతిక, మానసిక, ప్రాణిక ఆధ్యాత్మిక భావనల కలయిక. ఇది అందరికీ కనబడే సత్యం. కాని దీనిని దాటి బయటకు వెళ్ళి చూడగలిగితే ఇదంతా ఒకదానిమీద ఒకటి ఆధారపడి పనిచేస్తున్న అమరిక మాత్రమే అనిపిస్తుంది. భౌతికాన్ని మానసికాన్ని దాటి పై చేతనలోకి పోగలిగితే అక్కడ గోచరించే సత్యం వేరు. అది బాహ్యప్రపంచ భావనకు భిన్నంగా వుంటుంది.

మనకు కనిపించే రూపాలు నిజంగా సహజంగాను, సహేతుకంగాను ఉన్నాయనే అనిపిస్తుంది. అవన్నీ అవసరమైనవే అని కూడా అనిపిస్తుంది. కాని వీటి వెనుక దాగి ఉన్న సత్యం ఇందుకు భిన్నంగాను, అద్భుతంగాను, ఉంటుంది. దాన్ని చూడగలిగితే, వివిధ చేతనల మధ్య ఉన్న సంబంధం ఏమిటో తెలుస్తుంది. విభిన్నశక్తులు ఎలా సామరస్యంగా ఉంటాయో తెలుస్తుంది. సాధారణ చేతనకు ఇది అర్థం కాదు. కాని ఊహాతీతమైన ఈ అంతర్గత సత్యమే ఈ ప్రపంచాన్ని నడిపిస్తుంది.

ప్రాతినిధ్య సమూహం

శ్రీమాత తామే స్వయంగా "యోగసమన్వయం" చదువుతారు: " సాధకుడు వ్యక్తిగత సమస్యలపై విజయాలు సాధించిన తరువాత అంతటితో ఆగకూడదు. ఆ విధంగా మరల మరల ప్రయత్నిస్తూనే వుండాలి."

మీరు నన్ను సరిగా అర్థం చేసుకుంటున్నారో లేదో నాకు తెలియదు. కాని, ఒక్కటి మాత్రం నిజం. వ్యక్తిగత అవగాహన నిరంతరమైనది. నీ వరకు నీవు అంతర్గత పరిపూర్ణతను అనంతంగా సాధించుకోవచ్చు. కాని, బయట ప్రపంచం దృష్టిలో అది

నిరవధికం కాదు కదా! ఇది నలుగురుకీ ఉపయోగపడాలంటే కొందరు వ్యక్తులు ఒకటిగాఉండాలికదా!

పూర్వం దేనికైనా 12 సంఖ్య ఆదర్శసంఖ్యగా పరిగణించబడేది. ఏదైనా సాధిం చాలంటే 12 మంది ఉంటే సరిపోతుంది, అనుకునేవారు. మారుతున్న ఆధునిక సమాజంలో అది సరిపోదని అనిపిస్తుంన్నది. ప్రాతినిధ్యం వహించటానికి ఒక బృందం కావాలి. అందులోని సభ్యులు తలా ఒక సమస్యను అధ్యయనం చేసి, దాన్ని అదిగ మించటానికి ప్రయత్నించాలి. ఆ విధంగా పరివర్తన రావాలి. ఇది మీ ఊహకు తట్ట దేమో?

ఇది అంత తేలిక కాదు. ఇందులో అనేక చిక్కులు ఉంటాయి. (నవ్వుతారు) ఈ విషయాన్ని గురించి నేను లోగడ వ్రాసాను. కేవలం చిక్కులేకాదు, అసాధ్యమైన సమస్యలూ ఎదురౌతాయి. వాటిని పరిష్కరించాలి. అసాధ్యాలను పని చేయటం ద్వారా సుసాధ్యం చేయాలి. ఇదే సరియైన అవగాహన. అన్నీ అసాధ్యమైనవే. కాని వీటన్నింటినీ కలిసికట్టుగా ఛేదించి విజయం సాధిస్తేనే మన కార్యక్రమం సఫ లీకృతం అవుతుంది. మృదువుగా సూచించాలంటే "అసాధ్యము" అనకుండా "కష్టసాధ్యము" అంటే బాగుంటుందని నా అభిప్రాయం. ప్రయత్నిస్తే ఏదీ అసాధ్యం కాదు.

ఆనాటినుండి ఈ నాటివరకు మన సంఘం క్రమంగా పెరుగుతూనే వుంది. "యోగసాధన చెయ్యాలని అనుకుంటున్నాము," అని తడవకు ఒకరు వస్తునే వుంటా రు. "అట్లా అయితే మీరు ఇక్కడకే రావాల్సిన అవసరం లేదు." అని అంటూ వుంటాను. ఇక్కడి యోగం అంత సులభమైనది కాదు. ఈ విషయంలో శ్రీఅరవిందులు కూడా ఇలా వివరణ ఇచ్చారు.

"పనిలో ప్రయోజకత్వాన్ని సాధించి ఆ విధంగా పరిపూర్ణత్వాన్ని పొందాలని అనుకుంటే అది సమ్మతమే. కాని ఎవరైనా అమ్మా నాకు చాలా సమస్యలున్నాయి, మీ ఆశ్రమలో వుంటే ఆ బాధలు తొలగిపోతాయనే నమ్మకంతో వచ్చాను." అని అంటే మాత్రం నా సమాధానం ఒక్కటే. అయ్యో ఇక్కడ మీ బాధలు మరింత అధి కము. క్లిష్టతరము. అవుతాయి. అంటాను. నా ఉద్దేశం స్పష్టంగా అదే. సమస్యలు వ్యక్తి కేంద్రంగా ఉంటాయని అనుకోవద్దు. అన్ని సమస్యలూసామూహిక మైనవే! ఆ విధంగా నీ వ్యక్తిగత సమస్యలతోపాటు, సంఘంలో ఎదురయ్యే ఘర్షణలూ,

ప్రతిచర్యలూ, అపశృతులు కూడా అనేకం వుంటాయి. ఒక్కొక్క సందర్భంలో కర్ణ కఠోరమైన మాటలు వినాల్సి వస్తుంది. అలాగే ఒక్కొక్క సారి "అలా జరుగకుండా వుంటే ఎంత బాగుండేది" అని అనిపిస్తుంది. మనం దేన్నయితే వద్దనుకుంటామో అదే ఎదురౌతుంది. "వ్యక్తిగత పరిపూర్ణత్వం కోసం చేసే సాధన." అని అనుకోవటమే వీటి కంతా కారణం. కాని నిజంగా ఈ సమస్యలన్నీ సంఘంనుంచి ఉత్పన్న మవు తున్నాయనీ మన యోగం సమాజం కోసమే నని సాధారణంగా మనం అనుకోము. మన యోగం అందరికీ కావాల్సినయోగం. ఇది కేవలం వ్యక్తిగత సమస్యల పరిష్కా రానికి కాని, వ్యక్తిగత ప్రశాంతతకు కాని దోహదపడేది అని భావించకూడదు. అందుకే ఈ యోగం అంత సులభం. అని నేను చెప్పను. ఇంకెక్కడైనా మీరు యోగసాధన చేసి మీ వ్యక్తిగత ప్రశాంతతను పొందవచ్చు అని చెప్తూ ఉంటాను.

భగవంతుని సేవలో గడపాలని కాని, పనిలో ఏకాగ్రత సాధించాలని గాని మీరు ఇక్కడకు రావాలనుకుంటే సమ్మతమే! కాని ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా వుంటుందనీ, అది యోగసాధనకు అనుకూలంగా ఉంటుందనీ భావించి ఇక్కడకు రావాలనుకునే వారికి నేను చెప్పేది ఒక్కటే. "మరో ప్రదేశం చూచుకోండి, అక్కడి ప్రశాంతతను అనుభవించండి, మీరు రావలిసినది ఇక్కడకు కాదు."

అనువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు

అత్యధికంగా సన్నద్ధం చేసే రెండు విషయాలున్నాయి.

ప్రశ్న: "మన ఏకైక లక్ష్యం స్వయంగా దైవమే. ఆయనకై మనలో యేదో తెలిసో, తెలియకో యెల్లప్పుడూ మన రహస్య స్వభావంలో ఆకాంక్షిస్తూ, వుంది" అని యిక్కడ వ్రాసి వుంది. అమ్మా! ఇలా ఆకాంక్షించే ఆ యేదో యేది?

అమ్మ: అది అస్తిత్వంలోని భాగం, అది ప్రతివానిలోనూ ఒకే విధంగా వుండదు. అది సహజసిద్ధంగా అంతరాత్మిక ప్రభానానికి తెరచుకొంటుంది.

యెల్లప్పుడూ ఒక భాగం — కొన్ని సమయాల్లో అది నిజంగా తెరమరుగున వుంటుంది. దానిని గురించిన స్పృహ మన కుండదు — అంతరాత్మికం వైపు తిరిగి, దాని ప్రభావాన్ని స్వీకరిస్తూ వుంటుంది. ఇది అంతరాత్మిక చేతనకు, బాహ్య చేతనకు మధ్య మధ్యంతరంగా వుంటుంది.

అది అందరిలోను ఒకేవిధంగా వుండదు. ప్రతిదానిలోనూ అది భిన్నంగా వుంటుంది. దేనిద్వారా అంతరాత్మికాన్ని అతను తాకగలడో, యిచట అంతరాత్మిక ప్రభానాన్ని స్వీకరించగలడో ఆ స్వభావ లేక లక్షణంగల బిందువు అది. అది జనంమీద ఆధారపడి వుంటుంది, ప్రతివ్యక్తికీ అది భిన్నంగా వుంటుంది, ఇటువమటి బిందువు ప్రతివానిలోనూ వుంటుంది.

నిన్ను ఆకస్మాత్తుగా త్రోసేవి నీపైకి నిన్ను లేవనెత్తేవి, ఏదో మహనీయమైదానికై ద్వారాన్ని తెరచేవి కొన్ని విషయాలున్నాయని నీకు అనుభూతి కలుగవచ్చు. అది అనేక విషయాలు గావచ్చు. అది ప్రతి ఒక్కరి స్వభావంపైఆధారపడి వుంటుంది. అది దేనియందో ఉత్సాహం పుట్టించే అస్తిత్వభాగం, అది ఉత్సాహోని కుండే యా శక్తి. రెండు ప్రధాన సూత్రాలున్నాయి. తనను తాను హెచ్చుగాగాని, తక్కువగాగాని సంపూర్ణంగా అతనిలో ఉత్సాహం పుట్టించిన విషయంలోనికి నెట్టుకునేందుకు వీలుగా, అతని గొప్ప లేక అల్ప తమస్సునుండి బయట పడేటట్లు చేసే ఉత్సాహసామర్థ్యం యిది. ఉదా: కళాకారుడిని తన కళ కోసం, విజ్ఞాన శాస్త్రవేత్తను తన విజ్ఞానశాస్త్రం కోసం ఉత్సాహపరచడం. సామాన్యంగా, సృజించే లేక నిర్మించే ప్రతివ్యక్తి లోనూ మియా ఉన్ముఖత వుంటుంది. ఒక ప్రత్యేక శక్తి తెరచుకోవడం వుంటుంది. ఒక ప్రత్యేక సంభావ్యత వుంటుంది. అతనిలో అది ఉత్సాహాన్ని సృష్టిస్తూవుంటుంది. ఇది చురుకుగా వున్నప్పుడు అస్తిత్వంలో యేదో మేలుకొంటుంది. అపుడు జరిగిన పనిలో దాదాపు సకల అస్తిత్వపు భాగస్వామ్యం వుంటుంది.

ఇక్కడ అది వుంది: కృజ్ఞత చూపే సహజశక్తిగల వాళ్ళున్నారు. మొత్తం జీవితం వెనుక ఒక అద్భుతం దాగివున్నదనే సంవేదనతో, ప్రతి సూక్ష్మాతిసూక్ష్మ అంశం వెనుక, జీవితపు అతి చిన్న సంఘటన వెనుక, ఒక సర్వోత్కృష్ట సౌందర్యం లేక సమస్త వస్తువుల వెనుక ఉన్న అనంత దివ్య కృపను, ఒక అద్భుతంలాంటి దాన్ని దేన్నో సంవేదించి దానికి ఆర్థ్రతతో, భక్తితో, సంతోషంతోప్రతిస్పందించగల ప్రతిస్పందించే ఉత్సాహపూరిత అవసరం గలవాళ్ళున్నారు.

దేనిని గురించీ జ్ఞానంలేని వాళ్ళు అని చెప్పదగ్గ కొంత మంది నాకు తెలుసు. వాళ్ళకు చదువులేదు, వాళ్ళ మనస్సులు సాధారణమైనటువంటివి, తమను తా మర్పించుకొనే అర్థం చేసుకొనే కృతజ్ఞత కలిగిన యీ కృతజ్ఞతాశక్తి వున్నవాళ్ళు నాకు తెలుసు.

సరే, వాళ్లకు అంతరాత్మికంతో సంస్పర్శ చాలా తరచుగా, దాదాపు నిరంతరంగా, వాళ్ళకున్న శక్తి మేరకు సచేతనంగా జరుగుతుంటుంది. బాగా తెలిసినట్లుగాదు, కొద్దిగా తెలుసు. తమను తమ కంటె ఉన్నత స్థాయికి యెవరో ఉద్ధరించారని, యెత్తారని, సహాయం చేసారనే అర్థంలో వాళ్ళకది తెలుసు.

ఈ రెండువిషయాలు జనాన్ని చాలా ఎక్కువగా సన్నద్ధం చేస్తాయి. పుట్టుకతోనే వాళ్ళకు వాటిలో యేదో ఒకటి వుంది. వాళ్ళు గనుక శ్రమ పడితే అది క్రమంగా అభివృద్ధి చెందుతుంది. పెరుగుతుంది. ఉత్సాహ సామర్థ్యం అంటే నిన్ను నీ దయనీయస్థితి నుండి, అధమ అల్ప అహంనుండి బయటపడవేసేదేదో అది. ఉదారమైన కృతజ్ఞత, కృతజ్ఞతకుండే ఔదార్యత కూడా అల్ప అహంనుండి కృతజ్ఞత తెలుపుకోవడంలో తనను తాను బయటపెట్టుకొంటుంది. తన చైత్యపురుషునిలో దైవంతో సంపర్కంలోనికి ప్రవేశించడానికి యీ రెండు (ఉత్సాహం, కృతజ్ఞత) అనేవి అత్యంత శక్తివంతమైన లీవర్లు. (లీవరు అంటే తక్కువ శ్రమతో యెక్కువపని చేయడానికి ఉపయోగించే ఒక సాధనం. అను). ఇది చైత్యపురుషునితో అనుసంధానించే కొక్కెం. నమ్మకమైన కొక్కెం.

CWM 7

రెక్కలున్నది మనస్సుకు కాదు, హృదయానికి

రెక్కలున్నది తలకు కాదు, హృదయానికి. ఇదిగో యిది.... అవును, అనివార్య అవసరం. తక్కిన దేదీ లెక్కలోనికి రాదు. అదే సర్వం. అది మాత్రమే.

అందుచేత, చివరకు అవరోధాలను, యిబ్బందులను అతజు కించిత్తు కూడా పట్టించుకోడు. అది నిన్నేం చేయగలుగుతుంది?... అదిలెక్కలోనికి రాదు. అతడు కాలాన్ని చూచికూడా నవ్వుతాడు. అది చాలా కాలం తీసుకొన్నా నీకేమి అవుతుంది? ఎందుకనంటే (కాలంపట్టినందువల్ల) దీర్ఘకాలంపాటు ఆకాంక్ష, సమర్పణ, ఆత్మనివేదనల సంతోషం నీకుంటుంది.గాదా!

ఎందుకనంటే యిదే యదార్థమైన సంతోషం.అహంకారికమైనదేదైనా వుంటే యీ సంతోషం నెమ్మదిగా తగ్గిపోతుంది. ఎందుకనంటే నీ అర్పణలో యేదో కలగలిసిపోయిన ఒక అభ్యర్థన — దాన్నతడు అవసరం అనవచ్చు — వుంది. అలా గాకపోతే సంతోషం యెప్పుడూ అదృశ్యం అవ్వదు.

అతడు మొట్ట మొదట పొందేది దీన్నే. చివరకు, సాక్షాత్కరింపజేసుకునేదీ దీన్నే.

అది విజయ చిహ్నం

నీవు ఒక నిరంతర స్థిరమైన ప్రశాంతమైన ప్రకాశమయ, నిశ్చల సంతోషంలో వుండలేనంతకాలం నీవు యింకా నిన్ను పరిశుద్ధం చేసుకోవలసి వుంది. కొన్ని సమయాల్లో బాగా శ్రమించవలసివుంది అని అది నీకు తెలియజేస్తుంది. కాని ఇది దానికి గుర్తు.

బాధ, బాధపడడం, దుఃఖం, అజ్ఞానం తదితర అసమర్థతలనీ, యెడబాటు అనే భావం నుండి దాపురిస్తాయి. ఒక పరిపూర్ణ ఆత్మార్పణ, సంపూర్ణ అర్పణలో తన ను తాను మరచిపోవడంతో బాధ పడడం అదృశ్యమౌతుంది. దాని స్థానంలో యేదో ఆచ్ఛాదించలేని ఒక సంతోషం నిలుస్తుంది.ఈ ప్రపంచంలో ఈ సంతోషం ప్రతిష్ఠితమైనప్పుడు మాత్రమే అది యధార్థంగా రూపాంతరం చెందుతుంది. అప్పుడచట ఒక నూతన జీవితం, ఒక నూతన సృష్టి, ఒక నూతన సాక్షాత్కారం వుంటాయి. ముందుగా సంతోషాన్ని చేతనలో ప్రతిష్టించుకోవాలి, తరువాతే పదార్థ రూపాంతరీకరణ జరుగుతుంది., అంతకు ముందు జరుగదు.

నిజం చెప్పాలంటే ప్రత్యర్థియైన సైతానుతో, బాధ పడడమనేది ప్రపంచంలో ప్రవేశించింది. కేవలం సంతోషం మాత్రమే అతనిని నాశనం చేస్తుంది, మరేదీ చేయలేదు. తిరిగి తలెత్తని నిశ్చయాత్మకతతో ఆఖరుకు నాశనం చేస్తుంది.

సృష్టి చేసింది దివ్యానందం, సాధించేదీ దివ్యానందమే. మనుషులు సంతోష, మనిపించే దాన్ని గురించి కాదు. నేను మాట్లాడేది అని గుర్తుంచుకోండి, అది దాని రేఖా మాత్ర చిత్రం కూడా కాదు, నేననుకోవడం అతడిని దారికోల్పోయేటట్లు చేసేందుకు పిశాచి సంబంధ నూతనోత్పాదన, అది భౌతిక సుఖం నుండి మరుపు నుండి, ఉదాసీనత నుండి లభించే సంతోషం కాదు.

ఏది పరిపూర్ణ శాంతి, నీడలేని వెలుగు, సామరస్యత, సంపూర్ణ సౌందర్యం, అప్రతిహత శక్తియో ఆ సంతోషాన్ని గురించి మాట్లాడుతున్నాను. సారతః దివ్యేచ్ఛలో, సాక్షాత్కారంలో, స్వయంగా దివ్య సన్నిధి అయిన సంతోషాన్ని గురించి నేను మాట్లాడుతున్నాను.

CWM 7: 396-397 అనువాదం: కె.వి.రావు

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2018

యోగః పునరావిష్కారము

రెండవ భాగము




రెండవ భాగము

విషయసూచిక

పూర్ణజ్ఞాన యోగం

వదిలించుకోవాల్సిన ఆ ఒక్కటి

సాంప్రదాయక సనాతన జ్ఞానమార్గం పరిత్యాజ్యం అనబడు విసర్జన విధానంతో కొనసాగుతుంది. క్రమానుసారంగా దేహాన్ని, జీవాన్ని, ఇంద్రియాలను, హృదయాన్ని, అసలు వాటికి సంబంధించిన ఆలోచననే నిరాకరించి, నిశ్చలమైన పరమాత్మలోనో లేక అపారమైన శూన్యంలోనో లేక అనిర్దిష్ట నిరపేక్షంలోనో వాటిని విలీన మొందించడానికి సాగిపోతుంది. పూర్ణజ్ఞాన మార్గం ఉద్దేశం ప్రకారం మనమంతా ఒక సమగ్ర ఆత్మ-సిద్ధిని పొందగల స్థితికి చేరాలి. అందులో పరిహరించవలసినవి మన స్వంత మైమరపును, అజ్ఞానాన్ని, అజ్ఞాన ఫలితాలను. విసర్జించవలసింది అహంకారంగా రూపొందే అస్తిత్వ మోసపూరిత లక్షణం; అప్పుడు మన నిజ అస్తిత్వం మనలో వ్యక్తమవుతుంది. విసర్జించవలసింది మన శారీరక ఉనికి యొక్క యాంత్రిక పరిభ్రమణం, కేవలం ప్రాణిక తృష్ణగా రూపొందే జీవిత మాయాజాలం; అప్పుడు దైవశక్తిలో ప్రభావితమగు మన నిజ జీవితం గోచరమౌతుంది, భగవంతుని ఆనంద పారవశ్యతలోని సంతోషం లభ్యమౌతుంది. విసర్జించవలసిన భౌతిక డాంభికాలకు, ద్వంద్వ సంవేదనలకు లోనయ్యే ఇంద్రియ లాలసతను; అప్పుడు సమస్త వస్తు సముదాయంలోని దివ్యత్వానికి తెరుచుకొని, దైవికంగా వాటికి దీటైన సమాధానవ మీయగల ఉన్నత జ్ఞానం మనలో ఉదయిస్తుంది. విసర్జించ వలసింది హృదయాన్ని పంకిల మొనర్చే కామ, క్రోధ,లోభ,



యోగప్రక్రియలో మూడు దశ లున్నాయి. వాస్తవానవికి వాటి మధ్య అంతగా భేదం కనిపించదు లేదా అవి వేర్వేరుగానైనా కనిపించవు, కాని కొంత మేరకు ఒకదాని నొకటి అనుసరిస్తాయి.

మొదట, కనీసం ప్రాథమికంగా, ఊతమీయ గలిగే ఆత్మ ఔన్నత్యంతో పాటు దైవసంపర్కం సమకూరే దిశగా ప్రయత్నం ఉండాలి. తరువాత, ఏది సర్వోత్కృష్టమైనదో, దేనితోనైతే మన సంపూర్ణ చేతనాయుత అస్తిత్వ పరివర్తన కోసం అంతర్ముఖ సన్నిహిత సంబంధం ఏర్పరుచుకున్నామో, దానిని స్వాగతించాలి. చివరిగా, పరివర్తన చెందిన మానవజాతిని ప్రపంచ మందొక దివ్యకేంద్రంగా ఉపయోగించాలి.

CWSA: 23:58-59 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

మోహ, మనోవికారాలను, కోరికలను, ద్వంద్వ భావనలను; అప్పుడు మనలో ఒక గాంభీర్యతను సంతరించుకున్న హృదయం. సర్వజీవుల పట్ల దానికున్న ప్రేమతోను, భగవానుని ప్రతిస్పందనకై దానికున్న తీవ్ర తపనతోను, అపారమైన ఆకాంక్షతోను తెరుచుకో గలదు. విసర్జించ వలసింది ఆలోచనలను అంటిపెట్టుకొని వున్న అరకొర మనో నిశ్చయాలను, పొగరుబోతు ప్రతిపాదనలను, నిరాకరణలను, సంకుచిత మినహాయింపులతో దానిని తీవ్రతరం చేసే ఆలోచనా పరంపరల అవాస్తవికతను; అప్పుడు అన్నింటి వెనుక వున్న నిపుణతగల ఉన్నత జ్ఞానసంపద భగవంతుని నిజమైన పరమ సత్యతను, అంతరాత్మకు, మహాప్రకృతికి, విశ్వానికి తెరుచుకో గలదు.

CWSA 23:291-92

ఏకాగ్రతా శక్తి

ఏ విషయంపైన నైనా గానీ, అది ఏమైనా గానీ, ఏకాగ్రత వహించటంద్వారా దానిని గురించిన అవగాహన ఏర్పడుతుంది. దానిలో నిగూఢమై ఉన్న రహస్యాలు వెల్లడి అవుతాయి. ఈ శక్తిని విషయాలను తెలుసుకోవడానికి వినియోగించకూడదు, కేవలం ఏ విషయంలోనైతే దైవం స్వయంభువై ఉన్నాడో దానిని తప్ప. ఏకాగ్రతలో మరో ప్రయోజనం ఉంది. సంకల్పబలాన్ని యావత్తు సమీకృతం చేసుకొని ఏదైతే ఇప్పటికీ అగ్రాహ్యమై ఉన్దో, ఏది ఇప్పటికీ మనకు అంతుచిక్కలేదో అది తెలుసుకోవాలి. ఈ శక్తికి తగినంత తర్ఫీదు నిచ్చి, తగినంతగా ఏకోన్ముఖం చేసి, తగినంత శ్రద్దా సక్తిని గరిపించి తనపై తనకు నమ్మకం కుదిర్చి కేవలం తనపై తనకు మాత్రమే విస్వాస పాత్రత కలిగించి, దృఢమైన విశ్వాసం కుదిర్చినట్లయితే దానిని ఏ వస్తువునైనా, అది ఎలాంటిదైనప్పటికీ, దానిని సముపార్జించడం కోసం ఉపయోగించవచ్చు. అయితే, దానిని ప్రపంచమందు అందుబాటులో వున్న అనేక వస్తుసముదాయాలనువశం చేసు కొనుటకు వాడకుండా ఆధ్యాత్మిక పరంగా అనుసరించదగిన విషయం ఏదైతే జ్ఞానసముపార్జనకి తగినదై ఉంటుందో దానిని పొందటానికి వాడాలి. మనం దేనిని ఎన్నుకుంటే దానిగా మారటానికి దానికి చెందిన స్థాయిపై మన అస్తిత్వా న్నంతా కేంద్రీకరించాలి. ఉదాహరణకి శక్తి సామర్థ్యాల సందోహం ముందుండానికి బదులు బలహీనతలు, భయభ్రాంతుల సందోహం ముంగిటనున్నప్పటికీ శక్తి సామర్థ్యాల

స్థాయిపై కేంద్రాకరించడంతో, అది దానిగా మారవచ్చు.లేదా అత్యుచ్ఛమైన స్వస్థత, పవిత్రత, ప్రశాంతత గలవారిగా మారవచ్చు. లేదా, విశ్వగతమగు ఏకైక దివ్య ప్రేమ మూర్తిగా మారవచ్చు. కాని ఈ శక్తిని ఈ విధమైన మార్పును సాధించటానికి కూడ వాడకూడదు అని చెప్పబడింది. అది మన ప్రస్తుతస్థితికన్నా ఎంత గొప్పదైనప్పటికీ, అందుకు బదులు వీటన్నింటినీ ఉచ్ఛమైన, సకల కార్యాచరణలనుండి సర్వ లక్షణాలనుండి విముక్తమైన, స్వచ్ఛమైన సమగ్రమైన దివ్య జీవిగా మారడానికి ఉపయోగించవచ్చు.

CWSA 23:315

ఏకాగ్రత ప్రక్రియ - విధి విధానాలు

ఏకాగ్రతలో అనుసరించవలసిన మొట్టమొదటి నియమం: బయట విషయాలపై తార్కిక విశ్లేషణ చేస్తుండే మనస్సును ఒకే అంశంపై స్థిరంగా నిలిపి దానికి సంబంధించిన ఆలోచనను ఊగిసలాడనీయకుండా కొనసాగించటానికి అలవాటు పరచాలి. ఈ పద్ధతిని మనస్సు అనేకమైన ఆకర్షణలకు పెడదారి పట్టించే పరాయి పిలుపులకు చలించకుండా అనుసరించాలి. మన సాధారణ జీవిత గమనంలో ఇలాంటి ఏకాగ్రతను పాటించడం సర్వసాధారణం. కానీ అట్టి ఏకాగ్రతే బాహ్యమందలి వస్తువులపైగాని, చర్యపైగాని మనస్సును లగ్నపరచకుండా అంతర్ముఖంగా చేయడం కష్టతరమౌతుంది. అయినప్పటికీ జ్ఞాన సముపార్జనపై ఆసక్తిగల వాడికి ఈ అంతర్ముఖ ఏకాగ్రత అనివార్యం. అయితే, ఇది కేవలం మేధాపరంగా ఆలోచించేవారి అనుక్రమంగా సాగే ఆలోచనకాకూడదు. ఎందుకనగా అట్టివారి ఏకైక లక్ష్యం వారి భావాలను, ఊహలను మేధాపరంగా ఒకదాని కొకటి అనుసంధానించడం. అట్టి విధానం లేదా ప్రారంభదశలో సాధ్యమైనంతవరకు అంతరాత్మ యొక్క సంకల్పప్రభావం ఫలవంతమగు ఆలోచనాసారంపై ఒత్తిడి చూపడంతో వాస్తవికత యొక్క బహుముఖ కారణాలు వెల్లడి అయ్యేంతవరకు అవసరమౌతుంది. ఆ విదంగా ఏకాగ్రత కనబరచే అంశం దైవికమైన ప్రేమ అయినట్లయితే, మనస్సు ఏకాగ్రత వహించవలసింది. 'ప్రేమే దైవం' అనే భావన యొక్క మూలంపై, ఆ ఏకాగ్రత కూడా ఏ విధంగా నుండాలంటే, అనేక విధాలుగా సాగే దివ్యప్రేమ వ్యక్తీకరణ ప్రకాశవంతమైన సాధకుని ఆలోచనలోనే కాదు, అతని హృదయంలో అతని అస్తిత్వంలో, అతని దృష్టిలో

ఉత్పన్నం కావాలి. ఆలోచన ముందుగాను, అనుభవం ఆపైన సిద్ధించవచ్చు ఆ రీతిగానే అనుభవంముందుగాను జ్ఞానోదయం తరువాత కలిగవచ్చు. తరువాత సిద్ధించిన అంశంపై దృష్టిని లగ్నం చేసి, అది స్థిరమైన అనుభవంగా మారే పనిపై కేంద్రీకరిరించి చివరికి అది అస్తిత్వం నియమం లేక ధర్మంగా పరిణమించేవరకు దానిని దృఢంగా నిలపాలి.

ఇది తీవ్రమైన ఏకాగ్రతతో చేసే ధ్యానప్రక్రియ. కానీ ఇంతకన్నా దృఢమైన విధానం, మనసునంతా కేవలం ఆ భావన సారాంశంపై కేంద్రీకరించడంద్వారా దానిని గురించిన జ్ఞానాన్ని కాని దాని వెనుకనున్న అసలు విషయం సారాంశాన్నిగాని కనుక్కోవడం. ఈ ప్రక్రియలో ఆలోచన అంత మొందుతుంది. భావానికి సంబంధించిన సారాన్ని జీర్ణించుకున్న లేక దానిని గురించి ఆలోచించే పారవశ్య స్థితిలోకి జారి పోతుంది. లేదా అంతర్గత సమాధి స్థితిలో కలసిపోతుంది.

ఇక మూడవ పద్ధతి: మొదట దానిలో మాదిరి ఒకే అంశంపై ఏకాగ్రతతో తీవ్రంగా ద్యానించడంగాని, తీవ్రమైన ఏకాగ్రతతో ఆలోచనా దృశ్యంయొక్క లక్ష్యంపై ధ్యానించటం కాని కాదు. కాని మొట్టమొదట మనస్సును పూర్తిగా నిశ్చల పరచడం. ఇది అనేక విధాలుగా చేయవచ్చు. ఒకటి మానసిక కార్యాచరణను పూర్తిగా ఆపి, దానిలో ఏ మాత్రం పాలు పంచుకోకుండా వేయకూడని గంతులేయటం, ఎగరటం అధికమై అలసటచెంది పూర్తిగా చలనం లేని స్థితిని చేరేవరకు కేవలం సాక్షిగా నిలవడం. మరొక మార్గం, ఆలోచనాసూచనలు వచ్చినప్పుడల్లా వాటిని మనస్సునుండి త్రోసివేసే అస్తిత్వపు ప్రశాంతతను గట్టిగా నిలుపుకోవడం. ఈ నిలుపుదల మనస్సుయొక్క వ్యాకులత, కోలాహలాల వెనుక ఎల్లప్పుడూ నిలిచి ఉంటుంది. ఎప్పుడైతే ఈ నిగూఢమైన ప్రశాంతతకు తెర తీయబడుతుందో అప్పుడు ఒక గొప్ప నిశ్చలత అస్తిత్వంపై స్థిరపడుతుంది. దానితోపాటు సర్వవ్యాప్తము నిశ్శబ్దము అగు పరబ్రహ్మ జ్ఞానము, అనుభవము సంప్రాప్తిస్తాయి. ఈ ప్రశాంతత ఆధారంగా మిగతా విషయాలన్నీ జ్ఞానం లోను, అనుభవంలోను నిర్మించబడవచ్చు.అయితే, అవి బాహ్యవిషయాలపై కాకుండా దివ్యసాక్షాత్కార మందలి ప్రగాఢమైన వాస్తవికతపై నిర్మితమవుతాయి.

CWSA 23:323-24

నివృత్తి

మన పరిత్యాజ్యం నిజానికి అంతర్ముఖంగా చోటు చేసుకొనే పరిత్యాజ్యం కావాలి. ముఖ్యంగా అన్నింటికీ మించి ఇంద్రియాలలోను, హృదయంలోను కోర్కెలు ఈడే రాలనే సంవేదనలను, ఆలోచనలోను ఆచరణలోను స్వయం సంకల్ప భావాలను, చేతనా కేంద్రంలో అహంకారాన్ని పరిత్యజించాలి. ఎందుకనగా మనల్ని నిమ్న స్వభావానికి కట్టివేసే మూడముళ్ళబంధం ఇదే. వీటిని పూర్తిగా విసర్జించగలిగితే మనల్ని కట్టివేసేది వేరొకటి లేదు. అందువలన వశపరచుకోవాలనే కోరికను మొత్తం మననుండి త్రోసివేయాలి. మనం వశవర్తులం కావలసింది ప్రపంచమందు ఏవీలేవు. సంపద, లేక బీదరికం; సంతోషం లేక బాధ; జీవించడం లేక మరణించడం; గొప్పతనం లేక నీచత్వం; పాపం లేక పుణ్యం; స్నేహితుడు, భార్యాపిల్లలు, దేశం మన స్వంత పని లేక ఉద్యమం; స్వర్గలోకం లేక భూలోకం; వీటన్నింటి లోపల ఉన్నది లేక వాటికి అందుబాటులో లేనిది ఇవేవీ కావు. దీని అర్థం మనం ప్రేమించతగ్గది ఏదీ లేదని కాదు, మనం ఆనందం పొందేది ఏదీ లేదని కాదు, ఎందుకనగా వశపరచు కోవాలనే వాంఛ అహంకార పూరిత ప్రేమ అవుతుంది. కాని అచ్చమైన ప్రేమ కాలేదు. కోరిక అనేది సంతోషం, సంతృప్తి లపై గల గాఢ మక్కువలో ఒక పరిమితిని, ఒక అభద్రతను సూచిస్తుంది. కానీ విషయాల్లో లేక వస్తుసముదాయంలో దివ్యానందం కోసం అన్వేషణను కాదు.....

మనం ఈ వరకే చూచినట్లుగా, దైవకార్యాలలో మనం పరిపూర్ణతను పొందగలిగి నట్లయితే, ఆలోచనలోను ఆచరణలలోను ఆత్మసంకల్పం పూర్తిగా పరిత్యజింపబడి నట్లవుతుంది. మనం దివ్యజ్ఞానమందు కూడి పరిపూర్ణతను పొందతలచుకుంటే అందులో సైతం అది సమానంగా పరిత్యజించ బడాలి. ఆత్మ సంకల్పమనగా మానసిక అహంభావమని అర్థం, అది తనకు తానుగాదాని అభిమానాలకు, అలవాట్లకు, పాత క్రొత్త ఆలోచనావిధాలనాకు, దృక్పథాలకు, సంకల్పాలకు అంటిపెట్టుకుంటుంది. ఎందుకనగా వాటిని అది తనకు స్వంతమైనవిగా లేక అవి తానే అయినట్లుగా పరిగ ణిస్తుంది. 'నేను, నాది' అనే భావన లాంటి సున్నితమైన దారాలను వాటి చుట్టూ అల్లుకుంది. సాలెపురుగు తాను అల్లిన గూడులో తానే నివాసమేర్పరచుకొన్నట్లుగా అందులో వసిస్తుంది. సాలెపురుగు తన గూటిపైదాడిని సహించనట్లుగా తన ఉనికిని

అస్థిర పరచడాన్ని అది గర్హిస్తుంది. కొంగ్రొత్త దృక్పథాలను మనోకల్పనలను తనలో పునః ప్రతిష్టించబూనితే, అది పరాయి పంచన చేరినట్లుగా అసంతృప్తి చెందుతుంది. సాలెపురుగు తన గూడును వదిలి వేరొక గూడులోకి మారినట్లుగా ఈ మమతానురాగాల బంధం మనస్సునుండి పూర్తిగా ఖండించబడాలి. జాగృతమవని మనస్సు లోకం పట్ల, జీవితంపట్ల మక్కువతో అవి తన సహజ మూలకాలుగా భావించి, వాటిని పట్టుకు వ్రేలాడే తన సాధారణ వైఖరిని విడనాడటమేగాక మన స్వంత మానసిక కల్పనలతో బాటు మరే మేధాపరమైన ఆలోచనా వ్యవస్థకు లేక మతపరమగు సిద్ధాంతాలకు లేక హేతుపూర్వక నిర్ణయాలకు మనం బద్ధులం కాకూడదు. మనం మన మనస్సు, ఇంద్రియాల వలలయొక్క బంధాలను తెంచుకోవడమే కాక ఆలోచనా పరుడి వల నుండి కూడా దూరంగా పారిపోవాలి. అలాగే వేదాంతి మతాచార్యుడి మంత్రసహిత బీజాక్షరం మతపరమైన భావజాలవలలో చిక్కుకోకూడదు.

CWSA 23:229-30

అంతః చక్షువే అంతా

ఒకరి ఆత్మసిద్ధి, సాఫల్యత, ప్రయోజనం పొందటం విషయాలు అహంకార పూర్వక భావనలో ఇతరులకు స్వయం సేవగానో లేక పట్టుదల నెగ్గించుకోవడంగానో లేక ఆనందోత్సాహాలలో తేలియాడడంగానో లేక స్వయం తృప్తికై యధేచ్ఛగా సాగే కార్యాచరణగానో కనిపించేటట్లయితే, అట్టి కార్యాచరణను మనం తప్పక చేపట్టాలి. మన అంతరంగ మార్గదర్శనంతో మన కార్యాచరణ చేయాలిగాని, ఇత రుల అభిప్రాయాలని అనుసరించికాదు. తరచుగా పరిసరాలు గొప్ప ప్రభావాలు చూపుతాయి. ఏదో అంతగా పట్టించుకోకుండా బయటచూపరుల కంటికి ఆకర్ష ణీయంగా కనిపించే వేషధారణను ఎన్నుకుందాం. ఆ విధంగా మన అంతః చక్షువులపై ఒక తెర పడటాన్ని అనుమతిస్తాం. బీదరికం ఉట్టి పడేటట్లు లేక సేవ అందిస్తున్నామనే భావన కలిగేటట్లుగా లేక బయటికి నమ్మకం కలిగేటట్లుగా లౌకిక విషయాలపట్ల విముఖత, సన్యాస ధోరణి మచ్చలేని పవిత్రతను ప్రకటిస్తాం. ఎందుకనగా సాంప్రదాయ జనాభి ప్రాయం మననుండి ఆశించేది అట్టి ప్రవర్తనను కాబట్టి. ఆ విధంగా పరిసరాలలో గౌరవప్రదమైన వ్యక్తిత్వం ప్రదర్శించవచ్చు. కానీ ఇదంతా కేవలం ఆడంబరప్రదర్శన, వంచన. ఇలాంటి నాటకీయతను ప్రదర్శించటం అవసరం కావచ్చు. కారణం, అది

మన కార్యక్రమాలకు అనుగుణమైన నడవడి కావచ్చు. కానీ కాకపోవచ్చు కూడా. బాహ్యమందున్న వ్యక్తి దృష్టిని పట్టించుకో నవసరం లేదు. దానికి విలువలేదు. అంతః చక్షువే సర్వస్వం.

CWSA 22: 331 *అందుగులపాటి: కైలాసపతి*

సన్యసించటం - అనుభవించటం

సన్యసించటం అనే ఆలోచన కిచ్చే విశ్లేషణా పరిధి ప్రస్తుతం దానికి ఆపాదిస్తున్న అర్థం కన్నా భిన్నంగా ఉంది.

వర్తమానంలో దాని అర్థం ఆత్మ నిరసన, సుఖ సంతోషాలను త్రోసి పుచ్చటం, వినోదమయ వస్తువులను తిరస్కరించటం.

ఆత్మ నిరసన మనిషి అంతరాత్మ కొరకు అవసరమే. ఎందుకంటే ఆతని హృదయం చాలా అజ్ఞానంతో అనుబంధమై ఉంది. సౌఖ్యాలను అణచి ఉంచటం అవసరం ఎందుకంటే ఆతని యింద్రియాలు విషయభోగాలనే తెనె బురదలో కూరుకు పోయి ఉన్నాయి. సుఖాన్ని కలిగించే వస్తువులు తిరస్కరించబడ్డాయి ఎందుకంటే మనసు ఆ విషయాలకు అంటిపెట్టుకొని ఆపై ముందుకు సాగాలని అనుకోదు. అక్కడే ఆగిపోతుంది. మనిషి మనసు యిలా అజ్ఞానంతో అంటిపెట్టుకొని బందీయై అవిరామంగా, చంచలంగా, వస్తువుల రూపాలతో మోసం చెంది ఉండకపోతే పరిత్యజించవలసిన అవసరంలేదు. అంతరాత్మ ఆనందమార్గంలో పయనించ గలిగి ఉండేది. సూక్ష్మ మైన దానినుండి బృహత్తరమైన దానివైపు సంతోషం నుండి దివ్యానందం వైపుకు. ప్రస్తుతం అవి ఆచరణ యోగ్యం కాదు. లోలోపల దేనికైతే అంటిపెట్టుకొని ఉంటుందో దానిని వదిలి వెయ్యాలి. అందువలన దానిని తన నిజరూపంలో పొందగలుగుతుంది. బాహ్యమయిన సన్యాసం అవసరం లేదు, అది కొంతకాలం వరకూ మాత్రమే ఉపయోగపడుతుంది. కొన్ని విషయాలలో తప్పని సరి. కొన్నిసార్లు అన్నిటిలోనూ ఉపయోగపడవచ్చు. ఇలా కూడా అనుకోవచ్చు. పూర్తి సన్యాసమన్నది ప్రతి అంతరాత్మ ప్రగతి పథంలో తప్పనిసరిగా దాటవలసిన దశ. కాని అది ఆత్మ హింస. తమపై తాము విధించుకున్న భయంకరమైన ఆత్మ వేదన. అలా చేయటం తమలో

వసించే దైవంపట్ల దురుసుగా వ్యవహరించినట్లే. అంతిమంగా ఈ పరిత్యాగం, ఆత్మ నిరసన ఒక దశలో మాత్రమే ఉపయోగపడి గతించిపోతుంది. విషయపు కోరలలో మనసు చిక్కుకున్నంతవరకు మాత్రమే ఆ విషయాన్ని తిరస్కరించవలసి ఉంటుంది. ఎందుకంటే అంతరాత్మ యికపై ఏ మాత్రం విషయాన్ని విషయంగాకాక అది వ్యక్తీకరించే దైవంగా భావించటం ప్రారంభిస్తుంది. విషయానుభవం యికపై ఏ మాత్రం అవసరంలేదు. ఎందుకంటే అవి యింద్రియ సౌఖ్యాన్ని కాక అన్నింటా సమానంగా దివ్యానందాన్ని పొందుతూ ఉంటుంది. వ్యక్తిగతమైన లేదా భౌతికమైన ప్రాప్తి లేకుండా, సుఖానుభూతిని కోరుకోకుండా అంతరాత్మ ఆ వస్తువును స్వయంగా పొందవలసిన అవసరం లేకుండానే దివ్యానందాన్ని అన్నింటా సమానంగా ఆస్వాదించ గలుగుతుంది. ఎప్పుడైతే ఆత్మ దేనినీ నాదీ అని వాదించదో, అన్నింటా ఉండే ఏకాత్మ యొక్క సంకల్పానికి ఎరుకతో విధేయమై ఉంటుందో అపుడు ఆత్మ నిర సన తన క్షేత్రాన్ని కోల్పోతుంది. అపుడే మనం ఈ నియమ నిబంధననుండి సృష్టి ఆధ్యాత్మలో విముక్తమౌతాయి.

CWSA 23:333

వైరాగ్యము

మనం ప్రయత్నిస్తేనే తెలుస్తుంది, మనస్సుకు ఈ వైరాగ్య శక్తి ఉన్నదని అది కేవలం భావనలోనే కాక క్రియలలో కూడా భౌతికంగా ప్రాణికంగా కూడా వేరుగా ఉండగలదని. ఈ మానసిక వైరాగ్యాన్ని శారీరక విషయాలుపట్ల ఒక ఉదాసీనతతో బలోపేతం చేసుకోవాలి. దాని నిద్ర గురించిగాని, మెలుకువ గురించిగానీ, కదలికలు, విశ్రాంతి బాధ, సంతోషం ఆరోగ్యం అనారోగ్యం శక్తి, బలహీనత, సౌఖ్యాలు అసౌ ఖ్యాలు ఏమి తిన్నది, ఏమి త్రాగినది, మొదలయిన వాటిని పట్టించు కోరాదు. అంటే శరీరాన్ని మనం ఉంచగలిగినంత క్రమపద్ధతిలో ఉంచరాదని కాదు, హింసా యుతమైన కఠోర తపస్సు, లేదా భౌతిక స్వరూపాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయటం కాదు, ఆకలిదప్పులు, అసౌఖ్యము, అనారోగ్యముతో. అలా అని కొంత మంది లౌకికము, ప్రాణిక మయిన వ్యక్తులు దానికి ఆపాదించే కొన్ని ప్రాముఖ్యతలకు చాలా అనవసరమైన వాటికి అంటిపెట్టుకోవటం కాదు. ఈ ఉపకరణాల ప్రాముఖ్యతలు కూడా అవసరమనే స్థాయికి పెరగకుండా చూడాలి. ఉదాహరణకు మన మానసిక

స్వచ్ఛత మనం తినే త్రాగే వస్తువులపై ఉంటుందన్న ఊహించుకోవటం. ఒకదశలో త్రాగటం, తినటంపై నిబంధన మన అంతర ప్రగతికి దోహదం కావచ్చు. మనసు, ప్రాణికం, ఆహారం, పానీయాలపై ఆధారపడడం కేవలం ఒక అలవాటు మాత్రమే. ప్రకృతి వీటిమధ్య ఏర్పరచిన సాధారణ బాంధవ్యం అనుకోకూడదు. నిజానికి మనం తీసుకొనే ఆహారాన్ని ఒక క్రొత్తరీతిలో చాలా కనీస పరిమాణానికి తగిన వివేకవంత మయిన ప్రగతిలో దాటిన స్వల్ప భౌతికమయిన వనరులకన్నా, రహస్యమైన ప్రగతిలో వాటికి స్వల్ప భౌతికమయిన వనరులకన్నారహస్యమయిన మానసిక, ప్రాణిక శక్తులపై ఆధారపడగల మహత్తరమైన శక్తి - సామర్థ్యాలు పొందటానికి శిక్షణ నివ్వవచ్చు.

CWSA 23: 343- 344

అంతరిక విభజన:

అందువలన మనోమయ పురుషుడు ఈ యింద్రియమనసు సంబంధం నుండి విడివడి, ఈ యాతనలూ, బాధలూ, కష్టాలు, ఆనందాలు, రాగద్వేషాలు, ఆశ, నిరాశలు, భయక్రోధాలు, హర్షాతిరేకాలు, క్రుంగుబాట్లు, ఈ ప్రాణికమయిన స్థితులు, భావోద్వేగాలు, వ్యామోహాలు ఇవన్నీ పొందేవి. ప్రకృతియొక్క అలవాట్లు, చేతలు, అని తెలుసుకుంటాడు. మనసప్పుడు ఈ ఉద్వేగాలునుండి వెనుకకు మరలి శరీరపు కదలికలు అనుభవాలవలె ఒక పరిశీలనా దృష్టితో, సాక్షీభూతంగా ఉంటుంది. మళ్ళీ లోపల ఒక చీలిక ఉంటుంది. ఈ భావావేశ మనసులో మానసిక స్థితులు, వ్యామోహాలు, ప్రకృతి రీతి ననుసరించి సంభవిస్తూనే ఉంటాయి. ఈ పరిశీలనా మనస్సు వీటిని అవలోకిస్తూ, అధ్యయనం చేస్తూ, అర్థం చేసుకుంటూ, దాని నుండి వేరుగానే ఉం టుంది. వాటిని తాను గమనిస్తూ ఉంటుంది. ఒక మానసిక వేదికపై ఎవరో ఆడుతున్న నాటకంలా మొదట ఆసక్తితో తరువాత మమేకమవుతూ మళ్ళీ నిశ్చల వైరాగ్యంతో, చివరిగా నిశ్శబ్దంగా తన నిర్మలానంద స్వీయ మౌన అస్తిత్వాన్ని పొందుతుంది. ఆటలో నిమగ్నమయిన ఒక పసివాడి ఊహాజనితమైన అసత్య సంతోష దుఃఖాలలా వాటిని వీక్షిస్తూంటుంది.

రెండవది ఎవరి అనుమతి విరమణతో ఈ నాటకం ముగిసిపోతుందో నాటకాన్ని ఆడించే ఆ ప్రభువు తానేననే ఎరుకను పొందుతుంది. అనుమతవిరమించబడినపుడు మరొక గుర్తించదగిన దృగ్విషయం సంభవిస్తుంది. ఉద్వేగమనస్సు నిశ్చలము,

నిర్మలమూ, అయి ఆవేశాల నుండి బయటపడుతుంది. అవి కలిగినప్పటికీ లోపలనుండి ఉత్పన్నం కావు. దేనికైతే యింకా మనసు స్పందిస్తుందో అది బయటనుండి మన సుపై ప్రతిబింబించి, ముద్రను వేస్తాయి. కొంత కాలానికి ఈ స్పందన కూడా ఆగి పోయి ఉద్వేగమనసు కాలక్రమేణ తాను త్యజించిన వ్యామోహాలనుండి పూర్తిగా విముక్తం అవుతుంది. ఆశ, భయం, దుఃఖం, రాగద్వేషాలు, ఆకర్షణ, వికర్షణ సంతృప్తి అసంతృప్తి, ఆనందం కృగిపోవటం, భయం, కోపం, విరక్తి లజ్జాభావం, ప్రేమ, ద్వేషం, విముక్తి పొందిన చైత్యసత్త నుండి రాలిపోతాయి.

CWSA 23:353- 353

ప్రపంచంలో భగవంతుణ్ణి తెలుసుకోవడం, దర్శించటం

పరిమితమయిన దానిలోనూ యోగి భగవంతుణ్ణి తెలుసుకుంటూ దర్శిస్తూ, ఉంటాడు. ఆ దివ్య చైతన్యానికి, దివ్యకార్యానికి వాహికగా ఉంటాడు. కాబట్టి ప్రపంచ జ్ఞానం, జీవితానికి సంబంధించిన దాని నంతటినీ విస్తృతపరచటం, ఉన్నత స్థితికి లేవనెత్తటం అతని కార్య క్షేత్రంలోకి వస్తుంది. అన్నిటిలోనూ భగవంతుణ్ణి చూస్తాడు. ఉన్నతోన్నత సత్యాన్ని దర్శిస్తాడు. అతని జీవన పరమార్థం మానవాళిని భగవత్ జ్ఞానం వైపు, సర్వోన్నత సత్యాన్ని పొందటంవైపు నడిపించడం శాస్త్రం సిద్ధాంతం ద్వారా, తాత్త్వికి చింతనద్వారా సుందరమైన, మంచి రూపాలలో భగవంతుణ్ణి దర్శిస్తారు. జీవితపు అన్ని కార్యకలాపాలలో గతించిన ప్రపంచం చరిత్రలో దాని ప్రభావాలలో వర్తమానంలో దాని పోకడలలో భవిష్యత్తుయొక్క మహత్తరమైన ప్రగతిలో దైవాన్ని చూస్తాడు.ఇందులో ఏదో ఒకదానిలో లేదా అన్నిటిలో తన తేజోమయ దృష్టిని ముక్తిపొందిన తన ఆధ్యాత్మిక శక్తిని తీసుకు రాగలడు. నిమ్న జ్ఞానంనుండి అతడు పైకి ఎదిగాడు. ఉన్నత శక్తి నిమ్నమయిన వాటిని కాంతిమయం చేసి, తనలో లీనం చేసుకుంటుంది. అది కట్టకడపటి అంచు అయినా అత్యంత బాహ్యమయిన వెలుగయినప్పటికీ.

CWSA 23:517-518

యోగం యొక్క నాలుగు అంతర్భూతమైన లక్షణములు - శుద్ధి, ముక్తి, సిద్ధి, భుక్తి

CWSA 24: 639

అజ్ఞాన యుతమూ, పరిమితమూ, అహంకార పూరిత చేతన మాత్రమే అద్భుతాలను కోరుకుంటుంది. ఒకసారి జ్ఞాన సిద్ధి కలిగాక ప్రతిచోటా, నిరంతరం అద్భుతాలే, సంభవిస్తుంటాయని తెలుసుకుంటారు. ఈ అద్భుతంలో కరుణలో మరింత విశ్వాసం ఉన్నప్పుడు దానిని చూడగల అన్ని వేళలా అన్నిటా, దానిని గ్రహించగల సమర్థత పెరుగుతుంది. అజ్ఞానం, అపనమ్మకం మాత్రమే దానిని చూడనీయవు.

CWSA 7: 379

డా. సరోజాప్రసాద్

దివ్యప్రేమ యోగం

పరమోత్కృష్ట అస్తిత్వం

ఈ పరమోత్కృష్ట అస్తిత్వమే సార్వజనీన అస్తిత్వం కూడా, విశ్వంతో మన సంబంధాలన్నీ ఉపకరణాలే, వాటిద్వారానే ఆయనతో సంబందం పొందటానికి మనం సంసిద్ధం చేయబడతాం. మన మీద సార్వజనీన ఉనికి చేసే చర్యలను ఏ మానసిక ఉద్వేగాలతోనైతే మనం ఎదుర్కొంటామో, వాస్తవంగా అవి సరాసరి ఆయనకు ఉద్దేశించినవే. మొట్టమొదట అజ్ఞానంలో మొదలై, వృద్ధి పొందుతున్న జ్ఞానంలో వాటిని ఆయనవైపు సూచిగా నిర్దేశిండంతో, మనం ఆయనతోటి ఎక్కువ సన్నిహిత సంబంధాలలోకి ప్రవేశిస్తాం. మనం ఐక్యతవైపు దగ్గరగా లాగబడుతున్న కొలదీ వాటిలోని అనృతము, అజ్ఞానము అయినవి రాలిపడిపోతాయి. వాటన్నింటికీ ఆయన

"సూర్యకాంత పుష్పం సూర్యుడి వైపు తిరిగినట్లుగా దివ్య సత్యం వైపు తిరగటం చైత్యపురుషుని సహజ స్వభావం దివ్యమైన దేన్నైనా లేదా దైవత్వం వైపు వికసించే ప్రగతిచెందే దేన్నైనా అది అంగీకరించి దానికి అంటిపెట్టుకొని ఉంటుంది. వక్రీకరించే లేదా నిరోధించే దానినుండి అసత్యము, అదైవికమయిన దాని నుండి వెనుకకు మరలుతుంది."

CWSA 25: 153

సమాధాన మొసంగుతాడు, మనం ఉన్న అభివృద్ధి స్థాయినుంచి మనల్ని పట్టుకు పోతాడు. అపరిపూర్ణమైన మన వేడికోలుకు ప్రత్యుత్తరం లేదా సహాయం మనం పొందలేకపోవటానికి కారణం, మనం పరిపూర్ణమైన సంబంధాలను ఎన్నటికీ నెల కొల్పలేము కాబట్టే, మనజులు ఆ విధంగా ఆయనను సమీపించినా కూడా. అదే విధంగా ఆయన వారిని సైతం ఆమోదించి, వారి భక్తికి దివ్యప్రేమతో ప్రత్యుత్తర మిస్తాడు. 'తదైవ భజతే'.

ఎటువంటి అస్తిత్వరూపంలో, ఎటువంటి లక్షణాలతో, తమకున్న దానిని ఆయనకు వారు ఇచ్చుకోవటం జరుగుతుందో ఆ రూపము, లక్షణాలద్వారానే వారు అభివృద్ధి చెందటానికి ఆయన సహాయం చేస్తాడు. వారి సూటైన వంకరైన విధానాలు ఆయన వైపుకు ఆకర్షించే విధంగానే ఆయన వారి పురోగతిని ప్రోత్సహించటం లేదా పాలిం చటం చేస్తాడు. ఏ విధంగా ఆయనను వారు చూసారో అదీ సత్యమే, కాని అది పాక్షికమై, విరూపం చేయబడి దాని సొంత ఉన్నతోన్నత వాస్తవికత ననుసరించి కాకుండా, వారి సొంత అస్తిత్వంలోని, చైతన్యంలోని హద్దులను బట్టి ప్రాతినిధ్యం వహించిన సత్యం. మతం ఎక్కువ మోటైన, ఎక్కువ ప్రాచీనమైన ఆదిమమైన, ద్రవ్యాలకు ఇంకా వాటి తాత్కాలికమైన క్షణభంగురమైన అభిప్రాయాలకు ఇదే తగిన కారణం. అవి సమర్థనీయమైనవే. ఎందువలననగా వాటి వెనుక, దైవం ఉన్నాడనే సత్యం ఉంది కాబట్టి కేవలం అభివృద్ధి చెందుతున్న మానవ చైతన్యం ఉన్న స్థాయిలో మాత్రమే దైవం యొక్క సత్యాన్ని సమీపించడం సాధ్యం. ఆ విధంగానే అది ముందుకు సాగిపోవటానికి సహాయం పొందుతుంది, వాటిని ఖండించటం జరిగింది. కారణం అటువంటి మోటైన భావాలు సంబంధాల మీదనే దృఢంగా నిలబడటమనేది దైవంతో ఎక్కువ సన్నిహితమైన ఐక్యతను తొలగిస్తుంది. ఈ మోటైన ప్రారంభాలు మొదటి అడుగులు, అవి ఎంతగా తడబడి పోయేవైనప్పటికీ.

CWSA 24: 558

లోకాలన్నింటికీ ప్రభువు, ప్రాణులకన్నింటికీ స్నేహితుడు

దైవం ప్రభువుగా కూడా ఎవరినీ శిక్షించడు, ఎవరినీ భయపెట్టడు, విధేయతకు బలవంతం చేయడు. మానవ ఆత్మ స్వేచ్ఛగా దైవం వద్దకు రావలసి వుంటుంది, ఆయన అపారమైన శక్తికి తనకు తానుగా అర్పించుకోవాలి. దాని ఫలితంగా ఆయన

దానిని వశం చేసుకొని, దానిని దివ్య అంతస్థులకు ఉద్ధరించే అవకాశం ఉంది. అపరిమితమైనది పరిమిత ప్రకృతిమీద ఆధిపత్యం చేసే ఆనందాన్ని దానికి కలిగిస్తుంది. దాని ద్వారా స్వార్థాహంకారంనుంచి, నిమ్నతర ప్రకృతినుంచి విముక్తి లభిస్తుంది. ఈ సంబంధానికి ప్రేమ కీలకం, భారతీయ యోగంలోని ఈ దాస్యభావం, సేవ అనేది దివ్యస్నేహితుడికి లేదా ప్రియతమునికి తీవ్ర భావోద్వేగంతో చేసే ఆనంద దాయకమైనసేవ. లోకాల ప్రభువు గీతలో సేవకుడైన భక్తుడి నుంచి గట్టిగా కోరుకునేది, జీవితంలో ఉపకరణంగా తప్ప, మరేమీ కాదు. ఆయన ఈ విధమైన కోరికను స్నేహితుడిగా మార్గదర్శిగా, ఉన్నతోన్నతమైన దివ్యఆత్మగా ప్రకటిస్తాడు. ఎవరైతే ప్రాణులకన్నింటికి స్నేహితుడో, అతడు తనను తాను లోకాలన్నింటికీ ప్రభువుగా, సర్వలోక మహేశ్వరుడిగా వర్ణించి చెప్పుకుంటాడు, 'సుహృదం సర్వభూతానాం' వాస్తవంలో ఆ రెండు సంబంధాలు జతగూడి ఉండాలి. ఏదీ మరొకటి లేకుండా పరి పూర్ణం కాదు. అదే విధంగా విధేయతను గట్టిగా కోరేది సృష్టికర్త అయిన భగవంతుని యొక్క పితృత్వం కాదు, కారణం అతడు మన అస్తిత్వాన్ని తయారుచేసినవాడు, కాని పితృత్వపు ప్రేమ మనలను యోగంలో ఆత్మ- సంయోగం దిశగా సన్నిహితంగా నడిపిస్తుంది. రెండింటిలోను ప్రేమే నిజమైన కీలకం. భయంతో కూడిన ప్రేరణకు సమ్మతి నొసగే దానితో పరిపూర్ణ ప్రేమకు పొసగదు. దైవమూ, మానవ ఆత్మ సన్నిహి తంగా ఉండటమే లక్ష్యం. కాని భయం ఎల్లప్పుడూ హద్దును, దూరాన్ని ఏర్పరుస్తుంది. దివ్యాధిపత్య శక్తి యందు భయ సంభ్రమాలు గౌరవపూర్వకమైన పూజ్యభావం కూడా దూరానికి విభజనకు సంకేతం. అవి ప్రేమసంయోగపు సన్నిహి తత్వంలో మాయమైపోతాయి. అంతేకాకుండా, భయం నిమ్నతరమైన స్వభావానికి నిమ్న తరమైన ఆత్మకు చెందినది. ఉన్నతోన్నత దివ్య ఆత్మను సమీపిస్తూ దానిలోనికి ప్రవేశించటానికి ముందు, దానిని తప్పక ప్రక్కకు పెట్టవలసినదే.

CWSA24: 565-66

ప్రార్థన - దైవంతో సంబంధాలు

ప్రార్థన మొదట మనకు నిమ్నతరమైన అంతస్థులలో ఈ సంబంధానికి సంసిద్ధం చేయటానికి సహాయం చేస్తుంది. అక్కడ అది కేవలం స్వార్థాహంకారం, ఆత్మ భ్రాంతులతో అనుగుణంగా ఉన్నప్పటికీ ; కానీ తరువాత మనం దాని వెనుకనున్న

ఆధ్యాత్మిక సత్యం వైపు రాగలుగుతాం. అటువంటప్పుడు అడిగింది ఇవ్వడం అనేది ముఖ్యమైన విషయం కాదు, కాని సంబంధం దానికదే, భగవంతునితో మనిషి జీవితానికుండే సంబంధం, ఇంకా ఎరుకతో కూడిన ఇచ్చిపుచ్చుకోవడాలు ముఖ్యమవుతుంది. ఆధ్యాత్మిక విషయంలో ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొందటానికి చేసే ప్రయత్నాలలో ఇటువంటి ఎరుకతో కూడిన సంబంధం ఒక గొప్ప ఆధిపత్యశక్తి అవుతుంది. మనం సొంతంగా పూర్తిగా ఆత్మ-నిర్భరత మీద ఆధారపడి చేసే పోరాటమూ, ప్రయత్నాలకంటే, అది ఇంకా శక్తివంతమై, ఎక్కువ పరిపూరితమైన ఆధ్యాత్మిక పెరుగుదలను, అనుభవాన్ని తీసుకువస్తుంది. చిట్టచివరికి తప్పనిసరిగా ప్రార్థన, దేనికోసమైతే, అది మనలను సమాయత్తం చేసిందో, ఆ ఉత్తమోత్తమమైన దానిలో మునిగిపోవటంగాని, వాస్తవానికి విశ్వాసం, ఇచ్ఛ, ఆకాంక్ష, ఆవశ్యకంగా అక్కడ ఉన్నంతకాలం ప్రార్థన అని దేనినైతే మనం అంటామో దానికది అత్యావశ్యకమైనదేమీ కాదు — లేదా కేవలం ఆనందసంబంధం కోసం మాత్రమే మిగిలిపోతుంది. అంతేకాకుండా, దాని లక్ష్యమైనటువంటి, అది కోరుకొని అనుభవానికి తెచ్చుకోవాలనుకునే ధనం లేదా స్వప్రయోజనాలు, ఏ ఉద్దేశ్యమూలేకుండా దివ్యప్రేమ భరితమై, పవిత్రమూ, నిరాడంబరమూ, అయిన ఎటువంటి ఇతర కోరికా లేదా ఆపేక్ష లేనటువంటి అత్యున్నతమైన ప్రార్థనకు మనం చేరుకొనే వరకు, అవి ఉత్తమోత్తమము, ఇంకా ఉత్తమము అవుతాయి.

హృదయంనుంచి దైవానికి ఈ విధమైన వైఖరితో వెలువడే సంబంధాలు బిడ్డతో దివ్యతములగు తండ్రి మరియు తల్లికి ఉండే సంబంధం మరియు దివ్యస్నేహితుడితో ఉండే సంబంధం. మానవ ఆత్మనుంచి సహాయం, రక్షణ, మార్గదర్శనం, ఫలసిద్ధికోసం, లేదా జ్ఞానమే లక్ష్యమైనప్పుడు అది దివ్య మార్గదర్శకునికి దివ్య ఆచార్యునికి జ్ఞానమిచ్చు దివ్యదాతకు ఎందువల్లనంటే దైవమే జ్ఞాన భాస్కరుడు కాబట్టి, అది ఉపశమనం, సాంత్వనం, విముక్తి కోసం శోకంనుంచి బాధనుంచి ఉత్పన్నమైనప్పుడు, దైవానికి ఈ విషయాలు చేరగానే అప్పుడు దానికదే బాధనుంచిగాని లేదా బాధకు నివాసస్థలమైన విశ్వం ఉనికి నుంచిగాని లేదా దాని అన్ని అంతరంగ, వాస్తవికమైన కారణాల నుంచి గాని విముక్తి కావచ్చు. వీటిలో మనం ఒక విధమైన క్రమాన్ని చూస్తాం. ఎందువల్లనంటే పితృత్వసంబంధం ఎల్లప్పుడూ తక్కువ సన్నిహితమూ, తీవ్రమూ, ఆవేశ పూరితమూ, ఆత్మీయము, అయినటు వంటిది, అందువలన అత్యంత సన్నిహిత

సంయోగాన్ని కోరుకొనేవారు, దానిని యోగంలో తక్కువగా అవలంబించటం జరిగింది. అదే దివ్య స్నేహితునితో సంబంధం, ఎక్కువ మాధుర్యము ఎక్కువ సన్నిహితము కావటం మూలంగా అసమానతలలో సైతం మరియు పరస్పర ఆత్మ-సమర్పణల ప్రారంభంలోనూ అది సమానత్వాన్ని ఒప్పుకుంటుంది. దాని అత్యంత సన్నిహితత్వంలో భిన్నమైన సమర్పణలు, స్వీకరణాలు లేకుండా, అవి మాయమైపోయిన తర్వాత, ఆ ఒక్క ఏకైక సమస్త సంతృప్తి కలిగించే ప్రేమ కారణం తప్ప మరే ఉద్దేశమూ లేనిదైనప్పుడు, సృష్టి దివ్యలీలల్లో తోటి ఆటకాడుగా స్వేచ్ఛాయుతమైన, సంతోషదాయకమైన సంబంధంగా అది మారిపోతుంది. కాని ఎక్కువ దగ్గరైనదీ, ఇంకా ఎక్కువ సన్నిహితమైనదీ, దివ్యమాతా, శిశువు సంబంధం. కాబట్టి ఎక్కడ దైవభక్తి ప్రేరణ సమృద్ధంగా ఉత్సుకత్వంతో ఉంటూ, మనిషి హృదయం నుంచి అత్యంత మనః పూర్వకంగా ఉత్సాహంతో ఉబికి వస్తుందో అప్పుడది చాలా పెద్దపాత్రనే పోషిస్తుంది. ఆ అంతరాత్మ దాని అన్ని కోరికలలో, కష్టాలలో మాతృ అంతరాత్మను చేరుకుంటుంది. ఆ విధంగా జరగాలని దివ్యమాత ఆశిస్తుంది. పర్యవసానంగా, ఆమె హృదయ ప్రేమను సమృద్ధిగా ప్రవహింపజేయగలదు. అది ఆమె వైపుకే మరలుతుందికూడా, కారణం ఈ ప్రేమ స్వయంభువమైన స్వభావాన్ని కలిగినదవటం, ఇంకను అది మనకు, ప్రపంచంలోని మన పరిభ్రమణల నుంచి మనం మరలి, మన స్వస్థానంవైపుకు, మనం విశ్రాంతి నొందే, యెడదకు గురిపెట్టి చూపడమూ కారణం.

CWSA 24:567-68

దివ్యప్రియతముని కోసం పరితాపం

కాని అత్యున్నతమైన, ఉత్కృష్టమైన సంబంధం ఎటువంటిదంటే, అది ఎటువంటి సర్వసాధారణమైన మతపరమైన ప్రేరణలతోనూ మొదలయేది కాదు. కాని యోగం అసలైన సారంనుంచి మొదలయేది, అది ప్రేమ వాస్తవికమగు ప్రాకృతిక లక్షణం నుంచి, ఉబికి పైకి వస్తుంది. అది ప్రేమికుని ప్రియతముని రాగం. ఎక్కడెక్కడ ఆత్మకు దైవంతో పూర్తి ఐక్యతకై కోరిక ఉంటుందో, అక్కడక్కడల్లా ఇటువంటి దివ్యపరితాపం చేటు చేసుకొని మతాలలోగూడ ప్రవేశించినప్పుడు, అవి దానిని లేకుండా చేయటంకాని, వాటి సర్వసాధారణ వ్యవస్థలో దానికి చోటు కల్పించకుండా

చేయటంకాని చేశాయనిపిస్తుంది. ఇక్కడ ఒక్క విషయమే అర్థించబడుతుంది. ప్రేమ, ఒక్క విషయం గురించే భయపడటం జరుగుతుంది. ప్రేమభంగం, ఒక్కటే దుఃఖం, అది ప్రేమ వియోగం మూలంగా కలిగే దుఃఖం తక్కిన విషయాలు ప్రేమికుని విషయంలో అసలు మనుగడలోనే ఉండనివి గాని లేదా కేవలం ఘటనలుగా గాని లేదా ఫలితాలుగా మాత్రమే ఉంటాయిగాని ప్రేమకు లక్ష్యాలు లేదా నియమాలుగా ఉండవు. వాస్తవంలో ప్రేమ సమస్తం స్వాభావికంగా స్వయంభువు, కారణం అది అస్తిత్వంలో రహస్యమైన ఏకత్వంనుంచి మరియు ఆ ఏకత్వ భావన నుంచి లేదా ఆత్మలు తమకు తాము ఒకటినుంచి మరొకటి వేరని, విడివడి ఉన్నవని గ్రహించినప్పటికీ, వాటి హృదయంలోని ఏకత్వపు కోరికనుంచి ఉబికి పైకి వస్తుంది కాబట్టి. కనుక తక్కిన ఇతర సంబంధాలన్నీ కూడా కేవలం వాటి ప్రేమకోసం జనించే అస్తిత్వం యొక్క స్వయంభువైనటువంటి కారణంలేని ఆనందంనుంచి మాత్రమే రాగలవు. కాని ఇంకా అవి ఇతర ప్రేరణలలో మొదలై వాటి క్రీడలో సంతృప్తి పొందే వరకు చిట్టచివరి వరకు ఉంటాయి. కాని ఇక్కడ ప్రేమయే ప్రారంభం, ప్రేమయే ముగింపు, మొత్తం లక్ష్యం ప్రేమయే.కాని ఇది కూడా సంపూర్ణమైన స్వయంభూ ప్రేమతో అధిగమించడం జరుగుతుంది. మహాభక్తుని యొక్క చిట్టచివరి గాఢమైన కోరిక కేవలం అతని భక్తి ఎన్నటికీ నశించిపోకూడదని లేక తరిగి పోకూడదని అతను స్వర్గమును లేదా జన్మపరంపరనుంచిలేదా ఏ ఇతర లక్ష్యముతోటి విముక్తిని ఆశించడు, కాని కేవలం అతడి ప్రేమ శాశ్వతంగా ఉండాలని, సంపూర్ణంగా ఉండాలని మాత్రమే అడుగుతాడు.

CWSA 24: 569

మానసిక ఆరాధన ద్వారా దైవాన్వేషణ మూడుదశలు

దైవానికి ఆలోచనలను సమర్పించడమనేది కూడా ఉంది. ప్రారంభంనుంచే (మొట్టమొదటగా మొదలుపెట్టినప్పటినుంచే) ఆరాధించే లక్ష్యం మీద మనస్సును స్థిరంగా నిలపడమనే ఈ ప్రయత్నం చేయబడుతూవచ్చింది, ఎందువల్లనంటే, సహజంగానే అస్థిరమైన మానవ మనస్సు ఇతర విషయాలతో (లక్ష్యాలతో) ఆక్రమించబడి ఉంటుంది. అది ఊర్ధ్వముఖంగా నిర్దేశించబడినప్పటికీ కూడా, ప్రపంచం నిరంతరం దానిని తనవైపుకు ఆకర్షిస్తూనే ఉంటుంది — పర్యవసానంగా అది చిట్టచివరకు

అలవాటుగా ఆయననే స్మరిస్తూ ఉంటుంది. తక్కినవన్నీ కేవలం అప్రధానమైనవికాగా, కేవలం ఆయనకు సంబంధించి మాత్రమే ఆలోచించటం జరుగుతుంది. ఇది తరచుగా భౌతిక ప్రతిబింబాన్ని ఆసరా చేసుకొని చేయడం జరుగుతుంది లేదా, ఎక్కువ సన్నిహితత్వంతో, లక్షణాల సహితంగా, దేనిద్వారా నైతే దైవాన్ని సాక్షాత్కరింప జేసుకొంటామో అటువంటి ఒక మంత్రంతో గాని లేదా ఒక దివ్యనామంతోగాని అది చేయబడుతుంది. మానసిక ఆరాధనతో జరిగే అన్వేషణలో మూడు దశలుంటాయని దీనిని క్రమబద్ధీకరియిన వారు ప్రతిపాదించారు. మొదటిది, నిరంతరంభగవన్నామ మునూ, లక్షణాలను, వాటితో జోడించబడినవన్నింటినీ వినడం, రెండవది, నిరంతరం వాటిమీద లేదా భగవంతుని అస్తిత్వంమీద లేదా వ్యక్తిత్వంమీద ఆలోచించడం, మూడవది, ఒక ఉద్దేశ్యం మీద మనస్సును నిలుపుతూ, స్థిరంగా ఉంచడం, దీని ద్వారా సంపూర్ణమైన సాక్షాత్కారం సాకారం అవుతుంది. వీటి ద్వారా కూడా, వీటితో అనుగుణమైన అనుభూతి లేదా ఏకాగ్రత తీవ్రమైనప్పుడు, సమాధి అనగా పారవశ్యంతో కూడిన మైమరపు స్థితి కలుగుతుంది. ఆ స్థితిలో చైత్యన్యం బాహ్య వస్తువుల నుండి వేరయిపోతుంది. కాని ఇవన్నీ వాస్తవానికి ఆకస్మికంగా జరిగేవి, ఆవశ్యకమైన ఒక్క విషయం, ఏ లక్ష్యానికి పూజ్యభావం, ఉంటుందో, దానికి మానసిక తలంపులో తీవ్రమైన ఆరాధనతో ఉండటం. ఇది జ్ఞానమార్గంలో ఏకాగ్రత వహించటం మాదిరిగానే ఉన్న దైనప్పటికీ, తత్త్వతః దాని లాక్షణికతలో అది భిన్నంగా ఉంటుంది. వాస్తవికతలో దాని లక్ష్యం నిశ్చల స్థితికాదు. కాని, ఒక పారవశ్య పూరక ఏకాగ్రత, అది దైవ అస్తిత్వంలోకి ప్రవేశించాలని కోరుకోదు, కాని దైవాన్ని మనలోనికి తీసుకు రావాలని, ఆయన సన్నిధిద్వారా లేదా ఆయనను స్వాధీనపరచుకోవడం ద్వారా గాఢమైన పారవశ్యంలోకి మనకుమనం సడలిపోయి ముక్తులమైపోవాలని, దాని ఆనందం ఐక్యంలోని ప్రశాంతతకాదు, కాని సంయోగంలోని పారవశ్యత. ఇక్కడ, కూడా, విడివడిన ఆత్మ సమర్పణ ఉండవచ్చు. అది ఈ పారవశ్యతకోసం జీవి తంయొక్క అన్యతలంపులన్నింటినీ వదిలివేయడంలో, తరువాత లోకాల కావలగా నున్న శాశ్వతత్వం లేదా తలపులన్నీ పూర్తిగా దైవానివే అయిన సర్వతోముఖ సమర్పణంతో ముగిసిపోతుంది, జీవితంలోని వృత్తివ్యాపారాలలోని ప్రతి తలంపు ఆయననే గుర్తు చేసుకొంటుంది. ఇతర యోగాలవలెనే ఈ యోగంలోకూడా అదే విధంగా ఒకరు దైవాన్ని ప్రతిచోటా, అన్నింటిలోనూ దర్శించటం జరుగుతుంది.

తన అన్ని అంతరంగ చర్యలలోనూ బాహ్యచర్యలలోనూ దైవ సాక్షాత్కారాన్ని ప్రవహింప జేయటం జరుగుతుంది.

CWSA 24: 574-575

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సమగ్ర భక్తిమార్గము

సమగ్ర భక్తి మార్గ లక్ష్యాలు: 1. ఆరాధ్య దేవత భావనను ప్రపంచీకరించుట లేదా విశ్వీకరించుట. 2. అసంఖ్యాక సంబంధాలలో ఆ మూర్తిని వ్యక్తీకరించుట. 3. అన్ని సత్యాలలోను, స్థిరంగా ఆ మూర్తిని ప్రత్యక్షం చేసుకొనుట. 4. ఆమూర్తికే, ఆ దేవతకే సర్వం సమర్పించి, ఆరాధించి, తన సత్తా అంతటినీ అంకిత మొనర్చుట. 5. వీని ఫలితంగా ఆ దేవతను మన పరిసరాల్లోను, మనలోను జీవింపచేయుట, మనం ఆ దేవత దగ్గర ఆ దేవతలోను, జీవించుట.

మననం, దర్శనం స్థిరంగా ఆలోచించటం దానిని గూర్చి, అన్ని విషయాలలోను ఎల్లప్పుడూ అన్నిటిలోను, ఆ దేవతను చూచుట, అత్యంతావశ్యకం, ఈ విధమైన భక్తి మార్గంలో భౌతికనైజంగల విషయాలను చూచినపుడు, వాటిలో మన ప్రేమకు దివ్యవస్తువును(ఆ దైవాన్ని) చూడాలి. మనుష్యులను ఇతర సత్తాలను చూచినపుడు, వారిలో ఆ దైవరూపాలను చూడాలి. పదార్థ ప్రపంచపు హద్దులను తెంచుకొని వాని ఆవలి తలాలలో గల సత్తాలలో సంబంధా లేర్పరచుకున్నప్పుడు కూడ - ఇదే విధమైన ఆలోచనా పద్ధతిని దర్శ నాన్ని మన బుద్ధిలో నిజం చేసుకోవాలి. (అవన్నీ ఆ దైవ రూపాలే అని) సాధారణమైన మన బుద్ధి అలవాటు వస్తువులలో బాహ్యరూపాన్ని మాత్రమే దర్శించడం, దాని లోపలి రహస్యం దైవశీర్షాన్ని దర్శించకపోవడం అజ్ఞానంవల్ల ఇది మారాలి. క్రమంగా మన నిరంతర అలవాటువల్ల అన్నిటినీ ప్రేమించే అలవాటు వల్ల ఉత్పన్నమయే ఆనందం, అధికతర అవగాహనవల్ల, లోతైన బాంధవ్యం వల్ల అన్ని దైవశీర్షాలలోను — మనం ఆరాధించే దైవాన్ని ఒక్కటే, చూడాలి — అన్నీ ఈ ఒక్క దైవరూపాలే అని. ఇలా మన ఆధ్యాత్మిక కౌగిలిని విస్తరించుకుంటూ పోతే, మనం చేరుకుంటాం ఒక దశకు — అంతా అతడే— అనే దశకు. ఈ చైత

న్యం యొక్క ఆనందమే — మన అంతరాయంలేని — ప్రపంచాన్ని చూసే — సాధారణ — పద్ధతి అవుతుంది. అది చేరుస్తుంది, మనలను మన ఐక్యం వైపుకు — అతనిలో మన ఐక్యం వైపుకు, విశ్వీకరణ చెందిన మన ఐక్యం వైపుకు.

ప్రేయసి రూపం

ప్రేమింపబడేదాని రూపం అంతరంగంలో లోపలి నేత్రానికి, కనబడుతూ ఉండాలి. అతని నివాసభవనంలోలాగే, లోపలి నేత్రానికి, కనబడ్తూ ఉండాలి. అతని నివాసభవనంలో లాగే, మనలోనూ — అది నివశిస్తూ ఉండాలి. తన సాక్షాత్కార మాధుర్యంతో మనలను మన హృదయాలను, రమింపజేయాలి. మన సత్తా శిఖరం నుండి అది — ఒక నియంతలా ఒక ప్రేమికునిలా, స్నేహితునిలా, మన జీవితంలోను, బుద్ధిలోనుగల — కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ ఉండాలి. పైనుండి మనలను, విశ్వంతో కలుపుతూ ఉండాలి. ఒక స్థిరమైన అంతర ఐక్యతయొక్క సుఖం దగ్గరగాను, శాశ్వతంగాను, నిరంతరాయంగాను చేయబడాలి.

మనం మన సాధారణ కార్యకలాపాలను ప్రక్కకు పెట్టి, విశ్రాంతిగా ఉన్నప్పుడుఆ సమయానికి మాత్రమే ఈ సుఖం, ఈ కలయిక, ఈ ఆరాధన, పరిమితం కాకూడదు. మన అన్ని ఆలోచనలు పనులనూ, ఉద్వేగాలను, భావాలను, అతని ముందుంచాలి. అతని అనుమతి లేదా నిరాకరణ కొరకు. మనం ఈ దశకు ఇంకా చేరకపోతే, వీటి ని సమర్పించాలి. మన ఆకాంక్షలకు కైంకర్యంగా. అప్పుడే అతడు దిగివస్తాడు క్రమంగా మనలోకి, మన కార్యకలాపాలలోకి. వాటిని నింపివేస్తాడు. తన ఇచ్ఛ, శక్తి, వెలుగు, జ్ఞానాలతో తనప్రేమ ఆనందాలతో, చివరకు ఈ కార్యకలాపాలన్నీ అతనినుండే ఆవిర్భవించి, పరిణామం చెందుతాయి. ఒక దివ్యవిత్తనంవలె ఒక దివ్యరూపంగా. దీని ఫలితంగా మన అంతరంగ చైతన్యం, జీవితం, అభివృద్ధి చెందుతాయి. చివరకు మనం అతనిలో ఒక భాగం అనే ఎరుకకు వస్తాం.

మనం ఆరాధించే దైవఅస్తిత్వానికి మన జీవితాలకు వ్యత్యాసం తగ్గిపోతుంది. ఇదే విధంగా అన్ని సంఘటనల్లోను అన్ని విషయాలలోను దివ్యప్రేమికుని హస్తాన్ని గమనిస్తాం. దాని ఆనందాన్ననుభవిస్తాం. చివరకు దుఃఖాలు, బాధలు, భౌతిక బాధలు, కూడా అతని కానుకలుగా గుర్తిస్తాము. అవి దివ్యానందంగా మార్పు చెందుతాయి. దివ్యహస్త స్పర్శ అద్భుత పరిణామాలకు దారి తీస్తుంది. కొందరు త్యజిస్తారు.

జీవితాన్ని అది దుఃఖం, బాధతో కూడినదని. కాని దైవప్రేమికులు — వీటినే దైవాన్ని కలిసే సాధనాలుగా భావిస్తారు. దైవ నైజంలో మన కలయిక సంపూర్ణమైనపుడు అవి ఆ బాధలు, నశిస్తాయి. ఇవి విశ్వానందాన్ని మరుగు పర్చే ముసుగులు. అవి ఆనందంగా మారుతాయి.

CWSA 24: 601, 602

దైవంతో అసంఖ్యాక సంబంధాలు.

ఈ ఐక్యతకు తెచ్చే సంబంధాలన్నీ ఈ మార్గంలో అత్యంత గాఢంగా ఆనంద కరం, వ్యక్తిగతం. ఏదైతే వీటన్నింటినీ ఏకీకృతం చేసి, తనలో నిలుపుకుంటుందో అదే ప్రేయసీ ప్రియుల సంబంధం. అదే అన్నిటికన్నా అత్యంత గాఢమైనది. ఆనంద కరమైనది. అదే మిగిలిన వాటన్నింటినీ తనలో కలుపుకుపోయేది, తనతో తీసుకుపోయేది. వాటి నతిక్రమించేది. అతడే బోధకుడు, మార్గదర్శి. అతడే నడిపిస్తాడు. మనలను జ్ఞానంవైపు. ఎదిగే అంతర కాంతి దర్శనం యొక్క ప్రతి మెట్టువద్ద , అనుభూతి పొందుతాం, మనం అతని స్పర్శను. కళాకారుడు మధించినట్లు, అతడు మన బుద్ధి మట్టిని మధిస్తాడు. సత్యాన్ని బహిర్గతం చేసే అతని గొంతును, పదాన్ని అతడు మనకందిస్తాడు. మనం స్పందిస్తాం. మిరుమిట్లుగొలిపే అతని వెలుగుల శూల సదృశ కిరణాలు మన అజ్ఞాన అంధకారాన్ని వేటాడుతాయి.

అతడు నియంత. కాని ఈ మార్గంలో అతనిని సమీపించినపుడు దూరం, ఎడ బాటు భయం, ఆత్రుత, విధేయత, అన్నీ అదృశమౌతాయి. ఎందుకంటే, మనం బాగా దగ్గరవుతాం, కల్సిపోతాం. అతడు మన సత్తా యొక్క ప్రేమికుడు. మన సత్తాను అతడు తీసుకొని ఆక్రమించి, తన ఇష్టం వచ్చినరీతిని వాడుకుంటాడు.

విధేయత సేవకుని లక్షణం. కాని ఈ మార్గంలో అది అత్యంత దిగువది. తరువాత దశలో మనం విధేయతులం కాము. శిరసావహించడం కాని అనుసరిస్తాం అతని ఇచ్ఛనే — ఎలాగైతే తంత్ర వాయిద్యా తీగ, వాయిద్యగాని వ్రేలును అను ‑ సరించి స్పందిస్తుందో. అతని పనిముట్టుగా ఉండడం — ఆత్మసమర్పణ, నివేదన యొక్క ఉన్నత దశ. కాని ఈ పనిముట్టు జీవిస్తుంది. ప్రేమిస్తుంది అతనిని. చివరకు సత్తా అంతా అతని బానిస అవుతుంది. అతని పట్టులో, కౌగిలిలో, నియంతృత్వంలో బహ్మానందం పొందుతుంది.

అతడు స్నేహితుడు, సలహాదారు, సహాయకుడు, రక్షకుడు, మన కష్టాలలో బాధలలో అతడు అడ్డుకుంటాడు మన శత్రువులను. మన యుద్ధాలకు నాయకుడు అతడు. మన కవచంగా ఉంటాడు. మన దెబ్బలాటలలో, సారధిగా ఉంటాడు. రథానికి. నావికుడు. మన మార్గానికి ఇక్కడ మనకు బాగా దగ్గరౌతాడు. మనతోడు, నీడగా ఉంటాడు నిరంతరం. మనతోటి ఆటగాడు, జీవితం అనే ఆటలో.

ఇక్కడ ఇంకా కొంత వేర్పాటు ఉన్నది. స్నేహం ఎక్కువగా పరిమితం అవుతుంది., సహాయస్వీకారం భావనచే.

ప్రేమికుడు మనలను గాయపరుస్తాడు. విడిచి పెడ్తాడు, కోప్పడ్తాడు, మోసగించినట్లు కన్పడతాడు. మన ప్రేమ, వ్యతిరేకతలను తట్టుకోగలదో లేదో పరీక్షిస్తాడు.. అది ఇంకా వృద్ధి చెందుతుంది. వీటివల్ల తిరిగి కలిసినపుడు సంతోషం ఇంకా వృద్ధి చెందుతుంది. ఒకరిని ఒకరు పొందాలను భావన కూడా సంతోషాన్ని వృద్ధి చేస్తుంది. ఈ చర్యలవల్ల ప్రేమికుడు స్నేహితునిలా మిగిలిపోతాడు.

ఇదంతా మనలో అతని సంతోషం కొరకు మన ఆత్మ పరిపక్వత కొరకే అని చివరకు తెల్సుకుంటాము.

ఈ సాన్నిహిత్యమే అతనిని మన సత్త తల్లి, తండ్రి, దాని మూలము, రక్షకుడు, శ్రేయోభిలాషి, కోర్కెలుతీర్చే వానిగా చేస్తుంది. అతడు మన కోరిక మేరకే పుట్టిన మనచే లాలించబడే శిశువుగా, అతనిని చేస్తుంది. అంతా ఏకీకృతమౌతుంది. ఈ గాఢమైన బహుముఖ సంబంధాలతో.

CWSA 24:603-604

పెరుగుతున్న దైవప్రేమ

ఇది తప్పనిసరిగా దానితోపాటే, తనలోను జీవితంలోను దైవం యొక్క జ్ఞానాన్ని, దైవేచ్ఛను వీటిపై అవగాహనను విశాలం చేస్తుంది. లేదా పెంచుతుంది. దివ్యప్రేమికుడు తనను తాను బహిర్గతం చేసుకుంటాడు. మన జీవితాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంటాడు. వీటిలో కీలక సంబంధం ప్రేమదే. దీనినుండే ప్రవహిస్తాయి. అన్ని విషయాలు అనురాగవంతమైన ప్రేమ, సంపూర్ణ ప్రేమ, వీని సఫలత కొరకు అనేక మార్గాల అన్వేషణ, వొకరినొకరు పొందే మార్గాలు, సమాగమం, యొక్క అనేక ముఖాలు.

బుద్ధి కల్పించే అనేక విభేదాలు, అడ్డుగోడలు, చేయలేములు. కుదరదులు, కారణాలు విశ్లేషణ. ఇవన్నీ పరిహసింప బడతాయి. ప్రేమలో. వీటినే సమాగమానికి పరీక్షలు, క్షేత్రాలు, ద్వారాలుగా పరిగణిస్తారు.

ప్రేమ వస్తుంది, అనేక మార్గాలలో

1. ప్రేమికుని అందానికి మేల్కోడం ద్వారా.

2. ఒక ఆదర్శ ముఖాన్ని లేదా రూపాన్ని చూడడం ద్వారా,

3. ప్రపంచంలో గల వేలకొలది ముఖాలమధ్య అతని గుప్త చూచనలుల లేదా సంకేతాల వల్ల

4. నెమ్మదిగా లేదా హఠాత్తుగా, ఆత్మకు కల్గిన అవసరం వల్ల

5. అస్పష్టమైన ఆత్మ దాహంవల్ల

6. ప్రేమతో, ఆహ్లాదకరంగా, అందంగా ఉన్న ఒకరు దగ్గరలో మనలను అనుసరిస్తున్నపుడు (తప్పనిసరిగా మనం కనుక్కోవాలి, అతనిని)

CWSA 24: 604-605

మనం అతనిని అన్వేషించవచ్చు, లేదా దివ్యప్రేమికుడు మన వెంటబడవచ్చు

కనిపించని మన ప్రియుని, అనురాగంతో మనం అన్వేషించవచ్చు. అలాగే కనిపించని మన ప్రేమికుడు కూడా, మన వెంట పడవచ్చు. ఈ ప్రపంచం మధ్యలో తనకు తానుగా, మనలను పట్టుకోవచ్చు. మనం అనుమతించినా, అనుమతించక పోయినా అతను రావచ్చు. ఒక శత్రువు రూపంలో, ప్రేమ పిచ్చిరూపంలో. మన మొదటి సంబంధాలు యుద్ధమో, పెనుగులాటో, కావచ్చు. అది ప్రేమో, ఆకర్షణో అయినపుడు అది దైవానికి ఆత్మకు గల సంబంధం. అది ఎక్కువకాలం తప్పుగా అర్థం చేసుకోడం అసూయ, కోపం, ప్రణయ కలహాలలోను, ఘర్షణలలోను, ఆశ, నిరాశ లతోను, ఎడబాటు బాధలతోను, గడిచిపోతుంది.

మన హృదయపు అనురాగం , భావోద్వేగాలన్నింటిని అతని పైకి విసిరివేస్తుం టాము. అవి ప్రక్షాళన చెంది, ఆనందం, సంభ్రమం ఏకత్వంలోకి మారేవరకు. అది విసుగనిపించదు.

ఆ దివ్యప్రేమవల్ల లభించే ఐక్యతవల్ల కల్గే దివ్యానందంలో తార తమ్యాలను

వర్ణించడం భాషకు అందనిది, చెప్పలేనిది. ఈ ఆనందపు వెల్లువలో నింపబడ్డాయి. మన సత్తా ఎగువ దిగువ భాగాలన్నీ, మన బుద్ధి, జీవితం, ఆత్మ, భౌతికశరీరం వాటివంతు ఆనందాన్ని తీసుకుంటాయి. దాని స్పర్శను అనుభవిస్తాయి. ఈ ఆనందపు మధువు, అమృతం, మన నరనరాలలో ప్రవహిస్తుంది. ప్రేమ, ఆనందం, ఇవి మన సత్తా చివరి పదాలు. అవి రహస్యాలలో కెల్ల రహస్యాలు, గుప్త విషయాలలోకెల్ల గుప్త విషయం.

CWSA 24: 604

దైవ ప్రేమికుడు అందుకోలేనిది లేదు

ఈ విధంగా విశ్వీకరింపబడి, వ్యక్తీకరింపబడి, వాని గాఢతలకు ప్రేరేపింపబడి అతటిని ఆక్రమించే కౌగిలించే సఫలీకృతం చేయగల మార్గము, ప్రేమ, ఆనంద మార్గం. అది ఇస్తుంది. అత్యున్నత ముక్తిని. దీని ఉన్నత మెట్టు అతీత విశ్వ ఐక్య త. కాని ప్రేమ విషయంలో పూర్తి ఐక్యతే ముక్తి. వేరే అర్థం లేదు. దానిలోనే ఇమి డి ఉన్నాయి. అన్ని రకాల ముక్తులు

సాయుజ్యం, సామీప్యం, సాలోక్యం సాదృశ్యం

ఆత్మ దైవంతో ఐక్యమవడాన్ని సాయుజ్యం అంటారు. కాని ఈ ఏకత్వంలో ఇంకా రూప బేధముంటుంది.

సామీప్యం: ఇక్కడ ఆత్మ దైవానికి దగ్గరగా ఉండడం వల్ల కల్గే ఆనందాన్ని సామీప్యం అంటారు.

సాలోక్యం: ఆత్మల పరస్పర పరావర్తనం వల్ల కల్గే ఆనందాన్ని సాలోక్యం అంటారు.

సారూప్యం, సాదృశ్యం: రెండు ఆత్మలు ఒకేలా ఉండడం వల్ల కల్గే ఆనందాన్ని సారూప్యం లేదా సాదృశ్యం అంటారు.

ఇంకా భాషకు అందని అద్భుతాలెన్నో ఉన్నాయి. దైవప్రేమికునికి అందనిది, నిరాకరింపబడేది ఏదీ లేదు. ఎందుకంటే అతడు దివ్య ప్రేమికుని ప్రియుడు, అతని ఆత్మ.

CWSA 24: 605-606

మనం అనుసరిస్తున్న ఏకీకృత విధానంలో ఒక కీలక సూత్రాన్ననుసరించడం జరిగింది. అది యోగం వివిధ సంభావ్యతల దృష్టి కోణం నుండి, రాబట్ట బడింది. ఇది వేదాంత పద్ధతినుండి ప్రారంభించి, తంత్ర లక్ష్యానికి చేరుస్తుంది. తాంత్రిక పద్ధతిలో శక్తి ముఖ్యం. అదే ఆత్మను కనుగొనేందుకు కీలకం. ఏకీకృత విధానంలో ఆధ్యాత్మిక ఆత్మ, ప్రాముఖ్యత వహిస్తాయి. ఇవి రహస్య పాత్ర పోషిస్తాయి, శక్తిని సాధించడంలో

CWSA 24: 612 — మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఎస్. వై. సోమయాజులు

సమగ్ర ఆత్మ సిద్ధి

నిర్వ్యక్తికత, విశ్వజనీనత మారిన కర్మ తత్వం

సమస్తమూ, ఆ దైవం, ఆ యేకైక సత్ అభివ్యక్తులుగా దర్శించే వివేకం గల ఒక నిర్వ్యక్తికత, జడసదృశమైన ఒక సమత, ఒక విశ్వజనీనత, విషయాల పోకడ చూచి కోపగించదు, యిబ్బందిపడదు, అసహనం చూపదు, పైపెచ్చు ఉద్రేకపడదు, అత్యుత్సాహం చూపదు, దాని యెడల అనాలోచితంగా ప్రవర్తించదు. కాని ఆ పోకడ ధర్మానికి విధేయమయ్యేటట్లు, కాలగమనం గౌరవించబడేటట్టు చూస్తుంది. అది సానుభూతితో వస్తువుల, జీవుల వాస్తవికతను గమనిస్తుంది. అర్థం చేసుకొంటుంది. ప్రస్తుతం పైకి కన్పించే దాని వెనుక వున్న ఆంతరిక విశిష్టతం కోసం కూడా చూస్తుంది. ఒక టొకటిగా వెలువడబోయే వాటి దివ్య శక్యతలను కూడా ముందుగా చూడాలని, దైవ పరిపూర్ణ ఉపకరణాలుగా యెవరు పని చేస్తారో వారినుండి అది కోరే ప్రప్రథమ విషయం.

ఈ పరిణామానికి కావలసినవన్నీ తొందరగా జరగడానికి పరిపూర్ణ మానవఆత్మ ఎల్లప్పుడూ ఒక సాధనంగా ఉండాలి. దానికోసం ఆ దైవేచ్ఛ యొక్క రాజసంతో పనిచేసే ఒక దివ్యసంకల్పం ఏ ఒక్క స్థాయిలోనైనా స్వభావంలో ఉండాలి. కాని దానిని సిద్ధింపజేసి, శాశ్వతంగా చేసే పనులలో నిలకడగా ఉండి, నిజంగా దివ్యం అయినదైతే అది ఆధ్యాత్మికత సమానత ప్రశాంతత నిర్వ్యక్తికత సమస్త జీవులతో,

పొంది ఉన్న శక్తులను అర్థం చేసుకొని ముందుకు సాగాలి. ప్రపంచంలోని అనేక కార్యకలాపాలలో ఆ దైవం ఒక మహత్తర శక్తితో, అచరిత ఏకత్వంతో, స్వేచ్ఛతో, శాంతితో పని చేస్తుంది. పరిపూర్ణ ఆత్మ యొక్క దివ్య కార్యాలు ఆరకంగా ఉండాలి. పనిలో ఈ దైవాత్మ మార్పుని సాధ్యం చేసిన ప్రాణి స్థితి సమానత అందుండాలి.
CWSA 24: 700-701

విముక్తి సంకేతమే సమత్వం

ఆత్మలోనే కాక, స్వభావంలో కూడా సంపూర్ణ సమత యోగసాధనానికి కావలసిన స్థితి. మన ఆవేశపూరిత ప్రాణిక సత్తపై విజయం సాధించడానికి అది స్పష్టమైన మొదటి మెట్టు. ఎందుకంటే ఇక్కడ గొప్ప కష్టాలకు మూలాలు, అసమానత్వము, బానిసత్వానికి ప్రచండ శక్తులెన్నింటికో మూలాలు యిక్కడున్నాయి. మన అసంపూర్ణ తకు పట్టు బట్టే మూలము యిక్కడుంది. మన స్వభావంలోని ఈ భాగాల సమత్వం పరిశుద్ధత మరియు స్వేచ్ఛ ద్వారా వస్తుంది. విముక్తి సంకేతం సమత్వం అని మనం అనవచ్చు. భౌతిక పరమైన కోరికలు చేసే పెత్తనం నుండి విడివడడం, ఆత్మని తుఫానులా చుట్టుముట్టి ఆధిపత్యం వహించే కామవాసనలనుండి బయటపడా లంటే శాంతి, సమానత సకల హృదయంలో విశాల విశ్వము ఏకమను భావనచే పాలింపబడిన జీవితాశయం కలిగి ఉండాలి. ప్రాణమును అంటే జీవన సూత్రాన్ని అపవిత్రం చేసేవి బంధించే గొలుసు, కోరికలు. స్వేచ్ఛాగత ప్రాణాలంటే అర్థం జీవితాన్ని తృప్తి సంతృప్తి కలిగి, బాహ్య విషయాలను ఏ కోరికా లేకుండా ఎదురొడ్డి, వాటికి సమానంగా బదులిచ్చి, గ్రహించి, ఇష్టాఇష్టాలనెడి నీచమైన ద్వైత భావనకి అతీతంగా, సుఖదుఃఖాలనెడి ప్రేరేపణలను లెక్క చేయక ఆనందానికి ఎగిరి గంతేయక దుఃఖానికి క్రుంగిపోయి బాధపడక, కావాలనుకున్న స్పర్శలనెడి బంధనాలకిచిక్కి వ్రేలాడక లేక తాము అసహ్యించుకునే విషయాలని దౌర్జన్యంగా తిరస్కరించనప్పుడు అనుభవము గొప్ప విలువల వ్యవస్థకు అది తెరచుకుంటుంది. ప్రపంచంనుండి దానికి బెదిరింపు లేక వేడుకోలు రూపంలో వచ్చేదాని నంతటినీ అది ఉన్నత సిద్ధాంతా లకి, ప్రశాంత ఆత్మానందము కాంతిచే మార్పు పొందిన హృదయానికి హేతుబుద్ధికి విచారించమని అప్పచెబుతుతుంది. ఆవిధంగా శాంత పరచబడిన ఆధ్యాత్మచే పాలింపబడి మన లోలోతుల నున్న సున్నితమైన అంత రాత్మపై తన ఆధిక్యతను

మోపక, తనంత తానే ఆధ్యాత్మికతను సంతరించు కొని ఒక స్పష్టమైన ఉదాత్తమైన సాధనంగా ఆధ్యాత్మ, వస్తువులలో జరిపే దైవపర వ్యవహారాలన్నీ చక్కబెడుతుంది. జీవన ఉరవడిని, సహజలాభాలను పనిచేసే విధానాన్ని వైరాగ్యంతో అంతం చెయ్యడం అన్న ప్రశ్న ఇక్కడ లేదు. కావలసినది, దానిని అంతం చెయ్యడంకాదు. కాని దాని రూపాంతరీకరణ మాత్రమే.

CWSA 24: 702-703

సమతకి మార్గం.

ఏ ఆత్మ అయితే ఆధిపత్యం కోసం వెతుకులాడుతోందో, అది బలమైన, సమానమైన సహనము గల, ఎదిరించి నిరోధించే శక్తిని ఈ ప్రతిచర్యల మీదకు మరలించడంతో మొదలుపెడుతుంది. అవాంఛనీయ ప్రభావాలను వ్యతిరేకించి తప్పించుకోవడం గాని, లేదా తనని తాను రక్షించుకోవడానికి ప్రయత్నించడానికి బదులు అది దానిని ఎదుర్కొని బాధపడటానికి సిద్ధపడి వాటిని పట్టుదలతో సహించి ధైర్యముతో, వృద్ధి చెందే సమానత్వంతో మొండితనంతో మౌనస్వీకృతితో సహిస్తుంది.

రెండవమార్గం నిష్పక్షపాత ఉదాసీనత అనేటటువంటి దృక్పథం, దాని పద్ధతి, విషయాల యెడల ఆకర్షణ, వికర్షణలను వెంటనే తిరస్కరించి, వాటి కొరకు ఒక కాంతిమయ ప్రశాంతతను నిషద్ధాత్మకమైన తిరస్కారాన్ని అటువంటివాటినుండి విడివడి వాటిని నిరుపయోగం చేసే అలవాట్లను పెంపొందించుట. ఇచ్ఛ ఎల్లప్పుడూ అవసరమయినా ఈ దృక్పథం జ్ఞానం మీద కంటె ఇచ్ఛమీద తక్కువ ఆధారపడి ఉంటుంది.

మూడవమార్గం విధేయత. భగవదేచ్ఛకు విధేయం అను సిద్ధాతం మీద ఆధారపడిన క్రైస్తవుల పరిత్యాగము. కాని ఏక కాలంలో విశ్వజనీనేచ్ఛ అభివ్యక్తిగా జరిగే ఘటనలను, విషయాలను అహంకారరహితంగా స్వీకరించడం, లేక ఆ దైవానికై ఆ పరమ పురుషునికి వ్యక్తి సంపూర్ణ సమర్పణ, మొదటి మార్గం ఇచ్ఛది, రెండవ మార్గం జ్ఞానానిది, అర్థం చేసుకునే హేతుబుద్ధిది. కనుక ఇది భక్తి సిద్ధాంతానికి చాలా దగ్గరగా ఉన్న చిత్తవృత్తి, హృదయముల ఒక మార్గము.

దీనిని చివరివరకు తీసుకువెళ్తే, అది పరిపూర్ణ సమత ఫలితం దగ్గరకు చురుకుంటుంది. అహంకారపు ముడి విడివడి, తన స్వంతమను భావన మాయమవడం

ప్రారంభమయి మనం సంతోషాన్నిచ్చే విషయాలలో సంతోషానికి, లేక దుఃఖం కలిగించే విషయాలలో దుఃఖానికి ఇక ఎంతమాత్రం కట్టుబడి ఉండక, మనం వాటిని ఉత్సాహంతో స్వీకరించక లేక బాధపడుతూ తిరస్కరించక మన సత్తయొక్క అధికారికి దానిని నివేదించి, మనకు కలిగే వ్యక్తిగత పరిణామాన్ని తక్కువకి తక్కువ పట్టించుకుని ఒకే ఒక్క విషయాన్ని ముఖ్యమనుకుంటాం. అదే భగవంతుని చేరడం, లేక వైశ్విక అనంత సత్ తో సంబంధం కలిగి దానికి సమశృతితో ఉండడం, లేక దైవంతో యైక్యమై ఉండడం, అతని మార్గము, సాధనము సేవకుడు, ప్రేమికుడు, అన్ని విధాలా ఇంతే లక్ష్యమూ లేక ఆనందానికి లేక దుఃఖానికి వేరే కారణమన్నది లేక ఆయనలో అతనితో ఉన్న మన సంబంధంలోనే సదా ఆనందాన్ని పొందడం

CWSA 24:711-714

సమగ్ర సమర్పణ అనేదే ముఖ్యమైన ఆధారము

సంపూర్ణ ఆత్మ సమర్పణ మరియు చేసే పనులన్నింటి యెడల నిర్లిప్తత అనే వాటిని మినహాయించి సాధకుని ఆధారము సంపూర్ణ ఆత్మ సమర్పణ అయినపుడు సంపూర్ణ ప్రశాంతత, శాంతి లభిస్తాయి. కష్టాలు కొనసాగటం, అశాంతి, ఈ పరిశుద్ధికి సంపూర్ణతకి తీసుకొనే అవధి అనే వాటిని నిరుత్సాహానికి అసహనానికి కారణ మవ నీయకూడదు. అవెందుకొస్తాయంటే స్వభావంలో ఇంకా వాటికి బదులిచ్చేది ఉంది కనుక, బాధలు పునరావృతంమవడం లోపాల ఉనికిని వెలికి తీసి సాధకుడిని జాగ రూకుడిని గావించి అతనిలోని ఇచ్ఛని కార్యోన్ముఖము గావించి అతనిని అధికముగా ప్రబుద్ధిని గావించి పైవాటన్నింటినుండి విముక్తుడు కావడం కోసం బాధ దూరం పెట్టడానికి కూడా వీలుకానంత బలీయమైనప్పుడు దానిని అలాగే జరగనిచ్చి, అది తిరిగి పునరావృతమయినపుడు ఎక్కువ జాగరూకతతో ఆధ్యాత్మిక బుద్ధితో పట్టుపట్టి ఆ బాధని నిరుత్సాహ పరచాలి. అలా జరిగినప్పుడు, మిక్కిలి ఎక్కువగా ఈ విష యాలు వాటి బలాన్ని పోగొట్టుకోవడం, బాహ్యంగానే మిగిలిపోవడం, తక్కువగా పునరావృతమవడం చివరికి ప్రశాంతత అనేది ఆ వ్యక్తికి ధర్మంగా మారడం మనం చూస్తాం.

CWSA 24: 723

'స్వ' అనునది లేని సాధకుడు మరియు జ్ఞానియొక్క నిష్పాక్షిక సమత్వం దివ్యప్రేమ యొక్క చమత్కార పూరిత స్పర్శతో సర్వవ్యాపియగు ఆనందముగాను, కోట్లాది రూపములుగల ఆనంద స్థితిగాను పరివర్తన చెందుతుంది. అన్ని వస్తువులు దివ్య ప్రియుని దేహములుగాను, అన్ని కదలికలు ఆ దివ్య ప్రేమికుని ఆనందమయ అనంత గృహంలో క్రీడలవుతాయి. బాధకూడా మార్పుచెంది బాధామయ విషయాలు వాటివాటి ప్రతిక్రియలోను, వాటి సారంలోను కూడా మార్పు చెందుతాయి. బాధ కలిగించే విధానాలన్నీ దూరమౌతాయి. వాటి స్థానంలో ఆనందమయ రూపాలు సృష్టించబడతాయి.

CWSA 23: 160-161

కళ్యాణమయ శ్రద్ధ హృదయమందలి విశ్వాసము, శుభేచ్ఛ,

పరిపూర్ణత్వము కొరకు సమతాభావముకల హృదయము అవసరము, కాని తాళిమికల సమతయే కాక, అన్ని అనుభవాల వెనుక ఆ దివ్యశక్తి మంచి చేస్తుందన్న భావన, ప్రపంచంలోని విషాన్ని అమృతం క్రింద మార్చగలదన్న విశ్వాసము, ఇచ్ఛ, ప్రతికూల పరిస్థితుల వెనుకకూడా సంతోషమయ ఆధ్యాత్మిక అభిమతాన్ని చూడగలగడం, దుఃఖం వెనుక ప్రేమరహస్యాన్ని బాధ యనెడి బీజంలో కూడా ఆ దివ్యశక్తి సంతోషాలనెడి పుష్పాన్ని దర్శించడం తప్పక ఉండాలి. ఈ విశ్వాసము, ఈ కళ్యాణ శ్రద్ధ అనునవి ఎందుకు అవసరమంటే హృదయము, సంపూర్ణ బహిరంగ చైత్యపురుష అనునవి రహస్యమయ దివ్య ఆనందానికి బదులు పలికి ఈ సత్యమయ మూల సారాన్ని గ్రహించి అందులోనికి పరివర్తన చెందుతాయి. ఒక పరిమితం చేయనలవిగాని విస్తృతతర, తీవ్రతర ప్రేమకు సామర్థ్యాన్ని ఈ విశ్వాసం, సంకల్పం అనుసరించి అందులోకవి తెరచుకోవాలి.ఎందుకనంటే హృదయ ప్రధాన వ్యాపారం, దాని యధార్థమైన పని ప్రేమ. సంపూర్ణ సమైక్యతకు మరియు ఏకత్వమునకు విధినిర్దేశితమైన సాధనమది, కేవలం అర్థం చేసుకోవడం ద్వారా ప్రపంచంలో ఏకత్వాన్ని చూడగలగటం ఒక్కటే సరిపోదు, అది మన హృదయంలోను చైత్యపురుషునిలోను కూడా మనం అనుభవించగలగాలి. అంటే దానర్థం ఆ యేకైకంలో ఉన్న ఆనందాన్ని అతనిలోని ప్రపంచంలోని అన్ని అస్తిత్వాలని, ఆ దేముని, సమస్త ప్రాణుల ప్రేమని గుర్తించడం. హృదయం లోని విశ్వాసం శుభేచ్ఛ అనునవి ఈ విశ్వాన్ని నడిపించి,

సర్వవ్యాపి అయిన ఆ ఒకే ఒక ప్రత్యక్షమైన దైవము అనెడి దృక్పథంపై స్థాపించ బడ్డాయి.

CWSA 24: 737

కావలసిన విశ్వాసరీతి

మన విశ్వాసము లేక నమ్మిక యోగ సిద్ధాంతాలకి ఆవశ్యకసత్యమునకు మొదట కట్టుబడి ఉండాలి. ఇది తెలివిచే కప్పబడి, హృదయంలో నిరాశ చెంది భౌతిక బుద్ధి యొక్క కోరికచే ఎల్లప్పుడూ తిరస్కరించబడి, ఓడిపోయి, అలసి సొలసినప్పుడు అంతరాంతర అంతరాత్మలో పట్టుకు వ్రేలాడి దానికొరకై తిరిగి వచ్చేది ఏదో ఒకటి ఉండాలి. లేకపోతే, మనం ఆ దారిలో పడిపోవడం లేదా నీరసంతో ఆ తాత్కాలిక పరాజయాన్ని నిరాశా నిస్పృహలని కష్టాల్ని, విఘ్నాల్ని భరించలేక దానిని విడిచి పెట్టడం జరుగుతుంది. జీవితంలో వలెనే ఏ యోగంలో కూడా ఎన్ని పరాజయాలు, ఎన్ని నిరాశలు ఎదురయినా సరే కొంచెం కూడా చలించక చివరివరకు ఎదురొడ్డి అన్ని విపరీత పరిస్థితుల్ని, శక్తుల్ని అధిగమించి చివరకు విజయం సాధిస్తాడో అతడు తన నమ్మిక సరి అయినదనుకుంటాడు. కారణం మానవుని లోని అంతరాత్మ శక్తికి అసంభవమన్నది ఏదీలేదు. ఉండవలసిన మన ఆధ్యాత్మిక సంభావ్యతలన్నింటినీ వెను తిరిగి లేక సంకీర్ణ, అల్పాతి అల్ప ఖండించే వినాశనము, తెలివితేటలు, మన ప్రయత్నాన్ని దుర్భలపరిచే సంశయాలవెంట వచ్చేఅసూయ వాటన్నింటికంటే అంధ అజ్ఞాన విశ్వాసమైనా సరే అది ఉండవలసినదే.

CWSA 24: 773

దివ్యశక్తి అది పనిచేయు రీతియందు విశ్వాసము

శక్తి పని చేస్తున్నప్పుడు అజ్ఞానాన్ని అంధత్వాన్ని, దానిని తప్పుగా అర్థం చేసుకొని, మూర్ఖంగా నమ్మేవాటినన్నింటినీ కూడా దయా దాక్షిణ్యాలు లేక దెబ్బ తీస్తుంది. కనుక మనం రక్షించే నిజాన్ని మాత్రమే అంటిపెట్టుకున్న విశ్వాస రూపాలతో విడువకుండా ఉండే బంధాన్ని విడిచి పెట్టడానికి తయారుగా ఉండాలి. ఒక మహత్తర విశాల ఆధ్యాత్మికతతో కూడా తెలివైన విశ్వాసం, తెలివి అంటే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకొనుటకు ఆ దిశగా అధిరోహించే గొప్ప కారణంతో కూడిన తెలివి.

అదే సమగ్ర యోగ సాధనకి కావలసిన శ్రద్ధ గుణము.

ఈ శ్రద్ధ, ఇంగ్లీషు భాషయందలి విశ్వాసము లేక నమ్మిక యనునవి దాని వ్యక్తీకరణకి సరిపడిన శబ్దాలు కావు. ఇది నిజానికి ఆ అనంతదివ్యాత్మ ఒక ప్రభావం, దాని ప్రకాశం మన అతిమానస సత్త ఒక సందేశం. అది మన నిమ్న ప్రకృతినుండి, దాని అతి చిన్న వర్తమానం నుండి తనంతతానుగా ఎదగడానికి, తనని తాను అధిగమించడానికి ఒక గొప్ప పిలుపు. ఆ ప్రభావాన్ని గ్రహించి, ఆ పిలుపుకు బదులు పలికేది తెలివికాదు, హృదయం లేక దైవిక మనస్సు, కాని తన విధిని తనకి నిర్దేశించబడిన కార్య సత్యాన్ని ఆంతరిక అంతరాత్మ చక్కగా తెలుసు కుంటుంది. ఈ మార్గంపై మన తొలిఅడుగు పడడానికి ప్రేరేపించే పరిస్థితులు నిజంగా మనలో పనిచేసే దానిని తెలియచెప్పే సూచికలు కావు. అక్కడ బుద్ధి , హృదయం లేక దైవిక బుద్ధి కోరికలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తాయి. లేక ఎక్కువ ప్రేరేపకములు, కాని ఇవే అయినప్పుడు యోగ సాధనలో మన నిలకడకి ఆ పిలుపుకి మన భక్తి శ్రద్ధల రూఢి లేదు. దానిని ఆకర్షించిన ఆలోచనని తెలివివదిలి పెట్టవచ్చు, హృదయం అలసిపోయి మనల్ని ఓడించవచ్చు. దైవిక మనస్సు కోరికలు ఇతర లక్ష్యాల దిశగా పరుగిడవచ్చు. కాని ఆధ్యాత్మ వాస్తవిక కార్యకలాపాలకు బాహ్యపరిస్థితులు ఒక అచ్ఛాదన మాత్రమే. ఆ ఆధ్యాత్మ సమర్పించబడినప్పుడు ఆ పిలుపును అందుకున్న ఆంతరిక అంతరాత్మ లో శ్రద్ధ స్థిరంగా ఉండి ఓడించడానికి చెయ్యబడే అన్ని ప్రయత్నాల్ని అడ్డుకోవడం కాని అంతం చెయ్యడం కాని జరుగుతుంది.

CWSA 24: 774 అనువాదం: డా. వి. విజయలక్ష్మి

దైవశక్తి కార్యవిధానాలు మనల్ని కలవరపెట్టగూడదు

అజ్ఞానమనే శక్తి, నిమ్న ప్రవృత్తులను తీసివేసి వాటికి బదులుగా ఉన్నత శక్తిని ప్రవేశపెట్టడానికి జరిగే యుద్ధమును బహిష్కరించడానికి తిరస్కరించడానికి మాత్రమే. కానీ అనుభవాలు, ఆలోచనా స్థితి, భావాలు, అనుభవానికి తెచ్చుకునే రీతులు, ఉపయోగకరమైనవి మార్గంలోనే ఆమోదించవలసినవి అవి ఆ సమయానికి ఆధ్యాత్మిక అంత్యంగా అనిపించవచ్చు ఆ తరువాత అవి మార్పుకి సోపానాలు. వాటిని అధి

గమించాలి. మరియు ఇంతవరకు పనిచేసిన ఆలంబన, నమ్మకాన్ని వెనక్కు తీసుకోవాలి. ఎందుకంటే అంతకన్నా పెద్దది, సంపూర్ణమైన ఘనమైన అనుభూతులుకు బదులుగా పరివర్తన ప్రక్రియ పూర్తి చెయ్యడంకోసం ఉపసంహరించబడ్డాయి.

పూర్ణ యోగసాధనకు కృషిచేసేవారు మధ్యదారిలో ఎక్కడా విశ్రాంతి ప్రదేశాలను వసతి గృహాలను పట్టుకొని వ్రేళ్ళాడకూడదు. అతను పరిపక్వతకు అవసరమైన అన్ని అతి పెద్ద స్థిరమైన ఆధారాలను పణంగా పెట్టేంతవరకు మరియు అవి స్వేచ్ఛాయుతమైన పెద్ద అనంతాలుగా విడివడే దాకా సంతృప్తి పడకూడదు, అప్పుడు నిరంతరంగా నిర్విరామంగా అనంతాన్ని గూర్చిన అనుభవాలను తనలో నింపుకుంటూ ఉండాలి. అతని ఆరోహణ స్థాయినుంచి స్థాయికి సాగే అతని పురోగతి ప్రతి నూతన ఔన్నత్యం సరికొత్త దృశ్యాలను దివ్య సందేశాలను ఇంకా చేయవలసినవి తెలియజేస్తుంది. 'భూరి కర్తవ్యం' దైవశక్తి అతని సమస్త కృషి చివరకు తనలోకి తీసుకునే దాకా అతను అధిరోహిస్తూనే వుండాలి. సమ్మతితో దివ్యమాతతో ఆమె ప్రకాశవంతమైన కార్యాలలో సమ్మతితో దివ్యమాతతో కలిసిపోయి ఆమె ప్రకాశ వంతమైన కార్యాలలో సమ్మతితో ఏకమై సంతోషంగా పనిచేయడమే. ఆ శక్తి, మార్పులు, సంఘర్షణ, పరివర్తనన్నింటిలోను అతని కి ఆధారంగా అండగా నిలుస్తుంది. లేకపోతే అతను చిరాకు, నిరుత్సాహాలకు గురి అవుతాడు. ఎందుకనంటే జీవితం తెలివి, భావోద్రేకం ఎప్పుడూ అన్నింటినీ చాలా ఎక్కువగా స్వంతం చేసుకుంటాయి. అపరిపక్వ నిర్ణయాలు తమను తాము బంధించుకుంటాయి. అవి ఖచ్చితంగా బాధను కలిగించేవి వదిలించుకోవడానికి ఇష్టపడనివి. ఆ పనిచేసే దైవశక్తిమీద దృఢమైన నమ్మకం, యోగమార్గంలో నడిపించే గురువు మీద విశ్వాసం వుండాలి. ఆయన జ్ఞానం తొందరపడదు. మనం కలవరపడుతున్నప్పుడు అతడు మనతో వేయించే ప్రతి అడుగు నమ్మంగా, తగినట్టుగా దృఢంగా ఉంటాయి. ఎందువల్లనంటే మన స్వభావాన్ని అవసరమైన వ్యవహారాలను సంపూర్ణంగా అర్థం చేసుకొని వేయించేవే ఆ అడుగులు.

CWSA 24: 775- 776

దివ్యశక్తి సామర్థ్యం అపారమైనది

ప్రస్తుత అసమర్థత ఎంత దృఢంగా ఒత్తిడి చేసేదిగా అనిపించినా అది నమ్మకానికి

పరీక్ష లేక తాత్కాలిక కష్టం. సంపూర్ణ యోగ సాధనకు కృషిచేసేవాడు అశక్తుడననే భావానికి లొంగిపోవడమనేది అర్థరహితం. ఎందుకంటే అతని లక్ష్యం అప్పటికే అతనిలో ఆంతరంగావున్న పరిపూర్ణతాభివృద్ధి ఎందువలనంటే మనిషిలో అతని ఆధ్యాత్మలో దివ్యజీవన విత్తనాలుంటాయి. విజయసాధనావకాశాలు అతను చేసే ప్రయత్నంలో నిక్షిప్తమై ఉంటాయి. విజయం నిశ్చయం. నిశ్శంశయం ఎందువల్లనంటే ఆ పిలుపు మార్గదర్శకత్వం తన వెనుక ఉన్న ఈశ్వరశక్తిది.అదే సమయంలో తనమీద తనకున్న నమ్మకాన్ని రాజరిక అహంకారం మరియు ఆధ్యాత్మిక గర్వం నుంచి ప్రక్షాళన చేయాలి. సాధకుడు తప్పనిసరిగా దృఢంగా గుర్తుపెట్టుకోవాలి. అహంకారిక అర్థంలో తన బలం తనదే అన్న భావాన్ని వదిలి, విశ్వవ్యాప్త దైవశక్తిదని గుర్తుంచుకోవాలి. అహంకారంతో చేసే ఏపనైనా పరిమితులను కల్పించి చివరగా అడ్డంకి అవుతుంది. మన ఆకాంక్షవెనుకనున్న దివ్యశక్తి అపరిమేయం. ఎప్పుడైతే ఆ శక్తిని ఆర్తితో పిలుస్తారో అప్పుడు తప్పకుండా మనలోకి ప్రవేశించి ఏఏ అసాధ్యాలు అడ్డంకులూ ఉన్నాయో వాటిని తొలగించడంలో విఫలం కాదు అని ప్రస్తుతమైనా తరువాతయైనా ఏకాలంలో ప్రయాసపడుతున్నామో, ఎంత సమయం పడుతున్నామో అనేవి మొదట ముందుగా దేనికోసం ప్రయాసపడుతున్నామో ఆ కారణం మీద పాక్షికంగాను నమ్మకంయొక్క దృఢత్వంమీద పనితీరుమీద ఆధారపడినా చిట్టచివరకు జ్ఞానంతో నిర్ణయించు రహస్యశక్తి చేతిలో చివరకు జ్ఞానంతో నిర్ణయించు రహస్య శక్తి చేతిలో ఉంటుంది. ఆయనే యోగసాధనకు గురువు. ఈశ్వరుడు.

CWSA 24: 780

దివ్యమాత ఆమె నాలుగురూపాలు

దివ్యశక్తి మీద నమ్మకం ఎప్పుడూ మన పట్టుదల వెనుక ఉండాలి. దివ్యమాత వ్యక్తమయినపుడు అది పెరిగి తిరుగులేనిదిగా సంపూర్ణ మవ్వాలి. దివ్యమాతకు అసాధ్యమనేదేదీ లేదు. ఆవిడ చిఛ్ఛక్తి విశ్వజనీన దేవత, అనంతకాలంనుంచి సర్వ సృష్టికి మూలం, సర్వశక్తులను ధరించిన మాత. అనంత జ్ఞానం శక్తి విజయాలు, సామర్థ్యాలు అన్ని పనులు ఆమె చేతుల్లోనే వున్నాయి. అన్ని శక్తులకు పరిపక్వతకు, సిద్ధికి అవి సంపూర్ణ భాండాగారాలు. ఆవిడ మహేశ్వరి, సర్వోత్కృష్ట జ్ఞానానికి అధిదేవత. మనందరికీ అన్ని రకాల దివ్య దృష్టిని, పరమ సత్యాన్ని ఆవిడ యధార్థ

దైవసంకల్పాన్ని అతిమానస ప్రశాంతతను మనోభావాలను, ఆనందపు వెలుగులను తెచ్చే పంచే మాత. మహాకాళి సర్వోత్కృష్ట శక్తి. ఆవిడతోనే ఉంటాయి అన్ని శక్తులు. దైవికబలాలు, మరియు అత్యంత తాపసిక కఠినత మరియు యుద్ధానికి అవసరమైన వేగం, విజయం, హాసం, అదే అట్టహాస్యం. అది ఓటమిని మరణాన్ని అజ్ఞాన శక్తులను తేలిక చేస్తుంది. ఆవిడ మహాలక్ష్మి, ప్రేమకు, సంతోషానికి అధిదేవత, ఆవిడ ఇచ్చే కానుకలు ఆధ్యాత్మిక ఆనందంలో ఉండే ఆకర్షణ, సౌందర్యం, రక్షణ మరియు అన్ని దైవిక మాన ఆశీస్సులు . ఆవిడ మహాసరస్వతి. ప్రజ్ఞకు, (నైపుణ్యాలకు) ఆత్మ కార్యాలకు, అధిదేవత. "యోగః కర్మ సుకౌశలమ్". దివ్యజ్ఞాన ప్రయోజకతలు జీవితానికి ఆధ్యాత్మితను అన్వయింపజేసుకోవడం దాని సామరస్యతల సుఖం కూడా ఆమెదే. దివ్యమాత తన అన్ని రూపాలలోను, శక్తులలోను తన సర్వోత్తమ సాధికారతలను భరించు శాశ్వత ఉపకరణం నుండి వాంఛించబడే సర్వవిధకర్మ నిర్వహించగల వేగవంతమైన దివ్య సమర్థత పాలుపంచుకొనే సానుభూతి సర్వజీవుల లోని సర్వఊర్జాలతో స్వేచ్ఛామయ తాదాత్మ్యత అందుచేత విశ్వంలోని సమస్త దివ్యసంకల్పంతో ఒక స్వచ్ఛంద ఫలవంతమైన సామరస్యతను ఆమె భరించి ఉంటుంది. ఆమె సన్నిధి, ఆమె శక్తుల, సంవేదన ఆమె చేసే క్రియలన్నింటికీ మన అస్తిత్వం లోపల, చుట్టూ సంతృప్తితో కూడుకొన్న మన సమ్మతి అనేది దైవశక్తి యందు మన చిట్టచివరి విశ్వాస పరిపూర్ణత

CWSA 24: 780-781

మనలోని దైవంపై, ఆతని శక్తిపై, ఒక స్థిరమైన, బలమైన విధంగా ఆధారపడడంపై దైవానికి, ఆతని శక్తికి సంపూర్ణ సమర్పణ గావడంద్వారా, మనయేకత్వాన్ని, స్వేచ్ఛను, విజయాన్ని సిద్ధిని పొందవచ్చు.

CWSA 24: 771 *అనువాదం: డా. తాడిమేటి శేషరాజకుమారి*

శ్రీమాత సూక్తులు

సమగ్ర 'దివ్యత్వ' భావన

పూర్ణయోగాన్ని ప్రారంభించాలనంటే 'దివ్యత్వ' సాధనతోనే మొదలు పెట్టాలి. దివ్యత్వమే పరిపూర్ణమైనది. ఇందుకు గాను సంకుచిత స్వభావానికి లోను కానటువంటి విశాలత్వం హృదయంలో నిండివుండాలి. శాఖాబేధాలు లేని మత పరమైన భావాలు (దృక్పథాలు) కాని, పాక్షికమైన వేదాంతభావాలు కాని ఉండకూడదు. అనిర్వచనీయ మైన దివ్యత్వాన్ని అవి సంకుచిత మానసిక నిర్వచనాల పరిధిలో బంధింపచూస్తాయి.

మధుమయీ, శ్రీఅరవిందుల ఉద్దేశంలో "సమగ్ర దివ్యత్వం"అంటే ఏమిటి?

సమా: వ్యక్తి తన భావాలకూ, అభిరుచులకు అనుగుణంగా 'దివ్యత్వాన్ని' అర్థం చేసుకుంటాడు. వ్యక్తిగత అభీష్టాలు కోరికలూ, ఇందులో చోటు చేసుకుంటాయి. ఎవరికి వారు తమకు అనుకూలమైన విధంగా వారు దివ్యత్వాన్ని రూపొందించు కుంటారు. వారి భావన, వారి అవసరాలకు చాలవరకు లోబడే ఉంటుంది.

నీ మట్టుకు నీవు నీకు కావాల్సిన విధంగాను, సరిపడే విధంగానూ దివ్యత్వాన్ని అర్థం చేసుకుంటావు. అవునా? కాని నీ భావనాచక్రం నుండి నీవు కొంత వరకు బయటకు రాగలిగితే, అసలైన "సమగ్ర యోగం" ప్రారంభించ ప్రయత్నించగలిగితే ముందే దివ్యత్వం కేవలము నీవు భావించిన విధంగానే ఉంటుందని అనుకోరాదు. ఇతరులకు కూడా వారి భావాలు వారికి ఉంటాయి కదా! ఇంతేకాకుండా ఎవరికీ స్ఫురించని కొన్ని ఇతర భావాలు కూడా "దివ్యత్వ" భావనలో ఉండవచ్చు గదా!

ఇది కనుక అర్థం చేసుకుంటే 'సమగ్రత్వం' దిశగా మొదటి అడుగు వేసినట్లే!

సహజంగానే, తమకు తెలియకుండానే దివ్యత్వం తమతమ భావాలకు సరిపడేలా వుండాలని అందరూ అనుకుంటారు. అలవోకగాను, అప్రయత్నంగానూ, "ఇదే దివ్యత్వం" అని కాని , "ఇది దివ్యత్వం కాజాలదు" అని కాని వారు అంటూ వుంటారు. అసలు వారికి తెలిసినదెంత? ఇక, ఇక్కడకు వచ్చిన వారిలో కొంత మందికి ఈ మార్గంలో ఏ మాత్రం ప్రవేశం లేకపోయినా, "ఈ ఆశ్రమంలో దివ్యత్వానికి తావే లేదు" అని యధేచ్ఛగా అభిప్రాయాన్ని ప్రకటిస్తారు. కాని మనం చొరవ తీసుకుని, అసలు దివ్యత్వం అంటే మీ అభిప్రాయం ఏమిటి? అని కనుక నిలదీసి వారిని అడగగలిగితే వారి నోళ్ళు మూగబోతాయి. అసలు దివ్యత్వం ఎలాంటిదో

వారికి తెలియనే తెలియదు అని అనిపిస్తుంది. నిజమే, తక్కువగా తెలిసిన వారే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారు" విషయపరిజ్ఞానం బాగా వున్నవారు అంత తేలికగా, అంత తొందరగా నిర్ణయం చేయలేరు. మనం చెయ్యాల్సిందంతా జాగ్రత్తగా పరిశీలించ గలగటమే. 'అది', 'ఇది' అని నిర్ణయించటం చాలా అసాధ్యం. మనం చేయగలిగిందల్లా విషయాలను నిష్పాక్షికంగానూ, ఉన్నది ఉన్నట్లు గాను, ఉండవలసిన చోట ఉన్నదా లేదా అనే విషయాలలోనూ తగినంత అవగాహనతో, పరీక్షిస్తూ ఉండటమే మన పని, మంచి చెడ్డలు నిర్ణయించటం కాదు.

ఒక్కొక్క సందర్భంలో ఇదే దివ్యత్వం, అది కాదు. అని చెప్పటమే కష్టం అవుతుంది. ప్రపంచమంతా ఒకే మొత్తం అనే భావనతో చూడగలిగితే, ఒక దాన్నుంచి మరొకదాన్ని వేరుచేయడం మొత్తాన్నంతా ఛిన్నా భిన్నం చేయడమే అవుతుంది. ఈ విధమైన సమగ్ర, సమైక్య చేతన స్థాయినుండి ఒక మెట్టు క్రిందికి దిగివచ్చి బాహ్యచేతనలోనికి ప్రవేసిస్తే, ఒక విధంగా 'సత్యచేతన' మార్గానికి అవరోధంగా వుండి, దాన్ని వెనుకకు లాగే నిరోధించే పరిస్థితులు ఎలాంటివో అవగాహనలోనికి వస్తుంది. అప్పుడు మాత్రమే మన దృక్పథం మారి "ఇది దివ్యత్వానికి దారిచూపే మార్గము, అది కాదు " అని చెప్ప గలిగే అవగాహన వస్తుంది.

ఇది భౌతిక జీవనంలో ఎదురయ్యే ఆచరణాత్మక మార్గమే. దీనిని దాటి అంతర్గత పరిపూర్ణ చేతనను సాధించగలిగితే, ఈ పోరాటాల ఆవరణకు వెలుపల నున్న ప్రదేశంలో ప్రవేశించగలుగు తాము. అక్కడ అంతా దివ్యత్వమే. దివ్యత్వం కానిది ఉండనే ఉండదు!

కాని ఆ స్థితి చేరుకునే ముందు వ్యక్తి చేతనలో ఈ పోరాటాలు, విభేధాలు, తప్పక ఎదురౌతాయి. కాని వ్యక్తి స్వేచ్ఛకు కూడా అవకాశం వుంటుంది. విచక్షణా జ్ఞానం ఇందుకు దోహదపడుతుంది. వ్యక్తి తనకు తానుగా సమర్పణా భావాన్ని అంకిత భావాన్ని కలిగి యుండుటయే దానికి పరిష్కారము. ఆ స్థితిలో క్రీనీడలుకాని, పొరపాట్లు జరగటంకాని సంభవించవు.

CWM 8: 1- 2

సమగ్ర యోగము - భౌద్ధిక ప్రయత్నము

"శక్తివంతమైన యోగానికి మేధాశక్తి తొలి భూమిక అని నిర్ధారించవచ్చు. కాని

అది అనివార్యం అని మాత్రం అనలేము."

సమా: శక్తివంతమైన యోగం సమగ్రమైనదే. అందులో అనేక విషయాలు ఉంటాయి. అందువలన తెలివి తేటలు యోగానికి శక్తిని ఇచ్చే మాట నిజమే.

ప్ర: దీన్ని "సమగ్రయోగము" అనవచ్చునా?

సమా: అట్లా నిర్ద్వంద్వంగా నిర్ధారించలేము. సమగ్ర యోగం వ్యక్తిలోని అన్ని విభాగాలకు సంబంధించినది. అన్ని కార్యక్రమాలు దాని పరిధిలోనికే వస్తాయి. కాని మరోవిషయం ఒక వ్యక్తి చేయగల పనులు వేరే వ్యక్తి చేస్తే అంత బాగా ఉండకపోవచ్చు. వ్యక్తుల సమగ్రతలలో తేడాలుంటాయిగదా! నీకు ఈ విషయం అర్థం అయిందనుకుంటాను.

నీ మట్టుకు నీవు సర్వశక్తులూ ఒడ్డి యోగం చేయగలిగితే అది నీ వరకు నీకు 'సమగ్ర యోగమే .' కాని నీ నిర్వాహకత్వం సర్వ సాధారణంగానూ, తక్కువ స్థాయిలోనూ ఉండే అవకాశం కూడా వున్నది కదా! నీలో ఉన్న చేతన ఇతరులతో పోలిస్తే, అతి స్వల్పమైనదిగా కూడా ఉండవచ్చుగదా! కాని నీ యోగం నీకు సంబంధించినంత వరకు సమగ్రయోగం అనుకోవచ్చు. అందులో నీలోని సర్వశక్తులు, నీ పరిపూర్ణ కృషి తప్పక ఉంటాయి.

CWM 8: 8- 7

ఆశా, నిరాశా దృక్పథాలు

మధుమయి, "ఇందు నిమిత్తం ప్రారంభంలో వ్యక్తి తన నిమ్న ప్రకృతి ద్వారానే పనిచేయాలి," అని శ్రీఅరవిందులు ఒకచోట వ్రాసారు. ఇది దేనికి సంబంధించినది? దాన్ని ఎలా నిర్వహించాలి?

సమా: ఇందులో ఒక అనుకూల దృక్పథం, ఒక ప్రతికూల దృక్పథం ఉంటాయి. అనుకూల దృక్పథం ద్వారా వ్యక్తి తన ఉనికిని, చేతననూ, ఆకాంక్షనూ అభివృద్ధి చేసుకోవాలి. దృష్టిని అంతరంతర మానసిక వ్యక్తిత్వపు దిశగా మళ్ళించాలి. తన సర్వ శక్తులు కేంద్రీకృతం చేసి, వాటిని తగిన స్థానాలలో ఏక కేంద్ర శక్తిగా అమర్చాలి. చివరకు ఆకాంక్షనంతా దివ్యత్వం వైపే కేంద్రీకరించి అదే దిశగా ముందుకు సాగాలి. ఇదే ఆశావహ దృక్పథం అంటే.

ఇది ఇట్లా వుంటే, నిరాశా పూరిత దృక్పథం వలన బయట ప్రపంచంనుండి కాని, అంతః చేతన మరియు నిశ్చేతన మూలల్లోనుండి కాని, వచ్చే అన్ని

స్పందనలను ఆధ్యాత్మిక పురోగతికి అవరోధాలుగా భావించి త్రోసి రాజంటుంది. కాని వీటిని సదవగాహనతో పరిశీలించి ఒక పద్ధతి ప్రకారం తిరస్కరించవచ్చు. అదే సంయమంలో వాటి ఇచ్ఛాబలానికి లోనుకాకుండా జాగ్రత్త పడాలి. ఈ ప్రక్రియలో సంభవించే అవకాశం ఉన్న కష్టనష్టాలను, భ్రమప్రమాదాలను వ్యక్తి ప్రమేయంతో నిమిత్తం లేకుండా సంభవించగల దుష్పరిణామాలను కూడా పరిశీలనతో గమనించి అవి చేతనలో వప్రవేశించకుండాను అక్కడ తిష్టవేయకుండాను జాగ్రత్త పడాలి. ఇదే అనుకూల దృక్పథం అంటే.

ఈ రెండు దృక్పథాలను (సానుకూల, ప్రతికూల) ఏక కాలంలో ఆచరించవలసి వస్తుంది. సందర్భాన్ని బట్టి, సంసిద్ధతనుబట్టి అవసరానికి తగినట్లుగా వీటిని ఉప యోగించు కోవాలి. ఈ రెండింటినీ తప్పక గుర్తుంచుకోవాల్సిందే!

CWM 8: 22

అంతః శత్రువులు

మధుమయీ, ఈ విషయం నాకు అర్థం కాలేదు. "ఆత్మలోని అంతర్గత శత్రువులను త్యజించాల్సిందే. అవి పోతూ, పోతూ సాధకుని చేతనను ఎంత బాధకు గురి చేసినా వాటిని వదిలించుకోవాల్సిందే."

సమా: అర్థం కాలేదా? ఇలాంటిది నీ అనుభవం లోనికి ఇంకా వచ్చి వుండదు. అంతేకాదు. ఒక్కొక్క సందర్భంలో నీకు నచ్చనివి ఉంటాయి. కోపం, ద్వేషం, నిజాయితీ లోపించటం వంటివి. వాటిని నీవు వదులుకోవాలను కున్నప్పుడు కాని, వాటికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నప్పుడు కాని ఆ భావన నిన్ను కొంతలో కొంత భాధించడం కూడా కద్దు. అది కూడా బాధాకరమే కదా? దేన్నో బలవంతంగా బయటకు ఈడ్చివేస్తున్నాము అనే భావన కలుగుతుంది. ఈ అర్థమే పై వాక్యంలోనూ ఉన్నది. ఒక చెడ్డ విషయాన్ని వదిలించుకునే సందర్భంలో అది కొంత కుదుపును కూడా ఇస్తుంది. కానుకగా! అదే పైవాక్యం ద్వారా సూచించబడింది.

నొప్పి అంతా నీ వంతేనని నీవు భ్రమిస్తున్నావు. ఇది సత్యం కాదు. నొప్పి అనేది నీవు నీపై ఆపాదించుకున్న భావనయే. దీనికి భిన్నంగా జరిగినపుడు నీకు ఇదే రకమైన బాధ కలుగనే కలుగదు. పైపెచ్చు అదే నీకు ఆనందహేతువు కూడా

అయ్యే అవకాశం ఉంటుంది. వాస్తవిక అనుభవంలో ఏ మార్పూ ఉండకపోయినా, భావనలో మాత్రం నీకు బాధ అనేది అనిపించదు. ఒకవైపు నీవు వద్దనుకున్న వ్యతిరేక శక్తులతో పోరాడుతూనే వుంటావు. కాని అదే సమయంలో అవి అల్లంత దూరాన వున్నట్లు వాటి వలన నీకు ఏ మాత్రం అపకారం ఉండనట్లు అనిపిస్తుంది. ఆ విధంగా వ్యతిరేక ధోరణి కనుమరుగై, అనుకూల ధోరణి మాత్రమే మిగులుతుంది. దివ్యత్వం కటాక్షించటమే దీనికి కారణం. ఇదే నీకు దివ్యానంద హేతువు కూడా అవుతుంది. దివ్యత్వంతో నీవు మమేకం కావాలి. లేకుంటే, నీవు బహిష్కరించాలనుకున్న వికృత రూపం నిన్ను వెంటాడుతూ బాధిస్తూనే వుంటుంది.

CWM 8: 83-84 *అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు*

స్వీయ గతిశీల ధ్యానం

విముక్తం చేసి ఏకైక కేంద్రంకల ధ్యానం ఓ నిరంతర అంతరంగ జ్ఞాపకమవాలని ఈ యోగసాధన ఆశిస్తుంది. అందరిలో ఉన్నది ఒకే ఒక ఆత్మ. అంతా ఒకే దైవం . దైవంలోనే అందరూ ఉన్నది అందరూ దైవమే. మరొకటి విశ్వంలో లేదు. సాధకుని చేతనా ద్రవ్యమంతా అలా అయేవరకు ఈ యోచనే, ఈ నమ్మకమే. నేపథ్యంగా ఉండాలి. ఈ రకమయిన ఓ స్మృతి తననుతాను ఓ గతిశీలం చేసుకొనే ధ్యానంగా అయ్యి తుదకు ప్రగాఢ అవిచ్ఛిన్న దర్శనంగా మనం దేనిని యెంతో శక్తివంతంగా జ్ఞప్తియందుంచుకొంటామో లేక యెంతో నిరంతరంగా ధ్యానిస్తామో ఆస్పష్టమైన అన్నింటినీ ఆలింగనం, చేసుకొనే చేతనకు మరలాలి. మరలుతుంది.

ప్రశ్న: ప్రియమైన అమ్మా! శ్రీఅరవిందులంటున్న స్వీయగతిశీల ధ్యానమంటే ఏమిటి?

అమ్మ: అస్తిత్వాన్ని రూపాంతరీకరించ గల్గిన శక్తిగల ధ్యానమని అర్థం. చలనరహిత మయి సాపేక్షంగా చూసినప్పుడు జడంగా ఉంటూ మీ చేతనతో గాని, మీరుండే తీరుతోగాని ఏమీ మార్పుని స్థిర ధ్యానానికి భిన్నంగా ఈ ధ్యానం మిమ్ములను పురోగమింప జేస్తుంది. గతి శీల ధ్యానమంటే రూపాంతరీకరించే ధ్యానం.

మనుషులు సాధారణంగా గతిశీలమయిన ధ్యానం చేయరు. వారు ధ్యానంలో

ప్రవేశించినప్పుడు లేదా కనీసం వారు ధ్యానం అంటున్నదానిలో ప్రవేశించినపుడు వారి ఉనికిలో గాని, చేతనలోగాని ఎటువంటి మార్పు, ఏ కదలిక లేకుండా ఎంతగా ఉంటే అంతగా సంతోషిస్తారు. ఈ రీతిన అనంతంగా ధ్యానం చేయగలరు, అది విశ్వంలోగాని వారిలోగాని ఏమీ మార్పు తేలేదు. అందువలన శ్రీఅరవిందులుఅందుకు సరిగా భిన్నమయిన గతిశీల ధ్యానం గురించి చేప్తున్నారు.

ప్రశ్న: అదెలా చేయాలి? దానికి భిన్నమయినరీతిలో చేస్తారా?

అమ్మ: విభిన్నమయిన ఆకాంక్ష, విభిన్నమయిన వైఖరి ఉండాలనుకుంటాను. విభిన్నమయిన విధానం అంటున్నప్పుడు విధానమంటే (నవ్వుతూ)కూర్చునే విధానమా? అంతరంగ విధానమా?

అవును.

కాని అది ప్రతి ఒక్కరికి విభిన్నమయి వుంటుంది.

తానెందుకు ధ్యానం చేస్తున్నది తెలుసుకోవడం ఎంతో ప్రధానమనుకుంటాను. అది ధ్యానానికి ఒక లక్షణాన్నిస్తుంది. ఏదో ఓ క్రమంతో ఉంచుతుంది.

దివ్యశక్తికి మిమ్మల్ని తెరచి ఉంచుకోవడం కోసం ధ్యానం చేయవచ్చు. సాధారణ చేతనను నిరాకరించడం కోసం ధ్యానం చేయవచ్చు, మీ ఉనికి లోతులలోనికి ప్రవేశం కోసం ధ్యానించవచ్చు. మిమ్మల్ని సమగ్రంగా అర్పించుకోవడమెలాగో నేర్చుకోవడం కోసం ధ్యానించవచ్చు. అన్ని రకాల విషయాల గురించి ధ్యానం చేయవచ్చు. సాధారణంగా యిందుకోసమే చేస్తుంటారు. కాని ఎక్కువ సాధించలేరు. కాని పరివర్తన చెందాలిని కనిపెట్టడంకోసం అభివృద్ధి చెందే మార్గాన్ని పట్టుకోవడం కోసం ధ్యానం చేయవచ్చు. తొలగించవలసినదీ, పరిష్కారానికి కష్టముగా ఉన్నప్పుడు ఏ క్రియలోనో మరొకదానిలోనో సహాయం కావాలనుకున్నప్పుడు అందుకు గూడా ధ్యానం చేయవచ్చు.

ప్రతి ఒక్కరికీ తనదయిన ధ్యానవిధానముంటుందను కుంటాను. కాని ధ్యానం గతిశీలంగా ఉండాలనుకుంటే పురోభివృద్ధిని ఆశించాలి. అభివృద్ది చేందాలన్న ఈ ఆకాంక్ష నెరవేరడానికి సహాయంగా ధ్యానం చేయాలి.

అమ్మ, ప్రశ్నలు సమాధానాలు 1956 పేజిలో 88-89

దైవాన్నుండి అడుగుతున్నది

ఈ అపరిపూర్ణ అసత్య ప్రపంచాన ఓ ఆధ్యాత్మిక సత్యం ధర్మం మంచి చెడుల గురించి భావన చేసి ఉత్తమ మయిన మంచిని ఆవిష్కరించింది.... కాని వీటన్నింటి వెనుక, వీటన్నింటిలోను ఉన్న దివ్యత్వాన్ని ప్రకాశాన్ని తీసుకువచ్చేవాడు మార్గదర్శి, సర్వజ్ఞుడు, శక్తికి అధిపతి, ఆనందాన్నిచ్చేవాడు, మిత్రుడు, సహాయకుడు, తండ్రి, తల్లి, ప్రపంచ క్రీడలో సహ క్రీడాకారుడు, తన అస్తిత్వానికి తానే కేవల అధిపతి. అతడు అంతరాత్మకు ప్రియతముడు, ప్రియుడు. ఇవన్నీ అ దైవత్వమే అని అనుభూతి చెందాడు.

ప్రశ్న: *ఉదాహరణకు తానేదయినా తెలుసుకోవాలనుకుంటే లేక మార్గదర్శకత్వాన్ని ఏదో మరొకటో ఆశిస్తూ, దైవాన్నుండి తన అవసరానికి తగినదెలా పొందాలి?*

అమ్మ: దాని గురించి దైవాన్ని అడగడంవల్లనే. అడగకపోతే నీకెలా లభిస్తుంది?

దైవం వైపు తిరిగి పూర్తి నమ్మకంతో అడుగు. నీకు కావలసింది పొందుతావు. నీ కవసరమైనది అని నీవు ఊహించినది మాత్రం కాదు. నిజంగా అవసరమయింది దొరుకుతుంది. కాని అందుకోసం ఆయన నడగాలి.

నీవా ప్రయోగాన్ని నిజాయితీగా చేయాలి. అన్ని రకాలయిన బాహ్యామార్గాలలో పొందాలని ప్రయత్నించుతూ, అప్పుడు దైవం అడగకుండానే ఇవ్వాలని ఆశించ గూడదు. వాస్తవంగా ఎవరయినా ఏదయినా నీ కివ్వాలనుకుంటే అడుగుతావు. అడగవూ? దానికోసం అడగకుండా ఆయనే ఇవ్వాలని ఎందుకాశించడం. సాధారణ చేతనలో పూర్తిగా వ్యతిరేక పోకడ వుంటుంది. నీవేదో అనుకుంటావు. నాకిది కావాలి, ఈ సంబంధం కావాలి. ఈ వాత్సల్యం కావాలి. ఈ జ్ఞానం కావాలి యిత్యాదివి చేస్తావు. చెప్తావు. మంచిది. దైవం నాకు ఇవ్వాలి లేకుంటే అతడు దైవమే కాదు. అంటావు. చెపుతున్నదేమిటంటే సమస్యను పూర్తిగా తలక్రిందులు చేస్తావు.మొట్టమొదట నాకవసరం, అంటావు. నిజంగా అవసరమోకాదో, కేవలం ఓ ప్రభావమేమో, ఓ కోరికయో, ఓ మూర్ఖ కదలికయో నీకు తెలుసా? మొదటి అంశం. నీ కేమీ తెలియదు. రెండవ అంశం క్లుప్తంగా నీ సంకల్పాన్ని దైవంమీద ఆపాదించడం. నాకిది అవసరం అంటున్నావు. తర్వాత దానికోసం ఆయనను అడగనుగూడా అడుగవు. దాని నివ్వమంటావు. నా 'అవసరం' అంటావు. కాబట్టి నా కవసరం గనుక అదే సహజంగా,

స్వయంగా రావాలి. నా కవసరమయినదంతా యివ్వడం దైవం పని. అంటావు.

కాని అది అలాగే సంభవించితే, నిజానికి నీకు కావలసినదేదో నీకు తెలియనట్లే. అది కేవలం ఓ భ్రమ, నిజంగాదు. బేరంచేసినట్లుంటుంది. నీచుట్టూ ఉన్న జీవితంనుండి కావాలనుకుంటావు. దైవం వైపు తిరుగవు. ఆయనకు నీకు మధ్య ఎటువంటి సంబంధాన్ని కల్పించుకోవు. ఆయన గురించి యోచించవు. నీ వైఖరిలో ఎంతో కొంత నిజాయితీతో ఆయనవైపు తిరుగవు. ఆయననుండి ఏదీ కావాలనుకోవడం లేదు గనుక నీకిది ఇవ్వడానికి ఓ కారణం లేదు.

కాని నీవడిగితే ఆయన దైవం గనుక, నీకంటే బాగా నీకేమి కావాలో తెలుసుగనుక నీ కవసరమైనదిస్తాడు. లేకుంటే అదే కావాలని పట్టుబడితే నీ సంకల్పాన్ని ఆయన మీద రుద్దాలనుకుంటే నిన్ను మెప్పించడంకోసం కావలసింది యివ్వవచ్చు. నీ పొరపాటు తెలుసుకునేటట్లు చేయవచ్చు. కాని అది నిజంగా నీకు కావల్సింది కాదు. నీ వప్పుడు వ్యతిరేకించ ఆరంభిస్తావు. నీ వంటే వ్యక్తిగత అర్థంతో గాదు. మనుషులుందరికి అన్వయించి చెప్పడం. ఏదో హాని కలిగించేది దైవం నాకెందుకివ్వడం అంటావు దానికోసం నీవే అడిగినట్లు పూర్తిగా మరచిపోయి, ఈ రెండుచోట్ల అదే తీరుతో వ్యతిరేకంగా ఉంటావు. తిరిగి ఆయన ఇవ్వనప్పుడు కూడా నా కవసరమని చెప్పినప్పటికీ ఆయన దెందుకు ఇవ్వలేదు. అని ఖండిస్తావు. ఈ రెండుచోట్ల అదే విధమయిన విరుద్ధ అభిప్రాయాలతో నీవు ఉండడంతో, పాపం దైవం దైవం నిందింపబడతాడు. అదంతా లేకుండా నీలో అది తెలుసుకోవాలన్న సరళమయిన ఓ ఆకాంక్ష, ఒక ప్రేరణ, ప్రగాఢ తీక్షణ అవసరముంటే, నీ ఉనికియొక్క సత్యం ఎంతో కొంత అదేనని స్పష్టంగా భావిస్తే, అన్నింటికీ మూలం ఉత్తమమయిన మంచి అని, మనం కోరుతున్న వాటన్నింటిని సమాధానం సమస్యలన్నింటికీ పరిష్కారం అది తెలుసుకోవడమేనని భావించితే ఈ ప్రగాఢ అవసరం నీలో ఉంటే దానిని తెలుసుకోవాలని ఆకాంక్షిస్తుంటే, దైవంతో 'నాకిదివ్వు, అదివ్వు,' అని ఎంతమాత్రము అనవు. లేదా 'నాకిది అవసరం, అది కావాలి.' అనవు. 'నాకేది అవసరమో అది చేయి, అసత్యతయొక్క సత్యానికి నన్ను తీసుకువెళ్ళు. మీ ఉత్తమోత్తమ వివేకం నా కేది అవసరమని చూస్తే అదే ప్రసాదించు' అంటావు.

నీవప్పుడు పొరపాటు పడడం లేదని ఖచ్చితంగా అనుకుంటావు. నీ కాయన హాని చేసే దేదీ యివ్వరు.

మరింత ఉన్నతమయిన మెట్టున్నది, దానితో ఆరంభించడం కొంత కష్టం.

కాని నాకిది కావాలి, యిదివ్వు, అని దైవంతో చెప్పడం కంటే మొదటిది యిప్పటికెంతో వాస్తవమయిన విధానం. ఎందుకంటే వారికేది అవసరమో, నిజంగా కొద్దిమందికే తెలుసు. చాలా కొద్దిమందికి , అందుకు నిదర్శన మేమిటంటే, వారెప్పుడూ వారి కోరికలను ఫలవంతం చేసుకొనే ప్రయత్నాల్లోనే ఉంటారు. వారి ప్రయత్నమంతా దాని మీదనే ఉంటుంది. ప్రతిసారి వారి కలల్లో ఒకటి నెరవేరుతుంది. దానితో ఆశాభంగమవుతుంది. మరొకదానివైపు జరుగుతారు.

ఎంతో వెతుకులాట తర్వాత, ఎన్నో తప్పులు చేసిన మీదట ఎంతో బాధపడిన తర్వాత ఎంతో ఆశాభంగంచెందడంతో దీనంతటినుండి వివేకవంతంగా బయటపడే మార్గంమేదీ లేదా అని కొన్ని సార్లు ఆశ్చర్యపడతాడు. అది తన అజ్ఞానాన్నుండి బయటికొచ్చే మార్గమని చెప్పడం.

అప్పుడు ఆక్షణాన (అమ్మ తన చేతులు తెరచి) యిలా 'నే నిక్కడున్నాను, నన్ను స్వీకరించి నిజమైన మార్గానికి నడిపించు' అనగలడు.

అప్పుడంతా సవ్యంగా సాగడం మొదలవుతుంది.

CWM 8:121-124 *అనువాదం: అరుణా మోహన్*

దైవభక్తి ఆరాధనలకు సంబంధించిన సంపూర్ణ చర్య

"దానిని ఇలా చెప్పవచ్చు, దివ్యప్రేమ ఆరాధనకు సంబంధించిన సంపూర్ణ చర్య మూడు భాగాలుగా వుండి ఏక మాత్ర సకలానికి అభివ్యక్తీకరణగా జరుగుతుంది. ఒక క్రియారూపంలో దైవాన్ని అర్చించడం, దైవంతో ఒక అనుబంధాన్ని లేక ఒక అన్వేషణను యేదో దర్శనాన్ని ఒక రూపంలో వ్యక్తపరచే ఒక సంకేతంగా ఆరాధించడం అంతరాత్మలోనూ, ఆధ్యాత్మలోను, హృదయంలోనూ ఏకత్వంకోసం ఆంతరిక ఆరాధన పరితాపం, లేక యేకత్వసంవేదన"

ప్రశ్న: మొదటి రెండు భాగాలు నాకు బాగా అవగతం కాలేదు.

అమ్మ: క్రియకు సంబంధించిన పూర్తి భౌతిక రూపం అందులో వుంది. ఒక ప్రత్యేకమైన సంజ్ఞ, ఒక నిర్ణీతమైన కదలికద్వారా సమర్పణా భావాన్ని అభివ్యక్తం చేసే శాఖాపరమైన

సాంప్రదాయ రూపాల్లాంటి దది. అది పూర్తిగా భౌతికమైనది. ఉదాహరణకి అగరవత్తులు వెలిగించడం, కానుకలు సమర్పించడం, దేవాలయాన్ని పర్యవేక్షించడం దేవతామూర్తిని అలంకరించడం నిజానికి ఇవన్నీ కేవలం భౌతికంగా చేసే పనులు.

రెండవ అంశం ఒకవిధంగా మానసిక సమర్పణ. ఇది సంకేతరూపంలో నిర్వహించబడే చర్య. ఇక్కడ భక్తుడు మామూలుగా అగరవత్తులు వెలిగించడంలోనే తృప్తి పడడు. వాటిని వెలిగించడం ఒక ప్రతీకాత్మక చర్యగా చేస్తాడు. ఉదా: ఆకాంక్ష శరీరంలో జ్వలిస్తున్న ఆపేక్షకు లేదా ఆ విశుద్ధాగ్నిలో తాను కరిగిపోతున్న ఆత్మార్పణకు సంకేతంగా చేస్తాడు. దీనిలో మొదటిది కేవలం ఒక చర్య, తరువాతది ఆ క్రియల ఒక సంకేతం. ఆ పైన ఏదయితే చేయబడుతుందో దానిని సంకేతాత్మకంగా అర్థం చేసుకోవడం.

చివరకి ఈ రెండు రీతులకు వెనుక ఐక్యమత్యానికై ఒక ఆకాంక్ష. ఈ క్రియలు వాటి నుండి నీవు సంకేతాలుగా తయారుచేసినది, ఇవన్నీ దైవానికి ఇంకా ఇంకా దగ్గరవ్వడానికి చేసే సాధనాలు మాత్రమేనని, అతడితో ఐక్యంకావడానికి నిన్ను నీవు తగినట్లుగా చేసుకోవడంకోసం ఆకాంక్ష వున్నది ఈ మూడు అంశాలు క్రియ పూర్తి కావడానికి అంతర్భాగాలుగా ఉండి తీరాలి. అంటే పూర్తి భౌతికమైనది, కొంత పూర్తి మానసికమైనది, కొంత అంతరాత్మికమైనది కొంత అంతరాత్మిక ఆకాంక్ష వుండి తీరాలి. వీటిల్లో ఒక అంశం వుండి, తక్కిన రెండూ అంశాలు లేకుంటే అది అసంపూర్ణమౌతుంది. ఒక నియమం ప్రకారం చాలా అరుదుగా సచేతనంగా ఆ మూడు జతపర్చ బడతాయి. ఆ సంయోగం ప్రత్యేకమైన విలక్షణమైన సమర్పణ, నిజాయితీ కల వ్యక్తులను ఉత్పన్నం చేస్తుంది. అంటే అస్తిత్వం మొత్తం అన్ని భాగాలలో క్రియావిధానంలో పాలు పంచుకోవడం.

CWM 8: 234-235

అంతరాత్మిక అగ్నిని రాజేయడం

ఓ మాధుర్యమయి మాతా! "అంతర్యంలో అంతరాత్మిక అగ్నిని రాజేయాలి. దానిలో దైవం పేరిట సమస్తం అర్పణ చేయాలి." అని వ్రాసారు శ్రీఅరవిందులు.

ప్రశ్న: ఈ అంతరాత్మికాగ్ని ఎల్లవేళలా వెలుగుతూ వుండదా?

అమ్మ: అది ఎల్లప్పుడూ వెలుగుతూ వుండదు.

ప్రశ్న: అప్పుడెలా దానిని వెలిగించటం?

ఆకాంక్షతో

వికాసం చెందాలనే సంకల్పంతో పరిపూర్ణత వైపుగా సాగాలనే ప్రేరణతో. అన్నింటికీ పైగా వికాసం చెందే అందుకై ఆత్మ శుద్ధీకరణకై ఇచ్ఛ అగ్నిని వెలిగిస్తాయి. పురోగమించాలని ఎవరిలో అయితే దృఢ సంకల్పముంటుందో వారు ఆ సంకల్పాన్ని ఆధ్యాత్మిక వికాసం, ఆత్మ శుద్ధివైపు మళ్ళించినప్పుడు తమంతట తామే తమలో ఆ అగ్నిని వెలిగిస్తారు. వ్యక్తి తనలోని ప్రతిరూపాన్ని సరిదిద్దుకోవాలనుకుంటే లేక ప్రతి చిన్న వికాసాన్ని సాధించాలనుకొంటే ఆ మొత్తాన్నీ ఆ అగ్నిలో వేసినప్పుడు అప్పుడది మరిత క్రొత్త తేజస్సుతో ప్రజ్వలిస్తుంది. ఇది కనిపించే ఒక బింబం కాదు. సూక్ష్మభౌతికంలో జరిగే యధార్థం ఇది. ఆ జ్వాలకు సంబంధించిన వెచ్చదనాన్ని అనుభూతి చెందగలరు. అగ్నియొక్క ప్రకాశాన్ని సూక్ష్మభౌతిక స్తరంలో చూడగలరు కూడా. స్వభావంలో ముందుకు సాగనివ్వకుండా అడ్డు పడేదేదై వుందో దానిని కూడా ఆ అగ్ని లో వేసేయవచ్చు. అది కూడా దానిలోమండటం మొదలై జ్వాల మరింత తీవ్రమౌతుంది.


CWM 8: 251

ప్రయాసలోని ఆనందం, తీయదనం

కర్మల రూపం ధరించిన భక్తి తన త్రోవను విస్తృతం సంపూర్ణం, క్రియాశీలం చేసుకోవడమే కాదు. అది ఒక్కసారిగా లోకంలోకి కఠిన కార్య విధానాల్లోకి ప్రేమానందంలోని దివ్య భావావేశ ప్రబల మూలకాన్ని ప్రవేశపెడుతుంది. ఆ మౌలికాంశం మొదట్లో అంతగా కనబడదు. ఒక సంఘర్షణాయుతమైన, ఉద్ధరించే నిట్టనిలువు ఆరోహణా వత్తిడిని నిష్ఠగల ఆధ్యాత్మిక సంకల్పం అనుసరించినప్పుడు, హృదయం యింకా నిద్రలో వుండగా లేక నిశ్చల నీరవతకు బందీయై వున్నప్పుడు ఆ సంతోష, ప్రేమ, అంశాన్ని భక్తి కొని తెస్తుంది. దివ్యప్రేమ శక్తి ప్రవేశించ గలిగితే మార్గకాఠిన్యత తగ్గుతూ పోతుంది. మానసికాందోళన శమిస్తుంది. ప్రయాస, సంఘర్షణ కేంద్రంలో కూడా ఒక సంతోషం, తియ్యందనాలుంటాయి.

CWM 8: 251-52

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధనరాజు



కష్టంలో ఉన్నప్పుడు సుఖంగా ఆనందంగా యెలా వుండగలం?

కచ్చితంగా, ఆ కష్టం వ్యక్తిగతమైనది లేక అహంకారమైనది అయినప్పుడు దానినొక నివేదనగా చేసి, పరిశుద్ధత అనే అగ్నిలో దానిని విసరివేసినప్పుడు, అతడు పురోగతికి సంబంధించిన ఆనందాన్ని వెంటనే అనుభవిస్తాడు. అతడు చిత్తశుద్ధితో ఆ పని తెలిసినపుడు అతనిలో ఆనందం పెల్లుబుకుతుంది.

నిస్పృహ చెందటం, జరిగినదానిని తలచుకుంటూ విచారపడి బాధపడ్తూ, ఉండటానికి బదులుగా చేసి తీరవలసింది స్పష్టంగా అలాగే దానిని నివేదన చేసి రూపాంతరీకరణకు పరిశుద్ధతకు చిత్త శుద్ధితో ఆకాంక్షిస్తే, అతడు వెంటనే హృదయలోతుల్లోనుంచి ఆనందం పెల్లుబిక రావడాన్ని అనుభూతి చెందుతాడు. ఆ కష్టం పెద్ద దుఃఖానికి కారణమైనదైనా, దీనినతడు చాలా విజయవంతంగా చేయవచ్చు. అదెంతటి తీవ్రమైన దైనా దుఃఖం వెనుక, దివ్యానందం వున్నదనేది వాస్తవంగా గ్రహిస్తాడు.

CWM 8: 251-252

అనంతునిచే వరించబడిన వ్యక్తి

ప్రశ్న: దివ్యజననీ, "అనంతుని వరించువాడు అనంతునిచే వరించబడినవాడు" అని యిక్కడ చెప్పారు.

అమ్మ: అదొక అద్భుతమైన వాక్యం!

అది నూటికి నూరుపాళ్ళు నిజం. "భావాలు, సుభాషితాలు"లో కూడా యిలాంటి వాక్యమే ఒకటి వుంది.నేననుకోవడం అచట "అనంతుని" కి బదులు "భగవంతుడు" అనే పదం ఉపయోగించారు. కాని భావన మాత్రం ఒకటే. నిన్ను వరించింది భగవంతుడు, దైవం, నిన్ను వరించింది. అందుచేతే నీవు ఆయన వెంట పడ్తున్నావు. ఆయన చెప్పేది యిదే, కాదా? ఆ విధమైన నమ్మకాన్ని నిశ్చితత్వానికి, సరిగ్గా అతడెలా కాబోతున్నాడో తెలిపే దాన్నిచ్చేది యిదే. అతనలా ముందుకు నిర్దేశించబడి వుంటే పర్వత సదృశ కష్టాలున్నప్పటికీ, విజయం తథ్యం.అనేది తెలిసినవారికి అదొక లెక్కా! సమస్త కష్టాలను యెదుర్కొనే అజేయమైన ధైర్యాన్నిస్తుంది. సమస్త పరీక్షలకు యెదురు నిలబడగలిగే సహనాన్నిస్తుంది. నీకు విజయం తథ్యం.


అది వాస్తవం- వాస్తవానికి అది అలాగే వుంటుంది. నీవు దానిని గురించి ఆలోచించిన క్షణం, నీవు దానిని గురించి యెందుకు ఆలోచించావంటే, యెవరో ఒకరు నిన్ను గురించి ఆలోచించారుగనుక, నీవు వరించడం, నిన్నెవరో వరించారు గనుక జరుగుతుంది. ఒకసారి నీవు వరించబడితే, అది జరిగి తీరుతుంది. అందుచేత, సందేహాలు, సంశయించడాలు క్రుంగుబాట్లు, అనిశ్చితులు, ఇవన్నీ కాలాన్ని, ఊర్జాన్నీ, వ్యర్థంచేసేవే. వాటివల్ల యేం ఉపయోగంలేదు. తనలో ఒక్కసారి క్షణంపాటు "నా విషయంలో ఇదే సత్యం" అని సంవేదించడం జరిగితే చాలు, అంతా అయి పోయినట్లే. అది ముగిసినట్లే, ఖాయమైనట్లే. దుర్గమారణ్యం గుండా దారి చేయడానికి నీవు సంవత్సరాలు వెచ్చించినా అదేమంత చెప్పుకోదగ్గ విషయంగాదు. అది అయిపోయినట్లే, ముగిసినట్లే. అందుకనే ఒకనాడు "ఇంతాచేసి మీరంతా యిక్కడెందుకున్నారంటే మీరెక్కడో అలా కోరుకొన్నారు, ఎక్కడో కోరుకొని మీలో వున్ననట్లైతే దానర్థం, మీలో దానిని కోరుకొన్నది దైవం." అని నేను మీకు చెప్పాను. కనుక చాలా తిన్నని మార్గాన్ని అనుసరించే కొంతమంది చాలా త్వరగా చేరుకొంటారు. మరికొంతమంది వున్నారు. వాళ్ళకు యెత్తు పల్లాల మార్గం కావాలి.

అది చాలా కాలం పడ్తుంది. కాని అంత్యం అనేది వుంది. గమ్యం వుంది. అనుభవ పూర్వకంగా నేను తెలుసుకొనే దేమిటంటే తన జీవితంలో ఒక్కసారైనా దాని వైపు ఒక గొప్ప తపన... దానిని అతడు యేవిధంగా పిలిచినా యిబ్బందిలేదు. కాని భాషా సౌలభ్యం కోసం దైవం అందాం. దానిని చేరలేని వానిని ఒక్కరిని కూడా చూడలేదు. అతడు ఒకానొక సమయంలో ఆయనకు వెన్ను చూపినా అదేం పట్టించుకోవలసిన విషయం గాదు. అతడు తప్పకుండా చేరుకొంటాడు. హెచ్చు తగ్గులు లేకుండా పెనుగులాడవలసి వుంటుంది. హెచ్చు లేక తగ్గులుగా యిబ్బంది వుంటుంది. కాని యేదో ఒక రోజు విజయుడవ్వడం ఖాయం వరించబడినది అంతరాత్మ, అది చేతనావంతమైనది కారణం దాని ఘుడియ(ప్రాప్తించింది. ఒకసారి దాని ఘుడియ(ప్రాప్తిస్తే, హెచ్చు లేక తక్కువ త్వరగా ఫలితం లభిస్తుంది. కొద్ది నెలల్లో నీవది సాధించవచ్చు. కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. కొన్ని జన్మలైనా పట్టవచ్చు.కాని నీవది సాధిస్తావు.

ఇందులో చెప్పుకోదగ్గ విషయమేమిటంటే దీనిని వరించే స్వేచ్ఛ నీకే యివ్వబడింది. నీ అంతరంగంలో నీవు నిశ్చయించుకుంటే యీ నీ జీవిత కాలంలోనే దానిని సాధిస్తావు. నీవు సాధిస్తావు. నీవు పన్నెండు నెలల్లోనే చేరుకొనగలవు. గనుక ఒక శాశ్వత నిరంతర నిర్ణయాన్ని కలిగి వుండాలని నేను అనడంలేదు. కాదు, నా ఉద్దేశ్యం "నాకిది కావాలి," అని నీవు ఆకస్మికంగా దానికి పట్టుబడిపోతే, ఒక్కసారైనా, క్షణంలో, ఆమోదముద్ర పడిపోయినట్లే. అంతే అలా జరుగుతుంది.

CWM 8: 337-39

అనువాదం: కె.వి.రావు



అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2018

దివ్యవెలుగు పునరాగమనం

(పునరాగమన 125 వ వార్షికోత్సవ సంచిక)

సంపాదకీయం: శ్రీఅరవిందులు, 1893 ఫిబ్రవరి 6 వ తేదీన, 4 సంవత్సరాల తాత్కాలిక నివాసం తరువాత భారతదేశానికి తిరిగి వచ్చారు. "భారతీయ సంస్కృతికీ ప్రభావానికీ" దూరంగా వుండి విద్య నభ్యసించడానికి వారిని వారి తండ్రిగారు అచటికి పంపించారు. తరువాతి కాలంలో ఆయన కార్యాలలో ఒక దానికి అంటే ప్రాకృశ్చిమాలుగా అందరికీ తెలిసిన రెండు ఆలోచనా విధానాల అంతరాన్ని పూరించే వారధిని నిర్మించ సహాయపడేందుకు, వారు సాయుధులుగా తయారైన కాలంగా మనం ఆ 14 సంవత్సరాల కాలాన్ని చూడాలి. అదే సమయంలో యింకా శైశవ దశలోనే వున్న భారతీయ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి ముందుకు తీసుకుపోవడానికి, తగిన వ్యూహాన్ని రచించడానికి సహాయపడేందుకు బ్రిటిషువారి మనస్సు యెలా పని చేస్తుందో స్పష్టంగా తెలుసుకోవడానికా కాలం సహాయపడింది. వారు యే కార్యనిర్వహణకై అవతరించారో ఆ మహనీయ కార్యం కోసం 'సన్నద్ధమైన' కాలంగా బరోడాలో వారు నివసించిన కాలాన్ని చూడవచ్చు. వారు నిర్వహించవచ్చిన ఆ మహాకార్యం మానవదశను దూకి దాటిపోయి, తరువాతి పరిణామదశయైన అతిమానసంలోనికి మానవజాతి ముక్తం గావడం. ఈ సంచికలో, వారు బరోడాలో నివసించిన సమయం మీద కేంద్రీకరించాం, ఆ కాలంలో వారి ఆలోచనలు, అనుభూతులపై దృష్టి పెట్టాం. అదే కాలంలో కొన్ని ప్రముఖ ఆధ్యాత్మిక అనుభవాలపై దృష్టి సారిస్తూ చివరకు వారు సాధించిన 'నిర్వాణ' సాక్షాత్కారంతో ముగించాం. శ్రీఅరవిందులు భారతదేశానికి తిరిగివచ్చి 125 సంవత్సరాలు జరిగిన సందర్భాన్ని పురస్క

రించుకొని కృతజ్ఞతా పూర్వకంగా జరుపుకొనే వేడుకలో ఒక సంక్షిప్త భక్తిపూర్వక అంజలిగా దీనిని సమర్పిస్తున్నాం. శ్రీఅరవిందుల అర్థంలో 'నిర్వాణ' మంటే,చాలా దూరంగా, ఆవలగా యెక్కడో వున్న యెవరూ ఇతఃపూర్వం ప్రయాణించని, దర్శించని నూతన ఆధ్యాత్మిక సీమల లోనికి సాగిపోయే ప్రారంభస్థితి అని అందరికీ స్పష్టంగా తెలుసు.

అనువాదం: కె. వి రావు

పుట్టుక — బాల్యము

ఇంగ్లాండు వెళ్ళుట

శ్రీఅరవిందులు (15 ఆగష్టు, 1872 లో కలకత్తాలో పుట్టారు. వారి తండ్రి — దృఢమైన వ్యక్తిత్వము, గొప్ప సమర్థత గలవారు. పిల్లల విద్యాభ్యాసం నిమిత్తం, ఇంగ్లండు వెళ్ళిన వారిలో వారు ప్రప్రథములు. అలవాట్లలోను, భావాలలోను, ఆద ర్శాలలోను శ్రీఅరవిందులు ఎంతగా ఆంగ్లీకరింపబడ్డారంటే, చిన్నతనంలోనే వారు ఇంగ్లీషు, హిందూస్తానీ మాట్లాడేవారు. వారి మాతృభాష (బెంగాలీ), ఇంగ్లాండునుండి తిరిగి వచ్చాక మాత్రమే నేర్చుకున్నారు. తన పిల్లలు యూరపువారివలె పెంచబడా లని, శ్రీఅరవిందుల తండ్రి నిశ్చయించుకున్నారు. వారు ఇండియాలో ఉన్నప్పుడు డార్జిలింగ్ లో ఐరిష్ సన్యాసినుల స్కూలుకు, తన పిల్లలను పంపారు. ప్రారంభవిద్య కొరకు 1879లో తన ముగ్గురు కుమారులను ఇంగ్లాడు తీసుకెళ్ళి, మతబోధచేసే ఇంగ్లీషు దంపతులకు అప్ప చెప్పారు. భారతదేశ లేక భారతీయ ప్రభావమేదీ తన పిల్లలపై పడరాదని వారిని హెచ్చరించారు. ఈ ఆదేశాలు తుచ తప్పకుండా పాటింపబడ్డాయి. భారతదేశము, దాని ప్రజలు, వారి సంస్కృతిపై పూర్తి అజ్ఞానంలో శ్రీఅరవిందులు పెరిగారు.

CWSA 36:15

పాఠశాల విద్య స్వయం అధ్యయనం

మాంచెస్టరులోను, సెయింటు పాల్సులోను, సంప్రదాయవిద్యపై శ్రీఅరవిందులు దృష్టిపెట్టారు. సెయింట్ పాల్సులో ఆఖరి మూడు సంవత్సరాలు స్కూలు పాఠ్యాం

శాలపైనే దృష్టి పెట్టారు. విరామసమయంలో ఎక్కువ భాగం సాధారణ విషయాలు చదివేవారు. ముఖ్యంగా ఇంగ్లీషుపద్యాలు, సాహిత్యము, కల్పితకథలు, ఫ్రెంచి సాహిత్యం; ఇంకా పురాతన, మధ్య, ఆధునిక యూరపు చరిత్ర. ఇంకా కొంత సమయంలో ఇటలీ, జర్మన్, స్పానిష్ భాషలు నేర్చుకునేవారు. కొంత సమయంలో పద్యాలు రచించేవారు. స్కూలు చదువు చాల తక్కువ సమయం తీసుకునేది. స్కూలు చదువులు చాలా సులభంగా ఉన్నాయని, ఎక్కువ శ్రమించనవసరంలేదని భావించేవారు. కాని కింగ్ కళాశాలలో అనేక బహుమతులు గెల్చుకోగల్గారు. గ్రీకు, లేటిన్, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలలో గొప్ప ప్రావీణ్యం పొందారు. జర్మన్, ఇటాలియన్ వంటి పరదేశ భాషలతో పరిచయం ఏర్పర్చుకున్నారు.

CWSA 36:15

రాజకీయ అభిరుచులు - కార్యకలాపాలు

శ్రీఅరవిందులకు, వారి తండ్రి, వార్తాపత్రిక పంపడం ప్రారంభించారు. భారతీయులపై బ్రిటీషువారి అత్యాచారాలను బెంగాలీ పత్రికలో మార్కుచేసి, పంపేవారు. ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వం చర్యలను ఖండింస్తూ ఉత్తరాలు రాసేవారు. హృదయం లేని ప్రభుత్వంగా బ్రిటిషు ప్రభుత్వాన్ని నిందించేవారు.

పదకొండు సంవత్సరాల చిరుప్రాయంలోనే — గొప్ప తిరుగుబాటు మార్పులు — ప్రపంచంలో రాబోతున్నాయని వారందులో ప్రముఖ పాత్ర వహించవల్సి ఉంటుందని శ్రీఅరవిందులు పసిగట్టారు. అతని దృష్టి ఇండియా పై పడింది. ఇది క్రమంగా, స్వదేశవిమోచన వైపు మరలింది. కాని ఈ దశలో ఒక దృఢనిశ్చయం, ఒకరూపు ఏర్పడటానికి ఇంకా నాల్గు సంవత్సరాలు పట్టింది. ఇండియా మజ్లిస్ సంఘంలో సభ్యునిగా, కార్యదర్శిగా కేంబ్రిడ్జిలో అనేక ఉద్రేకపూరిత ఉపన్యాసాలిచ్చారు. ఇవి తరువాతి కాలంలో అతనిని 'ఇండియా సివిల్ సర్వీసు' నుండి తొలగించడంలో ప్రముఖపాత్ర వహించాయి. వారు గుర్రపుస్వారీ పరీక్షలో ఉత్తీర్ణులు కాలేకపోవడం, ఒక సాకు మాత్రమే. ఈ లోపం ఇండియాలోనే సరిదిద్దుకొనే అవకాశం కొందరకు ఇవ్వబడింది.

*

లండన్‌లో భారత విద్యార్థులు ఒక మారు కల్సుకొని, ఒక రహస్య సంస్థ ఏర్పాటు

చేశారు. దాని పేరు 'కమలము-కత్తి' అందులో ప్రతి సభ్యుడు శపథం చేశాడు. తాను భారతవిమోచనకు కృషి చేస్తానని. ఈ సంస్థను శ్రీఅరవిందులు ఏర్పాటు చేయలేదు. కాని తన సోదరునితో కల్సి తానుకూడ సభ్యునిగా చేరారు. ఆ సంస్థ ఇంకా శైశవ దశలోనే ఉంది. ఇది జరిగింది, శ్రీఅరవిందులు కేంబ్రిడ్జిని చివరిసారిగా వదలి, ఇండియాకు తిరిగిరాకపూర్వము.

ఆ సమయంలో భారతరాజకీయాసు బిక్కుబిక్కుమంటూ ఉండేవి. ఇది ఇంగ్లండులో భారత విద్యార్థుల తొలి ప్రయత్నం మాత్రమే.

ఇంగ్లాండు నుండి మరలుట

అతనికి ఇంగ్లండు విడిచినందుకు, పశ్చాత్తాపం లేదు. గతంతో అనుబంధం లేదు; భవిష్యత్ లో అచట ఉండే భ్రమలు లేవు. ఇంగ్లండులో కొద్దిగా స్నేహాలు ఉండేవి. ఏవీ ఎక్కువ సన్నిహితమైనవి కావు. మానసిక వాతావరణం సానుకూలంగా లేదు. దానిని తప్పించుకోవల్సిన అవసరంలేదు.

ఆంగ్లానికి, యూరపు భావాలకు, వాగ్మయానికి, అనుబందం ఉండేది, అతనికి. కాని, ఒక దేశంగా, ఇంగ్లాడుతో ఏ అనుబంధం, ముడులు, లేవు. మన్మమోహన్ వలె, ఇంగ్లాండును తను దత్తత తీసుకొన్న దేశంగా చేసుకోవాలనే ఉద్దేశం కూడా లేదు. అతనికి రెండవదేశంగా, యూరపు భూమితో ఏదైనా అనుబంధం ఉండి ఉంటే, అది మేధోపరంగా, భావోద్వేగ పరంగా, నేను ఈ జన్మ లో చూడని, నివసించని ప్రాన్సుతోగాని, ఇంగ్లాండుతో కాదు.

*

1893 నుండి 1906 వరకు పదమూడుసంవత్సరాలు శ్రీఅరవిందులు బరోడా సర్వీసులో గడిపారు. మొదట రెవెన్యూశాఖలోను, తరువాత మహారాజ సచివాలయం లోను తరువాత ఆంగ్ల ఆచార్యునిగాచివరగా బరోడా కళాశాల ప్రిన్సిపాలుగా ఈ సంవత్సరాలు వారి స్వయం కృషికి సాహితీకార్యకలాపానికి చెందినవి. తరువాత కాలంలో వారు పాండిచ్చేరి నుండి ప్రచురించిన పద్య రచనలు, ఎక్కువగా ఈ కాలానికి చెందినవే, ఈ కాలంలో వారు రచించినవే. ఈ కాలంలోనే పునాది పడింది, వారి భవిష్యకార్యానికి. వారి తండ్రిగారి స్పష్టమైన ఆ దేశాలకనుగుణంగా వారు

ఇంగ్లండులో పొందారు. పాశ్చాత్యవిద్యను. ఇండియా సంస్కృతితోగాని, తూర్పు[1] దేశాల సంస్కృతితోగాని, ఎట్టి సంపర్కం లేని లోటును వారు భర్తీ చేశారు బరోడాలో. ఇక్కడే నేర్చుకున్నారు. సంస్కృతం, ఇతర ఆధునిక భారతీయ భాషలను. ఈ కాలపు చివరి సంవత్సరాలు ఎక్కువభాగం వారు గడిపారు. సెలవులలో నిశ్శబ్ద రాజకీయాలలో. బరోడాలో వారి స్థానంవల్ల, ప్రజా ఉద్యమాలనుండి నిషేధింపబడ్డారు.

1905 లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా, దూసుకు వచ్చిన ప్రజా ఉద్యమం — అతనికి ఒక అవకాశమిచ్చింది — బరోడా సర్వీసును విడిచిపెట్టడానికి బాహ్యంగా రాజకీయ ఉద్యమంలో ప్రవేశించడానికి . 1906 లో అతడు బరోడా విడిచి కలకత్తా వెళ్ళారు. కొత్తగా స్థాపింపబడ్డ బెంగాల్ జాతీయకళాశాల ప్రిన్సిపాల్‌గా చేరారు.

*

నన్ను మొదట సెటిల్మెంటు శాఖలో వేశారు. పని నేర్చుకొనేందుకు. తరువాత రెవెన్యూస్టాంపుశాఖలోను, తరువాత సచివాలయంలో వేశారు.పని నేర్చుకుందుకు. (ప్రైవేటు కార్యదర్శిగా కాదు) సచివాలయంలో పనిచేసేవాడిననే కథనాలున్నాయి. కలాశాలలో నా మొదటి పని ఫ్రెంచి ఉపన్యాసకునిగా. కాని అది ఒక గంట మాత్రమే. మిగిలిన సమయంలో ఇతర పనులు ఇవ్వబడేవి. నేను సహాయ ప్రైవేటు కార్యదర్శిగా నియమింప బడ్డ జ్ఞాపకాలు లేవు. (చాలా కాలం తరువాత, ఆంగ్ల ఆచార్యునిగా అయ్యాక అది శాశ్వత నియామకం నేను నిరంతరాయంగా కొనసాగాను. నేను ఉప ప్రిన్సిపాలుగా నియమింపబడేవరకు వాస్తవంగా, నేను బరోడా విడిచిపెట్టేంతవరకు.

CWSA 36 అనువాదం: ఎస్.వై. సోమయాజులు

---


[1] *పురాతన, మధ్య ఆధునిక, యూరపు సంస్కృతికి — ఇంగ్లాండులో శ్రీఅరవిందుల విద్యాభ్యాసం — ఒక గొప్ప విశాల విస్తృత ఉపోద్ఘాతం — అని గమనించాలి. గ్రీకు, లేటిన్ భాషలలో అతడు ఒక గొప్ప ప్రతిభగల పండితుడు. చిన్నతనంలో మాంచెస్టరులో ఫ్రెంచి నేర్చుకున్నారు. సొంతంగా వారు జర్మనీ, ఇటలీ భాషలు నేర్చుకున్నారు. డాంటే, గోథేలను, వారి మాతృభాషలోనే చదవగలరు. కేంబ్రిడ్జిలో వారు 'ట్రిపోస్' ఉత్తీర్ణులయ్యారు. ప్రథమశ్రేణిలో. భారతీయ నాగరికతను, దాని హృదయాన్ని దాని — భూత, వర్తమాన రూపాలలో జీర్ణింపజేసుకున్నారు.*

CWSA 36:6

స
నాది కాదు బైరన్ యొక్క మెరుపుల బల్లెం
నాది కాదు వర్డ్స్‌వర్త్ ప్రశాంతశైలి ప్రస్థానం.
నాది కాదు షెలీ విషాద కవిత
సమతుల్యుడు లేని కీట్స్‌దీ గాదు
నేను భారత జలాల వైశాల్యతచే
తొంగి చూశా గతం యొక్క మేజిక్ (మాయ)
బూర పైపు పై వాయిస్తా
ముందటిరోజు రూపు మారిన ప్రతిధ్వనులను.

(CWSA: 2. P.41)

Note: This poem is titled "To a The Hero-worshipper". It consists of two parts. The above is the translation of first para of Part I.



తొలి కవితలు

న్యాయమైన మనిషి

("The Just man") [illegible]

ఆశా, భయమ్ములు కదలించలేని మనిషెక్కడ,
అతనిని విజ్ఞతగల దేవతలాదరింతురు
సద్భావన, స్థిరసంకల్పం గల మానవ దివ్యుడు
కీడుకు తలవంచడు
ఎవని మార్గం స్వచ్ఛమో, కాంచనానికి లేక అధికారానికి దారి తప్పదో
ఉన్నతమూ, తిన్న దైన, పట్టివుంచుకోవలసిన మార్గమది
ఆతడే విజ్ఞుడు, ఆతనినే విజ్ఞతగల దేవతలాదరింతురు
ఆతడు మాత్రమే అర్హుడు.

రాధ విన్నపము (Radha's Appeal)

ఓ ప్రేమా! ఈ రాధ యింతకన్న యేమనాలి
ఈ లౌకిక భాష బలహీనగదా?జీవన మరణాలలో
మనుగడలో, శ్వాసలో
రాధ అన్వేషణ మరే ప్రభువుకోసం గాదు నీ కోసమే
నీ పాదాల చుట్టూ బలమైన వల అల్లబడె
బలంగా అందు బంధించ బడినాను.
నీ సేవకైనా మనస్సును
నాకుగా నేను విడిచివేసినాను
నీకు బానిస యగుట కంటె
మధురమైనది నా హృదయానికి వేరొకటి లేదు...
రాధనైన నేను భావించాను, నా జీవన ప్రియ ప్రభువులేక
నీ బలమైన తంత్రిని మీటుమిపుడు —
నాకు శక్తి లేదు
కేవలం మొక్క ఘుడియ జీవించనైన.
ఆయన, అసన్నిధి, నా అంతరాత్మను కత్తితో చీల్చినట్లుండు.

ఓ ఘడియ నా చూపునుండి నిన్ను దొంగిలిస్తే
నాలో నా హృదయం మరణిస్తుంది
లోలోతుల నిధులను, బాలికలు పొదవుకొన్నట్లు
నేను నిన్ను గుది గుచ్చి నా కంఠమందు, యెడదపై కానుకగా అలంకరించుకొంటి

మహిమాన్విత సూర్యునివల్ల దుఃఖం

మహిమగల సూర్యుడస్తమించినందున దుఃఖిస్తొ
మరుచటి ఉదయం, తూర్పు మళ్ళీ మెరుస్తుంది
ప్రబలబలాలు విధికి తలవంచి దుఃఖించడానికి
ఆ పతనం వల్ల నదిరెట్టించిన శక్తివంతమగు
ఎవని స్నేహపూర్వక ఘర్షణ, లేక బాధ నుండి ముకుళిస్తే
సంతోషం దక్కదు, మృత్యువును భయంకరంగా చేయ
ఎవరు సుదూర జీవనానికి హసిస్తూ రారమ్మని సైగచేస్తారో
కొనసాగే శ్వాస కొక వారధి
నిస్పృ, వ్యధ, విషాదకరదుఃఖం
పొడిబారిన కనులు లేక విపత్కర కన్నీళ్ళు
దాని ఉపశమనానికని నీ వుద్దేశించినవి హృదయాన్ని చీల్చినట్లు
మనిషి సమస్త భయాల పైశాచిక బృందం
అమృత మానవుని పరిమితంచేయ యీ పెళుసైన జీవిత
పరిధిని నమ్మే అవివేకానికి పుట్టాయి.

ఏమి మాట యిది?

ఏమిటీమాట హంతకు డెవ్వరు, హతుడెవ్వడు?
ఈ జ్వలితాంతరాత్మను ఛేదించ శక్తులు
పదునైనవిగావు, వరదలుపశమింపజేయలేవు
మృతత్వము, బాధ ఒక బలమైన దశకు
కేవలం ఒడంబడికలు మాత్రమే.
ఒక యోధుని వెంటాడగా దుర్విధి

ఒక మహా ప్రపంచ స్తంభంలా పతనమగును
ప్రజల హృదయాల వణికిస్తూ, ఆశ్చర్యం నింపుతూ
చూచువారలు మౌనంగా కూచుంటారు లేక దీనులై విలపిస్తారు
ఈ మధ్యలో, రంగస్థలం వెనుక, నటుడు నిట్టూరుస్తాడు
గుండెల నిండాశ్వసించి, తానేదైవుండెనో దానిని తొలగించుకొంటాడు.
నిరీక్షించే మిత్రులతో ముచ్చటిస్తాడు లేక ప్రక్క తెరల మాటునుండి
అంతిమ దృశ్యాన్ని ప్రశాంతంగా గమనిస్తూంటాడు
హతమైన వాని గాయపడని తత్త్వాలు సైతం అలాగే
మన దృష్టికందని చోట తిరిగి జీవిస్తాయి

CWSA 2: 43,32, 33, 182 — శ్రీఅరవిందులు

కె.వి. రావు

తొలి వచన రచనలు

విక్రమాదిత్యుని భారతం

విక్రమాదిత్యుని భారతదేశంవంక చూడండి! ఆమె సౌందర్యం యెంత ఉజ్వలం! ఆమె కవుల స్వరాలు యెంత గంభీరమైనవి! ఆమె చిత్రకారుల కుంచె యెంత విషయాసక్తి కలిగిస్తుంది. ఆమె శిల్ప కళాకృతులు యెంత ఉదాసీన భోగలాలస గలవి. ఆ రోజుల్లో ప్రతి మనిషి తనకు తానే ఒక అద్భుతం చాలామంది వాళ్ళ సహచరులకు అద్భుతమైన వాళ్ళు, కాని అందరికంటె అద్భుతమైనవారు తత్త్వ చింతనులు, దార్శనికులు. ఎటువంటి తాత్త్వికత అది! ఎందుకనంటే ధ్యానమనే రెక్కలుగల పావుకోళ్ళపై తేజోలోకాని కధిరోహించి, సూర్యునిపైకి, పరిభ్రమించే తారకలపైకి, విస్తృత జ్వాలల పైకి యెగసిపోయిందది. ఎచట విశ్వ సంబంధ జ్వలించు గోడలు, గాలిచే మబ్బుచే మార్పుచెందక వున్నాయో అచట మండుతున్న కేంద్రంలో అత్యున్నతమైన భగవంతుని మోమును దర్శించాయి.

ఆ తాత్త్వికత భగవంతుని దర్శించింది కాని నశించలేదు. విశేషించి భువిపైకి, భువి వెనుకకు వచ్చి పడింది. అది అత్యధిక వెలుగుతో పేలి పోలేదు. మానవుల పెదవులు పలుకలేని, లేక మానవ మస్తిష్కం అర్థం చేసుకోలేని మానవ భాషకు

అతి పెద్దదైన మార్మికతా భారంతో వచ్చి పడింది. అది అప్పటి ఆమె. నిదురించక సర్వద్రష్ట సూర్యుడు, మహమ్మదు పుత్రులు ఆమె పచ్చటి వైభవక్షేత్రాలపై మిడుతల దండులా విరుచుకుపడి ఆ బలీయమైన నిర్మాణ శిథిలాలను అనాగకరికంగా అంధకార తీరాలలోనికి విసురుగా విసరివేయడానికి వీలుగా మారిపోయేందుకు అయిదు శతాబ్దాలు కూడా పట్టలేదు.

CWSA 1:21

విశ్వంలోని, లయాత్మక సామరస్యత

నక్షత్రాల వంక చూడు. వాటిని స్వర్గ మస్తిష్కం అన్నాడు మెరిడెల్. వాటి బంగారు ధూమ పాత్రలపై తారట్లాడుచు, సౌందర్యమనే అగరుధూపంతో నిశిని పరిమళ భరితం చేయడానికి యెలా సాగిపోతున్నాయో చూడు. స్వర్గ నీలరెల్లు కాగితంపై పాకులాడు చున్న రెక్కల పురుగుల గుంపులవి, బంగరుజోరీ గల దండు, మండుతున్న ధూళి మేఘమది. ప్రకృతి తక్షణకుంచెచే బంధింపబడి, శాశ్వతత్వం కల్పించబడిన తళతళలాడు అణువుల ఒక అద్భుత ప్రభావ మది. అయినప్పటికీ అవి వీటన్నింటి యే ఒక్కటీ గాదు. కాని ఒక బృహత్తర పరస్పరాధారిత ప్రపంచాల లావాదేవీలవ్యవస్థ. అనంత శూన్యంగుండా నిశ్శబ్ద కక్ష్యలలో తిరుగుతూ, జ్వలించే గోళాలు, స్థల శాశ్వతత్వం చేత వేరు చేయబడ్డాయి. అవి వ్యక్తిగతమైనవి, ఒంటరివి. ప్రతిదానినుండి ప్రతిదానికి చేరే లోతు తెలియని, అచేతనమైన ప్రభావాలు పులకరింపజేస్తాయి. అద్భుత అయస్కాంత ఆకర్షణలు, ప్రతి కూల తుఫానులవలె నిరోధించు, లేక ఉబ్బుతుండే తెరచాపలలోని గాలివోలె నడుపు ప్రపంచాల ఒకే దివ్యసామరస్యతలో యీ యేకాంత వైభవాలను బంధించు, సౌరమండల సామరస్యత మనకు తెలుసు. అదెంత విజయోపేతపరిపూర్ణత, యెడమెడంగా వుండి కూడా యెంత సామరస్యంగా వుంటాయి. ఏకత్వంలో యెంత వ్యష్టిగతం! తారకు తార యెలా బదులు పలుకుతుందో! భవిష్యత్తును నిర్దేశించేందుకు తిరుగాడుతుండే సప్తర్షి మండలాలు, లక్షలాదిమైళ్ళు యెడంగా వుండి అవి యెలా పరిభ్రమిస్తున్నాయి. తమను సూర్యునితో శాశ్వతంగా బంధించుకొని అదృశ్య అయస్కాంత పాశాలతో బంధించుకొని తమతో లాక్కుపోతూన్నాయి. స్థిరంగా వుండేవని మనం నమ్మే ఆ వెలుగులలో, ప్రతి ఒక్కటీఒక సూర్యుడు, దాని చుట్టూ అపారమైన సుడులలో

ఒకే ఒక అచంచల, అమృత నక్షత్రం చుట్టూ ఒక లయబద్ధ సామరస్యతలో నర్తిస్తున్న గోళాలు, పైపెచ్చు మనకు యేది స్థిరంగా వున్నదని అన్పిస్తున్నదో అది భగవంతునికి ఒక గోళం అని ఊహించడం అసంబద్ధ ఊహఅవుతుందా! బహుశా చంద్రలోక వాసులకు తడబడుతున్న యీ మన భూమి స్థిరమైనదిగాను నిరంతరం వెలుగుతున్న వెలుగుగానూ కన్పిస్తాందేమో! మనం ఆరాధించే వెలుగు ప్రభువునకు వైభవోపేత బంతిలా, మరింత ప్రకాశవంతమైన, మరింత పెద్దదైన యేదో రాచ ప్రతినిధిగావచ్చు. ఒక అధమ సామరస్యతల ఒక శ్రేణిగా మనం విశ్వాన్ని భావించవచ్చు. ప్రతి సామరస్యత తనలో తాను పరిపూర్ణం, ఒకే ఒక్కటైన, విశ్వజనీనమైన సమగ్ర సామరస్యతకు సహాయపడ్తుంది.

CWSA 1: 28-29

ప్రతిచోటా భగవంతుని వైశాల్యత

భగవంతుడు నక్షత్రంలో మండుతున్నాడు. రోజా పుష్పంలో వికసిస్తున్నాడు. పరుగులు పెట్టే ఆతని రథ దూళే మేఘం. ఆయన చిత్తవృత్తులను తెలిపే నురుగును గ్రక్కే అద్దం సాగరం. గాలిలో ఆతని శ్వాస యీలలూదుతుంది. సూర్యాస్తమయంలో వుండేది అతని ఎరుపెక్కిన మోము. వర్షం ఆయన వ్యధను ధారలుగా వర్షిస్తుంది. ఆతని నీలారుణవర్ణ దివ్యనేత్రాలపై మృదువుగా వాలు కనురెప్పల వెంట్రుకలు ఆ అంధకారం. నిద్రించునపుడు తలక్రింద పెట్టుకొని పుష్పతలగడను వీడి, పైకిలేస్తున్న ఆనందకర మిసమిసలాడు మోము ఆ రక్తవర్ణపు ఉషస్సు. భస్మీకరించు ఆతని జటాజూటాల నుండి శాశ్వతుని ఘన యెడదపై ప్రసరించు కాంతి గాక వెన్నెల మరేమి యగును, మానవ ఆకాంక్ష, మన క్షుద్ర చిరాకులు, మన దయనీయమైన కోపతాపాలు, మన సంచలనాత్మక వ్యామోహాలతో ఆయన కేమిపని? ఐయన మనల గురించి ఆలోచించ దయతో అంగీకరిస్తే, మన శక్తుల మొగ్గుదలను పూర్తిగా అపార్థం చేసుకొన్న అసమర్థ నటుల నటనలా వుంటుంది. హాస్యగాడు వాగాడంబర ధోరణిలో అరచి నట్లుంటుంది. విషాద పాత్ర పోషించే కళాకారుడు ఒక మూకాభినయపు విరామాలలో, బఫూన్ పాత్ర పోషించినట్లుంటుంది. రోమియో వ్యామోహన్ని రంగులలో చిత్రించే ప్రతిభ ఒక అసంబద్ధ రూపాన్ని చూపుతుంది. సౌందర్యపు ధవళ యెడద నుండి ఆనంద ఉంగరాల ముంగురులను భగవంతుడు పైకెత్తినపుడు మనం వికారా

లపై నిలచిన ఆతని చూపు మెరుపులు, పిడుగుల్లో, మనల పరిహసించు వికటాట్టహాసాన్ని వింటాం. అంతగా నిరర్థకంగా తయారైన హాస్యంపై, అమిత దుబారా అయినదానిపై ఆతడెందుకు ఒక తీవ్ర ఆలోచనను దుర్వినియోగపరచాలి?

CWSA 1: 31-32

మనిషిలో, జంతువులో సౌందర్యం ప్రేమల విషయం

మీరు నిమ్న జంతు స్వభావాన్ని గురించి, ఉన్నత ఆధ్యాత్మిక స్వభావాన్ని గురించి మాట్లాడారు. మీరు మాట్లాడిన దానినుండి మేం గ్రహించినది మనిషికి మాత్రమే ప్రత్యేకమైవున్న గుణాలు, కొన్ని లేక అన్ని జంతువులతో పంచుకొనే వాటికన్నా ఉన్నతమైనవని? ప్రేమకంటె కపట నాటకం వున్నతమైనదా? ఆ భావాన్ని చీత్కరిస్తూ తిరస్కరించాలి. అయినా కపటనాటకం మానవజాతి ప్రత్యేకత, కాని ప్రేమచాలావరకు, ఆధ్యాత్మికమైన ప్రేమ, అతడు భారతదేశ చిత్తడి నేలల్లో వుండే ఒక పావురంతో లేక అడవి బాతుతో పంచుకొంటాడు. అతడు సుదీర్ఘ నిశియందు మెలుకువతో జీవించలేడు, కారణం, అభివ్యక్త ప్రకృతి అతనిని అతని జీవితభాగస్వామి నుండి వేరుచేసింది, తన బాధ నొక ఓదార్పు పలుకుతోనైనా ఉపశమింపజేస్తుందేమోనని. మోహభరిత వేడుకోలుతో శీతల జలం తటతటమని తాకు తీరాలపైగా ఎల్లపుడు విలపిస్తూనే వుంటాడు."ప్రేమా నాతో సంభాషించు" అనే అతని అరణ్యరోదనను వన సంచారులు సంచరిస్తూ వింటున్నారు. ఒకరు అందంగా ఉన్నారు, మరొకరు అంత అందంగా లేరు. వేరొకరు అసలు అందంగానే లేరు అని వివిధ లక్షణాలను గురించి మాత్రమే చెప్పగలం. అందం అనేది, జంతువులా వుండడంలోగాని లేక జంతువుకంటె అధికుడై వుండడంలో గాని వుండదు. అందుకు చాలా భిన్నమైన దానిలో వుంది.

CWSA 1:1- 63

పరిణామం పరిపూర్ణం చేస్తుంది గాని రద్దు చేయదు

పరిణామం రద్దు చేయదు, పరిపూర్ణం చేస్తుంది. పెద్దపులిలో పెరుగుతుండే క్రౌర్య బీజం మనిషి స్వభావంలో అత్యంత లోతుల్లో వున్నది. అది ఒక తరంలో అత్యంత కనీస స్థాయికి తగ్గినపుడు, మరో తరంలో పెరుగుతుంది. తన స్వకీయ

అస్తిత్వంలో వున్న దాని కూకటి వేళ్ళను, రక్త మోడుతున్నా పెరికి వేయకుండా క్రూరత్వాన్ని సమూలంగా నాశనం చేయడం సాధ్యంకాదు. అయినప్పటికీ పెద్దపులిలో మృగసంబంధక్రౌర్యం ఠీవిగా, దానికి ఉచితమైనదిగా కళాత్మకంగా వుంటుంది. అదే క్రౌర్యం మనిషిలో ఆటవికంగా, మొరటుగా, అసంబద్ధంగా వుంటుంది. అదే క్రౌర్యం మనిషిలో పరిపూర్ణ సహజలక్షణంలో వీలైనంత హుందాగా, నిరపాయంగా, కుదురుకొనేంతవరకు దాని కవల సోదరుడైన, భౌతికధైర్యం, దాని దూరపు చుట్టమైన భౌతిక ప్రేమల వలె శిక్షణ యివ్వాలి, సంస్కరించాలి.

CWSA 1: 64- 65

సద్గుణాల సామరస్యత

ఆనందంగా వుండాలనే సద్గుణంలో, అందానికి సంబంధించిన అంశాలలో పరిపూర్ణమైన సామరస్యత వుండాలనే విషయంలో, వర్ణం విషయంలో లవంగంలోని సువాసనలా బాగా తక్కువగా వుండగూడదు. సూర్యకాంత పుష్పంలో లాగా కళ్ళు జిగేలు మనేటట్లు వుండకూడదు. అలాగే పరిమళం కూడా పసిగట్టలేనంత తక్కువగా ఉండకూడదు. తడి నేలల్లో పెరిగే గులాబీ జాతి మొక్కపూవులోమాదిరి భరించలేనంత ఘాటుగా వుండకూడదు. అన్ని అంశాలూ వాటిలో అవి సామరస్యంగా వుండి, ప్రతి ఒక్కటి యితర ప్రతి ఒక్కదానితో తగిన నిష్పత్తిలో వుండాలి అనే నా అభిప్రాయంతో నీ వేకీభవిస్తావు కదూ?

మనం సద్గుణానికి, మన వ్యక్తిత్వానికి సహజమైన, పుట్టుకతో వచ్చిన లక్షణాలకు నిర్వచనాన్ని పరిణామం అంటూ, పరిపూర్ణ అనే విశేషణాన్ని కట్టబెడ్తూ విస్తృత పరచాం. లక్షణాలు పరిణమించిన వాటి పరిపూర్ణతలో, తప్పక ఒక దానితో ఒకటి సామరస్యంగా వుంటాయనీ, అందమైన రూపం, వ్యక్తీకరణా కలిగి వుంటాయని, అందమైన రంగు లేక అంతరాత్మ, దివ్యజ్ఞానాన్ని వ్యక్తం చేసేవిగా, మనోహరమైన పరిమళాన్ని కలిగి వుంటాయనీ మొత్తం మూడూ కలిసి యుక్తమైన, సందర్భానికి తగిన సమరసత కలిగి వుండేటట్లు మాటలలో ఆ విశేషణానికి పూర్తి సువాసనను కట్ట బెడ్తాం కూడా. మన అంతరంగాల్లో యిటువంటి నమ్మకంతో మనం ముందుకు నిషేధాన్ని లెక్కచేయకుండా పోయి, మర్యాదకు భంగం కలుగకుండా పుట్టుకతో వచ్చిన మన సహజలక్షణాలను, శక్తులను, ఒక అందమైన సామరస్యతగల పరిపూర్ణత

లోనికి పరిణమింప జేసేంతవరకు, తేజోవంతమైన వాతావరణంద్వారా, సజీవ కవితల్లాగా, వయ్యారంగా నడుచుకుంటూ, యే శాఖనుగాని, లేక వికసనాన్ని గాని జరుగనీయకుండా అడ్డుపడకుండా యీ ప్రపంచపు నశించిపోయే సత్కారాల కంటె,ఒక సజీవ వైభవ కిరీటాన్ని యిష్టపడుతూ, యుగాల గందరగోళ గొణుగుడు ద్వారా వినవస్తున్న క్రీస్తు ప్రతిజ్ఞా పూర్వకప్రశ్న" తన అంతరాత్మను కోల్పోయిన మనిషికి ప్రపంచం మొత్తం స్వంతమైనప్పటికీ అతనికి కలిగే ప్రయోజనం యే పాటిది? అతని కలిగే లాభం యే పాటిది?" అనే ప్రశ్నకు వినసొంపైన తత్త్వసిద్ధాంతాల ననుసరించి, పరిపూర్ణ సౌందర్య జీవనంచే, సమస్త మేధస్సును దాటిపోయే భగవంతుని శాంతిని సముపార్జించుకొన్న విన సొంపైన దర్శన సిద్ధాంతాల ననుసరించి సమాధానం చెప్పవలసివుంది.

CWSA 1:74- 77 *అనువాదం: కె.వి.రావు*

పైనుదహరించిన తునకలు " సద్గుణ సామరస్యత" అనే నాటకంలోనివి. దీనిని శ్రీఅరవిందులు 1890, 1892 మధ్యలో ఇంగ్లాండులో వున్నపుడు రచించారు.

ఓ అమాయక పిచ్చి ప్రేమికా, కన్నీళ్ళతో
ఆపలేని మృత్యువును నీవు ఒప్పించలేవు
నీ అన్ని కష్టాల కాతడు చూపించడు జాలి, తెలుసుకోనూలేడు,
ఆతని శిలా సదృశనేత్రాలు సంగీత మధురిమతో దయగా చూడలేవు.
ఔననలేవు ప్రేమ పలుకులకు, అయినపుడు నీ వెలా
ఆ భయంకర ఛాయతో పోరగలవు, ఎవరు రక్షించలేరో
ఒక్క పుష్పాన్నైనా వాడకుండా, దేవతలు కోరే ఒకే ఒక్క
జీవిస్తున్న మనుజులందరినుండి అభ్యర్థన, త్యాగం,
అది చేయకుండా యేకిరీటమూ దక్కించుకోలేవు.

CWSA 2:126 ("ప్రేమ మృత్యువు") నుండి *ఆంగ్లమూలం: శ్రీఅరవిందులు*

అనువాదం: కె.వి. రావు

కల్పితగాథలు, పురాణ కథలు

భారతీయ సాంప్రదాయానికి గ్రీకుల నమ్మకాలకు మధ్యనున్న వ్యత్యాసం:

హిందూ పురాణగాథలు గ్రీకుల భావాలపై అనివార్యమైన ప్రతి చర్యను కలిగిస్తాయనే విషయాన్ని మనం కాదనలేము. గ్రీకుల భావజాలం స్వచ్ఛమైన తెలిమంచులా పరిశుద్ధమై, తేనె వలె మధురమైన హెలెనిక్ సంస్కృతిపై ఆధారపడి ఉంది. ఆకృతిలో ఉండగల పొందిక, సౌందర్యము వారి ఆదర్శాలు కాని, హైందవంలో కల్పితానికి, ఊహాజనిత స్వరూపాలకూ తగినంత అవకాశం ఉంది. ప్రపంచంలో అన్ని చోట్లా అట్టి ఊహాజనిత భావజాలమే నిండి ఉంది. అదొక నిరాకారమైన 'అనంతం' లాంటిది అని చెప్పవచ్చు. కాని గ్రీకులకు ఇది అనాగరికంగానూ, సత్యదూరంగానూ అనిపిస్తుంది.

అదే సమయంలో ఈ కారణంగా హైందవభావాలను తిరస్కరించడం, కాల్పనికాన్ని అంగీకరించలేకపోవడం, సత్యాన్ని, సౌందర్యాన్ని మాత్రమే నిజమని నమ్మే వారిలో సహజంగా వుండే లోపాలు! స్వచ్ఛమైన సత్యాన్ని, విలువలను, విమర్శనను గౌరవించే గ్రీకులు హైందవ సాంప్రదాయంలోని కల్పితాలనూ, ఊహాజనిత గాథలనూ వ్యతిరేకిస్తారు. సత్యాన్ని, సౌందర్యాన్ని, సహేతుకమైన విమర్శను, నమ్మేవారెవరైనా కల్పిత గాథలను, ఊహాజనిత భావాలను నమ్మలేరు! ఎవరైనా వారి భావాల పరిధిలోనే ఉండగలరు. ఆ చట్రం దాటి బయటకు రాలేరు. వారి ఆలోచనా పథంలోకి ఇతరుల మనోభావాలు, కృతకభావనలు అడుగిడలేవు. అందువలన హైందవంలోని కల్పనలను, ఊహాజనిత స్వరూపాలనూ వారు అర్థం చేసుకోలేరు. ఇవి వారికి అసహజంగాను, అందవికారంగాను, విపరీతంగాను అనిపిస్తాయి. కాని, ఈ కల్పనలలో కూడా ఒక విధమైన సద్భావన అంతర్లీనంగా వుంటుంది. ఉత్సుకతను కలిగించే లక్షణం కూడా వుంటుంది. ఊహాలలో కూడా అనేకమైన కళాత్మక భావనలు జనిస్తాయి. అవే అనేక రూపాలలో మనసులో గోచరిస్తాయి. ఈ విధంగా ఏర్పడే ఆకృతులు, కల్పనలూ కూడా పరిపూర్ణత్వం దిశగా కొనసాగేవే! కాని, గ్రీకు మనస్తత్వం ఈ విధమైన విశాల దృక్పథాన్ని అంగీకరించలేదు. దాని నిర్దిష్టమైన సునిశిత భావ చట్రంలో కళాత్మకమైన భిన్నత్వం ఇమడలేదు. కళలలోనూ, విమర్శనల్లోనూ నిత్యనూతన

సత్యాన్ని ప్రోత్సహించే బహుముఖమైన విస్తృతి గ్రీకు మానసిక పరిధిలో ఇమడలేదు.
CWSA 36:125

పురాణ గాథలు రెండు రకాలు:

గాథలను నేను రెండు వర్గాలుగా విభజిస్తాను. ఒకరకం మతానికి, వేదాంతానికి అన్వయిస్తుంది. రెండవది లౌకిక ప్రపంచానికి చెందిన కల్పన. మొదటి రకం చర్యలకు అవకాశం ఇవ్వదు. ఇది మధ్యయుగాలలో రూపొందిన హైందవ భావాలకు ప్రతీక. ఒక విధంగా ఇది పద్యకావ్యం. కొన్ని నిర్దిష్టమైన భావజాలాలకు అనువుగా ఇది రూపు దిద్దుకుంది. పాశ్చాత్యుల భావనలో ఇది నమ్మ శక్యం కాదు. వారి నమ్మకాలకు ఇది వ్యతిరేకం కూడా! ఈ పురాణాలను చూడగనే వారికి తల తిరిగినంత పని ఔతుంది. ప్రాశ్చ, పాశ్చాత్య బేధ భావం ఇలా ఏర్పడినదే. మనస్తత్వపు మూలలలో జనించినవి కావటంవలన వీటిని వదిలించుకోవటం దుర్లభమే. ఊహాజనిత మత విశ్వాసాలు గ్రీకుల మనస్తత్వానికి సరిపడవు. ఒకవేళ మతవిశ్వాసాన్ని వారు ఆమో దించినా, అది సహజంగానే, ముక్కు సూటిగా, సైద్ధాంతికంగా వుంటుంది. అట్లాంటి వారికి ఇతర మతాలలోని ఊహా కల్పనలు అసహజంగాను, అసత్యంగాను, శుష్కమైనవి గాను తోచటంలో వింతయేముంటుంది. బలమైన వేదాంత ధోరణి, కాల్పనిక ప్రతీక వాదములతో కలగా పులగంగా ఉండటం అసంబద్ధంగాను, నిర్హేతుకంగాను వారికి గోచరిస్తుంది. సిద్ధాంతంలో కాల్పనిక, ఊహాజనిత భావాలు ఉండటం వారికి గిట్టని విషయం.

కాని ఈ రకమైన ఊహాజనిత ధోరణులే హిందూ మతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలచి, నూతనత్వాన్ని గడించి పెట్టాయి. కొన్ని సందర్భాలలో గొప్ప గొప్ప భావ నలు ఇతి హాసాలలో ప్రతీకలుగా నిలచి విచిత్రమైన అందాలను సంతరించుకున్నాయి. అట్టి విచిత్ర ప్రక్రియలను గాని, అవాస్తవిక కల్పనలను గాని, ఆ పురాణేతి హాసాలు నుండి తొలగిస్తే, ఆ పురాణగాథలు వాటి ఉనికిని కూడా కోల్పోయే ప్రమాదం వుంది. పాశ్చాత్యులకు ఇవి ఎంత అవాస్తవికాలుగా ఉన్నా, భారతీయులు వాటిని సహజమైనవిగాను, సత్యమైనవిగాను భావించారు. ఆ విధంగానే స్వీకరించారు. ఇక ఇంతటితో ఫలితంలేని ఈ చర్చను ముగిద్దాము.

ఇక లౌకిక గాథల విషయానికి వస్తే, ఒకటి మాత్రం నిజం. ఆ కథలలో ఉన్నవి

చాలవరకు పిల్లల కథల వంటివి. వాటిలో ఎక్కువ భాగం హాస్యాన్ని గొలిపే వికార రూపాలేవుంటాయని చెప్పవచ్చు. కాని ఈ వికృత స్వరూపాలు వాటి అసలు లక్షణం కాదు. ఆ గాథల కథా కథనంలో సందర్భోచితంగా ప్రత్యక్షమయ్యే రూపకల్పనయే ఆ కృత్రిమ ఆకృతులు. హిందూ తత్త్వానికి ఇది సహజంగా వుండేదే. హిందూ సంస్కృతిలో అంతర్లీనంగా వుండే ఈ లక్షణం ఈ మతం పరిఢవిల్లిన యుగాలలో లేనే లేదు. పురాణ కథలలో ఉన్న వైకల్యం హిందూమతంయొక్క క్షీణదశలలో మాత్రమే వచ్చి చేరింది. అది సాహిత్యరూపంలో కూడా ప్రతిబింబించటం మన దురదృష్టం. వ్యాసుని మహాభారతం మొదట్లో 24,000వేల శ్లోకాలకు మాత్రమే పరిమితమై యుండేది. కాని కాలగమనంలో అనేకమంది పరిష్కర్తలు దాని విస్తృతిని అనేక అర్థంలేని ఉపాఖ్యానాలతో గణనీయంగా పెంచివేశారు. ఇప్పుడు అది ఒక మహా సముద్రంలా తయారైంది. ఆ సముద్రంలో అసలు గ్రంథం మునిగిపోయింది.

అదంతా సాహిత్యపు విలువలు క్షీణించిన శతాబ్దాలలో " పండితం మన్యులు" చేసిన నిర్వాహకమే!

ఈ మహాసముద్రపు అలలమీద కొట్టుకొని వచ్చి ఒడ్డున చేరినవే ఈనాడు మనకు లక్ష్యమైన పురాణేతి హాసాలు. అసలు గ్రంథంలోని సౌందర్యం క్రమంగా కనుమరుగై, చివరకు వికృత రూపాలు మిగిలాయి. కాలక్రమేణా తేలిన కృతక కావ్యభాగాలకు సహజ సౌందర్యాన్నీ, సహజత్వాన్నీ నేర్పరులైన కవులు ఇతిహాసాలుగా, నాటకాలుగా రూపకల్పన చేసి వీలయినంతవరకు మనకు అందించారు. ఆ గ్రంథాలన్నీ ఎంతో ఉదాత్తమైనవని చెప్పవచ్చు. ఉదాహరణకు మహాభారతంలోని "శకుంతలోపాఖ్యానం" లో ఎంతో కళావిహీనంగావున్న "శకుంతల దుష్యంతుల" కథను కాళిదాసు ఎంత గొప్పగా మలిచేడో ఈ రెండు గ్రంథాలూ అధ్యయనం చేసిన వారికి ఎవరికైనా తేటతెల్లం అవుతుంది. కాళిదాసు కథను ఎంత రసవత్తరంగా మలిచాడో, ఎంత సున్నితమైన భావాలు చర్చించాడో, ఎంత ఉదాత్తమైన ముగింపులు కథలో ప్రవేశపెట్టాడో ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు.

CWSA 36:126-27

హిందువుల మనస్తత్వం:

హిందూపురాణాలలో గ్రీకు గ్రంథాలలో ఉన్న భౌతిక భావ దృక్పథం ఉండదు.

ఇవి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఒక నిరాడంబరమైన, ఆదర్శవంతమైన జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. చూడటానికి నేరాలుగాను, అధర్మంగాను కనుపించే కథావస్తువులలో కూడా నిరాడంబరమైన ఆదర్శ జీవనమే గోచరిస్తుంది. ఈ పురాణ గాథలలో ఉద్రేక పూరితంగా ప్రవర్తించే "ఈడిపస్" "ఏగమెమ్నాన్" గాని ఉండే ప్రసక్తే లేదు. వీరు గ్రీకు యోధులు. ప్రతీకారం కథావస్తువుగా ఉన్న సందర్భాలలో కూడాఏదో కొంత ఊరట ఉండటం కద్దు. ఇది నాలాంటి మనస్తత్వం ఉన్నవారికి స్పష్టంగా తెలుస్తుంది. ప్రపంచంలో సంభవించే భౌతిక అనుభూతులు గ్రీకు గాథలలో మనం చూస్తాం. కాని, భారతీయ సంస్కృతిలోని గాథలలో గొప్ప ఆధ్యాత్మిక సౌందర్యం ఉట్టి పడుతూ ఉంటుందనేది కాదన లేని సత్యం. ఇవి ప్రపంచాన్ని సౌందర్యంతో నింపాలనే ప్రయత్నం చెయ్యక పోవచ్చు. కాని వాటి గమనంలో విషయంలోని నిగూఢతను వెలికి తీసి, దానిని సమున్నత జీవిత శిఖరాలపై ప్రతిష్టించే ప్రయత్నం చేశాయి. ఈ విషయంపై నన్ను ఇంకొంచెం విపులంగా, స్పష్టంగా వివరించనివ్వండి.

భారతీయ, మరియు గ్రీకు మనస్తత్వాల మధ్య ఉన్న తేడా ఏమిటంటే, ఒకటి ప్రాణిక శక్తులకు సంబంధించినది, వేరొకటి అతీత ప్రాణికానికి సంబంధించినది. అంటే ఒకటి భౌతికానికి సంబంధించినది అనుకుంటే, వేరొకటి అతీత భౌతికానికి సంబంధించినది. ఒకటి ప్రకృతిని కప్పియున్న అందమైన సూర్యరశ్మి వంటిది; వేరొకటి అట్టి ఆచ్ఛాదన వెనుకనున్న యధార్థ ఆనంద శిఖ వంటిది. గ్రీకులు నిర్వచనానికి లోబడగల పరిపూర్ణతను ఆరాధించారు. హైందవులు అనిర్వచనీయ అనుభూతికి పెద్ద పీట వేశారు. గ్రీకులు మానవాధీన శక్తులను పరిపుష్టం గావించారు. హిందూ సంస్కృతి అతీత శక్తులను సాధించి వాటిలోని ఉదాత్తతను చవి చూడాలనుకుంది. అది ఒక విధంగా కావ్యశిల్పానికి జటిలమైనదే!

గ్రీకులు పరిమితులకు లోబడగల సౌందర్యాన్ని పొందికగల రూపాలను, ఆకారాలను ఎంచుకున్నారు. గ్రీకు గాథలు, పురాణాలు వ్రాసిన కవులు (వారు గొప్పవారైనా, కొద్దివారైనా) మానవాధీన శక్తుల సౌందర్యాన్ని, ఉదాత్తతను కానీ, విషాదాన్ని కానీ, వాస్తవికతతో ఉట్టిపడే ప్రయత్నం చేశారు.

అనంతమైన ఆలోచనలు వివరించటం అందరికీ సాధ్యంకాదు. అత్యంత శక్తి సంపన్నులకే అది సాధ్యపడుతుంది. ఒకవేళ ఎవరైనా శక్తి విహీనులు సాహసిస్తే అది

వారికి వశం కాదు. సరికదా, తిరగబడి భయానక రూపం ప్రదర్శిస్తుంది. ఇదే యీ రెండు ప్రక్రియలలోని వైరుధ్యానికి కారణం. ఒకే పురాణ కథను ఇద్దరు కవులు విడి విడిగా చెప్పినా ఇట్లా జరిగే అవకాశం ఉంటుంది. ఒకటి సున్నితంగానూ, ఉదాత్తం గానూ, వేరొకటి పేలవంగానూ ఉంటుంది.

పాత పుక్కిటి పురాణాలను పరిశుద్ధం చేసి వాటి పూర్వ ఆకర్షణను పునరుద్ధరించే ప్రయత్నం చెయ్యటం ఈ నాటి హైందవ కవులకు అభిలషణీయమే. విదేశ భాషల విషయంలో ఈ ప్రయత్నం సాహసోపేతమైనది అని చెప్పవచ్చు.

CWSA 36:128-29

రురు మహారాజు కథ

భారతంలోని రురుచక్రవర్తి గాధ మూలభారతంలో లేదు. అది మధ్యలో వచ్చి చేరినది. అది అందము, అర్థము లేని పిల్లల కథ వంటిది. అసలు దాన్ని కథ అనటం కంటే ఒకానొక భావం అనటం మేలు. భృగువు రురువు యొక్క పితామహుడు. వేద వాఙ్మయంలో భృగువుయొక్క ప్రశంస ప్రస్తావించబడింది. ఆర్య నాగరికతలో ఈయన అంతగా వెలుగు చూడకున్నా, ఇతని పాత్ర ప్రాచీనకాలంలో ఎంతో విశి ష్టమైనది. ఆయన చుట్టూ అనేక గాధలు, కధలు ఛాయామాత్రంగా అల్లుకొని వున్నాయి. వర్ణించటానికి అందనటువంటి అనేక మహోన్నత విప్లవాలు చరిత్ర ఆయన కథతో ముడిపడి ఉంది. తరువాతికాలంలోని కధలలో ఆయన సంతతివారు పవిత్రమైన ఋషి సాంప్రదాయానికి చెందిన వారుగా అర్థం అవుతుంది. అనేక మంది క్షత్రియరాజులను సంహరించిన పరశురాముడు ఆ సంతతివాడే. బ్రహ్మమానస పుత్రుడైన ఈయన పులోమి ద్వారా చ్యవన మహర్షికి తండ్రి యైనాడు. మాతృ గర్భంలో వుండగానే తన తండ్రియొక్క విశిష్టగుణాలను పుణికి పుచ్చుకొని జన్మిం చాడు. చ్యవన మహర్షి నాగరకతా వికాసానికి తండ్రి వంటివాడు. ఊర్వసి పురూరవులకు జన్మించిన "ఆయువు," ఇతని శిష్యుడే చంద్రవంశమునకు "ఆయువే" మూల పురుషుడు.

మహాభారత యుద్ధానంతరము పరిపాలించిన రాజులు ఈ వంశము వారే. చ్యవనుని కుమారుడు ఒక అప్సరసవలన రురునికి తండ్రి అయ్యెను. ఆయన కథయే రురు చరిత్రము. తదనంతర కాలములో ఆయన తండ్రివలె ఒక మహాముని

అయ్యేను. కాని ఆయన యవ్వనమందు ఉండగా చిత్రరథుడను గంధర్వరాజు వలన మేకకు జన్మించిన ఒక సుందరిని భార్యగా చేకొనెను. ఈ విధముగా ఈమె శకుంతలకు సోదరియే. చిత్రరథుని, మేనకల సంబంధము శకుంతలయొక్క ఇష్టసఖి ప్రియంవద చెప్పినదాకా ఎవరికీ తెలియదు. ఈ రహస్యాన్ని ప్రియంవద పాము కాటుకు గురియై మరణించేముందు మాత్రమే వెల్లడించింది. ఇది గ్రీకు పురాణాలలో యురిడిస్ కథను పోలి వుంటుంది. మేనకను పోగొట్టుకున్న తరువాత వియోగాన్ని భరించలేక రురు పిచ్చివానిగా అడవుల పాలౌతాడు. చివరకు దేవతలకు జాలి కలిగి మేనకను మళ్ళీ అతనికి తిరిగి ఇవ్వటానికి అంగీకరించారు. కాని వారు ఒక షరతు కూడా విధించారు. దాని ప్రకారం మేనక అతనికి కావాలంటే, తన జీవితంలో సగభాగాన్ని ఆయన వదులుకోవలసియుంటుంది. ఇందుకు రురు సమ్మతిస్తాడు. ఆ విధంగా మేనక, రురులు మరల ఒకటౌతారు.

ఈ కథే మహాభారతంలోనూ ఉన్నది. కొన్ని అనవసరమైన వివరాలను పట్టించుకోకపోతే, ఇది గ్రీకు కథ "ఆర్ఫియస్ - యూరిడిస్" ను పోలి యుంటుంది. ఈ విధంగా హైందవ, గ్రీకు కథలలో సామ్యం స్పష్టంగా చూడవచ్చు. ఆర్ఫియస్ తన గానమాధుర్యంతో తాను అనుకున్నది సాధించి, తన భార్యను మరల ఎలా పొందగలిగాడో, కాని ఎలా మరల పోగొట్టుకున్నాడో మనకు ఒక పాఠం. మన బలహీనతలకు అద్దం పట్టిన కథలో భావనా పటిమ, విషాదం, మానవ సహజమైన భావోద్రేక వైచిత్రి చూడవచ్చు. ఒక విధంగా హిందూ కథలలో విషాదం లేకపోవటంవలన మనలో భావ చలనాన్ని అవి కలిగించలేవు. అందువలన అవి మామూలు కథలలా వుంటాయి. కాని అంతర్గత భావం ఉదాత్తమైనదే! చనిపోయిన ప్రియురాలి కోసం సగం జీవితాన్ని త్యాగం చేయటం ఎంత గొప్ప విషయం! ఇది మానవుని భావనా బలాన్ని ఎంతో గొప్పగా తట్టి మేల్కొలుపుతుంది. అతని అనంతశక్తులకు, బలహీనతలకు ఎంతో గొప్పగా దర్పణం పడుతుంది! బలహీనతలతో, అనంతమైన అతిలోతైన సామర్థ్యాలను, బలహీనతలను ఎంతో గొప్పగా బహిర్గతం చేస్తుంది!

CWSA 36:130 అనువాదం: కె.ఆర్.ఎల్. నరసింహారావు

హిందూ పురాణములలో నిజ - అంశం

హిందూ పురాణాలలో ప్రధాన అంశం రెండు ఆదర్శవంతమయిన శక్తుల మధ్య

పోరాటం. విశ్వాత్మక మయినవి, అందుకు వ్యతిరేకమయినవి త్రిమూర్తులను మినహాయించి మానవులు, దేవతలంతా పాత్రధారులై చదరంగంలో పావులవలె ముందుకు వెనుకకూ వారు తాము వ్యక్తం చేసే అనంత శక్తులచే నడపబడతారు. కానీ చైతన్యవంతంగా దిశానిర్దేశం చేయలేరు. బహుశా యిది అసురశక్తులతో పోరాడనున్న దైవీశక్తుల ఆదర్శం కావచ్చు. ఆపై మనకు రామాయణ ఆదర్శం ఉండనే ఉంది లేదా అదొక రాజశాసనమైన ఆదర్శం కావచ్చు. క్రమబద్ధీకరణ, స్వాధీనత, విధేయత, న్యాయం, సమానత్వం, రాజరికపు ఆదర్శానికి వ్యతిరేకంగా స్వీయ సంకల్పం, హింస, స్వాతంత్ర్యం, ఆత్మస్థైర్యం, భూస్వామ్య విశ్వాసం, ఖడ్గ చలనం దాని వెనుక బలవంతుల హక్కు. యిదే మహాభారతంలో కీలకమైన వస్తువు లేదా మరొకవైపు సావిత్రి గాథలో వలె ఒక వంటరి స్త్రీ తపన, తన భయానక గాథ నిశ్శబ్దం అంతఃశక్తితో అంతరాత్మలను విడదీసే మృత్యువుతో పోరాటం, స్వచ్ఛంగా దేశీయమైన నలుని ప్రణయ గాథ కేంద్రకమయిన క్షీణించిపోయే స్ఫూర్తిలో కలియుగ మేధాశక్తి, దృఢమైన దాంపత్యప్రేమచే జయింపబడింది. ఉరూరవ, ప్రియంవదల గాథలో యముడు, మన్మథుడు, మరణానికి, ప్రేమకు ప్రతీకలైన వారు నిజమైన పాత్రలై ఆ కార్యానికి ప్రాశస్త్యాన్ని కొనితెచ్చారు.

CWSA 36:130=31

హిందూపురాణాలలోని వ్యక్తిత్వాలు

మన పురాణాలలోని మహనీయరూపాలు ఆదర్శవంతమయినవి కొన్ని దుష్టత్వానికి, కొన్ని మంచితనానికి మరికొన్ని మిశ్రమమయిన లక్షణాలు గలవి పూర్తిగా దుష్టము, మంచి కానివి. అవి ఆదర్శవంతమయిన వ్యక్తిత్వ ఆవిష్కరణలు. ఇవి హైందవ సృజనాత్మక మనసు వ్యక్తుల వెనుక వారి గుణగణాలు, ప్రభావములు, ఆదర్శాలను చూడగల స్వభావం నుండి ఉత్పన్నమవుతాయి. రాముడు, సీత, సావిత్రి ఈ మహత్తర మయిన పాత్రలన్నీ కేవలం నైతిక పరాకాష్ట యొక్క నమూనా లేనా. వారి చరిత్రలను వాల్మీకి, వ్యాసమహర్షుల తేజోమయ మహత్వపూర్ణమయిన పరిభాషలో పఠించిన నేను వారి కష్టాలలో, సంతోషాలలో స్పందించిన నేను వారు కేవలం నమూనా పాత్రలేనని సరిపెట్టుకోలేను. ఖచ్చితంగా దృఢమైన నిశ్శబ్ద హృదయంగల 'సావిత్రి' తన శక్తివంతమయిన సూక్ష్మంగా సూచించబడిన వ్యక్తి

త్వంతో, తనలో జీవశక్తిని మనోహరతను కలిసి ఉంది. శ్రీరాముడు ఏ పనలేని పని చేసినా అందులో తప్పకుండా సమృద్ధిగా దివ్యాగ్నిని నింపుతాడు. సీత ఎంతో లావణ్యము, మాధుర్యము, మానవీయ అనురాగంతో ప్రేమించదగినది. తనలో స్త్రీత్వపు శక్తి, బలహీనతలు రెండూ నిండుగా ఉన్నాయి. రురు, ప్రియంవదలు కూడా ఆదర్శప్రాయమైన వారే, వారి ప్రేమ మకుటాయమానమైన అతిశయాన్ని అందుకోవటమే కాక పరిపూర్ణమై, మిగిలిన ప్రేమలన్నీ కేవలం పాక్షికంగా, విజయ వంతమయిన ఆవిష్కరణలుగా అనిపిస్తాయి. ఆదర్శవంతమయిన ప్రేమ ఒక త్రిగుణాత్మకమయిన శక్తి, కేవలం ఇంద్రియ స్పందనలు, కేవలం భావోద్రేకాలు, కేవలం ఆధ్యాత్మికత కాదు. ఇవన్నీ ఉండవచ్చు వేరువేరుగా అని మాత్రమే ప్రేమ కాదు. కేవలం యింద్రియ సుఖం ఒక పశుప్రాయమైన అవసరం, భావావేశం ఒక వచ్చిపోయే స్థితి. ఆధ్యాత్మిక భావన తన మార్గాన్ని కోల్పోయిన ఒక మతపరమైన ఆకాంక్ష. అయినప్పటికీ యివన్నీ కూడా ఆ ఉన్నతమైన అసురశక్తికి అవసరం. వృక్షమూలాలకు, నులువెచ్చని మృత్తికలా ఇంద్రియ స్పందన, జీవనానికి, ప్రాణ వాయువులా భావోద్వేగం, ఆధ్యాత్మిక ఆకాంక్ష ఒక వెలుగులా దానిని ఆరిపోకుండా కాపాడే స్వర్గంనుండి కురిసే కృపావర్షం అన్నీ అవసరమే. నా భావన, ప్రేమ, మరణాల మధ్య ఒక ఆదర్శప్రాయమైన సంఘర్షణ. అయినందున దానికి ఒక పటిష్ట మయిన రూపాన్నివ్వటానికి రెండు విషయాలు అవసరం. ప్రేమయొక్క ఒక సమగ్రమైన చిత్రం అలాగే మరణం యొక్క ఒక సమగ్రమయిన రూపం. చిత్రించబడిన ప్రేమ ఒక ఆదర్శమయిన స్థాయిలో ఉండాలి. తన మూడు దిశలలో పరిపుష్టతని అంతిమ పరిమితిని స్పృశించాలి. ఇంద్రియ స్పందన సరియైన ప్రాధాన్యతను పొంది ఆధారాన్ని, మూలాన్ని, కలిగి ఉండాలి. భావోద్వేగాలకు జీవశక్తిని యివ్వాలి. ఆధ్యాత్మికత దానిని అనంతంగా శాశ్వతం కావటాన్ని కొనసాగించాలి. వాటి విస్తారతకు సంబంధించిన పరిమితుల వద్ద అవి సామరస్యంగా విలీనమైతే అవి మూడుగా కాక త్రివేణీసంగమంగా అయినపుడు ఆ ప్రేమ ఒక పరిపూర్ణమయిన ప్రేమ, దాని చిత్రం ఒక పరిపూర్ణమయిన చిత్రం అవుతాయి.

CWSA 36: 131- 32 *అనువాదం: డా. సరోజాప్రసాద్*

పూర్వకాలపు ఋషులు

పూర్వకాలపు ఋషులు ధ్యానం చేయుట ద్వారా ప్రేరణపొంది అంతర్బుద్ధిని సాధించి దివ్యజ్ఞానాన్ని తమ సొంతం చేసుకున్నారు. హేతువుకు అందని అంతః కరణను, భవిష్యత్ దర్శనాలను పొందాలనే తలంపుతో వారు కఠోరమైన నిష్ఠ, నైపుణ్యాలలో ఏకాగ్రతను పొంది, మొండిదైన హేతువును నిశ్చలపరచి, తప్పులులేని దివ్యదర్శనాలను పొందిన అనంతరం వారు ఆ హేతువును అది చేయవలసిన పని కొరకు విడిచి పెట్టేవారు. క్షణకాలంపాటు మెరుపులవలె మెరిసే అంతరదృష్టివలన ఇది సంభవిస్తుంది. ఒక దాని తర్వాత ఒకటి వరుసగా వచ్చే అంతర దృష్టులన్నీ కలిసి ఒక తార్కిక రూపాన్ని భావాన్ని తీసుకుంటాయి. అయినా అంతరదృష్టి ఒక తర్కంతోగాని ఉదాసీన ఆలోచనతో గాని కలిగేది కాదు. కాని నిరంతర సహేతుకతలో సానుకూల ఏకరీతి ప్రేరణతో ఇది జనిస్తుంది. వీరితర్వాతి కాలంలో దైవాన్వేషులుగా అనగా పంచాగ్నులు మధ్య కూర్చుని తపస్సు చేసేవారు లేక రోజులతరబడి అంపశయ్యపై పవళించేవారు లేక కఠినమైన యోగాసనా ప్రక్రియలను సాధనచేసే వారు బయలుదేరారు. కాని ఋషులు ప్రేరణ కలిగించే ఆలోచనాపరులే గాని హేతువును బహిష్కరించుటగాని, భౌతికప్రక్రియల ద్వారా ఇంద్రియాలను లోబరుచు కొనుటగాని చేయలేదు. వారి వ్యక్తిగత ఓజస్సు దివ్యమైంది. కఠోరనియమాలతో అతి తీవ్రంగా తపస్సు చేసి, లెక్కకు అలవికాని ఆధ్యాత్మిక ఓజస్సులకు వారు అధిపతులయ్యారు. అందువలన వారి ఆగ్రహం మనుషులను శపించగలిగేదిగా ప్రపంచాన్ని ప్రమాద పరచేదిగా ఉండేది. వారి ఓజస్సు తత్వతః వారి వంశజులకు వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. లేక కనీసం వీరి వంశంలో నిద్రాణంగా నైనా ఉంటుంది. లేక స్వయం కృషితో విద్యనార్జించే విధంగానైనా దీని ఫలితం ఉంటుంది. ఆ తర్వాత కాలంలో ఆ జాతి జీవశక్తి అంతరించి దాని అంతరంగ జ్వాల తరిగిపోయి కాంతి విహీనమైంది. కాని ప్రాథమికంగా పుట్టిన ప్రతీ బిడ్డా దైవమే. చ్యవనుని తల్లి పౌలోమికకు గతంలో ఒక రాక్షసునితో వివాహం నిశ్చయమై అనంతరం అది రద్దై, భృగువుతో వివాహమైంది. కాని ఆ రాక్షసుడు తనకు సొంతం కాని ఆమెను భృగువు లేని సమయమున గర్భవతి అయిన ఆమెను చంపుటకు ప్రయత్నించాడు. కాని అనువంశికంగా సంక్రమించిన దైవీ లక్షణమైన ఓజస్సును గర్భస్థ శిశువుగానున్న

చ్యవనుడే. ఆ రాక్షసుని భస్మం చేసాడు. అని అంటారు. అప్పటి ఋషులు ఉద్రేకాలు లేని శాంతస్వభావులు. ఎప్పుడైనా ఆగ్రహించినా ఋషులు ప్రేమతత్వాన్ని అవలంబించేవారు. ప్రజ్ఞాపాటవాలలో సర్వోత్కృష్టమైనవి వారి జీవితాలు, వారు సౌందర్యోపాసకులు, దాని కొరకు వారు తపిస్తూ మహనీయ సుందర ఏకాంత ప్రదేశాలలో రాక్షసపుత్రికలను వివాహమాడుతూ, లేక స్వర్గలోక అప్సరసలతోనూ కూడి సంతృప్తిగా చరించేవారు. చరిత్రకు పూర్వం ఉండిన ప్రాచీకాలపు ఆర్యులలో ఒక భాగమైన పూజ్యనీయ నాగరిక జాతుల వారైన ఈ ఋషులు సంతతి ప్రస్తుతం బృహస్పతులు, గౌతములు, భార్గవులు, కస్యపులు, గా విభజింపబడి ఉన్నారు.

ఈ విధంగా ఈ గొప్ప మనుషులు భారతమాతకు ఒక నాగరికతను అందించుటవలన భారతదేశం దైవతుల్యమైంది.

ఈ భూమిమీద ఋషులు, స్వర్గంలో దేవతలు... కవితారూపం ధరించ గలుగుటకు తగినన్ని విశిష్ట చిహ్నాలిచట లేవా? చిత్రకారుని అమర దృశ్యాలను కూర్చచాలినంత సుందర ద్రవ్య మిచట లేదా?

CWSA 36: 133- 35

మనం ఆ పరంజ్యోతి నిప్పురవ్వలం,
ఆ సముద్రపు అలలం;
ఆయన నుంచి మనం వస్తాం ఆయనలోకే వెళ్ళాలని శాశ్వతంగా కోరుకో
ఆయన సంకల్పించినంతవరకు వేరుగా మన జన్మలు
ఉన్నాయి ఉంటాయి.
జీవితంనుండి విరమించకు, ఓ ఆర్యుడా!
ఆయన అనుగ్రహించి ముక్తి నిచ్చువరకు
ఆయననుంచి మంచిని చెడుని, పాపాన్ని, పుణ్యాన్ని
సంతోషంతో ఆనందంతో అందుకో.
అతడు సెలవు తీసుకోమని చెప్పేదాకా
నీ ఆయువు ఉన్నంతవరకు పరిపూర్ణంగా ఆయనదైన నీ పాత్రను పోషించు
ఈ ధరిత్రి నీ నాటకరంగం, నీవో గొప్ప నటుడివి
నాటకం ఆయనది అని భావించు.

కర్మ చేయి కాని ఫలితం మాత్రం దేవునికే చెందు
అతడు మాత్రమే ఉన్నది
కర్మ చేయి, ప్రేమించు, జ్ఞానం పొందు—
నీ అంతరాత్మ బ్రహ్మానందాన్ని పొందుతుంది.

CWSA 2: 236

శ్రీఅరవిందులు (ఋషి అనే పద్యం నుంచి)
అనువాదం: ఎస్. త్రివేణి

శ్రీఅరవిందునిలోని కొన్ని పార్శ్వాలు

కుటుంబపరమైన ప్రేమ మరియు గుణగణాలు

కుటుంబసంబంధమైన సద్గుణాలను బయటకు ప్రదర్శించడంలో ఎప్పుడూ తగిన విధంగా లేను.ఇదే నా భయం. ఒక కొడుకుగా, ఒక సోదరుడిగా ఒక భర్తగా నా భాధ్యతను నిర్వహించడానికై అసమర్ధంగానే ఎంతో ప్రయత్నించాను. కానీ చాలా బలమైనది నాలో బలమైన దేదో పనిచేస్తూతక్కిన ప్రతి ఒక్కదానిని అప్రధానంగా చేసి వేసింది. అయినా ఉత్తరాలు వ్రాయక పోవడమనే నా అపరాధాని కది సాకుగాదనే మాటనిజం. నా దోషాన్ని సరిదిద్దుకోవడం అంటే దానిని అంగీకరించడానికే త్వరపడతా ననేదే నా భయం. ఇది కనీసం చాలా సాధారణంగా ఉండవలసిన ప్రేమ లేకపోవడంవల్ల యిలా జరుగుతుంతోందని ఇతరుల కనిపిస్తుందనే విషయాన్ని నేను తెలిగ్గానే అర్థం చేసుకోగలను. ఇది మా తండ్రిగారి విషయంలో లాగా కాదు. ఈ లోపాన్ని ఆయన నుండి వారసత్వంగా పుణికి పుచ్చుకున్నట్లు కనిపించినా ఆయన విషయంలో అది లేదు. ఇంగ్లండులోవున్న నా 14 యేళ్ళ కాలంలో ఏ డజను ఉత్తరాలో మా నాన్నగారినుండి నా కొచ్చాయి. అయినా నాపై ఆయనకు గల వాత్సల్యాన్ని నేను శంకించను. ఆ తరువాత నేను చనిపోయానన్న తప్పు వార్త నా తండ్రిని చంపేసింది. నా తలపై పెట్టుకుమోస్తున్న అన్ని రకాల అసంపూర్ణతలతో నన్ను నన్నుగా నీవు అంగీకరించాలి.

CWSA 36: 147

జీవితం, వివిధ ఘటనల పట్ల ప్రవర్తనా ధోరణి

ఈ ప్రపంచంలో సంతోషాన్ని వెతుక్కోవడమన్నది, మనిషిని అదే సంతోషం నడుమ బాధను వెదుక్కోవడంలోకి నడుపుతుంది. దుఃఖం ఎప్పుడూ సంతోషంతోనే పెనవేసుకుపోయి ఉంది. ఈ సూత్రమన్నది సంతానం కావాలనే కోరిక వనిషయంలోనే కాదు, మిగిలిన అన్ని ప్రాపంచికమైన కోరికలనీ ఆక్రమించి వుంది.
బెంగాలీ రచనలనుండి 34-9-51

పని విషయంలో ప్రవర్తించే తీరు

పనిలో ఇష్టముండట మన్నది కాదు. పనిచేయగల సామర్థ్యమే ఇక్కడి ప్రశ్న. అయినా (ఇది ఎల్లప్పుడూ కాదు) ఇష్టమన్నది సామర్థ్యంతో కలిసే సాగుతుంది. సామర్థ్యం వృద్ధి చెందగలదు. ఇష్టత ఇంకా నీవు చెప్పే రసమన్నదీ వృద్ది చెందగలదు. ఈ యోగలక్ష్యాలను బట్టి ఒక వ్యక్తి మనస్ఫూర్తిగా తనకు ఇవ్వబడిన ఏ పనినైనా దైవానికి నివేదనగా చేయలేకపోతే, అతడు పూర్తి యౌగికస్థితిలో ఉన్నట్లుగాదు. ఒకప్పుడు నేను శారీరక శ్రమ చేయడానికి పనికొచ్చే వాడిగా లేను. కేవలం మానసికమైన వాటిపై జాగ్రత్త వహించే వాడిని. నాలో కొట్టొచ్చినట్లు కనిపించే ఈ లోపాన్ని అధిగమించడం కోసం, ఈ దేహ పరికరాన్ని యోగ్యమైనదిగా, సచేతనమైనదిగా చేసుకోవడానికి, శారీరకమైన కలాపాలను జాగ్రత్తతో, పరిపూర్ణతతో చేయడానికి నాకు నేను తర్ఫీదు ఇచ్చుకొన్నాను.

స్థిరమైన ఆధ్యాత్మిక బలం

నా స్వీయ అనుభవం నుండే మాట్లాడతాను. నేను నిజానికి దృఢమైన శక్తినే కల్గి వున్నాను. కాని నా న్యాయపరమైన హక్కులు నా కివ్వని వారికి వ్యతిరేకంగా రగిలిపోయే జ్వాల నాలో లేదు. అయినా ఎప్పుడూ నాకు నేను బలహీనుణ్ణనో, మృత ప్రాయుణ్ణనో భావించుకోలేదు. అశాంతి అన్నదానిని నెట్టి వేయడం కోసం, ఎన్నటికీ అశాంతికి లోనుకాకూడదనే నిబంధనను విధించుకొన్నాను. ఇంకా నాలోని దృఢమైన శక్తిని ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఉపయోగించగల్గేలా వున్నాను. రాజసికమైన శక్తి, ఉద్వేగాలుంటేనే అది బలమని తక్కినదంతా బలహీనతేనని, వట్టి

మృతప్రాయమని నీ వంటావే... అది కాదు, స్థిరమైన ఆధ్యాత్మికశక్తి నూరింతలు బలిష్టమైనది. అది బుసబుసమని పైకి పొంగి, అంతలోనే సమసిపోయేది కాదు. అది సుస్థిరమైనది. అచంచలమైనది. సదా క్రియాశీలకమైనది.

సన్యాసం - కోర్కెలు లేక పోవడం

సన్యాసమంటే ఏమిటి అన్నదానిపై ఇది ఆధారపడివుంటుంది. నా కెలాంటి వాంఛలూ ఉండవు. కానీ బాహ్యంగా ఎలాంటి బైరాగి జీవితాన్ని గడుపను. ఏకాంతంగా మాత్రమే ఉంటాను. గీతను అనుసరించి 'త్యాగం' కోరికలు, రాగ బంధాలనుండీ ఆంతరికంగా విడివడి వుండటమే నిజమైన సన్యాసం.

కుంగుబాటును అధిగమించడం

నాకు బాగా జ్ఞాపకం చాలా రోజుల క్రితం నాకు వ్యక్తిగతంగా ఎన్నో ఘర్షణలు, కష్టాలు ఉండేవి. బయట నుండీ మనుషులు సలహాలకోసం నా వద్దకు వచ్చేవారు. ఎంతో దుఖ-కరమైన కుంగుబాటుతో నిరాశ, వైఫల్యంనుండి బయటపడే ఏదారి కనిపించని ఆ పరిస్థితిలో నేనున్నప్పటికీ దాని నుండి ఏమీ లభించకపోయినా, ఒక సుస్థిరమై విశ్వాసంతో పలికాను. అది కపటమా? నేనలా అనుకోవడం లేదు. నాలో నుండ ఎవరైతే పలికారో ఆ పలికింది తప్పక జరుగుతుందని అతనికి తెలుసు. ఒక మనిషి పరిపూర్ణంగా దైవం వైపుకు మళ్ళడమన్నది అంత తేలికైన విషయం కాదు.

నా యవ్వనంలో నీవు వర్ణించినట్లు నేను సాత్వికుడినే. ఎప్పుడైతే శాంతి పై నుండీ క్రిందికి దిగిందో అప్పుడది పూర్తిగా భిన్నమైన అంశం. సత్వగుణం, నిర్గుణంలోకి అదృశ్యమైంది., ఆభావ నిర్గుణం సద్భావ త్రైగుణాతీతంలోనికి అదృశ్యమైంది.

శ్రీఅరవిందులు

అనువాదం: చక్రాల హర్షవర్ధన రాజు

దీనికి సమయం తీసుకొన్నా, నిరుత్సాహానికి లోనుకాకూడదు. దీనిలో ఇంకా ఇతర పోకడలు కూడా జోక్యం చేసుకోవచ్చు. వాటిని పరిగణిస్తూ సరిదిద్దుకొంటూ ముందుకు పోవాలి. అనిర్విణ్ణేన చేతసా.

CWSA 35: 47, 52, 53,48 *అనువాదం: చక్రాల హర్షవర్ధన రాజు*

బరోడాలోని తొలి ఆధ్యాత్మిక అనుభవాలు

ఆధ్యాత్మిక అన్వేషణలో తొలి అడుగు

ఇంగ్లండులో నివసించు సమయంలో ఆఖరి సంవత్సరంలో ఆధ్యాత్మిక అన్వేషణలో శ్రీఅరవిందుల తొలి అడుగు పడింది. సంప్రదాయబద్ధ పౌరోహితుడు కానటువంటి కుటుంబంతో వారు నివసించేవారు. అతడు "మతవిధుల నిర్వహణ" వర్గానికి చెందిన ఒక చర్చిలో బోధకుడు కూడా. శ్రీఅరవిందులు ఎప్పుడూ క్రైస్తవులు కానప్పటికీ వారి చిన్నతనంలో ఆ మతంతోను దాని గ్రంథమైన బైబిల్‌తోనూ మాత్రమే వారికి పరిచయం ఉండేది. కాని అది వారిని విముఖుల్ని చేసింది. మధ్యకాల క్రైస్తవ మతానికి మచ్చ తెచ్చిన మతద్వేషము పట్టి హింసించడముయొక్క భయంకరమైన కథ మరియు అటు తరువాత ఆ మతవికాసం జరిగినా దాని సంకుచితత్వం, అసహనీయత వారిని ఎంతగా నిరాశా నిస్పృహలకు గురి చేశాయంటే వారు ఆ మతంనుండి పూర్తిగా వైదొలిగారు. కొద్ది నాళ్ళ పూర్తి నిరీశ్వర వాదం తరువాత వారు అజ్ఞేయతా వాద దృక్పథాన్ని స్వీకరించారు. వారు ఐ. సి. యస్. చదివినప్పుడు వారికి భారతదేశ షట్ దర్శనాల పరిచయం ఉందా, లేదా అనువిధంగా అతితక్కువ లభించింది. ముఖ్యంగా అద్వైతంలోని 'ఆత్మ సిద్ధాంతం' వారి దృష్టిని ఆకర్షించింది. ప్రపంచం మరియు జీవితం వెనుక దాగివున్న సత్యానికి సంబంధించిన ఒక అసలైన సూత్రం ఇక్కడఉందేమో అనేది వారి బుద్ధికి తట్టింది. 'ఆత్మ' ను తెలుసుకోవటానికి, తన స్వీయ చైతన్యంతో ఈ అమూర్తభావనను ఒక వాస్తవిక జీవనసత్యం క్రింద మార్చడానికి ప్రయత్నం చేశారు. కాని దానిని ఈ పదార్థజగత్తుకి వెనుక లేక ఆవల ఉన్నదానినిగా భావించి ప్రయత్నించారు. దానిని వారిలోనూ సర్వంలోనూ

విశ్వంలోనూ కూడా ఉన్న ఏదో అంతర్వ్యాప్తమైన దానినిగా అర్థం చేసుకొనలేక పోయారు.

CWSA 36: 106

ఐహికము - ఆముష్మికము

భారతదేశ అంతరాత్మను గురించి నీవూ, ఆముష్మికమును వదిలిపెట్టి, ఐహికముపై పట్టుబట్టడాన్ని గురించి 'యక్స్' విశేషంగా ఎత్తి చెప్పిన సందర్భంగా ఒక విషయం నాకు చెప్పాలనిపించింది. ఏ సందర్భంలో ఆయన అలా ఎత్తి చూపారన్న దానిని గురించి లేక ఐహికము అన్నదాని గురించి ఆయన ఏమనుకుంటున్నారు అన్నది నాకు అసలు అర్థం కాలేదు. కానీ దాని గురించి నా అభిప్రాయం చెప్పడం నాకు అవసరమనిపించింది. నేను భారతదేశం వచ్చినప్పటినుండి నా నిజ జీవితంలోనూ, నా యోగ సాధనలోనూ ఐహిక ఆముష్మిక విషయాలనెడి రెండు విధాలా మినహాయింపు లేదు. మానవ అభిరుచులన్నీ ఐహికానికి సంబంధించినవే. వాటిలో చాలావరకు నా మనోరంగంలో ప్రవేశించాయని నేననుకుంటాను. అందులో రాజకీయాలనెడి కొన్ని నా జీవితంలోను ప్రవేశించాయి. కాని అదే సమయంలో బొంబాయిలోని అపోలో బందర్ వద్ద భారతభూమి పై నేను కాలిడినప్పటినుండి ఆధ్యాత్మిక అనుభూతులు పొందసాగాను కాని అవి ఈ ప్రపంచంనుండి విడివడినవి కాక దానితో ఆంతరిక సన్నిహిత సంబంధమున్నవే. అవి ఎటువంటివంటే ఈ భౌతిక స్థలాన్ని వ్యాపించి అనంతం వున్నదనే పదార్థ వస్తువులు శరీరాలను అంతర్యామి ఆవాసం చేసుకొన్నదనే అనుభూతుల లాంటివి. అదే సమయంలో భౌతిక ప్రపంచంపై ప్రభావం చూపుతున్న అతిభౌతిక ప్రపంచాలు, భూమికలలోకి నేను ప్రవేశించటం వల్ల వాటినుండి పదార్థ భూమికపై ప్రభావాలు, ప్రయోజనం కలగటం గమనించాను. కనుక నేను రెండు కొసలు అని వేటినయితే అన్నానో వాటికి వాటి మధ్య వున్న దానంతటి మధ్య సమాధాన పరచలేని వ్యతిరేకతను, లేక నిశితమైన యెడబాటును నేను కలిగించలేదు. నాకు అంతా బ్రహ్మస్వరూపంగా భాసించింది, నేను దైవాన్ని ఎల్లెడలా కనుగొన్నాను. ప్రతివారికి ఈ ప్రాపంచిక విషయాలనుండి వైదొలగి మరొక ప్రపంచాన్ని పొందే అధికారం ఉంది. వారు ఈ ఎంపికలో శాంతిని పొందినప్పుడు వారికి గొప్ప దీవెనలు అందినట్లే. నేను వ్యక్తిగతంగా శాంతిని పొందడం కోసం ఇలా చెయ్యడం అవ

సరం అనుకోలేదు. నా యోగ సాధనలో కూడా నేను ఆధ్యాత్మిక భౌతికమనే రెండు ప్రపంచాలను కలిపి నా దృక్పథంలో ఉంచుకునే ముందుకు సాగి దివ్యచైతన్యాన్ని, దివ్యశక్తిని మానవుల హృదయాలలో భౌతిక, జీవితంలో స్థాపించడానికి ప్రయత్నించాను. అది వైయక్తిక ముక్తి కొరకు మాత్రమే కాదు. కేవలం ఇక్కడ దివ్యజీవనం కొరకు. ఇది నాకు ఇతర ఆధ్యాత్మిక లక్ష్యాలలాగే కనిపిస్తుంది. ఈ జీవనసత్యం సాంసారిక వాసనలను, భూమిపై ఉన్న ఇతర విషయాలను పరిగణన లోనికి తీసుకొనినంత మాత్రాన దాని ఆధ్యాత్మికత తుడిచిపెట్టుకు పోదని లేక దాని భారతీయ నైజం మారిపోదన్న విషయాన్ని నేను నమ్ముతాను. దైవం, ప్రాపంచిక విషయాలు, ప్రపంచసత్యం గురించి ఎల్లప్పుడు నా అభిప్రాయం, అనుభవం చివరకు ఇదే. వాటి విషయమై అతి దగ్గరగా ఉన్న ప్రముఖ సత్యము ఇదే అని నాకు అనిపించింది. కనుకనే నేను దాని అన్వేషణగురించి మాట్లాడినప్పుడు దానిని పూర్ణయోగమని అన్నాను. ప్రతివారు ఇటువంటి సమగ్రతని తిరస్కరించడానికి నమ్మకపోవడానికి స్వతంత్రులు అనుకోండి. లేక పూర్తిగా ఈ ప్రాపంచిక విషయాలన్నింటినీ విసర్జించి మరొక ప్రపంచ ఆధ్యాత్మిక ఆవశ్యకతని నమ్మవచ్చుకూడా, కాని అటువంటివారికి నా యోగసాధన చెయ్యడం అసాధ్య మవుతుంది. నా యోగసాధన ఇతర ప్రపంచాల యొక్క సంపూర్ణ అనుభవాన్ని, అనంత ఆత్మ యొక్క భూమిపై, మధ్యలో ఉన్న ఇతర క్షేత్రంపై మన జీవితం మీద, భౌతిక ప్రపంచం పైన వాటివలన కలిగే ప్రభావాన్ని కలిగి ఉండవచ్చు. కాని ఆ పురుషోత్తముని లేక ఆ ఈశ్వరుని ఒక్క రూపాన్నైనా సరే, అది శివుడు, కృష్ణుడు, జగన్నాధుడు, మనకు మన చేతలకు యజమాని లేక ఆ వైశ్విక సచ్చిదానందుడిని గ్రహించాలని పట్టుపట్టవచ్చు, ఆ విధంగా ఈ యోగ సాధనయొక్క అవసరమైన ఫలితాలు సాధించి అటు తరువాత వాటినుండి ముందుకు సాగి దివ్యజీవన ఆదర్శాన్ని, ఆధ్యాత్మచే జయించబడిన ఈ భౌతిక ప్రపంచాన్ని అంగీకరిస్తే సమగ్ర ఫలితాల దిశగా నడువవచ్చు.

CWSA 35: 234- 235

ప్రాణాయామ అభ్యాసము

బరోడాలో నేను ప్రాణాయామాన్ని అభ్యసిస్తూన్నప్పుడు నేను దానిని ఉదయం 3గంటలు, మధ్యాహ్నం 2గంటలు మొత్తం రోజుకి 5గంటల పాటు చేసేవాడిని.

వెలుగులు చిమ్ముతున్న శక్తితో నా బుద్ధి పనిచెయ్యడం నేను గమనించాను. నేను ఆ రోజులలో కవిత్వం వ్రాసేవాడిని. ప్రాణాయామం అభ్యసించడానికి ముందు సాధారణంగా నేను రోజుకు 5 నుండి 8 వాక్యాలు నెలకు సుమారు 200 వాక్యాలు వ్రాసేవాడిని. ప్రాణాయామం అభ్యసించిన తరువాత ఒక అరగంటలో 200 వాక్యాలు వ్రాయగలిగాను. అది ఒక్క ఫలితమేకాదు. అంతకుపూర్వం నా జ్ఞాపకశక్తి కొంచెం బలహీనంగా ఉండేది. కాని ప్రాణాయామం అభ్యాసం తరువాత నాలో ప్రేరణ, ఉత్తేజము కలిగినప్పుడు అన్ని వాక్యాలు వాటి వరుసక్రమంలో నాకు జ్ఞాపకం వచ్చిన ఏ సమయంలోనైనా వాటిని తప్పులు లేకుండా వ్రాయగలిగే వాడిని. పని చెయ్యడం ఈ విధంగా వృద్ధి పొందడంతో పాటు నేను నామెదడు చుట్టు ఒక విద్యుత్ కార్య కలాపాన్ని, అది ఒక అతి సూక్ష్మ మైన పదార్థముతో చెయ్యబడి ఉండడాన్ని చూచాను. నాకు ప్రతీదీ ఆ పదార్థ కార్యవిధానమే. అనిపించింది.

Evening Talks. 204

యోగిపుంగవులు విష్ణుభాస్కర్ లెలె ను కలుసుకోవడానికి ముందు అనుభవాలు

శ్రీఅరవిందులు పూర్తిగా తన అంతరంగంలో ఉన్న మార్గదర్శకునికి తనని తాను సమర్పించుకొని అతను నడిపించిన విధంగా నడుచు కొన గలుగుతున్నారా అని లెలె వారి నడిగి అటులయినట్లయితే వారికి లెలె నుండి కాని, వేరెవరినుండి కాని ఎటువంటి ఆదేశాలు అవసరంలేదన్నారు. దీనిని శ్రీఅరవిందులు అంగీకరించి తన జీవన సాధనా నియమంగా చేసుకున్నారు. లెలె ను కలుసుకొనడానికి పూర్వం శ్రీఅరవిందులకి కొన్ని ఆధ్యాత్మిక అనుభవాలు కలిగాయి. కాని అది వారికి 'యోగ' విషయం లేక 'యోగ' అంటే ఏమిటి అన్నది ఏమీ తెలియక పూర్వం ఉదాహరణకు చాలాకాలం భారతభూమికి దూరమయి అటు తర్వాత తొలిసారి వారు అడుగు పెట్టినప్పుడు, అంటే బొంబాయిలోని అపోలో బందర్ పై మొట్టమొదట కాలు పెట్టిన క్షణాన ఒక గొప్ప ప్రశాంతత వారి పైకి దిగివచ్చింది. (అటు తరువాత అనేక నెలలు ఈ శాంతి వారిని చుట్టుముట్టి వారితోనే ఉంది) కాశ్మీర్ లోని తఖత్ -ఇ-సులైమాన్ కొండ అంచుపై నడుస్తున్నప్పుడు ఒక శూన్య అనంతత సాక్షాత్కారం నర్మదానది ఒడ్డున ఛాందోడ్ లోని ఒక దేవాలయంలో కాలికా సజీవ దర్శనం బరో

డాలో ఉండేటప్పుడు మొదటి సంవత్సరంలో బండిలో ప్రయాణిస్తుండగా దుర్ఘటన జరిగి ప్రమాదం సంభవించబోయే ముందు తనలోని దైవాంశ ఒక్క ఉదుటున బహిర్గతం గావడం మొదలైనవి. కాని ఇవన్నీ తమంత తామే అనుకోకుండా ఆకస్మాత్తుగా వారి అంతరంగంలో కలిగే అనుభూతులు మాత్రమే కాని వారి సాధనలో భాగం కాదు. వారు తమంత తాము గురువు లేకుండా యోగసాధన ప్రారంభించారు. గంగానాథ్ బ్రహ్మానంద శిష్యుడు తన స్నేహితుడు కూడా అయిన ఒకరినుండి అతనికి ఆ సూత్రం లభించింది. అది మొదట ప్రాణాయామం యొక్క కఠోర సాధనకి మాత్రమే పరిమితమయ్యింది. (ఒక్కోసారి రోజుకు 6గంటలు లేక అధికంగా కూడా) యోగసాధనకి, రాజకీయాలకి మధ్య ఎటువంటి ఘర్షణ లేక ఊగులాట కలుగలేదు. యోగసాధన ప్రారంభించాక వాటిమధ్య ఎటువంటి తేడాను గుర్తించక వారు రెండింటిని నిర్వర్తించ సాగారు. వారు ఒక గురువుని పొందాలనుకున్నారు. వారి అన్వేషణలో ఒక నాగసన్యాసిని కలుసుకున్నారు. బరీన్‌ని విడువని ఒక భయంకర విషజ్వరాన్ని ఒక మంత్రాన్ని నిశ్శబ్దంగా మాటిమాటికి ఉచ్ఛరిస్తూ వారు నింపిన గ్లాసుపై చాకుతో అడ్డంగా నిలువుగా గీస్తు ఆ సన్యాసి తన యోగశక్తితో ఒక్కక్షణంలో మాయ చెయ్యడం చూసినప్పుడు ఆతని యోగశక్తిలో నమ్మకం కుదురినప్పటికీ ఆతనిని గురువుగా స్వీకరించలేక పోయారు. బరీన్ ఆ నీటిని త్రాగిన వెంటనే ఆతనికి నయమయ్యింది. బ్రహ్మానందని కలుసుకొని ఆతని వలన కూడా శ్రీఅరవిందులు అధికంగా ప్రభావితులయ్యారు. కాని వారు లెలెను కలుసుకొన నంతవరకు వారికి యోగసాధనలో గురువు కాని, సహాయకులు కాని ఎవరూ లేరు, అదికూడా చాలా కొద్ది కాలం మాత్రమే.

CWSA 36:110 *భావానువాదం: డా. విజయలక్ష్మి*

యోగి విష్ణు భాస్కర్ లేలేతో సమావేశము

సూరత్ కాంగ్రెస్ నుంచి బరోడా వచ్చినప్పుడు, బరోడాలో తనకు తెలిసిన ఒక యోగి ఉన్నారని ఆయన్ను పరిచయం చేస్తానని బరీన్ లేఖ వ్రాసాడు. బారిన్ బరోడా నుంచి లేలే కి ఒక తంతి (టెలిగ్రామ్) పంపి వచ్చాడు. ఆ సమయంలో నేను కాశీరావ్ గృహంలో ఉంటున్నాను. మే మిద్దరం కలిసి సరదార్ మజుమ్‌దార్ ఉండే చోటికి వెళ్ళాం. ఆ ఇంటిపై అంతస్థులోని ఒక గదిలో మమ్మల్ని మూడురోజుల

పాటు మూసి ఉంచారు. నన్ను ఏ పని చేయవద్దని కేవలం నాకు వచ్చే ఆలోచనలను మాత్రం దూరంగా విసిరివేయమన్నారు. నేను మూడురోజులు పాటు ఆ విధంగానే చేసాను. మేమిద్దరం ధ్యాన సాధనలో కూర్చున్నాం. నేను నిశ్చలనీరవ బ్రహ్మ చైతన్యాన్ని గ్రహించగలిగాను. అప్పటినుంచి నేను నా మేధస్సుకు అతీతంగా ఆలోచించడం మొదలుపెట్టాను. ఒక్కొక్క సారి రాత్రిపూట ఒక శక్తి నా దగ్గరకు వచ్చేది. నేను ఆ శక్తిని ఆ శక్తి ప్రసాదించే ఆలోచనలను స్వీకరించే వాడిని, తెల్లవారగానే అందులోని ప్రతి పదాన్ని కాగితం మీద పెట్టే వాడిని.

ఆ నిశ్చల నీరవత ఆలోచనా రహిత స్థితిలోనే మేము బొంబాయి చేరుకున్నాము. అక్కడ నేను ఒక జాతీయ సమ్మేళనంలో ప్రసంగించవలసి ఉంది, అందుకని నేను చేయవలసినది ఏమైనా ఉందా అని అడిగితే నన్ను భగవంతుని ధ్యానం చెయ్యమని చెప్పాడు. కానీ నేనప్పటికే నిశ్చల నీరవత బ్రహ్మం తో లీనమైఉన్న కారణంగా, భగవంతుని ప్రార్థించే స్థితిలో లేనని చెప్పాను. అప్పుడు అతను తనతో కలిసి కొంతమంది ధ్యానం చేస్తారని నేను కేవలం ఆ సమావేశానికి వెళ్ళి, వచ్చిన ప్రేక్షకులందర్నీ నారాయణులుగా భావించి విశ్వమంతా వ్యాపించి ఉన్న దివ్యశక్తికి తలవంచి నమస్కరించమని అప్పుడు ఒక కంఠధ్వని నా ద్వారా మాట్లాడుతుందని చెప్పాడు. నేను సరిగ్గా అతను చెప్పిననట్టే చేసాను. నేను సమావేశ స్థలానికి వెళుతూండగా ఎవరో నా చేతికి ఒక కాగితం ఇచ్చారు. అందులోని శీర్షిక నా దృష్టిని ఆకట్టుకుంది. ఒక ముద్ర వేసింది. నేను ఉపన్యాసం ఇవ్వడానికి నిలబడగానే ఒక ఆలోచన నా మస్తిష్కంలో మెరిసి అకస్మాత్తుగా నాతో మాట్లాడించింది. అది లేలే నుంచి నా రెండవ అనుభవం. దానివల్ల అర్థం అయ్యేది ఏమిటంటే లేలే తనలోని శక్తిని యోగ అనుభవాలను ఇతరులకు పంచగలరని.

నీడలాంటి అవాస్తవ ప్రపంచ అనుభవాలు

నేను బొంబాయిలో ఉన్నప్పుడు, స్నేహితుని ఇంటి వసారాలో నుంచి చూస్తే, చలన చిత్రాలలో వచ్చే బొమ్మలాగా అవాస్తవ, నీడలాంటి వడివడిగా కదిలే బొంబాయి నగర జీవనం చూసాను. అది ఒక వేదాంత అనుభవం. నేను ఎప్పటినుంచి మానసిక ప్రశాంతతను అలవాటు చేసుకున్నానో అప్పటినుండి ఎంత క్లిష్టపరిస్థితులలో ఉన్నా అదే ప్రశాంత స్థితిని కలిగి ఉంటున్నాను. బొంబాయి నుండి కలకత్తా వచ్చే దారిలో

నేను చేసిన ప్రసంగాలన్నీ అదే స్వభావం కలిగి వున్నాయి. కొన్ని అంశాలలో మాత్రం మానసిక చేతన మిశ్రమం ఉంది. మేం విడిపోయేముందు లేలేకి చెప్పాను. మనం ఇంక కలిసి ఉండం కాబట్టి నాకు సాధనకు అవసరమైన కొన్ని సూచనలు ఇస్తే సంతోషం అని నా మదిలో ఉదయించిన మంత్రం గురించికూడా లేలే కి అప్పుడే తెలియచేసాను. సూచనలు ఇస్తున్న లేలే ఒక్కసారిగా నిలిపివేసి నాకు మంత్రం ఇచ్చిన వారిమీద నేను సంపూర్ణంగా ఆధారపడగలనా? అని నన్ను అడి గారు. సమాధానంగా ఎల్లప్పుడూ నేను అలా ఆధారపడగలనని చెప్పాను. అప్పుడు లేలే ఇక నాకు సూచనలు ఇవ్వ వలసిన అవసరం లేదన్నారు. కొన్ని నెలల తర్వాత లేలే కలకత్తా వచ్చారు. రోజూ ఉదయం సాయంత్రం నేను ధ్యాన సాధన చేస్తున్నానా లేదా అని అడిగారు నేను లేదని సమాధానం చెప్పాను. అప్పుడు ఏవో దుష్టశక్తులు నన్ను స్వాధీనపరచుకున్నాయి. అని నాకు సూచనలు ఇవ్వడం మొదలుపెట్టారు. నేను ఆయన్ను అవమాన పరచలేదు,. కాని ఆయన సూచనలను పాటించలేదు. అంతఃచేతన ననుసరించి ఆదేశాలు వచ్చాయి. మానవ గురువు ఆవశ్యకత నాకు లేదని ధ్యాన సాధన గురించి నేను రోజంతా ధ్యానంలోనే ఉంటున్నాను అన్న విష యం ఆయనకు చెప్పడానికి సిద్ధంగా లేను. నేను "కర్మ యోగి" లోను "వందే మాతరం" లోను వ్రాసినదంతా ఈ స్థితిలోనే. అప్పటినుంచి నేను నా అంతః చేత నను నమ్ముకోవడం మొదలుపెట్టాను. అది తప్పుదోవ పట్టించి సత్యానికి దూరంగా తూసుకువెళ్తూందని అనిపించింది ఆర్య, దాని తరువాత వచ్చిన రచనలు నా మెదడునుండి వచ్చినవి కావు. ఖచ్చితంగా ఆ శక్తి పనిచేస్తోంది. నేను ఇప్పుడు ఆ పద్ధతిని వాడటం లేదుకాని దానిని పరిపూర్ణస్థితికి అభివృద్ధి చేసి తరువాత పరిత్య జించేసాను.

శ్రీఅరవిందులతో సాయంకాలం సంభాషణలు, పేజి. 71,72-73

నిర్వాణ

అంతా రద్దు చేయబడింది. ఒక్క మౌనమే ఉంది
ఆలోచనలనుంచిమెదడు ముక్తమైంది విషాదం నుంచి హృదయం
నమ్మకానికి అతీతంగా అస్తిత్వరాహిత్యంలో కెదిగింది.
తెలిసిన — తెలియని 'నేను' లేదు, ప్రకృతి లేదు.


నగరం వర్ణఛాయలేని నీడలాంటి చిత్రంలా
తేలియాడుతోంది, అవాస్తవంగా కంపిస్తోంది, ఆగకుండా రూపాలు
ప్రవహిస్తున్నాయి, చలన చిత్రంలోని ఖాళీ ఆకారాలలా
తీరాలు లేని అగాధంలో మునిగిపోతున్న కొండగట్టులా
ప్రపంచం తయారైంది. ఒక అపరిమిత 'ధృవం' ఇక్కడ వుంది.
బ్రహ్మాండమైన శాంతినిరాకారత నిశ్చలత
ఒకప్పటినేనేమిటో దాన్నంతా తొలగించాయి.
ఒక నిశ్శబ్ద, పేరులేని శూన్యం,
అజ్ఞే.యంలో అంతరించిపోవ
లేదా అనంతపు దేదీప్యమాన సాగరాలతో పులకించిపోవ అంగీకరించె

CWSA 2: 561 *అనువాదం: డా. టి.యస్. రాజకుమారి*

జ్ఞాపకాలు వృత్తాంతాలు

ప్రార్థనకుగల శక్తి

ప్రార్థన విషయంలో, ఎటువంటి నిబంధనలు మార్గదర్శకాలు పెట్టలేం. కొన్ని ప్రార్థనలకు సమాధానం వస్తుంది. అన్నింటికీ రాదు. ఒక ఉదాహరణ సంజీవని పత్రిక ఎడిటర్, మా బంధువు కె. కె. మిత్రకు జ్యేష్టపుత్రిక ఏ విధంగానూ అద్భుతమైన, అతీంద్రియమైన, అతి భౌతికమైన లేదా కనీసం భావనాశక్తి కలిగిన వ్యక్తి కాదు. వైద్యులు ఆమెకు ప్రతి వనరును అన్ని మందులనూ, వాడి, అవి ఎందుకూ పనికి రావడం లేదని మానేశారు. అప్పుడా తండ్రి "ఇప్పుడిక కేవలం దేవుడే దిక్కు. మనందరం ఆయననే ప్రార్థిద్దాం." అన్నాడు. ఆయన ఆ విధంగానే చేశాడు. ఆ క్షణంనుంచి ఆ బాలిక తేరుకోవడం మొదలుపెట్టింది. టైఫాయిడ్ జ్వరమూ దాని అన్ని రోగలక్షణాలూ దూరమైపోయినై, మృత్యువుకూడా. అటువంటి ఎన్నో సంఘటనలు నాకు తెలుసు. సరే, అటువంటప్పుడు ప్రార్థనల కన్నింటికీ, ఎందుకని సమాధానం దొరకటంలేదు. అని నీ వడగవచ్చు. కాని అవన్నీ సమాధానం ఎందుకు పొందాలి? అదేమీ యంత్రం కాదు కదా! గదిలో ఒక ప్రార్థనను పెట్టి అడిగినది అందుకుంటూ ఉండటానికి. అంతేకాక అదే క్షణంలో మానవజాతి అడిగే అన్ని



నిర్వాణ స్థితికి చేరుకోవడం నా యోగ సాధన మొట్టమొదటి తీవ్రఫలితం... అది ఇతర విషయాలను ప్రవేశపెట్టకముందే నేను రాత్రి పగలు నిర్వాణంలో జీవించాను.... విముక్తి పొందిన నా చైతన్యంలో నిర్వాణం, నా సాక్షాత్కారానికి ఆరంభంగా. మొత్తం విషయం వైపు మొదటి అడుగుగా గాని యేకైక యథార్థ, సాధ్యమైన సిద్ధి గాదు, లేక కనీసం శిఖరాయమానమైన అంత్యం కాదు.

అనువాదం: డా. టి.యస్ రాజకుమారి

వైరుధ్య విషయాలను పరిగణనలోనికి తీసుకుంటే, భగవంతుడు వాటన్నింటినీ అను మతించ దలచుకొంటే, ఆయన ఒక ఇబ్బందికరమైన సంకట పరిస్థితిలో పడిపోతాడు — అది జరిగే పని కాదు.

కాశ్మీరం ఆకర్షణ

కాశ్మీర్ విషయంలో నీ అంచనాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఆకర్షణీ యమైన, దాని కొండలు, నదులు నెమ్మదిగా తీరికగా కదులుతూ ఉండే బోటు గృహంలో పరమోత్కృష్ట సౌందర్యం మధ్యలో సాగిపోతూ ఉండే ఆదర్శవంతమైన జీవితం — అది ఒక రకమైన భూలోక స్వర్గం కాశ్మీరు బయళ్ళ వైపు ప్రవహించే జీలంనది ఒడ్డున కవిత్వం వ్రాస్తూంటేనూ! దురదృష్టవశాత్తు ఆ స్వర్గాన్ని కాంతిహీనం చేయడానికి అమితంగా కష్టించి శ్రమపడే గైక్వార్ అక్కడే ఉన్నాడు! పరిపాలనా కాగితాల ద్వారా అతడి స్వర్గభావన సాగుతోంది. నాచేత, ఇతరులచేత ఉపన్యా సాలను వ్రాయించి, దాని కీర్తి ప్రతిష్టలన్నీ అతడు పొందుతున్నాడు. కాని ఎన్ని చెప్పినప్పటికీ, స్వభావసిద్ధంగా, ప్రతివ్యక్తికీ తనదైన మహదానంద స్థితి ఒకటి ఉంటుంది. *CWSA 35: 14- 15*

యోగంతో వ్యాధి నివారణ

యోగంతో వ్యాధినివారణను మొదట నాగసాధువు లేదా నాగసన్యాసి నుంచి నేను తెలుసుకొన్నాను. బరీన్ అమర్కంటక్ పర్వతాలలో తిరుగుతున్నప్పుడు అతనికి విషజ్వరం వచ్చింది. ఆ సన్యాసి ఒక కప్పు నీళ్ళు తీసుకొని ఒక కత్తితో ఆ నీటిని నిలువుగా, అడ్డంగా కోసి, నాలుగు భాగాలు చేసి దానిని బరీన్కిచ్చి తాగ మంటూ, ఇలా అన్నాడు. "అతడికి రేపు జ్వరం ఉండదు." అదే విధంగా జ్వరం లేకుండా పోయింది.

బరోడా విద్యార్థులు

బరోడాలో విద్యార్థులు, నేను చెప్పే పాఠం వివరణను వ్రాసుకోవడంతో పాటుగా ప్రత్యేకించి, వారు పరిక్షాధికారులైతే.... బొంబాయి ఆచార్యుల వివరణలుకూడా తెప్పించుకొనేవారు.

ఒకసారి నేను సౌధీ వ్రాసిన 'లైఫ్ ఆఫ్ నెల్సన్' పై వివరించి చెప్తున్నాను. నా ఉపన్యాసం బొంబాయినుండి వచ్చిన వివరణలతో ఏకీభవించడంలేదు. దానితో విద్యార్థులు నేను చెప్పేది దానిలో ఉన్నట్లుగా లేదని అన్నారు. ఆ వివరణలను నేను చదవలేదని సమాధానమిచ్చాను. ఏమైనాగాని, అవన్నీ పనికి మాలినవి. నేనెన్నడూ అతి సూక్ష్మ మైన వివరణల జోలికి వెళ్ళేవాడిని కాను. నేను చదివేసిన తర్వాత మనస్సును దాని మానాన దానిని వదిలివేసే వాడిని. ఆ కారణంగానే నేనెన్నడూ పండితుడను కాలేక పోయాను. పదిహేను సంవత్సరాలవరకు సెయింట్ పాల్స్‌లో చాలా ప్రయోజకుడవబోయే విద్యార్థిగా నాకు మంచి పేరుండేది. పదిహేను తర్వాత నేను ఆ మంచి పేరును కాస్తా పోగొట్టుకొన్నాను.

శిష్యుడు: అది ఎలా జరిగింది?

శ్రీఅరవిందులు: కారణం నేను నవలలు కావ్యాలు చదువుతూ ఉండేవాడిని, కేవలం పరీక్షలప్పుడు మాత్రమే కొద్దిగా చదివేవాడను. అప్పుడు నా ఉపాధ్యాయులు నేను నాబద్ధకం మూలంగా నా అసాధారణ సామర్థ్యాలను వినియోగించుకోవడంలేదని వాపోయేవారు. నేను కింగ్స్‌కాలేజీ, కేంబ్రిడ్జికి ఉపకారవేతనానికి వెళ్ళినప్పుడు ఆ స్కార్ బ్రౌనింగ్ అప్పటిదాకా అటువంటి మంచి వివరణాత్మక వ్యాఖ్యానాలను చూడలేదని వ్యాఖ్యానించాడు. కనుక, తెలిసిందికదా, అంత బద్ధకంలో నూ నేను దిగజారిపోవడం జరగలేదు.

Evening Talks pp. 132, 245

బ్రహ్మచారి

శ్రీఅరవిందులు తమ జీవన విధానంలో చాలా నిరాడంబరంగా ఉండేవారు. ఆయన తన అభిరుచుల విషయంలో ఏ మాత్రం అసంతృప్తిని పొందేవారు కాదు. ఆయన ఆహారం లేదా ఆహార్యం విషయంలో ఎక్కువ శ్రద్ధ వహించేవారుకాదు, కారణం, ఆయన వాటికి ఎప్పుడూ ఏ మాత్రం ప్రాధాన్యత నివ్వలేదు. ఆయన తన దుస్తులకోసం ఎన్నడూ మార్కెట్ కు వెళ్ళలేదు. ఇంట్లో ఉన్నప్పుడు, ఆయన తప్పనిసరిగా తెల్లటి ముతక దుస్తులు ధరించేవారు. ఆయనెన్నడూ మెత్తటి దూది పరుపుమీద పడుకోలేదు. కాని కొబ్బరి నార — పీచు పరుపు మీద పడుకొనేవారు. దాని మీద దుప్పటిలాగా తుంగ చాప పరచబడి ఉండేది.

ఒకసారి నేను ఆయనను ఆ విధంగా మోటైన, గట్టి పరుపును ఎందుకు వాడుతున్నారని అడిగితే, దానికి ఆయన తన సహజమైన చిరునవ్వుతో, "నీకు తెలియదా బాబూ, నేను బ్రహ్మచారిని కదా? మన శాస్త్రాలు బ్రహ్మచారి మెత్తటి పరుపును వాడకూడదని ఆదేశించాయి" అని అన్నారు.

Sri Aurobindo: His Life Unique by Rishabchand, p. 24

డబ్బు మీద ప్రేమ లేకపోవడం

ఆయన విషయంలో నేను గ్రహించిన మరొక విషయం డబ్బుమీద పూర్తిగా ప్రేమలేకపోవటం. ఆయన తన మూడు నెలల జీతాన్ని తీసుకువచ్చి మేజాబల్లమీద ఉండే తాంబళంలో మూట విప్పి గ్రుమ్మరించేవారు. ఆయన డబ్బును యెన్నడూ భద్రంగా పెట్టెలో తాళంవేసి పెట్టాలని తలచలేదు. నేను యాదాలాపంగా ఒక రోజు ఆయనను ఆ విధంగా డబ్బును ఎందుకు పెడ్తున్నారని అడిగాను.ఆయన నవ్వి, ఇట్లా అన్నారు, "అది మనం నిజాయితీపరులైన మంచివారిమధ్య ఉంటున్నామనే దానికి ఋజువు." "కాని మీరు మీ చుట్టూ ఉండేవారి నిజాయితీని పరీక్షించటానికి దాని నెన్నడూ లెక్కించరుకదా" అని అడిగాను. అప్పుడాయన ప్రశాంతవదనంతో: "నాకు లెక్కను దేవుడు వ్రాసి పెడతాడు. నాకు ఎంతమటుకు కావాలో అంత ఆయన నాకు ఇస్తాడు. మిగతాది తనకై ఉంచుకుంటాడు. ఏ విధంగానైనా, ఆయన నన్ను లేమిలో ఉంచడు. అటువంటప్పుడు నే నెందుకు బాధపడాలి?"

Sri Aurobindo: His Life Unique by Rishabchand, p. 25

ఆయన బోధనా విధానం

ఇంటర్మీడియట్ లో ఆయన విద్యార్థినవటం నేను చేసుకొన్న అదృష్టం. ఆయన బోధనా విధానం వినూత్నమై ఇంతమటుకూ తెలియనిది. పాఠం ప్రారంభంలో, విద్యార్థులకు పాఠంలోని విషయంలోకి ప్రవేశపెట్టడంకోసం ఆయన వరుసగా కొన్ని పరిచయ ప్రసంగాలను అందించేవారు. దాని తరువాత పాఠాన్ని చదివేవారు. అప్పుడప్పుడు అవసరమైనచోట్ల కఠిన పదాల, వాక్యాల అర్థాలను వివరించడానికి ఆపుతూ వారి బోధన సాగిపోయేది. పాఠంలోని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక దృక్పథాలను వివరిస్తూ, సర్వ సాధారణ ప్రసంగాలను అందిస్తూ ఆయన

ముగించేవారు. కాని కళాశాలలోని ఉపన్యాసాలకంటే, ఆయనను వేదికమీద నుంచి వినడం అనేది ఒక విందు. కళాశాల సంవాదనా సంఘం ప్రత్యేక సందర్భాలలో నిర్వహించే సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించేవారు. ఆయన మాట్లాడటం మొదలు పెట్టేటప్పుడు, కళాశాల మధ్యలోని సమావేశస్థలం అంతా పూర్తిగా నిండి పోయేది. ఆయనేమీ అనర్గళ వక్త కాదు, అయినా ఆయన ఉన్నత శ్రేణికి చెందిన ఉపన్యాసకుడు. ఆయన ఉపన్యాసంలో శ్రోతలు ముగ్ధులై లీనమైపోయేవారు. ఎటువంటి హావ భావాలు లేదా అవయవాల కదలికలు లేకుండా నిలబడి ఉండే ఆయన పెదవులనుంచి భాష ఎంతో తేలికగా, శ్రావ్యంగా యేరులై ప్రవహించేది, శ్రోతలను మంత్రముగ్ధులను గావించేది.... ఆయనను నేను ఆలకించి యాభైసంవత్సరాలు గడిచిపోయినప్పటికీ, ఇప్పటికీ ఆయన రూపం నా కళ్ళల్లో మెదలుతున్నది. శ్రావ్యమైన ఆయన కంచుకంఠం నా చెవులలో గింగురు మంటూనే ఉన్నది.

ఆర్.యన్. పట్‌కర్: రిషాబ్‌చంద్

అనికేతః (తనకంటూ వేరుగా నివాస స్థలం లేనివాడు)

తన బెంగాలీ పుస్తకంలో శ్రీఅరవిందో ప్రసంగంలో ధీరేంద్ర కుమార్ రాయ్ ఇలా పేర్కొన్నారు, శ్రీఅరవిందులకు, అతడు రాజ ప్రదసాదంలో ఉన్నాడా, గుడిసెలో ఉన్నాడా అనే దానిలో తేడా ఏమీలేదు. అతడు వాస్తవంగా నివసించిన ప్రదేశంలో, పెంకులనెప్పటికీ కాల్చడం జరగలేదు. సరికదా వాన నీరు కారనూలేదు. గీతలో వ్యక్తీకరించినట్లుగా, అతడు అనికేతః మొత్తం విశ్వంలో తనకంటూ, వేరుగా నివాస స్థలం లేనివాడు.

Sri Aurobindo: His Life Unique by Rishabchand, p. 25

ప్రాపంచిక తృష్ణ లేదా మానవ స్వార్థపరత్వపు జాడ ఇనుమంతైనా లేదు

శ్రీఅరవిందుల హృదయంలో ఎటువంటి నీచబుద్ధి, భూ మకిలి లేదనేది నాకు స్పష్టంగా తెలిసింది. రెండురోజుల క్రితం వరకు ఆయన నా కసలు తెలియనే తెలి యదు. ఆయన నవ్వు పసిపిల్లవాని నవ్వువలె సహజమై, స్వచ్ఛంగా హాయి గొలుపు తుండేది. ఆయన పెదవుల చివర దృఢమైన ఇచ్ఛ కనబడుతున్నప్పటికీ, ఆయన

హృదయంలో ఇసుమంతైనా ప్రాపంచిక తృష్ణ లేదా సర్వ సామాన్యంగా ఉండే మానవ స్వార్థపరత్వపు జాడ లేదు; అక్కడ కేవలం, దేవతలలో కూడా అరుదుగా ఉండేటటువంటి, మానవులను శోకంనుంచి విముక్తులను కావించటానికి తనను తాను త్యాగం చేసుకొనే అపేక్ష మాత్రమే ఉంది. శ్రీఅరవిందులకు అప్పటికింకా బెంగాలీలో మాట్లాడటం రాదు, కాని తన మాతృభాషలో మాట్లాడాలని ఎంత ఆతురతో! నేను ఆయనతో రాత్రి, పగలు ఉండేవాడిని. ఎంత ఎక్కువగా నేను ఆయన హృదయానికి దగ్గరవుతుంటే, అంతగా నాకు ఆయన ఈ భూమికి చెందినవారు కాదని స్పష్టంగా తెలిసేది. ఆయన తన స్వర్గాధామంనుంచి శాపవశాత్తు భూమిమీద పడిన భగవంతుడిలాగా అనిపించింది. ఆయనను ఒక బెంగాలీలాగా శాపగ్రస్తమగు భారతావని లోకి ఎందుకు నిర్వాసితుడను చేశాడనేది కేవలం భగవంతుడు మాత్రమే చెప్పగలడు. ఆయన కేవలం చాలామటుకు తల్లిఒడిలోని ఒక బిడ్డలాగ ఇంగ్లండు వెళ్ళాడు, మొత్తం నూతనత్వంలో తొణికిసలాడే ఉద్వేగభరితమైన యవ్వనం అయిపోయిన తర్వాతనే ఆయన మాతృభూమికి తిరిగిరావడం జరిగింది. కాని నన్ను అత్యంతా శ్చర్యానికి గురి చేసిన విషయం ఆయన ఉదార హృదయం విలాసాలకు, వ్యసనాలకు, తళుకులకు, మెరుపులకు, విభిన్న మనోభావాలకు, ప్రభావాలకు పాశ్చాత్యసమాజం వింతవేషభాషలకు బొత్తిగా మలినం కాకపోవడం.

Sri Aurobindo: His Life Unique by Rishabchand, p. 26

సమత్వం

శ్రీఅరవిందులు ఎల్లప్పుడూ సుఖానికి, బాధకు, కలిమికీ, ప్రతికూలతకీ, తెగ్గడ్తకీ, ఉదాసీనంగా ఉండేవారు..... కష్టాలన్నింటినీ ఆయన తొణకని మనస్సుతో ఎల్లప్పుడూ 'త్వయా హృషీకేశ హృదిస్థితేన, యధా నియుక్తోస్మి తథా కరోమి' అనే గొప్ప మంత్రాన్ని జ్ఞాపకం ఉంచుకుంటూ తాను ఆరాధించే దైవం ధ్యానంలో లీనమైపోయి, భరించేవారు. మరెవరినైనా బూడిదచేసే ఆ అగ్ని మాత్రం కేవలం ఆయన అహంకా రాన్ని దగ్ధం చేయడానికి ఉపయోగపడింది. ఆయనను ఎప్పటికంటే ఇంకా తేజో మయుణ్ణి చేసింది.

శ్రీఅరవిందులు మేజాబల్లవద్ద కూర్చొని నూనె దీపం కాంతిలో రాత్రి ఒంటిగంట వరకు, భరింపనలవికాని దోమకాట్లను కూడా లెక్కచేయకుండా, చదివే వారు.

ఆయనను నేను అక్కడ గంటలకొద్దీ అదే భంగిమలో, తాను చదివేపుస్తకం మీద కళ్ళు నిలిపి ఒక యోగి గనక దైవధ్యానం లోకి ఒక్కదూకు దూకి, బాహ్యంలో ఏమి జరుగుతున్నా ఇంద్రియ సంవేదన అనేది లేకుండా ఏ విధంగా ఉంటాడో, ఆ విధంగా కూర్చొని ఉండటం చూశాను. ఒక వేళ ఇల్లు అగ్నిప్రమాదం బారిన పడినా, అది ఆయన ఏకాగ్రతను భగ్నం చేయగలిగి ఉండేదికాదు. ఆ విధంగా ఆయన ప్రతిరోజు అర్ధరాత్రి దాటేవరకు ఐరోపాలోని అనేక భాషల పుస్తకాలనన్నింటినీ కావ్యాలు, కాల్పనికాలు, చారిత్రాత్మికం, వేదాంతికం, మొ. లెక్కకు మిక్కలి గ్రంథాలను ఔపోసన పడ్తూ, ఉండేవారు. విభిన్న భాషలలోని అనేక విషయాల మీద ఆయన చదివిన పుస్తకాలు కుప్పకుప్పలుగా పడి ఉండేవి. ఫ్రెంచి, జర్మన్, రష్యా, ఇంగ్లీషు, కవులైన ఛాసర్ మొదలుగా స్విన్ బరన్ వరకు రచించినటువంటి కావ్యాలు కూడా అక్కడ ఉండేవి. లేక్కలేనన్ని ఇంగ్లీషు నవలలు ఆయన పుస్తకాల అరలలో పేర్చబడి ఉండేవి. హోమర్ 'ఇలియడ్ ' డాంటే 'డివైన్ కామెడీ,' మన రామాయణ, మహాభార తాలు, కాళిదాసు కావ్యాలు కూడా ఆ పుస్తకాలలో ఉండేవి. ఆయనకు రష్యా సాహి త్యం మీద మక్కువ ఎక్కువగా ఉండేది.

Sri Aurobindo: His Life Unique by Rishabchand, p. 29

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

బరోడా మహారాణి వారికి 1930 వ సంవత్సరంలో వ్రాసిన లేఖ

యోగసాధన చేయడం వలన రాగల ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యాన్ని దానితోపాటుండే ఓ నిర్దిష్టశక్తిని నేను పొందడము నిజం. ప్రత్యేకంగా సిద్ధమై ఉన్నవారికి ప్రసరింపజేయడం కోసం, వారికి ఆధ్యాత్మిక స్థితివైపుకు సహాయపడడం కోసం అక్కడ శక్తి ఉంది. అందలి పరిపూర్ణతలో మార్పు చెందని అంతరంగ నిశ్చల నీర వత, బలము, దివ్యానందస్థితి ఉంటాయి. కాని ఈ ఆధ్యాత్మిక శాంతి ఆనందాలు మానసికమయిన శాంతి ఆనందాలకు పూర్తిగా భిన్న మైనవి. అది ఆధ్యాత్మిక క్రమశిక్షణ లేకుండా చేరుకోలేనిది.

మహారాణివారికి సవ్యమయిన వివరణ యివ్వబడిన దేమో తెలియదు. క్లుప్తంగా చెప్పాలంటే రెండు చైతన్య స్థితులలో ఏదో ఒక దానిలో జీవించగలరు. జీవితనాటకాన్ని దాటి నిలిచే ఉన్నత చైతన్య పాలనలోనిది ఒకటి. దీనిని ఆత్మ, సృష్ట్యాత్మ అని,

లేదా దైవమని, వివిధంగా పిలుస్తారు. మరొకటి మనుషులు జీవిస్తుండే సాధారణ చైతన్యం అదెంతో ఉపరితలంలో ఉండే జీవిత నాటకంలో ఒక సజీవ పరికరం. ఎవరు సాధారణ చైతన్యంలో జీవించుతూ, క్రియజేస్తూ ఉంటారో వారు పూర్తిగా సాధారణ మానసిక కదలికలతో పాలింపబడుతూంటారు. సహజంగా విచారం, సంతోషం, ఆందోళన, కోరికలకు గురవుతుంటారు. సర్వసాధారణ జీవనవ్యాసాంగాల తో తయారయిన ప్రతిదానికి లోనవుతూంటారు. వారు మానసిక శాంతిని, ఆనందాన్ని పొందుతాడు. కాని అదెప్పటికీ శాశ్వతము లేదా భద్రమైనది కాలేదు. కాని ఆధ్యాత్మిక చైతన్యమంతా వెలుగు, శాంతి, శక్తి ఆనందాలమయం. తానందులో పూర్తిగా జీవించగల్గితే ప్రశ్నే ఉండదు. ఇవన్నీ సహజంగా, భద్రంగా అతనివే. కాని అందులో అతడు పాక్షికంగా జీవించగల్గినా లేక నిరంతరం తనను తాను ఉన్ముఖంచేసుకున్నా జీవితంలో తగిలే దెబ్బలన్నింటి గుండా అతడిని భద్రంగా నడిపించడం కోసం ఈ

నిశ్చల నీరవ బ్రహ్మ చైతన్యం — శూన్యం

బ్రహ్మ చైతన్యం అనుభవంలోనికి రావాలంటే, దానికి ఉన్నటువంటి సర్వ సాధారణమైన భావన, ఒకరు తప్పకుండా అంతర్ముఖులై ఉండాలనేది. కాని అది పూర్తిగా నిజం కాదు. నాకు మొదటి నిశ్శబ్ద బ్రహ్మ చైతన్యానుభూతి, బరోడాలో, నేను మనస్సును, ప్రశాంతపరచిన వెనువెంటనే కలిగింది. సహజం గానే, అది, మనోమయ పురుషునికి కలిగిన అనుభవం. దానిని సుమారు ఒక నెల రోజులపాటు ఉంచుకున్నాను. కాని నేను ఎరుకలేని స్థితిలోకి వెళ్ళలేదు, నేను జనులను, వస్తువులను మాయలాగా చూశాను — అన్నీ కేవలం అత్యల్పం, ఒక ఏకం, మహావాస్తవం వాటి వెనుక ఉంది.

శూన్యానుభవం — ఖాళీస్థితి — ఇది ఇంకా ఎక్కువ అద్భుతం. కారణం నీవు ఒక విధంగా మహదాత్మ (పరమాత్మ) ను కూడా ఒక విధంగా నిషేధిస్తూ, దానిలోకి ప్రవేశిస్తావు.

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆధ్యాత్మిక వెలుగు, శాంతి, శక్తి, ఆనందాలను తగినంత స్వీకరించగల్గుతారు. ఈ ఆధ్యాత్మిక చైతన్యానికి ఉన్ముఖుడై ఉండడంవలన తానేమి పొందుతాడనేది దానినుండి తానాశించుచున్నదేమిటనే దానిపై ఆధారపడి ఉంటుంది. అది శాంతి అయితే తాను శాంతిని పొందుతాడు, అది వెలుగు లేక జ్ఞానమయితే అతడో గొప్ప వెలుగులో జీవించుతు, ఏ సాధారణమానవుని మనసైనా ఆర్జించగల్గిన దానికంటే లోతైన నిజమయి జ్ఞానాన్ని పొందుతాడు. అది బలమో, శక్తో అయితే బాహ్యాకర్మను క్రియను పాలించడం కోసం అంతరంగ జీవితంకోసం ఆధ్యాత్మిక శక్తిని పొందుతాడు. అది ఆనందమయితే సాధారణ మానవ జీవితం ఎటువంటి సంతోషం ఆనందాల నివ్వగల్గుతుందో అంతకంటే ఎంతో ఉత్తమమయిన దివ్యానందం లోకి ప్రవేశించుతాడు.

ఈ దివ్యచైతన్యానికి ఉన్ముఖులవడానికి లేదా అందులో ప్రవేశించడానికి మార్గాలెన్నో వున్నాయి. ఇతరులకు చూపుతున్న నీ మార్గం నిరంతర సాధనతో తన అంతరంగం లోనికి తాను వెళ్ళడం, ఆకాంక్షతో దివ్యత్వానికి ఉన్ముఖమవడం ఒక్కసారి దానిగురించి దాని క్రియను గురించి తాను చైతన్యవంతమయితే దానికి తనను తాను పూర్తిగా సమర్పించుకోవడం, తనను అర్పించుకోవడం అంటే దేని కోసమో అడగడం కాదు. నిరంతరం దివ్యచైతన్య సంపర్కం లేదా కలయికతో ఉండడం దాని శాంతి, శక్తి వెలుగు ఆనందాలను ఆకాంక్షించడం, మరికేదీ అడగక పోవడం, ప్రపంచంతో ఎటువంటి కర్మను చేయమని యిచ్చినా అది చేయడంకోసం జీవితంలో క్రియలో కేవలం పరికరంగా ఉండడం, ఒక్కసారి దివ్య క్రియాశక్తికి ఉన్ముఖమయిన మనస్సులో, హృదయంలో, దేహంలో ఆధ్యాత్మికశక్తి పనిచేయడం అనుభూతి చెందగల్గితే మిగిలినదంతా దాని పట్ల నమ్మకంతో ఉండిపోవడమే. ఎల్లవేళలా దానికోసం పిలుస్తూండడం అది వచ్చినప్పుడు తన పనిని చేయనీయడం ఇతరమయిన ప్రతిదానిని, నిమ్న చైతన్యానికి అధోస్వభావానికి చెందిన క్షుద్ర క్రియాశక్తిని కాదనడము.

నా స్థితిని, నా యోగశక్తి స్వభావాన్ని వివరించడం కోసం ఎంతో వ్రాసాను. సాధాణంగా ఈ యోగాన్ని సాధన చేయమని ఎవరినీ అడుగను, ఎందుకంటే ఆరంభాన్నుండి ఉన్నవారికి లేదా దానికోసం తీక్షణమయిన పిలుపు నందుకొన్న వారికి మాత్రమే అది సాధ్యం. మిగిలిన వారు చివరి వరకూ వెళ్ళలేరు. ఎంతోమంది యోగులులు చేస్తున్నట్లు బాహ్యప్రకృతికి చెందిన ఏదో రకమైన శాంతి అవసరమయిన

వారికి సహాయపడడంకోసం నా మార్గాన్ని వదిలేస్తారు. కొందరి విషయంలో అలా చేయడం నేను నిరాకరించినప్పటికీ నా లక్ష్యం ఉన్నత చైతన్యాన్ని క్రిందకు తీసుకు రావడం కోసం మాధ్యమంగా పనిచేసే ఓ ఆధ్యాత్మిక జీవన కేంద్రాన్ని సృష్టించడం, దానిని కేవలం 'మోక్షం' కోసం గాక భూతలాన దివ్య జీవితం కోసం పనిచేసే ఓ శక్తిగా తయారయేటట్లు జేయడం. ఈ ఉద్దేశంతోనే ప్రజా జీవితాన్నుండి విరమించుకొని పాండిచ్చేరిలో ఈ ఆశ్రమాన్ని స్థాపించాను. (అంతకంటే మంచి పదం దొరకక అలా పిలవడం, ఎందుకంటే యిది సన్యాసులుండే ఆశ్రమం గాదు, కాని మిగిలినవన్నీ వదిలి ఈ పనికి తయారవాలనుకున్న వారికి) అదే సమయాన భారతదేశమంతటా తమ కుటుంబాలతో నివసిస్తూ, దూరాన్నుండయినప్పటికీ నా నుండి ఆధ్యాత్మిక సాయాన్ని అందుకుంటున్న శిష్యులు కొందరున్నారు.

మహారాణివారికి మీకు ప్రస్తుతం యింత మాత్రమే సమాధానమీయగలను. మీరాశించుతున్న దేమయినా ఈ లేఖలో వివరించిన దానితో జరుగుతుందేమో మీరే నిర్ణయించుకో గలరు.

CWSA 36:440- 442 *అనువాదం: అరుణామోహన్*

ఒకరి ఆత్మసిద్ధి, సాఫల్యత, ప్రయోజనం పొందటం విషయాలు అహంకార పూర్వక భావనలో ఇతరులకు స్వయం సేవగానో లేక పట్టుదల నెగ్గించు కోవడంగానో లేక ఆనందోత్సాహాలలో తేలియాడడంగానో లేక స్వయం తృప్తికై యథేచ్ఛగా సాగే కార్యాచరణగానో కనిపించేటట్లయితే, అట్టి కార్యాచరణను మనం తప్పక చేపట్టాలి.

CWSA 22: 331 — శ్రీఅరవిందులు

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2018



మాతృత్వ విద్య

సంపాదకీయం:

మానవ గర్భధారణలలో చాలా భాగం పథకం ప్రకారం జరిగేవికావు, అనుకొనని సంఘటన అనేది బాగా ఆలోచించవలసిన విషయం. బిడ్డ యెప్పుడు కడుపున పడిందో తల్లిదండ్రులకు తెలియదు. కేవలం దాంపత్యసుఖం బిడ్డగా ఫలించడం కాకూడదు. అది ప్రార్థనల, ఆకాంక్ష ఫలం అవ్వాలి. ఒక బిడ్డ రూపంలో అభివృద్ధి చెందే ఆధ్యాత్మిక బీజం దైవానికి చెందినది, కాలక్రమంలో దేహాన్ని అంతరాత్మవంతం చేయడానికి బిడ్డరూపం పొందడంలో దైవ పర్యవేక్షణకై ప్రార్థించడమే స్త్రీపురుషులు చేయగలిగింది. ఈ మొత్తం ప్రక్రియ అంతా, ఒక అవాంఛనీయ, అచేతన మానవ సమూహాన్నిగాక, ఒక సచేతన జనబాహుళ్యాన్ని (సుప్రజ - జననమ్) సృజించడం కోసమే. ఈ అసాధారణ సృష్టికోసం, ఒక గొప్ప సన్నద్ధత అవసరం. బిడ్డలకోసం ఆకాంక్షించే స్త్రీ, పురుషులు తప్పక ఆధ్యాత్మికంగా పురోగమించాలి, ఆధ్యాత్మిక పరివర్తన చెందాలి. ఈ ఆధ్యాత్మిక పరివర్తన అంటే యేమిటి? దాని నెలా సాధించాలి, అనే ప్రశ్నలు చాలా విస్తృత పరిధికి చెందినవి, అధ్యయనం జరగాలి. మదర్ రచనల నుండి యీ విషయంపై సేకరించిన సమాచారంనుండి చాలా లోతైన పరిజ్ఞానం పొందవచ్చు.



స్త్రీలు, పురుషులు

స్త్రీ, పురుషుల సంబంధం:

స్త్రీలను ఇంటికి, గృహకృత్యాలకు పరిమితం చేయటం; పురుషులకు మాత్రమే బయట సమాజంలోని కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కల్పించటం మనం చూస్తున్నాం. కలసివుండటము, అయినా ఈ విధంగా వేరువేరు బాధ్యతలకు పరిమితం కావటం, స్త్రీపురుషులను శాశ్వతంగా భిన్న వ్యక్తులుగా చూడటం వారిద్దరికీ కూడా బాధాకరమే! స్త్రీ, పురుషుల సాన్నిహిత్యం వలనగాని, విశ్వాసంవలనగాని, నిర్వహించగల వారి ఘనతర బాధ్యతలూ, విధులకు ఈ విధంగా ఆటంకం కలుగుతుంది. లింగ వివక్ష రూపుమాసిపోయే రోజు రానవసరం రావాల్సిన అవసరం లేదా అనేది అన్ని దేశాలకూ వర్తించేదే.

ఈ నాటి సమాజ శిధిలాలపై చక్కని నూతన నిర్మాణాన్ని చేపట్టవలసిన అవసరం వుంది. ఇది అందరి బాధ్యత, ఏ ఒకరిదో కాదు. ఇందులో పరస్పరమైన పోటీభావం ఉండకూడదు. స్వలాభం ప్రక్కన పెట్టి, స్త్రీ, పురుషులు ఎల్లరూ కలసికట్టుగా ఈ సమున్నత బాధ్యత చేపట్టాలి. దీన్ని పట్టుదలతో నిర్వహించి ఇందులో విజయం సాధించాలి. వారి బాహ్య కార్య, కలాపాల విషయాలలోనే కాదు, వారిలో ఆంతరంగిక ఆధ్యాత్మికత ఎదిగేలా ప్రయత్నించాలి. అంతర్గత అభివృద్ధి లేనినాడు బాహ్యామైన అభివృద్ధికి అర్థమే లేదు. స్త్రీ వాదము, దానితో ముడిపడిన సమస్యలు అన్ని ప్రాపంచిక సమస్యల మాదిరిగానే, ఆధ్యాత్మికం దిశగా పయనిస్తాయి. ఆధ్యాత్మిక సత్యమే అన్ని ఉన్నత ఆదర్శాలకూ మూలం. దివ్యప్రపంచం, బౌద్ధుల "ధమ్మత" ప్రపంచానికి శాశ్వతమైన పునాది. ఇతర లోకాలన్నీ దీనిమీదే నిర్మితమైనాయి. స్త్రీ పురుషుల హక్కుల విషయంలోగాని, వారివారి బాద్యతల విషయంలోగాని పరాత్పర సత్యత దృష్టినుండి చూస్తే, అంతా సమానమే, ఇదీ ఇంతే! ఏదైనా తేడాలువుంటే, అవి నిజాయితీలోనూ, ఆకాంక్షలోనూ, పట్టుదలలోనూ మాత్రమే ఉంటాయి. ఈ ప్రాథమిక ఆధ్యాత్మిక సమత్వాన్ని ఆధారం చేసుకొనే లింగవివక్షత వలన ఉత్పన్నమయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలి. భవిష్యత్తులో నిర్మాణం కావలసిన "మానవత్వపు దేవాలయం" ఈ పునాదుల పైననే జరగాలి. ఈ ఉన్నత స్థాయినుండే

నూతన జీవితానికి అవసరమైన కార్యకలాపాలు జరగాలని కాంక్షించాలి.

CWM 2: 149-150

పురుషులకన్న అధికంగా స్త్రీలు భౌతిక, ప్రాణిక చేతనలకు అంతగా బద్ధులు కారు. ఇందుకు భిన్నంగా వారికి చైత్యపురుషుని గమనించగల సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. "అంతా తమకే తెలుసు" అని అహంకారభావంతో మెలిగే పురుషులలో ఇది అంతగా కానరాదు. మాటలతో వర్ణించలేని స్త్రీల మనస్తత్వం వారి భావాలలోనూ, చేతలలోనూ వారికి తెలుస్తూనే వుంటుంది. ఇది సర్వసాధారణమే!

CWM 14:289

ముందుగా నమ్మవలసినది ఏమిటంటే, గర్వము, లజ్జ విహీనత, జుగుప్సాకరమైన లక్షణాలు. అజ్ఞానము, బుద్ధి మాంద్యము ఉన్నవారే గర్వంతో ప్రవర్తిస్తారు. తగినంత విజ్ఞత ఉన్నవారు — అది ఎంత కొద్దిగా ఉన్నాసరే — వారికి బయట ప్రపంచంతో గనుక సంబంధం వుంటే, వారిలో నమ్రత కూడా అభివృద్ధి అవుతుంది.

అవసరాల నిమిత్తం స్త్రీలు పురుషులపై ఆధార పడతారు. అని అనుకోవటం సరియైన భావన కాదు. స్త్రీ, పురుషులు ఇద్దరూ పరస్పర ప్రయోజనాన్ని ఆశించేవారే. కచ్చితంగా చెప్పాలంటే, వారిరువురి అవసరాలు సమానంగానే వుంటాయి. భౌతిక అవసరాల విషయంలో మగవారు స్త్రీలపై ఆధారపడినట్లు, స్త్రీలు కూడా పురుషుల శ్రమపై ఆధారపడుతున్నారు. పరస్పర సహకారం కావాలంటే పురుషుల్లో సంయమనం, స్త్రీలలో అధికారం కూడా ఉండాలి. ఇదే మానవాళికి అవసరం.

"స్త్రీలు అణకువగా ఉండి, పురుషులను సంతోషపెట్టాలి." అనే భావన కూడా లోపభూయిష్టమైనదే! స్త్రీ కేవలం పురుషుల సంతోషానికేనా, ఈ భూమ్మీద పుట్టింది! ఇది అర్థం లేని వాదన.

దివ్య చైతన్యశక్తిని ఈ భూమి మీద నెలకొల్పడానికే ఈ ప్రపంచం సృష్టించబడింది. స్త్రీ పురుషులు దీన్ని గ్రహించి, వారివారి కర్తవ్యాలను నిర్వహించి ఆ దివ్యశక్తిని ఈ ప్రపంచంలో ఆవిష్కరించాలి. ఇదే వారి ఉనికికి లక్ష్యం. దీనికి మించిన ప్రయోజనం మరొకటి లేదు. వారు దీన్ని ఎంత ఎక్కువగా జ్ఞాపకం చేసుకుంటే, అంత త్వరగా వారి మధ్యన ఉన్న వైరుధ్యాలు మరచిపోయి, తామంతా దివ్యత్వాన్ని ఆవిష్కరించటానికే, సేవించటానికే భూమి మీద జన్మించామని నమ్మగలరు. ఆ విధంగా

దివ్యత్వానికి ఇంకా మెరుగైన సేవలను అందించగలరు.

CWM 2:151

అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు (ఫోన్ 9848848291)

మాతా! మాధుర్యమయీ! స్త్రీ పట్ల పురుషునికి, పురుషుని పట్ల స్త్రీకి ఉండే ఈ సానుభూతి లేదా ఆకర్షణ వెనుక శాశ్వత సత్యం ఏమున్నది?

జ: పురుష, ప్రకృతులకు మధ్య వున్న సంబంధం, ఈ విషయాన్ని గూర్చి శ్రీఅరవిందులు వ్రాసినది నీవు చదవాలి.

CWM 16: 311

మూడు బానిసత్వాలనుండి విముక్తి

స్త్రీలు వారికి వారుగా స్వతంత్రులు అయితే తప్ప ఏ శాసనం వారిని బంధ విముక్తులను చేయలేదు.

వారిని బానిసలుగా తయారుచేసేది ఏమిటంటే:

1. పురుషునివైపు, అతని బలంవైపు ఆకర్షణ
2. గృహస్థ జీవితం, దానివల్ల ఏర్పడే భద్రతపై మక్కువ
3. మాతృత్వం పట్ల అనురాగం

వాళ్ళు గనుక ఈ మూడు బానిసత్వాలనుండి విడివడితే నిజంగా పురుషులతో సమానంగా ఉండగలరు.

పురుషులు కూడా మూడు గులామీలను కల్గి వున్నారు.

1. స్త్రీని స్వాధీనంలో వుంచుకొనే తలంపు, అధికారం, ఆధిక్యతలతో వుండాలను కోవడం.
2. స్త్రీతో లైంగిక సంబంధాన్ని కల్గి వుండే కోరిక
3. వైవాహిక జీవితంలో వుండే చిన్న చిన్న సుఖ సదుపాయాలకు లొంగటం.

ఈ మూడు బానిసత్వాలనుండీ విముక్తి పొందితే గనుక వారు నిజంగా స్త్రీలతో సమానం కాగలరు.

CWM 14: 289

ఏది ప్రేమ కాదు?

లైంగిక సంభోగం ప్రేమకాదు.

ప్రాణికమైన ఆకర్షణ, పరస్పరం ఇచ్చుపుచ్చుకోవడం ప్రేమకాదు.

అనురాగం కోసం హృదయంలో ఆరాటం ప్రేమ కాదు.

ప్రేమ అంటే ఏకేశ్వరుడినుండీ నేరుగా వచ్చే బలీయమైన భావ ప్రకంపనం. ఎంతో పరిశుద్ధంగా ఎంతో శక్తివంతంగా వున్నవారే దానిని అందుకొని అభివ్యక్తపర్చ గలరు. శుద్ధంగా ఉండటమంటే అన్యమైన దానికి కాక పరమాత్మ ప్రభావానికి మాత్రమే తనను తెరుచుకోవడం.

CWM 14:125

వివాహాన్ని గూర్చి, ఎన్నటికీ వీడని కలయికలోని రహస్యం

మీ భౌతిక జీవితాలను, మీ భౌతిక సంబంధమైన అభిరుచుల్ని ఏకం చేయడం, ఇద్దరూకలసి కష్టాలను, విజయాలను జీవితంలో వచ్చే గెలుపు ఓటములను ఎదుర్కొనే నిమిత్తం భాగస్వాములు అవ్వడం అన్నది వివాహానికి అసలు పునాది. కాని అది మాత్రము సరిపోదు అన్నది మీకు తెలుసు.

మీ సంవేదనల్లో ఒకటైపోవడం, ఒకే రకపు కళాత్మక అభిరుచి ఆస్వాదనల్ని కల్గి వుండటం, ఒకే రకపు విషయాల్లో సహజంగా ఒకేలా ప్రవర్తించడం ఒకరి వలన ఒకరు ఒకరికొకరుగా మెలగటమన్నది మంచిది. అది అవసరం, కానీ అది కూడా చాలదు.

మీ ప్రగాఢ భావస్పందనల్లోనూ ఇరువురూ ఒకటిగా ఉండటం, జీవితంలో ఒడుదుడుకులు ఎన్ని వచ్చినా ఎట్లాంటి మార్పు లేని పరస్పర మమతానురాగాన్ని, మృదుత్వాన్ని కల్గి వుండటం, ప్రతి చికాకును, అలసటను, నిరాశను ఎదుర్కొగలగటం, ఎప్పుడూ ప్రతి సందర్భంలోనూ, సంతోషంగా అమిత సంతోషంగా ఉండటం ఇద్దరూ కలిసి ప్రతి స్థితిలో సమత్వాన్ని, శాంతిని ఆనందాన్ని ఒకరికొకరం అన్నది మంచిది. చాలా చాలా మంచిది. అది అత్యావశ్యకం. కానీ అదీ సరిపోదు.

మీ మనస్సులను ఒకటి చేయడం, మీ ఆలోచనలను సమన్వయ పరిచి పరస్పర అభినందనీయంగా చేసుకోవడం, మీమీ భౌద్ధికమైన ముందు చూపులు, జాగ్రత్తలు, ఆవిష్కరణలు ఒకరికొకరు పంచుకోవడం సంక్షిప్తంగా చెప్పాలంటే మీరు ఒక్కే సారిగా సంపాదించుకొన్న విశాలత్వం, జ్ఞానసమృద్ధి ద్వారా మానసిక కార్యకలాపాల్ని

ఒకటి చేసుకోవడం అదంతా మంచిది. అది ఖచ్చితంగా కావాలి. కాని అది కూడా చాలదు.

దీనంతటికీ పైగా లోతుల్లో కేంద్ర స్థానంలో వ్యక్తి లోని సర్వోన్నత శిఖరంపై, జీవులకుచెందిన పరమసత్యం శాశ్వతప్రకాశం, ఈ పుట్టుక, ప్రాంతం వాతావరణం, విద్య మొదలైన పరిస్థితులనుండి స్వతంత్రమైనది వుంది.

అదే మూలం. మన ఆత్మ వికాసానికి హేతువు. గురువు. అదే మన జీవితాలకు శాశ్వతమైన మార్గదర్శనాన్ని ఇవ్వగలదు. అదే మన తల వ్రాతలను నిర్ధారించగలదు. దానికి సంబంధించిన చైతన్యంలో మీరు ఏకమవ్వాలి. ఒకే ఆధ్యాత్మిక మార్గంలో ఇరువురూ అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగటానికి ఇరువురూ ఒకే ఉద్గమనంలో ఒకే ఆకాంక్షతో ఉండాలి. ఇదే ఎన్నటికీ నిలిచిపోయే కలయికలోని రహస్యం.

CWM 13: 236- 237


సాధారణ జీవితంలో ఈ ఆధునిక మహిళకుండవల్సిన ఆదర్శమేమిట?

నిత్యజీవితంలో వాళ్ళిష్టపడుతున్న భావనలతో వాళ్ళు వుండవచ్చు. అది అంత ముఖ్యం కాదు. ఆధ్యాత్మిక దృష్టిలో దైవాన్ని సాక్షాత్కారింప చేసుకోవడంలో స్త్రీలు, పురుషులు వారిలోని సమర్థత దృష్ట్యా సమానులే. ప్రతి ఒక్కరూ అతడు (ఆమె) తనదైన మార్గంలో, అతడి (ఆమె) అనుకూలమైన స్వీయ సాధ్యాసాధ్యాలను బట్టి ప్రయత్నించాలి.

CWM 10: 299- 300

శ్రీమాత

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్ (ఫోన్: 9441519210



ఆకాంక్ష, ప్రయత్నము

తల్లి ఆకాంక్ష, ఆమె ఆలోచనలు భావములు, ఆమె ఉన్నత ఆదర్శములు, ఆమె ఇచ్ఛ, ఆమె భౌతిక పరిస్థితులు

పుట్టబోయే శిశువు ప్రకృతి చాలా వరకు ఆ శిశువుకు రూపునిచ్చే తల్లి మీదా, ఆమె ఆకాంక్ష, ఇచ్ఛ మరియు ఆమె నివసించే భౌతిక స్థితిగతులమీదా ఆధారపడి ఉంటుంది.ఆమె ఆలోచనలు ఎల్లప్పుడూ చక్కగా, నిర్మలంగా ఉండి, ఆమె ఎల్లప్పుడూ సుకుమార ఉదాత్త భావనలు కలిగి ఉండి, ఆమె భౌతిక పరిస్థితులు ఎల్లప్పుడూ ఎంత వరకు వీలయితే అంతవరకు సమతుల్యంగా, చాలా నిరాడంబరంగా ఉండాలి. ఇది తల్లికి సంబంధించినంత వరకు విద్యయందలి ఒక భాగము. ఇంతేకాక ఆమె ఊహించుకునే గొప్ప ఆదర్శానికి అనుగుణంగా శిశువును తయారు చేసుకోవాలనే నిక్కచ్చియైన ఒక సచేతన ఇచ్ఛాశక్తిని అదనంగా ఆమె కలిగిఉన్నప్పుడు అత్యంత ఉన్నతమైన అంతర్నిహితశక్తులతో ఈ ప్రపంచంలోకి బిడ్డ రాగలిగేవిధంగా అసలైన ఉత్తమ పరిస్థితులు సాకారమౌతాయి.

CWM 12: 9

ప్రశ్న: శిశువు చదువు ఎప్పుడు ప్రారంభం అవుతుంది?

సమా: మానవుని చదువు జన్మించినపుడు మొదలై జీవితాంతం కొనసాగుతూనే ఉండాలి.

సరే, మనం ఈ చదువు అతి యెక్కువ ఫలితాలు సాధించాలనుకుంటే జన్మించడానికి పూర్వమే విద్య ప్రారంభమవ్వాలి. ఈ సందర్భంలో తల్లి తనంత తానే రెండువిధాలయిన కర్మ ద్వారా ఈ చదువుతో ముందుకు సాగుతుంది. మొదటిది తన అభివృద్ధికై తన పై తాను పనిచెయ్యడం, రెండవది తను శారీరకంగా తయారుచేసే బిడ్డకై పనిచెయ్యడం.

CWM 12: 9

ఏకాగ్రత, ధ్యానం, ఆకాంక్ష ముందుగా తనని తాను తయారుచేసుకోవడం, గర్భధారణ సమయంలో చేతనావస్థ

ప్రశ్న: మాధుర్యమయీ శ్రీమాతా, తల్లితండ్రులకు వారు కావాలనుకునే ఆత్మకై

అర్థించి దానికి జన్మ నివ్వడం సంభవమా?

అడగడమా? దానికోసం వారికి ఒక గుహ్య జ్ఞానం ఉండి తీరాలి. కాని అది సాధారణంగా వారికి ఉండదు, కాని ఏది ఏ మయినా, ఏది సంభవమంటే పశువువలె కామవాంఛతో ప్రేరేపింపబడి కాకుండా, చాలా సందర్భాల్లో కావాలనుకో కుండానే వారు ఇచ్ఛా శక్తితో ధ్యానపూర్వక అభిలాషతో వారు తయారుచెయ్యబోయే ఆకృతిలోనికి వారు కావాలనుకునే ఆత్మ దిగివచ్చి, రూపు దిద్దుకోవాలని అనుకోవచ్చు. నాకు కొంతమంది తెలుసు. చాలా మంది కాదు, ఇది తరచు జరుగదు, కాని అయినప్పటికీ ఎవరయితే కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులను ఎంచుకొని, ఒక ప్రత్యేక ఏకాగ్రతా చిత్తంతో ధ్యానించి, అభిలషించి వారి శరీరంలోకి వారు తయారుచేయబోయే ఆకృతి గల దేహం లోనికి ఒక అనుపమ ప్రాణిని తీసుకురావాలను కోరుకుని తమని తాము తీర్చిదిద్దుకున్నవారిని కొంతమందిని నే నెరుగుదును.

CWM 8: 200 భావానువాదం: డా. విజయలక్ష్మి (ఫోన్: 9894020952)

కోరికకు సంబంధం లేని పూర్తిగా బయట ప్రక్క గర్భధారణ జరుగుతుంది. అది నెరవేరడం చాలా కష్టం

ఒక శిష్యునితో మదర్ సంభాషణలు ఏప్రిల్ 19, 1967

అనువాదం: కె.వి. రావు.

తల్లి కాబోయే సమయంలో తల్లితండ్రుల చేతనాస్థితి ముద్రను జీవితాంతమూ బిడ్డ ప్రతి బింబిస్తూంటుంది

కొందరు పిల్లలు దుశ్చేతనతో వుంటారు. తల్లిదండ్రులు ఆకాంక్షించకుండానే వారు పుట్టి వుంటారా?

బహుశా ఇది తల్లిదండ్రుల ఉప చేతస్సులోని చెడుభావన అయివుంటుంది. మనుషులు తమ చెడ్డతనాన్ని పుట్టిన బిడ్డలోనికి తమనుండి నెట్టి వారిలో అది పుట్టేటట్లు చేస్తారు. ప్రతి ఒక్కరిలో ఒక చీకటికోణం వుంటుంది. కొందరిలో ఇది బయట పడుతుంది, అయితే అది అంతటితో వారిని వీడిపోదు. బహుశా అది కొంత ఓదార్పు నీయవచ్చు. కాని దాని ఫలితాన్ని పొందేది బిడ్డే, తెల్సిందా? తల్లిదండ్రులలో ఆ క్షణంలో వున్న చేతనా స్థితికి అధిక ప్రాధాన్యత వుంది, అనేది నిజం. ఒకవేళ వారికి నిమ్నస్థాయికి చెందిన లేక నీచభావన వున్నట్లైతే బిడ్డలు ఆ లక్షణాలను తప్పనిసరిగా ప్రతిబింబింప

జేస్తారు. ప్రత్యేకించి తెలివితేటల దృక్కోణంలో (తూట్లతో కొన్నింటిని కోల్పోయి) పుట్టిన అసంపూర్ణ, సరిగా రూపుదాల్చని సరిగా పోషణలేని యీ బిడ్డలందరూ అర్థ చేతస్సుగలవారు, సగమే రూపొందిన వారు అవుతారు. అందుకు గర్భధారణ సమయంలో తల్లిదండ్రులకున్న చేతనాస్థితియే కారణం. అలాగే ప్రపంచాన్ని వదిలి వెళ్ళే వారి చివరిక్షణాల్లోని చేతనాస్థితి వారి భవితవ్యానికి ఎంతో ప్రాధాన్యత కలిగి వుంటుంది. అలాగే గర్భధారణ సమయంలోని తల్లిదండ్రుల చేతనాస్థితి అంతగానూ ప్రాముఖ్యత కలిగి వుంటుంది. ఒక విధమైన ముద్రగా అది బిడ్డ జీవితాంతం బిడ్డలో ప్రతిబింబిస్తూనే వుంటుంది. ఇవన్నీ చిన్న విషయాలుగా కనిపిస్తాయి. ఆక్షణంలోని వారికున్న భావనాస్థితి. వారి క్షణిక ఆకాంక్ష లేదా భ్రష్టత మీద అదే విధమైన మరి దేనిమీదైనా ఆ ప్రత్యేకక్షణంలో జరిగే ప్రతిదాని మీద ఆధారపడివుంటుంది. అది అత్యల్ప విషయంగా కన్పించవచ్చు. కాని అదే ఒక గొప్ప పర్యవసానానికి దారి తీస్తుంది. ఈ ప్రపంచంలోకి ఒక అసంపూర్ణ లేదా చెడ్డ లేదా ఎందుకు పనికిరాని బిడ్డను తీసుకొస్తుంది.మనుషులకీ విషయం తెలియదు.

తర్వాత బిడ్డ అసభ్యంగా ప్రవర్తించినపుడు వారు తిడతారు. కానీ వారిని వారు దూషించుకోవడం ప్రారంభించాలి, ఈ విధంగా వారికి వారు చెప్పుకుంటూ, ఈ బిడ్డని లోకంలోకి తెచ్చినపుడు మేము ఎలాంటి భయంకర చేతనావస్థలో వున్నామో? ఎందుకంటే నిజం అదే కాబట్టి.

CWM5: 411- 412

ప్రపంచాన్ని వదలిలి వెళ్ళేవారి చివరి క్షణాల్లోని చేతనాస్థితి వారి భవితవ్యానికి ఎంత ప్రాధాన్యత కలిగి వుంటుందో అంతగా గర్భధారణ సమయంలోని తల్లిదండ్రులు చేతనాస్థితి ప్రాముఖ్యత కలిగి వుంటుంది. అది బిడ్డపై ఒక విధమైన ముద్ర పడేటట్లు చేస్తుంది. అదే ఆ బిడ్డ జీవిత పర్యంతమూ ప్రభావాన్ని చూపిస్తూనే వుంటుంది.

CWM 5: 412 *అనువాదం: లక్ష్మి తుమ్మల (ఫోన్: 9014239277)*

నిజమైన మాతృత్వం - చేతనతో ఒక ప్రాణిని సృష్టించడంతో ఆరంభం అవుతుంది

మాతృత్వం, నిర్వహించవలసిన అతి ముఖ్యమైన పాత్రగా యోచించడమైనది. కాని మాతృత్వం అన్న పదాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నప్పుడే అది నిజమౌతుంది.

శిశువులను ఈ ప్రపంచంలోకి తీసుకురావడం అంటే కుందేళ్ళు చేసినట్లుగా యాంత్రికంగా, అవివేకంతో, స్వాభావికంగా చేయడం కాదు. అది నిజమైన మాతృత్వం కాదు. నిజమైన మాతృత్వం ఆరంభం మనస్ఫూర్తిగా ఇష్టపూర్వకంగా చేతనతో ఆత్మ రూపకల్పన చెయ్యడం, అంతరాత్మ అభివృద్ధి చెందటానికి సరికొత్త శరీరాన్ని వాడుకోవడానికి సంసిద్ధ పరచడం, స్త్రీ అసలైన పరిధి ఆధ్యాత్మికత, కానీ మనం చాలా సార్లు దాన్ని మర్చిపోతాం.

ఒక శిశువును గర్భంలో ధరించి దాదాపు అధోచేతనతో శరీరాన్ని తయారు చెయ్యడం ఒక్కటే సరిపోదు. మన అసలైన కర్తవ్యం, మన ఆలోచనాశక్తితో, అభిలాషతో గర్భం ధరించి, ఒక ఆదర్శవంతమైన పాత్రను సృష్టించగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్ననాడు మొదలౌతుంది.

నాకు అంత శక్తి సామర్థ్యాలు లేవు అనవద్దు. ఇంతశక్తివంతమైన, ఫలవంతమైన ప్రక్రియకు అసంఖ్యాకమైన ఉదాహరణలను చూపించవచ్చు.

మొట్టమొదటగా భౌతిక పరిసరాల ప్రభావాన్ని గుర్తించి, అధ్యయనం చెయ్యడమన్నది చాలాకాలం ముందరే జరిగింది. స్త్రీ చుట్టూ ఆవరించి ఉన్న కళ, సౌందర్యాలతో పురాతన గ్రీకులు మెల్ల మెల్లగా అపురూపమైన సామరస్యత గల తమ ప్రస్తుత జాతిని సృష్టించుకో గలిగారు.

ఈ యధార్థతకి వ్యక్తిగత దృష్టాంతాలు అనేకం. ఒక స్త్రీ గర్భం ధరించినపుడు ఒక సుందరమైన చిత్రాన్ని లేదా శిల్పాన్ని తదేకంగా చూస్తూ ఆనందించడం ఆ చిత్రాన్ని లేదా శిల్పాన్ని ఇష్టపడుతూ శిశువుకు జన్మ నివ్వడం అరుదైన విషయంకాదు. ఇటువంటి సంఘటనలు నాకు చాలా తెలుసు. అందులో నాకు బాగా స్పష్టంగా జ్ఞాపకం వున్నది, ఇద్దరు ఆడపిల్లల కవలలు, ఆ ఇద్దరూ అత్యంత సుందరమైనవాళ్ళు ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వారిద్దరూ తల్లిదండ్రులను చాలా తక్కువగా పోలి ఉన్నారు. (రూపసారూప్యత చాలా తక్కువ) వాళ్లు నీకు అత్యంత ప్రఖ్యాతి గడించిన రెనాల్డ్ వేసిన చిత్రపటాన్ని గుర్తు చేస్తారు. ఒక రోజు ఈ విషయం వారి తల్లికి చెప్పగా ఆశ్చర్యంతో, నిజంకదా మీకు తెలుసుకోవాలనే ఆసక్తి కలగవచ్చు నేను బిడ్డల్ని మోస్తున్నప్పుడు, నా గదిలో నేను నిద్రించే మంచం పైన రెనాల్డ్ గీసిన అత్యంత సుందరమైన చిత్రపటం ఉండేది. నేను పడుకునే ముందు, లేవగానే, ఆ చిత్రపటాన్ని చూసేదాన్ని, రోజులో నా మొదటి ఆఖరి

చూపులు ఆ చిత్రపటం మీదే ఉండేవి. నా హృదయం లోని కోరిక ఏమిటంటే నా పిల్లలు ఆ చిత్రాన్ని పోలి ఉండాలని,మీకు తెలుసా. ఈ విషయంలో నేను విజయం సాధించాను, అన్నది. వాస్తవానికి ఆవిడ ఆ విజయానికి చాలా గర్వపడి ఉండాలి. ఆవిడ ఇచ్చిన ఉదాహరణ చాలా మంది స్త్రీలకు ఉపయోగకరం.

కానీ మనం ఈ ఫలితాలు భౌతిక సమతలం మీద అతి తక్కువ మృదుత్వం ఉన్న మూలపదారథంగాలపైనే సాధించ గలిగితే ఇంకా ఆలోచనా, కోరికలు, అభిలాషలు మీద దృఢమైన ప్రభావం చూపగల ఆ మానసిక భూమికల మీద ఎంతో ఎక్కువ దృఢత్వంతో ప్రభావం చూపగలవు. అప్పుడు పురాతన, అనువంశిక అస్పష్ట బంధాలను ఎందుకు స్వీకరించాలి. అవి మన స్వంత సహజశీల వైఖరి అధోచేతన యిష్టాలు గాక మరేం కాదు. మన కోరికతో ఏకాగ్రతతో ఎంతో ఉన్నతమైన ఆదర్శవంతమైన శిశువును గర్భంలో ధరించగలిగితే, ఎంతో విలువైనది. మరియు పవిత్రమైన విషయం అవుతుంది. నిజానికి ఈ ప్రయత్నంతో మనం ఆత్మ యొక్క దివ్యమైన ప్రక్రియ లో ప్రవేశిస్తున్నట్లవుతుంది. స్త్రీత్వము జంతు ప్రవృత్తికి అతీతంగా నిజమైన మానవత్వశక్తి వైపు ఎదుగుతుంది.

ఈ ప్రయత్నంలో ప్రక్రియలో నిజమైన బాధ్యత నిండి ఉంది. ఇది ఎల్లప్పుడు అత్యంత ప్రధానమైన బాధ్యత. ప్రస్తుత భూమి పరిణామ క్రమంలో ఇది నిశ్చయంగా ప్రధాన స్థాయిని చేరుకుంది.

CWM 2; 157-158

అనువాదం: డా. టి. యస్. రాజకుమారి (ఫోన్: 9849412227)

గర్భం దాల్చిన తల్లికి భౌతిక, మానసిక, భావోద్వేగ ఆధ్యాత్మిక పరమైన వాతావరణ ప్రాధాన్యత

ఎన్నో ప్రాచీన దేశాలలో — కొన్ని దేశాలలో యిప్పటికీ — శిశువుకు జన్మ నివ్వనున్న స్త్రీని ప్రత్యేకించి సుందరము, సామరస్య పూరితము, ప్రశాంతము సురక్షితము అయిన పరిస్థితులలో ఉంచేవారు. ఆ విధంగా సాధ్యమయినంత ఉత్తమ స్థితులలో శిశువు రూపు దిద్దుకుంటుంది. ఇది తప్పక చేయవలసిందే. ఎందుకంటే యిది మానవశక్యతల కందుబాటులో వున్న విషయం ప్రత్యేకించి ఏదో ఎంతో గాకున్నా మానవులు తగినంతగా అభివృద్ధి చెందినప్పటికీ యిదెంతో ప్రత్యేకమైనదే.

ఎందుకంటే దీని గురించి యోచన చేసేది బహుకొద్దిమంది. పిల్లలు కావాలనుకోకుండా కలిగిన వారు లేక్క లేనంత మంది ఉన్నారు. నేను చెప్పాలనుకున్నదది.

ఓ అంతరాత్మను పిలవడం సాధ్యమే, కాని తన గురించి కొంతయినా చైతన్య వంతమయి ఉండాలి. తాను చేస్తున్నది ఉత్తమమయిన పరిస్థితులతో చేయాలను కోవాలి. ఇదెంతో అరుదయినప్పటికీ సాధ్యమే.

*

తల్లి గర్భిణిగా ఉన్న సమయమంతా అల్ప స్థాయి ప్రభావాలన్నింటినుండి పరిపూర్ణ రక్షణగల వాతావరణం ఉండాలి. ఆదర్శ ప్రాయమయిన, అద్భుతమయిన వాతా వరణంలో జీవితంలోని ఎటువంటి నీచత్వాలనుండయినా రక్షణ గలిగి, పూర్తిగా సహజమైన స్వేచ్ఛాపూరితమయిన సామరస్య పూరితమయిన సౌందర్యపూరిత మయిన, జీవితమై ఉండాలి. నూతన శిశువు గావాలన్న ఆశయం తల్లికే ఉండాలి. యాంత్రికంగా చేయవలసింది గాదిది. పూర్తి సృజనశీల వాతావరణంలో ఎరుకతో సంకల్పించిన విషయమయి ఉండాలని చెప్పదలచుకొన్నాను.

బిడ్డ జనించకముందు విద్యావంతురాలిని చేయవలసింది తల్లిని

మనకున్న అనుభవం వలన మీరూహించే రూపాన్నివ్వగలరని, మొత్తం మీద మీరూహించే గుణాన్నివ్వగలరని తెలుస్తుంది, అదంతా సమంజసమే. కాబట్టి బిడ్డను గాక తల్లిని విద్యావంతురాలిగా చేయడం ఆరంభించాలి. అప్పుడు మీ స్వీయ ప్రతిస్పందనలను ఎంతో నియంత్రించు కోవడంద్వారా బిడ్డ ఏర్పడడంలో కొన్ని తప్పుడు ప్రేరణలు కలువకుండా నిరోధించగలరు. అదంతా క్రొత్తేమీ కాదు. చాలా కాలంగా తెలిసినదే. గనుక నేను గర్భం దాల్చినప్పుడు అలా సాధన చేశాను. కాబట్టి నాకది తెలుసు.

కాని మరొకమారు చెప్పే అసలు విషయమేమిటంటే బిడ్డను పొందకముందే తల్లిని విద్యావంతురాలిని చేయాలి.

(ఒక శిష్యురాలితో అమ్మ సంభాషణ , ఏప్రియల్ 19, 1967)

ప్రసవించడం — బలము, దృఢమైన దేహం, సహజమైన పరిస్థితులను నొక్కి చెప్పడం

బలమైన వ్యాయామాలు చేయడంసుశిక్షితులయి దృఢమయిన కండరాలు కల్గిన స్త్రీలు శిశువు రూపుదాల్చడం, శిశుజననమనే అగ్నిపరీక్షలో నుండి బహు సులభంగా, బాధ లేకుండా బయట పడతారు.

బరువు లెన్నో మోస్తూ, మైళ్ళకు మైళ్ళు నడవటానికి అలవాటు పడిన ఆఫ్రికా స్త్రీలలో ఒకరి ప్రామాణికమయిన కథ గురించి విన్నాను. ఆమె గర్భవతి, ఓ రోజు అలా నడిచివెళ్ళుతున్నప్పుడు పురుడు రావడం సంభవించింది. ఆమె రోడ్డు ప్రక్కగా చెట్టుక్రింద కూర్చుంది, బిడ్డకు జన్మ నిచ్చింది. ఓ అరగంట పాటు అలా వున్న ది, అంతే తర్వాత లేచి అంతకు ముందున్న సామానుకు నూతన శిశువును జోడించి ఏమీ జరగనట్లుగా మౌనంగా తన దారిన వెళ్ళిపోయింది. పూర్తి ఆరోగ్యం, బలం తన స్వాధీనంలో ఉన్నప్పుడు స్త్రీ ఏదయినా చేయగలదనడానికి యిదొక అద్భుతమయిన ఉదాహరణ.

వైద్యులంటారు, మానవాళి సాధించిన పురోగతి అంటున్న నాగరిక ప్రపంచంలో అటువంటిది సంభవం కాదని కాని అలా జరుగదని గాని అనలేము. భౌతిక దృక్కోణంలో నవీన నాగరికతలతో సృజింపబడిన సున్నితత్వాలు, ఈ బాధలు యిబ్బందులు పడడం కంటే యిదెంతో ఆనందకరమైన స్థితి.

పైగా అసాధారణ సందర్భాలపట్ల వున్న అమిత ఆసక్తితో వైద్యులు ఆ కోణం నుండీ ఎక్కువగా నిర్ణయాలు చేస్తారు. కాని మనకిది పూర్తిగా భిన్నం. సాధారణత నుండి అత్యున్నత అసాధారణతకు ఎదగగలము. అంతేకాని అపక్రమమైన మార్పుకు హీనతకు చిహ్నంగా ఎప్పుడూ ఉంటుండే క్రమరాహిత్యత నుండి కాదు.

CWM 12: 295-296

ప్రసవ సమయంలో వాతావరణం

ప్రశాంతంగా ఉండడం అత్యంత ప్రధానమైనది. శాంతియుత వాతావరణంలో ఉన్నప్పుడు ఎటువంటి ఆటంకం లేకుండా 'అమ్మ' దివ్యక్రియాశక్తి పనిచేయగలదు.

CWM 13: 236 *అనువాదం: అరుణామోహన్ (ఫోన్ 9866117137)*

నిజమైన మాతృత్వం, తల్లి తండ్రుల ప్రేమ

మానవులలో జంతువులలో మాతృప్రేమ

ప్రశ్న: పూలలో అది సౌందర్య సౌరభాల ప్రేమ వెల్లువ, పశువులలో ఆకలి దప్పులలో, స్వంతం చేసుకోవడంలో, విస్తరించటంలో, సంతానోత్పత్తిలో, క్లుప్తంగా, చైతన్యవంతమైన లేక చేతనమైన కోరికలన్నింటి వెనుక ప్రేమలేదా? అలానే కొంత ఉన్నతమైన జీవులలో తన సంతానం కోసం ఆత్మ త్యాగం చేసే తల్లిలో కూడా వున్నది కాదా?

సమా: అదే మానవులలో మాతృప్రేమ అవుతుంది. ఒకే ఒక వ్యత్యాసమేమిటంటే మనుషులలో అది తన ఎరుకను కలిగి ఉంటుంది. జంతువులలో తరచుగా అది మానవులలో కన్నా నిర్మలమైనదై ఉంటుంది. వాటి పిల్లల పట్ల జంతువుల కుండే అంకిత భావం శ్రద్ధ స్వార్థ రాహిత్యానికి సంబంధించిన సంఘటనలు నిజంగా, అప్రయత్నంగా ఏమీ తలపోయకుండానే జరుగుతుంది. పశువులు జంతువులు తామేం చేస్తున్నామనేది ఆలోచించవు. మనిషి ఆలోచిస్తాడు. కొన్ని సార్లు యిది ఆ సందర్భాన్ని పాడుచేస్తుంది. కొన్నిసార్లు చాలా తరచుగా మరికొన్ని సార్లు ఉన్నతమైన విలువను ఆపాదిస్తుంది. కానీ అరుదుగా జరుగుతుంది. జంతువుల ప్రవర్తనలో కన్నా ఈ సహజత్వం మనుషులలో తక్కువగా ఉంటుంది.

నాదగ్గర ఒక పిల్లి ఉండేది. అది పిల్లలను పెట్టినపుడు అక్కడనుండి అసలు కదిలేది కాదు. ఆహారం తీసుకునేది కాదు, ఏ విధమైన ప్రకృతి అవసరాలకు వెళ్ళేదికాదు. పిల్లి కూనలకు అంటిపెట్టుకొని వాటిని సంరక్షిస్తూ, పాలిస్తూ అక్కడే ఉండేది. వాటికేమైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని భయపడుతూ ఉండేది. అది ఆలోచన నుండి వచ్చినది కాదు. చాలా అప్రయత్నంగా అలా జరిగేది. అది అక్కడనుండి కదలడానికి నిరాకరించేది. కేవలం అంతస్ఫూర్తితోనే ఏదో కీడు జరుగుతుందని భావించి వాటిని వదిలి వెళ్ళేది కాదు. ఆ పిల్లలు పెరిగి పెద్దవయినపుడు వాటికి అన్నీ నేర్పించటానికి ఆ పిల్లి పడిన కష్టం అద్భుతం. ఎంత సహనం! ఒక గోడమీదనుండి యింకొక గోడమీదకు ఎలా దూకాలో, ఆహారం ఎలా వెదకి పట్టుకోవాలో ఎంత శ్రద్ధ, ఎంత జాగ్రత్త, మళ్ళీ మళ్ళీ ఒకసారి పదిసార్లు తిరిగి తిరిగి అవసరమైతే వందసార్లు చెప్పేది. పిల్లలు తాను అనుకున్నది నేర్చుకొనేంతవరకు ఏ మాత్రం అలసిపోకుండా చెబుతూనే

ఉండేది. చాలా అసాధారణమైన శిక్షణ. గోడ అంచుమీదుగా ఇంటి కప్పుపైకి ఎక్కటం, పడకుండా నడవటం, రెండు గోడల మధ్య ఎక్కువ దూరం ఉన్నప్పుడు దాటడానికి ఏం చెయ్యాలో నేర్పేది. ఆ పిల్లి కూనలు పెద్ద సందు ఉన్నప్పుడు దాటడానికి భయపడి దూకటానికి నిరాకరించేవి. (వాటికది ఎక్కువ దూరం కాకపోయినా సందు దాటడానికి ధైర్యం చేసేవి కావు) అపుడు తల్లి దూకి అవతలివైపుకు వెళ్ళి వాటిని పిలిచేది. రండి, రండి అని, అవి కదిలేవికాదు. వణుకుతూ ఉండేవి. అది మళ్లీ వెనక్కి దూకివచ్చి వాటికొక ఉపన్యాసం యిచ్చేది. తన పంజాతో చిన్నగా వాటిని అదిలించి వాటిని నాకేది. అయినా అవి కదిలేవి కాదు. అది మళ్ళీ దూకేది. ఇలా అరగంటపైన జరిగేది. ఆ తర్వాత అవి బాగానే అర్థం చేసుకున్నాయని అని పించిన పిదప ఏ పిల్లికూన అయితే సిద్ధమైందో సామర్థ్యం ఉందని నమ్మకం కలిగిందో దాని వెనుక నిలబడి తన తలతో గట్టిగా తోసింది. అపుడా పిల్లి కూన అనుకోకుండా దూకేసింది. ఒకసారి దూకాక మళ్ళీ మళ్ళీ దూకటం మొదలుపెట్టింది.

ఇంతటి సహనం ఉండే తల్లులు కొందరే ఉంటారు.

CWM 5: 242 - 43

శ్రద్ధ , స్వార్థ రాహిత్యత, ఆత్మ విస్మృతి, సహనం

ప్రశ్న: మధురమయీ! తల్లి తండ్రులకు పిల్లల పట్ల ఎటువంటి ప్రేమ ఉంటుంది?

సమా: ఎటువంటిదా? మానవుల ప్రేమా?

మనుష్యుల ప్రేమ లన్నింటి లాగానే భయంకరంగా అన్ని రకాల భావాలతో మిశ్రితమై ఉంటుంది. తమకే చెందాలనే స్వార్థ పూరిత అవసరం, భయానకమైన అహంకారం. నేను నీకు ముందుగా ఒకటి చెప్పాలి ఏమిటంటే, ఒక అద్భుతమైన చిత్రం గీయబడింది. చాలా పుస్తకాలలో పిల్లలపట్ల తల్లి ప్రేమను గురించి అత్యంత రమణీయమైన విష యాలు రాయటం జరిగింది. నేను మీకు భరోసా యిస్తున్నాను. అందమైన భాషలో ఈ విషయాన్ని సమర్థవంతంగా చెప్పటం మినహాయించి... ఉన్నతమైన జంతువుల ప్రేమ ఉదాహరణకు క్షీరదాల ప్రేమ కూడా సరిగ్గా యింతే ఉన్నతమైన స్వభావాన్ని కలిగి ఉంటుంది. అదే అంకిత భావం. అదే స్వార్థ రాహిత్యం. అదే ఆత్మ విస్మృతి. విద్య పట్ల అదే జాగరూకత శ్రద్ధ, అదే సహనం. సరిగ్గా అలానే నేను ఎంతో అద్భుతమైన విషయాలు చూశాను. అది ఒక పిల్లికి కాక ఒక స్త్రీకి ఆపాదించినట్లయితే అద్భుతమైన

నవలలు తయారయి ఉండేది. జనులంతా 'ఓ ఎంత గొప్ప వ్య.క్తి' ఈ స్త్రీలు మాతృప్రేమలో ఎంత అద్భుతమైన అంకిత భావాన్ని కలిగి ఉన్నారు, అని ఉండే వారు. సరిగ్గా సరిగ్గా ఒకే విధమైన ప్రేమ. పిల్లులు అలంకారిక భాషను ఉపయోగించ లేవు. అంతే. అవి పుస్తకాలు రాయలేవు. ప్రసంగాలు చెయ్యలేవు. అదొక్కటే కానీ నేను అత్యంత ఆశ్చర్యకరమైన విషయాలు చూసాను. అటువంటి ఆత్మ నివేదన ఆత్మ త్యాగం - ప్రేమ ప్రారంభమయిన వెంటనే అది వచ్చేస్తుంది. నేను అధ్యయనం చేసిన దానిని బట్టి నేను విశ్వసించే దేమిటంటే జంతువులు మానవుల కన్నా నిర్మల మయినవి. ఎందుకంటే అవి ఆలోచించవు. మనుషులు తమ మానసిక శక్తితో, ఆలోచించే సామర్థ్యం వలన వివేచన, విశ్లేషణ, విద్య వీటన్నింటితో చాలా అందమైన అనుభవాన్ని పాడు చేస్తారు. ఊహించటం కారణాలు వెతకటం అనుమానించటం వ్యవస్థీకరించటం మొదలుపెడతారు.

CWM 6: 106

బిడ్డతో తల్లికి ఉండే అనుబంధపు భౌతికాధారం:

మీ చైతన్యం నుండి చాలా భ్రమలను తొలగించటానికి నేను ఒక తల్లికి బిడ్డపట్ల ఉండే ప్రేమయొక్క మూలాల గురించి చెప్పాలి. ఎందుకంటే బిడ్డ ఆమె శరీరంలో ఒక భాగం. చాలా కాలం పాటు — సాపేక్షంగా చాలాకాలం పాటు — మాతృత్వ అనుబంధం పదార్థ అనుబంధమే. తల్లీ బిడ్డల మధ్య ఈ అనుబంధం చాలా సన్నిహిత మయినది. ఆమె శరీరంలో ఒక భాగాన్ని వేరుచేసి, దూరంగా ఉంచినట్లుగా, వుం టుంది. చాలా కాలం తర్వాత మాత్రమే ఈ అనుబంధం పూర్తిగా వేరవుతుంది. ఒక విధమైన బంధం ఒక సూక్ష్మ మైన భావన, బిడ్డ అనుభూతి చెందినట్లుగానే తల్లి కూడా అనుభూతి చెందుతుంది. తనకే సంభవించినట్లుగా భావిస్తుంది. అదే తల్లికి బిడ్డకూ ఉండే అనుబంధం యొక్క భౌతికమైన మూలం. అది ఒక భౌతికమయిన అభిన్నత అంతే అంతకన్నా మరేమీ కాదు. అనుభూతి తదుపరి కాలంలో కలుగు తుంది. (తొందరగా కూడా కలుగవచ్చు వ్యక్తులను బట్టి ఉంటుంది.) కానీ నేను ఎక్కువ శాతం మంది మనుషులను గురించి మాట్లాడుతున్నాను. అనుభూతి అనేది చాలా కాలం తర్వాత కలుగుతుంది. అది నిబంధనలకు లోనయినది. అక్కడ అన్ని విధాలయిన విషయాలు ఉంటాయి. నేనీ వేషయంపై గంటల తరబడి

ప్రసంగించగలను. అయినప్పటికీ అది ప్రేమతో సమ్మిశ్రితం కాదు. అదొక భౌతిక మయిన సారూప్యత. తల్లిని సన్నిహితంగా అనుభూతి చెందేలా చేస్తుంది. బిడ్డయొక్క భావనలు ఎంతో స్థూలంగా స్పందించినట్లుగా తల్లి అనుభూతి చెందుతుంది. బిడ్డకు ఏదయినా ఘాతం తగిలితే అది తనకు తగిలినట్లుగా అనిపిస్తుంది. ఇలా కనీసం రెండు నెలలు వరకూ ఉండవచ్చు.

ఇదే ఆధారం. మిగిలినదంతా జనుల స్వభావం నుండి వాళ్ళ ప్రగతి స్థాయినుండి వారి చేతన నుండి, వారి విద్య, అనుభూతి చెందగల సామర్థ్యం నుండి వస్తుంది.

CWM 106 - 107

పిల్లలను పనివాళ్లతో వదిలి వెయ్యడం; అవాంఛనీయ సహచర్యం

శ్రీమాతా! కొన్నిసార్లు తల్లి బిడ్డను బాగానే విద్యావంతుణ్ణి చేయవచ్చు. కానీ చుట్టూ ఉండేవాళ్ళు దానిని పాడుచేస్తూ ఉంటారు. అలాంటపుడు తల్లి ఏమి చేయగలదు?

అవును. అది చాలా నిజం. అన్నిటికన్నా అధ్వాన్నమయిన విషయమేమిటంటే (సాధారణంగా పురుషులు యిలా చేస్తుంటారు) పిల్లలను పనివాళ్ళ చేతుల్లో వదలడం. ఇది నేరం. ఎందుకంటే వీళ్ల చేతన అసహ్యంగా, నిమ్నంగా, మూఢంగా ఉంటుంది. వాళ్ళకి తెలియకుండానే పిల్లలలోకి ఈ నిమ్నచేతన ప్రవేశిస్తుంది. సాధారణంగా స్కూలుకు పంపే వయస్సులో రకరకాల పిల్లలతో కలవటం జరుగుతుంది. అంతగా అభిలషణీయంకాని ఈ విధమైన సంబంధాలు అనివార్యమే. కానీ ఎవరైనా జీవితాన్ని ఎంతో కొంత చైతన్య స్పృహతో, సుహృద్భావంతో మొదలుపెట్టి ఉంటే, యిలాంటి అవాంఛనీయమైన వారిని కలిసినపుడు వారు దానిని అనుభూతి చెందుతారు. అటువంటి వారిని మళ్ళీ చూడకుండా ఉండటాన్కి ప్రయత్నిస్తారు.

CWM 5: 412-4 13

అనువాదం : డా. ఆర్. సరోజాప్రసాదు (ఫోన్: 9704198298)



పుట్టుక: చైత్యపురుషుడు

చైత్యపురుషుడు యెన్నుకొనే భౌతిక పరిస్థితులు, పరిసరాలు

మహాత్ములు భువిపై జన్మించాలనుకొన్నప్పుడు, వాళ్ళు తమ తల్లిదండ్రుల్ని యెన్నుకొంటారా?

ఆహ్! అది వాళ్ళ చేతన మీద ఆధారపడి వుంటుంది. అది వారి అంతరాత్మిక రూపకల్పన స్థితిమీద ఆధారపడివుంటుంది. చైత్యపురుషుడు సంపూర్ణంగా రూపం ధరిస్తే, అది తన అస్తిత్వ పరిపూర్ణతకు చేరుకొంటే, పునఃజన్మించాలా లేదా అనేది నిర్ణయించుకొనే స్వేచ్ఛ కలిగివుంటే, అప్పుడు దానికి యెన్నుకొనే సామర్థ్యం వుంటుంది. కాని యీ విషయం నీ కిదివరకే చెప్పాననుకుంటాను. వారు దేహంలోనికి రానంతవరకు మనకున్నట్లు భౌతిక దృష్టి వుండదు. అందుకని వాళ్ళకు అనుకూలంగా తయారై వాళ్ళను వ్యక్తం చేయడానికి తగిన దేహంకోసం వాళ్ళు చూస్తారనేది స్పష్టం. కాని వాళ్ళు పదార్థ నిశ్చేతనలో దాని వాటాను దానికివ్వాలి, దేహానికి చెందిన పదార్థ ధర్మాలకు చాలా వరకు తమను తాము అనుకూలంగా చేసుకోవలసిన ఆవశ్యకత కూడా అలా చేస్తుందని చెప్పవచ్చు. అందుచేత అంతరాత్మ ఆవశ్యకత కూడా అలా చేస్తుందని చెప్పవచ్చు. అందుచేత అంతరాత్మ దృక్పథం నుండి చూస్తే, అతడెక్కడ జన్మించాలనే ప్రదేశాన్ని యెంచుకోవడం ముఖ్యమే. అది తక్కువ విశిష్టత గల అంశమేమీకాదు. కాని ముందుగా చూడలేని విషయాలనేకం వున్నాయి. ఉదా: ఒక పరిసర ప్రాంతాన్ని ఒక దేశాన్ని, ఒకానొక రకమైన కుటుంబాన్ని యెన్నుకోవచ్చు. కాబోయే తల్లితండ్రులు స్వభావాన్ని చూడ ప్రయత్నించవచ్చు. వాళ్ళలో అది వరకే బాగా అభివృద్ధి చెందినలక్షణాలనుచాలినంత స్వాధికారతను వారిలో ఆశించవచ్చు. అవరోధాలను అధిగమించడానికి చాలినంత క్రియాశీలత అతనిలో లేకపోతే యిదంతా చాలనే చాలదు. కాబట్టి, అన్ని విషయాలను ఆలోచించాక, యిదేమంత బ్రహ్మాండమైన ప్రాముఖ్యతగల విషయం గాదనిపిస్తుంది. ఏదేమైనా అంతా మహా బాగే అనుకున్నా , తల్లితండ్రులు సచేతనంగా సహకరించుకున్నా అపరిమేయ ఉపచైతన్యం వున్నది ఇంకా నిమ్ననిశ్చేతన వుంది. అది అప్పుడప్పుడు ఉపరితలానికి లేస్తుంది. అక్కడ అలజడి రేపుతుంది.పనిని నాశనం చేస్తుంది. స్థిరతను, నిశ్చలనీరవతను అనివార్యం చేస్తుంది. సదా, యెల్లప్పుడూ సన్నద్ధత అవసరం

యేర్పడుతుంది. అతడు యెంచుకొన్నప్పుడు కూడా సుదీర్ఘ సన్నద్ధత అవసరం యేర్పడుతుంది. జన్మించే సమయంలో సంభవించే దేహంలోనికి దిగివచ్చేటపుడు సంభవించే అర్ధ-నిర్ఘాంతస్థితి నుండి పూర్తిగా బయటపడటానికి, తరచుగా చాలా కాలం పడ్తుంది.

CWM 5: 410- 411

భౌతిక ప్రపంచంలోనికి దిగిరావడాన్ని అంతరాత్మికం యెన్నుకోగలదు, కాని తనను యధార్థంగా స్వీకరించగలవారి కోసం అన్వేషిస్తుంది.

అంతరాత్మికం ప్రపంచంలోనికి ప్రవేశించేముందుగా, అది తీసుకోబోయే రూపాన్ని యెన్నుకొంటుందా?

అదొక ఆసక్తికరమైన ప్రశ్న. అది వేరే దానిమీద ఆధారపడి వుంటుంది. నేనిప్పుడే చెప్పినట్లు తయారీలోవున్న చైత్యపురుషులున్నాయి. పురోగమిస్తూ వున్నవీ ఉన్నాయి. సామాన్యంగా యివి, మొత్తం మీద సరిగ్గా చెప్పాలంటే యెక్కువగా యెన్నుకోలేవు. కాని అవి యెదగడంలో, చేతనలో ఒకానొక స్థాయికి చేరుకొన్నప్పుడు సాధారణంగా అవి, భౌతికదేహంలో యింకా ఉన్నప్పుడే కొంత అనుభవం వాటి కుండివుంటుంది. ఆ సమయంలో, వాటి తదుపరి అనుభవ క్షేత్రం యెలా వుండాలనే దాన్ని నిర్ణయించుకుంటాయి.

విశేషించి, నేను మీకు కొన్ని బాహ్య ఉదాహరణల నివ్వగలను. ఉదా: ఒక చైత్యపురుషునికి ఆధిపత్యం అవసరం, అధికారం ప్రతి చర్యలను తెలుసుకోవడానికి, యీ కదలికలన్నింటినీ దైవం వైపు మరల్చడం యెలా సాధ్యమో తెలుసుకొనటానికి అధికారం గల జీవితం నీకేం బోధిస్తుందో నేర్చుకోవడానికి అవసరం కలిగిందనుకుందాము. అది ఒక రాజుకో, రాణికో పుడుతుంది. వీళ్ళు కొంత అధికారాన్ని భోగించారు. ఆ కాలంలో వారి అనుభవాలు వారికున్నాయి. వాళ్ళు అనుభవ క్షేత్రం చివరకు చేరుకొన్నారు. ఇప్పుడు వాళ్ళేం తెలుసుకోవాలనుకున్నారో అది వాళ్ళకు తెలిసింది. వాళ్ళు నిష్క్రమించబోతున్నారు, యిప్పుడు నిరుపయోగంగా తయారైన దేహాన్ని విడిచిపెట్టబోతున్నారు. తదుపరి అనుభవానికి సిద్ధం కాబోతున్నారు. సరే, చైతన్య పురుషుడింకా దేహంలోనే వున్నప్పుడు, అదేం నేర్చుకున్నదో గుర్తించింది. తరువాత సందర్భాన్నది నిర్ణయించుకొంది. కొన్ని వేళల్లో ఆ చలనం క్రియ,

ప్రతిక్రియగా వుంటుంది. ఎందుకంటే అది ఒక క్షేత్రాన్ని పూర్తిగా అధ్యయనం చేసింది. దానికి వ్యతిరిక్తమయిన క్షేత్రాన్ని అధ్యయనం చేయవలసివుంది. చాలా తరచుగా అదివరకు అది అనుభవించిన జీవితంకన్న చాలా భిన్నమైన జీవితాన్నది యెన్నుకొంటుంది. అందుకని నిష్క్రమించేముందు ఈ సారి యీ ప్రాంతంలో నేను జన్మించాలి... అనుకొంటుంది. ఉదా: దైవంతో సచేతన సంబంధంలోనికి ప్రవేశించి, రూపాంతరీకరించే సామర్థ్యం గలదానిగా భౌతిక దేహాన్ని తయారుచేయగలిగే అవకాశం లభించే స్థాయికి తన యెదుగుదలలో అంతరాత్మిక మైనది చేరిందని అనుకుందాం. ఆ స్థాయిలో వుండగా అది దేహాన్ని విడువబోతోంది. ఆ దేహంమీద దానికిదివరకు అధికారం ఆధిపత్యం వుంది. ఆ దేహంలో కార్యకలాపం నిర్వహించింది. తన యెదుగుదలకు ఆ దేహాన్ని ఉపయోగించుకొంది: "ఈ సారి నేనొక తటస్థపరిసరంలో, అధమమూగాని, ఉత్తమమూగాని ఎచట బాగా యెక్కువగా (యెలా చెప్పాలి) బాహ్యజీవితం, జీవించవలసిన అవసరం వుండదో, ఎచట గొప్ప శక్తిగాని, గొప్ప దైన్యంగాని వుండదో — పూర్తిగా, తటస్థమైన మధ్యస్తంగా ఉండే జీవితంవుండే చోట నేను పుట్టాలి." అనుకొంటుంది, దాన్నే ఎన్నుకొంటుంది. అది తన అంతరాత్మిక ప్రపంచానికి, ఆవశ్యకమైన విశ్రాంతి కోసం చేరుకొంటుంది. సంపాదించిన అనుభవాన్ని జీర్ణించుకొనటానికి, భవిష్యత్తులో పొందబోయే అనుభవానికి సన్నద్ధంగావడానికి చేరుకొంటుంది. సహజంగానే అది తన యెన్నికను గుర్తుంచు కొంటుంది, జీర్ణించుకోవడం పూర్తైనాక, తిరిగి వచ్చే సమయమాసన్నమైనపుడు, భువి మీదకు తిరిగిరావడానికి మనం చూస్తున్నట్లుగా పదార్థ వస్తువులను ఆ ప్రాంతం నుండి చూడలేదు. అనే విషయం తెలుసా, అవి దానికి మరో రూపంలో కన్పిస్తాయి. సకలాన్నీ, భౌగోళికంగా చూడగల దృష్టి దాని కుంటుంది. అది యెన్నుకొంటుంది. కొన్ని సమయాల్లో అది దేశాన్ని యెన్నుకొంటుంది. కొన్ని సమయాల్లో అలా చేయ లేదు. కొన్ని సమయాల్లో అది పరిసరాన్ని మాత్రమే అది సాగించబోయే జీవనవిధా నాన్ని మాత్రమే యెన్నుకొంటుంది. అప్పుడు ఆ పై నుండి క్రిందికి రాకముందు, తానుకోరుకొనేటటువంటి ప్రకంపనాలకై చూస్తుంది, వాటినది చాలా స్పష్టంగా చూస్తుంది. అదెచట పడబోతున్నదో దానిపై గురి పెట్టినట్లు చూస్తుంది. కాని అదొక ఉజ్జాయింపు మాత్రమే ఎందుకనంటే, దానికి మరో స్థితి కూడా అవసరం అవుతుంది. దాని యెంపిక మాత్రమే గాక, క్రిందినుండి ఒక స్వీకృతి, ఆకాంక్ష కూడా వుండాలి.

అది యెన్నుకొన్న పరిసరాల్లో యెవరో ఒకరు, సాధారణంగా తల్లి కొన్ని సమయాల్లో తల్లిదండ్రులు ఇద్దరూ, కాని అనివార్యంగా తల్లికి ఆకాంక్ష వుండాలి. ఆమెకు తప్పక ఆకాంక్ష గాని లేక స్వీకరించే శక్తిగాని వుండాలి. అదేదైనా గాని, (జోక్యం చేసుకోకుండా) తటస్థంగా ఉన్ముఖమై లేక ఉన్నతమైన దేని వైపుకో ఒక సచేతన ఆకాంక్ష కలిగి వుండాలి. అది చైత్యపురుషునికి ఒక చిన్న వెలుగును కలిగిస్తుంది. అది యెందులో జన్మించాలని అనుకొంటుందో, ఆ పరిసరానికి ప్రాతినిధ్యం వహించే రాశిలో, తనదే యైన తననుండి ముందుకు వెలువడుతూ వచ్చిన సంకల్ప ప్రభావం క్రింద ఒక చిన్న వెలుగు వెలిగించబడ్తుంది. అప్పుడు (ఆ వెలుగును చూచి) అక్కడకు తాను వెళ్ళాలని అది తెలుసుకొంటుంది.

అదిగో అందుకు బహుశా నెలలు లేక రోజులు, సంవత్సరాల దాకా బహుశా పట్టక పోవచ్చు, వ్యవధి పడ్తుంది. మళ్ళీ తిరిగి రావడానికి. ఏదేమైనప్పటికీ, ఒక అనిశ్చితనిదే సృష్టిస్తుంది, అందుచేత కచ్చితమైన తేదీని ముందుగా చెప్పలేం. ఫలానా తేదీన ఫలాన ఘడియలో నేను జన్మిస్తాను. అని ముందుగా చెప్పలేరు. స్వీకరించే యెవరో ఒకరు దానికి అవసరం. దాన్ని చూచినపుడు అది క్రిందికి పరుగున వస్తుంది. కాని ఇలా జరగటం అనేదంతా ఒక చిత్రీకరణ మాత్రమే. ఖచ్చితంగా జరిగేదిది కాదు. కాని దీనికి చాలా దగ్గరిగా పోలివుంటుంది. అది తనను తాను అచేతనలోనికి నెట్టుకొంటుంది. ఎందుచేతనంటే భౌతిక ప్రపంచం, మానవ చేతన యేదైనా గాని, అంతరాత్మిక చేతనతో పోలిస్తే, చాలా అచేతనం. అందుకని అది అచేతనలోనికి దూకుడుగా వస్తుంది. తలక్రిందులుగా ఒకసారి పడినట్లుంటుంది. అదిగో అది దానిని నిర్ఘాంతపోయేటట్లు చేస్తుంది. కనుక కొన్ని చాలాచాలా అరుదైన సందర్భాలు మినహాయిస్తే, చాలా కాలంవరకు దానికి తెలియదు. తానెక్కడవున్నదీ, తానేం చేస్తున్నదీ తానక్కడెందుకున్నదీ, యేదీ కూడా యెంతమాత్రం దానికి తెలియదు. ముఖ్యంగా సహజంగానే మెదడు లేనటువంటి పసిపాప ద్వారా తనను తాను వ్యక్తం చేసుకోవడానికి దానికి చాలా కష్టమనిపిస్తుంది. సరిగా రూపొందిందా లేదా అన్నట్లుండే ఒక మెదడు ఆరంభదశ అది, తనను తాను అభివ్యక్తం చేసుకొనడానికి తగిన మూలకాలు లేవు. తాను తనలోపల కలిగివున్న అపురూపమైన జీవిని వెంటనే అభివ్యక్తం చేసే బిడ్డ చాలా అరుదు. అదీ జరుగుతుంది. మనం అటువంటి సంగతులు విని వున్నాం. అది జరుగుతుంది, కాని కొంత సమయం అవసరం. అది తన

మత్తునుండి నెమ్మదిగా మాత్రమే మేలుకొని యేదో కారణం చేత, తన యెంపిక చేతనే తానక్కడున్నానని తెలుసుకొంటుంది. అంతరాత్మిక చేతననుండి నిన్ను పూర్తిగా సంబంధం లేకుండా చేసిన తీవ్రమైన మానసికవిద్యతో ఇది మామూలుగా యేక కాలంలో జరుగుతుంది. తాను యితర లోకంనుండి వచ్చానని, ఒక ప్రత్యేక కారణం కోసం వచ్చానని అతడు జ్ఞప్తికి తెచ్చుకోవడం మొదలుపెట్టేందుకు ఆంతరిక ద్వారాలను తెరువడానికి అనేక పరిస్థితులు సర్వవిధ సంఘటనలు, భావోద్వేగాలు, సమస్త విధాలైన విషయాలు అవసరం.

లేనియెడల, అంతా సవ్యంగా జరిగిపోతే దానికి చాలా త్వరగా సంబంధం యేర్పడుతుంది. చాలా త్వరగా, ఏ కొంతైనా జ్ఞానంకల యెవరైనా దొరికే అదృష్టం దాని కుంటే, అజ్ఞాన ప్రపంచంలో పడడానికి బదులు, అది కొంచెం జ్ఞానమున్నచోట పడినట్లౌతుంది. ప్రతీది చాలా వేగంగా జరిగిపోతుంది.

CWM 5: 213- 215 *అనువాదం: కె.వి.రావు (ఫోన్: 9849929254)*

జన్మ, జన్మతః అబ్బిన లక్షణాలు అవచేతనలో లోతుగా నాటు కున్నాయి; వ్యక్తియొక్క మాసికస్వభావంలో మార్పు తీసుకురావటం లోని రహస్యం.

పుట్టడంతోనే ప్రాణికము వికృతం చెందుతుందా?

పుట్టుక ఒక యాదృచ్ఛిక సంఘటన కాకపోయినట్లయితే వక్రీకరణ చోటుచేసుకోలేదని కచ్చితంగా భావించవచ్చు. కానీ పుట్టినప్పుడు నీవు ఎలాగున్నావో అన్నది చాలా వరక , దాదాపు అన్ని సందర్భాలలో బేషరతుగా నీ తల్లితండ్రులు నిన్ను దేనిగా తయారుచేసారో అన్న దానిపై ఆధారపడుతుంది. కుటుంబాలలో కొన్ని ప్రాణిక పరమైన సాంప్రదాయాలుంటాయి. అదీగాక నీవు రూపు దిద్దుకున్న నీవు గర్భంలో పడిన సమయంలోని చేతనాస్థితి ఒకటుంది. నీవు గర్భస్థమైన క్షణం. అది కోటిలో ఒకసారి కూడా ఆ చేతన స్థితి సత్యమైన ఆకాంక్షను ధృవీకరించేదిగా నుండదు. ఒక సత్యమైన ఆకాంక్ష మాత్రమే నీ ప్రాణికాన్ని మిశ్రణాల మాలిన్యం సోకకుండా కాపాడి స్వచ్ఛంగా నుంచగలదు. ప్రాణిక మూలాన్ని సర్వరోగ సంక్రమణల నుండి విడివడిన ఒక స్వచ్ఛమైన మూలంగల అస్తిత్వంగా రూపుదిద్దుకొను దిశగా ఆకర్షింప గలదు. నా ఉద్దేశ్యమేమిటంటే ఒక చైత్యపురుషసత్త అక్కడ ప్రవేశించినట్లయితే

అది దాని పెరుగుదలకు దోహదపడగల అంశాలను కూడతీసుకో గలదు. ప్రస్తుత ప్రపంచపరిస్థితుల్లో విషయాలన్నీ ఎంతగా ఎన్ని విధాలుగా కలిసిపోయి వున్నాయంటే, ఎన్ని విధాలుగా ఎంతగా మిశ్రమం గావించబడ్డాయంటే, ప్రాణికమూలాలను కలుషితం కాబడిన ఇతర అస్తిత్వాల అంటువ్యాధుల బారినపడకుండా స్వచ్ఛంగా నుంచటం దాదాపు అసాధ్యమవుతుంది.

తల్లి తండ్రుల సమాగమం జరిగే ముందు వారు ఏ విధమైన ఆకాంక్షను కలిగి వుండడమనే విషయాన్ని ఇదివరకే ప్రస్తావించానని అనుకుంటాను. కానీ నేను చెప్పినట్లుగా వేల సందర్భాలలో ఒక్కసారైనా జరుగదు. సంకల్పానుసారంగా గర్భధారణ జరగటం అనేది అత్యంత అరుదైన సంఘటన. చాలా వరకు ఇది యాదృచ్ఛికంగా చోటు చేసుకుంటుంది. చాలామంది తల్లి తండ్రులు అతి కొద్దిమంది మాత్రమే కనీసం బిడ్డ ఏ విధంగా నుండాలనే విషయం గురించి అలోచిస్తారు. బిడ్డ ఏ విధంగా నుండాలనేది తామే విధంగా నుండాలనే దానిపై ఆధారపడి వుంటుందనే అవగాహన వారికేమాత్రం వుండదు. ఉన్నత వర్గానికి చెందిన అతి కొద్దిమందికి మాత్రమే దానిని గురించిన అవగాహన వుంటుంది. చాలా కాలం విషయాలు యధేచ్ఛగా కొనసాగుతుంటాయి. ఏదైనా జరుగవచ్చు. కానీ ఏమి జరుగుతున్నదో కూడా వారు తెలుసుకోలేరు. కాబట్టి ఇట్టి పరిస్థితుల్లో ఏ విధంగా నీకు ఉపయుక్తమైన రీతిగా తగినంత స్వచ్ఛమైన ప్రాణిక అస్తిత్వంలో నుండ గలిగేటట్లుగా జన్మ నెత్త గలనని ఆశించగలవు? ప్రతి ఒక్కరు జీవించడం ప్రారంభించక పూర్వమే శుభ్రపరచడం ఆవశ్యకమైన మాలిన్యంతో పుడ్తారు. ఇక అంతర్గత పరివర్తనా మార్గంలో ఒక్కసారి పయనం ప్రారంభిస్తే, అస్తిత్వంయొక్క అవచేతన మూలానికి చేరగలిగితే, ఖచ్చితంగా ఏదైతే తల్లితండ్రులనుండియేగాక అనువంశికంగా సంక్రమించిందో దానిని అప్పుడు అదేమిటో నీవు చూడగలుగుతావు. అక్కడ అన్నీ దాదాపు అన్ని కష్టాలు వుంటాయి. అతికొద్ది మాత్రమే జీవితపు తొలిదశ తదుపరి ఎదురౌతాయి. ఇది ఏ విషమ క్షణాననైనా జరుగవచ్చు. నీవు చెడు సహవాసం చేసినా లేక చెడ్డ పుస్తకాలు చదివినా ఆ విషయం నీలోకి ఎక్కవచ్చు. కానీ వంశపారంపర్యంగా అబ్బిన ఈ వారసత్వ లక్షణాలు ఇప్పటికే అవచేతనలో లోతుగా నాటుకొని వున్నాయి. ఉదాహరణకు అబద్ధాలాడకుండా నోరు విప్పలేనివారు కొందరున్నారు.అయితే, వారు అది ఎల్లప్పుడూ కావాలని చేయరు. కొందరుంటారు, ఇతరులతో పోట్లాడకుండా వుండలేరు. రకరకాల తెలివి

మాలిన పనులు చేయకుండా వుండలేరు. ఆ లక్షణాలు అవచేతనలోలోతుగా నాటుకొని వున్నాయి. ఇప్పుడు నీకు శుభసంకల్పం వుంటే దాని నంతా వదిలించుకొనడానికి బాహ్యంలో చేయాల్సిందంతా చేస్తావు, సాధ్యమైతే అట్లు పరిస్థితిని చక్కపరచటానికి నీవు శ్రమిస్తావు. పోరాడుతావు. ఇక ఇప్పుడు తెలుస్తుంది, ఈ విషయం సదా తలెత్తుతూ వుంటుందని, అది నీ నియంత్రణను తప్పించుకోగల ఏదో భాగంనుండి వస్తుంటుందనీ. కానీ, నీవు ఈ అవచేతనలోకి చొరబడినట్లు చేసి జాగ్రత్తగా చూసినట్లయితే, నీ కష్టాలు అన్నింటి మూలాలను వాటి ఉత్పత్తి స్థానాలను కొంచెం కొంచెంగా కనుక్కోగలవు. అప్పుడు నీకు అర్థం కావడం ఆరంభమౌతుంది, నీ తల్లితండ్రులు, మాతా పితామహులు ఎలాంటివారై ఉన్నారో. ఏదో క్షణాన నిన్ను నీవు అదుపులో ఉంచుకోలేనప్పుడు, నీకు అర్థమౌతుంది. "వారు ఆ విధంగా ఉండి ఉన్నారు కాబట్టి నేను అలా ఉన్నాను." అని .

నీవు పెడదారి పట్టకుండా నీపై ఓ కన్నేసి ఉంచి నిన్ను సరైన మార్గంలో పెట్టగల చైత్య పురుషుని నీలో నిలుపుకొని ఉన్నట్లయితే నీకు ఉపయుక్తమగు విషయాలను అది నీ వైపు ఆకర్షించగలదు. నీకు సహాయపడే వ్యక్తులను, గ్రంథాలను నీకు అందుబాటులోకి తేగలదు. పరిస్థితులను సానుకూలపరచగలరు. కాకతాళీయంగా జరిగినట్లుగా చిన్నచిన్న సంఘటనలు, అభీష్టసిద్ధిని ప్రసాదించే దివ్యసంకల్పమేదో సమకూర్చిపెట్టినట్లుగా నిన్ను సరైన దిశగా మలచడానికి సూచనలను అందించి సహాయపడగలరు. అందుకు తగిన నిర్ణయాలను తీసుకోవడానికి ఆధారాన్నీయగలడు. కానీ, ఒక్కోసారి నీవీ నిర్ణయ తీసుకోవాలని నిర్ణయించుకుంటే, అందుకై అనుసరించతగిన మార్గంలో నడకను హృదయ పూర్వకంగా ప్రారంభిస్తే, అప్పుడు సర్వము నీ పురోగమనానికి ఏకోన్ముఖమైనట్లుగా తోస్తుంది. నీవు జాగ్రత్తగా గమనించినట్లయితే కొంచెం కొంచెంగా నీ కష్టాల మూలాలను కనుక్కోగలుగుతావు. క్షణం కాలం ఆగి ఆలోచిస్తే, ఫలానలోపము నీ తండ్రిలోన ఉండిందని, నీ తల్లికి అలవాటుగానుండిందని నీ అమ్మమ్మనో నానమ్మనో, తాతనో ఆ విధంగా ఉండేవారని తెలుసుకోగలుగుతావు. లేకపోతే చిన్నతనంలో నీ ఆలన పాలనకై నియమించబడిన ఆయానో లేక నీతో ఆడుకున్న నీ అన్న దమ్ములు, అక్కచెల్లెళ్లు లేక నీ చిన్ననాటి స్నేహితులు మొదలగు వారిలో ఈ లక్షణాలున్నట్లు స్ఫురిస్తుంది నాటి స్నేహితులు మొదలగు వారిలో ఈ లక్షణాలన్నింటిని ప్రశాంతంగా ఆలోచనలను అనుసరిస్తే వీటన్నింటినీ

ప్రశాంతంగా దాటగలవని తెలుసుకుంటావు. కొంతకాలం లోనికి నీ పుట్టుకతో ఏర్పడిన బంధాలను త్రెంచివేసి, నీ దారిని స్వేచ్ఛగా అనుసరిస్తావు.

నిజంగా నీ స్వభావంలో మార్పును కోరుకుంటే, నీవు చేయాల్సింది అది. స్వభావంలో మార్పును తేవడం అసాధ్యమని చిరకాల నమ్మకం. అన్ని వేదాంత గ్రంథాలలోను, యోగానికి చెందిన వాటితో సైతం అదే కథ వల్లించబడింది. నీ స్వభావాన్ని మార్చుకోలేవు. నీవు ఆ విధంగా పుట్టావు. ఆ విధంగానే ఉన్నావు అంటాయి. ఇది పూర్తిగా అసత్యం. ఇది పూర్తిగా అబద్ధమని నేను హామీ ఇస్తాను. కానీ నీ స్వభావాన్ని మార్చటానికి అతి కష్టమైన దొకటి చేయాల్సి వుంటుంది. కారణం మార్పు చెందాల్సింది స్వభావంకాదు. నీ పుట్టు పూర్వోత్తరాలకు చెందిన లక్షణాన్ని వాటిలోని లక్షణాన్ని నీవు మార్చలేవు. ఎందుకనగా వాటికా ఉద్దేశ్యం లేదు కాబట్టి . కానీ నీలో అది మార్పు చెందాలి. నీకు అవి ఇచ్చినది అది. నీవు పుట్టినప్పుడు ఈయబడిన చిన్నచిన్న బహుమతులు. చక్కని బహుమతులు అవి. మార్పు చెందవలసింది ఇది. వీటి సమాహారానికి ఆధారంగా అగు దారాన్ని నిజమైన దారాన్ని పట్టుకోవడంలో నీవు సఫలీకృతుడవైనట్లయితే, నీవు అందుకై పట్టుదలతో, శ్రద్ధాశక్తులతో శ్రమించినావు కాబట్టి, సఫలీకృతుడవైతే ఒక దివ్యమైన ఉషోదయాన నీవు స్వేచ్ఛను పొందుతావు. ఇదంతా నీ నుండి వీడిపోతుంది. నీవు భారరహితజీవితాన్ని జీవించ ప్రారంభించ గలవు. అప్పుడు నీ వొక కొత్త మనిషి వవుతావు. స్వభావంతో కొత్త జీవితం గడుపుతావు. ఇక నీవు వెనుదిరిగి చూసుకున్న ట్లయితే, నీవంటావు. "ఇది అసాధ్యం. నేను ఎప్పుడూ అలాగుండలేదు." అని

CWM 4:260-62

అనువాదం: అందుగులపాటి కైలాసపతి (ఫోన్: 9573605734)

చైత్యపురుషుడు:? పరిణామ ఒక ఫలితం

పరిణామ ఒక ఫలితం చైత్యపురుషుడు, అనగా మహా పదార్థంలో పరచుకొని ఉన్న దివ్యచైతన్యపు పరిణామం, నెమ్మదిగా మహాపదార్థాన్ని ఉద్ధరించింది, దానిని దైవంవైపు మరల్చి, అభివృద్ధి నొందేటట్లుగా తయారుచేసింది. క్రమానుగతంగా ఈ దివ్యకేంద్రంలో జన్మ పరంపరలద్వారా చైత్య పురుషుడు రూపు దిద్దుకోబడింది.

CWM 5: 263- 264

పునర్జన్మలో, శరీరంనుంచి శరీరానికి పయనమైపోతూ ఉండేది అంతరాత్మికమైనదే

పునర్జన్మలో, జన్మించేది తల్లితండ్రులచే పరిసరాలనుండి, పరిస్థితుల మూలంగానూ రూపు దిద్దుకున్నటువంటి బాహ్యజీవి — మానసికం, ప్రాణికం, భౌతికం, — కాదు: కేవలం చైత్యపురుషుడు మాత్రమే శరీరంనుంచి శరీరానికి పయనిస్తుంది. తార్కికంగా, అప్పుడు క్రితం జన్మలను, మానసికం లేదా ప్రాణిక అస్తిత్వం జ్ఞప్తి యందుంచుకోలేవు. గుణంలోగాని లేదా జీవనశైలిలోగాని ఈ వ్యక్తి లేదా ఆ వ్యక్తి తనను తాను గుర్తించలేదు. కేవలం చైత్యపురుషుడు మాత్రమే జ్ఞాపకం ఉంచుకో గలుగుతుంది.. మన చైత్యపురుషుని ఎరుకను మనం పొందటంవలన మనము గత జన్మల కచ్చితమైన గురుతులను కలిగి ఉండగలము.

అంతేకాకుండా గతంలో మన మేమైవున్నామో అనే దానిపై కన్నా మనమే మవబోవాలనుకుంటున్నామో దాని మీదనే గట్టిగా మన శ్రద్ధను ఉంచడం మనకు ఎంతోఎక్కువ ముఖ్యం.

CWM15:124

చైత్యపురుషుడు: దాని ప్రభావంలో అన్ని భాగాలను ఉంచడమనే దాని ప్రాముఖ్యత

ప్రశ్న: మనస్సు, ప్రాణికం లేక భౌతికం కాకుండా కేవలం చైత్యపురుషుడే మళ్ళీ జన్మ నెత్తుతున్నట్లైతే, అప్పుడు అంతక్రితం జన్మలో చేసిన ప్రాణిక లేదా మానసిక అభివృద్ధికి మరొక జన్మలో యే విలువా లేనట్లేనా?

సమా: అది ఎంతమటుకు జరుతుందంటే కేవలం యీ భాగాల పురోభివృద్ధిని అంతరాత్మికానికి సమీపంగా తీసుకువచ్చినంతవరకు జరుగుతుంది, అస్తిత్వంలోని భాగాలన్నింటినీ వరసగా ఎంతమటుకు అంతరాత్మిక ప్రభావం క్రిందకు చేరుస్తామో పురోభివృద్దిని బట్టి అంతవరకు మాత్రం ఆ (విలువ) ఉంటుంది. అంతరాత్మిక ప్రభావం కింద ఉన్నదంతా, అంతరాత్మికంలో తాదాత్మ్యం చెందినదంతా కొనసాగుతుంది. కేవలం అది మాత్రమే కొనసాగుతుంది. కాని అంతరాత్మికాన్నే ఒకరు తమ జీవితానికి, చైతన్యానికి కేంద్రంగా చేసుకుంటే, అస్తిత్వమంతా దాని

చుట్టూ వ్యవస్థీకృతమైతే, అస్తిత్వమంతా అంతరాత్మిక ప్రభావం కిందకు పయనిస్తే, దానితో ఐక్యమైపోతే, అప్పుడది కొనసాగగలదు — అది కొనసాగటం ఆవశ్యక మైనట్లైతేనే. వాస్తవానికి భౌతిక శరీరానికి కూడా అదే గమనాన్ని ఇవ్వగలిగినట్లైతే — పురోభివృద్ధి యొక్క అవే గమనాలను చైత్యపురుషుని కున్న అదే ఆరోహణా సామర్థ్యాన్ని ఇవ్వగలిగినట్లైతే — అప్పుడు దానికి శిథిలమై పోవలసిన అగత్యం ఉండదు. కాని వాస్తవంగా అదే ఉన్న కష్టమంతా. కేవలం అంతరాత్మికమైన దానితో సంపర్కంలో ఉన్నది మాత్రమే. కొనసాగుతుంది. కేవలం ఏది కొనసాగుతుందో అదే గుఋతుకు రాగలుగుతుంది — మిగతాదంతా అదృశ్యమై పోతుంది. ఆ వచ్చింది కూడా తిరిగి చిన్నచిన్న ముక్కలుగా విలీనమైపోయి, మరోచోట వినియోగ మవుతుంది — శరీరం తిరిగి మట్టిలో కలిసిపోయి, మరోచోట వినియోగ మవుతున్నట్లుగా. అది తిరిగి భూమికి చేరిపోతుంది. మొక్కలు మట్టిని వినియోగిం చుకుంటాయి. మనుషులు మొక్కలను తింటారు. ఈ విధంగా అది జరుగుతూ ఉంటుంది. అప్పుడది తిరిగి భూమికి చేరి, మరలా ఆరంభిస్తుంది.

CWM 5:358- 359

పునర్జన్మలు — మరణఘడియలో, చైతన్యం ఉండేటటువంటి స్థితియొక్క ప్రాముఖ్యత

ప్రశ్న: ఒక అంతరాత్మకు తదుపరి జన్మలో తాను జన్మించే ప్రదేశం ఎంపికను చేసుకొనే అవకాశం ఉందా?

సమా: అదా, పూర్తిగా వారు మరణించిన పరిస్థితి మీద, వారి చివరి కోరిక, అంత రాత్మిక సంకల్పం మీద ఆధారపడి ఉంటుంది. అది యాంత్రికమూ లేదా రుద్దబడే విషయమూ కాదు. అది ప్రతి ఒక్కరికీ వేరుగా ఉంటుంది.

నేను నీకు ఇప్పటికే చాలా సార్లు చెప్పి ఉన్నాను. మరణానంతరం సంక్రమించే భవితవ్యానికి చైతన్యపు చివరి స్థితి సామాన్యంగా అత్యంత ముఖ్యమై ఉంటుంది. అనగా మరణఘడియలో, తన పనిని కొనసాగించటానికి తిరిగి రావాలనే తీవ్రమైన ఆకాంక్షఉంటే, అప్పుడు దానికి వలసిన పరిస్థితులు అమర్చబడతాయి. కాని, తెలుసుకో. మరణం తరువాత ఏమవుతుందనేదానికి అన్ని రకాలైన సంభావ్యతలూ ఉన్నాయి. కొంతమంది జనం చైతన్యంలో తిరిగి వస్తారు. సావధానంగా అవలోకించు,

బాహ్య అస్తిత్వం చాలా అరుదుగా పదిలపరచబడుతుందని నేను నీకు చెప్పానుకదా; కనుక మనం కేవలం వాస్తవంలో ఎల్లప్పుడూ స్థిరంగా ఉండే అంతరాత్మిక చైతన్యం గురించి మాత్రమే మాట్లాడతాం. తరువాత, కొంతమంది విషయంలో అంతరాత్మిక మైనది వారు పొందిన అనుభవాలను జీర్ణించుకోవడానికి, వారి భవిష్య జన్మను తయారుచేయడానికీ అంతరాత్మిక క్షేత్రానికీ మరలిపోతుంది, ఇది కొన్ని శతాబ్దాలు పట్టవచ్చు, అది ఆయా జనులమీద ఆధారపడి ఉంటుంది.

ఎంతగా ఎక్కువగా అంతరాత్మికమైనది పరిణమించితే, అంతగా అది దాని పూర్తి పరిపక్వతకు దగ్గరగా ఉంటుంది, జన్మలమధ్య అంత ఎక్కువ వ్యవధి ఉంటుంది. కొంతమంది జీవులున్నారు. వాళ్ళు ఒక వేయి సంవత్సరాల తర్వాత, రెండు వేల సంవత్సరాల తర్వాత మాత్రమే తిరిగి జన్మిస్తారు. రూపమేర్పడే ప్రారంభానికి ఎంత దగ్గరగా వుంటే, అంత దగ్గరగా పునర్జన్మలుంటాయి. ఒక్కొక్కప్పుడు చాలా మటుకు నిమ్న స్థాయిలో కూడా మనిషి జంతువుకు బొత్తిగా దగ్గరగా ఉన్నప్పుడు, అది ఈ విధంగా జరుగుతుంది. (సంజ్ఞ) అనగా, వారి పిల్లల పిల్లల్లో, తిరిగి జన్మిం చటమనేది అసాధారణమేమీ కాదు, ఆవిధంగా ఒక విధంగా ఆ విధంగా కాని లేదా సరిగ్గా తరువాత తరంలోనైనా జరుగుతుంది. కాని ఇది ఎల్లప్పుడూ చాలా పరిణామ ఆదిమస్థాయిలో జరిగే విషయం, అప్పుడు చైత్యపురుషుడు ఎక్కువగా ఎరుకకలిగి ఉండదు. అదింకా రూపుదిద్దుకొనే స్థితిలోనే ఉంటుంది. అది ఎక్కువ అభివృద్ధికి నోచుకున్నప్పుడు, పునర్జన్మలు నేను చెప్పినట్లుగా ఒకదాని కొక్కటి చాలా దూరంలో ఉంటాయి. చైత్యపురుషుడు పూర్తిగా అభివృద్ధి చెందినప్పుడు, దాని అభివృద్ధికి అది ఇక ఎంతమాత్రము భూమిమీదకు తిరిగి రావలసిన అవసరం లేనప్పుడు అది పూర్తి స్వేచ్ఛను పొందినప్పుడు, జన్మించకుండా, దాని పని మరొక చోట ఉన్నదని కనుగొన్నా ఇక ఎంతమాత్రం భూమి మీదకు తిరిగి రానక్కరలేదనే దానికీ లేక అది కేవలం అంతరాత్మిక చైతన్యంలోనే కొనసాగాలని కోరుకున్నదానికీ లేదా అలా కాకుండా, అది కోరుకున్నప్పుడు అది కోరుకున్న విధంగా, ఎక్కడ కావాలంటే అక్కడ, పరిపూర్ణమైన ఎరుకతో రావడానికీ మధ్య యెంచుకొనే అవకాశం దాని కుంటుంది. కొంతమంది, విశ్వజనీన క్రమంలోని శక్తులతోనూ, ఊర్ధ్వమానసం లోని లేక మరెక్కడివైనాగాని జీవులతోనూ, ఊర్ధ్వమాసంలోని లేక మరెక్కడివైనా గాని జీవులతోనూ ఐక్యమైపోయిన వారున్నారు. వారు కార్యనిర్వహణకై సర్వ కాలాలూ

భూవాతావరణంలోనే కొనసాగుతూ, క్రమానుగతంగా శరీరాలను తీసుకుంటూ ఉంటారు. దీనర్థం, చైత్య అస్తిత్వం పూర్తి ఆకృతిని దిద్దుకొన్న క్షణం సంపూర్ణంగా స్వేచ్ఛ పొందుతుంది. అది పూర్తి ఆకృతిని పొందినప్పుడే అది పూర్తి స్వేచ్ఛను పొందుతుంది. అది తాను ఏమి చేయాలను కొంటే దానిని చేస్తుంది. అది ఎంచుకొనే దానిమీద అది ఆధారపడి ఉంటుంది. ఆ కారణంగా ఒకరు, "అది ఈ విధంగా ఉంటుంది, అది ఆ విధంగా ఉంటుంది అని చెప్పలేరు;" అది ఖచ్చితంగా తాను కోరుకున్నట్లుగా చేస్తుంది. శరీరం మరణించే క్షణంలో, దాని తదుపరి పునర్జన్మ ఏ విధంగా ఉంటుందో, అనేది ఎంపిక చేసుకొని ప్రకటించగలదుకూడా (అది జరిగింది) కాని ఈ స్థితికి ముందు, చాలా తరచుగా జరగనిది అది, పూర్తిగా అంతరాత్మికం ఏ స్థాయిలో అభివృద్ధి ని సాధించిందీ, అస్తిత్వం సమగ్రచైతన్యంతో రూపుదిద్దుకున్న దాని అపేక్షమీదా ఆధారపడిఉంటుంది. అక్కడ ఇంకా అంతరాత్మిక చైతన్యంలో ఐక్యమైన మానసిక, ప్రాణిక, భౌతిక చైతన్యం ఉంటుంది. ఆ క్షణంలో, మరణించే క్షణంలో, శరీరాన్ని వదలి వెళ్ళిపోయే క్షణంలో అది ఒక అపేక్షను లేదా ఒక ఆకాం క్షను లేదా ఒక ఇచ్ఛను వ్యవస్థీకరిస్తుంది. సామాన్యంగా ఇదే భవిష్య జీవితాన్ని నిశ్చయిస్తుంది.

CWM 7: 86- 87

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ (ఫోన్: 8639106913)

పరిసరాలలో అంతరాత్మ సంఘర్షణ

ప్రపంచంలో పుట్టుక ఒక బలాత్కారమా?

గతవారం పుట్టుక గురించి మాట్లాడా. అంతరాత్మలు శరీరంలో ఎలా ప్రవేశిస్తాయో, ఎలా శరీరం ఎంతో అసంతృప్తికరంగా ప్రతివానికి ఏర్పడుతుందో, దీనికి మినహాయిం పులు ఎంత అరుదు అంటే వాటిని గూర్చి మాట్లాడనవసరంలేదు.

నేను చెప్పా, పుట్టుకయొక్క అజ్ఞాతం వల్ల మనకెదురయ్యే, మనం వదుల్చు కోవల్సిన, భౌతిక విషయాల గుంపు ఒకటున్నదని, దీనిని గురించి నేను చెప్పిన వాక్యం ఒకరు ప్రస్తావించారు. అది ఇలా ఉన్నది. ఇక్కడకు నీవు బలవంతంగా తీసుకు రాబడ్డావు. ఇక్కడ పరిసరాలు, ఆటవిక న్యాయం నీపై బలవంతంగా రుద్ద బడ్డాయి.

అయితే ఇదంతా యెవరు చేస్తారని ఆ వ్యక్తి నన్ను అడిగారు. ఇంకా స్పష్టంగా విడమర్చి చెప్పగల్గేదానను. కాని నేను చెప్పింది తగినంత స్పష్టంగానే ఉంది.

శరీరం స్త్రీ పురుషులవల్ల ఏర్పడుతుంది. దానికి వారే తల్లితండ్రులవుతారు. వారు ప్రపంచంలోకి తెచ్చే సత్తా దాని ఇష్ట ప్రాకరం వస్తోందో, లేదో దాని గమ్యానికి అనుగుణంగా వస్తోందో, దాని నడిగి తెల్సుకునే సాధనం వారివద్దలేదు. ఇలా వారి వద్దకు వచ్చిన శరీరంపై, — వారి అవసరాలు వత్తిడివల్ల వారు బలవంతంగా ప్రయోగిస్తారు — వారి పరిసరాలను, అటవికన్యాయాన్నిక తరువాత విద్యాభ్యాసాన్ని. కాని అవే వాని భవిష్యత్తు ఎదుగుదలకు — ఇంచుమించిగా ఎల్లప్పుడూ — ప్రతి బంధకాలుగా మారుతాయి.

అందుకే నేను చెప్పాను, మళ్ళీ చెబుతున్నా, ఈ భౌతిక తల్లితండ్రుల గురించి, వారు ఏర్పరచిన భౌతిక శరీరం గురించి నేను తగినంత స్పష్టంగానే చెప్పా.

ఏ ఆత్మ ఈ కొత్త శరీరాన్ని పొందుతుందో, అది తప్పనిసరిగా ఘర్షణ పడ వల్సి ఉంటుది. తన పశుపుట్టుకవల్ల తనపై బలవంతంగా రుద్దబడిన పరిస్థితులకు వ్యతిరేకంగా తన గమ్యానికి నిజ మార్గాన్ని అన్వేషించేందుకు తన ఆత్మను పూర్తిగా తెల్సుకుందుకు అంతే, అంతా.

CWM 8: 199 - 200

ఏది ఏమైనా — ఏదేమైనా — ఇంకా మంచి సందర్భాలలో కూడా చైతన్యంతో (ఎరుకలో) ఆత్మ తన భౌతికశరీర ఏర్పాటులో పాల్గొన్నప్పటికీ పశుపద్ధతిలో శరీర ఏర్పాటులో పాల్గొన్నప్పటికీ పశుపద్ధతిలో శరీర ఏర్పడడంవల్ల మానవ పశుత్వంలో దోషాలను సర్దుబాటు చేయడానికి ఆత్మ ఎంతో ఘర్షణ పడవల్సి ఉంటుంది.

తప్పనిసరిగా తల్లితండ్రులకు ఒక ప్రత్యేక ఏర్పాటు ఉంటుంది. వారు ఆరో గ్యంగానో, అనారోగ్యంగానో ఉంటారు. వారిలో రాశులకొద్దీ ఆటవిక న్యాయాలు (పద్ధతులు) అలవాట్లువారి అంతఃచైతన్యంలోను, అచేతస్సులోను ఉంటాయి. ఇవి, వారు నివసించిన జీవించిన పరిస్థితులవల్ల, పుట్టుకవల్ల వస్తాయి. వారెంతవారైనా అవి వ్యతిరేకంగా ఉంటాయి. నిజ ప్రాణిక జీవితానికి తల్లితండ్రులు ఎంత కష్టపడ్డా విద్యాభ్యాసంలో పిల్లలకు అనేక రకాల ప్రజలతో సంపర్కమేర్పడుతుంది. అవి వారిపై ప్రభావం చూపడమే కాక, వారి చిన్నతనంలో వారి ఉపచేతస్సులో ప్రవే

శిస్తాయి. వీటితో పోరాడవల్సి ఉంటుంది. వారు, తరువాత కాలంలో

బయటకు ఉపరితలానికి వచ్చే ఉత్తమ సందర్భాలలో సైతం అని నేనెందుకు చెప్పానంటే ఉపచేతస్సు నుండి, వస్తుండే అనేక అసంఖ్యాక కష్టాలను ఎదుర్కోవల్సి ఉంటుంది. వాటితో ఘర్షణ పడవల్సి ఉంటుంది. నీవు సంపూర్ణంగా స్వేచ్ఛ పొంది సాధారణ పద్ధతిలో అభివృద్ధి చెందేందుకు.

CWM 8: 202-203

అనువాదం: ఎస్. వై. సోమయాజులు (ఫోన్: 9247677982)

ఒక సచేతన జీవిగా తయారుగావటానికి అంతరాత్మ ఆరోహణకు వేల సంవత్సరాలు పడుతుంది.

ప్రశ్న: అమ్మగారూ! శరీరం రూపొందినపుడు అందులోనికి అవతరించే అంత రాత్మ శరీరంలో, బలవంతంమీద అవతరిస్తుందా?

అమ్మ: నీప్రశ్న నాకు బాగా అవగతం కాలేదు.

ప్రశ్న: శరీరం రూపు దిద్దు కొనడం పూర్తిగా స్త్రీ, పురుషులపై ఆధారడి ఉంటుంది. అయితే శిశువులో అభివ్యక్తమయ్యే అంతరాత్మ రూపుదిద్దుకుంటున్న ఆ శరీ రంలో బలవంతం మీదే అభివ్యక్తమవుతుందా?

అమ్మ: విభిన్నశరీరాల్లో ఏదో ఒక శరీరాన్ని ఎంచుకుంటుందని నీ అర్థమా?

శిష్యుడు: అవును మాతా!

అమ్మ: శరీరాన్ని ఎంచుకోవటంలో జీవాత్మకు కొన్ని మినహాయింపులుంటాయి. ఇంతటి మానవాళిలో ఒక సచేతనాంతరాత్మ స్వచ్ఛందంగానే అవతరించడమనేది అపురూప విషయం. ఇది చాలా సాధారణమైన విషయం. అంతరాత్మ పూర్తిగా చైతన్యవంతమై పూర్తిగా రూపు దిద్దుకొని పూర్తిగా అవతరించా లనుకున్నప్పుడు భువిపైన ఏదో ఒకచోట తన మనోతలం నుండి దాని కణుగుణమైన అంతరాత్మిక వెలుగును అన్వేషిస్తుందని మీకు ఇదివరకే చెప్పాను. దీనికి తోడు గతజన్మలో భూ వాతావరణాన్ని వదిలేముందు జీవితంలో పొందిన అనుభవ వాసనల ఫలితంగా భవిష్యత్ జన్మకు తగిన పరిస్థితులను ఎంచుకుంటుంది. ఇవి చాలా అపురూపమైన సందర్భాలు. ఇచట మనలో మనం మాట్లాడుకోవచ్చు. కాని చాలా మందికి, విద్యా వంతులకు కూడా అంతుపట్టని విషయమిది. తరువాత రూపు దిద్దుకొంటున్న,

హెచ్చు తగ్గులుగా రూపు దిద్దు కొన్న చైత్యపురుషుని విషయం చూద్దాం. ఒక అగ్ని కణం చిన్న వెలుగుగా మారటానికి అది అనేక దశల ద్వారా పూర్తి జీవిగా రూపుదిద్దుకొని వస్తుంది. దీనికి వేల సంవత్సరాలు పట్టవచ్చు. ఒక సచేతన జీవిగా తయారుగావటానికి అంతరాత్మ యీ ఆరోహణ, స్వీయ సంకల్పం కలదానిగా తన జన్మను తానే ఎంచుకొనే సామర్థ్యం కల దానిగా తయారు గావడానికీ వేల సంవత్సరాలు పడ్తుంది.

ఈ శరీరం వద్దు. మరొక శరీరం కావాలి. అని చెప్పే అంతరాత్మను గురించి నీవు తలపోస్తున్నావు.... ఇది అసాధ్యమని నేను అనను. ప్రతీదీ సాధ్యమయ్యేదే. ప్రాణం లేకుండా పిల్లలు పుట్టటం జరుగుతూ వుంటుందికదా. ఆ దేహాలలో అవతరించగల అంతరాత్మ లేదు అని అర్థం. అంతరాత్మ వాటిలో వ్యక్తం కాకపోవటానికి మరిన్ని కారణా లుండవచ్చు. వికారరూపం కారణమై వుండవచ్చు. ఈ విషయం ఎవరూ చెప్పలేరు. ఇది అసాధ్యమైన విషయమని నేను అనను. సామాన్యంగా చేతన గల స్వేచ్ఛాయుత అంతరాత్మ తిరిగి భువిపై జన్మించాలని కోరుకొన్నప్పుడు పుట్టక ముందునుండే ఆ దేహంపై పనిచేస్తూవుంటుంది. తల్లి దండ్రుల అజ్ఞాన ఫలితంగా కలిగే అసౌకర్యాలను సైతం అంగీకరించకపోవడానికి కారణం కన్పించదు. ఎందుకనంటే అంతరాత్మ అజ్ఞానం కాని ఒక ఉద్దేశంతో ఒక ప్రదేశాన్ని ఎంచుకుంటుంది. ఎందుకంటే అచట అది ఒక వెలుగును చూసింది. అది ఒక సంభవతకు సంబంధించిన వెలుగు. ఆ వెలుగుకోసమే వస్తుంది. ఓ నా కిష్టం లేదు. అని చెప్పటానికి బాగుంటుంది. ఇష్టమైన దాన్ని ఎంచుకోవడానికి ఎక్కడికి పోతుంది? అది కూడా సంభవించ వచ్చు. అది అసాధ్యమని అనను, కాని అది చాలా తరచుగా జరుగదు. ఎందుకంటే అంతరాత్మ తన అంతరాత్మిక తలంనుండి భువిలో మరొక జన్మకు స్థలాన్ని ఎంచుకుంటుంది. ఏ మాత్రం పొరబాటు లేకుండా చాలినంత అవగాహనతోనే ఎంచుకొంటుంది.

అంతరాత్మలు అవతరించాయి, వెళ్ళిపోయాయి. అలా వెళ్ళిపోవటానికి ఎన్నో కారణాలుంటాయి. పిల్లలు కొద్ది రోజులు కొద్ది వారాలు జీవించి చనిపోతూవుంటారు. అలా పోవటానికి అదే కారణం అయి వుండవచ్చు. అంతరాత్మ రూపం పూర్తి అవటానికి ఎన్నో కారణాలు వుండవచ్చు. అంతరాత్మ రూపం పూర్తి అవ్వడానికి కొద్ది అనుభవం అవసరమై వుంటుందనీ ఈ కొద్ది వారాలలోనే ఆ అనుభవం పొంది అది వెళ్ళి పోయి వుంటుంది అంటారు. కాబట్టి ప్రతీదీ సాధ్యమయ్యేదే. మనుషుల కథ

చెప్పటానికి యెన్నో కథలు అవసరమయినట్లే, అంతరాత్మల కథలు చెప్పటానికి అన్ని అవసరం, ఇలాంటి కథలుంటాయి. అవి ఒక దానికొకటి భిన్నంగా వుంటాయి.

ఇది అలా గుంది, ఇలా లేదు, ఇలా సంభవిస్తుంది, అలా కాదు అనటం పిల్ల చేష్ట అవుతుంది. ప్రతిదీ సంభవించ గలదు. చాలా తరచుగా అలా జరిగినట్లు చెప్పే ఉదాహరణలున్నాయని సామాన్యీకరించినట్లుగా చెప్పవచ్చు. అంతేగాని ఇది సాధ్యం కాదు, ఇలా వుండవలసిందే, అలా వుండవలసిందే, అని ఎప్పుడూ చెప్పకూడదు. అలాగే జరుగుతాయని అనరాదు.

CWM 8:201-202 శ్రీమాత

అదృశ్యలోకానికి, ఒక ఆధ్యాత్మిక ఆవేశం నిండిన ఒక పిలిపుతో ఒక సచేతన ఆకాంక్షతో, బుద్ధి పూర్వకంగా తెలిసి బిడ్డను కనడానికి, యాదృచ్ఛికంగా, బిడ్డ కావాలనే ఉద్దేశ్యమే లేకుండా కొన్ని సమయాల్లో అసలు, కావాలనే అనుకొనకుండా బిడ్డను కనడానికి మధ్య బ్రహ్మాండమైన భేదం వున్నదని వేరే చెప్ప పని లేదు.

అనువాదం: శ్రీ ఆకుల కృష్ణ (ఫోన్: 9989251895)

అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2018




సనాతన ధర్మం

సంపాదకీయం:

సనాతనధర్మాన్ని అర్థం చేసుకొనకుండా భారతదేశాన్ని దాని విస్తృతతర, ప్రగాఢతర భావం రీత్యా అర్థంం చేసుకోవడం అసాధ్యం. ఒక భావంలో, భారతం దానితోనే పుట్టింది. దానితోనే నివసిస్తుంది. దాని సమష్టి అంతరాత్మికతలో, సనాతనధర్మ ఉత్థాన పతనాలతో పాటు, అది కూడా లేస్తుంది, పడుతుంది. ఇంతకీ అసలు సనాతన ధర్మమంటే నిజంగా యేమిటి? వివేకం కలిగించే ఒక గ్రంథం, ఒక సంస్థాపకుడు లేక జీవితాన్ని శాసించే నియమనిబంధనల నిర్దేశించు దానిపై ఆధారపడిన ఒక విశ్వాస వ్యవస్థయా? ఒక అత్యున్నత మహనీయ 'సత్' వైపుకు గల ఒక ఆకాంక్షయా? లేక చాలా మంచి భావించేటట్లు కేవలం ఒక జీవన విధానమా? ఇతర అనేక మతాల లాగా అది కూడా ఒక మతమేనా లేక మానవ నిశిరాత్రులను వెలిగించే ఒక ఆధ్యాత్మికాగ్నియా? ఎవరికి సనాతన ధర్మం, కేవలం చిట్లం గట్టిన మేధోపరమైన జ్ఞానం లేక ఒక విశాల సర్వాన్నీ ఆవహించే పరమ సత్యపు యేక పక్ష దృష్టిగాక, ఒక సజీవ సత్యతయో, ఆ శ్రీఅరవిందులకన్న మన యీ ప్రశ్నలకు ఉత్తమ సమాధానా లెవ్వరివ్వగలరు? సనాతనధర్మమిప్పుడేదైవుండి వుండెనో, దానిని మాత్రమేగాక యిక ముందేమై వుండబోతున్నదో కూడా తెలిపే దర్శనం ఆయనిది. ఎందుకనంటే, కాలం జరిగినకొద్దీ తనను తాను పొరలు విప్పి చూపుకొంటుండే దేనికైనాసరే మించిన ఒక సజీవ, క్రియాశీల పరమసత్యం సనాతనధర్మం. ఇదే ఈ సంచికలోని విషయం, దీనిని శ్రీఅరవిందుల వెలుగు సహాయంతో ఆవిష్కరించుకొందాం.

అనువాదం: కె.వి. రావు (9849929254)



పాశ్చాత్య మేధస్సుకు తెలిసిన యే నిర్వచనాలతోనూ భారతీయ మతాన్ని వర్ణించ నలవి గాదు. దాని సమగ్రతలో అది సమస్త ఆధ్యాత్మిక ఆరాధన, అనుభవాల ఒక స్వేచ్ఛామయ సహనశీల సమన్వయం. దాని అనేక పార్శ్వము లన్నింటి నుండీ యేకైక పరమసత్యాన్ని దేనినీ విడువకుండ, పరిశీలిస్తుంది. తనకు తానది ఒక ప్రత్యేక నామాన్ని యిచ్చుకోలేదు. పరిమితీకరించు యే విశిష్టతకు తనను తాను బద్ధం చేసుకోలేదు. తనలోని శాఖలు, విభాగాలకు ప్రత్యేకత కలిగించే బిరుదుల ననుమతిస్తూ, అది యుగాలనుంచి దేనికోసం అన్వేషిస్తున్నదో ఆ బ్రహ్మం వలెనే అది కూడా తనకు తానుగా నామ, రూప రహితంగా, విశ్వజనీనంగా, అనంతంగా నిలిచిపోయింది. దాని సాంప్రదాయక పవిత్రగ్రంథాలు, ఆరాధనవిధానాలు, చిహ్నాలచేత యితర మతసాంప్రదాయాలకన్నా భిన్నంగా కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. సారతః అది ఒక విశ్వాసమతం కానే కాదు. కాని అదొక విశాల, బహుపార్శ్వ, సదా యేకం చేస్తుండే, సదా పురోగమనాత్మకమై తనను తాను విస్తరింప జేసుకొంటూ వుండే ఆధ్యాత్మిక సంస్కృతీ వ్యవస్థ.

శ్రీఅరవిందులు

సనాతనధర్మం, హిందూత్వం

హిందూమతమంటే ఏమిటి?

మనం సనాతనం, శాశ్వతం అని పిలిచే మతం అంటే యేమిటి? అది హిందూ మతం, ఎందుచేతనంటే దానిని హిందువులే నిలిపి వుంచుతున్నారు, ఎందుచేతనంటే యీ ద్వీపకల్పంలోనే, సాగరాల, హిమాలయాల యేకాంతతలో అది యెదిగింది, ఎందుచేతనంటే యీ పవిత్ర పురాతన గడ్డలో యుగాల పర్యంతం దానిని పరిరక్షించ వలసిన ఒక బాధ్యతగా ఆర్యజాతి కది అప్పగించబడింది. కాని ఒకే ఒక దేశ యెల్లలకు అది పరిమితం కాలేదు, హద్దులమధ్య బంధించ బడిన ఒక ప్రపంచ భాగానికే, యెల్లకాలం ప్రత్యేక రీతిలో అది చెందదు. మనం హిందూమతం అని పిలిచేది నిజంగానే శాశ్వతమతం, ఎందుచేతనంటే, యితర అన్నింటినీ ఆలింగనం చేసుకొనే విశ్వజనీన మతం అది. ఒక మతం విశ్వజనీనమైనది కాకపోతే, అది శాశ్వతం కాలేదు. ఒక సంకుచిత మతం, ఒక శాఖాపరమైన మతం, మినహాయింపుల మతం, పరిమిత కాలంపాటు పరిమిత కార్యానికై మాత్రమే జీవించగలదు. విజ్ఞానశాస్త్రం ఆవిష్కరణలను ముందుగానే ఆహ్వానిస్తూ వేదాంత విచారణలను కలుపుకుంటూ పదార్థవాదాన్ని జయించిన మతం యిదొక్కటే. మనకు భగవంతుడెంతో సన్నిహితమని మానవజాతికి నచ్చచెప్పగలిగిన మతం, మనిషి భగవంతుని చేరగలగడానికి యెన్ని ఉపాయాలు సాధ్యమో, వాటన్నింటినీ తన పరిధిలో ఆలింగనం చేసుకొనే యేకైక మతం హిందూమతం. భగవంతుడందరిలో వున్నాడు, అన్ని వస్తువులందూ వున్నాడు, ఆయనలోనే మనం చరిస్తున్నాం, మన అస్తిత్వాన్ని కలిగివున్నాం అని సర్వమతాలు యే సత్యాన్నంగీకరించాయో అసత్యంపై ప్రతిక్షణం ఒత్తి చెప్పే యేకైక మతం యిది. ప్రపంచం అంటే యేమిటో ప్రపంచానికి చూపిన, అంటే అది వాసుదేవుని లీలగా చూపిన యేకైక మతం యిది. ఆ లీలలో మన పాత్రను యెంత బాగా దాని సూక్ష్మతమ ధర్మాలలో, దాని మహోదాత్త నియమాలలో యెలా పోషించాలో మనకు చూపించే యేకైక మతం. మృత్యుసత్యతను మననుండి పూర్తిగా తుడిచివేసి, అమృతత్వమంటే యేమిటో తెలిసిన (తెలిపిన) మతం నుండి యే సూక్ష్మ వివరణలో కూడా జీవితాన్ని వేరు చేయని యేకైక మతం యీ హిందూమతం.

CWSA 8:11- 12

రెండు హిందూత్వాలున్నాయి. ఒకటి ఆహారంపై ఆధారపడి, దేహాన్ని శుభ్రం చేయడంద్వారా స్వర్గాన్ని అన్వేషిస్తుంది. రెండవది, భగవంతుడిని ఆహారపాత్ర ద్వారా, సాంఘిక ఆచారం ద్వారా గాకుండా అంతరాత్మలో అన్వేషిస్తుంది. రెండవది కూడా హిందూత్వమే. అది మొదటి దానికంటె చాలా ప్రాచీనమైనది, చాలా కాలం నిలువగలిగేది, అది భీష్ముని, శ్రీకృష్ణుని, శంకర, చైతన్య హిందూత్వం, హిందూ దేశాన్ని దాటి పోయే హిందూత్వం, అది చాలా ప్రాచీన కాలం నాటిది, యెల్లకాలం వుండేది, ఎందుచేతనంటే అది శాశ్వతంగా యుగాల పర్యంతం యెదుగుతూనే వుంటుంది. దాని నినాదం క్రియ కాదు. కర్మ; శాస్త్రం కాదు, జ్ఞానం; ఆచారం కాదు, భక్తి, అయినప్పటికీ, అది క్రియను, శాస్త్రాన్ని ఆచారాన్ని, వాటి కోసమే వాటిని చివరికంటా ఆచరించుకొంటూ పోవాలని గాక, కర్మను, జ్ఞానాన్ని, భక్తిని పరిపూర్ణం చేయడానికి వాటిని అంగీకరిస్తుంది. ఉన్నత జ్ఞానాన్ని అంటే శ్వాసపై అధికారం మంత్రపునశ్శరణ, నామాన్ని అలవాటుగా ఉపయోగించడం, భావన మీద నిత్యం ధ్యానించడం లాంటి దాన్ని పొందటానికి సహాయంచేసే ప్రతి అభ్యాసం అని క్రియకు నిఘంటువు అర్థం. కర్మను క్రమబద్ధం చేసేది, కర్తవ్యాకర్తవ్యాలను స్థిరీకరించేది, అని శాస్త్రం అనే పదం అర్థం. అజ్ఞానానికి సంబంధించిన రెండు మాతృస్థానాలను అది గుర్తిస్తుంది — తాత్కాలిక ఉపదేశాలకు భిన్నమైన శాశ్వత ప్రజ్ఞానం, యిది మన పురాతన గ్రంథాలలో, మానవహృదయంలో భగవంతునిచే వ్రాయబడిన, శాశ్వత అపౌరుషేయ వేదం. దేనివల్ల హృదయం పరిశుద్ధమై, దివ్యప్రేమకు తగిన పాత్ర అవుతుందో ఆ సమస్త నైతికశిక్షణ అని ఆచారాన్ని అర్థం చేసుకొంటుంది. సర్వకాలానికి, నిరంతరంగా అన్వయింప జేయడానికి ఉద్దేశించిన కొన్ని క్రియలు, కొన్ని శాస్త్రనియమాలు ఆచారానికి సంబంధించి కొన్ని వివరణలు వున్నాయి. తాత్కాలికమైనవి.దేశ కాల పాత్రలనుబట్టి మారుతూండేవి.మరికొన్ని వున్నాయి. తాత్కాలికమైన ధర్మాల్లో వంటగిన్నె, ప్రాయశ్చిత్త కర్మలకు కూడా స్థానం వుంది. కాని అవి సర్వులకూ కాదు. యెల్లకాలమూ కాదు. ఆపత్కాలంలో, బాహ్యావత్తిడి క్రింద కొంచెమై అణగి వుండవలసిన సమయాల్లో హిందూత్వం ఆంతరిక దేవాలయం

నుండి పారిపోయి తనను తాను వంటగదిలో దాచి పెట్టుకొంది.

CWSA 8:11- 12

ఉన్నత తర , యధార్థతర హిందూత్వం:

ఉన్నతతరర, యధార్థతర హిందూత్వం కూడ రెండు విధాలుగా వుంది. అవి శాఖాపరమైనవి, శాఖాపరంకానివి, విడివిడిగాసాగేవి, కలుపుకు పోయేవి ఒక పార్శ్వంలో తనను తాను బంధించుకొనేవి, సర్వాన్ని కాంక్షించేవి. మొదటిది ఒక భావనకు, ఒక అనుభవానికి ఒక అభిప్రాయానికి లేక అభిప్రాయాలకు సముదాయానికి చిత్తవృత్తికి, ఒక ధోరణికి ఒక ప్రత్యేక గురువుకు, యెంచుకొన్న ఒక అవతారానికి రాజసికంగా లేక తామసికంగా అంటిపెట్టకొని వుండిపోవడం నుండి పుట్టుకొచ్చింది. ఈ విధమైన అంటిపెట్టుకోవడం అనేది సహించరానిది. తలబిరుసుతనంతో కూడినది. అల్పజ్ఞానంవల్ల యేర్పడిన గర్వం, దాని స్వంతం కానటువంటి నిందార్హతగలజ్ఞానం. అది తనకున్న వాటిని చూడకుండా యితరుల కుసంస్కారాలు, మూఢాచారాలను గురించి యెల్లప్పుడూ మాట్లాడుతుంటుంది, లేక "నా గురువొక్కడే అసలు గురువు. తక్కిన వారందరూ కుహనాగురువులు. లేక అధములు" అని చెప్తుంది. లేక "నా చితవృత్తే సరైన చిత్తవృత్తి, నా మార్గాన్ని అనుసరించని వాళ్ళు బుద్ధిలేనివాళ్ళు. లేక ఛాందసులు లేక నిజాయితీ లేని వాళ్ళు." అంటుంది. లేక "నేను కొలిచే అవతారమే స్వయంగా నిజమైన భగవంతుడు, తక్కిన వారంతా తక్కువ రూపాలు", అంటుంది. లేక నా యిష్టదేవతే భగవంతుడు, తక్కినవారు ఆయన పాక్షిక అభివ్యక్తులు" అంటుంది. అంతరాత్మ ఉన్నతతర స్థాయికి లేచినపుడు, తన స్వంత భావనలను, అనుభవాలను అభిప్రాయాలను చిత్తవృత్తిని గురువును, యిష్టదేవతను యిష్టాన్ని అనుసరిస్తుంది. "అనేక మార్గాలున్నాయి, అన్నీ సమంగా భగవంతునికే దారితీస్తాయి. పాపి, నాస్తికుడు సైతం సాధనలో నా సోదరులే, దివ్యప్రియుడు ప్రతివానిని తనదేయైన మార్గంలో ద్వైతస్థితిలేని యేకైకునిలోనికి వారిని ఆకర్షిస్తున్నాడు." అని యెలుగెత్తి చాటుతాడు. కాని పూర్ణ జ్ఞానోదయం కలిగిపుడు, నేను సర్వానుభవాలను నాలో ఆలింగనం చేసుకొంటాను. సర్వభావనలు యధార్థమేనని, సమస్తాభిప్రాయాలూ ప్రయోజనకరమైనవేనని, విశ్వజనీన అనుభవం, సంపూర్ణతను సముపార్జించుకోవడంలో సాధనోపాయాలు, దశలు యీ అనుభవాలన్నీ, ధోరణులన్నీనని, సమస్త గురువులు

ఒకే ఒక మహద్గురువు ప్రవాహమార్గాలు, లేక అవతారాలు, యిష్టదేవతలందరూ, అవతారాలన్నీ స్వయంగా భగవంతుడే.... అంటాడు.

పారతంత్ర్యాన్ని పారద్రోలడం స్వాతంత్ర్యాన్ని సాకారం చేసుకోవడం, మన కాళ్ళకున్న బంధాలను తొలగించివేయడం అనేవి మన భవిష్యత్తుకు ప్రప్రథమ ఆవశ్యకత. రామకృష్ణుడు వచ్చింది ముక్తి నివ్వడానికి గాని, ఒక నూతన బంధాన్ని విధించడానికి గాదు. అందుచేత వివేకానందుడు విగ్రహారాధకులకు దేవదూతయైనాడు, అతడు సమస్త విషయాలలో స్వేచ్ఛను ప్రకటించాడు. హిందూత్వ అంతరాత్మ, ఆయుక్తమైన దేహంలో కృంగి కృశించి పోతుంది. ఆ మూసను భగ్నం చెయ్యి అంతరాత్మ జీవం పోసుకుంటుంది. దేహాత్మ బుద్ధిని నాశనం చెయ్యి, తాత్కాలికమైన దేహంతో తాదాత్మ్యత చెందుతున్న అంతరాత్మ అంధత్వాన్ని నాశనం చెయ్యి అన్నది యోగం ప్రథమ బోధకాదా? దేహం యవ్వనవంతమై, తగినరీతి మార్పు చెందగలిగినదై, అర్హమై వుంటే అంతరాత్మ దాని నుపయోగించ వచ్చు, కాని అది శక్తి ఉడిగినదై, అనారోగ్యం, అపరిశుద్ధత కలదై వుంటే, దేహంతోపాటు అంతరాత్మను గూడా ధ్వంసం చేసే పాశ్చాత్య విగ్రహనాశక తత్త్వంతోగాక, జాతీయ యోగంచేత అది మార్చబడాలి.

CWSA 1:552-53 *అనువాదం: కె.వి.రావు (ఫోన్ 9849929254)*

సనాతన ధర్మముయెడల ఒక అజ్ఞాన, పొరపాటు - దృక్పథం

భారతదేశంలో మతం అంటే ఈ కనీస నియమాలను పాటించడమే: 1. పవిత్ర మత గ్రంథాలను గౌరవించడం, తెల్సుకోడం; వాటి స్థానంలో ఆచారాలను పాటించ డం. 2. గౌరవింప తగినను, కాకున్నను, బ్రాహ్మణులందరినీ గౌరవించడం. 3. సాంఘికంగా హీనకులస్తులు వండిన పదార్థాలను తినకపోవడం. 4. ఒకని కుమార్తె పెద్దమనిషి కాకపూర్వమే వేరొకరికుమారుని పెండ్లియాడుట. 5. ఆడువారిని అజ్ఞానంలో ఉంచుట, ఇంటిపనులకు ఉపయోగకరంగా ఉంచుట. 6. నిష్టగా స్నానంచేయుట వంటి కొన్ని నియమాలను అతిగా చేయుట, వాటిని గొప్పగా భావించుట. 7. నేల పైనే గాని టేబుల్ పై భోజనం చేయకపోవుట. 8. అర్థం చేసుకోకుండా రోజుకు రెండుసార్లు పూజ చేయుట. 9. అంతగా ముఖ్యంకాని, అర్థరహిత సూక్ష్మ విషయాలను నిత్యకృత్యంలో పాటించుట. 10. ఒక ప్రతిమను ప్రతిష్టచేసి, పూజించి, పారవేయుట.

హిందూ పవిత్రదినాలను పాటించుట. భారతదేశంలోని మతాన్ని గురించి తక్కువ చెప్పటం యిది ఇదే హిందుత్వం, ఇదే సనాతనధర్మం అని గొప్పగా చెప్పబడింది.

ఒకరికి ఉద్వేగపూరితమైన పవిత్రతత, భక్తి, ఉంటే అతడొక భక్తుడు. అతడు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దర్శనాల గురించి మాట్లాడగల్గితే అతడు ఒక జ్ఞాని. అతడు ఏ పనీ చేయకుండా కాషాయ దుస్తులు ధరిస్తే, అతడొక త్యాగి, సన్యాసి. అతడే బిచ్చమెత్తుకొని శాకాహారం తింటే, అతడు సాధారణధర్మాలనుండి ముక్తుడు. పనులన్నీ ఆచారప్రకారం బ్రాహ్మణులు చెప్పిన ప్రకారం జరగాలి. సాధారణ హిందూమతానికిగల ఒక ఆధిక్యత ఏమంటే నిజభక్తులను, సన్యాసులను అది గౌరవిస్తుంది. కాని వారు విప్లవాత్మక లక్షణాలు, వింతదుస్తులు ధరించి ప్రదర్శించరాదు.

యూరపు వారు వీరిని తప్పనిసరిగా మతపరమైన కపటులు, దంభాచారులు పరాన్నభుక్తులు, పిచ్చివారు, సోమరులుగా హేళనతో తక్కువ చేసి చూస్తారు. *CWSA 1:492*

విచారించేబుద్ధి ఆవశ్యకత

పరిణామాత్మకంగా ఆలోచించే బుద్ధి, లేదా విచారణబుద్ధి అత్యవసరం. విప్లవాత్మక కాలాలు రెండురకాల బుద్ధులకు జన్మ నిస్తాయి. 1. అవగాహనలేని వ్యక్తపర్చలేని అవిచారబుద్ధి. 2. అది పాతది కావున పాతకాలానికి బలంగా అంటుకు ప్రేళ్ళాడే బుద్ధి, అది క్రొత్తది కావున దాని వెంట పరుగులు తీసే బుద్ధి. వీని మధ్య ఉంటాడు — తనని తాను మధ్యతరహా మనిషినని చెప్పుకొనేవాడు. అతడు అంటాడు, కొంత పాతది, కొంత కొత్తది. పాటిద్దామని. ఇతడు అతివాదుల కంటె తక్కువ అవిచారి కాడు. అతడు మధ్యతరహా అనేది ఒక గొప్ప ఫార్ములాగా భావిస్తాడు. దానిని పిచ్చిగా ప్రేమిస్తాడు. పాత, కొత్తల మధ్య ఒక అసంభవ సంధి కొరకు వెంపర్లాడుతాడు. ఇదే భావాన్ని క్రీస్తు ఇలా చెప్పారు. 'కొత్తసారాను పాతసీసాల్లో నింపరాదు'. అని. విచారణబుద్ది ఎప్పుడూ ఒక ఫార్ములాను ఏర్పాటుచేయదు. ముందుగానే ఒక నిర్ణయానికి రాదు. కాని ప్రశ్నిస్తుంది. ప్రతి విషయాన్ని తూకం వేస్తుంది. ప్రతిదానిని విచారి అంటాడు. "యూరపు విజ్ఞానవంతమైనది. ఇండియా అటవికమైనది" అలా అని నేనెందుకు అనుకోవాలి. నిజానికి యూరపువారు అటవికులు కావచ్చు. భారత విజ్ఞానం సత్యప్రకాశం కావచ్చు. ఎవరైనా భారతీయునిలా ఉండు, భారతీయునిలా

పనిచేయి అంటే విచారి అంటాడు. "నేను భారతీయునిలా ఉండడం కోసమే భారతీయునిలా ఉంటానని కచ్చితంగా చెప్పలేను." ప్రస్తుతం భారతదేశంలో ఉన్న భారతీయులు, ఉండాల్సిన విధంగా ఉండడం లేదు. వేరు వేరు కాలాలలో – శకాలలో భారతీయులు ఎలా ఉండేవారు, వారి నాగరికత ఎలా ఉండేదో తెలుసుకోవాలి. తాత్కాలికమైనదేదో, శాశ్వతమైనదేదో తెలుసుకోవాలి. బహుశా మనం పోగొట్టుకున్న కొన్ని నిజమైన భారత సుగుణాలు యూరపు వారిలో ఉండవచ్చు. భారతీయునిగా ఉండండం మంచిదే, కాని అది విజ్ఞానం కొరకు మాత్రమే. ద్వేష బుద్ధితో కాదు.

CWSA 1:499- 500

జ్ఞానం

భారతీయ విజ్ఞానంలో నాల్గు పద్ధతులున్నాయి. 1. పరిశోధించేవాడు మొదట తన బుద్ధి శుద్ధి చేసుకొంటాడు. దీని కొరకు అతడు తన రాగాలను, ఉద్వేగాలను ముందస్తు నిర్ణయాలను, పాతసంస్కారాలు, వాటికి చెందిన వాటిని, శాంతింపజేయాలి, నిలుపుదల చేయాలి. 2. సంపాదించిన విజ్ఞానాన్ని కఠినంగా అనుమానిస్తూ విచారణ చేయాలి. అభిప్రాయాన్ని సత్యం నుండి, నిర్ణయాలను వాస్తవాలనుండి, వేరు చేయాలి. వాస్తవాలను కూడ తాత్కాలిక సత్యాలనుకోవాలి. తాను సంపాదించిన విజ్ఞానమంతా అర్థసత్యాలని, తప్పుడుగా ప్రయోగింప బడిందని, తప్పుడు తడకలని, తెలుసుకొనేందుకు సైతం సిద్ధంగా ఉండాలి. 3. తాను లాభం పొందటానికి లేదా వ్యక్తిగత అనుభవం సంపాదించటానికి ప్రయోగాలు చేస్తాడు. 4. తన అనుభవం తనను ఎంతమేరకు (సత్యం చేరువకు) చేర్చగలదో, తన నిర్ణయాలు సరిగా ఉన్నాయో లేదో, తెలుసుకొనేందుకు విచారణ సాధనాన్ని వాడ్తాడు. చివరగా, విషయంపై విశుద్ధ బుద్ధి కాంతిని మళ్ళించి, వివేచనతో జ్ఞానాన్ని చేరుకొంటాడు. వివేకు నిర్ణయాలను అతడు ప్రశ్నించడు. విచారణను, వివేకంగా పొరపడకుండా తనను తాను సురక్షితంగా వుంచుకొంటాడు. తన దృష్టికిరాని కొత్తసత్యాలతో, తన నిర్ణయాలను సరిచూచి, విస్తరిస్తాడు. సత్యానికి వేరొక వైపు (కోణం) ఉండవచ్చని అంగీకరిస్తాడు. యూరపు శాస్త్రివేత్తలా,

పాతసిద్ధాంతాలను పట్టుకు వ్రేళ్ళాడడు. కొత్త పద్ధతిలో విజ్ఞాన విస్తరణను కపటంగా, మోసంగా పరిగణించడు. నటునివలె ఉండడు.

CWSA 1:501-502

మతపరమైన విధులు, క్రతువులు, పూజ, ఆరాధనా పద్ధతులు

హిందూత్వంలో మతపరమైన విధులు, క్రతువులు పూజ, ఆరాధనా పద్దతులను అర్థం చేసుకోగల్గడానికి ముందు దాని మౌలిక నైజాన్ని అర్థం చేసుకోవాలి. మొదటిది, అది మూఢ విశ్వాసాలతో ప్రమేయం లేకుండా, అన్నిటినీ తనలో కలుపుకుపోయే మతం. ఇస్లాం క్రైస్తవాలను కూడ అది తనలో కలుపుకుపోయేదే, అవి సహకరిస్తే. తన కెదురైన ప్రతి మతాన్ని, తనలో కలుపుకుంది. ఊహను, భావోద్వేగాలను, ఉత్తమాభిరుచుల స్పృహను, అర్థ ఉపతేజస్సు గల భాగాల సహజాతాలను సైతం, అది ప్రభావితం చేయజూస్తుంది. మతం మనిషిని హేత్వాతీత స్థితివైపుకు, ఆధ్యాత్మిక సత్యంవైపుకు, నడపాలి, మార్గం మీద అది ప్రకాశింపజేయబడిన హేతుబుద్ధి తోడ్పాటును తప్పక తీసుకోవాలి. కాని అది (మతం) మిగిలిన సత్తా సంక్లిష్ట నైజానికి దైవ పిలుపును, నిరక్ష్యం చేయజాలదు. ఇంకా ప్రతి మనిషి ఏ స్థాయిలో ఉంటాడో, ఆ స్థాయి నుండి అతనిని పరిగణలోనికి తీసుకోవాలి. అతను దేనిని అనుభూతి చెందగలడో, దానినుండే అతనిని ఆధ్యాత్మీకరించాలి. సత్యమైన జీవిస్తున్న శక్తిని, అతను అనుభూతి చెందలేని దానిని, గ్రహించలేనిదానిని బలవంతంగా హఠాత్తుగా, అతనిపై రుద్దకూడదు. హిందూత్వంలోఅన్ని భాగాలభావం, లక్ష్యం, ఇదే.

కాని ప్రత్యేకించి, ఈ అంశాలనే, యింద్రియాధారిత మేధస్సు, ఒక మచ్చగా ముద్ర వేస్తుంది.

CWSA 20:147- 148 శ్రీఅరవిందులు

అనువాదం: ఎస్. వై. సోమయాజులు (6281730339)

హిందూ సంస్కృతి నాగరికత

పశ్చిమదేశీయుల మనసుకు నీతి అంటే ఎక్కువగా బాహ్య ప్రవర్తనకు చెందినది. కాని హైందవ మనసుకు నీతి అంటే కేవలం ఆత్మ వున్న స్థితిని వ్యక్తం చేసే ఓ గుర్తు. సందర్భానుసారం పాటించడంకోసం హైందవ అనేక ఆదేశాలను కలిపి

కూర్చి, ఓ నైతిక నియమాల సూచిక నిచ్చింది. మనసుకు ఓ ఆధ్యాత్మిక పవిత్రతకు లేక నైతిక పవిత్రతకు కర్మనుగూడా జతచేసి ఓ బాహ్యాసూచికగా విధించింది. 'హింసింపరాదు' అని తగినంత బలంగా దాదాపు ఎంతో గట్టిగా ఆదేశించింది.అంతేగాక నీవు అసహ్యించుకోరాదు. దురాశకు కోపానికి లేక అసూయకు లోనుగారాదు. అని ఎంతో ఖచ్చితంగా ఆజ్ఞాపించింది. ఎందుకంటే చంపడానికి మూలాలు అవే. హైందవ సాపేక్ష ప్రమాణాలను ఆమోదిస్తుంది. అది ఐరోపా వారి ప్రజ్ఞకు అంతుబట్టని వివేకం. గాయపరచకపోవడం "అహింసయే పరమధర్మం", దానిని నియమాలలో అది ఎంతో ఉన్నతమైనది. అయినప్పటికీ యోధునికి దాని నొక భౌతిక నియమంగా విధించదు. పైగా అతడినుండి, యుద్ధానికి సన్నద్ధంగా లేని, బలహీనుని, నిరాయుధుని పట్ల, అణచివేయబడినవాని పట్ల దయను, ఉదారతను, గౌరవాన్ని గాఢంగా ఆశి స్తుంది.మొత్తం జీవితంనుండి, ఆచరణయోగ్యం కాని అతి పవిత్రతకు చెందిన ఒక నియమాన్ని అది తప్పిస్తుంది.

CWSA 20:149

భారతీయ నాగరికత ఆధ్యాత్మిక లక్ష్యం

భాతతీయ సంస్కృతికి ఐరోపా సంస్కృతికి మధ్య మొత్తం తేడా మూలం, హిందూ నాగరికతయొక్క ఆధ్యాత్మిక లక్ష్యాన్నుండి ఉద్భవిస్తున్నది. దానికి ప్రత్యేక లక్షణాన్నిస్తున్నటువంటి సంపన్న విస్తృత వైవిధ్యతలు గల్గిన రూపాలపై, లయలపై, ఈ లక్ష్యం విధించిన నూతన రూపం దానికా ప్రత్యేకతను కట్టబెట్టింది. ఇతర సంస్కృతులలో ఉన్నది, దీనిలోవున్నప్పటికీ అది కూడా కొట్టొచ్చినట్లు కన్పించే మౌలికత, యితర సంస్కృతులలో లేని గొప్పదనం ఆ నూతన రూపం వల్ల లభిం చింది. ఈ సంస్కృతిని పాలించే క్రియాశక్తి, దాని యోచన కేంద్రం, దాని గాఢవేశం ఓ ఆధ్యాత్మిక ఆకాంక్ష. ఆధ్యాత్మికతను జీవితపు అత్యుత్తమ లక్ష్యంగా చేయడమేగాక నాటి పరిస్థితులలో మానవజాతి జీవనం మొత్తాన్ని ఆధ్యాత్మికతవైపు మళ్ళించేందుకు గూడా ఎంతవరకు చేయగలిగితే అంతవరకు ప్రయత్నించింది. మనస్సులో ప్రప్రథ మంగా మతం స్థావర మేర్పరుచుకొంది. పెత్తనం చేయాలనీ, జీవితం మీద పట్టు సాధించాలని అది చేసిన కృషి ఆధ్యాత్మిక ప్రేరణ అసంపూర్ణ రూపం, అయినప్పటికీ, ఆలోచనను, కర్మను మతం మూసలో పోత పోయవలసిన, జీవిత సందర్భాన్నీ

మతభావనతో నింపివేయ వలసిన ఆవశ్యకతకు కారణమైంది. మత- తాత్త్విక సంస్కృతి వ్యాపకత నాశించింది. మతరూపంతో, విశ్వాసంతో పాలింపబడాలని ఆశించే ఆ అల్పస్థాయిని మించి అత్యున్నత ఆధ్యాత్మికత ఎంతో ఉన్నతంగా స్వేచ్ఛాపూరితంగా విశాల వాతావరణంలో చలిస్తుంది. అది పరిమితులను సులభంగా సహించదు. వాటిని ఆమోదించినప్పటికీ అతీతంగా పోతుంది. నియతమయిన మత ధార్మిక మనసుకు తెలియని అనుభవంలో జీవిస్తుంది. కాని మనిషి వెంటనే ఉత్తమ అంతరంగ ఉన్నతికి చేరుకోడు, దాని నొక్కమారుగా అతడినుండి ఆశించితే అక్కడి కెప్పటికీ చేరుకోడు. మొట్టమొదట అతడికి క్రింది ఆసరాలు ఆరోహణా స్థాయిలు అవసరము. తనలో ఆధ్యాత్మిక ఆలయాన్ని నిర్మించుకొనేటప్పుడు నిలబడగలగడానికి కొంత మత విశ్వాసం, ఆరాధన, ప్రతిమ, సంజ్ఞ, రూపం, చిహ్నం వంటి భవన నిర్మాణ సరంజామా, కొంతవరకు ఆంక్షలు లేకుండా, నడచుకోవడం, సహజ ప్రేరణ మిశ్రమ అర్థభాగాన్ని నిలబడగలగడానికి ఆసరాను, అనుమతిని అడుగుతాడు. ఆసరాలను తొలగించగలిగేది ఆలయం పూర్తయిదే సరంజామా అవసరం తీరిపోయేది. హైందవత పేరుతో యిప్పుడు నడుస్తున్న మత ధార్మిక సంస్కృతి ఈ ఉద్దేశాన్ని ఫలప్రదం జేయడంతోపాటు కొన్ని మత ధార్మిక తెగలవలెగాక దాని ఉద్దేశం గూడా దానికి తెలుసు. అందుకొక పేరయితే పెట్టుకోలేదు, ఎందుకంటే అది శాఖా పరిమితులకు అంటిపెట్టుకోలేదు. సర్వులూ అంటిపెట్టుకునే సార్వత్రిక యోగ్యత గలదని అనలేదు. అదే అమోఘమయిన విశ్వాసమని నొక్కి వక్కాణించలేదు. మోక్షానికి ఏకైక యిరుకు మార్గంగా లేక ద్వారంగా ఏర్పాటు చేయలేదు. దైవందిశగా మానవ ఆధ్యాత్మ చేస్తున్న ప్రయత్నమనే నిరంతరం విశాలమౌతున్న సంప్రదాయంకంటే యిదొక మత తెగగా, సంస్కృతిగా తక్కువే. ఆధ్యాత్మిక స్వీయ నిర్మాణంకోసం, తనను తాను కనుగొనడం కోసం అపారంగా పలుకోణాలు, పలుస్థాయిలు సమకూర్చుకుంది. శాశ్వత మతంగా దానికి తెలిసిన తనను పిలుచుకొనడానికి దానికి తెలిసిన, హక్కున్న ఒకే ఒక నామం శాశ్వత మతం, 'సనాతన ధర్మం', యీ భారతీయ మత భావనను, స్ఫూర్తిని న్యాయంగా సవ్యంగా మెచ్చుకోగల్గితే భారతీయ సంస్కృతిమొక్క అసలయిన భావాన్ని, స్ఫూర్తిని అర్థం చేసుకోగలుగుతాము.

CWSA 20: 178-79

శ్రీఅరవిందులు

అనువాదం: జి. అరుణామోహన్ (9866117137)

సనాతన ధర్మ పవిత్ర గ్రంథాలు

భగవంతుని విశ్వజనీన లక్షణం

ఉపనిషత్తులు వాటి దివ్యజ్ఞానమునకు భగవంతుని విశ్వాజనీన లక్షణం అనుల్లంఘ నీయమైన ఆధారమని ప్రకటించడంతో మొదలుపెడ్తాయి. శాశ్వతమగు బ్రహ్మము యొక్క ఈ విశ్వజనీన లక్షణం వేదాంతానికి మొదలు, తుది అవుతుంది. దానిని గనుక ఆమోదించకపోతే వేదాంతం చెప్పేదానికి ఎటువంటి విలువా ఉండటాని కవకాశం లేదు. ఏలననగా దాని ప్రతిపాదనలన్నీ దానినుంచే ముందుకు సాగిపోతూం టాయి. లేదా కనీసంగా దానిని ముందస్తుగా భావిస్తాయి. ఇంతటి ప్రధానమైన అత్యున్నతసత్యం లేనప్పుడు, మ్లేచ్ఛ పండితులు తాత్వికులు వాటిని గురించి ఏ విధంగా ఆలోచిస్తారో ఆ విధంగానే ఉపనిషత్తులు తయారవుతాయి. ఒకదానికి మరొకదానికి పొసగని అసంబద్ధమైన ఒక పెద్దరాశి, అయినప్పటికీ తరచుగా కనబడు తూండే, మహనీయమైన యోచనా సరళిని కలిగినవి. ఈ సత్యాన్ని నీ కరదీపికగా పెట్టుకొని పవిత్ర గ్రంథాలలో అస్పష్టంగా అనిపించే ఉద్ఘాటనలన్నింటిమీద కాంతిని ప్రసరింపజేస్తే చాలా త్వరగా నీవు ఉపనిషత్తులను ఒక బ్రహ్మాండమైన సామరస్యతా మరియు పరిపూర్ణతతోనిండిన ప్రకాశవంతమైన మొత్తంగా, అనేకములగు వాటి దృక్పథాలతో ఒకే ఒక, విశ్వజనీన సత్యాన్ని వ్యక్తీకరించేవిగా తెలిసికొంటావు. అన్ని స్మృతులు పురాణాలు, దర్శనాలు, ధర్మశాస్త్రాలు శాక్త, శైవ, వైష్ణవ సౌరస, లిఖితాలు, వాటితో పాటు మొత్తం బౌద్ధమతం అంతా, దాని పవిత్రగ్రంథాలతోసహా, ఈ బృహదృక్పథాల ఒకే ఒక్క మహా సత్యానికి కేవలం భిన్న పార్శ్వాల అనేక వివ రణలూ వ్యాఖ్యానాలు అన్వయాలూ మాత్రమే. ఈ మహాసత్యమే కేవలం మతాలన్నిం టికీ పునాది కాగా, మతాలన్నీ సురక్షితమైన అభేద్యమైన ఈ శిలలాంటి దాని మీదనే నిలబడగలవు. శిలకంటే ఎక్కువే. ఏలనంటే, శిల పగిలిపోవచ్చునేకాని ఇది ఎప్పటికీ నిలచివుండేదే. కనుకనే ఆర్యుల మతం సనాతనధర్మం, ఆది అంతరహితమూ, అయిన ధర్మమని పిలువబడింది. శ్రుతిని చిరమైనదిగాను ఆది లేనిదిగానూ పిలవటం మూలంగా హిందువులు ఏతప్పూ చేసినవారు కాదు. ఋషులెవరైతే సూక్తాలను స్వరబద్ధం చేసారో వారే కేవలం సత్యమును చూసినవారు, మానవభాషలో వాటికి రూపుదిద్దినవారు సాక్షులు; కారణం, ఈ చూడటం అనేది మానసిక దృష్టితో జరుగలేదు.

కాని అది ఆధ్యాత్మికం. కనుకనే వేదాలు శ్రుతములు లేదా వివేకోదయాలు అని సరిగ్గా పిలువబడ్డాయి. వాటిలో ఋగ్, యజుర్, సామ, అథర్వణములు మహా సత్యముయొక్క వృక్షానికి పోషణను కలిగించి, పెంపుదలకు దోహదం చేసేటటువంటి సారవంతము చేసే వర్షము, ఈ వృక్షమును కనుగొనగలిగే అడవియే బ్రాహ్మణములు, అవి పెరిగే భూమి అరణ్యకములు, ఉపనిషత్తులు స్వయంగా వృక్షమే, వ్రేళ్ళు, కాండము, ఆకులు, పష్పరంధ్రము, పూరేకలు, పుష్పాలు, వాటికవే అభివ్యక్తమై సర్వ కాలాల్లోను చెప్పే "అదే నేను నేనే అతడు" అది ఉపనిషత్తుల అత్యున్నత స్థితి. ఆ శాశ్వతునకు నమోవాక్కములు, ఏది ఏమైనా ఆ మహా శాశ్వతమునకు, ఆ నా మహదాత్మకు నమోవాక్కములు.

CWSA 13: 101-102

వేదము - వేదాంతము

వేదాలు ఆ జ్ఞానమును వేదాంతం కంటే ఎక్కువగా కలిగి ఉన్నాయి, ఎక్కువ సమృద్ధి ని కలిగి ఉన్నాయి. ఆచరణాత్మకంగానూ సూక్ష్మవివరణలతోనూ, కాని అవి మనకు మనం అర్థం చేసుకోవడం మానేసిన ఒక భాషలో అందుబాటులో ఉన్నాయి. ప్రాచీన పదాలకు అర్థాలుమారిపోవడంమూలంగా, అవి మటుకు చాలా తేలికగా, సుపరిచితంగా అనిపించినా, అందులోని శబ్దప్రయోగం తరచుగా ఎక్కువ గానే తప్పు దారి పట్టిస్తుంది. అదంతా సంకేతాలతో నిండిన ప్రణాళికకాగా, దాని కీలకం మననుంచి తీసేసుకోబడింది. భారతీయులు వేదాలను ఏ మాత్రం అర్థం చేసుకోరు, ఐరోపా దేశస్థులు మొత్తంగా వాటియొక్క తప్పుడు వ్యాఖ్యానాలను వ్యవస్థీకరించారు. కనుక, చీకటి సొరంగాలలో సామాన్యులకు అందుబాటులో లేకుండా యిటూ అటూ ప్రవహించే నదీజలంలా మనకు వేదాలలోని సనాతన జ్ఞానం అందకుండా వుండిపోయింది. ఉపనిషత్తులలోనే మొదట ఆ ప్రవాహం బయల్పడి బాహ్య సానువు లలో పారింది. అక్కడ అది మనకు ఎక్కువగా అందుబాటులోకి వస్తుంది. కాని ఈ వాగుకూడా చొరరాని అడవులు మరియు దుష్కరమైన కొండప్రాంతాల ద్వారా ప్రవహిస్తుంది. దాన్ని మన వినియోగానికి అనుకూలమైన స్థానాలలోనే, ఎక్కడైతే అడవి పలచగా ఉంటుందో లేదా కొండ దారిని ఇస్తుందో అక్కడే పొందగలం. అక్కడే మనుజులు వారి చిన్న కృత్రిమమైన తత్త్వవిచారంతో కూడిన, ఆధ్యాత్మికతకు

ఆచరణాత్మకమైన పట్టణాలను నిర్మించుకున్నారు. ప్రతిదానిలోను నివాసులు మొత్తం నదిని నియంత్రిస్తున్నట్లుగా నటించారు. వారు వారి నివాసస్థలాలను వేదాంతం లేదా సాంఖ్యం అద్వైతం లేదా ద్వైతం, శైవం లేదా వైష్ణవాలుగా వాటి పక్కన ఒక వందనామాలతో, వారిదే అసలైన పద్ధతనీ, వారిదే అసలైన జ్ఞానమనీ దంభాలు పలికారు. కాని వాస్తవంలో మనలో ప్రతి ఒక్కరం సనాతన ధర్మంలోని అల్ప సత్యాన్ని మాత్రమే అందుబాటులోకి తెచ్చుకోగలం, కారణం మనలో ఎవ్వరమూ ఉపనిషత్తులను ఏ కొంచెంగానో తప్ప అధికంగా అర్థం చేసుకోలేం.

CWSA 17: 361- 362

గీత - వేదాంతము

గీతలో శ్రీకృష్ణుడు వేదాంత తత్త్వజ్ఞానాన్ని సాంఖ్యతత్త్వ జ్ఞానాన్ని ఏకం చేయటాన్ని మనం చూస్తాం. ఆదునిక వైజ్ఞానిక శాస్త్రం మనిషికి ఆత్మ ఉందనే విష యాన్ని ఖండిస్తుంది. విజ్ఞానశాస్త్రం కేవలం ప్రకృతిలోని ధర్మాలను (సూత్రాలను) మాత్రమే పరిగణనలోనికి తీసుకొంటుంది. అది ప్రకృతిని భౌతిక పదార్థంగా, మనిషి కేవలం ప్రకృతిశక్తుల ఉత్పత్తిగా చెప్తుంది. అతడి చేతలన్నీ స్థిర నిర్ణీత సూత్రాల ఫలితాలు, అతడికి స్వతంత్రత లేదు. సాంఖ్యం ప్రకారం మనిషికి ఒక ఆత్మ ఉంది. అది ప్రధానంగా దివ్యపురుషుడే కాని పదార్థం కాదు. ఆత్మ చర్యల నాచరించదు. ఆత్మ ప్రశాంతమై, చలనం లేనిది. ప్రకృతి ఎల్లప్పుడూ స్థాన పరివర్తనం కలిగినది, మారుతూ ఉండేది. ఆమె ప్రభావంలో అన్ని క్రియాకలాపాలూ జరుగుతూ ఉంటాయి. ప్రకృతి కార్యాలను చేస్తుంది. మనిషి కేవలం తనకు తాను స్వతంత్రుడవగలిగేది అతడు దివ్యపురుషుడని గుర్తించినప్పుడు మాత్రమే. శ్రీకృష్ణుడు గీతలో సాంఖ్యముయొక్క ఈ సిద్ధాంతమును అనుసరణకు స్వీకతరించాడు ఆయన వేదాంత సిద్ధాంతమును అనుసరణకు స్వీకరించాడు. ఆయన వేదాంతమును కూడా అనుసరణకు స్వీకరించాడు. మనిషికి ఒక అమృతాంతరాత్మ ఉందని, కాని విశ్వజనీన అంతరాత్మ కూడా ఉందని ఆయన చెప్పాడు. మనిషి కేవలం భగవంతుని ఒక అంశ. అతడు కేవలం శాశ్వతం, అనంతం, సర్వ జ్ఞానవంతం, సర్వశక్తివంతం అయినదానిదేదో దాని అంశ. ఈ శాశ్వతశక్తి అనేదే యథార్థంగా ఉన్నటువంటిది. మనం చూసే, వినే, అనుభూతి నొందేది, చూసేది, కేవలం ఆయనను మాత్రమే

పరమేశ్వరుడు ఆయన మాయ ద్వారా ఈ లోకాన్ని నిర్మాణం చేశాడు. మనం మాయ అనిపిలిచే మహాభ్రాంతికి ఆయన ప్రభువు. దీనిని ఆతడు తనకు తానే అయిన ఏకమును ప్రకటించు కోవటానికి చేశాడు. మన చుట్టూ ఉన్నవన్నీ తాత్కాలికం. మార్పులేనిదీ, శాశ్వతంగా స్వేచ్ఛతో నున్నదీ సుఖం కలిగినదీ మనలో ఉన్నది. మనిషి తనకు తాను దైన్యానుభూతిని పొందితే దానికి కారణం అతడు తన అజ్ఞానంలో తనను తాను అహంకారం ఏలుబడికి ఆమోదం తెలుపడం మూలంగానే. సమస్తమూ తానేనని అతడు అనుకోవడమే కారణం. దైవమే ఈ లీలకు ప్రభువని అతడు తెలిసికొనడు. అతడు నేనే నా కర్మకు కర్త ననుకుంటాడు. నేనే ఈ నా శరీరానికి ప్రభువనుకుంటాడు. ఆ విధంగా ఆలోచించడం మూలంగా అతడు తన కర్మకు బద్ధుడు. ఆ శక్తుల చేతనే అతడు జన్మనుంచి జన్మకు తరమబడుతున్నాడు. మహాభ్రాంతి ఏమిటంటే తాను నివసించే ఈ శరీరమే తానని అనుకోవడం, తదుపరి అతడు తన మనస్సుతో తాదాత్మ్యం చెంది, ఆలోచించేది, చూసేది, అనుభూతి నొందేది తానేనని అనుకుంటాడు. గీతానుసారంగా, యధార్థంలో, భగవంతుడు ప్రతి ఒక్క ప్రాణి హృదయాంతరాళంలో ఉన్నాడు.

CWSA 8:48-49

పురాణాలు, తంత్రాలు

పురాణాలు, తంత్రాలు వాటికవే అత్యున్నతమైన ఆధ్యాత్మిక తాత్త్విక సత్యాలను కలిగి ఉన్నాయని చెప్పబడింది. ఆలోచనాపరుల వాదోపవాదాలలో వలె ముక్కలు చేయబడి, ఒక దానికొకటి వ్యతిరేకంగా వ్యక్తీకరించబడినవి కాదు, కాని సమ్మేళనం ద్వారా సంయోజనం చేయబడి, సర్వతో ముఖమైన భారతీయ మనస్సుకు ఆత్మకూ, అత్యంత అనుకూలంగా జోడించటం లేదా సమీకరించడం చేయబడింది. కాని చాలా తరచుగా ఇతిహాసము, కథ, ప్రతీక, నీతికథ, అలౌకిక క్రియ, దృష్టాంతముల ద్వారా జనరంజకమైన ఊహ, అనుభూతుల రూపంలో వాటిలోని ఏదో ఒకటి ఉండేటట్లుగా చేయబడింది. అపారమైన సంక్లిష్టమైన మానసిక ఆధ్యాత్మికానుభవానికి తంత్రాలలో నిర్దుష్టమైన రూపం ఇవ్వబడింది. అది దృశ్యరూపముల ద్వారా బలపరచబడింది. యోగాభ్యాసరూపాలలో వ్యవస్థీకరించ బడింది. ఇదే అంశం పురాణాలలో కూడా కనబడుతుంది. కాని చాలా పట్టు తక్కువగా ఉండి, తక్కువ శ్రమతో

కూడిన అంశాలతో పాత్ర పోషణ చేయబడింది. అఖరికి ప్రక్రియసమస్తం కేవలం వేద పద్ధతికి ఒక పొడిగింపు. మరియు మరొక రూపంలో గుణగణ ప్రవృత్తుల మార్పు మాత్రమే. పురాణాలూ భౌతికరూపాలు మరియు పాలన, ఆచార, అనుష్ఠానాల, ప్రతిదానియొక్క ప్రకృతికతీతమైన ప్రాధాన్యంతో కూడిన వ్యవస్థను నిర్మిస్తాయి. ఆ విధంగా గంగ, యమున, సరస్వతుల మూడు నదుల పవిత్ర సంగమం అంతరంగ సంగమానికి, మనో భౌతికప్రక్రియలోని ప్రధానమైన అనుభవానికి ఆలంకారికం. ఈ రకమైన ప్రతీకల వాడుకలో పొదుపరితనం సర్వసామాన్యంగా ఉండేవిధంగానే, దానికి ఇంకా ఇతర ప్రాముఖ్యతలుకూడా ఉన్నాయి. పురాణాలలోమనకు ఖండితంగా చెప్పబడిన రీతిలో ఎంతో విచిత్రంగా వర్ణించబడిన భౌగోళిక పరిస్థితులు. ఒక అద్భుతమైన కావ్యాలంకరణ, ఆంతరంగిక మనోమయ విశ్వంయొక్క ఒక భౌగోళిక ప్రతీక. వేదాలలో మాదిరిగానే ఒక్కొక్కప్పుడు సరిగ్గా భౌతిక విశ్వపు పరిభాషలో వర్ణించబడిన జగదుత్పత్తికి ఒక ఆధ్యాత్మిక, మానసిక అర్థమూ, ప్రాతిపదికా ఉన్నాయి.

CWSA 20: 374-75 *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*
(8639198298)

ఇతిహాసములు: రామాయణము, మహాభారతము.

ఇతిహాసము ఒక ప్రాచీన చారిత్రాత్మక లేక పౌరాణిక ఐతిహ్యము అయితే, అది ఏదైనా ఆధ్యాత్మిక మతపరమైన లేక నైతిక లేక ఆదర్శాత్మక అర్థాన్ని తెలుపుతూ మహత్వ పూర్ణ పురాణములేక కథగా పనిచేసి ప్రజల బుద్ధిని తీర్చిదిద్దే విధంగా తయారుచేయబడింది. రామాయణ, మహాభారతములు ఒక మహత్తర లక్ష్యంతో విస్తృత పరిధిలో ఈ విధమైన ఇతిహాసములే. ఈ మహత్తర కావ్యములను రచించిన కవులు కాని లేక వాటికి మరింత జతచేసినవారు కాని కేవలం ప్రాచీన గాధలను అందంగా లేక ఉదాత్తంగా చెప్పాలని అనుకోక, కావ్యాన్ని అభిరుచి పూర్ణంగా అర్థవంతంగా తయారుచేయాలని కూడా అనుకోకుండానే ఈ రెండింటిని వారు విజయవంతంగా నిర్వర్తించారు. మానవ జీవన నిర్మాతలవలె శిల్పులవలె సృజన శీలురులవలె జాతీయ ఆలోచనా సరళి మతము, నీతి, సంస్కృతులయొక్క ప్రముఖ రీతుల సృజనాత్మక నిర్వాహకులవలె వారు తమ రచనా కార్యమందు నిమగ్నులయ్యారు. మానవ జీవితముగూర్చి ఒక ప్రగాఢ ఆలోచనను మతము,

సమాజముపై ఒక విస్తార పూర్వక శక్తివంతమైన దృక్పథమును, ఒక విధమైన దార్శనిక ఆలోచనా ఒత్తిడిని ఈ కావ్యముల ద్వారా ప్రవహింపజేయడమేగాక ఒక గొప్ప బౌద్ధిక భావన సజీవ ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రకటనల గొప్పశక్తీ మొత్తాన్ని వానిలో నిక్షిప్తం చేసారు. మహాభారతము పంచమవేదమని చెప్పబడింది, ఈ రెండు కావ్యములను గూర్చి అవి కేవలము రెండు గొప్ప కావ్యములుగా మాత్రమే కాక అవి గొప్ప ధార్మిక, నైతిక, సామాజికవిద్య రాజనీతి గరిపే ధర్మ శాస్త్రాలుగా ప్రజల జీవితాలపైన బుద్ధిపైన అవి ఎంత ప్రభావం పట్టు సాదించాయంటే అవి భారతీయ ప్రజల బైబిల్ గా వర్ణించబడ్డాయి. అది నిజంగా సరియైన ఉపమానం కాదు. ఎందువలనంటే భారతీయ ప్రజల బైబిలుగా వేదములు, ఉపనిషత్తులు పురాణములు, తంత్రశాస్త్రము, ధర్మశాస్త్రములు కూడా పేర్కొనబడ్డాయి. ప్రాదేశిక భాషలలో పెద్దమొత్తంలో ఉన్న మతపరమైన కవిత్వం గురించి చెప్పనే అక్కర్లేదు. ఈ కావ్యముల పని గొప్ప వేదాంత పరమైన నైతిక భావనను సాంస్కృతిక అభ్యాసాన్ని ప్రజాదరణ రూపొందేటట్లు చేయడం. ఒక గొప్ప కావ్యరూపంలో ఒక కావ్యాత్మక కథ నేపథ్యంలో ఆత్మపరంగా, ఆలోచనా పరంగా కూడా మహోన్నతమైన ప్రతినిధి వ్యక్తిత్వాలుగా, జాతీయ జ్ఞాపకాలతో ప్రజలను కట్టి పడేసినవిగా, వాస్తవిక జీవితాన్ని, కల్పనా సృష్టిని, ఆదర్శబుద్ధిని యధార్థంగా లేక భారతీయ సామాజిక, రాజనైతిక ధార్మిక సంస్కృతి గుణగణాన్ని ప్రకాశవంతంగా అవి ప్రస్ఫుటీకరిస్తాయి. వీటన్నింటినీ క్రోడీకరించి కావ్యరూపంలో కళాత్మకశక్తి తో ప్రభావాత్మకంగా పారంపరికంగా సగం పౌరాణికంగా, సగం చారిత్రాత్మకంగా చెప్పినా అప్పటినుండి ప్రజలచే అవి ప్రగాఢమైన వారి మతభాగంగా, జీవన సత్యంగా, సంతోషప్రద జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. మహాభారతము, రామాయణము ఆ విధంగా మూలంలో సంస్కృత భాషలో రచించబడినవైనా ప్రాదేశిక భాషలలో తిరిగి వ్రాయబడినా జనం వద్దకు కథకులచే, పాటగాళ్ళచే చదువులచే, వ్యాఖ్యాతలచే కొనిపోబడి ప్రాచుర్యతపొందిన విద్య, సంస్కృతుల ప్రముఖ ఉపకరణాలుగా ఉండి ప్రజల ఆలోచనా సరళిని, శీలాన్ని వారి ధార్మిక సౌందర్యపర ఆ వేగాన్ని, కవిత్వాన్ని కల్పితకథరూపాన్ని, ప్రణయాల్ని రుచి చూపించాయి. వేదములలోను ఉపనిషత్తులలోను సుసంస్కృతి అత్యంత గంభీర దార్శనిక సూత్రాలలోను, ప్రబంధములు లేక ధర్మ శాస్త్రాలలోనో, అర్థ శాస్త్రంలోనో బంధింపబడిన విషయాలు ఇచట సజీవరూపాలుగా సృష్టించబడి,

సుపరిచిత కథతోను, ఇతిహాసముచోను ముడివడి వైవిధ్య భరిత జీవన ప్రాతినిధ్యత్వంతో కలపబడిన కారణముగా సన్నిహిత జీవనశక్తిగా తయారయి ప్రతి ఒక్కరూ దానిని వెంటనే తమతమ ఆత్మకు కల్పనకు, తెలివితేటలకు హత్తుకునే ఆ కావ్యశబ్దాన్ని జీర్ణించుకోగలిగారు.

CWSA 20: 345-347 — *శ్రీఅరవిందులు*

సనాతన ధర్మము మరియు యోగము

యోగసారము

కేవలము కానవచ్చే వాటియెడల .యెరుక కలిగి ఉండే సాధారణ చేతననుండి యదార్థముల యెడల మరియు ఆ ఒకే ఒక్క సత్యము యెడల యెరుక కలిగి ఒక ఉన్నత, విశాల లోతైన చేతనలోనికి సాగడమే యోగసారము. కంటికి కనిపించే విషయాన్ని అనుసరించి వాటితో బ్రతక కుండా కేవలము మనము దానిని గూర్చి యెరుక కలిగి ఉండడమే కాక, దానిలో వసించి, దానికనుగుణంగా పనిచేస్తాము. యోగము అజ్ఞానమునుండి ఆత్మజ్ఞానమునకు, బాహ్యమునుండి మన సత్యగత ప్రాణికి, బాహ్యఅద్భుత, మానసిక, ప్రాణిక, భౌతిక జీవన అస్తిత్వమునుండి ఆంతరిక ఆధ్యాత్మిక అస్తిత్వానికి మరియు ఆధ్యాత్మిక స్వభావానికి సాగే మార్గము.

యోగము వలన దృగ్గోచరమైన దానినుండి నిజమైన మనిషి అవుతాం. కంటి కగుపడే మన నిజ బాహ్య ప్రకృతి చేతననుండి మన నిజ అంతః చేతనకి, ఆత్మకి, ఏదయితే శాస్వతమైన సత్యమైన మనమో అటువంటి మన ఆంతర అంతరాంతర పురుషునిగా మారగలుగుతాము.

ఈ తాను లేక సత్యగత ప్రాణి మన దృగ్గోచర అస్తిత్వ అన్ని మార్పులలోను, మనః ప్రాణ, లేక దైహిక పరివర్తనలోను లేక మనకానవచ్చే వ్యక్తిత్వముయొక్క మార్పులలోను సదా శాశ్వతముగా నిరంతరముగా ఆ చిరంతనుని అంశగా అభివ్యక్తిగా ఉంటుంది. యోగముద్వారా మనము మన దృగ్గోచర రూపము లేక విశ్వరూపము లేక మన చుట్టుప్రక్కల ప్రపంచమునుండి దాని సత్యగత చేతనకి వెడలగలుగుతాము. మనం చూసే వినే, అనుభవించే దాని నంతటి నిజమైన సత్యమగు విశ్వగత ప్రాణి

లో లేక దానిలో ఈ ప్రపంచం ఒక అభివ్యక్తిగా మనం తెలుసుకోగలుగుతాము. ఏదయితే జగత్ ఊర్జం, ఒక జగదాత్మ లేక ఆధ్యాత్మ జగత్ దైవము జగదధి దేవ త అనబడుతుందో ఆ జగశ్చేతన యెడల కూడా జాగరూకులవుతాము.

కాని యోగము ద్వారా మనము మనలని తెలుసుకొనడమే కాక, మనస్వీయాత్మ లేక యధార్థ అస్తిత్వం జగదాత్మ జగతధ్యాత్మతో, యేకమని, మన ప్రకృతి ఈ జగత్ప్రకృతి ఒక ఆట అని తెలుసుకున్నప్పుడు మనమధ్య, ప్రపంచం మధ్య ఉన్న గోడ మాయమవడం ప్రారంభించి పూర్తిగా నశిస్తుంది. మనం మనలో, ఇతరులలో మొత్తం ప్రపంచం యొక్క అస్తిత్వంలో మన వలె ఉన్న ఆ సర్వదేవతా భావనని తెలుసుకోగలుగుతాము.

కాని యోగము వలన మనం మన వ్యక్తిగత అస్తిత్వం కంటే అధికమైన జగదస్తిత్వం కన్న అధికమైనదేదో అయిన మన లేక విశ్వ సృష్టి మీద ఆధారపడని ఒక పురుషోత్తముడు లేక సత్ ని తెలుసుకొంటాము. మన అస్తిత్వం ఆ సత్తయొక్క, మరియు ఆ సత్త యందే ఆవిర్భవించినది. ఈ బ్రహ్మాండము కూడా ఆ ఒకే ఒక అస్తిత్వమునందలిది, దానియొక్క ప్రాదుర్భావము.

CWSA 12; 330- 331 — *శ్రీఅరవిందులు*

భావానువాదం: డా. విజయలక్ష్మి (9894020952)

యోగం అంటే ఏమిటి?

యోగం అంటే ఏమిటి? అది ఒక ప్రత్యేకమైన ప్రక్రియ కాదు. మనం యోగం అనుకోగానే, తనని తాను ఒక గుహలో బంధించుకొని, కొన్ని సాధనలకు స్వయంగా లోబడి వుండువాడు, తనని తాను అన్ని బంధాలనుంచి విముక్తుణ్ణి చేసుకొన్నవాడు, అని వూహించుకొంటాం. కానీ శ్రీకృష్ణులు యోగాన్ని మరో నేపథ్యంలో ఉపయో గిస్తారు. ఆయన అంటారు. పనే యోగమని. ఇందులో మొదటి అంశం 'సమత.' సమత అంటే సంతోషాన్ని , దురదృష్టాన్ని పొగడ్తని, నిందారోపణి గౌరవాన్ని, అగౌరవాన్ని జయాన్ని, అపజయాన్ని సమదృష్టితో చూడగల్గడం. నీవు వీటిలో దేనినీ ఏ మాత్రం పరిగణలోనికి తీసుకోకూడదు. కానీ ఒక ప్రశాంతమైన స్థిరనిశ్చలమైన మనసుతో నీకు కేటాయించిన పనిలో ముందుకు సాగాలి. లోకం యొక్క పొగడ్తకాని, ఆక్షేపణగానీ నిన్ను విచలితుణ్ణి చేయకూడదు. ఎవరయితే సమతను కల్గి వుంటారో

వారికి మిత్రులుగాని శత్రువులుగాని ఉండరు. అతడందరినీ సమభావంతో చూస్తాడు. ఎందుకనగా అతడు అంతర్ముఖంగా తనను తాను పరిశీలించుకుంటాడు. తదుపరి ప్రపంచంపై దృష్టి సారిస్తాడు. అతను తనని తాను అన్నిటా దర్శించుకుంటాడు. సర్వాన్ని తనలో గుర్తించుకుంటాడు. తనని తాను అన్నిటిలో ఎందుకు దర్శిస్తాడంటే అన్నింటిలోనూ భగవంతుడున్నాడు. కాబట్టి అతడికి ఉన్నత స్థాయికి చెందిన వారిని లేక నిమ్నస్థాయికి చెందిన వారిని చూసినా ఎలాంటి భేదభావం ఉండదు. అంతేకాక అతను ప్రతి జీవిలోను నారాయణుని దర్శిస్తాడు. వస్తువులోని ప్రతి అణువులో ఉన్న దైవంలో తానొకడనని గ్రహిస్తాడు. ఒకవేళ ఏమైనా తేడాలున్నా అవి తాత్కాలిక మయినవి, బాహ్యమయినవే. అతడు ఆ వాసుదేవుడు తన కోర్కెలను ఎవరిద్వారా అయితే నిర్వర్తిస్తాడో అతడు ఆ వాసుదేవుడే అని గ్రహిస్తాడు.

యోగమంటే ద్వంద్వత్వం నుంచి స్వేచ్ఛ పొందడం. యోగి సుఖ దుఃఖాలకోప తాపాల ఇష్టాయిష్టాల మమకార బంధాలనుండి ముక్తుడు. ఎందుకంటే అతను అందరినీ సమదృష్టితోనే చూస్తాడు. కాబట్టి అతడు దురదృష్టానికి దుఃఖానికి క్రుంగిపోడు. సంతోషం కలిగినా అసంతృప్తి కలిగినా చలించడు. అతడు శారీరక బంధనాలనుంచి విడివడి వుంటాడు. ఎందుకంటే ఏ మనిషైనా అతనికి ఆనందాన్ని కానీ, దుఃఖాన్ని కానీ కలిగించలేడు. ఎందుకంటే సంతోషాన్ని ఆనందాన్ని అందించగలిగే శక్తి అతనికి ఉన్నది. ఆ స్వేచ్ఛనే యోగం ఇస్తుందని 'గీత' చెబుతుంది. దానినే మనం సాధారణంగా ముక్తి అని పిలుస్తాము. గీత హామీ ఇచ్చేది, ఈ స్వేచ్ఛనే గీతాచార్యు డంటాడు. నీవు యోగంలో పనిచేస్తే నీవు దుఃఖాన్నుంచి బాధనుంచే గాక అన్నిటినీ అదిగమిస్తావని, భయం నుంచి లేక పాపాన్నించి విముక్తిని పొందుతావు. ఎందుకంటే నీవు నీకోసం పనిచెయ్యవు కాబట్టి. నీకు సంతోషం కలుగుతుందని పనిచేయవు. భగవంతుడికోసం చేస్తావు. ఆ విధంగా నువ్వు యోగాన్ని చేరుకొంటావు. నీవు సంతోషంగా వుండాలనుకుంటే నీ పనులన్నింటినీ భగవంతుడికి వదిలివేయాలి. నీవు నీ పనులన్నింటినీ భగవంతుడి కోసమే చేయాలి. అందువలన ఏ పాపము నిన్ను అంటదు. కేవలం స్వార్థపరతతోనే పాపమంటుకుంటుంది. ఎప్పుడయితే నీవు ఆ నారాయణుడు అన్నింటావున్నాడని గ్రహించగల్గుతావో అపుడే అల్పమైన పరిమితి చెందిన వ్యక్తిగత 'నేను', నీ నుండి వదిలిపోతుందనేది తథ్యం. నీ కపుడు విశాల దృక్పథం కలుగుతుంది. నిన్ను నీవు ఒక కుటుంబంలో, ఒక సమాజంలో, ఒక

మానవజాతిలో, ప్రపంచంలోని అన్నింటిలోను చూసుకోగలవు. నిన్ను నీవు పూర్తిగా మరచిపోగలవు. నీవు మానవ జాతికోసం, ఇతరులకోసం, పనిచేస్తావు. నువ్వెప్పుడయితే కేవలం నీ స్వార్థాన్ని అనుసరిస్తూ పనిచేస్తావో, అదెప్పటికీ దైవకార్యం కానేరదు. గీత ఇలా చెబుతుంది. "నీ సంక్షేమం భగవంతుడి బాధ్యత", అని నీవు దైవంకోసం పనిచేస్తే, నీకు భయం వుండదు. ఎందుకంటే భగవంతుడు తన దయాపూరిత హస్తాన్ని నీ వైపు చాచి వుంచుతాడు కాబట్టి. యోగం నిన్ను ఈ స్థాయికి తీసుకువెళ్తుంది. గీత బోధను నీవు అనుసరించినట్లయితే, అది నిన్ను పాపపు దారులనుంచి దుఃఖాన్నించి ముక్తి కలుగజేస్తుంది.శ్రీకృష్ణులంటారు. నన్నే శరణుపొందు. నేను నీకు సర్వ పాప కర్మలనుండి ముక్తిని ప్రసాదిస్తాను. ప్రతి పని ఒక యజ్ఞంగా నాకు సమర్పించు." ఆ లక్ష్యం వైపుకే నీవు వెళ్తావు. హరి నామమే నిన్ను సర్వ దురవస్థల్నుంచి కాపాడుతుంది.

CWSA 8: 51- 52

పాక్షిక, సంపూర్ణ, యోగము

యోగం అంటే సంయోగం. యోగం యొక్క లక్ష్యం ప్రాకృతిక మానవుని అంతరాత్మను పరమాత్మతో ఐక్యం చేయటం. మానవజాతి ప్రస్తుత స్వభావాన్ని పరమాత్మతోను లేక దివ్యప్రకృతితోను ఏకం చేయడం. ఎంత ఎక్కువ కలయిక ఉంటుందో అంత ఎక్కువగా యోగం సమకూరుతుంది. కలయిక అంత సంపూర్ణమైతే, యోగం అంతగా సంపూర్ణమవుతుంది. ఆ సర్వ శ్రేష్టునిపై వివిధ రకాలయిన భావనలున్నాయి. ప్రతి భావనకి అనుగుణంగా ఒక్కో యోగశాస్త్రి విధానం ప్రత్యేకమైన భావనతోను, శిక్షణతోను వుంటుంది. కానీ ఇవన్నీ పాక్షికమైన విధానాలే. సంపూర్ణమైనవి. కావు, లేదా అవి వాటికవే సంపూర్ణత్వాన్ని కలిగి వుంటాయి. కానీ అవి పూర్తిగా మానవ అస్తిత్వాన్ని స్వభావాన్ని వ్యక్తీకరించవు. అవన్నీ చాలావరకు వ్యక్తిని జీవితం నుంచి దూరం చేస్తాయి. ఎవరయితే మానవ ఉనికిని తప్పించుకొని మరొక అస్తిత్వానికి చెందిన ఆనందాన్ని కోరుతారో, వారికి ఉపయుక్తమవుతాయి. మానవ జాతికి ఇలాంటి యోగంతో నిజమైన సందేశం అందదు. పూర్ణయోగం అంటే ఈ లోకంలో భగవంతుణ్ణి పూర్తిగా అంగీకరించడం జీవులందరితోను ఏకత్వాన్ని పొందటం, యావత్ మానవజాతితో సంఘీభావం కలిగి వుండటం జీవితాన్ని సృష్టిని దైవ

చేతనతచే నింపడం. మానవుడిని వ్యక్తిగతంగా వృద్ధి చెందించడమే కాక మానవ జాతిని మొత్తం పరిపూర్ణతవైపు నడిపించడం

CWSA 12:334-335 శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మల లక్ష్మి (9014239277)

సనాతనధర్మంయొక్క అంతర్గత సత్యాలు

ఒక్కడే దైవం - అనేక దేవతామూర్తులు

భారతీయమతం భగవంతుడు కాలాతీత. నామ రహిత, నిరాకారుడనే మూలంపై స్థాపించబడింది. కానీ, అటు తరువాత కాలంలో ప్రాచుర్యానికి వచ్చిన సంకుచితం, అజ్ఞాన భూయిష్టమగు వర్గాలు కొన్ని సూత్రీకరించినట్లుగా నిత్యుడు, శాశ్వతుడు, అనంతుడు అగు భగవంతునికి వేర్వేరు రూపాలు, నామాలు, శక్తులు, వ్యక్తిత్వాలు ఉండవని ఒకవేళ ఉన్నా, అవి రద్దు చేయబడాలి. అన్న భావ జాలాన్ని హిందూమతం స్వాగతించలేదు. ఒక రాగరహితమైన లేక వెలవెల బోయిన, అనిశ్చితమగు అతీతమైన ఆస్తికవాదం దాని ఆరంభదశగాని, మధ్యంతరదశగాని సమాప్త దశగాని కాదు. ఒకే దైవం సమస్తమైనదిగా పూజింపబడింది. కారణం, ప్రపంచమందున్నదంతా అతడే లేక అతని అస్తిత్వంనుండి లేక అతని ప్రకృతి నుండి రూపొందించ బడినదే, అందువలన భారతీయ మతం ఆత్మ వికాసంలేకుండా మూర్తిపూజలు చేసే అనాగరిక ఆటవిక సాంప్రదాయం కాదు. కారణం అది దాని విశ్వాత్మకమగు విశ్వాసాన్ని మించిన శాశ్వతుడగు పరమాత్మపై విశ్వాసం నిలుపుకుంది. భారతీయ బహు దేవతారాధన విధానం ప్రాచీన ఐరోపాఖండ మందు ప్రాచుర్యంలో నున్నట్టిది కాదు. ఎందుకనగా ఇచట మనుషులు బహు దేవతారధకు లైనప్పటికీ ఆతని దివ్యలక్షణాలన్నీ ఆ ఏకైకునియొక్క అనేక నామాలు, వ్యక్తిత్వాలు శక్తులు అనే అవగాహన వారుకుంది. వారి సర్వ దేవతామూర్తులు ఆమూల పురుషుని నుండి ప్రభవించినవే. అవి అతని దేవీమూర్తులు ఆ ఏకైక దివ్యశక్తియొక్క బలాబలాలు అని వారికి తెలుసు. ఆ భారతీయ మతారాధన వ్యవస్థ మార్గాలు చాలా వరకు ఆస్తిక మతంయొక్క జనాదరణ పొందిన పద్ధతులను పోలి వుంటాయి. అవి అంతకే పరిమితమైనవికావు, అంతకు

మించి మేలైనవి. ఎందుకనగా పరమాత్మ యొక్క అనేక లక్షణాలను వేటినీ అవి విసర్జించవు. మీదు మిక్కిలి స్వాగతిస్తాయి. భారతీయ విగ్రహారాధన విధానం ఒక అనాగరికమైన లేక పరిణితి చెందని మనస్సుది కాదు. ఎందుకనగా అపారమైన అజ్ఞానంతో మెదిలే వారికి సైతం విగ్రహం కేవలం ఒక చిహ్నమని ఒక ఆధారమని, దాని ఉపయోగం ముగియగానే దానిని విసర్జించవచ్చునని తెలుసు. .....

CWSA 20; 192

సాకార, నిరాకార దైవాకృతులు రెండూ ఒకే పరమసత్య స్వరూపం

దైవం గురించి మనుషులకుండే భావము తమకుగా రెండుగా విభజింపబడ్డాయి. మొదట, సాకార ఆరాధనగాను, నిరాకార దిశగా ఆకాంక్ష గలదిగాను, తరువాత సగుణాత్మకుడి ఆరాధనగాను నిర్గుణుడు గుణాతీతుడు పట్ల అపురూపమైన, అరుదైన జీవాత్మలకు కలిగే ప్రేరేపణగాను విభజించబడ్డాయి. ఈ స్థాయిలకు తాంత్రికపూజా విధానం వర్తనా నియమావళి తగినంత సమకూరుస్తుంది. అయితే మతపరంగా వాదించే హేతువాది ఈ ప్రశ్న నడుగవచ్చు. నిరాకారుడు అగు దైవం తనకు తానుగా అ విధంగా రూపాన్ని ధరించగలడు? ఈ విశ్వంయొక్క ఉనికి అందుకు సమాధానం. హిందూమతం నారాయణుడిని రాతిలో చెట్టులో, జంతువులో మానవునిలో పూజిస్తుంది. ఇతర మతాలు ఏ మేధాపరమైన ఆధ్యాత్మిక పరమైన గర్వాహంకారంతో, తీక్షణతతో దేనికైతే చిత్తగిస్తామో, దానినే హిందూమతం ఒక తార్కిక తీక్షణతతో తనకు గర్వ కారణమైన దానిగా తులతూగుతూ చెట్లు రాళ్లు చతుష్పాద జంతువు, మానవుడు — ఇవన్నీ మనకు దైవసమానులు. మకు దైవికమైన సహోదరులు, సర్వ శక్త్యాత్మకుడగు దైవం ధరించడానికి విముఖత చూపని రూపాలు. కాని భౌతిక రూపాలను మించిన ఇతర కాల్పనికమైనవి, చిహ్నరూపమైనవి ఎన్నో ఉన్నాయి. అయితే అవి తక్కువ స్థాయికి చెందినవేమీ కావు, ఒక విధంగా అధిక వాస్తవికత గలవి, భౌతికంగా వ్యక్తపడేవాటి కన్నా అధిక దైవశక్తి గలవి. మనం దైవాన్ని మానసిక మూర్తుల రూపంలో పూజిస్తాము. హిందువు అన్నవాడు తాను తన భక్తిభావనను ఏ రూపానికి అంకితం చేస్తాడో, దైవం ప్రేమపూర్వకంగా ఆ రూపాన్ని తప్పక ధరించి తీరుతాడు, దానిని జీవంతో ఉట్టిపడేలా చేస్తాడు అని నమ్ముతాడు. అట్టి నమ్మకం అర్థరహితమైనదని అనలేము. ఎందుకనగా ఈ విశ్వమందు దైవికమైన చేతన ఒకటి

ఉన్నట్లయితే, అందుకు అతీతమైనదేదో ఈ జీవు లందరికి ఆర్తిపూర్వక అభిలాషకు స్పందించ గలిగితే, బహుశా అది స్వయంగా మాతాపితరులు, స్నేహితుడు, ప్రేమికుడి కుండే సహజ ప్రేమతో, వీటన్నింటి ప్రేమను మించిన ప్రేమతో ఈ జీవు లందరి పట్ల అభిలాష చూపినప్పుడు దైవం తన స్వీయ సంతోషార్థం, వైభవం కోసం విశ్వం యొక్క వివిధ రూపాలను ధరిస్తాడనో లేక సృష్టిస్తాడనో ఊహించటం నిరర్థక మవుతుంది. కానీ ఆరాధకుడు ప్రేమతో తనకు అర్పించినవాటిని నిరసించి నట్లయితే అది తన గౌరవానికి, పవిత్రతకు భంగం వాటిల్లినట్లుగా దైవం భావిస్తాడు. కారణం తానే స్వయంగా వాటిని ఆరాధకుడి హృదయంలోనో లేక భావనలోనో రూపొందించాడు కాబట్టి. ఈ మానసిక కల్పనా రూపాలకు మానసిక పూజ అర్పించ వచ్చు. ఇది అత్యున్నతమైన మార్గం లేదా ఒక భౌతికమైన ఆధారాన్ని సమకూర్చవచ్చు అనగా ఒక శిలాప్రతిమను లేక చిత్రపటాన్ని ప్రతిష్టించవచ్చు. ఆ విధంగా ఒక భౌతిక ఆరాధనా కార్యక్రమానికి భౌతిక స్థిరత్వం కలిగించవచ్చు.

నిరాకారంలో సైతం దైవాన్ని అర్చిస్తాము. అతని లక్షణాలలో, అతని దైవ ప్రేమలో, దివ్యశక్తిలో, దివ్యానందంలో, దివ్యజ్ఞానంలో, విశ్వగతమైన ఆతని దివ్యసిద్ధాంతాల కనుగుణంగా జ్ఞానేనేత్రానికి అతను ప్రకటితమయ్యే విధంగా పూజిస్తాము. ఈ లక్షణాలతో కూడివున్నవాడిగానో లేక ఆ లక్షణాలు బహిర్గతంగా కనిపించని దివ్యవ్యక్తిత్వం గలవాడిగానో పూజిస్తాము. గీతలో ప్రవచించబడిన విధంగా శిఖరాగ్ర స్థాయిని మించిన పరాకాష్టస్థితికి ఎదిగినప్పుడు గ్రహించగలిగినట్లుగా అరూపుడిగానే గాక నిర్గుణుడిగా, అనిర్దేశ్యుడిగా గ్రహించ గలుగుతాము. మానవసహజమైన అజ్ఞానంలో మనకు కలిగే మానసిక ప్రకోపాలతో ఈ విషయాలకు అంతస్తులు ఘనతలు, ఆధిక్యతలు, ప్రత్యేకతలుగా వర్గీకరించి, ఫలానిది శ్రేష్టమైనది అని అంటాం. ఇది అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న అధమస్థాయికి చెందిన అంతరాత్మలకు వర్తిస్తుంది. ఆస్తికుడైనవాడు సాకార ఆరాధకుడిని, మనిషిని గొలిచేవాడిని, విగ్రహారాధకుడిని, బహుదేవతారాధకుడిని నింద్యార్హుడిగా చిన్నచూపు చూస్తాడు. అద్వైతుడు సగుణాత్మక లక్షణాన్ని ఆరాధించడంతో సంతోషంతో సంతృప్తి పొందే ఆస్తికుడి అజ్ఞానాన్ని ప్రశాంత చిత్తంలో, సహనంతో చిన్నచూపు చూస్తాడు. కానీ దైవం దేనినీ నిరసించడని, అన్నింటా నుండే సర్వాత్మకుడు ఒక చిన్నపిల్లవాడు ప్రార్థనలో లేక దైవంయొక్క చిత్రపటమందు పత్రాన్నో, పుష్పాన్నో నివేదించడంలో ఎంత ఆనందం పొందుతాడో,

ఒక వేదాంతి తన ఆలోచనల శిఖరాగ్ర స్థాయి నుండి అనిర్వచనీయమైన, అగ్రాహ్యమైన స్థాయికి గెంతడంలో అంతే ఆనందం పొందుతాడు. ఎవరైతే పై స్థాయికి ఎదిగి, హద్దులు లేని సిద్ధిని పొందిన స్థాయిని అందుకోగలిగి తమను తాము విస్తృతపరచుకొన్న ప్పటికీ చిన్నపిల్లాడి హృదయాన్ని నిలుపుకో గలిగి, దైవంయొక్క బహురూపాలను దర్శించగల సత్తాను కలిగి వుంటాడో, అతడే అత్యుత్తమ కార్య సాధకుడు.

CWSA 20:572-73

అపరా విద్య, పరావిద్య (అధమ స్థాయికి, ఉన్నత స్థాయికి చెందిన జ్ఞానం

మేధోపరమైన గర్వాహంకార ప్రభావానికి లోనై ఉన్నవారు, సహేతుకంగా ఋజువు చేసే లక్షణాన్ని మనుషులు ఉత్తమోత్తమమైన మార్గదర్శకం కాదని చులకన చేసినప్పుడు, దిగ్భ్రమ చెంది చలించిపోతారు. సంస్కారవంతుడగు మనిషి అట్టి లక్షణాన్ని చులకన చేసి చూడడం భగవంతుడు అని పిలువబడే అన్య ప్రభావం గొప్పదని పొగడటం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నిస్తారు. అయితే ఈ విధంగా అనుమానించేవారు పాశ్చాత్యదేశీయమైన భౌతికవాదంతో ప్రభావితులైనవారు. అది మనిషిని అతనిలోని భౌతిక భాగానికి పరిమితం చేయడానికి ప్రయత్నిస్తుంది, అతనికి దైవికమైన మూలాన్ని, దైవికమైన గతిని పొందే సంభావ్యతను తిరస్కరిస్తుంది. ఎప్పుడైతే ఐరోపా ఖండం క్రైస్తవ మతాన్ని ఒక సన్యసించిన వ్యక్తికి, ఒక సర్వసంగ పరిత్యాగికి వదిలివేసి ఖగోళ శాస్త్రజ్ఞుడగు గెలీలియో సిద్ధాంతాలను విస్మరించిందో అది స్వయంగా తనకు ఒక భయంకరమైన గతిని దాపురింప జేసుకుంది, ఇప్పటికీ ఆ గతి నుండి బయల్పడ లేదు. మానవునిలో నున్న దైవమే సమస్త జ్ఞానసంపద, అతడే సమస్తమైన మతం. దేనినైతే క్రైస్తవ మతం అస్పష్టంగా బోధించిందో దాని ని హైందవమతం మేధకు వేదాంత రూపంలో సుస్పష్టం చేసింది.

ఎవరైనా మనలను కేవలం బుద్ధికుశలత గల జీవులుగా పరిగణించితే అతడు హిందువు కాదు. హిందూమతం బుద్ధి కౌశల్యం యొక్క శ్లాఘనీయతను దైవాన్ని ఎప్పుడూ చూడనివారికి వదిలేస్తుంది. హిందూమతం కేవలం దైవంయొక్క ఔన్న త్యాన్ని, ఆతని సర్వం సహా ఆధిపత్యాన్ని మాత్రమే చాటాలని ఆతనిచే ఆదేశింప బడింది, ఆ విధంగానే వేల సంవత్సరాల తరబడి చేస్తూ వుంది. మనం ప్రప్రథమంగా

ఐరోపా విద్యావిధానాన్ని ఎప్పుడు స్వీకరించామో అప్పుడే మనల్ని మనం విజ్ఞానశాస్త్రి వెలుగులో పెడదారి పట్టించుకున్నాం. విజ్ఞానశాస్త్రి పరిజ్ఞానం కేవలం ఒక చిన్న గదికి మాత్రమే పరిమితమైన కాంతి లోకాని కంతా వెలుగు నిచ్చే సూర్యుడు కాదు. అపరావిద్య అనునది కేవలం విజ్ఞానశాస్త్రిం యొక్క సంక్షేప జ్ఞాన భాండారం. అయితే దానిని మించిన ఉన్నతతరమైన విద్య ఒకటి ఉన్నది, ఒక అమోఘమైన జ్ఞానసంపద ఉన్నది. మన మెప్పుడైతే నిమ్నస్థాయికి చెందిన జ్ఞానానికి ప్రభావితమై వుంటామో అప్పుడు సమస్త కార్యనిర్వహణ మనమే గావిస్తున్నామని ఊహిస్తాం, మనమే స్థితిలో నున్నామో దానిని హేతుబద్ధంగా సమర్థించడానికి ప్రయత్నస్తాం, మన బుద్ధికుశలత ఎంతో శ్రేష్టమైనదని, సర్వశక్తివంతమైనదని తలుస్తాం. కానీ ఇది కేవలం ఒక భ్రమ, ఒక మహా మాయతో ఆవరింపబడిన వైఖరి. ఎవరైనా ఒక్కమారు దైవంయొక్క వైభవాన్ని తమలో అనుభూతి చెందినట్లయితే వారు ఎన్నటికీ మేధ దానికన్నా శ్రేష్టమైనదని నమ్మడు. ఒక ఉన్నతమైన గళముంది, నిర్వివాదమైన, నిశ్చయంగా జరిగితీరే దివ్యవాణి ఒకటి ఉంది. దైవం వసించేది హృదయంలో, పనిచేసేది మేధాశక్తి ద్వారా. అయితే మేధ ఏది ఆలోచించినా హృదయానికి ముందు తెలుస్తుంది. మేధాశక్తిని అధిగమించి హృదయం దాకా ఎవరైనా వెళ్లగలిగితే వారు భగవంతుని గళాన్ని వినగలరు,

CWSA 8-7:891-92

మూడు ప్రధాన ఆలోచనలు

మతపరమైన భారతీయ ఆలోచనా విధానంయొక్క సంయోగలక్షణాన్ని, అభేదతా భావనతో దేనినైనా ఆదరంతో స్వీకరించే లక్షణాన్ని నొక్కి చెప్పే అవసర ముంది ఎందుకనగా అలా చేయకపోతే భారతీయజీవిత గమనంయొక్క ఉద్దేశాన్ని, భారతీయ సంస్కృతియొక్క సంవేదనను పొందే అవకాశం మొత్తం కోల్పోతాము. విశాలమైన, రమ్యమైన ఈ లక్షణాన్ని గుర్తించడం ద్వారా మాత్రమే సమాజజీవనం పైన, వ్యక్తిగత జీవనశైలి పైన దానికి గల సంపూర్ణ ప్రభావాన్ని తెలుసుకో గలుగుతాం. ఒక వేళ మనల్ని మనం ఈ విధంగా ప్రశ్నించుకొన్నట్లైతే, "ఇంతకీ హిందూత్వం అంటే ఏమిటి, అది బోధించే దేమిటి, అచరించే దేమిటి?" మన మీ విధంగా సమాధాన మీయవచ్చు. భారతీయ మతం మూడు ప్రధానమైన ఆలోచనలపై లేక మూడు

అత్యున్నతమైన అతి విశాలమైన, ప్రధానమైన ఆధ్యాత్మిక అనుభవాల ఆధారంగా నిర్మితమయింది అని. మొదటిది, వేద ప్రామాణికమైన సూత్రం, "సృష్టి ఉనికికి మూలం ఒక్కడే", ఆ ఒక్కడికే జ్ఞానులు వేర్వేరు నామాలు ఇచ్చారు. ఉపనిషత్తులు ఘోషించినట్లుగా "రెండవవాడు లేని ఒక్కడు" అని "అద్వితీయుడు" అని, "ఉన్న దంతా అతడే, దానికి ఆవల ఉన్నది కూడా అతడే" అని. "ధృవం" అని బౌద్ధులు అన్నారు. దృశ్యమాన జగత్తును విశ్వసించనివారు, అనగా కేవల వాదులు "సర్వ సంపూర్ణుడు, సర్వ స్వతంత్రుడు" అన్నారు, బహు దేవతారాధకులు "జీవాత్మను, మహా ప్రకృతిని తన అధీనమందు ఉంచుకున్నవాడు" అని. ఒక్క మాటలో చెప్పాలంటే, "నిత్యసత్యుడైన భగవంతుడు", "అనంతుడు" అని అన్నారు.

ఇది సామాన్య జనావళికి చెందిన మొదటి ఆధారం. దానిని అనేక విధములైన మేధోపరమైన సిద్ధాంతాల ద్వారా వ్యక్తపరచవచ్చు. వ్యక్తపరచబడింది కూడా. ఈ శాశ్వతుని, ఈ అనంతుని, ఈ నిత్య సత్య దైవాన్ని కనుగొని, అతని సాన్నిధ్యానికి చేరువై అతనితో ఏదో ఒక విధమైన లేక ఒక స్థాయికి చెందిన సంయోగమొందటం అనేది దాని ఆధ్యాత్మిక అనుభవంయొక్క పరాకాష్ట స్థితి, దాని చిట్టచివరి ప్రయత్నము. అది భారతదేశంయొక్క మతపరమైన మానసంయొక్క సార్వత్రిక సూత్రం. ఈ ఆధారాన్ని ఏ సూత్రానుసారం వాస్తవమని నమ్మినా, ఈ గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యాన్ని భారతదేశంలో గుర్తింపు పొందిన వేలాది మార్గాలలో ఏదో ఒకదానిని అనుసరించినా లేదా వాటి శాఖల నుండి ఆవిర్భవించన ఏ నూతన మార్గాన్ని అనుసరించినా మతంయొక్క మూలానికి చేరినట్లే. ఎందుకనగా దాని రెండవ ప్రధానమగు ఆలోచన ప్రకారం శాశ్వతుడు, అనంతుడు అగు దైవాన్ని చేరడానికి అనేకమైన మార్గాలున్నాయి. అనంతుడగు దైవం అసంఖ్యాకమైన అపారతలతో కూడి ఉన్నాడు. వీటిలోని ప్రతి ఒక్క అపారత స్వయంగా ఒక శాశ్వతుడగు దైవంగా భాసిల్లుతున్నవి. ఇక ఇక్కడ విశ్వాని కున్నటువంటి పరిమితుల్లో దైవం తాను స్వయంగా ప్రకటితమై అనేక విధాలుగా ఈ ప్రపంచ మందు తనను తాను సఫలీకృతుడిని చేసుకుంటాడు. అయితే ప్రతి ఒక్క విధానం దైవానికి చెందినదే. ఎందుకనగా ప్రతి ఒక్క పరిమితమైన దానిలో, అన్ని విషయాల ద్వారా అతని రూపాలుగా, చిహ్నాలుగా అతనిని కనుగొనగలం, ఈ అనంతుడి దరి చేరగలం. విశ్వగతమైన శక్తులన్నీ అతని సుస్పష్ట రూపాలే, అన్ని బలాబలాలు ఆ ఏకైకుడి శక్తులే. మహాప్రకృతి కార్యక్రమాల వెనుక నున్న

దేవతలు ఆ ఒక్కడైన దైవంయొక్క శక్తులుగా, నామరూపాలుగా, వ్యక్తిత్వాలుగా పరిగణించబడాలి, పూజించబడాలి. అన్ని సంఘటలల వెనుక ఒక అనంతమైన చేతనాశక్తి, కార్యనిర్వాహక శక్తి, దైవసంకల్పం లేక దైవశాసనం, మహా మాయ, మహా ప్రకృతి, మహాశక్తి లేక దైవికమగు కర్మ ఉంటాయి. అవి మనకు మంచిదిగానో లేక చెడ్డదిగానో, అంగీకారయోగ్యమైనది గానో లేక కానివిగానో, అనుకూలమైనవిగానో లేక ప్రతికూలమైనవిగానో కనిపించవచ్చు. అనంతమైనది సృష్టిస్తుంది, అది బ్రహ్మం; కాపాడుతుంది, అది విష్ణువు; నాశనం చేస్తుంది. అది రుద్రుడు లేక శివుడు, మహోత్కృష్టమైన దైవశక్తి ఏదైతే సహాయపడి, రక్షణ కల్పించి మేలు చేకూరుస్తుందో అది తనంతట తాను లోకా లన్నింటియొక్క మాతయగు మహాలక్ష్మిగా లేక మహా దుర్గగా రూపొందించుకుంటుంది. నాశనమొందించు ముసుగులో సైతం మేలు కలుగ జేసేది మహాచండి లేక మహాకాళి, నల్లని మేని ఛాయగల శ్రీమాత. ఒక్కడైన దైవం తనను తాను తన లక్షణాల కనుగుణమైన రూపాలలో అనేక నామాలతో అనేక దేవతలుగా ప్రకటిత మవుతాడు. వైష్ణవుడియొక్క దివ్యప్రేమాధిదేవత అగు దైవం, శాక్తేయుడియొక్క దివ్యశక్తియుతుడగు దైవం, ఇద్దరు వేర్వేరు దేవతలుగా కనిపిస్తారు; కానీ వాస్తవానికి వారు వేర్వేరు ఆకారాలతో నున్న ఒకే దైవం. ఒక వ్యక్తి పరమాత్మను వీటిలోని ఏ నామం ద్వారానైనా, ఏ రూపం ద్వారా నైనా యెరిగియో లేక ఎరుక లేకనో సమీపించ వచ్చు. ఎందుకనగా వాటి ద్వారానే గాక వాటికి అతీతంగా కూడ చివరికి మహోత్కృష్టమైన దివ్యానుభవం పొందవచ్చు. తీవ్రమైన పర్యవసానానికి కారణభూతమగు మూడవ ఆలోచన ఏదైతే భారతీయ మతతత్వానికి మూలమైనదో అది ఆధ్యాత్మిక జీవితానికి అత్యంత క్రియాశీలమైనది, ఒక సార్వత్రిక చేతన గాని లేక సమస్త అంతర్గత, బహిర్గత మహాప్రకృతిని చీల్చుకొని పోవటం ద్వారా గాని దైవసన్నిధికి చేరవచ్చు. ప్రతి ఒక్క వ్యక్తిగతమైన అంతరాత్మ స్వయంగా తన స్వకీయ ఆధ్యాత్మిక పాత్రలో దివ్యమైన ఆ 'తత్' లేక దైవాన్ని కలుసుకోవచ్చు. ఎందుకనగా దానిలో 'ఏకం' అగు దైవంయొక్క ఉనికి సన్నిహితమైనది లేక కనీసం దానితో సన్నిహితమైన సంబంధం కలిగినదేదో ఉన్నది. భారతీయమత సారాంశం మన మనస్సు నుండి, మన జీవితం నుండి ఆత్మజ్ఞానాన్ని కప్పి వుంచిన అజ్ఞానం నుండి బయల్పడటానికి ఏ విధమైన జీవితం గడపాలి, ఏ విధంగా ఎదగాలి అనే లక్ష్యాన్ని సాధించటం, మనలో నున్న దివ్యత్వాన్ని గురించిన చేతనను

పొందటం. ఈ మూడు విషయాలు వెరసి హిందూమతంయొక్క సర్వస్వం, దాని ప్రధానమైన భావం; ఇంకా దాని గురించి తెలుసుకోవాలి అనుకుంటే, దాని లక్షణం.
CWSA 20:193-195 అనువాదం: అందుగులపాటి కైలాసపతి (9573605734)

మానవజీవితం నాలుగు అవసరాలు

హిందూమతము జీవితానికి నాలుగు ముఖ్యలక్షణాలను మన ముందు ఉంచింది. మొదటగా అది గుర్తించినసత్యం ఏమిటంటే ఈ ప్రపంచంకంటే ఉన్నతమైన దివ్యచేతన ఒకటి ఉందనీ, అంతా అందులో నుండే ఉద్భవించి, తుదకు అందులోనే లీనమౌతుందనీ నిర్ధారించింది. ఇదే మనం గ్రహించవలసిన సత్యం. మానవులు ఈ స్థితిని చేరుకోవాల ంటే తమ జీవితకాలమంతా అందుకు కావలసిన అర్హతను పొందే ప్రయత్నం కూడా చేయాలికదా! ఉన్నత చేతనలో ఉండే అనుభవాన్ని స్వయం కృషి ద్వారానే సాధించాలి. ఇంతే కాదు హైందవం చక్కగా అన్వేషించబడి, సుస్థిరమైన బహుముఖా లుగా (శాఖోపశాఖలై) విస్తరించగల జ్ఞానాన్ని క్రమశిక్షణను రూపొందించింది. అది సాధ్యం కాదని భావించేవారికి కూడా అనుకూలంగా ఒక సాంఘిక వ్యవస్థను ఏర్పరచి ఆయా వ్యక్తుల నైతిక, మానసిక వికాసానికి దోహదం చేసింది. ఈ వ్యవస్థలో వ్యక్తులు తమ పరిధిలో తాము సాధన చేస్తూవే సాంఘిక సామరస్యాన్ని కూడా సాధించి ఉన్నత మానసిక చేతనను కూడా సిద్దింపచేసుకొనగలరని భావించింది. పైన చెప్పిన విషయాలు ఏ మతానికైనా అత్యంత ఆవశ్యకమే. హైందవం ఇందులో చివర పేర్కొన్న ఉన్నత మానవికి అత్యంత ఆవశ్యకమే. హైందవం ఇందులో పేర్కొన్న ఉన్నత మానసానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, లౌకిక జీవనం కూడా మత పరిధిలోనిదే కాని భిన్న మైనది కాదు అని బలంగా నమ్మింది.

మానవులకు ఇష్టమైనవి ఈ నాలుగే

ప్రాచీన భారత నాగరికత ప్రముఖంగా మానవుల చతుర్విధ అవసరాలపై ఆధారపడిందని అనుకోవచ్చు. అవి 1. కోరిక భోగలాలసత, 2. ఆర్థిక, భౌతిక అవ సరాలను తీర్చుకొనే విధానాలు, మానసికమైన కోరికలను తృప్తిపరచుకోవడం, 3. సంఘంలో అవసరమైన నైతిక విలువలు కాపాడటం, 4. ఆధ్యాత్మిక సంబంధమైన మోక్ష సాధన. వీటినే చతుర్విధ పురుషార్థములు (ధర్మార్థ కామ మోక్షములు)

అని కూడా అంటారు. ఏ సంస్కృతి అయినా, ఏ సమాజం అయినా వీటివలన సమర్థవంతంగా నెలకొల్పబడుతుంది. చాలా అరుదైన సందర్భాలను మినహాయిస్తే, మొదటి మూడు నాలుగవ పురుషార్థం కంటే ముందుగానే అవసరంకూడా. జీవితం అనవసరం అని దాన్ని వదలి వేయాలంటే, ముందుగా దాన్ని పరిపుష్టం చేసి లోతు పాతులు తెలుసుకోవాలి కదా! అట్లాగే కుటుంబము సంఘము ఇష్టదేవతలు నిర్లక్ష్యానికి గురికాకుండా చూచుకోవాలి. ఉన్నత పరిపూర్ణత్వాన్ని కోరుకొనేవారు దిగువస్థాయి నుండే దాన్ని సాధిస్తూ పోవాలికదా! సన్యాసం, ఆశ్రమవాసం, మోక్షసామ్రాజ్యం అనేవి ప్రారంభదశలోనే తొందరపడి చెప్పే ఉపన్యాసాలు కాకూడదు.

చతుర్వర్ణ వ్యవస్థ

చతుర్వర్ణవ్యవస్థను నిరర్థకమైన, కాలంచెల్లిన అర్థంలేని కులవ్యవస్థ అని భావించ రాదు. ఇతర దేశాలలో ఉన్న పరస్పర వైరుధ్య భావాలతో నిండిన వర్గపోరాటాల లాంటిది ఇది కాదు. వర్గపోరాటం, వేరే నాగరికతలకు సంబంధించినది. వాటిలోనూ పూజారులూ, భూస్వాములూ వర్తకులు వ్యవసాయ కూలీలు, ఉండేవారు. అట్టి నాగరికతలలోనూ ప్రారంభదశలో మనదేశ విధానం వంటిదే అండేదని చెప్పవచ్చు. కాని వాటిలో విభేదాలు కూడా ఉండేవి.

ప్రాచీన భారత నాగరికతలో మానవులు తమతమ మనస్తత్వాలను బట్టి జీవన విధానాన్ని ఎన్నుకునేవారు. ఇవి కూడా నాలుగు రకాలే. విద్యలకు, విజ్ఞానానికి చెందినవారు సమున్నత స్థానాన్ని ఆక్రమించారు. తరువాతి స్థానం పరిపాలన, యుద్ధ కౌశల్యము నాయకత్వ లక్షణాలు కలిగిన వారిది. మూడవ స్థానంలో వస్తూత్పత్తి, పంపిణీ చేసేవారు. కళాకారులు ఉండేవారు. ఈ మూడు వర్గాలవారు ద్విజులు. వీరికి ఉపనయన సంస్కారం ఉండేది. వీరే క్రమంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులుగా స్థిరపడ్డారు. చివరి స్థానంలో అంతగా మానసిక పరిణతి సాధించలేనివారు ఉండేవారు. వీరికి తగినంత దేహదార్ఢ్యం ఉండటం వలన సేవాకార్యక్రమాలలో స్థిరపడ్డారు. వారే శూద్రులు. ఈ విధంగా సంఘంలో వైజ్ఞానిక ఆర్థిక అవసరాలు తీరేవి. కాల ప్రవాహంలో తరతమ భేధాలు కూడా ఇలాగే ఏర్పడ్డాయి.

విద్యావంతులైన బ్రాహ్మణులు, పూజారులుగానూ, వేదాంతులుగనూ, మంత్రాంగం తెలిసిన సలహాదారులుగనూ, పండితులుగనూ, మతపెద్దలుగనూ ప్రముఖ

స్థానం వహించేవారు. ఇక క్షత్రియులలో నుండి ప్రభువులు, సైనికులు, రాష్ట్రప్రముఖులు, పరిపాలనాదక్షులుగనూ ఏర్పడి ద్వితీయస్థానం ఆక్రమించారు. ఉత్పత్తిదారులైన కర్షకులు, పంపిణీదారులు, వర్తకులు, వృత్తిపనివారు మూడవ వర్గంగానూ, శూద్రులు పై మూడు వర్గాలకు అవసరమైన సేవలు అందించేవారుగానూ స్థిరపడ్డారు.

ఇలా జరిగినంతకాలం సంఘం సుస్థిరంగానే ఉండేది. ఒకటి రెండు విదేశీ నాగరికతలలోనూ యిలాగే వుండేది. భారత సంస్కృతిలో మతవిశ్వాసాలు, విద్య, మేధావికాసము, కూడా ఉండేవి. ఇది సుస్థిరముగా సమున్నతంగానూ ఉండేది. భారతీయ సంస్కృతిలో ప్రతి మనిషియొక్క స్థానం అతని పుట్టుకను బట్టి కాకుండా అతని అభిరుచులను సామర్థ్యాన్ని బట్టి నిర్ణయించబడేది ఈ నియమం కచ్చితంగా అమలులో ఉన్నంతవరకు దానికి ప్రత్యేకమైన ప్రాముఖ్యం, ప్రాధాన్యత కూడా ఉంటాయి గదా!

కాని, ఎంత విశిష్టమైన సమాజమైనా కాల క్రమేణా భౌతికతవైపే పయనించే యంత్రం తయారవుతుంది. అందువలన సున్నితమైనటువంటి, మానసికమైనటువంటి అభిరుచులపై మాత్రమే ఆధారపడే సాంఘిక వ్యవస్థ పూర్వం జరిగినట్లే మనుగడ సాగించేలా చూడాలనుకోవడం వృథా ప్రయాసే అవుతుంది.అట్లా అనుకోవడం వలననే పుట్టుక ఆధారంగానే వృత్తిని నిర్ణయించే విధంగా ఈ కులవ్యవస్థ వచ్చింది. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే దీన్ని మరో కోణం నుండి పరిశీలించాలి. ఈ సాంఘిక వ్యవస్థ ఈ విధంగా స్థిరపడటం వెనుకనున్న బలమైన కారణాలను ఇంకనూ అన్వేషించవలసి యుంది.

ఉన్నతమైన సత్యమే అత్యంత ప్రధానం

విజ్ఞాన సముపార్జన మతవిశ్వాసాల పరిరక్షణ మాత్రమే అత్యున్నత సత్యాలని భారతీయ సాంప్రదాయం భావించలేదు. సత్యాన్ని వివిధ రూపాలలో, అర్థాలలో దర్శించి, దాన్ని ఒక ఆంతరంగిక అనుభవంగా మలచుకొని, అట్టి చేతన మాత్రమే అత్యంత ఆవశ్యకం అని మనదేశం భావించింది. ఒక సిద్ధాంతం జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావటమే జీవితలక్ష్యం అని భావించగా మరో సిద్ధాంతం ప్రకారం దైవత్వం అంతర్గతంగా బీజప్రాయంగా మానవులలో ఉన్నా, ప్రకృతిలో అతని ఉనికి మరో విధంగా ఉంటుందని నిర్ధారించింది. వేరొక సిద్ధాంతం ప్రకారం జీవాత్మ వేరు, పర

మాత్మ వేరు. ఈ విభేదాలున్నా వీటన్నింటికీ మూలం జీవాత్మయొక్క ప్రాధాన్యతే. అదే మానవ జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్నీ ఇవ్వగలదు. దైవ భావనను మానవ జీవితం నుండి తొలగించిననాడు ప్రకృతికి ప్రయోజనమే లేదు. మనం దేన్నయితే, 'మాయ', 'ప్రకృతి', 'పరాశక్తి' అంటున్నామో ఆ పరమాత్మనూ, వ్యక్తుల జీవాత్మనూ, ద్వైత, అద్వైత, విశిష్టా ద్వైత శాఖలన్నీ అంగీకరించాయి. అదే విధంగా మానవులలోని అంతర్గత ఆధ్యాత్మికతనూ, దానితో దివ్యాత్మకుగల అవినాభావ సంబంధాన్ని కూడా ఆధ్యాత్మిక పరిపూర్ణతకు ఆదారభూతంగా నిర్ధారించాయి.

ఇక దైవం అంటే మానవాతీత నిరపేక్ష అనంత శక్తి అని కాని, లేక అతీత శక్తి గల అభౌతిక అనంతుడు అనిగాని భావించటం మనకే వదలి వేయబడింది. అసలు విషయం ఏమిటంటే భగవంతుడు సృష్టికి కేంద్రముగా, హృదయస్థానంలో ఉన్నాడనీ అతనిలోనే ఈ విశ్వమంతా ఒదిగి యుంటుందనీ విశ్వసించాలి. ఆత్మ సాక్షాత్కారము అంటే ఆయనను అన్వేషించటమే. మతాలలో నిశాఖా పరబేధాలు అందరిలో ఉన్న ఏకాత్మను దర్శించటానికే అని అందరూ అంగీకరించాలి. కేవలము ఆత్మజ్ఞానమే మనకు కావలసినది. ఆంతరిక ఆత్మను తెరచియుంచి అనంతునిలో జీవించి శాశ్వత మైన దానిని అన్వేషించి, దైవ సాన్నిధ్యాన్ని పొంది, తరించటమే మతముయొక్క ముఖ్యోద్దేశము. మోక్షం అంటే ఇదే. ఇదే సజీవ సత్యము. ఇదే మోక్ష ఫలితము. ఈ అత్యున్నత ఆధ్యాత్మిక లక్ష్యమే చలన శీలమైన భారతీయ మతవిశ్వాసాలకు పరమావధి. చూడటానికి భిన్నంగా కనిపించే విధానాలన్నింటినీ ఏకం చేసి బంధించి యుంచే భావనకూడా కేవలం ఇదే.

CWSA 20:183-84   అనువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు (9848848291)

సనాతన ధర్మం: మానవజాతి

భారతీయ తత్త్వచింతనలో మనిషి

దివ్యమైన విశ్వాత్మని మాత్రమే కాక మనిషిని కూడా మన శాస్త్రాలు పురుషుడు అని ఒకే పదంలో సూచిస్తాయి. మానవాళికి దైవానికి మధ్య ఏకత్వాన్ని సూచించుట కోసం కాబోలు నర, నారాయణలు సనాతన ద్వయం. ఉన్నది ఇద్దరైనా ఇద్దరూ ఒక్కటే. శాశ్వతంగా ఇరువురూ, శాశ్వతంగా ఒక్కరు. జలాలలో కొలువు ఉండేవాడు. నారాయణుడు అంటారు, శాస్త్రవ్యాఖ్యాతలు. కాని నా ఉద్దేశ్యంలో అఖిల మానవాళి సారం, ఆత్మ నారాయణుడు అని ఆ భావనలోని అంతరార్థం. నరుడు ఉన్నచోట నారాయణుడు ఉంటాడు. ఎందుకంటే ఇరువురిని వేరుచెయ్యడం సాధ్యంకాదు. క్రీస్తు కొన్ని సందర్భాలలో తాను మానవుడి శిశువుని అని చెప్పుకుంటాడు. పురుషుడి తనయుడు అని ఆయన ఉద్దేశం. ఆ శబ్దానికి గ్రీకు అనువాదాన్ని ఊహించుకోవాలంటే నాకు అన్న అనుచితమైన పదమే స్ఫురిస్తుంది. పురుషుడు అన్న పదానికితత్వమమైన ఏదో సిరియన్ పదానికి అదొక అవివేకమైన యథాతథ అనువాదం మాత్రమే ననిపిస్తుంది.

మనిషిలో ఎన్నో దివ్యమైన అవకాశాలు ఉన్నాయన్న విషయం నిజమే కావచ్చు. అతడు కేవలం భౌతిక పరిణామక్రమంలో ఒక దశ మాత్రమే కాదు. అతడే ఒక ఆధ్యాత్మికపరిణామ క్షేత్రం. ఆ పరిణామం అతడితోనే ఆరంభమై అతడిలోనే అంతం కానుంది. మానవుడు నిర్మించబడ్డాకనే దేవతలు సంతృప్తి చెందారు. జంతురూపాల్ని తిరస్కరించిన దేవతలు మనిషిని చూసి సుకృతమేవ అని ఎలుగెత్తి చాటారు. మనిషి నిజంగా అందంగా, అద్భుతంగా, నిర్మించబడ్డాడు, ఉన్నత పరిణామం ఇప్పుడు ఆరంభం కావచ్చు. మనిషి దైవాన్ని పోలినవాడు. పశువునుండి దేవతల వరకు గల జీవరాశులన్నిటియొక్క సంఘటిత రాశి. మారని అచలత్వం వాటి గుణం అయితే అనంతమైన వైవిధ్యం మనిషి గుణం. అత్యున్నత స్థాయికి చెందిన ప్రాణులలో కూడా నిశ్చలత్వం ప్రధాన గుణమైతే గొప్ప సక్రియాత్మకత మనిషి లక్షణం. ప్రస్తుత స్థాయిలో అధికారంలో అతడు దేవతల కన్నా కాస్త దిగువ స్థాయిలో ఉన్నా, ఏదో ఒకనాటికి తన పరిణామానికి అంతంలో దేవతలని మించి పోతాడు. స్థిర లక్షణులైన తక్కిన జీవులు, జంతువులు, దేవతలు, యక్షులు తదితరులకి కూడ తమ స్థితిని మించి ఎదిగే అవకాశం వున్నది. కానీ, ఆ మార్పుని సాధించడంకోసం

వారు మానవ దేహాన్ని, పార్థివ జననాన్ని స్వీకరించవలసి వుంటుంది.

CWSA 12:7

ధర్మాన్ని నిలబెట్టేది

ధర్మం అన్న పదానికి నైతిక, లౌకిక, తాత్త్విక మతసంబంధిత, ఆధ్యాత్మిక అర్థాలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క అర్థంలోనైనా ఆ పదాన్ని ప్రయోగించవచ్చు. పూర్తిగా నైతికంగానో, పూర్తిగ తాత్వికంగానో లేదా పూర్తిగా మతసంబంధితమైన అర్థంలోనో ఆ పదాన్ని ప్రయోగించవచ్చు. నైతికంగా చూస్తే అది సత్యవ్రతాన్ని నైతికనియమావళిని సూచిస్తుంది. మరింత బాహ్యమైన, లౌకికమైన, అర్థాన్ని తీసుకుంటే అది సాంఘిక నియమానళిని, సాంఘిక నియమావళికి విధేయమైన జీవనసరళిని సూచించవచ్చు...

భారతీయ చింతనలో ధర్మం అంటే మంచిది, సరైనది, నైతికమైనది, న్యాయ బద్ధమైనది మాత్రమే కాదు. అది మనిషికి అన్య జీవులకి, ప్రకృతికి, దైవానికి, మధ్య సంబంధాలన్నింటినీ శాసించే, ఒక దివ్య నియమావళి. కర్మకి చెందిన వివిధ రూపాలలో, సూత్రాలలో అంతర బాహిర జీవన రాపాలలో, లోకంలోని అన్ని రకాల సంబంధాల తీరు తెన్నులలోను క్రమంగా రూపు దేలే దివ్యతత్వం దృష్టితో చూసినప్పుడు కనిపించే దివ్య నియమావళి ధర్మం. మనం ఎందులో లగ్నమై ఉంటామో, అది ధర్మం. మన అంతర బాహిర చర్యలన్నీ దేని వల్లనైతే సంలగ్నమై ఉంటాయో అది ధర్మం. దాని ప్రాథమిక అర్థంలో చూస్తే, అది మన చర్యలన్నింటినీ రహస్యంగా నియంత్రించే మన మౌలిక స్వభావం. ఆ విధంగా చూసినప్పుడు ప్రతీ జీవికి, ప్రతీ వర్గానికీ జాతికీ, వ్యక్తికీ సముదాయానికి దాని స్వంత ధర్మం ఒకటి వుంటుంది. రెండవ విషయం ఏమిటంటే మనలో అభివృద్ధిచెంది, మనలోఅభివ్యక్తం కావలసిన దివ్యప్రకృతి ఒకటి ఉంది. ఆ అర్థంలో చూసినప్పుడు ఏ విధమైన ఆంతరిక కర్మల చేతనైతే మన ఆత్మలో ఎదుగుతుందో అదే ధర్మం. మూడవ విషయం ఏమిటంటే వ్యక్తినే కాక, మొత్తం మానవజాతిని ఓ దివ్యమైన ఆదర్శం దిశగా వేగంగా ముందుకు తోసే విధంగా మన చింతనని, కర్మలని, మన పరస్పర సంబంధాలని శాసించే నియమావళినే ధర్మం అంటారు.

ధర్మం గురించి ప్రస్తావించేటప్పుడు అది సనాతనమైనది, అచంచలమైనది

అన్నట్టు చెప్పుకుంటారు. ధర్మం అనే ఆదర్శాన్నే తీసుకుంటే దానియొక్క మౌలిక తత్త్వాన్ని తీసుకుంటే అది నిజమే. కాని దాని బాహ్యరూపాలలో అది నిరంతరం మార్పునకు గురవుతూ, పరిణామం చెందుతూ ఉంటుంది. ఎందుకంటే మొదట్లో మనిషి ఆదర్శాన్ని అందుకుని అందులో జీవించగలిగే స్థితిలో ఉండడు. అంతో ఇంతో పరిపూర్ణంగా దాని కోసం ఆకాంక్షిస్తూ, దాని జ్ఞానంకోసం శోధిస్తూ, దాన్ని ఆచరించాలని ప్రయత్నిస్తూ ఎదుగుతూ ఉంటాడు. ఆ ఎదిగే ప్రయత్నంలో దివ్యమైన నిర్మలత్వం, విశాలత్వం, ప్రకాశం, స్వేచ్ఛ, శక్తి, సత్యం, ఆనందం, ప్రేమ, శ్రేయస్సు, ఏకత్వం, సౌందర్యాల దిశగా ధర్మం మనసు తీసుకుపోతుంది. ధర్మ వృద్ధిని నిరోధించేదంతా, ధర్మ ప్రభావాన్ని చవిచూడనిదంతా, లోన రహస్యంగా నిక్షిప్తమైన దివ్య నిధులని బయటపడనీయనిదంతా బయటపడనిచ్చే ఉద్దేశం లేనిదంతా ధర్మం యొక్క నల్లని నీడలా, దాని తిరస్కృతిని ధర్మానికి అడ్డుగా నిలిచి వుంటుంది. అంతర్వైరుధ్యం అపరిశుద్ధత సంకుచితత్వం, బానిసత్వం, అంధకారం, బలహీనత కుటిలత్వం స్పర్థ, వేదన, విభజన, వైకల్య, వికారాలతో (మనిషి తన పురోగమన క్రమంలో విడనాడవలసిన లక్షణాలన్నింటితో) కూడుకున్న ఒక అభివ్యక్తిని అది ప్రదర్శి స్తుంది. అదే అధర్మం. ధర్మం కానిది. అది ధర్మాన్ని అందుకుని అతిక్రమించాలని చూస్తుంది. వెనక్కు లాగాలని, కిందికి ఈడ్చాలని చూస్తుంది. దుష్టత్వానికి, అజ్ఞానానికి, అంధకారానికి మూలమైన ప్రతిఘటనాత్మక శక్తి అది. ఈ రెండింటిమధ్య సనాతనంగా కలహం, సమరం కొనసాగుతుంటాయి. జయాపజయాల లయలు కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు ఉన్నత శక్తులది పైచేయి. అయితే కొన్ని సార్లు అధోబలాలు గెలుస్తాయి. *CWSA 19:172-72*

ఆర్యుడు పరిపూర్ణ మానవ ఆదర్శం

ఆర్య అనేది జాతీయ శబ్దం అనుకుంటే 'ఆర్', అనే ధాతువుని అందులో మూలశబ్దంగా గ్రహించవచ్చు. 'ఆర్', అంటే శక్తి, శౌర్యం. పోరాడటం అనే అర్థం గల 'ఆర్' అన్న ధాతువు నుండి అది వచ్చింది. దానినుండే గ్రీకుల యుద్ధ దేవత అయిన 'ఏరియోస్' (Areious) పేరు వచ్చింది. 'ఏరియస్' (Areious) అంటే ధైర్యం. యుద్ధపరాయణత. అలాంటిది మరో పదం (Arete) అంటే సౌశీల్యం. లాటిన్ పదం వర్టస్ (virtus) కి దీనికి కూడా సంబంధం ఉంది. కాబట్టి 'ఆర్' అన్న

ధాతువులో మొదట భౌతికబలం, ధైర్యం, ఆ తరువాత నైతికబలం, ఔన్నత్యం ధ్వనిస్తుంది. ఆ అర్థాన్నే ప్రస్తుతం మనం స్వీకరిద్దాం. "మహోన్నతమైన ప్రజ్ఞని సాధించటం కోసం మేము పోరాడుతాం. అందుకే మనుషులు మమ్మల్ని యోధులు అంటారు." ఇక్క ప్రజ్ఞ అతి శ్రేష్టమైనది. అత్యున్నతమైనది. అతి ప్రకాశవంతమైనది. అతి దివ్యమైనది, అయిన తత్వాన్ని తెలుసుకోగలిగే జ్ఞానం, దాన్ని ఎంచుకొనే వివేకం, అందులో ఇంకా ఎంతో అర్థం వుంది. అన్నిటీ గురించిన జ్ఞానం కలిగి ఉండడం, దయతో, భక్తితో కూడుకున్న మనోభావం కలిగి ఉండడం. అతి కుటిలమైన, అందవిహీనమైన, అంధకార బంధురమైన వాటి పట్ల కూడా అదే మనోభావాన్ని కలిగి ఉండడం. ఎందుకంటే ఆ మనోభావం అన్నిట్లో సమానంగా విశ్వాత్మ కొలువున్నా డన్న గుర్తింపునుండి పుట్టింది. ఎందుకంటే సత్కార్మ అనేది ఒక ఎన్నిక. భగవంతుణ్ణి మరుగుపరిచే దానిపట్ల తిరస్కృతి, భగవంతుణ్ణి వ్యక్తం చేసేదానిపట్ల అపేక్ష. ఇక ఆ ఎన్నిక ఒక యుద్ధం. ఓ విశ్వప్రయత్నం. ఆ ఎన్నిక చేసుకోవడం సులభంకాదు. దాన్ని అమలు చేయటం కూడా సులభంకాదు. దివ్యత్వపు శిఖరాలని ఎవరైతే అంచెలంచెలుగా అధిరోహించాలని కాంక్షిస్తారో దేనికీ భయపడకుండా అపజయానికి వెరవకుండా తన ప్రతిభ కన్నా ఎంతో విశాలమైనదని వెనుదీయకుండా తన ఆత్మో న్నతికన్నా ఎంతో ఎత్తైనదని సంశయించకుండా తన శక్తిస్థైర్యాలకన్నా ఎంతో ఘనమైనదని సంశయించకుండా ఎవరైతే ఆ ఎన్నిక చేసుకుంటారో అతడే ఆర్యుడు. అతడే దివ్య యోధుడు. విజేత, ఉత్తముడు, గ్రీకుల అరిస్టోస్ (Aristos), గీతలో చెప్పబడ్డ శ్రేష్టుడు. మూలార్థంలో తీసుకుంటే ఆర్య అంటే ప్రతిఘటన. అతిక్రమణ. తన వెలుపల, లోపల మానవ పురోగతికి అడ్డు పడేదానిపై ఉద్యమించేవాడే ఆర్యుడు. ఆత్మ విజయం అతడి మొదటి ధర్మం. అతడు ఈ పృథ్విని, పార్థివ దేహాన్ని అధిగ మిస్తాడు. సామాన్యుల్లా వాటి జడత్వానికి మారని కాలక్రమానికి, తమోగుణానికి లొంగిపోడు. అతడు ఈ జీవితాన్ని, జీవశక్తులని అధిగమిస్తాడు. వాటి తపనలకి, కోరికలకి, లొంగిపోవటానికి ఒప్పుకోడు. వాటి రాజసిక తాపత్రయానికి బానిస కాడు. అతడు మనస్సుని, మానసిక అలవాట్లని అధిగమిస్తాడు. అజ్ఞానపు పంజరంలో అపోహల వారసత్వంలో సాంప్రదాయక భావాలలో ప్రియమైన అభిప్రాయాలలో బందీగా మిగిలిపోడు. అతడికి శోధించి ఎంచుకోవడం తెలుసు. అతడు తన ప్రజ్ఞలో విశాలంగా, నమ్యంగా, ఉంటాడు. సంకల్పంలో బలంగా, దృఢంగా ఉంటాడు. ఎందుకంటే

అతడు అన్నిట్లో సత్యాన్నే శోధిస్తాడు. అన్నిట్లో ఋతాన్ని శోధిస్తాడు. అన్నిట్లో ఉన్న స్వేచ్ఛని శోధిస్తాడు. అతడి ఆత్మ విజయంలోని మహాలక్ష్యం ఆత్మ పరిపూర్ణత. కాబట్టి తాను గెలిచినదాన్ని నాశనం చెయ్యడు. ఉద్ధరించి దాని సాఫల్యాన్ని సాధిస్తాడు. తనకి దేహం, ప్రాణం, మనస్సులు ఇవ్వబడటానికి కారణం వాటికన్నా ఉన్నతమైన దాన్ని సాధించడం కోసమేనని అతడికి తెలుసు. కాబట్టి వాటిని అతిక్రమించాలి. అధిగమించాలి. పరిమితులని పటాపంచలు చేయాలి. వాటి తాపత్రయాల సమ్మోహనాన్ని త్రోసిపుచ్చాలి. కాని ఆ మహోన్నత లక్ష్యం కేవలం జీవనశూన్యం కాదని, ఇక్కడ వర్థమానంగా వ్యక్తమయ్యే తత్వం అని అతడికి తెలుసు. అదే దివ్యసంకల్పం. చైతన్యం, ప్రేమ, ఆనందం, ఆ తత్త్వాన్ని కనుగొన్నప్పుడు అది అధోజీవన అంశాలని పూరిస్తుంది. దాన్ని కనుగొన్న సాధకుణ్ణి, దాన్ని గ్రహించుకోగల సామర్థ్యం గల పరిసరాలని అది పూరిస్తుంది.దానికి అతడు సేవకుడు, ప్రేమికుడు, సాధకుడు. దాన్ని సిద్ధించుకున్న తరువాత దాన్ని తన కర్మలలో, ప్రేమలో, ఆనందంలో, జ్ఞానంలో, మానవాళికి పంచి పెడతాడు. మరి ఆర్యుడు అన్నవాడు నిత్య శ్రామికుడు, యోధుడు, మహోన్నత లక్ష్యాన్ని శోధించడం కోసం సేవించడంకోసం అందుకు అవసరమైన మానసిక, దైహిక పరిశ్రమ నుండి వెనుదీయక పనిచేస్తాడు. సమస్యలనుండి తప్పుకోడు. వేసటవల్ల విరామం కోరడు. తనలోను, లోకంలోను దిగిరానున్న దివ్యసామ్రాజ్యం కోసం పోరాడుతూ ఉంటాడు.

CWSA 13: 442- 443 శ్రీఅరవిందులు

అనువాదం: డా. వి. శ్రీనివాస చక్రవర్తి (9500069322)

మోక్షం

నిరాశావాదులు మోక్షాన్ని నిర్మూలనంగా లేక అంతరించిపోవుటగా భావించారు. కాని దాని అసలైన అర్థం స్వేచ్ఛ. మనిషి బంధాలనుంచి వ్యక్తిగత స్వేచ్ఛను పొందుటయే మోక్షం. కాని మోక్షం పొందుటకొరకు ఉండే గాఢావేశం కూడా చిట్టచివరి బంధమే. ఆత్మ పరిపూర్ణంగా స్వేచ్ఛను పొందే దానికంటే ముందే ఆ గాఢావేశాన్ని కూడా సాధకుడు త్యజించాలి, ఇంకను చివరగా కలిగే జ్ఞానం "ఎవరూ బద్ధులు కారు, ఎవరూ స్వేచ్ఛను కోరుకొనడం లేదు" అనేది. కాని అంతరాత్మ యెప్పటికీ పరిపూర్ణ స్వేచ్ఛను కలిగేవుంది. బంధం ఒక భ్రమ ఆ బంధం అనే జ్ఞానం నుండి

విముక్తి పొందాలను కొనుట కూడా ఒక భ్రమే. మనం బద్ధులమై వుండడమే గాక, క్రీడలో కూడా వున్నాం.మనంతట మనమే మన సంతసం ప్రకారం విప్పుకోగలముడుల లాంటివి అవి. దేశ కాలాల కార్యకారణ సంబంధాల కావలవున్న ఏకమే వా ద్వితీయం, అని చెప్పబడే విశ్వ జనీన యేక మాత్ర అస్తిత్వంనుండి విడివడిన ప్రత్యేకమైన అస్తిత్వం గల వాడననే అహంకారం భ్రమల ముడు లన్నింటిలో అత్యంత సమస్యాత్మకమైనది.

మన స్వభావంలో, అస్తిత్వంలో మనమంతా పూర్తి పరబ్రహ్మమే. ఒకే ఒక సముద్రంలోని అలలు మనలను వేరుచేసే పరిమితీకరించే నామరూపాలు. ఈ ప్రపంచనాటకం కొరకు క్రీడలో మాత్రమే నామరూపాలుంటాయి.

పరబ్రహ్మమాత్రమే ఉండి వేరొక ఉపాధి లేనపుడు అహానికి చెందిన 'నాది'

ప్రతిచర్యలమీద మనిషి చర్యలు ఆధారపడి ఉంటాయి. ప్రతి విషయానికి ప్రతి జీవికి సంబంధించిన ధర్మ నియతి తాదాత్మ్యత దృష్ట్యా దైవిక చర్య అప్రయత్నంగా ఉద్భవిస్తుంది. ఈ దైవిక చర్య స్థిర గ్రహణశక్తి. అది అప్రయత్నంగా శ్రమ లేకుండా తటాలున ప్రతిజీవి స్వ ధర్మాన్ని గుర్తించి సంభవిస్తుంది. (నేను ధర్మ అనే పదాన్ని ఉపయోగిస్తాను.ఎందువలననగా యిదొక న్యాయసూత్రము కాదు, ఒక సత్యము, కాదు, ఇది ఇవి రెండూ సమ్మిళిత మైనది) జీవి తన గమ్యాన్ని త్వరితగతిని చేరుటకు ధర్మాన్ని ఆచరించుట దగ్గరదారి. ఈ మలుపుతో ఆ జీవికి తన పయనంలో సానుకూల పరిస్థితులు ఒనగూడుతాయి. పర్యవసానంగా ఆ జీవి చేసే కర్మ సర్వదా పరిణామం మీద రూపుదిద్దుకుంటుంది. దీని పలితంగా ఒకే మాదిరిగా ఉన్నట్లు కనిపించే పరిస్థితులలో దివ్యజ్ఞాన కర్మలు ఒకసారి పూర్తిగా భిన్నంగానూ కొన్ని సందర్భాలలో ప్రతికూలంగా సైతం ఉంటాయి. కాని పై విషయాన్ని సాధారణ చైతన్యంగల మనుషులకు ఎలా వివరించాలి? ... ఉదాహరణకు భగవంతుడు ఒకరిని ప్రేమించవచ్చు. వేరొకరిని ప్రేమించకపోవచ్చు. అంతేకదా!

శ్రీమాత: ఒక అనుయాయితో జరిపిన సంభాషణ, జూలై 22, 1964

అనే భ్రమ ఏల కలుగుతుంది? వేరొక ఉపాధి తప్పక ఉంది. కాని అది పరబ్రహ్మ యొక్క అభివ్యక్తిలో మాత్రమే. కాని వాస్తవానికి వేరొక దాని ఉనికి లేదు, అని మేమంటాము. హక్కుగా కాక ఒక నటుడు ఒకే క్షణంలో ఒకే ప్రదేశంలో అనేక పాత్రలను ఒకదాని తరువాత మరొకటిగాక యేక కాలంలో పోషించకలిగినట్లు ఆ పరబ్రహ్మం ఉంటుంది. ఈ ప్రపంచ నాటకరంగంలో ప్రతి ఒక్కపాత్ర అతడే అతనిలో ఏకం అవిభాజ్యం. కాని ప్రతి పాత్ర వేరొక పాత్రకు భిన్నంగా ఉంటుంది. పరబ్రహ్మ దేశ కాలాలలో విస్తరించి ఉన్నాడు. కార్యకారణ సంబంధం అతనిని నియమబద్ధం చేయలేదు. కాని అతనిలో నియమబద్ధత ఉంటుంది. ఎపుడైనా అది మార్చబడవచ్చు. లేదా రద్దు చేయబడవచ్చు. మహాకాలంలో విశ్వంలో కార్యకారణ సంబంధంలో అనేక నామరూపాలలో అతను స్వయంగా తనను తాను బంధించుకుంటాడు. విశ్వఅస్తిత్వంలో అవన్నీ కేవలం అతని ఉపాధులు మాత్రమే. అభివ్యక్తిలో సమస్తం నిజమైనవే కాని అభివ్యక్తికి బయట అవన్నీ అసత్యం.

CWSA 12: 6 — శ్రీఅరవిందులు

మన జీవితంలో దైవాన్ని సాక్షాత్కారింపచేసేది సనాతన ధర్మం.

భవిష్యత్‌లో జరిగే మార్పులలో ఒక క్రొత్త సార్వత్రిక ఉన్నత స్థాయి ప్రమాణాలను స్థాపించుటకు దాని దిశగా హిందూసమాజం ముందుండి, తప్పక ప్రపంచాన్ని నడిపించాలి. ఇది మనకు మాత్రమే చాలా ప్రత్యేకమై వున్న దాని ద్వారా, హిందువులమై వున్న మనం తప్పక ప్రయత్నించాలి, మనకు ఒక ఉన్నతప్రమాణముంది. అది నిశ్చితంగా సార్వత్రికము మనకే ప్రత్యేకమూ అయిన శాశ్వతమతం. అది భారత దేశంలో సదా శాశ్వతంగా అంతర్నిహితంగా వుండి వున్నది. అది ఎప్పటికీ భారతదేశ శాశ్వత పునాది. అది పరిణమిస్తూ, మార్పుచెందుతూ, బహురూపం ధరిస్తూండే హిందూత్వం. ఏదో ఒక మతానికి స్థిరంగా నత్తవలె అంటిబెట్టుకొని ఉండుట ధర్మం అనిపించుకోదు. ధర్మం పాటించకుండా ముందుకు మారడము ధర్మం అనిపించుకోదు. అంతరంగ జీవితంలోను బాహ్యజీవితంలోను అంతకంటె తక్కువ గాకుండా సమాజంలోనూ, తనలోనూ దేవుడిని సాక్షాత్కరింప జేసుకోవడం శాశ్వత మతం. "ఏష ధర్మః సనాతనః" దేవుడు పురాతనం కాదు. నవీనంకాని కాదు, దేవుడు ఒక మానవధర్మ శాస్త్రం కాదు. విద్యారణ్యుడు కాదు.రఘునందనుడు కాదు. ఐరోపాకి చెందిన ఒక

వ్యక్తి కాదు. అతను మూలంలో ఒక సత్ చిత్ ఆనందంగా ఉన్నాడు. తన అభివ్యక్తిలో సత్యము, ప్రేమ, శక్తిగా దివ్యసత్యం దివ్యశక్తి దివ్యప్రేమగా ఉన్నాడు. సత్యానికి, విషయాల ప్రధానతత్వానికి అనుకూలంగా వుండేదేదైనా, మనుషుల మధ్య ప్రేమను యేది వృద్ధి చేసినా వ్యక్తిని బలంగా శక్తివంతముగా యేది చేసినా అటువంటి ఆ జాతి దాని సంతతి దైవమే. ఇది వైవశ్వత మనుధర్మం. ఇది సనాతన ధర్మం, ఇది హిందూశాస్త్రం. దేవుడు మాత్రమే త్రివిధ సామరస్యత అతడు పక్షపాతిగాదు. మన ప్రేమ మనలను బలహీనులను, గ్రుడ్డివారిని లేక అవివే కులను చేయకూడదు. మన బలం, మనలను మొండివారిగా కోపిష్టిలుగా చేయకూడదు. మన ప్రధాన తత్వాలు మనలను మతదురభిమానులుగా, మానసిక దౌర్బల్యులుగా చేయకూడదు. మనం ప్రశాంతంగా, సహనంతో నిష్పక్షపాతంగా ఆలోచిద్దాము, మనం మనస్ఫూర్తిగా, గాఢంగా కాని విజ్ఞతతో ప్రేమిద్దాం. మనం బలంగా శక్తితో ఉదాత్త శీలంతో క్రియాశక్తితో పనిచేద్దాం. అయినా మనం పొరపాటు చేస్తాం కాని ఆ దేవుడు చేయడు. మనం నిర్ణయం తీసుకొని కర్మ చేస్తాం, అతను మన కర్మకు తగిన ఫలితాన్ని నిర్ధారిస్తాడు, అతను యేది నిర్ధారించినా అది మంచిదే.

CWSA 12:53-54 — శ్రీఅరవిందులు

అనువాదం: త్రివేణి (8008245276)

శ్రీఅరవిందులు, భారతదేశం మరియు సనాతన ధర్మం

నాకు ఆ సమయంలో ఏం జరిగిందో చెప్పమని నన్ను ఎవరూ నిర్బంధించలేదు. కానీ ఒక్క విషయం రోజు తర్వాత రోజు ఆయన నాకు తన వింతలు చూపిస్తూ నేను హిందూధర్మంలోని పరమసత్యాన్ని తెలుసుకొనేలా చేసారు. అంతకు ముందు నాకు చాలా సందేహాలు ఉండేవి, ఎందుచేతనంటే నేను సంపూర్ణంగా వేదేశీ వాతావరణంలో విదేశీ భావాలతో పెరిగాను. హిందూత్వంలోని చాలా విషయాలు కల్పితమైనవి అన్న భావనలతో ఉండటానికి ఇష్టపడేవాడిని; అది ఎక్కువగా కలలు, భ్రాంతులు మాయతో కూడుకున్నదిగా భావించే వాడిని. కాని రోజులు గడుస్తున్నకొద్దీ హిందూధర్మంలోని సత్యాన్ని నా బుద్ధి గ్రహించింది. నా హృదయం గ్రహించింది. నాశరీరం కూడా గ్రహించింది. అవి నాకు సజీవ ఉదాహరణగా మారిపోయాయి. ఏ

భౌతిక విజ్ఞాన శాస్త్రం వివరించవలసిన అవసరంలేకుండా నేను మొట్ట మొదటిసారి వెళ్ళి ఆయనను కలిసినపుడు నాలో ఒక భక్తిలాంటి స్ఫూర్తి కానీ, జ్ఞాని అన్న భావన కానీ లేవు. స్వదేశీ ఉద్యమం మొదలు కావడానికి చాలా కాలము ముందే నేను ఐరోపాలో ఆయన వైపు తిరిగాను. అప్పుడే ప్రజాక్షేత్రం లోకి లాగబడ్డాను. ఆ సమయంలో దేవుడు దగ్గరకు వెళ్ళినా దైవం మీద నాలో సజీవనమ్మకం లేదు. నాలో నాస్తికుడుఉండే వాడు. శంకితుడు ఉండేవాడు. దేవుడు లేడని వాదించేవాడు ఉండేవాడు. అసలు దేవుడున్నాడా అని సందేహించేవాడుకూడా ఉండేవాడు. అసలు నాకు నిశ్చయంగా సంపూర్ణంగా దేవుని ఉనికి తెలియదు, నేను అనుభవించలేదుకూడా, నాకు తెలుయకుండానే ఏదో శక్తి నన్ను వేదాలు, భగవద్గీత హిందూధర్మం సత్యం వైపుకి లాగింది. ఈ యోగంలోను, వేదాల మీద ఆధారపడ్డ హిందూమతంలోను ఎక్కడో అతి పెద్ద సత్యం ఉంది. అన్న భావన నాలో కలిగింది. అందుచేత నేను యోగం వైపు దృష్టి మరలించి, ఆచరించడం ద్వారా నా భావనలు సరియైనవా కావా అని తెలుసుకోవడానికి నిశ్చయించుకున్నారు. అదే స్ఫూర్తితో ఆయనకు నా ప్రార్థన "నీవున్నట్లయితే నా హృదయాన్ని పూర్తిగా నీవు గ్రహించి వుంటావు. నేను మోక్షాన్ని కాంక్షించటంలేదని కూడా తెలుసుకొని వుంటావు. ఇతరులు సాధారణంగా కోరుకొనేది ఏదీ కూడా నేను కోరుకోవటం లేదు. నాకోరిక ఒక్కటే నాకు ఈ దేశాన్ని నిలబెట్టగల శక్తిని ప్రసాదించమని, నేను ప్రేమించే ఈ మనుష్యులకోసం నేను జీవించి శ్రమించాలి అని నా జీవితం అందుకు అంకితం అయిపోవాలన్నదే నా ప్రార్థన." నేను యోగసాధన చేస్తూ చాలాకాలంగా శ్రమించాను. ఎలాగైతేనేం కొంత సాధించగలిగాను. కానీ నేను ఆశించిన విషయంలో మాత్రము నాకు సంతృప్తి కలగలేదు.

CWSA 8: 9-10

భారతదేశ ఉద్ధరణ అంటే సనాతనధర్మ ఉద్ధరణే

"నేను ఈ మతాన్ని ధర్మాన్ని ప్రపంచంముందు నిలబెడుతున్నాను. ఋషులు, సన్యాసులు అవతారపురుషుల ద్వారా నేను దానినే పరిపూర్ణం చేసాను. అభివృద్ధిని సాధించాను. ఇప్పుడు అదే దేశాలన్నిటిలోను నా పనిని నిర్వర్తించబోతోంది. నేను

దేశాన్ని నిలబెట్టేది నామాటను చాటడానికి ఇది సనాతన ధర్మం ఆద్యంతరహితమైన మతం.

ఇంతకు పూర్వం మీకు తెలిసి ఉండని దానిని ఇప్పుడు నేను మీకు తెలియపరచాను నీలోని నాస్తికునికి నిత్యశంకితునికి సమాధానం లభించింది. ఎందుకనంటే నీ లోపల బయట నేను చూపించిన విశేషమైన భౌతిక విషయపరమైన ఆ ధారాలు నిన్ను సంతృప్తి పరిచాయి. నువ్వు ముందుకు వెళ్ళి నీ జాతిని ఉద్దేశించి మాట్లాడినపుడు ఎప్పుడూ సనాతన ధర్మం కోసమే అది ఉద్ధరించబడుతోందని అని చెప్పాలి. ప్రపంచానికి సేవచేయడంకోసం వాళ్ళకి నేను పూర్తిస్వాతంత్ర్యం ఇస్తున్నాను. కాబట్టి చెప్పేది ఏమిటంటే భారతదేశ ఉద్ధరణ అంటే, సనాతన ధర్మ ఉద్ధరణ భారతదేశం గొప్పదవ్వాల అంటే అర్థం, సనాతనధర్మంగా గొప్పదవ్వాలి అని అర్థం... భారతదేశం వ్యాప్తి చెంది విస్తారం అవ్వాలి అంటే సనాతన ధర్మం ప్రపంచమంతా వ్యాపించి విస్తారం అవ్వాలి. భారతదేశం ధర్మంకోసం ధర్మంచేత ఉనికిలో వుంటుంది. మతాన్ని పెద్దగా చూపించడమంటే దేశాన్ని పెద్దది చేసి చూపించటమే. నేను మనుజుల అందరిలోను అంతటా అన్ని వస్తువులలోను వ్యాపించి ఉన్నానని నీకు చూపించాను. నేను యీ ఉద్యమంలోనూ దేశం కోసం పనిచేసేవారి లోనే కాదు, తమ దైన మార్గంలో నిలబడి, ఈ కార్యాన్ని వ్యతిరేకించేవారి లోకూడా పనిచేస్తున్నాను. నేను ప్రతి మనిషిలోను పనిచేస్తున్నాను. ఎవరు ఏ మాలోచించినా ఏం చేసినా నా సంకల్ప సాధనకే తోడ్పడుతుంది. వాళ్ళందరూ నా పనిలోనే ఉన్నారు. వాళ్ళెవరూ నా శత్రువులు విరోధులు కాదు. నా పనిముట్లు. నువ్వు చేసే పనుల ద్వారా ఎటు వెళ్తున్నావో తెలియకుండానే నువ్వు పురోగమిస్తున్నావు. నువ్వు ఒకటి చేద్దామనుకుంటూ ఇంకొకటి చేస్తావు. నువ్వు ఒక ఫలితాన్ని ఆశిస్తావు. కానీ, నీ ప్రయత్నాలు నువ్వు అనుకున్నదానికి భిన్నంగా విరుద్ధంగా జరగడానికి ఉపయోగపడతాయి. బయటకి వచ్చి మనుష్యులలో ప్రవేశించింది ఒక మహాశక్తి. నేను చాలా కాలంనుంచి ఈ మహాఉద్యమానికి సిద్ధం చేస్తున్నాను. ఇప్పుడు సమయం ఆసన్న మయింది. దానిని సఫలం చేయడానికి నేను నాయకత్వం వహిస్తాను.”

CWSA 8: 10-11

భారతదేశం సనాతన ధర్మంతోనే జన్మించింది

నేను ఇంతకు ముందు నాలోని యీ శక్తితో మాట్లాడాను. ఈ ఉద్యమం రాజకీయ ఉద్యమం కాదు. జాతీయతా భావం రాజకీయ ఉద్యమం కాదు, జాతీయతా భావం రాజకీయం కాదు. అది ఒక మతం, ఒక మత విశ్వాసం, ఒక నమ్మకం. నేను ఇవాళ ఈ విషయాన్ని ఇంకో విధంగా చెబుతున్నాను. అది ఏమిటంటే జాతీయతా భావన ఒక మత విశ్వాసం, మతం, నమ్మకం కాదు, అది సనాతన ధర్మం అదే మనకి జాతీయతా భావన.

హిందూ జాతి సనాతనధర్మం తోనే జన్మించింది. సనాతన ధర్మంతోనే ముందుకు పోతోంది, యెదుగుతోంది. ఎప్పుడైతే సనాతన ధర్మం క్షీణిస్తుందో అప్పుడు జాతి కూడా క్షీణిస్తుంది. సనాతన ధర్మం అంతరించిపోతే దానితోపాటే జాతీ అంతరించిపోతుంది. సనాతన ధర్మమే జాతీయత, అదే నేను నీకు అందించే సందేశం.

CWSA 8: 12 *అనువాదం: టి.యస్. రాజకుమారి (9849412227)*

జీవించకపోతే మతం నిష్ప్రయోజనం

మనం మన ముందుంచుకున్న కార్యం యాంత్రికమైనది కాదు. అది నైతికమైనది. ఆధ్యాత్మికమైనది. ఆ కార్యంతో ప్రభుత్వ రూపురేఖలను మార్చాలనే ధ్యేయం మనకు లేదు. జాతిని నిర్మించాలన్నదే మన ధ్యేయం. ఆ కార్యంలో రాజకీయం ఒక భాగం, ఒక భాగం మాత్రమే. తత్త్వశాస్త్రానికి, సాహిత్యానికి విజ్ఞానశాస్త్రానికి మాత్రమే గాకుండా ఇవన్నీ కలిసిన ఒక అంశానికి అంకితం కావాలి. ఆ అంశం మనం నమ్మే ముఖ్యమైన ధర్మం. మనం నమ్మే సార్వజనీనమైన జాతీయమతం. జీవితానికి ఒక బలమైన నియమం. అది ఒక గొప్పమానవ పరిణామ నియమం. దేహాన్ని ఆధ్యాత్మిక జ్ఞానానుభవంతో తీర్చి దిద్దవలసిన నియమం. ఈ నియమానికి ఒక సంరక్షకురాలిగా, నిదర్శనగా, ఒక మిషనరీగా, భారతదేశం కొనసాగుతూ ఉంటోంది. ఆ నియమమే మన సనాతన ధర్మం. శాశ్వతమైన మతం. అయితే విదేశీ ప్రభావాల ఒత్తిడికిలోనై ఈ మతం వాస్తవిక జీవనంపై పట్టును కోల్పోయిందికాని ధర్మంతీరు తెన్నులపై కాదు. జీవించకపోతే భారతదేశమతం మతమే కాదు. ఈ

ధర్మాన్ని ఈ మతాన్ని యావత్ జీవితానికి వర్తింపజేయాలి. దీని తత్త్వంసమాజంలోకి వ్యక్తిగత శీలంలోకి మన మహా ఆశయాలలోకి ప్రవేశించివాటిని మార్పు చేయాలి. ధర్మం మూలాలను అర్థం చేసుకోవటానికి, ఉన్నత భావాలను అనుభూతమయ్యేట్లు చేయటానికి అది ఆవిర్భవించింది, వ్యక్తమయింది. జీవితంలో కార్యరూపం ధరించింది, కర్మ యోగమయింది, అని మనం అర్థం చేసుకొన్నాము. మానవ జీవితాదర్శానికి యోగాచరణ గావించటానికి భారతదేశం నేడు తలెత్తుతోంది. తన స్వాతంత్ర్యాన్ని, ఐకమత్యాన్ని, గొప్పదనాన్ని నిజం చేసుకొనడానికి ఆమె యోగంవల్ల బలాన్ని పొందుతుంది. దానిని పరిరక్షించుకొనడానికి ఆమె యోగంవల్ల బలం నిలుపుకొంటుంది. ఒక ఆధ్యాత్మిక విప్లవాన్ని నేను ముందుగా చూస్తున్నాను, దాన్ని సాధించే మన సాదనాసామగ్రి దాని ఛాయ, ప్రతిబింబం మాత్రమే.

CWSA 8: 24

ఆత్మ మాత్రమే సంరక్షిస్తుంది.

ఐరోపాను అనుసరించినట్లు యంత్రాంగాన్ని మార్చి, మన సమాజాన్ని పునః నిర్మాణం చేయటంపై మనకు నమ్మకం లేదు. వితంతు పునఃర్వివాహాలు. కులానికి ప్రత్యమ్నాయంగా, తరగతి వర్ణాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలలు లాంటి సంఘసంస్కర్తల ప్రత్యేక కార్యక్రమాల యోగ్యతా యోగ్యత లెలాంటి వైనప్పటికీ, అవి స్వయంగా జాతి ఆత్మను రక్షించలేని, సజీవంగా వుంచలేని, దిగజారిపోయి క్షీణించిపోకుండా వుంచలేని యాంత్రికమార్పులు మాత్రమే. ఆధ్యాత్మ మాత్రమే సంరక్షించేది. హృదయంలో ఔన్నత్యం, స్వేచ్ఛను పొందడంచేత మాత్రమే సామాజి కంగా రాజకీ యంగా గొప్పవారం, స్వేచ్ఛాజీవుల మవుతాం, పాశ్చాత్త్యులనుండి దిగుమతి చేసుకున్న సంకుచిత మైన అల్పమైన మతభావాలతో పరిమితమైన నూత్న తెగలను పెంచుకోవటంపై మనకు నమ్మకంలేదు. లేక హిందూమత దేహానికి కేవలం నిరంతరం వస్త్రి ధారణకు సంస్థలను ఏర్పాటుచేసి ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని శక్తిని గొప్పతనాన్ని పొందలేము. అనివార్యమైన భావప్రకటనా స్వేచ్ఛ, భౌతికవాద విరామకాలం ద్వారా, అన్యమత అసహనం లేనటువంటి, యేకైకుని యెడల దానికి ఒక అచంచల విశ్వాసం వుంది గనుక, సర్వ మతరూపాలను సమ్మతిస్తూ, పూర్ణ విశ్వాసంతో, తపనతో ఒక నూతన స్వేచ్ఛామయ మతపరమైన ప్రపంచ-జీవనం

వైపు ప్రపంచం సాగిపోతుంది. విజ్ఞానశాస్త్రం విశ్వాసం, ఆస్తికవాదం క్రైస్తవమతం మహమ్మదీయ మతం బౌద్ధ మతాలను ఈ సనాతనమతం స్వీకరించినా యివేవీగాని దానివైపు ప్రపంచాత్మ కదిలిపోతుంది. మన మతం అన్నిటిని సంశయిస్తుంది, అన్నింటిని నమ్ముతుంది. అనేకమైనవాటిపై అది ప్రయోగాలు చేసింది, ప్రశ్నించింది గనుక అది సంశయిస్తుంది. దానికి లోతైన అనుభవం ఉంది, వైవిధ్యభరితమైన సానుకూల ఆధ్యాత్మికజ్ఞానం వుంది గనుక అది అన్నింటినీ నమ్ముతుంది. హిందూత్వం ఒక సిద్ధాంతంకాదు. సిద్దాంతాల సమ్మేళనం కాదు. ఇది భూతకాల తత్త్వాన్ని భవిష్యత్ సామాజిక పరిణామాన్ని కలిగివుంది. ఇది దేనిని తిరస్కరించదు. పరీక్షించమని అంటుంది, అనుభవించమని అంటుంది. అంతరాత్మ ఉపయోగాలవైపు దానిని మరల్చుతాం. ఈ హిందూతత్వంలో భవిష్యత్ ప్రపంచమతానికి ఆధారం దొరుకుతుంది. ఈ సనాతనధర్మంలో ఎన్నో పవిత్ర గ్రంథాలున్నాయి. వేదం, వేదాంతం, గీత, ఉపనిషత్ , దర్శనాలు, పురాణాలు, తంత్రగ్రంథాలున్నాయి. ఇది బైబిల్నుగాని, ఖురాన్‌ను గాని తిరస్కరించదు. అయితే దీని వాస్తవికమైన అధికారికమైన గ్రంథం శాశ్వతుని నివాసమైన మన హృదయం. మన అంతర ఆధ్యాత్మిక అనుభవాలలో ప్రపంచ పవిత్ర గ్రంథాల మూలాలు దృష్టాంతాలను జ్ఞాన ప్రేమ, శీల, ధర్మ కర్మ యోగ ఆధారస్ఫూర్తిని కనుగొంటాం.

CWSA 8: 12 *అనువాదం: శ్రీ ఆకుల కృష్ణ (9889251895)*

మనముందున్న కర్తవ్యము, లక్ష్యము

మానవజాతి హితంకోసం భారతదేశ నిర్మాణానికి సహకరించడమే మన ధ్యేయమై వుండాలి. ఇదే మన జాతీయవాద భావన. దీనినే బహిరంగంగా ప్రకటించాలి. అనుసరించాలి. "సమయం వచ్చింది. మీరిప్పుడు గొప్ప పూనికతో ముందడుగు వేసి, ఈ భౌతిక అస్తిత్వం నుండీ మానవజాతి కదిలే ఇంకా ఉన్నతమైన, గంభీరమైన, విశాలమైన జీవితానికి ఉద్గమించాలి. మానవజాతిని యిబ్బంది పెట్టిన సమస్యలు మనలోపటి సామ్రాజ్యాన్ని జయించుకున్నప్పుడే పరిష్కరించబడతాయి. ప్రకృతి శక్తుల్ని విలాస, సౌకర్యాల సేవలో కట్టి పడేయడం వలనకాక, భౌద్ధిక, ఆత్మిక శక్తులపై అదుపు సాధించడంద్వారా అటు అంతర్గతంగానూ ఇటు బాహ్యంగానూ మనిషి స్వేచ్ఛను విజయోపేతంగా నిరూపించడం ద్వారా అంతరంగంలో నుండీ బాహ్య

ప్రకృతిని గెలవడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమౌతాయి. ఈ పనికోసం ఆసియా పునర్జాగృతి అవసరం. కాబట్టే ఆసియా పైకి లేస్తున్నది. ఈ పనికోసమే భారతదేశానికి ఘనతా స్వాతంత్ర్యాలు అత్యావశ్యకాలు. అందుచేత ఆమె పొంది తీరవలసిన స్వాతంత్ర్య, ప్రాశస్త్యాలను పొందజూస్తుంది. ఇది యావత్తు మానవజాతి ప్రయోజనం కోసం, ఇంగ్లాండుతో సహా, తన అధికారాన్ని పూర్తిగా నెలకొల్పుకోవాలి." ఇదే ఆమె తన హక్కుగా ప్రకటిస్తోంది.

ఐరోపా అధీనంలో కాక మనం మనంగా జీవించాలన్నది దేవుని సంకల్పం. మన స్వజనుల పాలనకాక వేరేవాని శాసనాన్ని అనుసరించటం ద్వారా కోల్పోయిన జీవనాన్ని సంపాదించుకోవడానికి కాంక్షించాం. వెనుకకు మరలి మన ఊర్జవాన్ని, జీవన మూలాన్ని మనలోనే మనం వెతుక్కోవాలి. మన భవిష్య ప్రయోజనాలకోసం మన గతాన్ని తెల్సుకోవాలి. దానిని తిరిగి కైవసం చేసుకోవాలి. మనం చేయవలసింది మనల్ని మనం ముందు తెలుసుకోవడం. ఆ పై భారతీయ శాశ్వత జీవనానికి, స్వభావ ధర్మానికి అనుగుణంగా ప్రతి దానిని మలచడం. కాబట్టి అది మన మత హృదయాన్ని మన సమాజాన్ని, మన తత్వ చింతనను, రాజనీతిని, సాహిత్యాన్ని, కళను, న్యాయశాస్త్రాన్ని, విజ్ఞానాన్ని, చింతనను ఇలా ఇంతకు ముందున్న ఇప్పుడు కొనసాగుతున్న ప్రతి అంశాన్ని అధ్యయనం చేయడమే కర్మయోగి లక్ష్యమౌతుంది. ఈ విధంగా మనకి, మన దేశానికి ఇది మన ధర్మం అని చెప్పుకోగలం. మన భారతీయ తాత్విక దృక్కోణం నుండి ఐరోపా నాగరికత మొత్తాన్ని సమీక్షించగలం. పాశ్చాత్య ఆధిపత్య ముద్రను త్రోసి పుచ్చడం నేర్చుకోగలం. పశ్చిమంనుండి మన మేమి గ్రహించాలో దానిని భారతీయులుగా స్వీకరిందాం. ధర్మాన్ని ఒక్కసారి కనుగొంటే దానిని ఇహ పూర్తి స్థాయిలో బహిరంగ పర్చడమే కాదు, మన వ్యక్తిగత కార్యకలాపాలల్లో, మన సామాజిక జీవనంలో, మన రాజకీయ ప్రయాసలన్నింటిలో దానిని నెలకొల్పి జీవించటానికి గట్టిగా ప్రయత్నిస్తాం.

CWSA 8: 26-27

భారతదేశ త్రివిధ సందేశం

మేమిక్కడ చాలా క్లుప్తంగా నైతిక, అంతరాత్మిక, ఆధ్యాత్మికమైన మూడు విధాలుగా వున్న భారతదేశాన్ని అందిస్తున్నాము. ఈ అంతరాత్మిక ప్రపంచానికి

అతనికి బాహ్యంగా వున్న భౌతికానికి ఆధారం, మూలవనరులకు తాళం చెవి మనిషి ఆంతరంలోనే వున్నదని నమ్ముతుంది. దీనినే నేడు ఐరోపా అస్పష్టమైన కాంతిలో అన్వేషించడం మొదలు పెట్టింది. ఆమె ద్వారాల కవతలి ప్రపంచ క్షణిక దర్శనాలను చిక్కించుకొంది. ఆమె చేతులు తాళంచెవికోసం తడుములాడు తున్నాయి. ఇంకా ఆమెకు ఆ బీగం దొరకలేదు. అమృతత్వం అన్నది నిరూపితమై, స్వీకరించబడినప్పుడు భగవంతుని విశ్వసించడం సులభమౌతుంది. ఆధ్యాత్మిక సందేశమేమిటంటే విశ్వాత్మ, అన్నది ఒక్కటే. మనఅంతరాత్మలన్నీ సహోదరులు మాత్రమే కాదు, ఒక మూల పదార్థం ఒకే ప్రకృతినుండీ రావడమే కాదు ఏకత్వంలోనే జీవిస్తూ, అత్యంత మౌలికమైన ప్రధానమైన ఏకత్వం వైపే సాగిపోతున్నాయి. ఈ ప్రకారంలో ప్రేమయే సర్వోచ్ఛ ధర్మం, దాని వైపే ఈ పరిణామం సాగి తీరాలి అంటుంది. ఆనందం, సంతోషం లీలకు లక్ష్యం. ప్రేమ సాఫల్యతే ఆనందానికి పతాకస్థాయి. కాబట్టి స్వార్థ రాహిత్యమే ప్రాథమిక ధర్మం. యజ్ఞం అన్నదే ధర్మం. దాని ద్వారానే సర్వానికీ పితరుడు ప్రారంభంలోనే లోకాన్ని సూత్రబద్ధీకరించాడు. అన్ని నీతిసూత్రాలు, ప్రవర్తన, జీవితం సర్వం ఐచ్ఛకంగానో, లేదా అచేతనంగానే ఒక యజ్ఞమే అనిగీత చెబుతుంది. నైతిక జ్ఞాన ఆరంభం దీనిని పరిగ్రహించడంతోనే మొదలవుతుంది. తన వ్యక్తిగత కోరికలను సచేతనంగా త్యాగం చేసేలా చేస్తుంది. ఇది ఒక నిమ్నమైన పాక్షిక నాగరిక నైతికత. ఇది స్వార్థాన్ని నైతికతకు పునాదిగా చేసుకొని పొందే నిమిత్తమే వదిలిపెడుతుంది. ఒక మనిషి తన స్వల్ప పరిమిత ఆత్మను కోల్పోయి, ఇతరుల్లో మానవజాతిలో, దేశంలో, దేవునిలో బృహదాత్మను కనుగొనడం. ఇదే వేదాంతసూత్రం. ఇదే భారతీయ సందేశం. ఈ సందేశాన్ని అందించడంలోనే ఈమె తృప్తి చెందకూడదు. ఈమె మేల్కొని, పైకిలేచి ఈ ప్రపంచంముందు ఆ సందేశంతో జీవించాలి. తద్వారా దేశానికి మానవులకూ నిరూపితమైన, సుసాధ్యమైన ప్రవర్తనా ధర్మంగా దానిని చేయగలదు.

CWSA 8: 55

ఆర్యచింతనను, ఆర్య శీలాన్ని తిరిగి ఆర్జించండి

మేము ప్రతివ్యక్తికీ ముఖ్యంగా ఎవరైతే నేడు భారతదేశకార్యానికి, ప్రపంచ కార్యానికి దేవుని కార్యానికై సంసిద్ధమౌతున్నారో ఆ యువకులందరికీ... "మీ

మనస్సులను ఐరోపా భావనలకు లోబడజేసి లేక జీవితాన్ని కేవలం భౌతిక దృక్కోణం నుండీ చూచినట్లైతే మన ఆదర్శాలను అభిమానించలేరు. పైగా అంతకంటే యింకా తక్కువగా వీటిని నెరవేర్చగలరు. భౌతికంగా చూస్తే, మీరేమి కారు. ఆత్మపరంగా మీరే సర్వం. భారతీయుడు మాత్రమే ప్రతిదానిని విశ్వసించ గలడు. ప్రతిదానికి సాహసించగలడు. ప్రతిదానిని త్యాగం చేయగలడు. కాబట్టి మొదట మీరు భారతీయు లవ్వండి. మీ పూర్వీకుల వారసత్వాన్ని తిరిగి సంపాదించండి. ఆర్యభావాన్ని తిరిగి పొందండి. ఆర్యక్రమశిక్షణను తిరిగి అలవర్చుకోండి. ఆర్యశీలాన్ని తిరిగి పెంపొందించుకోండి. ఆర్యజీవనాన్ని తిరిగి జీవించండి. వేదాంతాన్ని, గీతను, యోగాన్ని, తిరిగి చేబూనండి. వాటిని బుద్ధితో, యేదోభావావేశంతో మాత్రమే స్వీకరించక జీవితంతో మేళవించుకోండి. వాటిని మీలో జీవింపచేస్తే, గొప్పవారుగా శక్తివంతులుగా నిర్భయులుగా వీర్యవంతులుగా అజేయులుగా తయారవుతారు. ఇటు జీవితం కానీ, అటు మృత్యువుకానీ మీ పట్ల భయాలు కానేరవు. కష్టం, అసాధ్యమన్నది మీ పరిభాషనుండి అదృశ్యమైపోతాయి. మీ ఆత్మలో వున్న బలం శాశ్వతమైది. మీ బయట సామ్రాజ్యాన్ని గెలుచుకొనేముందు మీ లోపలి స్వరాజ్యాన్ని, మీదైన ఆత్మరాజ్యాన్ని తిరిగి కైవశం చేసుకోండి. అక్కడ 'మాత' వశిస్తోంది. ఆరాధనకై వేచి చూస్తోంది. తద్వారా ఆమె మీకు శక్తినివ్వగలదు. ఆమెను విశ్వసించండి ఆమెను సేవించండి. మీ సంకల్పాలను ఆమెకు వదిలివేయండి. మీ అహంకారాన్ని, దేశ బృహత్ అహంకారంలో లయం చేయండి. మీవైయక్తికమైన స్వార్థాన్ని మానవజాతి సేవలో విని యోగించండి. మీలోని శక్తికి మూలాధారాన్ని తిరిగి చేజిక్కించుకోండి. సాంఘిక పటుత్వం సర్వశ్రేష్ఠమైన మేధస్సు, రాజకీయ స్వేచ్ఛ, మానవ చింతనపై అదుపు, ప్రపంచంపై ఆధిపత్యం ఇలా తక్కినదంతా మీకు ప్రాప్తిస్తుంది".... అని చెబుతాం.

CWSA 8: 28 — శ్రీఅరవిందులు

అనువాదం: సి.హెచ్. హర్షవర్థన్ (9441519210)

అఖిల

ల భారత పత్రిక
వంబరు 2018




మతం: ఆధ్యాత్మికత

సంపాదకీయం:

మనిషి, పరిగణన, అనుభవ, సాధారణ పరిధి కావలవున్న "తత్ "వైపు పయనించ డానికి స్వీకరించిన రెండు విశిష్టమైన మార్గాలు మతం, ఆధ్యాత్మికతలు. మానవఉన్నత కార్యకలాపంలో ఒక దానితో ఒకటి పెనవేసుకొనివున్న పార్శ్వాలైనప్పటికీ ఈ విభిన్నమైన రెండింటిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం మూలంగా చాలా గందరగోళం చోటుచేసుకొంది. దాని పరిధిలోనూ, అవగాహనలోనూ యెంతగా పరిమితికి లోనైనప్ప టికీ, చాలామతాల పుట్టుక యెంతో కొంత ఆధ్యాత్మిక వివేకం మీదనే ఆధారపడి వున్నదని మనం చూచినపుడు, యీ గందరగోళానికి కారణం అర్థం చేసుకోగలం. ఏదేమైనప్పటికీ, కాలం జరిగినకొద్దీ మొత్తం వ్యవహారమంతా, ఒక నమ్మక వ్యవస్థగా, కఠిన మత సిద్ధాంతాలుగా మారిపోయింది. శాశ్వతము, పరమసత్యము వైపు, ఒక సజీవ, సచేతన శిక్షణావిధానంగా ఒకప్పుడున్న టువంటిది, చివరకు ఒక సంకుచిత, సామాన్యంగా విధించబడిన కర్మ కాండలుగా, జీవంలేని అవశేషాలుగా మిగిలిపోయింది. ఆ విధంగా చూచినప్పుడు అది, ఉన్నతోన్నత సత్యాలవైపు అన్వేషిస్తూ, ముందడుగు వేసే మనిషి అంతరాత్మ కదొక అవరోధంగా తయారవుతుంది. తమ విశ్వాసం, ఆకాంక్షలతో, దానిలోనికి ప్రాణం పోసే ఆధ్యాత్మతో ఊపిరి లూదడం ద్వారా పవిత్ర గ్రంధాల రక్త, మాంసాలతో నిర్జీవ అస్తిపంజరాన్ని కొంతమంది బ్రతికించగలరనేది కూడా అంతగానూ సత్యమే. ఆ విధంగా చూచినపుడు, అదృష్టవంతులైన కొద్దిమందికి, మతం అనేది, ఆధ్యాత్మికతవైపుకు ఒక అడుగు అవుతుంది. మతం ఆధ్యాత్మికతలను లోతుగా అర్థం చేసుకోవడం, వాటిమధ్య బేధాలు, పరిమితులు, వాటిమధ్య గల సామాన్య సూత్రం,రెండింటిద్వారా పరిణమించే మానవ ఆకాంక్షపై యీ సంచిక దృష్టి పెడ్తుంది.

అనువాదం: కె.వి. రావు (9849929254)



శ్రీఅరవిందులు

సాత్త్విక మానవుడు : ఆధ్యాత్మిక మానవుడు

ఆధ్యాత్మకు గల అనేక పార్శ్వాలలో ఒక్కదానికైనా సంబంధించిన దాన్ని యెంతో కొంతైనా నిజం చేసుకొన్నవానిని ఆధ్యాత్మిక మానవుడు అంటారు. ఏ వ్యక్తి ఆధ్యాత్మికత వైపుగా ఎదగాలని అభిలషిస్తాడో అతడే నిజమైన ఆధ్యాత్మికాన్వేషి. మిగతా కార్యక్రమాలు ఎంత మేధోపరమైనవైనా, నైతికపరమైనవైనా రామణీయకతా సౌందర్యం కలవైనా, సామరస్యతకలవైనా, జవజీవాలపరంగా అద్భుతమైన ఘనకార్యమే. కాని అది ఆధ్యాత్మికత కాదు. అతడు తిరిగి రావీలులేని మానసిక సరిహద్దులు దాటిపోలేదు.

CWSA : 424-425

జీవితము - మతము

ప్రశ్న: ప్రకృతిలో మతం ఎలా రూపుదిద్దుకుంది, అసలు మతం అంటే ఏమిటి; అది ఆధ్యాత్మిక జీవనానికి అవరోధమా?

మతం మానవులలోని ఊర్థ్వ మనసుకు సంబంధించినది. అది ఒక విధంగా అతీత శక్తియైన భగవంతుని చేరుకోవాలనే తపన. ఆ అతీతశక్తినే "దేవుడు" లేక "దివ్యాత్మ" లేక "సత్యము" లేక "జ్ఞానము" లేక "విశ్వాసము" లేక "అనంతుడు", లేక ఒక విధమైన "కేవలుడు," అనవచ్చు. కాని అది ఏదైనా మానవుని సాధారణ మానసికానికి అతీతశక్తియే! ఇందువలన "మతం" అనేది చివరకు "భగవంతుని" గురించే అని అనుకున్నా, దాని అసలైన స్వభావం మానవుని మనస్సు పరిధి లోనిదే కదా! నిజా నికి దేన్ని మనం "మతం"అని అంటున్నామో అది ఒకే ఒక మతానికి మాత్రమే పరిమితమైన విషయం కాదు. "మతాలు" అనగానే చాలా "మతాలు" ఉన్నాయనే అర్థం కూడా వస్తుంది.

మతాలు ఎన్ని ఉన్నా, అవన్నీచెప్పే విషయం మాత్రం ఒకటే. ప్రతిమతమూ, ఒక ప్రవక్తచే స్థాపించబడినదే అని చెప్పవచ్చు. "ప్రవక్త" ఒక దివ్యసత్యాన్ని ప్రచారం చేయటానికి మన మధ్య అవతరించిన కారణజన్ముడు. ఒక విధంగా ఆయన భగవంతుని అంశతో జన్మించాడని నమ్మవచ్చు. ఆయన ప్రతిపాదించిన సత్యము సాధారణ మానవులకు చేరగానే అది క్రమంగా వ్యాపారంగా మారిపోతుంది. అదే క్రమంలో దానికి ఒక రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది. అందులో ఒక అధీకృత వ్యవస్థ, కొన్ని మార్గదర్శక సూత్రాలు శాఖా బేధాలు, ఛాందస భావాలు నీతి నియమాలు పూజా పునస్కారాలు, వచ్చి చేరుతాయి. అవి క్రమంగా అనివార్యం అయిపోతాయి. ప్రభుత్వాల తరహాలో అవి విశ్వాస పాత్రులకు రక్షణనూ, ఎదిరించినవారికి శిక్షలనూ కూడా ఇస్తాయి. మతాన్ని నమ్మకపోయినా శిక్ష తప్పదు.

ఒక స్థిరమైన నమ్మకం ఏమిటంటే ప్రతిమతము "నాదే ఉన్నతమైన సత్యము, ఇతర విశ్వాసాలన్నీ అసత్యాలే. అవన్నీ దీనికి దిగదుడుపే." అని ప్రచారం చేసుకుం టాయి. ఈ విధంగా తాము నమ్మి, ఇతరులను నమ్మించకపోతే మతాలకుమనుగడ ఉండనే ఉండదు. నాదే ఉన్నతమైన సత్యము అని బల్ల గుద్ది నీవు చెప్పకపోతే

ఇతరులను నీవు ఏ విధంగా నమ్మించగలవు? నిన్ను వారు ఎందుకు అనుసరిస్తారు?
CWM 3 : 76-77

మత ప్రయోజనము:

మత సూత్రాలు, సాంప్రదాయాలు మానవ నిర్మితాలే! మనం కేవలం మత పరిధిలోనే ఆలోచిస్తే, వీటికి అవతల ఉన్న సత్యాన్నీ లేక తత్త్వాన్ని అర్థం చేసుకోలేము. దాన్ని కూడా సూత్రాలతో బంధించటానికి వీలుపడదుగదా! కేవలం ఒక మతానికే కట్టుబడి దాని ఆధారంతోనే, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనుకోవటం నీ శక్తివిస్తృతిని నీవే తగ్గించుకున్నట్లవుతుంది. మతాన్ని మన కోణం నుంచి మాత్రమే కాకుండా మరో కోణం నుంచి దర్శించగలిగితే ఏదీ దానికి అడ్డంకి కాబోదు. మతం విస్తృతిని కూడా పెంచి, నట్లవుతుంది. మతం అనేది మానవుల సమున్నత కార్యక్రమం అని భావించి మానవులు సహజమైన ఆకాంక్షలలో ఒకటిగా దాన్ని అవగాహన చేసుకోగలిగితే, అది ఆధ్యాత్మిక జీవనానినికి చక్కని మార్గదర్శి కాగలదు. అదే సమయంలో మానవ మేధస్సునుండి జనించిన మతాలలో ఉండగల అవలక్షణాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. నిజాయితీతో లోతుగా ఆలోచించగలిగితేనే అందులోని అసలు సత్యాన్ని గమనించడం వీలవుతుంది. ఆ విధంగా సత్యం పై మనకున్న ఆకాంక్ష బయట పడుతుంది. అంతేకాదు మానవుల నిర్వాహకం మతాన్ని ఎలా భ్రష్టు పట్టించిందో, ఎంతగా రూపాంతరం చెందించిందో కూడా అర్థం అవుతుంది. దీనికి తగినంత మానసిక సమతౌల్యం, స్థిరత్వం ఉండాలి. అప్పుడే అది నీ ఆధ్యాత్మిక సాధనలో నీకు సహకారం అందిస్తుంది.

ఉద్రేకంవలన వచ్చే శక్తితోనూ, అందువలన జనించే తీవ్రమైన ఆకాంక్షతోనూ ప్రభావితం అయినవారు అన్ని మతాలలో ఉంటారు. కాని వారందరిలో, జ్ఞానమార్గం లోనే దివ్యత్వాన్ని అన్వేషించాలి అనే కోరిక ఉంటుదని చెప్పలేము. అటువంటి ఊహకూడా రానటువంటి బలహీనమనస్కులుగా కొందరు ఉంటారు. అట్టి వారికి మతం మానసికమైన ఊరట మాత్రమే. ఏవో కొన్ని రూపాలను వారు ఆరాధిస్తూ, ఆలయాలు సందర్శిస్తూ, ఆ విధంగా వారి ఆధ్యాత్మిక ఆకాంక్షలను సంతృప్తిపరచు కుంటూ ఉంటారు. వారికి అదే చాలు.

అదే సమయంలో ప్రతి మతంలో కొందరు సమున్నత ఆధ్యాత్మికతను సాధించిన

వారుకూడా ఉన్నారు. కాని "మతం" తనంతట తానుగా వారికి ఆధ్యాత్మికతను ప్రసాదించలేదు. కాని, వారే ప్రయత్నపూర్వకంగా మతంలో ఆధ్యాత్మికతను మేళవించారని చెప్పాలి. అటువంటివారు ఎక్కడ ఉన్నా, ఏ మతానికి చెందినా, వారి ఆధ్యాత్మికజీవన లక్ష్యం ఒకే విధంగా ఉంటుందని చెప్పాలి. ఆ శక్తి వారి అంతరంలోని శక్తి. అది మతం ద్వారా వారికి లభించినది కాదని చెప్పవచ్చు. వారి ఔన్నత్యానికి కారణం కూడా అదే.

CWM 3: 78-79

ఎవరి మతాన్ని వారు అన్వేషించాలి

నీ మతాన్ని నీవు సరిగా అంచనా వెయ్యాలంటే నీవు అన్ని దేశాలలోనూ పర్యటించాలి. అన్ని మతాలనూ అధ్యయనం చేయాలి. నీవు పుట్టి పెరిగిన మతం, దాని విశ్వాసాలు నీకు నిజమైనవనే అనిపిస్తాయి. అది సహజం. కాని మతాలు సాపేక్షాలు అంటే వ్యక్తుల విశ్వాసాలకూ, అలవాట్లకూ సంబంధించినవి. (ఆత్మాశ్రయమైనవి) అవి నిరపేక్షములు కావు. అనేక సందర్భాలలో నీ మతం గౌరవించిన విలువలను వేరొకమతం గౌరవించకపోవచ్చు. ఎవరి విశ్వాసాలు వారివి! మతాలన్నీ ఆ యా ప్రాంతాలలోని సమాజాలు విశ్వసించిన సాంప్రదాయాలనుండే ఏర్పడ్డాయి. అన్ని చోట్లా యోగులు, సాధువులు, మహానాయకులు ఉన్నారు. అట్లాగే సామాన్యులు, దుర్మార్గులు కూడా ఉంటారు. "నా మతమే అన్నిటి కంటే గొప్పది, నేను అందులోనే పుట్టి, అందులోనే పెరిగాను" అని మనం గర్వంగా చెప్పుకున్నా, అది సత్యదూరమే అవుతుంది. మనం మన కుంటుంబం గురించి కూడా ఇట్లాగే భావిస్తాము కదా! "నేను పుట్టి పెరిగిన కుటుంబం అనేక శతాబ్దాలుగా మనుగడలోనే ఉన్నది. అందువలన ఆ సంస్కారమే శ్రేష్ఠమైనదిగా నేను భావిస్తాను" అనటం సహజం.

ప్రతి భావనకూ ఒక అంతరంగ విలువ ఉంది. అది నచ్చినవారికి అది గొప్పదిగా కన్పించటం సహజం. ఇది మతానికి, దేశానికి, భాషకు కూడా వర్తిస్తుంది. అందువలన నీవు సంకల్పించకుండా ఎదురైన దానిని మంచిదో కాదో వెంటనే తేల్చుకోలేవు.

అందువలన మీరు అనుభవాల చట్రం వెలుపలకు ఒక్క అడుగు వచ్చి దేన్నయినా బేరీజు వేయండి. అన్నీ ప్రకృతి మీపై కలిగించిన సంప్రదాయాలనుండి జనించినవే అనీ తప్పక అనిపిస్తుంది.

యాంత్రికమైన స్పందనలు: వీటిని దూరంగా వుంచండి. మీ అంతరంగాన్ని సంప్రదించి, నిరపేక్షంగా అంచనా వెయ్యండి. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఆలోచించండి. అప్పుడు మాత్రమే మీరు, "ఇది నా కుటుంబం, నా దేశం, నాకు నచ్చిన మతం అని నిర్ద్వందంగా చెప్పగలరు."

CMW 3: 81- 82 అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు (9848848291)

ఎవరిపైనా మోపగూడనిది మతం

మీ సంబంధాలన్నీ ఆంతరిక స్వేచ్ఛాయుతమైన ఎంపిక మీద నూతనంగా నిర్మించబడాలి. పరంపరాగతంగా మీరు నివసించే, మీరు పెరిగిన, ఇతరులు కోరుకున్న విధంగా వారి సామాన్యబుద్ధి లేక చుట్టుపక్కల వాతావరణ ఒత్తిడి అన్నీ మీపై విధించబడినవే. మీ సమ్మతిలో నిర్భంధము అనే మౌలికాంశం ఉంది. ప్రజలపై మతము మోపబడింది. తరచు ఏదైనా మత లేదా ఆధ్యాత్మిక ప్రమాదభయ సూచన దానికి సహాయపడుతుంది. కాని ఆ దైవముతో మీ సంబంధములో అటువంటి విధింపు ఏదీ ఉండదు. స్వేచ్ఛామయ హృదయ మస్తిష్కాలతో ఆనందంగా, ఉత్సాహంతో జరిగిన ఎంపిక వుండాలి. "నన్ను బలవంతపెట్టారు, నేను కాదనలేక పోయాను," అని ఎవరైనా వణకుతూ అన్నప్పుడు అటువంటి కలయిక యెటువంటి కలయిక? సత్యము స్వయంప్రకాశము, అది ప్రపంచంపైన రుద్దబడదు. ప్రజలు దానిని స్వీకరించాలన్న అవసరం దానికి లేదు. కారణం, అది స్వయంభు; దాని గురించి ప్రజలు ఏమన్నారన్న దాని మీద లేక వారి అనుసరణమీద అది జీవించదు. కాని, ఎవరైనా మతాన్ని స్థాపించినప్పుడు వారికి చాలా అనుచరులు అవసరం ఉంటుంది. ఏ మతంయొక్క బలమైనా, గొప్పతనమైనా దాని ననుసరించేవారి సంఖ్యాబలంమీద ప్రజలచే నిర్ణయించబడుతుంది. కాని నిజమైన గొప్పతనం అక్కడ లేదు. ఆధ్యాత్మిక సత్యం యొక్క గొప్పతనం సంఖ్యలలో లేదు. ఒక కొత్త మతాన్ని స్థాపించిన వ్యక్తిని, అతని కుమారుని నేనెరుగుదును. ఫలానా మతాన్ని స్థాపించడానికి ఎన్నో వందల సంవత్సరాలు పట్టిందని, వేరొకమతంకూడా వ్యాపించడానికి ఇంకొన్ని వందల సంవత్సరాలు అవసరమయ్యాయని కాని, వారి మతం మాత్రం 50 సంవత్సరాల కాలంలోనే అప్పటికే నాలుగు మిలియన్లకి పైగా అనుచరులని ఆకర్షించిందనే కాక అతను ఇంకా ఇలా ముక్తాయించాడు. "చూశారా మరి, మా మతం ఎంత

గొప్పదో! "మతాలు వాటిలో నమ్మకం కలిగిన అనుచరుల సంఖ్యాబలాన్ని బట్టి వాటి గొప్పతనాన్ని చెప్పుకోవచ్చు. కాని దానినసుసరించేవారు ఒక్కరూ లేక పోయినా సత్యం మాత్రం ఎల్లప్పటికీ సత్యమే.
CWM 3:137

పూజా విధానము మరియు మతపరమైన జీవితము

పూజావిధానమని అక్షరశః దేనినయితే అంటారో అది ధార్మిక జీవితానికి సంబంధించినది. దానిని సరియైన విధి విధానముగా, గహనతరమతపర ఆధ్యాత్మికతతో ఆచరించినప్పుడు అది మస్తిష్కాన్ని, హృదయాన్ని కొంతవరకే తయారుచెయ్య గలుగుతుంది. అంతకుమించి కాదు. కాని, ధ్యానములో భాగంగా ఆధ్యాత్మిక సత్యం కోసం, ఆధ్యాత్మిక చేతనకోసం నిజమైన అభిలాష కలిగి ఉండి భగవంతునితో సంబంధానికి, భగవంతునితో ఐక్యం చెందటానికి తపిస్తూ పూజ సలిపినపుడు అది నిజంగా ఆధ్యాత్మికంగా, ప్రభావాత్మకంగా ఉంటుంది. నీ మనస్సులోను ఆత్మలోను ఆధ్యాత్మిక పరివర్తన కోసం నీకు నిజంగా అభీప్స ఉన్నప్పుడు నీకు మార్గమూ దొరుకుతుంది. మార్గనిర్దేశకుడూ దొరుకుతాడు. కేవలం మానసిక అన్వేషణ, ప్రశ్నించడం మాత్రం ఆత్మద్వారాలు తెరవడానికి సరిపోవు.
CWSA 28: 420

మత పరమైన శిక్షణలు సహాయపడతాయా?

శి: మధురమయీ శ్రీమాతా! సాధారణ చేతన కలిగిన వ్యక్తులకి మతపరమైన శిక్షణలు చాలా ముఖ్యమైనవా?

అమ్మ: మతపరమైన శిక్షణలా? నాకు తెలియదు! మతపరమైన శిక్షణలు అన్నప్పుడు నీ అభిప్రాయం ఏమిటి?

శి: జపము, మొదలైనవి.

అమ్మ: ఓహ్, ఆ విషయాలా! అవి నీకు సహాయపడితే మంచిదే. అవి నీకు సహాయపడక పోతే అది కేవలం పూర్తిగా సాపేక్షమైన విషయాల్లో ఇదొకటి.

ఇదంతా పూర్తిగా సాపేక్ష విషయం. దాని విలువ అది నీ మీద ఎంత ప్రభావం కలిగించిందన్న దాని మీద, దానిని నువ్వు ఎంత విశ్వసిస్తున్నావన్న దాని మీద

ఆధారపడుతుంది. నువ్వు ఏకాగ్ర చిత్తుడవడానికి అది సహాయపడితే మంచిదే. సాధారణ చైతన్యం ఎప్పుడూ దానిని మూఢనమ్మకంతో ఇది నేను చేస్తే, వారానికి ఒకసారి నేను దేవాలయానికో, చర్చికో వెళితే, నేను ప్రార్థనలు చేస్తే, నాకు ఏదో ఒకటి చాలా మంచి జరుగుతుంది." అనే ఆలోచనతోనే చేస్తుంది. ఇది ప్రపంచమంతటా వ్యాపించిఉన్న మూఢనమ్మకం, కాని ఆధ్యాత్మికత దృష్ట్యా దానికి ఎటువంటి విలువ లేదు?

CWM 6 : 193

మతప్రాముఖ్యతగల స్థలాలు, ప్రాణిక జీవులు

మత ప్రాముఖ్యతగల కట్టడాలు, గొప్పగొప్ప మతాలకి సంబంధించిన చిహ్నాలైన కట్టడాలు, ఫ్రాన్స్, జపాన్, లేక ఏ దేశంలోనైనా సరే, దేవాలయాలు, చర్చిలు, దేవతలు ఒకే విధమైనవి కావు.కాని కొద్దిపాటి తేడాలతో ప్రతిచోటా నా అనుభవం మాత్రం సుమారుగా అదే. చర్చిలో ఏ శక్తి కేంద్రీకరించి ఉన్నదో అది భక్తులయొక్క విశ్వాసం మీద, నమ్మకస్థుల మీద నమ్మకం మాత్రమే ఆధారపడి ఉన్నది. అచటవున్న నిజమైన ఆశక్తికి వారు అనుకుంటున్న శక్తికి మధ్య తేడా ఉంది. ఉదాహరణకి ఫ్రాన్సులో ఒకానొక చాలా అందమైన కేథడ్రిల్ (పెద్దగుడి) వున్నది. ఊహకందే వాటన్నింటిలోకీ కళాత్మకదృష్టికి అత్యంత అద్భుతమైన కట్టడం, అటువంటి దానిలో అత్యంత పవిత్రమైన చోట నేను ఒక బ్రహ్మాండమైన నల్లని ప్రాణిక సాలెపురుగుని చూశాను. అది ఆ మొత్తం స్థలమంతా ఆక్రమించి గూడు కట్టుకుని ఉంది. అది ప్రజల భక్తి ప్రవత్తులు, ప్రార్థనలు మొదలైన వాటినుండి వెలువడిన శక్తులన్నింటిని తనలోనికి గ్రహించి భక్షిస్తోంది. అది మనోహరమైన దృశ్యం ఎంతమాత్రం కాదు. అక్కడ ఉండి ప్రార్థనలు చేస్తున్న ప్రజలందరూ ఏదో ఒక దివ్య స్పర్శని అనుభవించి, వారి వారి ప్రార్థనల ద్వారా అన్ని విధాలైన వరాలని పొందుతారు. కాని అక్కడ ఉన్నది మాత్రము ఇదే, ఈ సాలెపురుగే కాని వారికి ఉన్న విశ్వాసం ఆ చెడుని కూడా వారిలో మంచిగా మార్పు చెందించి వారిలో విశ్వాసం కలిగించింది. కనుక నేను నిజంగా వెళ్ళి అక్కడి వారితో "మీరు నిజంగా భగవంతుని ప్రార్థిస్తున్నామని అనుకుంటున్నారా? అక్కడ ఉన్నది ఒక ప్రాణిక సాలెపురుగు, అది మీ శక్తులన్నింటిని ఆరగిస్తోంది." అని అంటే అది నిజంగా వాళ్ళకు ప్రయోజనం కలిగించే మాట అవ్వదు. చాలా

వరకు అది అలాగే ఎక్కువకాలం అన్ని చోట్లా జరుగుతుంది. అక్కడ ఉన్నది ఒక ప్రాణికశక్తి. ఈ ప్రాణికసత్త్వములు మానవుల అరిషడ్వర్గముల భావోద్వేగాల మీద ఆధారపడి బ్రతుకుతాయి. చాలా తక్కువ మంది ప్రజలు, అతి తక్కువ సంఖ్యలో, నిజమైన మతపరమైన స్పృహతో చర్చికి కాని, దేవాలయానికి కాని వెళతారు. అంటే భగవంతుని ప్రార్థించి, అర్థిస్తూ, ఏదో కావాలని కోరడానికి కాక, వారిని వారు సమర్థించుకుని, కృతజ్ఞతలు తెలియజేసి, వారిని వారు యిచ్చివేసుకోవాలనే అభీప్స కలిగినవారు చాలా తక్కువగా ఉంటారు. అలా చేసిన వారు కోట్లాది జనంలో ఎవరో ఒక్కరు కూడా ఉండడం కష్టమే. కనుక వారికి వాతావరణాన్ని మార్చే శక్తి ఉండదు. బహుశా వారు అక్కడ ఉన్నప్పుడు ఏదో ఒక విధంగా దారిచేసుకొని ఎక్కడికో వెళ్ళి ఏదో ఒక విధమైన దివ్యత్వాన్ని స్పర్శిస్తారు. కాని అధిక సంఖ్యాకులు కేవలం మూఢ నమ్మకంతో, అహంకారంతో స్వార్థ కోరికతో వెళతారు వారు ఈ రకమైన వాతావరణాన్ని సృష్టిస్తారు. మీరు చర్చికో దేవాలయానికో వెళ్ళినప్పుడు మీరు అటువంటి భావనలనే పీల్చుకుంటారు. మీరు కేవలం చాలా మంచి భావనలు కలిగి అక్కడకి వెళ్ళినప్పుడు మీకై మీరు ఇలా అనుకుంటారు. "ఆహా, ధ్యానించడానికి ఎంత ప్రశాంతమైన స్థలమిది!"

CWM 6:194- 95 *భావానువాదం: డా. విజయలక్ష్మి (9884020952)*

హేతువు మరియు మతం

నువ్వు ఏ మతాన్నయినా నీ హేతుబుద్ధితో అంచనావేస్తాననుకుంటే నువ్వు తప్పనిసరిగా తప్పులు చేస్తావు, ఎందుకంటే మతం అనేది హేతుత్వపరిధికి అతీతమైనది. సాధారణ జీవన పరిధిలోని సహేతుక విషయాలను నిర్ణయించడానికి హేతుబుద్ధి సరిపోతుంది. ఆ తరువాత ఆయన చెప్పినట్లుగా హేతుబుద్ధి నిజమైన పాత్ర మానవుని జీవనంలోని ముఖ్యమైన మానసిక కదలికలను అదుపులో పెట్టి నిర్వహించడమే.

ఉదాహరణకు ప్రతిసారీ ఏ ఒక్క వక్తికైనా ఒక విధమైన ముఖ్యమైన అస్తవ్యస్తత, కలత, వాంఛలు, ఉద్రేకాలు, వంటివి కలిగినపుడు వ్యక్తి వాటికి కారణాలు వెతికి హేతు దృష్టితో చూచిపుడు వాటిని క్రమబద్ధీకరించ గలడు. మనిషి ముఖ్యమైన మానసిక జీవన కదలికలను క్రమపరిధిలో ఉంచడంలో హేతుబుద్దిదే ముఖ్యపాత్ర.

కానీ మతవిలువలు తెలుసుకోవడానికి యధార్థంగా నిన్ను దైవమార్గంలో పెట్టి దైవంతో సాన్నిహిత్యాన్ని కలిగించడానికి ఆధ్యాత్మిక జీవితంవైపు నిన్ను నడిపించడానికి నిర్ణయం తీసుకొనే శక్తి హేతుబుద్ధికి లేదు. నిజానికి మతం గురించి దానికేం తెలియదు. అది దాని క్షేత్రం కాదు. ఏమీ అర్థం కాదు కూడా. మనం ఇతరపద్ధతులను ఉపయోగించాలి.

CWM 7: 167- 68

సాధారణ జీవితంలో మతం ఆవశ్యకత

దివ్యమాతా, మతం సాధారణ మానవుని నిత్యజీవనానికి అవసరమా?

సామాజిక జీవనానికి మతం ఎంతో అవసరం, ఎందువలనంటే అది సాముదాయక అహంకారాన్ని సరిదిద్దుతుంది. ఆ విధమైన నియంత్రణ లేకపోతే అహంకారం అత్యధిక మోతాదులో పెరుగుతుంది.

సామూహిక చైతన్యం ఎప్పుడూ కూడా వ్యక్తుల చైతన్యం కన్నా తక్కువ స్థాయిలోనే ఉంటుంది. అది మనం తెలుసుకోగలం. ఉదాహరణకు ఎప్పుడైనా చాలామంది మనుష్యులు ఒక ప్రదేశంలో గుంపుగా కలుసుకొని అతి పెద్ద సమూహంగా ఏర్పడినపుడు వాళ్ళ చైతన్యం చాలా క్రిందిస్థాయికి పడిపోతుంది. ఒక గుంపులో సాముదాయక చైతన్యం వ్యక్తిగత చైతన్యంకన్నా తక్కువ స్థాయిలోనే ఉంటుంది. సమాజంలో సాముదాయక చైతన్యం సమూహంలోని వ్యక్తుల వ్యక్తిగత చైతన్యంకన్నా ఖచ్చితంగా దిగువస్థాయిలోనే ఉంటుంది.

సాధారణ జీవనంలో మనిషికి తెలిసినా తెలియకపోయినా మతం అనేది తప్పని సరిగా ఉంటుంది. చాలా ఆవశ్యకంకూడా కానీ మతంపట్ల వారి లక్ష్యం చాలా నిమ్నస్థాయిలో ఉంటుంది. ఆ వ్యక్తి ఆరాధించి, పూజించే దేవుడు లేదా శక్తిని ఇచ్చే దేవుడు. ఇంకా సరళంగా చెప్పాలంటే ఆ కుటుంబం కొలిచే దేవుడు. పిల్లల దేవుడు, పూర్వీకులు ఆరాధించిన దేవుడు.

మతం అనేది ఎప్పుడూ ఉంది, మత ధర్మము మాత్రం వ్యక్తులకు అనుగుణంగా మారుతుంది. కానీ మానవుడు జీవించడానికి జీవనం కొనసాగించడానికి ప్రాథమిక రూపంలోనైనా సరే ఏదో ఒక ఆదర్శం లేకపోతే చాలా కష్టం. అదే ప్రాథమిక ఆదర్శం వ్యక్తి జీవనానికి మూలబిందువుగా పనిచేస్తుంది. వ్యక్తిని తన ఆదర్శం ఏమిటి

అని అడిగినపుడు అతడు దానిని వివరించ లేకపోవచ్చు. బహుశా అది ఏమిటో తెలిసి ఉండకపోవచ్చు. కానీ అస్పష్టంగానైనా సరే ఏదో ఒకటి అతనికి జీవితంలో అత్యంత విలువైనదిగా అనిపించవచ్చు.

CWM 9 : 354 - 55

సాంఘిక రాజకీయ సిద్ధాంతాలు, మతం

ప్రతి సామాజిక రాజకీయ ఆలోచనలలోను, మతంగురించి చెలియచేసే భావాలు అతి ప్రాథమిక దిగువ స్థాయికి చెందినవిగానే ఉంటాయి. భావనా శక్తి ఏర్పడగానే ఆలోచన బయలుదేరి కఠినమైన నిత్య జీవితంలో క్షణ, క్షణం జరిగే వాటికి అతీతంగా దేనికోసమో ఒక ఆకాంక్ష తప్పనిసరిగా కలుగుతుంది.

విడిగా వ్యక్తులకైనా సమాజాలకైనా విలువలు, వారు పాటించే ఆదర్శాలు, మతజీవితంలో అంతిమ లక్ష్యంగా దేన్నైతే కోరుకొంటున్నారో వాటన్నింటికీ ఇచ్చే విలువలకు అనుగుణంగానే ఉంటుంది.

మనం మతం గురించి మాట్లాడినపుడు అంటే గుర్తింపు కలిగిన మతం గురించి నిజానికి తనకి తెలిసినా తెలియక పోయినా తనకంటూ ఒక మతం ఉంటుంది. అది ఎంతో గుర్తింపు, చరిత్ర గలది అవ్వచ్చు. ఇది ఎంత వాస్తవం అంటే ఒకరు మత విశ్వాసాలను ఎంత ఔపోసన పట్టినా, నియమానుసారంగా మత సంప్రదాయాలను అమలు పరుస్తున్నా, వ్యక్తులు మతాన్ని తమదైన శైలిలో అర్థం చేసుకొని ప్రవర్తిస్తారు. మతం పేరు మాత్రమే ఒకటి కానీ ఆ మతాన్ని ఆచరించే వ్యక్తులందరూ ఒకే విధ మైన మత విధానాలను ఆచరించరు.

అజ్ఞేయ ఉన్నతమైన అతీత శక్తి గురించిన యీ ఆకాంక్షను ఏదో ఒక విధంగా వెల్లడిచేయలేకపోతే మానవ మనుగడ చాలా కష్టతరం అని మనం చెప్పగలం. ప్రతి వ్యక్తి మనసులో ఈ భావనలు, మంచి జరగాలన్న ఆశ అది ఎలాంటి దైనా సరే లేకపోతే వ్యక్తులు జీవించడానికి, జీవనం సాగించడానికి కావలసిన శక్తిని కనుగొనడం కష్టమౌతుంది.

(నిశ్శబ్దం)

కాని చాలా కొద్ది మందికి మాత్రమే స్వేచ్ఛగా ఆలోచించగల సామర్థ్యం ఉంటుంది. తమదైన ఒక ప్రత్యేక మత విధానాన్ని ఏర్పరచుకోవడంకన్నా, ఒక

మతంలో ప్రవేశించడం ఆ మతాన్ని అంగీకరించి, అనుసరించడం చాలా సులభం. అందుచేత స్పష్టంగా వ్యక్తి అటుకానీ, ఇటుకాని ఉంటాడు. వాస్తవానికి అది బయటకు కనిపించేది మాత్రమే.

CWM9: 355

మతాలలోని లోపం

సాధారణంగా ఏ రెండు దారులు ఒకేలా ఉండవు. ప్రతివ్యక్తి తన దారిని తనే వెతుక్కోవాలి. అది హేతుబద్ధమైన ఆవిష్కరణ అంటే పొరపడినట్లే, అది ఆకాంక్ష 'ఆవిష్కరణ', అది అధ్యయనం మరియు విశ్లేషణలతో సాధ్యం కాదు. కేవలం అంతరాత్మని నిష్కల్మషంగా చిత్తశుద్ధితో తెరిచి ఎంతో తీక్షణతతో ఆకాంక్షించి నప్పుడు సాధ్యం .

ఎప్పుడైతే వ్యక్తి నిజాయితీగా, ప్రత్యేకంగా ఆధ్యాత్మికసత్యం వైపు తిరుగు తాడోదానికి ఏ పేరు పెట్టినా సరే, మిగిలే విషయాలన్నీ అప్రధానం అయినపుడు ఆ ఒక్కటే ఆవశ్యకం, అనివార్యం అయినపుడు, ఒక్క క్షణం బలంగా, సంపూర్ణంగా పూర్తి ఏకాగ్రతతో చూసినా చాలు సమాధానం పొందటానికి.

ఈ విధానంలో ఎవ్వరూ ఖచ్చితంగా తప్పు చెయ్యరు. దానినుంచి ఎవ్వరూ అంధ విశ్వాసాలను రూపొందించనంతవరుకు సూత్రీకరణ ఇంచుమించు ఒకేలా ఉంటుంది. దానికి పెద్ద ప్రాధాన్యతకూడా ఉండదు.

అది నీకు మాత్రం అవసరమైనది మంచిది. దాన్ని ఎవరిమీదనైనా బలవంతంగా రుద్దాలనుకుంటే అది ఎంత ఉత్తమమైనది అయినా సరే తప్పనిసరిగా కృత్రిమమైనది అవుతుంది.

అందువల్లనే మతాలు ఎప్పుడూ తప్పుగా అనిపిస్తాయి. ఎందువల్లనంటే అను భవాల అభివ్యక్తీకరణను ప్రమాణీకరించి వాటిని ఇతరుల మీద బలవంతంగా ఖండింప నలవికాని సత్యంగా రుద్దాలని ప్రయత్నిస్తారు. ఆ అనుభూతిని తయారుచేసినవానికి మాత్రం అది సత్యం, సంపూర్ణం, నమ్మదగినది. అది అనుభవించడానికి సూత్రీకరణకు అద్భుతమైనది.

కానీ అది ఇతరులమీద తిరుగులేని సత్యంగా, బలవంతంగా విధిద్దాం అనుకుంటే అది మొట్టమొదటి తప్పిదం. మొత్తం మీద విపత్కర పరిణామాలను కలుగజేసి

సత్యానికి అతి దూరంగా తీసుకువెళ్తుంది.

అందువల్లనే అన్ని మతాలు అవి ఎంత అద్భుతమైనవైనాసరే మనుషుల్ని మితిమీరిన దుర్మార్గం వైపు నడిపించాయి. మతం ముసుగులో చేసే అన్ని నేరాలు దుష్కార్యాలు అన్నీ కూడా మానవుల చరిత్రలో మాయని మచ్చలు, అదే ఒకరికి సత్యం అనిపించినది, సంఘంలోని అందరికీ సత్యమే, అన్న అభిప్రాయం కలిగించాలి అన్న ఒక చిన్న ప్రాథమిక తప్పిదంవల్ల జరిగిన విధ్వంసం.

మార్గాన్ని చూపించాలి, ద్వారాలు తెరిచి ఉంచాలి. ప్రతివ్యక్తీ ఆ మార్గాన్ని అనుసరించి ఆ ద్వారం గుండావెళ్ళి స్వయంగా వ్యక్తిగత అనుభవాన్ని పొందగలగాలి.

వ్యక్తి ఆశించి పొందగలిగే ఒకే ఒక్క సాయం దివ్యకృప అది దానంతట అదే వ్యక్తి అవసరానికి అనుగుణంగా రూపం దాలుస్తుంది.

CWM 9:407 *అనువాదం: డా. టి.యస్. రాజకుమారి (9849412227)*

తెగల మొండి పట్టుదలలు మతాల అసహనం

తెగల మొండిపట్టుదలలు, మతాల అసహనం బాహాటంగా ప్రదర్శించబడేది, నిజానికి తెగలు, మతాలు, కేవలం వారి విశ్వాసాలు మాత్రమే జ్ఞానమని, ఇతరుల విశ్వాసాలు తప్పుల తడక, అజ్ఞానం లేదా డాంబికాలు పోవటమేనని అనుకోవడం మూలంగానే.

ఈ అల్పగమనమే వారిని వారు విశ్వసించినదే నిజమైన సిద్ధాంతంగా నెలకొల్ప టానికీ, ఇతరులు సత్యమని విశ్వసించిన వాటిని తీవ్రంగా ఖండించేటట్లు చేయడానికీ కారణమైంది. కేవలం నీ జ్ఞానం ఒక్కటే నిజమైనదని అనుకోవడం, నీ విశ్వాసమే సత్యమని, ఇతరుల విశ్వాసాలు సత్యదూరమైనవని తలంచడం అనేది కచ్చితంగా అన్ని తెగలు, మతాలు, చేసిన దానినే చేయడం అవుతుంది........

నీవు చేస్తున్నపనిలో నిన్ను నీవు గమనించుకుంటే, నీకు ఈ అసహనం తీరు తెన్నులు అర్థం అవుతాయి. నీవు తక్షణం ఇటువంటి పనికిమాలిన వాగ్వివాదాల న్నింటికీ తెర దించగలవు. ఈ విషయం మనలను తిరిగి వెనక్కి, ఈ వరకే నేను ఒకసారి చెప్పినదాని చెంతకే చేర్చుతున్నది. సత్యవిషయాలతో నీకున్నటువంటి సంబంధం, వ్యక్తిగతమైన సంబంధం — హెచ్చుతగ్గులతో కూడిన ఒక సంబంధం, స్పష్టము, సమృద్ధము, విశాలమూ, పవిత్రమూ, అయినటువంటిది — అది ఒక

ప్రత్యేక వ్యక్తిగా అయిన నీకు చాలా ఆసక్తిదాయకమైన, బహుశా నిశ్చయాత్మకమైన అనుభవాన్ని కూడా ఇచ్చి ఉండవచ్చు. నీవు దానిని అవశ్యం విశ్వజనీన అనుభవమనీ, అదే సంబంధం ఇతరులకు అదే అనుభవాన్నిస్తుందని తలపోయరాదు. నీవు దీనిని అదేదో పూర్తిగా వ్యక్తిగతమని, ప్రత్యేకించి ఒక వ్యక్తికే చెందినదని, ద్రష్టకు సంబంధించినదని, అది ఏ మాత్రమూ సంపూర్ణం కాదని, సర్వసాధారణ సూత్రమూ, కాదని అర్థం చేసుకొంటే అప్పుడు నీవు ఇక ఎంత మాత్రమూ ఇతరుల జ్ఞానాన్ని తృణీకరించబోవు. అంతేగాక నీ సొంత దృష్టి కోణాన్ని, అనుభవాన్ని ఇక వారిమీద రుద్దడానికి చూడవు. ఈ అవగాహనే ఎప్పుడూ పూర్తిగా ఎందుకూ కొరగాని అన్ని మానసిక ఘర్షణలను నివారిస్తుంది.

CWM 10: 21

చాలామంది ప్రజలు మతాన్ని సామాజిక అలవాటుగా అనుసరిస్తారు

ఇతరుల దృష్టిలో తమను పనికిమాలినవారని అనుకోకుండా ఉండటానికి ప్రజలు మతాన్ని సామాజిక అలవాటుగా అనుసరిస్తారు. ఉదాహరణకు, ఒక గ్రామంలో మతకార్యాలకు వెళ్ళకుండా ఉండడం కష్టమైనపని, కారణం పొరుగువారందరూ నిన్ను వేలెత్తి చూపుతారు. కాని దానికి ఆధ్యాత్మిక జీవితానికి ఎటువంటి సంబంధమూ లేదు, ఏ మాత్రమూ లేదు.

CWM 8: 147

ఇక్కడ మాకు మతం లేదు. మేము మతాన్ని ఎక్కువ అసలైన, ఎక్కువ లోతైన, అనగా దైవానికి ఎక్కువ దగ్గరగా ఉండే ఆధ్యాత్మిక జీవితంతో పునఃప్రతిష్ఠ చేస్తాం. కారణం, దైవం ప్రతి ఒక్కదానిలోను ఉన్నాడు, కాని మనకు ఆ ఎరుక లేదు. ఇంతటి అపారమైన పురోభివృద్ధినే మనిషి అవశ్యం సాధించాలి.

CWM 13:110

మతమౌఢ్యమంతా తప్పే

మతమౌఢ్యమంతా తప్పే, కారణం అది భగవంతుని దివ్యసత్యపు వాస్తవమైన ప్రకృతికి విరుద్ధం. దివ్యసత్యం బైబిలు లేక వేదం లేక ఖురాను వంటి ఒకే ఒక పుస్తకంలోను లేదా ఒకే ఒక మతంలోను మూసివేయబడ గలిగింది కాదు. దివ్య అస్తిత్వం

శాశ్వతం, విశ్వజనీనం, అనంతం, కేవలం ముసల్మానుల లేదా సెమిటిక్ (యూదు) మతాల ఆస్తికాదు, బైబిలును అనుసరించేవారి యూదులు లేదా అరబ్బు ప్రవక్తల వాటి స్థాపకుల ఆస్తి కాదు.

హిందువులకు కన్ఫ్యూషియన్స్కు, టావోయిస్టులకు మిగతా అందరికీ, భగవంతుని సంబంధం కలిగి వుండడానికి తమ స్వకీయమార్గంలో దివ్యసత్యాన్ని కనుగొనడానికి అంతగానూ హక్కువుంది. మతాలన్నీ కొంత సత్యాన్ని తమలో కలిగి ఉన్నాయి. కాని దేనిలోనూ మొత్తం సత్యం లేదు, అవి కాలంలో సృష్టించబడినవి. అంతిమంగా క్షీణించి, నశించిపోతాయి. మహమ్మదుకూడా ఖురాను దైవంయొక్క ఆఖరి సందేశమని మరేదీ ఉండబోదనీ ఎన్నడూ నమ్మబలకలేదు.

దైవము, దివ్యసత్యము ఈ మతాలను మించినవి, వాటికవి సవ్యంగాదివ్యవివేకం తాను ఎంపికను చేసుకొనే రీతిలో ఏ విధంగానైనా ఏరూపంలోనైనా, అభివ్యక్త మౌతాయి. భగవంతుడిని నీకు సంకుచితమైన నీ స్వంత మెదడులోని పరిమితులతో మూసివేయలేవు లేదా దివ్య ఆధిపత్యశక్తికి దివ్యచైతన్యానికి ఏ విధంగా లేదా ఎక్కడా లేదా ఎవరిద్వారా అది అభివ్యక్త మవ్వాలోననే దానిని నీవు పురమాయించలేవు, దివ్యశక్తిమంతుని కెదురుగా నీవు నీ దుర్బలమైన అడ్డంకులను ఉంచలేవు......

....నేను ఎవ్వరినీ మార్చటానికి ఇక్కడ లేను, నా వద్దకు రావాలని నేను ప్రపంచానికి బోధ చేయను. నేను ఏ ఒక్కరినీ పిలువను. ఎవరికైతే వారిలో వారికి నా వద్దకు రావాలనే పిలుపు అనుభూతి కలిగి దానికి అంటిపెట్టుకొని ఉన్నారో వారిలో దివ్యజీవనం దివ్యచైతన్యం స్థిరపరచటానికై నేను ఇక్కడ ఉన్నాను, ఇతరులలో కాదు. మమ్ములను అంగీకరించమని నేను నిన్ను అడగటం లేదు. శ్రీమాతనిన్ను అడగటంలేదు. నీవు ఏ రోజైనా వెళ్ళిపోవచ్చు. నీ యిష్టాయిష్టాలను బట్టి, ప్రాపంచిక జీవితాన్ని గాని, లేదా ఒక మతైక జీవితాన్ని గాని జీవించవచ్చు. నీవు ఏ విధంగా సర్వస్వతంత్రుడవో, అదే విధంగా ఇతరులు కూడా ఇక్కడ ఉండడానికి తమసొంత విధానాన్ని అనుసరించడానికి సర్వస్వతంత్రులు...."

CWM 35: 482

మతం అత్యంత చేటు విషయాలకు, అత్యంత మంచి విషయాలకు ప్రేరణగా ఉంటూవచ్చింది, అత్యంత భయంకరమైన యుద్ధాలు చేయబడినప్పటికీ, దాని పేరుమీద అత్యంత అసహ్యకరమైన అత్యాచారాలు కొనసాగించుకొనబడటానికి

పరమోత్కృష్ట వీరత్వాన్ని, ఆత్మ- త్యాగాన్ని కూడా దాని ఉద్యమంలో ఉద్దీపనం చేసింది. వేదాంతంతో పాటు తన అత్యంత ఉన్నతమైన కార్యకలాపాలలో మానవ మనస్సు ఎంతవరకు చేరిందో చూపింది. నీవు గనక దాని బాహ్యాకృతికి బానిసవైతే, అది ఒక ప్రతిబంధకం, ఒక సంకెల అవుతుంది. నీకు దాని అంతర్గత సారపు విని యోగం తెలిస్తే, అది నీకు పరమాత్మ సామ్రాజ్యంలో దూకటానికి సహాయం చేసే టటువంటి దూ కే- బల్ల అవుతుంది.

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రత్యేకమైన దివ్యసత్యంగా తెలియపరచబడే ప్రపంచం లేదా విశ్వంయొక్క యెటువంటి దృక్పథానికైనా, అందులో ఒకరికి తప్పకుండా సంపూర్ణమైన విశ్వాసం నెలకొన్నప్పుడు మనం దానికి మతం అనే పేరు పెట్తాం. దానికి సర్వసాధారణ కారణమేమిటంటే ఈ దివ్యసత్యం దైవాదేశం ఫలితంగా వచ్చిందని ప్రకటించబడడం మూలంగానే.

చాలా మతాలు భగవంతుని ఉనికిని రూఢిగా నొక్కి చెప్తాయి. ఆయన ఆజ్ఞప్రకారం నడచుకోవటానికి నిబంధనలను (సూత్రాలను) స్థిర పరుస్తాయి. కాని అదే విధంగానే, ఒక మహదాదర్శం లేక మహాస్థితి పేరుతో సామాజిక - రాజకీయ వ్యవస్థలలాంటి దైవం లేనటువంటి కొన్ని మతాలున్నాయి. అవికూడా అదే సరియైనదని దానికే అజ్ఞాబద్ధులై ఉండ మంటూ ఒత్తిడి చేస్తాయి. తన స్వంత విధానాలలో దివ్యసత్యాన్ని స్వేచ్ఛ గా పొందటం దానిని స్వేచ్ఛగా సమీపించటం అనేది మానవుని హక్కు. కాని ప్రతి ఒక్క వ్యక్తి తెలుసుకోవలసిన విషయం, అతని ఆవిష్కరణ కేవలం అతనికి మాత్రమే శ్రేయోదాయకం, దానిని ఇతరులపై రుద్దడం జరగకూడదు.

CWM 13:

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ (8639106913



శ్రీమాత

ఆధ్యాత్మిక అనుభవం అంటే వ్యక్తికి తనలోని దైవంతో సంబంధం ఏర్పడటం (లేదా బయటకూడా ఏదైనా ఒకటే) ఈ ఒకే అనుభవమే సర్వత్రా అన్ని దేశాల్లోనూ, అన్ని కాలాలలోనూ అందరిలోనూ సంభవిస్తుంది. నీవు దైవాన్ని కలుసుకుంటే అదే దైవాన్ని అన్ని వేళలా, అన్ని చోట్లా ఒకే మాదిరిగా (ఆయనను) కలుసుకొంటావు. తేడా ఎక్కడొస్తుందంటే అనుభవానికి ఆచరణలో అది తీసుకొనే రూపానికి మధ్య పెద్ద అగాధం తయారౌతుంది. నేరుగా నీవు ఆధ్యాత్మిక అనుభవాన్ని పొందగలిగి వుంటావు. అది ఎల్లప్పుడూ అంతర చేతనలో పొంది వుంటావు. అది ఎప్పుడూ అంతర చేతనలో చోటు చేసుకొంటుంది. అది నీ బాహ్య చేతనలో మరోవిధంగా నీవు నేర్చిన విద్య, నీ విశ్వాసం, మీవు ముందుగానే కల్గించుకున్న మానసిక సంకల్పానికి అనుగుణంగా తర్జుమా అవుతుంది. వున్నది ఒక సత్యమే, ఒక సద్వస్తువే. అది బహురూపాల ద్వారా అనేకంగా వ్యక్తమవ్వవచ్చు.

CWM 3: 16-17

ఆధ్యాత్మిక జీవితం

సాధారణ జీవితం - ఆధ్యాత్మిక జీవితం

ఆధ్యాత్మిక జీవితం, ధార్మిక జీవితం సాధారణ జీవితం (నైతికత దీనిలో ఒక భాగం). ఈ మూడు నిజానికి పూర్తిగా భిన్నమైనవి. ఒక మనిషి వీటిలో దేనిని కోరుకొంటున్నాడన్నది అతడు తెలుసుకోవాలి. మూడు జీవితాలను కలిపివేసి తికమక పడకూడదు. సాధారణ జీవితం అన్నది భగవంతుని నుండీ తన నిజ ఆత్మ నుండీ వేరైపోయిన సగటు మానవ చైతన్యం. అది అజ్ఞాన, నియమాలైన శరీరం, ప్రాణం, మనస్సుల సాధారణ అలవాట్ల చేత నడుపబడుతుంది. ధార్మిక జీవితం అదే అజ్ఞాన పూరితమైన మానవ చేతన మరో గమనం. అది పృథ్వినుండీ వెనుతిరిగి దైవంలోకి మళ్ళిపోవడం లేదా పోవటానికి ప్రయత్నించడమే. అదింకా జ్ఞానశూన్యంగా మూర్ఖమైన అభిమతంతో భూచేతనా బంధనాలనుండీ విడిపోయి దివ్యానందమయ 'ఆవలికి' దాటిపోయేందుకు మతశాఖలు ఏర్పరచిన నిబంధనలతో నడుపబడుతుంది. అయితే ఈ ధార్మిక జీవనం ఆధ్యాత్మికతవైపుకు జరిగే తొలి ప్రయత్నం కావచ్చు. కానీ ఈ మతపరమైన ఆచారాలు, సంస్కారాలు సాధనలు, భావజాలాలు, రూపాలు, వాటినే మళ్ళీ మళ్ళీ ప్రయోజన రహితులుగా చేయడంలా కనిపిస్తుంది. ఆధ్యాత్మిక జీవితంపై వాటికి భిన్నంగా నేరుగా జరిగే ఒక చేతనా పరివర్తన. తన యధార్థ ఆత్మలో నుండీ, దైవంనుండీ విడిపోయిన సాధారణ అజ్ఞాన చేతననుండీ మహోన్నత చేతనలోనికి పరివర్తన. ఆ చేతనలో వ్యక్తి తనలోని అసలు పురుషుణ్ణి కనుగొంటాడు. మొదట ప్రత్యక్ష సజీవ సంపర్కంలోకి ప్రవేశిస్తాడు. ఆ పిదప దైవంతో మమేకమౌతాడు. ఆధ్యాత్మిక అన్వేషికి చేతనా పరివర్తనమే ఒక ప్రత్యేక ఆవిష్కరణ అవుతుంది. తక్కిన దేదీ అతడికి పట్టదు.

నైతికత అన్నది సాధారణ జీవితంలో ఒక భాగం. అది కొన్ని మానసిక నియమాల ద్వారా బాహ్య ప్రవర్తనను నియంత్రించుకొనే ఒక ప్రయత్నం. లేదా మానసికంగా ఏర్పాటు చేసుకొన్న ఒక నిర్దిష్టమైన ఆదర్శాన్ని ప్రతిబింబించే ఆయా నియమాల ద్వారా వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవడం. ఆధ్యాత్మిక జీవితం మనస్సును దాటి పోతుంది. ఇది ఆత్మకు చెందిన ప్రగాఢ చేతనలోకి ప్రవేశిస్తుంది. ఆత్మ, అసలు సత్యంలో పనిచేస్తుంది. నైతిక జీవితం దైవసాక్షాత్కారం ఆవశ్యకత అన్న ప్రశ్న

వచ్చినప్పుడు, జీవితలక్ష్యాలను నెరవేర్చడమంటే ఏమిటి అన్న దానిపై అది ఆధారపడి ఉంటుంది. ఆధ్యాత్మిక చేతనలోకి ప్రవేశించడం అనేది దానిలో ఒక భాగమే అయితే నైతికత అన్నది నీకేమి ఇవ్వదు.

CWSA 28: 419- 420

ఆధ్యాత్మిక జీవితం - అద్భుతాలు

అద్భుతాల కున్న గిరాకీ మీదే చాలా మతాలు స్థాపించబడ్డాయి. కొన్ని కారణాల వల్ల నేను దీనినంతా నిక్కచ్చిగా రాజకీయమని పిలుస్తాను. ఆయా మతాల వారు ఆ మత మూలాల్లో వారి మతస్థాపికులు చేసి చూపిన లీలల్ని ఆధారాలుగా కొన్ని అట్టిపెట్టుకుంటారు. ఆ మతప్రవక్తలోని దైవశక్తిని నమ్మేందుకై అతడు చేసిన లీల ల్ని చూడడం అవసరంగా అట్లాంటి ఆసక్తిని అజ్ఞులైన ప్రజల్లో కలిగేలా మోటుపద్ధతిలో వాళ్ళను ప్రేరేపితుల్ని చేస్తారు. ఇదొక అసాధారణ అజ్ఞానం. ఎందుకంటే అద్భుతాలు చూడడానికి దైవశక్తి, దివ్యచేతన అన్నది అవసరమే లేదు. ప్రాణికలోకంలోని అల్పజీవుల (భౌతిక లోకంతో సంబంధం పెట్టుకొని దానిలో పనిచేయటానికి ఇవి సరిపోతాయి.) సహాయంతో అద్భుతాలు చేయడమన్నది గొప్ప ఉన్నతస్థాయిల్లోని చేతనలో జీవిస్తూ, తక్కిన అన్ని సూక్ష్మ సీమల మధ్యవర్తిత్వంతో మాత్రమే ప్రకృతిపై పనిచేయడంకంటే చాలా తేలికైన పని. దైవికంగా ఉండడమంటే అతడు చనిపోయినవారిని బ్రతికించ గలడు. వ్యాధుల్ని మాన్పగలడు. ఇలా ఇంకెన్నో అద్భుతాలు చేయగలడు. అదే దైవత్వానికి ఋజువు అనిమానవ మేధస్సుకు పదేపదే చెప్పుతూ వచ్చారు. అయితే నేనిప్పుడు గ్యారంటీ ఇస్తున్నాను. అది ప్రమాణమే కాదు. అది ఋజువు చేస్తున్నది ఏమిటంటే ఈ గురువులు ఆ ప్రాణిక లోకంతో సంబంధాన్ని కల్గి వుండి, ఆ జీవుల సహాయంతో ఇక్కడ అద్భుతాలు చేసి, చూపుతారు. అంతే.

CWM 4: 82- 83

కాబట్టి ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించటానికి నిన్ను అర్హునిగా చేసే గుణాలు నీవు కల్గివుండాలి. అవి నీవు ప్రతిదానిలోనూ, మితంగా ఉండటానికి నీ పనిలో సంతులనం, నీ ఆంతరికంలో సమత నిత్యనిష్ఠా, యదార్థతత, భక్తిని కలిగి వుండాలి.

CWM 3: 190

ఎన్ని గంటలు ధ్యానంలో వున్నావన్నది ఆధ్యాత్మికాభివృద్ధికి ఋజువు కాదు. ధ్యానంలోకి వెళ్ళి పోవడానికి నీవు శ్రమించవలసిన అవసరం లేకపోవడమే నీ అభివృద్ధికి ఋజువు. అలాంటప్పుడు ధ్యానాన్ని ఆపుచేయడానికి ప్రయత్నించాల్సి వస్తుంది. ధ్యానాన్ని ఆపటం ఎంతో కష్టమౌతుంది. దైవాన్ని గూర్చి ఆలోచించడాన్ని ఆపడం ఎంతో కష్టంగా ఉంటుంది. సామాన్య చేతనా స్థాయికి దిగి రావడం చాలా కష్టమౌ తుంది. అదిగో అప్పుడు నీవు పురోగమనంలో వున్నట్లే. నీ దృష్టినంతా దైవంపై నిలపడమే నీ జీవితానికి ఆవశ్యకమైనప్పుడు ఆ ఏకాగ్ర స్థితి లేకుండా ఏమీ సాగదో, ఉదయం నుండీ సాయంకాలం వరకూ నీవేపనిలో నిమగ్నమై వున్నా నిరంతరం సహజంగా అదే. తల్లీ నీ స్థితి కొనసాగుతూవుంటే అప్పుడు నీవు పురోగమిస్తున్నట్లు. నీవు ధ్యానానికి కూర్చొన్నా, లేక ఇటు అటు తిరుగుతూ ఏదో పనిచేస్తున్నప్పటికీ నీకవసరమైనది మాత్రం చైతన్యం. అదొక్కటే నీకు అవసరం. స్థిరంగా దైవంతో సచేతనుడై వుండటం.

*

మనం చేసే ప్రతిదానిలోనూ, అన్ని వేళలా, మనల్ని పనుల్లోనూ, ప్రతి చర్యలోనూ దైవం మీద ఏకాగ్రమవ్వడానికే మనం యత్నిస్తున్నాము. ఇక్కడ ఉండేవారిలో కొందరికి ధ్యానం చేయమని చెప్పాం. మరి కొందరికి అస్సలు ధ్యానాన్ని సూచిం చడమే ఉండదు. ఇక్కడ దీని అర్థం. వారు పురోగమించట్లేదని తలంచడం కాదు. వారు కూడా ఒక రకమైన క్రమశిక్షణను అనుసరిస్తున్నారు. అయితే అది కొంచెం భిన్న స్వభావం కలది. పనిచేయడం, భక్తి ప్రవత్తులతో వ్యవహరించడం ఒక ఆంతరిక సమర్పణతో వుండటం కూడా ఆధ్యాత్మిక సాధనే. కడపటి లక్ష్యం మాత్రం దైవంతో సుస్థిరమైన ఐక్యతతో ఉండడమే. అది ధ్యానంలోనే కాదు. అన్ని పరిస్థితుల్లోనూ ఈ సక్రియాత్మక జీవితం మొత్తంలోనూ....

కొందరుంటారు. వాళ్ళు ధ్యానంలో కూర్చొన్నప్పుడు, ఒక స్థితిలోకి వెళ్ళి పోతారు. ఇక ఆ స్థితే అద్భుతమని, ఆనందప్రదంగా భావిస్తారు. దానితో సంతృప్తిపడి అదే స్థితిలో కూర్చొని ప్రపంచాన్ని మరుస్తారు. ఒకవేళ యేదైనా వాళ్ళ ధ్యానానికి భంగం కలిగిస్తే కస్సుమని లేస్తారు. ఎందుకంటే ధ్యాన విఘాతం కల్గింది. ఇది

ఆధ్యాత్మిక ప్రగతికి, సాధనకు సంకేతం కాదు. కొంతమంది వుంటారు. వాళ్ళు దైవానికి ఋణపడి పోయి ధ్యానం చేస్తూ ఋణం తీర్చుకొంటున్నట్లుగా కనిపిస్తారు, చేస్తారు. వారానికి ఒక్కసారి చర్చికి వెళ్ళి దేవుడికి ఋణపడ్డ అప్పును చెల్లించినట్లుగా ఉంటుంది వాళ్ళతీరు.

ధ్యానంలోకి వెళ్ళడానికి ప్రయత్నించడం అవసరమౌతున్నదంటే నీ వింకా ఆధ్యాత్మిక జీవితం జీవించగల్గడానికి చాలా దూరంలో వున్నట్లే. ఎప్పుడైతే అదే ధ్యానంలోంచి బయటకు రావడానికి ప్రయత్నిస్తున్నావంటే ఆ ధ్యానం నీవు ఆధ్యాత్మిక జీవనంలో ఉన్నావన్న దానికి సూచన కాగలదు.

CWM 3 : 20 - 21` *అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్ రాజు (9441519210)*

ఆధ్యాత్మిక శిక్షణా విధానాలు - ఆధ్యాత్మికత

ఆధ్యాత్మిక జీవితంతో యేమీ సంబంధంలేని హఠయోగం, రాజయోగం శిక్షణా విధానాలను యెవరైనా అభ్యాసం చేయవచ్చు. మొదటి యోగం చాలావరకు దేహనియంత్రణకు చేరుకొంటుంది. తరువాతది మనస్సు నియంత్రణకు చేరుకొం టుంది. కాని ఆధ్యాత్మిక జీవితంలోనికి ప్రవేశించడమంటే, నీవు సముద్రంలో మునక వేసినట్లు. దైవంలో మునక వేయడం, దైవంలో నివసించడం నేర్చుకోవాలి. అదెలా చేస్తావు. "నేనెక్కడ పడతాను, నాకేం జరుగుతుంది.?" అని ఆలోచించకుండా, తిన్నగా దూకెయ్యాలి. సందేహించే నీ మనస్సే నిన్ను నివారిస్తుంది. తేలికగా నిన్ను నీవు ముందుకు పోనివ్వు. సముద్రంలో మునగాలని అనుకొంటూ "ఇక్కడో రాయి వుండవచ్చు, అక్కడో బండ వుండవచచ్చు" అని యెప్పుడూ అనుకుంటుంటే నీవు మునకవేయ లేవు.....

సముద్రంలోనికి దుముకబోయేముందు, దానిని గురించి కొంత తెలుసుకోవడం, దానిని చూడడం జరుగవలసివున్నట్లే దైవ సత్యతను గురించి కొంత క్షణిక వీక్షణమైనా నీ కుండాలనే మాట నిజమే. అంతరాత్మిక చేతన మేల్కొనడమే మామూలుగా ఆ వీక్షణం అవుతుంది. కాని కొంత నిజీకరణమన్నా నీకుండాలి. లోతైన అంతరాత్మిక లేక సమగ్ర సంపర్కం గాకపోయినా ఒక బలమైన మానసిక లేక ప్రాణిక సంపర్కం వుండాలి. దైవసన్నిధిని నీలో లేక నీ చుట్టూ బలీయంగా నీవనుభూతి చెందాలి. అలా అణచివేసే వాతావరణం నుండి బయట పడడానికి చేసే కృషి వైపుకు నిన్ను

ఆకర్షించే, సాధారణ ప్రపంచ వ్యతిరేక శ్వాస ఒక ఊపిరాడకుండా చేసే వత్తిడి యొక్క అనుభూతి కూడా నీ కుండాలి. అది నీకున్నట్లైతే నీవు యెట్టి మినహాయింపులూ లేకుండా దైవసత్యతలో ఆశ్రయం పొందాలి. దానిలో మాత్రమే, దాని సహాయంలో రక్షణలో మాత్రమే నివసించాలి. నీ సాధారణ జీవితంలో అలా దేన్నైనా పాక్షికంగా లేక నీ అస్తిత్వ కొన్ని భాగాలలో లేక కొన్ని సందర్భాలలో, లేక కొన్ని వేళల్లో చేసిన వన్నీ సంపూర్ణంగా, శాశ్వతంగా చెయ్యి. నీవు వేయవలసిన మునక, లేక దూకుడు అటువంటిది, అలా నీవు చేయకపోతే నీవు సంవత్సరాల తరబడి యోగం చేసినా, యధార్థ ఆధ్యాత్మిక జీవనమంటే నీకేమీ తెలియనట్లే అవుతుంది. సకలంతో, మొత్తంగా మునిగి పోవాలి. అప్పుడు యీ బాహ్య గందరగోళం నుండి స్వేచ్ఛ లభించి, ఆధ్యాత్మిక జీవన యధార్థ అనుభవం ప్రాప్తిస్తుంది.

CWM 3: 20 - 22

ఆధ్యాత్మికత -- సన్యాసం

మనస్సు నియమానికి అంటిపెట్టుకుపోయి వుండడమంటే యెక్కడో దాగివున్న అంధత్వానికి సూచన. ఉదాహరణకు ఒక సార్వత్రిక మోధ్యాన్ని చూద్దాం. సన్యాసం, ఆధ్యాత్మికత ఒక్కటే అనేది ప్రపంచమంతటా వ్యాపించి వుంది. ఫలాన అతను లేక ఫలానా ఆమె ఆధ్యాత్మికపురుషుడు లేక ఆధ్యాత్మిక స్త్రీ అని నీవు చెప్పగానే, ఏమీ తినకుండా లేక కదలకుండా రోజంతా కూర్చుని వుండే వాడని, యెంతో పేద వానిగా ఒక గుడిసెలో నివసించే వాడని, తనకున్నదంతా యిచ్చివేసి, తనకంటూ ఏమీ వుంచుకొనని వాడని, జనం వెంటనే అనుకొంటారు. ఆధ్యాత్మిక వ్యక్తిని గురించి మాట్లాడినప్పుడు యిదిగో యిలా నూటికి తొంభైతొమ్మిది మందిలో వెంటనే చిత్రిత మౌతుంది. ఆధ్యాత్మికతకు ఒక ఋజువు, పేదరికం, సంతసం కలిగించే, సుఖాన్నిచ్చే దేదీ అతనికి లేకపోవడం. ఆధ్యాత్మిక సత్యాన్ని దర్శించడానికి, అనుసరించడానికి నీకు స్వేచ్ఛకావాలనుకుంటే నీవు తప్పక విసిరివేయవలసిన మానసిక నిర్మాణం యిది. ఎందుకనంటే, ఒక నిజాయితీ గల ఆకాంక్షతో ఆధ్యాత్మిక జీవితాని కొచ్చావు. నీవు దైవాన్ని కలుసుకోవాలని, నీ చేతనలోనూ, నీ జీవితంలోనూ దైవాన్ని సాక్షాత్కారింప జేసుకోవాలనీ వచ్చావు. అప్పుడేం జరిగింది. సుఖంగా జీవిస్తున్న స్వేచ్ఛగా భుజిస్తున్న అందమైన లేక విలాసవంతమైన వాటిమధ్య తనకున్న వాటిని పేదవారి

కిచ్చివేయకుండా, జనం యిచ్చే వాటినన్నింటినీ భోగిస్తూ వున్న గుడిసెలో నివసించని ఒక దైవం దగ్గర కొచ్చావు. నీలో అది వరకు స్థిరపడిపోయిన మానసిక నియమం వల్ల దిగ్భ్రాంతికి లోనై "ఎందుకని? యేమిటిది? నేనొక ఆధ్యాత్మిక వ్యక్తిని గదా కలవాలని వచ్చాను!" అనుకొంటావు. ఈ అసత్య అవగాహన భగ్నమై అదృశ్యమై పోవాలి. ఒకసారి అది అంతమైతే, నీ సంకుచిత సన్యాస నియమం కన్న చాలా ఉన్నతమైన దేన్నో నీవు కనుగొంటావు. నీ కేదన్నా లభిస్తున్నప్పుడు దానిని అను మతించు., దానినే నీవు తిరిగిచ్చివేయవలసివచ్చినప్పుడు, అంతే సమమైన ఐచ్ఛికతతో వదలివెయ్యి. వస్తువులు వస్తుంటే అంగీకరించు, పోతుంటే పోనివ్వు, అదే సమతాపూర్వక చిరునగవుతో స్వీకరించు, విడిచిపెట్టు.

CWM 3:53-54

సన్యాస పద్ధతులు- ఆత్మాధిపత్యం

అమ్మా ! ఆత్మ-స్వామ్యం కోసం, కొన్ని సమయాల్లో సన్యాస పద్ధతు లుపయోగ పడవా?

లేదు. దానివల్ల యేదీ సంస్కరించబడదు. నీవు పురోగమించినట్లు నీకు నీవు భ్రాంతి కల్పించుకొంటావు. కానీ నీవు దేనినీ సంస్కరించలేదు. దానికి ఋజువు, నీ సన్యాస పద్ధతని నీవు విరమించినట్లైతే, అది అదివరకటికంటె బలీయంగా తయారవుతుంది. పగతీర్చుకోడానికన్నట్లు తిరిగి వస్తూ విజృంభిస్తుంది. నీవు వేటిని సన్యాస పద్ధతులన్నావో వాటిమీద అది ఆధారపడివుంటుంది. నీ కోరికలన్నింటినీ సంతృప్తి పరచడంలో అది జోక్యం చేసుకొంటే, అది నిజానికి సన్యాసం కాదు, అనేది లౌకిక జ్ఞానానికి కూడా తెలుసు. అది మరేదో అవుతుంది. సన్యాస పద్ధతులు అంటే పలుమార్లు ఉపవాస ముండడం, చలికి తట్టుకొనేటట్లు నిన్ను నీవు బలవంతం చేసుకోవడం.... వాస్తవానికి, నీ దేహాన్ని కొంచెం చిత్రహింస పెట్టడం. నిజానికిది నీకు ఆధ్యాత్మిక గర్వాన్నిస్తుంది. అంతకంటే మరేమీకాదు. అది దేనిని ఆధీనం చేసుకోలేదు. అది యెంతో యెంతో సులభం. అది సులభం గనుక, జనం దానిని తేలికగా ఆచరిస్తారు. గర్వం బాగా సంతృప్తి చెందుతుంది. ఆడంబరత ఉబ్బిపోతుంది. అది తేలిక. తన సన్యాస సుగుణాలను గొప్పగా చేసి యెవరైనా ప్రదర్శించవచ్చు. ప్రదర్శించి, తాను చాలా ప్రముఖ వ్యక్తినని భావిస్తాడు. అలా చేస్తే అతడు చాలా వాటికి తట్టుకొనేందుకు

అది సాయపడ్తుంది. తన ప్రేరణలను, ప్రశాంతంగా, చెదరకుండా అవి తమంతట తాము బయటపడకుండా నియంత్రించడం చాలా కష్టం — యెంతోయెంతో — సన్యాసపద్ధతుల నవలంబించకుండా నియంత్రించడం కష్టం, నీ వశంలో వున్న వస్తువులపై మమకారం లేకుండా వుండడం, అసలు వేటినీ వశం చేసుకోకపోవడం కంటే యెంతో యెక్కువ కష్టం కలిగిస్తుంది. ఇది శతాబ్దాలనుండి తెలిసిన విషయమే. వేటినీ వశం చేసుకోకపోవడం కంటె, వశమందున్న వాటి యెడల సంగత్వం లేకుండా వుండడానికి యెంతో గొప్ప లక్షణం అవసరం. లేక తన అధీనంలో వున్న వాటిని, కచ్చితంగా చాలా కనీస స్థాయికి తగ్గించుకోవడంకూడా కష్టమే. అదెంతో ఉన్నత శ్రేణికి చెందిన నైతిక గుణం. ఏదైనా నీకు ప్రాప్తించినపుడు దానిని స్వీకరించి ఉప యోగించు, యేదో ఒక కారణంతో అది తిరిగి వెళ్ళిపోయినపుడు దాన్ని వెళ్లనివ్వు దానికై విచారించకుండా వుండడమనేది అసలైన ధోరణి. అది వచ్చినప్పుడు తిరస్క రించరాదు. నిన్ను నీవు అందుకనుగుణంగా సరిదిద్దుకోవడం అది పోయినపుడు విచారించకుండా వుండడం నేర్చుకోవాలి.

CWM 6: 429- 430 *అనువాదం: కె.వి. రావ (9849929254)*

ఆధ్యాత్మిక జీవితం - నైతిక జీవితం

ఆద్యాత్మిక జీవితం అన్నింటిలోని ఏకత్వాన్ని, అలాగే అనంతమైన భిన్నత్వాన్ని తెలియజేస్తుంది. ఏకత్వంలో భిన్నత్వం కోసం భిన్నత్వంలో సంపూర్ణత, పరిపక్వత కోసం ఇది పనిచేస్తుంది. ఆధ్యాత్మ స్వేచ్ఛకు జీవిత వైవిధ్యానికి విరుద్ధంగా ఒక కృత్రిమ ప్రామాణికతను నైతికత లేవదీస్తుంది. ఏదో ఒక మానసికమైన, కచ్చితమైన, పరిమితమైన దాన్ని సృజించి దాన్ని అనుసరించమని అన్నిటినీ ఆదేశిస్తుంది. అందరు ఒకేలక్షణాలను ఒకేఆదర్శవంతమైన స్వభావాన్ని సంతరించుకునేందుకు శ్రమించమంటుంది. నైతికత దివ్యత్వం కాదు. దివ్యత్వానికి చెందినది కాదు. ఇది మానవునికి సంబంధించినది. మానవత్వానికి సంబంధించినది. మంచి చెడులమధ్య ఒక కచ్చితమైన విభజన గావించేందుకు ఒక మూలాంశాన్ని నైతికత గైకొంటుంది. అయితే ఇది దాని స్వీయ అభిప్రాయం. ఇది సాపేక్షకమైన వాటిని గ్రహించి పరిపూర్ణ మని అంటూ వాటిని రుద్దేందుకు ప్రయత్నిస్తుంది. భిన్న శీతోష్ణస్థితులకు, కాలాలకు, శకాలకు, దేశాలకు ఇది మంచి, ఇది చెడు అని విచక్షణనుచేసి చూపుతుంది.ఇది

సత్సంకల్పము, ఇది దుస్సంకల్పం, ఒకదాన్ని అంగీకరించి, మరొకదాన్ని త్యజించ మని చెప్పేంతవరకు నైతికత వెళుతుంది. అయితే ఆధ్యాత్మిక జీవితం కోరికలన్నింటినీ త్యజించమనే అంటుంది. దీని నియమం ఏమిటంటే దివ్యత్వం నుండి దూరంగావించే వాటన్నింటినీ త్యజించమంటుంది. వాటిని త్యజించడమనేది అది చెడు అని గాదు — అది మరొక వ్యక్తికి లేక మరొక రంగానికి మంచిగా వుండవచ్చు — అవి సంవే దనలకు, శక్తులకు సంబంధించినవి. అవి ప్రకాశరహితమై, అజ్ఞానపరమై మన దివ్యమార్గానికి అడ్డు తగులుతుంటాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే దివ్యమార్గంలో అనుసంధానం గావించే వాటన్నింటినీ అంగీకరించ మంటుంది. అవి మంచివని అంగీకరించమనటం లేదు. అవి దివ్యత్వం వైపు కొనిపోయేవి కాబట్టి అంగీకరించ మంటుంది. దివ్యత్వాన్ని దూరంచేసే వాటిని త్యజించమంటుంది. అయితే ఇది మంచి, ఇది చెడు అని మాత్రం చెప్పవద్దంటుంది. నీ దృక్పథాన్ని ఇతరులపై రుద్దడానికి ప్రయత్నించవద్దంటుంది. ఎందుకంటే నీకు చెడు అయినది దివ్యజీవనాన్ని అర్థంచేసుకునే ప్రయత్నం చేయని నీ పొరుగు వానికి మంచి కావచ్చు.

CWM 3:118-119

నైతిక, ఆధ్యాత్మిక స్వచ్ఛత

ఉదాహరణకు నీవు నైతిక దృక్పథాన్ని అలవరచుకొన్నావనుకోఅది ఆధ్యాత్మిక దృష్టికి దోషంగా కనిపిస్తుంది. ఎంతో కల్మషాన్ని కలిగివుండీ అన్ని సాంఘిక నియ మాలను, అన్ని ఆచారాలను, అన్ని నైతిక సంప్రదాయాలను అనుసరిస్తూ పరిపూర్ణ నైతిక జీవితాన్ని గడిపే వారున్నారు. ఆధ్యాత్మిక దృష్ట్యా వీరంతా అపార అపరిశుద్ధులే మరొక ప్రక్క కొంతమంది సామాన్య కార్యకలాపాలు చేసుకొనే పేదవారున్నారు. వారు స్వేచ్ఛా భావంతో పుడుతున్నారు. సామాజికపరమైన, నైతికపరమైన గౌరవనీయమైన పనులుగా పరిగణింపబడే వాటిని చెయ్యటం లేదు. ఇతరులకంటె వీరిని అనంతమైన స్వచ్ఛత గలవారిగా చేసే శ్రద్ధ, ఆకాంక్ష, గల స్థితి కలిగిన వారున్నారు. ఇలా ఉండటం కష్టమైన పని. వీటిని గురించి మాట్లాడిన వెంటనే వారి చేతనలో ఒక వికారం అన్ని సామాజిక, నైతిక సంప్రదాయాలవల్ల కలుగుతుంది.

స్వచ్ఛతను గురించి మాట్లాడినవెంటనే ఒక నైతికనిర్మాణం నీ ముందు సాక్షాత్కరిస్తుంది. నీ అభిప్రాయాన్ని పూర్తిగా తప్పు పడుతుంది. సామాజిక దృష్ట్యా

నైతికంగా వుండటం ఆధ్యాత్మిక దృష్ట్యా నైతికంగా వుండడంకంటె సులభతరమైనదని గుర్తుంచుకోండి. సామాజిక దృష్ట్యా నైతికంగా ఉండటానికి ఇతరులు అంగీకరించిన దానిని యేమీ చేయకుండా జాగ్రత్త వహించవలసి వుంటుంది. ఇది ఒకింత కష్టం. అసాధ్యమైంది మాత్రం కాదు. నేను చెప్పినట్లు ఒకరు దీన్ని ఆచరిస్తున్నపుడు అశ్రద్ధ, కల్మషం కూడి వుండవచ్చు. ఆధ్యాత్మిక దృష్ట్యా స్వచ్ఛతగా, వుండటమంటే అన్ని పరీక్షలకు నిలబడగలిగే జాగరూకత, చితశుద్ధి, చైతన్యం వుండడం.

ఆధ్యాత్మిక జీవితానికి సంసిద్ధత

ఆధ్యాత్మిక గురువు లేనట్లైతే ఆధ్యాత్మిక మార్గానికి సిద్ధంగా వున్నాడని తెలియ జేసే గురుతులు ఏమైనా వున్నాయా?

ఉన్నాయి. ముఖ్యమైన సూచన ఏమిటంటే అన్ని పరిస్థితులలో స్థిత ప్రజ్ఞత్వాన్ని కలిగివుడడం. ఇది అనివార్యమైన మూలాధార సూచన. చాలా ప్రశాంతంగా, నెమ్మ దిగా, శాంతిగా, గొప్పబలమైన శక్తి అనుభూతిని కలిగివుండటం. జడత్వము నుండి వచ్చే ప్రశాంతత కాదు. ఏకాగ్రతా సంవేదనాశక్తితో వస్తుంది. అది ఎప్పుడూ స్థిరం గా వుంచుతుంది. ఏమి జరిగినా జీవితంలో తటస్థించే దుర్భర పరిస్థితులలోను నిన్ను స్థిరంగా ఉంచుతుంది. ఇది మొదటి సూచన. రెండవ సూచన ఇత్తడిగోడకు రంధ్రం చేయవలసివస్తున్నట్లు విపరీతమైన కఠినంగా, ఊపిరాడకుండునట్లు నీ సాధారణ చైతన్యంలో బంధించబడినట్లు అనుభూతి చెందుతావు. బాధ భరించరానంతంగా వుంటుంది. నిన్ను బిగుసుకుపోయేటట్లు చేస్తుంది. దీన్ని ఛేదించడానికి అంతరకృషి అవసరం. ఛేదించడాన్ని నీవు చేయలేవు. ఇది కూడా మొదటివాటిలో ఒక సూచన. దీనర్థం మీ అంతరంగ చైతన్యం ఒక పరిపక్వదశకు చేరుకొంది. బాహ్యమైన మూస దానికి చిన్నదిగా కనిపిస్తోంది. సాధారణ జీవితపు మూస, సాధారణ కార్యకలాపాలు సాధారణ సంబంధాలు అన్నీ ఎంతో చిన్నవిగా, ఎంతో నిరర్థకంగా కనిపిస్తాయి. నీలో ఒక శక్తి ఆ మూసను ఛేధిస్తూందనే సంవేదన నీకు కలుగుతుంది.

మరొక సూచన. నీవు ఏకాగ్రతకలిగి, ఒక ఆశయముంటే నీలోకి ఏదో వస్తున్నట్లు అనుభూతి చెందుతావు. నీకు సమాధానం లభిస్తుంది. నీకు తక్షణమే ఒక వెలుగు, శాంతి, శక్తి, దిగివస్తున్నట్లు అనుభూతి చెందుతావు. నీవు వేచి వుండవలసిన అవసరం లేదు. చాలా కాలం గడపవలసిన అవసరంలేదు. ఆ వెంటనే ఒక ఆంతరిక ఆకాంక్ష,


ఒక పిలుపు, ఒక సమాధానం లభిస్తుంది. సంబంధం పూర్తిగా ప్రతిష్టితమైనట్లు దాని అర్థం.

CWM 4:97-98 *అనువాదం: శ్రీఆకుల కృష్ణ (9989251895)*

ఆధ్యాత్మికమార్గ ప్రవేశం

ఒకరు నిజంగా ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించారని ఎప్పుడు చెప్పగలం? మొదటి సంకేతం ప్రతివారికి ఒకే విధంగా నుండదు. ఆధ్యాత్మికత ఒక్కటి తప్ప మిగతా విషయాలేవీ ఏ మాత్రం విశేషమైనవిగా కనిపించవు అని నా నమ్మకం. నీ యావజ్జీవితం, నీ కార్యక్రమాలు సర్వం, నీ కదలికలు పరిస్థితులు సానుకూల పడితే, యధాతథంగా కొనసాగుతాయి. కానీ అవన్నీ నీకు అప్రధానమనిపిస్తాయి. నీ ఉనికికి, గల కారణం అవి కాదని నీకు అవగతమౌతుంది. ఇది మొట్టమొదటి సంకేతమని నేననుకుంటాను.

వేరొక సంకేతం కూడా ఉండవచ్చు. ఉదాహరణకు మామూలుగా నుండే దానికన్నా అంతా భిన్నంగా నున్నదని. జీవితం మరో విధంగా గడుస్తున్నదని, అది వరలో లేని వెలుగొకటి మనస్సులో విరిసినట్లున్నదని, అది వరలో లేని ప్రశాంతత హృదయంలో నెలకొన్నదనేటటువంటి భావన. అది మాత్రమే మార్పును కలిగించదు. నిశ్చితమైన మార్పు సాధారణంగా తరువాత చోటు చేసుకుంటుంది. ఒకరు ఆధ్యాత్మిక జీవితం అనుసరించాలనే నిశ్చయానికి వచ్చినప్పుడు మార్పు చోటుచేసుకొనే సమయంలో మెరుపు మెరిసినట్లుగా రావచ్చు. కానీ అలా జరగటం చాలా అరుదు. కొన్ని సార్లు అది ఒక మహత్తరమైన ఆధ్యాత్మిక వెలుగు విరజిమ్ముతున్నట్లుగా ప్రారంభమవుతుంది. ఒక మహదానందం నీలోకి చొచ్చుకొని వస్తుంది. కానీ సాధారణంగా ఈ స్థితి మాటున పడిపోతుంది, కారణం అనేకమైన అసమగ్రతలు, దోషాలు, నీలో అంతరించకుండా నిలిచి వున్నాయి కాబట్టి ... అది విసుగుదల కాదు. తిరస్కారం కాదు. కానీ సర్వము ఎంత అనాసక్త మనిపిస్తుందంటే దీనిని అనుసరించడం నిరర్థకమనిపిస్తోంది. దాహరణకు నీవు కొన్ని భౌతికమైన పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు అవి ఆహ్లాదకరమైనవైనా నీలో నీవనుకుంటావు. "అదంత అంత ముఖ్యమైనదిగా నుండిందా? కానీ దానికి ఏ మాత్రం ప్రాముఖ్యం లేదే!" నీవు నిజంగా వేరొక పక్షం వైపుగా మళ్ళినట్టి అనుభూతి కలుగుతుంది. కొందరనుకుంటారు. ఆధ్యాత్మిక జీవిత



శ్రీమాత

చిహ్నం ఓ మూల కూర్చొని ధ్యానం చేసుకోవడమని! అది సర్వ సాధారణంగా కలిగే భావన. నేను కఠినంగా అంటున్నానని కాదు. కానీ చాలామంది ఎవరైతే వారి ధ్యానానుష్టాన శక్తిని గురించి, గొప్పలు పోతారో వారు గంటలో కనీసం క్షణ మాత్రమైనా ధ్యాననిమగ్నులై ఉంటారనుకోను. నిజంగా ధ్యానంలో నిమగ్నులయ్యే వారు దాని ఊసెత్తరు. వారికి అది అతి సహజమైన విషయమనిపిస్తుంది. ఎప్పుడైతే అది నీకు అహంకారరహితమైన సహజ విషయం అవుతుందో అపుడు నీవు పురోగ మిస్తున్నానని అనుకోవచ్చు. ఎవరైతే దానిని గురించి అతిగా మాట్లాడతారో, ఆ కారణంగా తాము ఇతరులకన్నా మిన్న అని తలుస్తారో, అలాంటివారు అధికసమయం విశ్రాంతి స్థితిలోనే ఉంటారని కచ్చితంగా చెప్పవచ్చు.

CWM 4:103-104

అనుభవాలు — వాటి ప్రయోజకత్వం

ఒకరికి ప్రాణిక పరమైన అనుభవాలు కలిగినట్లయితే - ఉదాహరణకు భావిసూచక దృశ్యాలు — తగినంత మానసిక ప్రయత్నం లేకుండా కలిగే ప్రాణిక అనుభవాలు కలిగినట్లయితే, అది వారి సమతుల్యతను భగ్నపరిచే ఫలితానికి దారితీయవచ్చు. జరుగుతున్న దేమిటో అతనికి తెలియదు. అది హానికరం కాకపోయినా నిష్ప్రయో జనమౌతుంది. అలా కాకండా ఒకవేళ అతను తన అవగాహనాశక్తిని వృద్ధి పరిచినట్లయితే శ్రద్ధగా పరిశీలించి విషయాన్ని అర్థం చేసుకోగలిగి, దానికి గల కారణాలను తెలుసుకో గలిగితే ఉదాహరణకు యోగలక్ష్యాన్ని దానిని పొందగలిగే విధానాలను పరిశీలించ గలిగితే — నిజానికి ఆ విషయం గురించి మానసిక సంవేదనము — అప్పుడు ఒక అనుభవం కలిగినట్లయితే అది ఏమిటో తెలుసుకోగలిగే అవకాశం లభిస్తుంది. లేనట్లయితే ఎవరూ ఏమీ తెలుసుకోలేరు. అందుకోసం తగినంత మానసిక ప్రయత్నం అవసరం — సంపూర్ణంగా కాకపోయినా కనీసం అవసరమైనంత — కలిగే అనుభవాలను కొంత మాత్రమైనా అర్థం చేసుకోవడానికి.

CWM 6: 350-51

"అనుభవం" పొందడం అనగా అర్థం ఏమిటి?

మనుషులు మామూలుగా అనుభవం అనగా అదేదో అత్యంత అమోఘమైన,

అద్భుతమైన విషయమనో, యోగవిద్యాభ్యాసం ద్వారా పొందలిగే గాలిలో తేలిపోవడం లాంటి సన్నివేశమనో, లేక గగుర్పాటు కలిగించే దృశ్యాలలో లేక భవిష్యత్తులో జరుగబోయే దేమిటో చూడగలగడమో లేక సాధారణ విషయాల్లాంటి దూరంగా నున్నవాటిని చూడగలగడమోలేక పోగొట్టుకొన్నవస్తువు ఎక్కడ కనిపించగలదో చెప్పగలగడమో అని భావిస్తారు.

ఇలాంటి వాటిని 'అనుభవాలు' అని, జనం అంటారు.

సరే, సాధారణంగా ఇలాంటి లక్షణాలు గలవారు గొప్పగా చదువుకున్నవారై ఉండరు. కానీ ఏ కారణంచేతనో వారు ప్రజ్ఞాపాటవంతో పుడ్తారు. కొందరు సంగీత కళాకారులుగా, కొందరు చిత్రకారులుగా, మరికొందరు శాస్త్రకారులుగా, పుట్టినట్లు, వీరు పుట్టుకతోనే అరుదైన అంతర్ దృష్టి లేక దూరదృష్టి గలవారై అవసరం కలిగినప్పుడు వారి నైపుణ్యతను జీవనోపాధికై వాడి దానిని పూర్తిగా భ్రష్టు పట్టిస్తారు. వారికి పరిస్థితులు హాయిగా ఉండి, జీవనోపాధికై శ్రమించనవసరం లేకపోతే సన్నిహిత వర్గాలలో ప్రఖ్యాతి పొందుతారు. ఏదిఏమైనా నిపుణత అనేది ఎల్లప్పుడు ఒకవిధమైన వ్యాపార వ్యవహార శైలికి అవకాశంగా నుంటుంది. ఈ లక్షణాలను కలిగివుండి వాటిని పేరు పొందటానికో లేక డబ్బు సంపాదనకో వాడుకోకుండా ఉండేవారు బహుకొద్దిమంది మాత్రమే. అయితే, ఈ నైపుణ్యతలు ఉన్నత స్థాయికి చెందినవి కావు. జీవితాన్ని అంత అధికంగా ఆధ్యాత్మికపరంగా గడపని వారు సైతం అట్టి లక్షణాలను పొందగలరు. అంతరంగ ఆధ్యాత్మిక ఔన్నత్యంపై ఇవి ఆధారపడవు. వీటిని అభివృద్ధికి సూచికలుగా పొరపాటు పడకూడదు.

CWM 6: 353

ఆధ్యాత్మిక అనుభవాలు పొందటం

మీరు ఆధ్యాత్మిక అనుభవం గురించి చెపుతుంటారు. అనుభవమనగా ఏమిటి? ఒకరు దానిని ఎలా పొందగలరు?

అది ఎలాగుంటుందంటే నీకు మామూలుగా నుండే చేతనకన్నా ఉన్నతమైన దానితో నిన్ను సంపర్కంలోకి తెస్తుంది. నీకుగా నీవు ఒక చేతనావస్థను కలిగి వుంటావు. దానిని గురించి అసలు నీకు తెలియనే తెలియదు. అది నీకుండే సాధారణ చేతనాస్థితి, అర్థమయిందా? మంచిది. ఒకవేళ హఠాత్తుగా పూర్తిగా భిన్న మైనది ఒక ఉన్నతమైనది

చోటు చేసుకొన్నదనే ఎరుక నీకు కలిగిందంటే, అప్పుడు అది ఏదైనా కానీ, అది ఒక ఆధ్యాత్మిక అనుభవం అవుతుంది. నీవు దానిని ఒక మానసిక భావనతో రూపొందించ వచ్చు లేక అలా చేయకపోవచ్చు. దానిని నీకుగా నీవు వివరించుకోవచ్చు. లేక అలా చేయకపోవచ్చు. అది నిలిచి ఉండవచ్చు. లేదా ఉండకపోవచ్చు. అది ఒక్క క్షణంలో జరుగవచ్చు. కానీ చేతనలో ఇటువంటి సారభూతమగు వ్యత్యాసం కలిగి నప్పుడు సహజంగానే దాని లక్షణం నీకు మామూలుగా నుండే దాని కన్నా అత్యున్న తమైనది, స్పష్టమైనది, స్వచ్ఛమైనదిగా నుంటే అప్పుడు దానిని ఒక ఆధ్యాత్మిక అనుభవం అనవచ్చు. దీని అర్థం ఆధ్యాత్మిక అనుభవాలు అనబడే ఇతరమైన విష యాలు వేలకొద్దీ ఉన్నాయని.

ఆధ్యాత్మిక అనుభవం కలగాలని మనం ఆకాంక్షించాలా?

ఆధ్యాత్మిక అనుభవానికై ఆకాంక్షించే కన్నా అభివృద్ధి కన్నా మంచిగా నుండాలని లేక మంచిగా పనిచేయాలని ఆకాంక్షించడం వివేకవంతంగా వుంటుందని అనుకుంటాను. ఎందుకనగా కేవలం ఆధ్యాత్మికానుభవానికై ఆకాంక్షిస్తే, అది కాల్పనిక మైన అసత్యమైన అనుభవాలకు ఉన్నతమైన విషయాలుగా పైకి కనిపించే ప్రాణిక పరమైన కదలికలకు దారి తీయవచ్చు. అనుభవాలకై ఆకాంక్షించి తమను తాము మోసపుచ్చుకునే ప్రమాదముంది. వాస్తవానికి అనుభవమనేది అంతరంగ అభివృద్ధి సాధించిన ఫలితంగా దానంతట అది సహజసిద్ధంగా సంభవించాలి. కానీ అనుభవం కేవలం అనుభవం కోసం కాదు.

CWM 6:432 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి (9573605734)*

భౌతిక జీవితం - ఆధ్యాత్మిక జీవితం

ఆత్మ సాక్షాత్కారం పొందటానికి జీవితాన్నుండి తప్పించుకోవాలని అనుకొనే వాళ్ళు మామూలు వాళ్ళకంటే భిన్నమైన వాళ్ళుగా, పరిపూర్ణులు కానివాళ్ళుగా నేను పరిగణిస్తాను. వాస్తవానికి వాళ్ళు బలహీన స్వభావులు. కాని బలం, క్రియాశక్తి ఒకవిధమైన ఆరోగ్యకర సమతుల్యత వున్నవాళ్ళు, వాళ్ళఆధ్యాత్మిక సాక్షాత్కారాన్ని దైహికంగా కూడా నిజంచేసుకోవడమే అసలైన అవసరం అనుకున్నవాళ్ళు యెక్కడో ఆకాశంలో విహరించడంలో లేక రూపరహిత లోకాలకు వెడలిపోవడంతో సంతృప్తి, చెందరు.

సమస్తం తయారై సిద్ధంగా వున్న మతాన్ని స్వీకరించాలనీ లేక అనుసరించాలనీ లేక ఆ మతంలో భాగస్వాములు కావాలనీ అనుకోవడం మానవుల లోగల "సామూహిక -సహజాతం" నుండి పుట్టుకొస్తుంది. అప్రయత్నంగా వ్యక్తమయ్యే, తాను ఆరాధించే రూపం, తనకే స్వంతమయిన ఆరాధనా విధానం, ప్రతి వ్యక్తికి దైవంతో ఉండే ప్రత్యేక వ్యక్తిగత సంబంధ సత్యాన్ని వ్యక్తపరుస్తుంది. అది ఆదర్శవంతమైన స్థితి.

అతడు ఒక మతంలో పుట్టినందువల్లగాని లేక జనం ఆ మతాన్ని ప్రేమిస్తారు, నమ్ముతారు, ఆచరిస్తారు అనిగాని, లేక ఒక ప్రత్యేకమైన చోటుకు వెళ్ళినపుడు అచటివాళ్ళు ప్రార్థిస్తున్నారు. పూజిస్తున్నారు అనిగాని, అచట తన ప్రార్థనలో, పూజలో సహాయం లభించినదనిగాని ఆ మతాన్ని స్వీకరించడం అనేది బలమైన స్వభావ లక్షణంగాదు. విశేషించి అది బలహీనత లక్షణం అనీ, యెలా చూసినా అతనికి ఒక స్థిరమైన మౌలిక అభిప్రాయం లేని వాడని అంటాను.

అయితే అంతరంగంలోని ఆకాంక్షకు, ఆరాధనకు అనుగుణంగా భౌతిక జీవితంలో సాంప్రదాయక విధానాలను మార్పులు చేసుకోవాలనుకోవడం సరియైన ప్రక్రియ. అది తనను రెండుగా విభజించుకొని బాహ్యభౌతిక జీవితాన్ని యాంత్రికంగా సాధారణంగా కొనసాగిస్తూ, అతనికి సమయం ఉన్నప్పుడు లేక అతనికి వీలైనపుడు తనలోనికి తాను ఉపసంహరించుకొని భౌతిక జీవితంనుండి, భౌతిక చేతననుండి తప్పించుకొని తన ఆధ్యాత్మికానందాలను కనుగొనడానికి సుదూర శిఖరాలకు పోయే వానికంటే యితడు చాలా చిత్తశుద్ధి కలవాడు అవుతాడు.

ఎవరైతే తమ బాహ్యజీవితాన్ని ఒక ఉన్నత ఆకాంక్షకు ప్రతిరూపంగా మలుచుకోవాలనుకుంటారో వారు జీవనితాన్ని రెండుగా విడగొట్టి బాహ్య జీవితం ముఖ్యం కాదని, అది ఏనాడూ మార్పు చెందదని, దానిని అలాగే చూడాలని భావించే వారి కంటే నిజాయితీ పరులు ఉన్నతులు, సన్మార్గులు. నిజానికి ఆంతరిక వైఖరే ప్రధానం

CWM 8:246

సత్యం అనేదానికి ఎలాంటి ప్రచారాలు అవసరంలేదు. అది తనను తాను దాచుకోదు. అలాగని ప్రకటనలు కోరుకోదు. అది తనను తాను ఆవిష్కరించుకోగలదు. ఫలితాలను ఆశించదు. ఎవరి మెప్పునూ వాంఛించదు. అలాగని ఎవరైనా మెచ్చుకొంటే విముఖత చూపదు. ప్రాపంచికమైన ఆకర్షణలకు లోనుగావడం, కించపరచడం లాంటి వాటికి అది లోబడదు. ఇంక యోగ విషయానికి వచ్చినప్పుడు నీ మానసిక

కల్పనలు, ప్రాణిక తొట్రుపాటులన్నింటినీ త్రోసిరాజనాల్సిందే. నీ విశ్వాసమునకుదక్క, ఏ ఒక్క ఇతర నమ్మకాలను, మానసిక ఆసరాలను అవసరాలను గాలికి వదిలేయా ల్సిందే. నీ మనోగతాన్ని, వాసనలను పూర్తిగా విస్మరించాల్సిందే. నీ చేతననుండి వాటిని నిర్మూలించాల్సిందే. అన్ని బంధనాలనుండి బయటపడి ఒక నూతన జన్మగా నీ జీవితాన్ని స్వీకరించు. గతాన్ని పూర్తిగా మర్చిపోయి నీవు ఆకాంక్షించే దిశగా సాగిపో. పూర్తిగా భవిష్యత్తువైపు చూడు. నీ మతాన్ని, దేశాన్ని, కుటుంబాన్ని వది లేసి కేవలం దైవం వైపే చూడు.

CWM 3: 53 *అనువాదం: యస్. వై. బాషా (9704101385)*

మతము - ఆధ్యాత్మికత

ఆలయాలలో విగ్రహాలను ప్రతిష్టించటానికి ఒక సాంప్రదాయ రీతిలో ఉత్సవం నిర్వహిస్తారు. ప్రధాన అర్చకులు లేదా సహాయ అర్చకులు ఎవరైనా కొన్ని నిగూఢమైన శక్తులు — అవి పరిమితమైనవే అయినప్పటికీ — కలిగి ఉండే తన ఆకాంక్షతో వైదిక విధానంద్వారా ఈ పృథ్వికి అతీతమయిన చేతనను ఈ మూర్తులలో ప్రతిష్టించ గలుగుతారు. అది ఒక పద్ధతి. ఇది ఒక చెక్క బొమ్మ కాదు. కేవలం ఒక రాయికాదు. ఒక చిత్రం మాత్రమే కాదు. ఇందులోకి ఒక వైదిక సంస్కారం ద్వారా శక్తిని కొనిరావటం జరిగింది. మీరు దానితో మాట్లాడవచ్చు అని మీకు చెప్పి ఉంటారు. ఇది సత్యమే. కాని అర్చకుడి స్వభావమేమిటో మనకు తెలియాలి. అతనికున్న మార్మికజ్ఞానం, అతనికి ఎటువంటి శక్తులతో సంబంధమున్నదీ కూడా మనకు తెలియాలి. అందువలన అక్కడ ఎన్నో విషయాలు ఉండవచ్చు. అక్కడ తప్పకుండా, "ఏదో" ఉంది. ఆ తతంగం జరిగినది అసలు ఏ శక్తీలేని అజ్ఞాని, మూర్ఖుడు, కాకపోతే, ఏ శక్తినీ ప్రతి ష్టించకుండా కేవలం ఒక పైపై ప్రదర్శన మాత్రమే జరిపి ఉంటే — తప్ప యిలా అరుదుగా జరుగుతుంది. తరచుగా అలా జరగాలని లేదు.) సాధారణంగా అచట యేదో వుంటుంది. కాని దాని స్వభావం, గుణం, మరివాటి సంగతి.....

CWM 4 : 396

సృష్టిలోని పరమాత్మకు, మతమెప్పుడూ, ఒక పరిమితే

మతం సృష్టిలోని ఆత్మకు ఒక పరిమితి. వ్యక్తి తన మానసికమయిన ఆలోచనలకు, తన జీవన పరిమితులలకు అతీతంగా స్వతంత్ర్యమయిన ఆధ్యాత్మికమయిన జీవనాన్ని కలిగి ఉంటే ఆ ఆధ్యాత్మికజీవనం మతపరమైన సూత్రాలను అధిగమిస్తుంది. మరింత ఉన్నతమయిన దానిలోకి ప్రవేశిస్తుంది. కానీ అతని సమర్పణ అంతరంగం నుండి రావాలి. కేవలం ముక్తసరి కాకూడదు. అది కేవలం బాహ్యరూపంనుండి వచ్చినదయితే, దాని పరిమితి ఘనతరమై ముందుకు సాగనివ్వదు. తమ పురోగమనం స్తంభించకుండా ఉండాలంటే తప్పకుండా మతం నుండి బయటకు రావలసినవారు కొందరున్నారు. ఎవరైతే మానసికమైన కార్యకలాపాలన్నీ కలిగి ఉండరో, తమను తాము ఏమీ ప్రశ్నించుకోరో, కేవలం తమ హృదయంలో అనంతంగా ఉన్నతమయిన దానికి సమర్పణకై ఆతురతను, తీవ్రమైన భక్తిని కలిగి ఉంటారో, వారికి మతం ఉన్నదా లేదా అన్నది ముఖ్యం కాదు. ఏదైనా ఒకటే అవుతుందికాని ఎపుడైతే పైపై రూపాలకే పరిమితమై పోతారో అపుడు యిక ముందుకు సాగలేరు.

మనసు స్వతంత్రమయి వెలుగులో వసిస్తుంటే తప్పయెంతో దూరం వెళ్ళడం కష్టం. అందుకని అది సుమారుగా ఒక తప్పనిసరి నియమం. (మరీ తప్పనిసరికాదు) కానీ మానసిక మయిన శక్తిని లేనివారు ఏ సిద్ధాంతాన్నయినా వాదించకుండా అంగీకరిస్తారు. తమను భగవంతునికి అనుసంధానించే ఈ ఆంతరికమయిన ఆత్రుత నుండి ఏదీ ఆపలేదని భావిస్తారు. కాని వీరికి మానసికమయిన జీవితం ఉండదు. చాలా పరిమితమై పోతుంది.

ప్రశ్న: ఆధ్యాత్మిక జీవనంలో కులాల కేమైనా ప్రాధాన్యత ఉన్నదా?

కులాలా? వాటికి ఆధ్యాత్మిక జీవితంతో పనిఏమిటి? ఎంతమాత్రం లేదు. అది కేవలం ఒక సాంఘికమయిన వ్యవస్థ. మాత్రమే.

ప్రశ్న: బ్రాహ్మణులు దైవాన్ని సేవించడంలో ఎక్కువ ప్రగతి చెందారని చెప్ప బడుతూ ఉంటుందికదా?

చాలా చెప్తూ ఉంటారు. ఆధ్యాత్మిక జీవనం ఈ విషయాలపై ఏ మాత్రం ఆధారపడి ఉండదు. కొన్ని సాంఘికమయిన సదాచారాలు వీరిపై ఆధారపడి ఉంటాయి. అవి కొన్ని పరిసరాలు, ప్రత్యేకమయిన విద్యాశిక్షణ యితరమైన వాటికన్నా మెరుగైన

ఆచార సంప్రదాయాలుండడం వలన ఉంటాయి. కేవలం అంతవరకే.

CWM5: 245-246

భగవంతుడు అనే పదానికి మనమిచ్చే అర్థం.

భగవంతుడు అనే పదానికి మనం ఆపాదించే అర్థాన్నిబట్టి అంతా ఆధారపడి ఉంటుంది. (ఇది మీకు నేను నాలుగు ఐదు సార్లు చెప్పి ఉంటాను.) ఏదయితే మనకు తెలియదో దేనినయితో మనం పొందటానికి ప్రయత్నిసున్నామో దానిని వ్యక్తం చేయటానికి ఈ పదం ఉపయోగిస్తూ ఉంటాం. మీరు మతపరమైన విద్యా బోధనను అందుకొని ఉంటే మీరు దానిని 'భగవంతుడు' అని పిలువటానికి అలవాటు పడి ఉంటారు. మీరు మరింత తాత్వికపరమైన విద్యను అభ్యసించి ఉంటే మీరు దానిని అనేక నామాలతో పిలవటానికి అలవాటుపడి ఉంటారు. అదే సమయంలో అది ఒక పరమోత్కృష్టమైన సత్యం అని మీరు భావిస్తారు. భగవంతుని గురించి మాట్లాడాలంటే, వర్ణించాలంటే మన చేతనకు అందని వస్తువులకు అతీత మయినదిగా, గహనమయినదిగా ఉన్నప్పుడు దైవం అని పిలుస్తాం. కొన్ని మతాలు మాత్రమే భగవంతుడికొక నిర్దిష్టమయిన రూపాన్నిస్తాయి. కొన్ని సార్లు అనేకమయిన రూపాల నిస్తాయి. అనేకమంది దేవుళ్ళుంటారు. కొన్ని సార్లు ఒకే రూపం, ఒకే దైవం ఉండటం చూస్తాం. కానీ యిదంతా మానవుల ఊహా చిత్రం. మరేదో ఉంది. ఒక సత్యం. మన అభివ్యక్తులకు అతీతంగా సాధనామార్గంద్వారా దానిని అందుకొనటంలో మనం సఫలం కావచ్చు. దానితో మమేకం కావచ్చు. ఒకసారి మమేకం అయినపుడు అది ఏమిటి అనేది మనకు తెలుస్తుంది. దానిని వ్యవస్థీకరించలేక పోవచ్చు. ఎందుకంటే అది మాటలలో చెప్పలేనిది. మీరు ఒక విధమైన పదజాలాన్ని వాడినపుడు మీకొక నిర్దిష్టమయిన మానసికమయిన విశ్వాసం ఉన్నప్పుడు, మీరు దానికి సంబంధించిన పదాలను వాడటం జరుగుతుంది. మీరు మరొక వర్గానికి చెందినపుడు మరొక విధ మయిన మాటలతో చెపుతారు. మీరు ఆ మాటలతో పిలవటం, ఆలోచించటం జరు గుతుంది. మీకు ఒక సరియైన అవగాహన కోసం చెప్తున్నదేమిటంటే అక్కడ ఉన్నది గహనమయినది, ఆలోచనలతో అందుకోలేనిది, అది చాలా చిన్న విషయం. దానికి ఏ ప్రాముఖ్యతా లేదు. అది ఉంది. మనం చేయవలసినదల్లా దానితో అనుసంధానం

కావటమే. దానికో పేరు పెట్టడం లేదా దానిని వర్ణించటం కాదు.

CWM 5: 25- 26 అనువాదం: డా. సరోజాప్రసాదు

తప్పనిసరిగా ఆ పరమసత్యతలో మనం జీవించగలగాలి

కొన్నిసార్లు ఒకరు ఒక వేదాంత గ్రంథాన్ని అసాంతం చదివికూడా అడుగైనా ముందుకు వేయలేరు. మతాన్ని పరమావధిగా చేసుకొని బ్రతికే ఒక పరమభక్తుడు ధ్యానంలో కూర్చుని వుండికూడా దేనినీ పొందలేడు. కొంతమంది వుంటారు. (మనకి బాగా తెలిసిన ఉదాహరణలున్నాయి.) అతి సాధారణమైన పనులు చేసేవారు, ఉదాహరణకు పాత చెప్పుని మరమ్మత్తు చేసే వ్యక్తి కూడా అనుభవం పొందుతాడు. దానిని గురించి ఆలోచించి చెప్పగలిగే వాని అంతట్నీ మించివున్న అనుభవం అది. ఇది ఒక వరం అంతే! అసలు కావలసింది యేమిటి? దానితో మమేకమై జీవించడం. ఒక్కోసారి ఏదో పుస్తకంలో ఒక వాక్యం చదువుతావు. అది నిన్ను వాస్తవికతకు చేరువ చేస్తుంది. కొన్నిసార్లు వేదాంత గ్రంథాన్ని చదువుతావు. లేక మత గ్రంథాలన్ని చదువుతావు. అవేవి ఎక్కడికీ చేర్చలేవు. ఏది ఏమయినా కొంతమంది వ్యక్తులుంటారు, వారికి ఆధ్యాత్మిక పుస్తక పఠనం ముందుకు సాగడానికి సాయం చేస్తుంది. కానీ ఇవన్నీ అప్రధానమైనవి, ఒకే ఒక్క విషయానికి ప్రాధాన్యత వుంది! అది నిజాయితీతో కూడిన నిరంతర తపన, ఎందుకనగా ఈ విషయాలు రెప్పపాటులో జరగవు. అందువల్ల పట్టుదల కలిగి వుండాలి. తాను పురోగమించడంలేదు అని భావించితే అతను నిరాశ చెందకూడదు. అతడు ప్రయత్నించాలి. ఏది తనకు స్వభావంలో అడ్డుగా వుంటున్నదీ తెలుసుకొని ఆ తర్వాత అవసరమైన పురోగతిని సాధించాలి. అపుడు అతను హఠాత్తుగా పురోగమిస్తాడు. చివరిస్థాయికి చేరినపుడుఒక అనుభవం కలుగుతుంది. చెప్పుకోతగ్గ విషయం యేమిటి అంటే విభిన్నమార్గాలని అనుసరించి, పూర్తిగా విరుద్ధమైన మనస్తత్వాలు కలవారు అత్యధిక విశ్వాసం కలవాడినుంచి లేదా అసలే నమ్మనివారి వరకు, భౌతికవాదులు సైతం అలాంటి అనుభవం దగ్గరకు చేరుకొంటారు. అది అందరి విషయంలోనూ అంతే. ఎందుకంటే అది యథార్థం కాబట్టి. ఎందుకంటే అది నిజం, ఏకైక సత్యత కాబట్టి. అది అతి సామాన్యం. నేనింక ఇంతకన్నా ఏమీ చెప్పను. దానిని గురించి మాట్లాడే విధానం ముఖ్యంకాదు. ఏది ముఖ్యం అంటే

ఆ మార్గాన్ని అనుసరించడమే — నీ మార్గాన్ని ఆ దారి ఎలాంటిది అయినా ఫర్వా లేదు. అవును అక్కడికి యెదగడానికి.

CWM 6 : 26- 27

దివ్యజీవులు, ఆరాధన

నీవు నిజమైన దివ్యజీవుల విషయం తీసుకొంటే, వారు దీనికి ఏ మాత్రం విలువనీయరు. వారు తమను ఆరాధించడానికి ఇష్టపడరు. లేదు, వారికిది ఎలాంటి ప్రత్యేకమైన సంతోషాన్ని యివ్వనే యివ్వదు! వారికి గర్వం లేదు కాబట్టి వారు సంతోషంగా వున్నారని అనుకోకు. గర్వం వల్లనే మనిషి ఆరాధింపబడటాన్ని యిష్టపడతాడు, ఒకవేళ మనిషికి ఎలాంటి గర్వం లేకపోతే అతను ఆరాధింపబడటాన్ని యిష్టపడడు, ఉదాహరణకు: వారు ఒక మంచి ఉద్దేశ్యాన్ని లేదా సున్నితమైన భావనను, లేదా నిస్వార్థతతో కూడిన లేదా అత్యుత్సాహంతో కూడిన ఒక చిన్న చర్యని, ఒక ఆనందాన్ని ఒక ఆధ్యాత్మిక ఆనందాన్ని చూసినట్లయితే అవి వారికి, ప్రార్థన, ఆరాధనలు, పూజలకన్నా మించిన గొప్పవిలువ గలవవుతాయి....

నేను ఏమి చెప్తున్నానో అది చాలా తీవ్రమైన విషయం. మీరు నిజమైన దేవుడిని ఒక ఆసనంలో కూర్చోబెట్టి, పూజ చేస్తున్నంతసేపు ఆయనక్కడే కూర్చుని వుండాలని నిర్బంధిస్తే దానిని ఆయన ఒక వినోదంగా చూస్తూ వుండవచ్చు, కానీ అది తప్పనిసరిగా ఆయనకి ఎలాంటి సంతృప్తిని యివ్వదు. ఏ సంతృప్తినీ యివ్వదు! నీ పూజ ద్వారా అతను పొంగిపోడు, సంతోషపడడు, గొప్ప వాడుకాదు. నువ్వా ఆలోచనని పూర్తిగా వదిలించుకోవాలి. ఆధ్యాత్మిక మరియు భౌతిక ప్రపంచాల నడుమ ప్రాణిక జీవులకు చెందిన ప్రపంచం మరి యొకటి వుంది. ఆ ప్రపంచమంతా ఇలాంటి వాటితో నిండి ఉంటుంది. ఎందుకనగా యీ జీవులన్నీ దాని మీదే జీవిస్తాయి. కాబట్టి దానితో సంతోషపడతాయి. అది వారికి త్వరితగతిని ప్రాముఖ్యతను యిస్తుంది. ఎవరికయితే ఎక్కువమంది విశ్వాసపరులు, భక్తులు మరియు ఆరాధకులుంటారో వారు అత్యంత ఆనందం పొందుతారు. పొంగిపోతూ, వుంటారు. కానీ ఆ భగవంతుడు వాటికి విలువనిచ్చాడని యెలా ఊహించగలరెవరైనా. దేవుళ్ళు.... నేను నిజమైన దేవుళ్ళగురించి మాట్లాడుతున్నాను, అధిమానస యథార్థ దేవుళ్ళు సైతం — వాళ్ళు ఇంకా వున్నా.... అలా అలా వారికి ఉన్నత చేతనా స్థాయి నిజంగా

వున్నప్పటికీ, అనేక మానవ సహజ బలహీనతలను కలిగి ఉంటారు. ఏ విధంగాను ఇది వారిని సంతోష పెట్టదు. ఒక నిజమైన మంచిచర్య మేధస్సు నిస్వార్థత, లేదా ఒక సూక్ష్మ అవగాహన లేదా ఒక పూర్తి నిజాయితీతో కూడిన ఆకాంక్ష ఇవన్నీ వారికి అల్పమతసంబంధమైన వేడుకలకన్నా అనంతంగా ఉన్నతమైనవిగా కనిపిస్తాయి. అనంతంగా! అసలు పోలికే లేదు.

CWM 6:196

మతపరమైన వేడుక

మత పరమైన వేడుక! ఉదాహరణకు అక్కడ మహాకాళి అని పిలువబడే అనేక శక్తులున్నాయి. వాటికి అతి భయంకరమైన రూపాలు కట్టబెట్టారు. ఎన్నో కులదేవతలుగా కొలువై వుంటారు. అవి చాలా భయంకరమైన ప్రాణిక శక్తులతో నిండి వుంటాయి. నాకు కొంతమంది తెలుసు. వారు ఇంట్లోవున్న కాళికను గురించి ఎంతగా భయ భ్రాంతులై వుంటారంటే, నిజానికి వాళ్ళు ఒక చిన్న తప్పు జరుగుతుందేమోనని వణికి పోతూంటారు. ఎందుకంటే ఏ దయినా ఉపద్రవాలు వస్తే, అవి కాళికాదేవియే పంపింది అని అనుకుంటారు. ఇది ఒక భయంకరమైన విషయము, ఆలోచనకూడా. నాకు ఆ శక్తులు బాగా తెలుసు. కాని అవి ప్రాణిక జీవులు, ఒక విధంగా చెప్పాలంటే వాటికి రూపు వచ్చింది మనుషుల భావనల నుంచే. ఎలాంటి రూపులో! మనుషుల లాంటి, భయంకరమైన, వికృతమైన శక్తుల్ని ఆరాధిస్తారు. అనుకోవటం! ఇంకా ఏమిటంటే ఈ అల్పదేవతలు గొప్పగా అని భావించబడడంకూడా జరుగుతుంది. ఈ దృక్కోణంలో మనుషులు కొద్దికాలమైనా మతసంబంధమైన వాతావరణనుంచి బయటపడటం మంచిదే — ఎంతో భయంతో, ఇలాంటి గుడ్డి మూఢనమ్మకాలకు లొంగిపోవడంవల్ల ప్రతికూలశక్తులు భయాందోళనలు కలిగించే అవకాశం తీసుకొంటాయి. ఈ తిరస్కరణలు, ఈ నమ్మకాలసమయాలు, ఈ కోణంలో మనుషులను మూఢాచారులనుంచి విముక్తులను చేయడం అత్యావశ్యకం, ఎపుడయితే వికృతమైన, అల్పమైన శక్తులకు పాదాక్రాంతంగాకుండా వుంటామో అపుడే మనం యధార్థ ఆధ్యాత్మిక శిఖరాలని అందుకొనేందుకు ఎదుగ గల్గుతాము. అపుడే పరమసత్యక్రియా శక్తులకు, నిజమైన దివ్యచేతనకు యధార్థమైన దివ్యశక్తితో కలిసి పనిచేయగలుగుతాం.

ఉన్నత స్థాయికి ఎదగకమునుపే వీటన్నింటినీ
బహుదూరంగా, పూర్తిగా వదిలివేయాలి.

CWM 6 : 196-197 అనువాదం: లక్ష్మి తుమ్మల (9014239277)

యోగము, మతము

ప్రశ్న: స్వీట్ మదర్ (మధుమయి శ్రీమాత) యోగానికి మతానికి మధ్యనున్న భేదమేమిటి?

ఒక వ్యక్తి ఏదో విధంగా దైవం ఉన్నాడని వినటమో, లేక దైవంలాంటి దేదో ఒకటి ఉన్నదనో లేక అటువంటి దేదో వున్నదనే వ్యక్తిగత అనుభూతి పొంది అతనిని కనుగొనటానికి సర్వవిధ ప్రయత్నాలు చేయ మొదలుపెట్తాడు. ఈ దైవాన్ని కనుగొనటానికి అతడేమిటో తెలుసుకొనడానికి అతనితో సాన్నిహిత్యానికి ఆతనితో ఏకంగావడానికి ఇచ్ఛతో ఒక క్రమశిక్షణ యేకాగ్రతకు సంబంధించిన సర్వవిధ ప్రయత్నాలు మొదలుపెట్తాడు. అప్పుడతడు యోగాభ్యాసం చేస్తున్నాడంటాం. అపుడు ఆ వ్యక్తి దైవాన్ని కనుగొనే ప్రక్రియనంతా వ్రాసి పెట్టుకొని దానిని ఒక స్థిర వ్యవస్థగా మార్చి నిర్దేశించితే అది ఒక మతంగా రూపుదాల్చుతుంది. ఉదాహరణకు అతనంటాడు — దైవం ఇలా ఉంటాడు, దైవాన్ని కనుగొనాలంటే, ఇది నీవు తప్పక చేయాలి. ఈ ప్రత్యేకమైన యోగముద్రలో ఉండాలి. స్థిరపడిన మనోవైఖరితో, నడవడికతో ఉండాలి. నిష్టగా, ఆచారాన్ని పాటించాలి. ఇదంతా సత్యమని నీవు సమ్మతించాలి. “నేను ఈ సత్యానికి పూర్తిగా కట్టుబడి ఉంటాను” అని చెప్పాలి, ఇంకను ప్రపంచంలో ఈ పద్దతి మాత్రమే సరైనదని కూడా చెప్పాలి. ఇదంతా స్థిరసూత్రాలుగా ఆచారాలుగా వ్రాసి వ్యవస్థీకరించి, ఏర్పాటు చేస్తే, అది ఒక మతంగా తయారవుతుంది.

ప్రశ్న: ఈ (మత) పద్ధతి ద్వారా ఎవరైనా దైవాన్ని తెలుసుకోగలరా?

ఎవరికైతే ఆధ్యాత్మిక భవిష్యముంటుందో దైవాన్ని తెలుసుకొనుట కొరకే ఆతనిలో చేతనావంతులవ్వటానికి, ఆతనిలో జీవించటానికి జన్మిస్తారో వారు, యే మార్గమైనా దేన్ననుసరించైనా ఆయన దగ్గరకు చేరతారు. మతాన్ని అనుసరించే వారిలో కూడా కొందరు ఆధ్యాత్మిక అనుభవాలను పొంది దైవాన్ని కనుగొన్నారు — సామాన్యంగా మతాన్ని అవలంబించినను, అవలంబించకున్ననూ కొందరిలో అంతరంగికంగా

గాఢంగా, ప్రేరణ ఉంటుంది. ప్రేరణ వారి అవరోధాలన్నింటినీ తొలగించి ముందుకు నడిపిస్తుంది. అంతట సమస్తము వారి ప్రయోజనానికి తోడ్పడుతుంది.

వారు తమ ఆధ్యాత్మిక అనుభవాలను పరిమితపరచుకొని చాలా మటుకు అనివార్యమైనవి మాత్రము చెప్పి వాటినే తమ సిద్ధాంతంగా చేస్తారు. కాని వారు స్వయంగా పరిమితులకు, నామరూపాలకు, సమస్త నియమాలకు అతీతంగా ఉంటూ కష్టం కాని సత్యమైన ఆధ్యాత్మిక అనుభవాలను పొంది ఉంటారు.

భిన్నమతాల సామరస్యత

అన్ని మతాలను సంయోజనము, సామరస్యము చేయుట మానసిక చైతన్యంతో వీలుకాదు. ఇందుకొరకు ఔన్నత్యాలకు ఎదిగి ఆలోచనలకు ఆవలగా ఉన్న భావాన్ని కనుగొనుట అవసరం. ఆకాంక్షతో ఆత్మసాక్షాత్కారంలో ప్రతి ఒక మతం చేసిన మానవ ప్రయత్నాన్ని శ్రీఅరవిందులు ఇచట ఎత్తి చూపారు. కచ్చితమైన మత సిద్ధాంతాలను మేధోపరమైన భావాలను, వాటి బాహ్యరూపాలుగా తయారుచేసుకొని ఉన్న ఈ మతాలను మనం అంగీకరించడానికి బదులు వాటి మూలతత్వాన్ని అవి ఏ సూత్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయో వాటిని తీసుకొంటే వాటిని యేకం చేయడంలో యిబ్బంది పడం.

మానవజాతి పురోగతి భిన్నపార్శ్వాలు యీ మతాలు. ఇవి పరస్పరం చక్కగా ఒక దానికొకటి పరిపూర్ణం చేసుకొంటాయి. పురోగతికి జీవితాన్ని మరింతగా అర్థం చేసుకొనడానికి దైవాన్ని మరింత సమగ్రంగా చేరడానికీ యింకా చాల వాటితో యేకం కావాలి. వస్తువుల వెనుకనున్న పరమాత్మను చేరడానికి యీ యైక్యత అవసరమని అది వరకే వక్కాణించబడింది. అయినా ఇది కూడా సరిపోదు, వీనితో పాటు అతనికి భవిష్యద్దర్శనంకూడా ఉండి తీరాలి. యే లక్ష్యం దిశగా మానవజాతి ముందుకు సాగుతున్నదో దానిని గురించి ప్రపంచ భవిష్యత్ సాఫల్యత గురించి తెలియాలి. ఒక నూతనయుగానికి నాంది పలికే 'ఆధ్యాత్మిక విప్లవం' అంటే అతి మానసిక విప్లవం గురించి శ్రీఅరవిందులు చెప్పినదాన్ని గురించి చివరకు తెలిసి ఉండాలి.

ఈ అతిమానస చైతన్యంలో ఈ మతాలన్నీ వైరుధ్యాలతో మినహాయింపులతొ యిక నెంతమాత్రం వుండవు. అవన్నీ పరస్పర పూరకాలౌతాయి.

మానసికం మాత్రమే అన్నింటినీ విభజిస్తుంది. ఒక సామరస్యపూరిత మొత్తం తయారవ్వాలంటే , యీ మానసిక రూపం దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో అది ఇతర మానసిక రూపాలు ప్రాతినిధ్యం వహించేలా వాటితో యేకమైతీరాలి.

మతానికి ఆధ్యాత్మికజీవితానికి మధ్యనున్న ముఖ్యమైన బేధం ఇదే. ఒక మతం ప్రత్యేకంగా తన రూపాలలో తన కర్మకాండలలో ఒకవిధమైన భావజాలంలో జీవిస్తుంది. అతి కొద్దిమంది అసాధారణ వ్యక్తుల ఆధ్యాత్మికత ద్వారా మాత్రమే అది గొప్పదవుతుంది. ఆధ్యాత్మికజీవితం అన్నింటినీ మించి, అతిమానస ఉపలబ్ధి, ప్రతి కచ్చితమైన మేధోపరమైన రూపం, జీవితానికి సంబంధించిన ప్రతి పరిమితరూపం నుండి స్వేచ్ఛ కలిగి వుంటుంది. ఈ ఆధ్యాత్మికజీవితం సంభావ్యతలను అభివ్యక్తులను ఆలింగనం చేసుకొని ఉన్నత విశ్వసత్యాలకు వాహికగా ఉంటుంది. వాటిని వ్యక్తం చేసేదిగా వుంటుంది. ఒక క్రొత్తమతం నిష్ప్రయోజనమేకాక హానికరం కూడా. ఒక క్రొత్త జీవితాన్ని సృష్టించాలి. ఒక క్రొత్త చైతన్యం వ్యక్తం అవ్వాలి. మేధో పరిమితులకు మానసిక సూత్రాలకు ఆవలనున్నదది. అభివ్యక్తం కావలసిన ఒక సజీవ సత్యం ఈ ఉపలబ్ధిలో ప్రతిదాని సారం దాని సత్యం తప్పక చేరాలి. అది దైవసత్యం యొక్క సాధ్యమైనంత సమస్త సంపూర్ణ విశ్వజనీనప్రకటన అవ్వాలి. ఇది మాత్రమే మానవజాతిని, ప్రపంచాన్ని కాపాడగలదు. ఈ గొప్ప ఆధ్యాత్మిక విప్లవాన్ని గురించే శ్రీఅరవిందులు మాట్లాడేది. దీనినే మనందరం సాక్షాత్కారింపజేసుకోవాలని వారు ఆశిస్తున్నారు.

CWM 9 : 151 అనువాదం: ఎస్. త్రివేణి (8008245276)

ఘటం - అమృతం

వివిధ మతశాఖల మధ్య తగవులు, వివిధ ఘటాల మధ్య తగవులా ఉంది: అమృతాన్ని నింపడానికి తగిన పాత్రగా మతాన్ని అంగీకరించారు. వాటిని తగవు లాడుకొనీయండి. మనకు కావల్సింది, అమృతాన్ని పొందటం పాత్ర ఏదైనా సరే, అమృతాన్ని, అమరత్వాన్ని పొందడమే.

— శ్రీఅరవిందులు

అమరత్వాన్నిచ్చే అమృతమే అత్యున్నత సత్యం, అత్యున్నత జ్ఞానం, అత్యున్నతునితో ఐక్యమైతేనే అమృతత్వ చేతన ప్రాప్తిస్తుంది. ప్రతి మతానికి, ఒక ప్రత్యేక మార్గముంటుంది, దైవాన్ని చేరేందుకు. శ్రీఅరవిందులు వాటిని వేర్వేరు

పాత్రలతో పోల్చారు. ఏ మార్గం అనుసరించినా గమ్యమొక్కటే. అదే ముఖ్యమైనది. ఏ కలశంలో పోసినా అదే అమృతం. కాని కొందరంటారు. కలశం మారితే (లేదా నడిచేదారి మారితే) దాని పరిమళం, రుచి మారుతుందని. అంటే దైవంలో నీ ఐక్యత ప్రభావితమౌతుందని. దీనికి శ్రీఅరవిందులు జవాబు ఇలా ఇస్తారు. ఎవరికి వారు వారి అభిరుచికి నచ్చిన మార్గంలో, దైవాన్ని చేరవచ్చు. కాని, అమృతం దైవంలో కలయిక, దాని అమరత్వశక్తిని అది తప్పక కల్గి ఉంటుంది.

CWM 10 :83

మతం ప్రయత్నిస్తుంది - దైవాన్ని తయారు చేయడానికి మనిషి రూపులో

ఎల్లప్పుడూ మతం ప్రయత్నిస్తుంది. మనిషి రూపులో దైవాన్ని తయారుచేయడానికి, బాగా విస్తరించబడ్డ, వృద్ధి చేయబడ్డ, అతిశయించిన మనిషి రూపులో దైవాన్ని చేయడానికి. కాని చివరకు అది, మనిషి లక్షణాలు గల దైవమే. ఫలితంగా, ప్రజలు దేవునికూడ మనిషిలాగే శత్రువుగా పరిగణిస్తారు. వారు చెప్పిన మాట వినకపోతే, చెప్పింది చేయకపోతే, ఆ దైవాన్ని నదిలో పారవేస్తారు.

ప్రశ్న: కాని ఈ దైవాలు కేవలం మానవ కల్పితాలేనా? వాటికి ప్రత్యేక అస్తిత్వం, స్వతంత్రఅస్తిత్వం ఉండదా?

మనం పిలిచే దైవం యొక్క ప్రతిమ ఎలా ఉన్నా, అసహ్యంగా, భయంకరంగా, లేదా ఒక వ్యంగ్య చిత్రంలా ఉన్నప్పటికీ, అది ప్రకటించే దైవం యొక్క ఉనికి, ఎల్ల

మతాలు ఉన్నంతకాలం నాస్తికత్వం, మతాలను సమతూకంలో వుంచడాని కనివార్యం. దారితెన్నులు అయిన మతం, నాస్తికత్వం రెండూ అదృశ్య మవ్వాలి. సత్యంకోసం, చిత్తశుద్ధి, అనాసక్త అన్వేషణ జరగడానికి రెండూ అదృశ్య మవ్వాలి. యీ అన్వేషణ లక్ష్యసాధనయెడల సంపూర్ణ సమర్పణా భావం వుండాలి.

CWM 10 : 284

ప్పుడూ దానిలో ఉంటుంది. దానికి ఎల్లప్పుడూ ఒక పూజారి, సన్యాసి, లేదా ఒక సాధువు, ఉంటాడు, దానిలో శక్తిని సాక్షాత్కారాన్ని బయటకు తెచ్చేందుకు. ఇది వాస్తవం. ఇది సత్యం. అక్కడ ఉంది దానిశక్తి, సాక్షాత్కారం. దానినే ఆరాధిస్తారు. పూజిస్తారు. ప్రజలు దాని రూపంగల రాయిని, చెక్కను, లేదా లోహాన్ని కాదు.
CWM 10 :95

మత, ఆధ్యాత్మిక బోధలు

మత బోధ పాతకాలానికి చెందినది, అది ఆపుతుంది, పురోగమనాన్ని. ఆధ్యాత్మిక బోధ భవిష్యత్ కు చెందినది, అది వెలుగును నింపుతుంది. చైతన్యాన్ని, ఎరుకను. అది తయారుచేస్తుంది, నిన్ను భవిష్యత్ సాధనలకు, అనుభవాలకు.

ఆధ్యాత్మిక బోధ మతాలకు అతీతమైనది. అది శ్రమిస్తుంది, ప్రపంచ - విశ్వ-సత్యం వైపు. బోధిస్తుంది అది సూటిగా దైవంలో దైవసంబంధంలో ప్రవేశించడాన్ని.
CWM 12:120

శ్రీమాత జీవితం నుండి ఒక కథ

నేను మొదటిసారి ఇండియా వచ్చినప్పుడు, ఒక జపాన్ పడవలో వచ్చా. దానిలో ఇద్దరు మతబోధకు లున్నారు. వారు ఆంగ్లేయులే. ఒకరు ఆంగ్లికన్, రెండవవారు ప్రెస్ బిటీరియన్తెగలకు చెందినవారు.

ఆదివారం వచ్చింది. మతపరమైన సమావేశం జరగాల్సి ఉంది. ఆ పడవపై. లేదంటే, అనాగరికంగా ఉంటుంది. అప్పుడు ప్రెస్ బిటీరియన్ ఆ సమావేశం జరిపించాడు. అక్కడ కొన్ని మెట్లు దిగువనున్న విశ్రాంతి హోలులో సమావేశం జరిగింది. వాతావరణం వేడిగా ఉంది. మేము ఎర్రసముద్రంలో ఉన్నాం. అందరూ జాకెట్లు, బిగువకాలర్లు, తోలుబూట్లు, టోపీలు, నెక్ టైలు ధరించారు. చేతి అడుగున ఒక పుస్తక ముంచుకున్నారు. స్త్రీలు టోపీలు, గొడుగులు ధరించారు. చేతి అడుగునఒక ప్రార్థనా పుస్తకముంచుకున్నారు. వారంతా, నౌక పైభాగంనుండి దిగువగల విశ్రాంతి హాలుకు ఒక వరుసలో వెళ్ళి గుమిగూడారు. ప్రెస్బిటీరియన్ మతబోధ ఉపన్యాసం ఇచ్చారు. అంతా శ్రద్ధగా విన్నారు. అందరూ ఎంతో తృప్తిగా పైకి వచ్చారు. సక్రమంగా ఒక బాధ్యత నిర్వహించామన్న తృప్తి వారిలో ఉంది. ఒక ఐదు నిమిషాల

తర్వాత వారంతా, త్రాగుతూ, పేకాడుతూ, బార్ లో ఉన్నారు. వారు మరిచారు మత సమావేశాన్ని. అంతా అయిపోయింది. వారివిధి వారు నిర్వహించారు. అంత కంటే ఏమీ జరగలేదు.

మతబోధకుడు పైకివచ్చి, ఎంతో గౌరవంగా నాతో అన్నారు. మీరు ఎందుకు రాలేదని, నేను అన్నాను "నేను చింతిస్తున్నాను. కాని నాకు మతంపై నమ్మకంలేదు." "ఓహ్! అయితే మీరు నిరీశ్వరవాదులా? అన్నాడు. మతబోధకుడు శ్రీమాత "కాదు, కానేరదు."

మతభోధకుడు: " అయితే ఎందుకు?"

శ్రీమాత: ఓహ్, నేను చెప్తే మీరు నిరుత్సాహపడ్తారు. కాని అతడు పట్టు పట్టాడు, కారణం చెప్పమని.

చివరకు నేను చెప్పా

శ్రీమాత: నన్ను అర్థం చేసుకుందుకు ప్రయత్నించండి. నేను అనుకోవడంలేదు మీరు, మీవాళ్ళు నిజాయితీగా ఉన్నారని. మీరంతా అక్కడకు వెళ్ళారు. ఒక సాంఘిక విధి నిర్వహణకు. ఒకమతాచార నిర్వాహణకు మాత్రమే. ఎందుకంటే మీరు నిజంగా అనుకోలేదు, దైవసంబంధంలో ప్రవేశించాలని"

మతబోధకుడు: దైవసంబంధంలో ప్రవేశించడానికా! అది మనం చేయలేము. మనకంత సామర్థ్యం లేదు. మనంచేయగల్గిందంతా కొన్ని మంచి మాటలు చెప్పడమే.

అప్పుడు నేనన్నా, "కాని ఆ కారణం వల్లే నేనక్కడకు వెళ్ళలేదు. ఎందుకంటే, అది నాకాశక్తి కల్గించదు."

CWM 8: 149 *అనువాదం: ఎస్. వై. సోమయాజులు (9247677982)*

*

తాను సత్యంగా చేస్తున్నట్లయితే, అదేదీ ఒక యోగశిక్షణగాలేకపోదు. సవ్యంగా చేయకున్నట్లయితే తపస్సయినా సరే ఉపయోగముండదు. ఎక్కడికీ చేర్చదు. అదే విధంగా సమయమంతా నిన్నే చూసుకుంటూ "నేనేమయినా అభివృద్ధి చెందు తున్నానా? ఇది ఇంకా బాగుండబోతున్నదా. విజయం సాధించబోతున్నదా?" అనుకుంటూ తపస్సు నాచరిస్తూంటే అదప్పుడు మీ అహం అని తెలుసుకోండి. అదింకా యింకా అంతులేనంతయి మరొక దానికక్కడ స్థానం లేకుండా అంతటినీ ఆక్రమిస్తుంది. ఆధ్యాత్మిక అహం అన్నింటికంటే హీనమని ఓ రోజున చెప్పుకున్నాం,

ఎందుకంటే దాని అల్పత్వం గురించి పూర్తిగా అచేతనమయి ఉంటుంది. పరిపూర్ణ దివ్యతనసుకోనప్పటికీ తానెంతో అధికమని నమ్ముతుంది.

CWM 4 :363

*

ప్రత్యేకించిన సత్యమన్నట్లు గోచరింపజేసే యే ప్రాపంచిక భావననయినా విశ్వభావన నయినా మనం 'మతం' అని, ఈ సత్యం ఒక ఆవిష్కార ఫలితమని ప్రకటింపబడి నందువలన అందులో అందరికీ నమ్మకముండాలంటాము.

మతాలలో అధికభాగం దైవం ఉనికిని ఆయనను, విధేయతతో అనుసరించడానికి నియమాలను రూఢిపరుస్తాయి. అయితే కొన్ని దైవంలేని మతాలున్నాయి. అవి సామాజిక- రాజకీయ సంస్థల వంటివి. ఒక ఆదర్శం పేరున లేక ఒక ఉన్నత స్థితి పేరుతో వాటిపట్ల అదే విధేయత చూపవలసిన హక్కు గురించి వాదిస్తాయి.

సత్యాన్ని స్వేచ్ఛగా అనుసరించడము తనదయిన మార్గంలో స్వేఛ్ఛగా దానిని సమీకరించడం మనిషికున్న హక్కు. అయితే ప్రతి ఒక్కరు ఆ ఆవిష్కరణ తనకు మాత్రమే మంచిదని, దానిని మిగిలిన వారిపై రుద్దరాదని తెలుసుకొని తీరాలి.

*

మతబోధను ఆధ్యాత్మికమని పొరపడరాదు.

మతబోధ గతానికి సంబంధించినది. అభివృద్ధిని తాత్కాలికంగా ఆధ్యాత్మికబోధ భవిష్యత్తుకు చెందిన బోధ, ఇది చైతన్యాన్ని శాంతివంతం జేసి, భవిష్యత్సాక్షాత్కారానికి తయారుచేస్తుంది.

ఆధ్యాత్మిక బోధ మతాలకంటె ఉన్నతంగా, సార్వజనీన సత్యంవైపు మరలేందుకు కృషి చేస్తుంది.

భగవంతునితో ప్రత్యక్ష సంబంధం లోనికి మనం ప్రవేశించడం గురించి బోధిస్తుంది.

CWM 12 :120

ప్రతి మతము మానవాళికి సహాయ పడింది. విగ్రహారాధనతత్వం మనిషిలో సౌందర్యపు వెలుగును, అతడి జీవితానికి విస్తృతిని ఉన్నతిని పెంచింది. బహుముఖ పరిపూర్ణతను లక్ష్యంగా చేసింది. క్రైస్తవం అతనికి దివ్యప్రేమ, దాతృత్వాల దర్శనాన్ని కొంత యిచ్చింది. బౌద్ధం మరింత వివేకంతో, సాధువు, పవిత్రంగా ఉండడానికి ఒక ఉత్తమ మార్గాన్ని చూపింది. జూడాయిజం, యిస్లాంలు క్రియతో మతధర్మ యుత మయిన నమ్మకంతో దైవం పట్ల మిక్కిలి శ్రద్ధాభక్తులతో ఎలా ఉండాలో చూపాయి, హిందూతత్త్వం అత్యంత విస్తారమైన, అత్యంత లోతయిన ఆధ్యాత్మిక సంభవతలను అతడికి విప్పి చెప్పింది. ఈ దివ్యధర్మాలన్నీ పరస్పర ఆలింగనంతో ఒకదానితోనొకటి సమ్మిళితమయితే ఓ మహనీయ కార్యం జరుగుతుంది. కాని బౌద్ధిక మౌఢ్యం మతైక అహంకారం అడ్డుకుంటాయి.

మతాలు ఎన్నో ఆత్మలను రక్షించాయి. కాని యిప్పటికీ, ఏదీ మానవాళిని ఆధ్యాత్మికం చేయలేదు. అందుకు కావలసింది మతమూ, నమ్మకమూ గావు, కాని ఆధ్యాత్మికంగా స్వీయపరిణామం కోసం వదలకుండా సంపూర్ణ అవగాహనతో కూడిన ప్రయత్నం చేయాలి.

SABCL. Vol. 16, p. 393- 4

*

శ్రీఅరవిందులు జన్మించేవరకు ఎల్లప్పుడూ మతాలు, ఆధ్యాత్మికత గత ఆకృతులను కేంద్రంగా చేసుకొనేవి. భూతల జీవితాన్ని నిరాకరించడమే 'లక్ష్యం' గా చూపు తుండేవి. కాబట్టి రెండు ప్రత్యామ్నాయాలమధ్య మీరెంపిక చేసుకోవలసి ఉండేది. అల్పమయిన సంతోషాలు, బాధలు, ఆనందాలు, వేదనలు, సవ్యంగా ప్రవర్తించకపోతే నరకం ప్రాప్తిస్తుందన్న భయాలతో గూడిన యీ ప్రాపంచిక జీవితమో లేదా మరొక ప్రపంచం, స్వర్గలోకం నిర్వాణం, మోక్షం, (విముక్తి) లోనికి పలాయనమో ఎంపిక చేసుకోవాలి.

ఈ రెండింటి మధ్య పెద్దగా ఎంపిక చేసుకొనేదేమీ లేదు. రెండూ సమానంగా అల్పమయినవే.

ఈ మౌలికమయిన తప్పిదం వల్లనే భారతదేశం బలహీనమయి, హీనస్థితికి వచ్చిందని శ్రీఅరవిందులు మనకు చెప్పారు. ఈ దేశాన్నుండి శక్తినంతటినీ (నీరు

గార్చడానికి) బౌద్ధం జైనం జగన్మిథ్యాతత్వం నిర్వీర్యం చేయడానికీ తత్వాలు చాలినంత చేసాయి.

ప్రపంచంలో పదార్థాన్ని మించి ఏదో ఉన్నదని యింకా ఎరుకతో ఉన్న ప్రాంతం కేవలం భారతదేశం మాత్రమే. మిగిలిన దేశాలు ఐరోపా అమెరికా, యింకా యితర మైనవి దీనిని మరిచాయి. అందువలన భద్రపరచి ప్రపంచానికి అందించవలసిన ఒకానొక సందేశం ఆమెవద్ద ఉన్నది. కాని ప్రస్తుతం బురదలో బురదనే చిమ్ముకుంటూ ఆమె చిందులేస్తోంది.


పృథ్వీ జీవితాన్నుండి పారిపోవడంలో సత్యం ఉండదని, అందులోనే ఉంటూ, దైవం దానిని రూపాంతరణ జేసి, దివ్యం జేయడంలో ఉన్నదని ఇక్కడ ఈ భౌతిక ప్రపంచం వ్యక్తమయ్యేందుకు వీలుగా శ్రీఅరవిందులు చూపారు.

CWM12 :211 *అనువాదం: జి. అరుణామోహన్*

అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2018




పునర్జన్మ

సంపాదకీయం:

మరణానంతరం, యేం జరుగుతుందనే దానిని గురించి లోతైన అంతుబట్టని రహస్యాలను నిశితంగా అధ్యయనం చేసేటట్లు ఆధ్యాత్మిక అన్వేషకుడిని, విజ్ఞాన శాస్త్రవేత్తను, పునర్జన్మకు సంబంధించిన విషయం వేధిస్తూనే వుంది. మన యింద్రియాలు దాటిపోలేని ఒక యినుపగోడలాగా మృత్యువు నిలిచి వుంది. దేహం అంతమవ్వడాన్ని మనిషి చూస్తూనే వున్నాడు. కాని తానొక దేహాన్ని మాత్రమే కాదని, ఒక సజీవ మూర్తిత్వాన్ననే స్ఫురణ అతని కుంది. అన్నింటినీ మించి మనం, నివశించేదేహంలో వున్న ఒక సచేతన అమరులం అని మార్మికవాది, దానికి తన అనుభవాన్ని జోడించి చెప్తాడు. మన పదార్థ సంబంధ పరిమితుల కావలకు చేరగల సూక్ష్మయింద్రియాలను అభివృద్ధి చేసుకొన్న మార్మిక జ్ఞాని, అంతరాత్మ రహస్యాన్నే గాక, అనేక దేహాలు, విభిన్న మూర్తిత్వాల ద్వారా అది సాగించే మహాయానాన్ని గురించి కూడా తెలియజేస్తాడు. అసలు దీనంతటికీ ఒక ఉద్దేశ్యం అంటూ యేదైనా వుందా? ఉంటే అదేమిటి? నశించే యీ భౌతిక దేహం వున్న భూమిమీదకు తిరిగి తిరిగి జన్మద్వారా రావడంలోని అంతరార్థం యేమిటి? ఈ ప్రశ్నలు మానవ జాతిని యుగాల పర్యంతం వేధిస్తూవస్తూనే వున్నాయి. శాశ్వతమైనవిగా కన్పించే యీ ప్రశ్నలకు సమాధానాలను, శ్రీమాత, శ్రీఅరవిందుల వెలుగులో, యీ సంచికలో వెదుక ప్రయత్నిద్దాం.

అనువాదం: కె.వి. రావు (9849929254)



మనస్సు, జీవితాల కఠిన శ్రమ ఆమెకు తెలుసుగనుక
తన బిడ్డల జీవితాల ననుభూతి చెంది, భాగం పంచుకొనే తల్లిలా
తన ఒక చిన్న అంశనే వెలువరించి
మనిషి అంగుష్ఠముకన్న పెద్దది కాని ఒక అస్తిత్వాన్ని
హృదయ రహస్య ప్రాంతమందుంచె

శ్రీఅరవిందులు

అమృత అంతరాత్మ

దివ్యాగ్ని విస్ఫులింగం (నిప్పురవ్వ)

ప్రాణ, పదార్థాలలోవున్న దివ్యాగ్ని ఒక విస్ఫులింగం అంతరాత్మ, అదొక ఉపమానం మాత్రమే. దానిని చేతనా విస్ఫులింగమని వర్ణించలేదు.

అంతరాత్మికంనుండి భిన్నమైన, మానసికమైన ప్రాణిక భౌతిక చేతన ఉన్నది. చైత్యపురుషుడు చేతన ఒకటిగాదు. అంతరాత్మ లేక దివ్యాగ్ని విస్ఫులింగం ఒక అంతరాత్మికవ్యక్తిత్వాన్ని అభివృద్ధిచేయ నారంభించినపుడు, ఆ అంతరాత్మిక వ్యక్తిత్వాన్ని చైత్యపురుషుడు అంటాం. వ్యవస్థీకృమైన ప్రాణికం, మనస్సులు అభివృద్ధి చెందకముందే అంతరాత్మ, లేక విస్ఫులింగం వుంది. అవిద్యనుండి, వెలుగులోనికి సాగే వ్యష్టి పరిణామానికి అందులోనే వుండి ఆధారంగా అవ్వడానికి ఒక దివ్య సూత్రంగా, పరిణామంలోనికి, దైవానికి సంబంధించినదేదో అది అంతరాత్మ. పరిణామక్రమంలో అది ఒక అంతరాత్మిక వ్యక్తిని లేక అంతరాత్మ వ్యష్టిత్వాన్ని అభివృద్ధి చేస్తుంది. అది జన్మ, జన్మకు మనస్సును, ప్రాణికాన్ని, దేహాన్ని తన పనిముట్లుగా వాడుకొంటూ యెదుగుతూంటుంది. అంతరాత్మ అమరం, కాని, తక్కినదంతా విచ్ఛిన్నమై పోతుంది. అది తన అనుభవసారాన్ని, వ్యక్తి పరిణామ కొనసాగింపును, జన్మ నుండి జన్మకు తీసుకుపోతూ పయనిస్తుంటుంది.

CWSA 28: 117-18

అంతరాత్మిక సన్నిధి, చైత్యపురుషుడు

ఊర్థ్వగతి పరిణామానికి సంబంధించినంతవరకు, చైత్యపురుషుని గురించి ప్రస్తావించడంకంటె అంతరాత్మికసన్నిధి గురించి మాట్లాడడమే సమంజసంగా వుంటుంది. ఎందుకనంటే కొంచెంకొంచెంగా చైత్యపురుషునిగా తయారయ్యేది అంతరాత్మిక సన్నిధి. పరిణమించే ప్రతిరూపంలో ఒక సన్నిధి వుంటుందికాని అది వ్యక్తీకరించబడి వుండదు. దానికి యెదుగగల పరిణామ గతిని అనుసరించగల సామర్థ్యం వుంది. ఊర్థ్వంనుండి అంతర్వలన మవుతూ క్రిందికి దిగిరావడం గాదు. అది చివరకు ఒక వ్యక్తిత్వంగా తయారైనపుడు, చైత్యపురుషునిగా తయారయ్యేటట్లు యెదిగే అస్తిత్వానికి కేంద్రంగా అవ్వడాని కుద్దేశించబడిన దైవచేతనా విస్ఫులింగం చుట్టూ,

క్రమంగా ఒకరూపం సంతరించుకొంటుంది. శాశ్వతమై వుండేది, ఇదిగో ఈ విస్ఫులింగమే. ఆ వ్యక్తిత్వాన్ని రూపొందించడానికి సర్వవిధఅంశాలను అది తన చుట్టూప్రోది చేసుకొంటుంది. శాశ్వత దివ్య విస్ఫులింగం చుట్టూ అంతరాత్మిక మూర్తిత్వం పూర్తిగా యెదిగినపుడు, పూర్తిగా నిర్మితమైనప్పుడు మాత్రమే యధార్థ చైత్యపురుషుని రూపం తయారవుతుంది. ఊర్ధ్వంలోని ఒక అస్తిత్వంతో గాని, లేక మూర్తిత్వంతోగాని, అది యేకం అయినపుడు అది తన అత్యున్నతస్థితిని, సంపూర్ణ సాఫల్యతను పొందు తుంది.....

ప్రతి జంతువుకు దానిని దత్తం చేయడానికి తిరస్కరించలేనట్లుగా ప్రతి మనిషికి ఒక చైత్యపురుషుడుంటాడని యెవరం చెప్పలేం. మనిషికి దగ్గరగా నివసించిన అనేక జంతువులలో దానికి సంబంధించిన దాని ఆరంభాలు యెంతో కొంత వున్నాయి. అదే సమయంలో చాలా తరచుగా, పశుప్రాయులకంటె మరేమీ కానటువంటి వారిని కూడా మనం చూస్తున్నాం, ఇక్కడ కూడా చాలా వరకు తత్సమస్థాయి వుంది. కాని మొత్తం మీద అంతరాత్మికానికుండే యధార్థ అర్థంలో మానవ దశలోనే అది మొదలౌతుంది. కాథలిక్ మతం, ఆ కారణంచేతనే, మనిషికి మాత్రమే అంతరాత్మ వుంటుంది అంటుంది. మనిషిలో మాత్రమే చైత్యపురుషుడు పూర్తి స్థాయికి యెదిగి చివరకు అవతరించు ఒక అస్తిత్వంతో, ఊర్ధ్వం నుండి దిగివచ్చే ఒక దైవతంతో కలిసి, ఒకటైపోయే అవకాశం వుంది.

CWM 3: 150-51

చైత్యపురుషుని మూలం

ఇవెలా జరుగుతాయో చూద్దాం. అంతరాత్మిక జీవితం మూలం, విశ్వపదార్థంలో దివ్యసన్నిధి అనేవి రెండూ ఒకటే, అది తెలిసే వుంది. కాని యెన్నడూ భూమిమీద జన్మించనటువంటి అక్కడ్నించే పనిచేయాలనుకుని, ఇహలోక కార్యాన్ని చేస్తున్న టువంటి జీవులు పైలోకంలో వున్నారు. కాబట్టి కొన్ని చైత్యపురుషులు పూర్తిగా అభివృద్ధి చెందేంతవరకు నిరీక్షించి వాటితో యైక్యమై వాటి స్వభావాన్ననుసరించి యేదో పనిచేస్తున్నారు. భూమిమీదున్న అంతరాత్మిక చేతనకు వారి చేతన తోడవు తుంది. ఇచట ఎన్నడూ జన్మ తీసుకొనని జీవులు వీరు. వీరు, సృష్టి ముందుకు పోతున్నకొద్దీ అధికాధికంగా తమను తాము వాస్తవం చేసుకుంటూ వుంటారు.

బహుశా వాళ్లు ప్రప్రథమంగా దైవం నుండి వెలువడినవారు, కొన్ని ప్రత్యేక కారణాల చేత విశ్వం లోనికి పంపబడినవారు — వారిని మనుషులు 'దేవతలు' లేక 'అర్థ దేవతలు' అంటారు. కాబట్టి ఒక ప్రత్యేక కారణంచేత, రూపమేర్పరచుకొంటున్న ఒక చైత్యపురుషుని వీటిలో యేదో ఒకటి యెంచుకొంటుంది. తాను దానితో తాదాత్మ్యం చెందినపుడు ఆ తాదాత్మ్యతను భరించి ఆధారం కాగలంత బలంగా ఆ చైత్యపురుషుడు చాలినంతగా తయారైనపుడు భూమి మీద కొంత పనిచేయడానికి దానితో తాదాత్మ్యత చెందుతుంది. ఇది చాలా తరచుగా జరుగదు, కాని అది జరిగింది, యింకా జరుగుతుంది కూడా. ప్రాచీన సంప్రదాయాలలోని గాథలలో భూమి మీద దేవత లవతరించడాన్ని గురించి విని వుంటావు. పురాణగాథలు వాటిని గురించి చెప్తాయి. అది కొంత వాస్తవానికి సంబంధించినదే. కాని, చైత్యపురుషు లన్నీ అవశ్యం ఉన్నత భూమికలకు సంబధించిన ఒక అస్తిత్వంలో యేకం అవ్వడం వుండదు.

CWM 4:183-84

చైత్యపురుషుని పురోగతి

చైత్యపురుషునిలో విభిన్నమైన ద్వివిధ పురోగతి వుంటుంది. ఒకటి స్వీయ రూపాన్ని సంతరించుకోవడం, నిర్మించుకోవడం, వ్యవస్థీకరించడం. జీవునిలోనే ఒక విధమైన సూక్ష్మ దివ్యవిస్ఫులింగంగా వున్న స్థితి నుండి అంతరాత్మికం ఆరంభమౌతుంది. ఈ విస్ఫులింగం నుండి తన స్వకీయ కర్మ, సంకల్పం కలిగిన ఒక స్వతంత్ర సచేతన అస్తిత్వం వెలువడుతుంది. తన మూలంలో చైత్యపురుషుడు, ఒక దివ్యచేతన విస్ఫులింగం మాత్రమే. జన్మ పరంపరల ద్వారా అదొక సచేతన వ్యక్తిత్వాన్ని నిర్మించుకొంటుంది. ఎదుగుతున్న బిడ్డ పురోగతి లాంటిదే అది కూడా. తయారీలో వున్న వస్తువది. ఎక్కువ మంది మనుషులలో చైత్యపురుషుడు తయారవుతున్న దశలోనే వుంటుంది. అది పూర్తిగా వ్యక్తిత్వీకరించబడి వుండదు, పూర్తిగా సచేతన అస్తిత్వమై వుండదు, తనకు తాను అధిపతియై వుండదు. దానికి అనేక పునర్జన్మలు ఒకదాని తరువాత మరొకటిగా, తనకు తాను నిర్మాణం చేసుకొనేందుకు పూర్తిగా సచేతన మయ్యేందుకు వీలుగా, వుంటాయి.

కాని యిటువంటి పురోగతికి అంత ముంటుంది. పురుషుడు పూర్తిగా అభివృద్ధి



చెందిన, పూర్తిగా వ్యష్టిత్వాన్ని సంతరించుకొన్న, తనకు తాను పూర్తిగా అధికారియైన, తన భవిష్యత్తును తానే నిర్ణయించుకోగల సమయం వస్తుంది. ఈ అస్తిత్వంలేక యీ చైత్యపురుషులలో యేదైనా ఒకటి ఆ దశకు చేరి మానవునిగా జన్మ తీసుకొన్నప్పుడు, అది చాలా గొప్పదైన భిన్నత్వం కలిగి వుంటుంది. చెప్పాలంటే ఆ మానవజీవి జన్మతః స్వేచ్ఛావంతుడై వుంటాడు. అతడు పరిస్థితులకు, పరిసరాలకు, తన మూలానికి, ఆనువంశికతకు సాధారణ జనంలాగా బద్ధుడై వుండడు. ఏదో కార్య నిర్వహణకు, దేనినో చేయడానికి, ఒక మహాకార్యసాధనకు ప్రపంచంలోని కొస్తాడు. ఈ దృక్పథం దృష్ట్యా యెదుగుదలలో అతని పురోగతి ముగిసిపోయినట్లే, అంటే ఒక మానవదేహంలో అతను తిరిగి జన్మించవలసి రావడం అతనికి అనివార్యం కాదు. అప్పటి వరకూ పునర్జన్మ అతనికి ఒక ఆవశ్యకతైంది. ఎందుకనంటే పునర్జన్మ ద్వారానే అతడెదిగాడు. భౌతికదేహంలో, భౌతికజీవితంలో క్రమంగా అభివృద్ధిచెంది, పూర్తి సచేనతజీవిగా యెదిగాడు. కాని ఒకసారి అతను పూర్తిగా రూపొందిన పిదప అతడు స్వేచ్ఛాజీవి అయ్యాడు, అంటే అతడు జన్మలోనికి రావచ్చు, రాకపోవచ్చు, అది అతనిష్టం. అందుచేత, ఆ స్థాయిలో, ఒక రకమైన పురోగతి నిలిచిపోతుంది.

పూర్తిగా రూపొందిన యీ జీవి దైవకార్యోపకరణం అవ్వాలనుకొంటే, ఒక అంతరాత్మికానందంలో, తన స్వస్థానంలో విశ్రాంతి తీసుకోవాలని అనుకొంటే, భూమిపై దైవకార్యంలో ఒక కార్యకర్తగా అవ్వాలని, దైవకార్యం నెరవేర్చాలనుకొంటే అప్పుడు అతనికో నూతన పురోగమనం, కార్యసాధనలో పురోగతి, తన కార్యనిర్వహణా విధానంలో దైవ ఇచ్ఛను ప్రకటించడంలో నూతన పురోగతి వుంటుంది. కనుక విషయం మారిపోయే సమయమంటూ ఒకటి వుంది. ప్రపంచంలో వున్నంతకాలం, దైవం కోసం పనిచేయాలనుకొన్నంత కాలం అతడు పురోగమిస్తుంటాడు. అతడు అంతరాత్మికలోకం లోనికి ఉపసంహరించుకొని, దైవకార్యాన్ని త్యజించినపుడు మాత్రమే అతడు సమస్త పురోగతికి బయట వుండిపోతాడు, ఎందుకనంటే నేను మొదట చెప్పినట్లు, భూమి మీద మాత్రమే భౌతికప్రపంచంలో మాత్రమే పురోగమనం వుంటుంది, ప్రతి చోటా దానిని సముపార్జించుకోలేం. అంతరాత్మికలోకంలో ఒక రకమైన ఆనందమయ విశ్రాంతి వుంటుంది. అతడది వరకేమిటో, అలాగే వుండిపోతాడు, యేమీ కదలిక వుండదు.

CWM 5L204-05 అనువాదం: కె. వి. రావు (9849929254)

మృత్యువు, అభివృద్ధి

ప్రశ్న: ఎవరికైతే వారి అంతరాత్మిక స్పృహ లేదో వారి విషయం?
వారికి ఇష్టమున్నా లేకున్నా తప్పనిసరిగా అభివృద్ధి చెంద వత్తిడికి లోనవుతారు. వారి చైత్యపురుషుడు దానంతటదే అభివృద్ధి పథంలో నడుస్తుంది. వారికి ఆ స్పృహ లేకపోయినప్పటికి అభివృద్ధి చెందేటట్లు తమను తామే వత్తిడికి లోను చేసుకుంటారు.

అంటే వారు ఒక వక్రగతిని అనుసరిస్తున్నారని చెప్పవలసి వుంది. వారి జీవితంలో ఒక ఆరోహణను అనుసరిస్తారు. అది ఒక యెరుగుదలలేని పసివాని పురోగమనంలా ఉంటుంది. ఒక సమయాన తన యెదుగుదల శిఖరాగ్రానికి చేరిన తర్వాత అభివృద్ధి భూమిక మారకపోతే అంటే శుద్ధమైన భౌతిక అభివృద్ధి, మానసిక అభివృద్ధిగా అంతరాత్మిక అభివృద్ధిగా, ఆధ్యాత్మిక అభివృద్ధిగా మారకపోతే వక్రగతి ననుసరిస్తూ క్రిందికి దిగిపోతుంది, అచట నశించిపోతుంది, ఇక నెంతమాత్రం మనుగడ సాగించలేదు.

భౌతిక ప్రపంచములో అభివృద్ధి స్థిరమైనది, అవిచ్ఛిన్న మైనది కాదు కాబట్టి అచట యెదుగుదల, యెంతో ఉన్నది, క్షీణింపు, నశింపు వుంటాయి. ఎందుకనంటే ముందుకు వెళ్ళలేని దేదైనాసరే వెనుకకు పడిపోతుంది. పురోగతి లేనిదంతా తిరోగ మిస్తుంది.

భౌతికంగా జరిగేది అంతంత మాత్రమే. భౌతికప్రపంచం నిరాటంకంగా అభివృద్ధి చెందడం ఎలాగో నేర్చుకోలేదు. పురోగతిలో ఒకానొక దశకు చేరుకొన్న తర్వాత అభివృద్ధి చెందడంలో అలసిపోయి, శక్తిసామర్థ్యాలు ప్రస్తుత శరీరతత్వం సరిపోక పోవడము వలన, కారణ మేమైనప్పటికి అభివృద్ధి ఆగిపోవడము, కొంతకాలానికి క్షీణించడము జరుగుతుంది. ఎవరైనా పూర్తిగా భౌతిక జీవితం జీవించినవారైనా ఒక విధమైన శిఖరాగ్రానికి చేరి, వేగముగా కిందకు దిగజారిపోతారు. కాని సాధారణ సామూహిక మానవాభివృద్ధి వెనుక, భౌతిక, ప్రాణిక, మానసిక అభివృద్ధి వున్నది. కాబట్టి, మానసికాభివృద్ధి దీర్ఘకాలము భౌతిక పురోగమనం ఆగిపోయినా కొనసాగు తుంది. ఈ మానసికాభివృద్ధి ద్వారా ఒక రకమైన ఆరోహణను భౌతికాభివృద్ధి ఆగి పోయిన చాలా కాలంవరకు కొనసాగించుకొంటాము

తమ చైత్యపురుషుని యెరిగి, దానితో యేకమై, దాని జీవితంలో పాలు

పంచుకొన్నవారు, యోగం చేస్తున్నవారు ఉన్నారు. అటువంటివారు తమ జీవిత మంతా తుది శ్వాస వరకు పురోగమిస్తూనే వుంటారు. వారు మరణించినా కూడా అభివృద్ధి ఆగదు. శరీరం యిక నెంత మాత్రం నిలువలేదనే కారణం చేత వారు శరీరాన్ని విడిచినా వారి అభివృద్ధి నిరంతరము కొనసాగుతూనే వుంటుంది.

CWM 5;203-05 శ్రీమాత

దేహములో అంతరాత్మిక కేంద్రముగా రూపాంతరీకరణ, నిర్వహించబడును. రెండు భౌతిక జీవితాల మధ్య విరామదశలో అభివృద్ధి కొనసాగుతుందని లేక అది మరింత సంపూర్ణము, వేగవంతము అని నమ్మడం చాలా పెద్ద పొరపాటు. సాధారణముగా అచట ఏ విధమైన పురోగమన ముండదు. ఎందువల నంటే అంతరాత్మికమైనది విశ్రాంత స్థితిలో ప్రవేశిస్తుంది. మిగిలిన భాగాలు కొంచెం ఇంచుమించుగా క్షణభంగుర జీవితంలో, తమ స్వీయ పరగణాలలో కొంతకాలముండి, ఆ తరువాత అదృశ్యమౌతాయి.

భూమిపై జీవనము అభివృద్ధికి అనువైన ప్రదేశము. ఇచట భూమిపై నివసించు సమయంలోనే అభివృద్ధి సాధ్యము. అంతరాత్మికమైనది తనకు తాను అభివృద్ధి చేసుకుంటూ, ఒక జీవితము నుండి మరొక జీవితానికి పురోభివృద్ధిని కొనిపోతూతన స్వకీయ పరిణామాన్ని, స్వయంగా అభివృద్ధిని కొనిపోతుంటుంది.

CWM 9:270 శ్రీమాత

అనువాదము: జి. వి. యస్. వి. ప్రసాదరావు (9848532224)

పునర్జన్మ ఉద్దేశ్యం

పునర్జన్మ కానుకగానో లేదా శిక్షగానో రాదు.

ఒక మంచివాణ్ణి, నిజానికి అతడు మంచివాడే అయినా అతడి కడుపులోకి పోయే నెయ్యి, అతడి బ్యాంకు ఖాతాలో జమ అయ్యే రూపాయిల గలగలలు, ఇంకా రకరకాలుగా అదృష్టం కలిసివస్తే అతణ్ణి ఒక మంచి మనిషిగా,పుణ్యాత్ముడిగా చెప్పగలగడం ఎంత సౌకర్యంగా, హాయిగా వుంటుంది. పరమాత్మ ఒక కఠోర, గౌరవనీయుడైన జమాఖర్చులు వ్రాసే గణకుడు గదా? — అలాగే అంతా పోగొట్టు కొన్న ఒక బికారియైన మోసగాని వంక వేలెత్తి చూపుతూ “నువ్వు దరిద్రుడివి, నీవు ఇంత దుష్టుడివి కాకుంటే దేవుడు పరిపాలించే ప్రపంచంలో వుండేవాడివి లేదా కనీసం మంచి యేలికలోనైనా వుండేవాడివి కానీ ఇలా చితికిపోయి, ఆకలి, దురదృష్టం, దుఃఖాలతో తరమబడుతూ లోకుల నడుమ అగౌరవంతో బ్రతికేవాడివా? అవును నీవు పాపిష్టిగా నిరూపించబడ్డావు. ఎందుకంటే ఇలా నీవు శిథిలమైనావంటే దేవుని న్యాయం అమలు జరిగినట్లే” అని అనగలగడం కూడా ఎంతో సౌకర్యంగా, తేలిగ్గా వుంటుంది. కానీ అదృష్టంకొద్దీ పరమేశ్వరుని మేధస్సు ఈ మనిషి పిల్లతనం కంటే ఎంతో తెలివిగా, ఉదాత్తంగా వుంటుంది. అలా పైన అనుకొన్నట్లు జరగడం అసంభవం. కానీ ఆ విధంగానే చూద్దాం. ఒక వేళ మంచివాడు తగినంత అదృష్టాన్ని, నేతిని, డబ్బుల్ని కల్గి వుండకపోతే అతడు నిజంగానే తాను క్రితం ఎప్పుడో చేసిన అపరాధాలకు బాధలను అనుభవిస్తున్న దౌర్భగ్యుడిగానే అనుకోవచ్చు — కానీ పూర్వజన్మలో నీచుడైనవాడు ఈ జన్మలో అతని తల్లి గర్భంలో హఠాత్తుగా అతడి రాత తిరగబడిందని చెప్పుకొని, మనకు మనం సరిపెట్టుకోవచ్చు. దూరంగా ఎక్కడో వున్న ఒక దుర్మార్గుడు మూడు పువ్వులు ఆరుకాయలుగా, వైభవంగా వర్థిల్లుతుంటే అది అతడి గతజన్మలోని మంచితనంచేత మారిపోయిన ఋషి అని చెప్పుకొని మనకు మనం సరిపెట్టుకోవచ్చు. గతజన్మలో సాధువు క్షణమాత్రం “నేను పుణ్యాత్ముణ్ణి” అనే దర్పాన్ని ప్రదర్శించిన అనుభవం వల్ల అలా పాపి అయ్యాడా? దాంతో అంతా స్పష్టమైపోయింది, అంతా చక్కచేయబడింది. ఇప్పుడు మనం చేసే పాపాలకు మరో శరీరంలో బాధ అనుభవించాలి. ఇప్పుడు చేసే సత్కర్మలకి మనం మరు జన్మలో శుభఫలాలు పొందుతాం. ఇలా అంతు లేకుండా

సాగిపోతూనే వుంటుంది. ఆశ్చర్యపడ నక్కరలేదు. వేదాంతులు దీనిని పనికిరాని తతంగంగా కనిపెట్టి ఈ పాపపుణ్యాలను రెండింటి నుండీ బంధవిముక్తులవ్వడమే దీనికి తరుణోపాయమని, అఖరికి మన పరమశ్రేయస్సు అద్భుతంగా పాలించబడు తున్న లోకమే అయినా దీనినుండి ఎలాగైనా పెనుగులాడి బయట పడటమే మంచిది అని ప్రతిపాదించారు. ఇది సుస్పష్టం. ఈ విషయాలకు సంబంధించిన పథకమంతా పాత ఆధ్యాత్మిక-భౌతికమైన లంచం, భయంవల్ల ఏర్పడిన వ్యత్యాసమే. పుణ్యం చేసుకొన్నవారికి భారీ స్వర్గసుఖాలనే లంచం, పాపులకి, దుష్టులకి నిరంతరం భగభగ మండే నరకంలో క్రూరమైన హింస లుంటాయని బెదిరించడం, ఈ లోకనియమం. ప్రాథమికంగా బహుమానాలను ఇవ్వడం లేదా శిక్షలు అమలుపరచడానికే అన్న భావనకి మూలం — పరమేశ్వరుడే న్యాయాధికారి, 'తండ్రి' లేదా ఎల్లప్పుడూ మంచి పిల్లలకి లాలీపాప్‌లు కానుకలుగా అందిస్తూ, అల్లరి కుంకల్ని బెత్తంతో బాదుతూ వుండే అధ్యాపకుడు అన్న భావన. ఇదే ఒక్కొక్కసారి ఆటవికుని అనాగరికమైన, అనాలోచితమైన విధానానికి మూలంగా ఎప్పుడూ సామాజికమైన తప్పిదాలకు నికృష్టమైన శిక్షలు అమలౌతూ వచ్చాయి. ఆ దోషాలవల్లనే సమాజం ఒక సంతృప్తికరమైన పద్ధతిలో ఒక మంచి వ్యవస్థను స్థాపించుకోలేక పోయింది. అది ఇప్పుడు సాధ్యమౌతుంది. మనిషి నిరంతరం దేవుని రూపంగా మరింతగా రూపాంతరం చెందడానికి ప్రయత్నించడానికి బదులుగా దేవుణ్ణే తన రూపంలోకి మార్చడానికి చూస్తున్నాడు. ఈ ఆలోచనలన్నీ మనలో వున్న అర్భకుడూ, జంతువు, ఆటవికుడి నుండీ కలిగే పరావర్తనాలే.ఈ రకమైన స్వభావాన్ని పరివర్తన చెందించుకొని పురోగమించడంలో ఈనాటికీ విఫలమౌతూ వున్నాము.

CWSA 13:265-66

పునర్జన్మకు అసలు ఆధారం

పునర్జన్మ సైద్ధాంతిక వాదానికి నిజమైన ఆధారం అంతరాత్మ పరిణామం. ఇంకా చెప్పాలంటే పదార్థపు పొరలో నుండి వికసనం. తనను తాను దశలవారీగా కనుగొనడం. అయితే ఆ పరిణామానికి లక్ష్యమేమిటి? అది సాంప్రదాయకమైనదో లేదా ఆసక్తికరమైన పుణ్యసాధనో కాదు. పదార్థరూపంగా కానుకలు పంచుకొనే ఆశలతో మంచి అనే చిన్న నాణేలను పొరపాటు లేకుండా లెక్కిస్తూ వుండడం

కాదు. అది పవిత్రతత, ప్రేమ, శక్తి దివ్యజ్ఞానం వైపుగా నిరంతర పురోగమనం. ఈ అంశాలు మాత్రమే పుణ్యం. అదే దానికి బహుమానం. ప్రేమకు చెందిన కార్యాలకు ప్రతిఫలం సర్వాన్ని తనలో బంధించవేయగల ఆత్మయొక్క మహత్వాకాంక్ష, ఆలింగనంలోని పారవశ్యస్థితికి చేరే ప్రేమానంద సామర్థ్యాల్లో నిరంతరం ఎదగడం. సరియైన జ్ఞానానికి సంబంధించిన కార్యాలకు ప్రతిఫలం అనంతమైన ప్రకాశంలోకి ఎడతెగకకుండా పురోగమిస్తూ వుండటమే. సరియైన శక్తికి సంబంధించిన కార్యాలకు బహుమానం దివ్యశక్తికి అధికాధికంగా ఆవాస స్థానమవ్వడమే. నిజమైన పవిత్రతతకు సంబంధించిన కార్యాలకు ప్రతిఫలం అహంకారం నుండీ అధికాధికంగా విడివడిపోతూ ఏ నిర్దోషమైన విశాలత్వంలో అన్ని అంశాలు రూపాంతరం చెంది దివ్యసమానత్వంలో రాజీ కుదుర్చుకొంటాయో ఆ విశాలత్వంలోకి ప్రవేశించడం. అలా కాకుండా వేరే బహుమతిని వెతుక్కోవడమంటే పిల్లతనపు అజ్ఞానానికి, మూర్ఖత్వానికి తనను కట్టి పడేసుకోవడమే. వీటిని కానుకలుగా భావించడం అపరిపక్వత, అపరిపూర్ణతే అవుతుంది.

అసలు దుఃఖం, సుఖం, దురదృష్టం, అదృష్టం అంటే ఏమిటి? ఇవి అంతరాత్మ పొందే శిక్షణలో ఎదురయ్యే అనుభవాలు, సహాయాలు, చిక్కులు, సాధనాలు, ఆధారాలు, అనుశాసనాలు, పరీక్షలు, అవరోధాలు, — సంపద, అదృష్టం అన్నది బాధ కంటే నీచమైన అవరోధం. వాస్తవానికి వ్యతిరేకత, బాధ అన్నవి ఒక పాపాత్ముడికి శిక్ష ఎలాగో దానికంటే మించి వీటిని మంచివాడికి బహుమానాలుగా భావించవచ్చు. ఈ బాధ ఒక గొప్ప సహాయంగా, ఆత్మలో తనకు తానుగా పోరాడి వికాసం చెంద డంలో శుద్ధి కారకం కాగలదు. వీటిని న్యాయాధికారి అందించే కఠోరమైన కానుకగా మాత్రమే చూడడం చిరచిరలాడే పాలకుని కోపంగా చూడడం, చెడుకు కారణమైనది. ప్రతి చెడుపై తిరగబడిన ఫలితంగా చూడడం — అంతరాత్మతో, లోకపరిణామ సూత్రంతో భగవంతుడు సాగించే వ్యవహారాన్ని ప్రపంచ పరిణామ ధర్మాన్ని చూడడం అత్యంత ఉపరితల దృక్పథం అవుతుంది. ఈ ప్రాపంచిక సంపద, ధనం, సంతతి, అధికారం, సౌందర్యం, కళలను బాహ్యంగా ఆనందించడం — ఇనవ్నీ ఏమిటి? వీటిని ఆర్జించడం మంచిదే కానీ వీటిని సాధించాలనుకొంటే అంతరాత్మకు నష్టం వాటిల్లకుండా మన భౌతిక అస్తిత్వంపై పెల్లుబికే దివ్యానందం, అనుగ్రహ స్రవంతిగానే వాటిని అనుభవించాలి. కాని ముందు వాటిని ఇతరుల కోసం, ఇంకా వీలుంటే అందరి కోసం సాధించాలి. మన కోసమైతే విశ్వాత్మిక నియమంలో భాగంగా

లేదా పరిపూర్ణత్వాన్ని చేరువ చేసే భాగంగా లేదా పరిపూర్ణత్వాన్ని చేరువ చేసే సాధనంగానే సంపాదించాలి.

CWSA 13:276-68 శ్రీఅరవిందులు

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్ (9441519210)

పునర్జన్మ, పురోగతి

ఒక మనిషి తన అనుభవాన్ని, పుస్తకాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తర్జుమా చేయగల అనుభవాన్ని అతని చైత్యపురుషుడు పొందాడని అంగీకరిద్దాం. గత జీవితంలోని అతని సాంగత్యాలు, పరిస్థితుల వల్ల అతనికొక ప్రత్యేక క్షేత్రంలోని అనుభవం కలిగింది. కాని అతడు కోల్పోయిన మరొక క్షేత్రానుభవం మరొకటుంది. ఉదాహరణకు అతను "నేను బుద్ధికుకుశలత కలిగిన ప్రతిచర్యలతో, తెలివితేటలతో జీవించాను, ఇప్పుడు నేను నా అనుభూతులతో జీవించాలి" అనుకుంటాడు. సాధారణంగా ఈ అతి చురుకుదనం (ఎక్కువ చైతన్యం) సామాన్య జీవితంలోని అనుభూతుల సామర్థ్యాన్ని (శక్తిని) క్షీణింప చేస్తుంది. అందుచేత ఇంకొక క్షేత్రంలో, రంగంలో అనుభవాలను పొందడానికి, అభివృద్ధికి అతను తన బౌద్ధిత ఔన్నత్యాన్ని కుదించుకుంటాడు, అతను ఇప్పుడు అత్యంత ప్రతిభాశాలి కాదు, ప్రతిభావంతమైన (కర్త) రచయిత. అతను ఒక సాధారణ మనిషిగా మారతాడు, కాని ఉత్కృష్టమైన హృదయం కల, చాలా దయ, ఔదార్యం కలిగిన వ్యక్తి. నేను అతనిని మూర్ఖుడని అన్నాననుకోండి కాని, అది ఎప్పుడూ పోల్చిచెప్పడమే: ఇది అసాధారణమేమీ కాదు, ఉదాహరణకు ఒక చైత్యపురుషుడు, తాను యెదుగ గలిగినంత ఉన్నత ఎత్తుకు ఎదిగి ఆత్యున్నత దశకి చేరుకుని ఉండచ్చు, అధికారంతో పాలనచేస్తూ, నియంత్రిస్తూ ఆనందించి ఉండవచ్చు. (ఒక రాజు లేదా చక్రవర్తి జీవితంలో అనుభవించేవన్నీ పొంది ఉండవచ్చు.) ఇప్పుడు ఒక నిగూఢ జీవనం సాగించాలని కోరుకోవచ్చు, ప్రభుత్వపరమైన ఆండంబరాలు వేటితోను నిర్బంధింపబడకుండా, అతి సాధారణమైన వాతావరణంలో జన్మించాలని నిర్ణయించుకోవచ్చు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో, సగటు పరిస్థితులలో అజ్ఞాతంగా ఉంటూ దేశాధిపతికి వచ్చే అవసరమైన ప్రభుత్వపర ప్రదర్శనలతో బంధింపబడకుండా పని కొనసాగించ గలగాలని కోరుకోవచ్చు. ఈ విషయాన్ని ఒక వైపు నుంచి చూస్తే నువ్వు అంటావు ఇది ఏమిటి? ఎందుకు ఇంత

పతనం (దిగజారుడుతనం) అని? అది దిగజారడం కాదు, సమస్యను వేరే కోణం నుంచి వేరే ధృక్పథం నుంచి ఎదుర్కోవడం. చేతనకు (నా ఉద్దేశ్యంలో నిజమైన చేతన దివ్యచేతన) జయాపజయాలు రెండూ సమానమే, కీర్త్యపకీర్తులు కూడా సమానమే. చేతన పెరగటం మాత్రమే ముఖ్యం?

సాధారణంగా మానవుల ఎదుగుదలకు దోహదపడేలా కనిపించే కొన్ని పరిస్థితులు చేతన పెరుగుదలకు ప్రతికూలం కావచ్చు.

CWM 5:267

ప్రకృతి, ప్రగతి విధానం

పునర్జన్మలో బాహ్యానికి కనబడే — తల్లిదండ్రులు, పర్యావరణం, పరిస్థితులు తయారుచేసిన జీవి కాదు తిరిగి జన్మించింది: చైత్యపురుషుడు మాత్రమే ఒక శరీరం నుంచి ఇంకొక శరీరానికి మారుతుంది. తార్కికంగా చెప్పాలంటే మానసిక, ప్రాణిక అస్తిత్వానికి పూర్వజన్మ స్మృతులు, లక్షణాలు గుర్తు ఉండవు, ఏ పాత్ర ఏ విధమైన జీవనం గడిపిందో, ఎవరు ఏమిటో కూడా గుర్తించలేదు. చైత్యపురుషుడు మాత్రమే మరువకుండా ఉండగలడు; చైత్య పురుషుని ఎరుక ద్వారానే మనం పూర్వజన్మ స్మృతులను గుర్తించగలం.

అదే కాకుండా మన దృష్టిని మనం ఎలా ఉన్నాము అన్నదాని మీదకన్నా ఏమవ్వాలనుకుంటున్నామో అన్నదాని మీద గురిపెట్టడం ముఖ్యం.

CWM 15;124

ప్రశ్న: మన మనస్సు, ప్రాణం లేదా భౌతికం పునర్జన్మించదు. ఒక్క చైత్య పురుషుడు మాత్రమే ఉన్నప్పుడు సాధించిన ప్రాణికపర, మానసికపర, ప్రగతికి ఇంకొక జీవితంలో విలువ ఉండదా?

అది ఎప్పుడు సాధ్యపడుతుందంటే ఈ భాగాలన్నీ అంతరాత్మికానికి దగ్గరకు చేరుకున్నప్పుడు, ఆ భాగాలన్నిటిని అంతరాత్మిక ప్రభావం దగ్గరకి తీసుకవచ్చినపుడు సాధ్యపడుతుంది. అంతరాత్మిక ప్రభావం కింద ఉండి, అంతరాత్మికంతో మమేకమైనపుడు మాత్రమే అది కొనసాగుతుంది, అది ఒక్కటే కొనసాగుతుంది. కాని మనిషి తన చేతననకు ఆధ్యాత్మికతను కేంద్రబిందువుగా చేసుకుంటే మొత్తం అస్తిత్వం అంతా దాని చుట్టూ సంఘటితం చేయబడితే మనిషి మొత్తం ఉనికి ఆధ్యాత్మికతతో

ప్రభావితమై, దానితో ఐక్యమై అది కొనసాగుతుంది — అదికొనసాగడం అవసరం అయితే. వాస్తవానికి భౌతిక శరీరానికి కూడా ఆ చలనాన్ని ఇవ్వగలిగితే చైత్యపురుషుని కుండేటటువంటి గతి, పైగి ఎదగటానికి కావల్సిన సామర్థ్యం వుంటే — న్యాయంగా అది శిథిలమైపోవాల్సిన అవసరం లేదు. కాని వాస్తవానికి అదే క్లిష్టమైనది.

CWM 5:358-60

ప్రగతి సాధించడానికి ప్రకృతి ఉపయోగించిన ప్రక్రియ

నువ్వు ఏమంటావు — మరణం, మరుజన్మ — మరణం మరుజన్మ — ఇది వ్యక్తి గత పరిణామ ప్రక్రియ, అయితే పుట్టుక మరణం ద్వారా కూడా జీవిలో ఏదో ఒకటి నిలిచిపోయి వుంటేనే అలా జరుగుతుంది. ఒక వేళ ఆ వ్యక్తి సంపూర్ణంగా మరణించి, శిథిలమైపోతే, పునర్జన్మించడానికి అతనిలో ఏమి మిగిలి ఉంటుంది? ఖచ్చితంగా ఏదో ఒకటి నిలిచి ఉండాలి — జననమరణాలలో కూడా నిలచి ఉండాలి లేకపోతే ఆ వ్యక్తి ఒక్కడే కాదు. ఒక వేళ ఏదీ నిలిచి ఉండకపోతే ప్రగతి సాధించేది మనిషి కాదు ప్రకృతి. ప్రకృతి పదార్థాలని ఉపయోగించుకుంటుంది; ఈ పదార్థాలతో ప్రకృతి రూపాలను (ఆకృతులను) తయారుచేస్తుంది. నేను ఇది నీకు అతిసరళ విధానంలో చెప్తున్నాను, కానీ శిథిలమైపోతుంది, అది ఒక వ్యక్తిగత అంశంగా నిలి చి ఉండదు. ఎందుకు అలా నిలచి ఉండదు? ఎందుకంటే ప్రకృతికి పదార్థంతో ఆవశ్యకత ఉంది, ఇతర ఆకారాలను తయారుచేయడానికి మూలపదార్థాల ఆవశ్యకత అదే. అంటే ఆమె తను చేసినదానినే చెరిపేసి దానితో ఇంకొక రూపాన్ని తయారు చేస్తుంది. ఆ చర్య ఆవిడ నిరంతరం కొనసాగిస్తుంది. దాని మూలంగా వ్యక్తిగత అభివృద్ధి కాకుండా మొత్తం అంతా ప్రగతి సాధిస్తుంది.

ఒక వేళ నీ దగ్గర చిన్నపిల్లలు రకరకాలు ఆకారాలు తయారుచేసుకొనే మెత్తటి ముద్దలాంటి పదార్థం ఉంటే — దాని గురించి తెలుసు కదా? మంచిది — దానితో నువ్వు ఒక ఆకారాన్ని తయారుచేస్తావు. నీకు అది నచ్చదు. దాన్ని మళ్ళీ ముద్దగా మార్చేస్తావు. దానికి వేరే రూపాన్ని ఇస్తావు. నువ్వు కొంత ప్రగతి సాధించావు, నువ్వు ప్రయత్నం చేస్తావు అన్నిటిని అమర్చుకుంటావు; అప్పుడు అంటావు "ఇది బాగా లేదు, నేను ఇలా ప్రయత్నిస్తాను", నువ్వు చేసిన ఆకారం కొంచెం మెరుగ్గా ఉండవచ్చు కాని, నువ్వు కోరుకున్నట్టుగా అవ్వలేదు. అందుకని నువ్వు మళ్ళీ

దానిని విధ్వంసం చేసి ఆ ముద్దకి కొంత నీరు చేర్చి మళ్ళీ మొదలుపెట్టి ఇంకో ఆకారం చేస్తావు. ఆ ప్రయత్నం నిరంతరం కొనసాగించవచ్చు. ప్రతీ ప్రయత్నంలోనూ పదార్థం ఒకటే కానీ ప్రాణి ఒకటి కాదు, నువ్వు తయారుచేసిన ప్రతి ఆకారానికి తనదైన ప్రత్యేకమైన ఉనికి ఉంటుంది. నువ్వు దానిని భంగం చేయగానే ఇంక ఏమీ మిగలదు. ఆ ఆకారాన్ని తయారుచెయ్యడంలో నువ్వు పరిపక్వతను సాధించి ఉండవచ్చు లేదా వేరే రూపాలను తయారుచేయవచ్చు, ప్రయత్నం కొనసాగించ వచ్చు, ఉదాహరణకి నువ్వు ఒక కుక్కని లేదా గుర్రాన్ని తయారుచేయ్యాలి. అది నువ్వు సాధించ లేకపోవచ్చు. ఆ పనిని తిరిగి ప్రారంభించి ఒక కుక్క లేదా గుర్రాన్ని తయారుచేయవచ్చు, కానీ ఇంకొకటి కూడా నువ్వు ప్రారంభించవచ్చు. నువ్వు ఒక ఇంటిని లేదా గృహాన్ని నిర్మించావు. అది నీకు నచ్చలేదు, దాన్ని కూలగొట్టి ఇంకొక నమూనాతో వేరే ఇల్లు నిర్మించవచ్చు. మొదటి గృహానికి సంబంధించినవి ఏవీ మిగలలేదు, కేవలం జ్ఞాపకం తప్ప. అది కూడా నువవు దాచుకోవాలంటే. అదే విధంగా ప్రకృతి పూర్తిగా తెలియని, నిరాకార పదార్థంతో మొదలుపెట్టి ఒకటి తర్వాత ఇంకొకటిగా ఆకారాలను తయారుచేస్తుంది; ఒక్కటే వ్యత్యాసం, మనం చేసినట్టుగా ఒక్కొక్క రూపం కాకుండా ఒకేసారి ప్రకృతి లక్షల, లక్షల రూపాలను తయారుచేస్తుంది.

CWM 9:227-29 *డా. టి. ఎన్. రాజకుమారి (98494 12227)*

పూర్వజన్మల అనుభవాల ప్రయోజనం

శ్రీమాతా, ప్రతి ఒక్క కొత్త జన్మలో మనస్సు, ప్రాణికంతో పాటు శరీరం కూడా కొత్తగా రూపొందుతుంది గనుక పూర్వజన్మ అనుభవాలు వాటికి ఎలా ఉపయోగపడతాయి? మేమా అనుభవాలనన్నీ మరో మారు పొందవలసి వుంటుందా?

అది మనుషులపై ఆధారపడి ఉంటుంది

జన్మజన్మకు వృద్ధినొంది కొనసాగేది మనస్సు, ప్రాణికం కాదు— ప్రత్యేకమైన అత్యుచ్చ స్థాయికి ఎదిగిన సందర్భాలలో తప్ప — కొనసాగేదేమిటంటే, చైత్యపురుష సత్తాకు కార్యశీల, విశ్రాంతిదశలు ఒకటి తరువాత ఒకటి పర్యాయక్రమంగా సంప్రాప్తిస్తాయి. భౌతిక జీవితంలో దైహికంగా గడిపే క్రియాశీల జీవిత అనుభవాల ఫలితంగా,

శారీరక, ప్రాణిక, మానసిక అనుభవాలన్నింటి ఫలితంగా, పురోభివృద్ధి చెందిన జీవితం సంప్రాప్తిస్తుంది. అప్పుడు సాధారణంగా, చైత్యపురుష సత్త ఒక విధమైన విశ్రామదశకు చేరుకుంటుంది. అట్టి దశలో క్రియాశీలమైన ఉనికిలో సాధించబడిన అభివృద్ధి ఫలితం బేరీజు వేయబడుతుంది. ఆ ఫలితాన్ని తనలో లీనం చేసుకొని అది ఒక కొత్త శరీరంతో అవతరిస్తుంది. దానితో పాటు అది సముపార్జించిన యావత్ అభివృద్ధి ఫలితాన్ని కూడా కొని తెస్తుంది. బాగా వృద్ధి చెందిన దశలో ఏదో ఒక అంశకు సంబంధించిన అనుభవాన్ని పరిపూర్ణం చేసుకోవడానికి అవసరమైన శరీరాన్ని, వాతావరణాన్ని సైతం ఎన్నుకుంటుంది. అత్యున్నత అభివృద్ధి చెందిన కొన్ని సందర్భాలలో ప్రాణోత్క్రమణకు పూర్వమే చైత్యపురుషసత్త తదుపరి జన్మలో దానికే విధమైన జీవితం లక్షించాలో నిర్ణయించుకోగలదు.

అది ఎప్పుడైతే పరిపూర్ణతను సంతరించుకొని అత్యంత చేతనావృతమైన అస్తిత్వం కలదిగా రూపొందుతుందో అప్పుడు అది నూతన శరీరం ఏర్పాటుకావటంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. సాధారణంగా ఒక అంతర్భూతప్రభావం ద్వారా కొత్త అనుభవానికి అనువైన విధంగా శరీరం రూపొందటానికి కావలసిన మూలద్రవ్యాలను ఎన్నుకుంటుంది. అయితే ఇది బాగా అభివృద్ధి చెందిన దశలో జరిగే పని. అటు తరువాత అది సంపూర్ణంగా రూపొంది సేవ చేయాలనే సంకల్పంతో, దైవకార్య నిర్వహణలో సమిష్టిగా సహాయపడి భాగస్వామి కావాలనే ఉద్దేశ్యంతో భువిపై తిరిగి అవతరించినప్పుడు రూపుదిద్దుకుంటున్న శరీరానికి కొన్ని మానసికమైన, ప్రాణికమైన అంశాలను గత జీవితాలనుండి అందజేయగలదు. ఈ అంశలు గత జన్మలలో చైత్యపురుషసత్తా శక్తులతో వ్యవస్థీకరించబడి ఫలప్రదంగావించబడి నందువలన కాపాడబడి వుంటాయి. పర్యవసానంగా సమగ్రాభివృద్ధి లో భాగస్వామ్యములు కాగలవు. అయితే ఇది చాలాచాలా అభివృద్ధి సాధించిన స్థితిలో జరిగే విషయం.

చైత్యపురుష సత్తా ఎప్పుడైతే పూర్తిగా వృద్ధి చెంది, అత్యంత చేతనా పూరితమై, దైవసంకల్పం నెరవేర్చడానికి సమర్థమైన పరికరంగా తయారవుతుందో అప్పుడు అది ప్రాణికాన్ని, మనస్సును కూడా సమగ్రమైన సామరస్యపూర్వక అభివృద్ధిలో పాలు పంచుకొనే విధంగా వ్యవస్థీకరించి వాటిని కాపాడుతుంది.

అత్యున్నత స్థాయికి చేరిన అభివృద్ధి, శరీరం అంతరించినప్పటికీ, మానసిక, ప్రాణిక అస్తిత్వాలలోని కొన్ని భాగాలనైనా పదిల పరుస్తుంది. ఉదాహరణకు ఒకవేళ

మానవ కార్యక్రమాలలోని కొన్ని భాగాలు మానసిక లేక ప్రాణికం అయినవి. ప్రత్యేకంగా వృద్ధి చెందినట్లయితే ఈ మానసికమయిన యీ ప్రాణిక మూలపదార్థాలు వాటి పూర్వాకృతికి సైతం భంగం వాటిల్లకుండా కాపాడుబడతాయి. పూర్తిగా వ్యవస్థీకరించ బడిన కార్యక్రమానికి అనువైనట్లుగా — ఉదాహరణకు, మహోన్నతమైన మేధాసంపత్తిగల వ్యక్తులు ఎవరైతే వారి ఆలోచనా పటిమను ప్రత్యేకంగా బలపరచుకున్నారో వారి అస్తిత్వం యొక్క మానసిక భాగం ఆ పటిమను కాపాడి వ్యవస్థీకరించబడిన మెదడు రూపంలో భద్రపరుస్తుంది. ఆ విధంగా వ్యవస్థీకరించబడిన మెదడు దాని జీవశక్తిని అది కలిగి వుంటుంది. భవిష్యజన్మ సంభవించే వరకు మార్పు చెందకుండా, అది సమకూర్చుకొనివున్న ప్రయోజనాలతో సహా అందులో పాలు పంచుకొనడానికి నిలిచి వుంటుంది.

కళాకారుల్లో ఉదాహరణకు కొందరు సంగీతజ్ఞులు ఎవరైతే వున్నారో వారి చేతులను ఒక ప్రత్యేకమైన చేతనాపూర్వక రీతిలో వాడివున్నారో వారి విషయంలో ప్రాణిక, మానసిక పదార్థం చేతులరూపంలో భద్రపరచబడుతుంది. ఆ చేతులు పూర్తిగా చైతన్యవంతమై వుంటాయి. ఒకవేళ ప్రత్యేకమైన ఆకర్షణ ఏదైనా ఉన్నట్లయితే అవి బ్రతికున్నవారి శరీరాన్ని సైతం ఉపయోగించుకోగలవు.

లేనట్లయితే, సామాన్యజనుల్లో ఎవరిలోనైతే చైత్యపురుష సత్త పూర్తిగా వృద్ధి చెందబడలేదో, వ్యవస్థీకరించబడలేదో మానసికశక్తి శరీరం నుంచి విడిపోయినప్పుడు మానసిక, ప్రాణిక, రూపాలు కొంత సమయం వరకు కొనసాగవచ్చు. ముఖ్యంగా మరణం ప్రశాంతంగా తీవ్రతరంగా కూడా సంభవించినట్లయితే, కానీ ఒక వ్యక్తికి హఠాన్మరణం తీవ్రోద్వేగ స్థితిలో, అనేక ప్రేమానురాగబంధాలలో చిక్కుపడి ఉన్న ప్పుడు సంభవిస్తే అస్థిత్వం పటాపంచలై వేర్వేరు భాగాలుగా విడిపోయి కొంతకాలం వాటి పరిథిలో అది సజీవమైఉండి తరువాత అంతరిస్తాయి.

CWM 9:268- 69

పరిణామక్రమ ఆవశ్యకత — మరుజన్మ

ఒకరు మరుజన్మలో సైతం, ఇచ్చట ఈ ఆశ్రమంలోనే ఉంటారనేది నిశ్చయమా? లేక వారు ఇతర అనుభవాలకోసం వేరెక్కడికో పోతారా?

అది పూర్తిగా వారెట్టి స్థితిలో చనిపోయారో వారి అంతిమ కోరిక ఏమిటో అన్న

దానిపైన వారి మనోనిశ్చయంపై ఆధారపడి వుంటుంది. అది, యాంత్రికంగానో లేక బలవంతంగానో విధించే విషయం కాదు. ప్రతిఒక్కరికీ వేరుగా నుంటుంది. నేను మీకిదివరలో అనేక మార్లు చెప్పాను. మరణానంతరం భవితవ్యానికి సాధారణంగా చిట్టచివరి చేతనా స్థితి ముఖ్యమని అనగా మరణించే క్షణాన వారికి తిరిగి వచ్చి తమ కార్యక్రమాన్ని కొనసాగించాలనే తీవ్ర ఆకాంక్ష గనక ఉన్నట్లయితే అది నెర వేరడానికి తగిన పరిస్థితులుఏర్పాటు గావించబడతాయి. కానీ, చూడండి, మర ణానంతరం ఏమి జరగాలనే దానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి.

చైత్యపురుషసత్తాలో తిరిగి వచ్చే మనుషులున్నారు. నేను మీకు చెప్పాను, బాహ్య అస్తిత్వం కాపాడబడేది అతి అరుదుగా జరుపబడుతుందని కాబట్టి మనం నిజంగా నిరంతరం కొనసాగుతుండే మానసిక చైతన్యం గురించే మాట్లాడుతాము. ఇక కొందరుంటారు వారి మానసిక శక్తి తిరిగి మానసిక క్షేత్రానికే చేరుతుంది. వారికిదివరలో కలిగిన అనుభవాన్ని అంతర్లీనం చేసుకోవడానికి వారి భావి జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడానికి . అందుకు శతాబ్దాలు పట్టవచ్చు. అయితే అది మనుషులపై ఆధారపడి వుంటుంది.

చైత్యపురుషసత్త ఎంత ఎక్కువగా వికసనమొందుతుందో అది దాని పరిపూర్ణతకు అంతదగ్గర అవుతుంది. జన్మలమధ్య సమయం కూడా అంత ఎక్కువ అవుతుంది. వేయి లేక రెండువేల సంవత్సరాలు పట్టవచ్చు.. జన్మలమధ్య సమయం కూడా అంత ఎక్కువ అవుతుంది. వేయి లేక రెండువేల సంవత్సరాల తదుపరి మాత్రమే పునర్జన్మనెత్తే జీవులుంటారు. వికసన ప్రారంభానికి ఒకడు ఎంత చేరువగా నుంటే పునర్జన్మ అంత దగ్గరలో జరుగుతుంది. కొన్ని సార్లు పూర్తి నిమ్నస్థాయిలో మనిషి జంతువుకు దగ్గరలో నున్నప్పుడు అది ఈ మాదిరిగా సాగుతుంది. (సంజ్ఞ) అనగా మరణానంతరం మనుషులకు వారి సంతానంయొక్క సంతానంగా పునర్జన్మించటం అసాధారణమేమీకాదు. ఆ విధంగా జరుగవచ్చు లేక తరువాతి తరంలో చోటు చేసుకోవచ్చు. అయితే ఇది పరిణామారంభ దశలో జరుగుతుంది. చైత్యపురుషసత్త చైతన్యవంతంకాని దశలో అనగా అది ఇంకా రూపుదిద్దుకొంటున్న దశలో జరుగ ుతుంటుంది. చైత్యపురుషసత్త చైతన్యవంతంకాని దశలో అనగా అది ఇంకా రూపు దిద్దుకునే దశలోనే ఉన్నప్పుడు అట్టి ప్రాథమిక దశనుండి వృద్ధి పొందినకొద్దీ, నేను చెప్పినట్లుగా పునర్జన్మలమధ్య దూరం పెరుగుతుంది. చైత్యపురుషసత్తా పూర్తిగా

వృద్ధిచెందినప్పుడు వృద్ధి చెందడంకోసం భువికి తిరిగి ఏతెంచనవసరం లేనప్పుడు అది పూర్తిగా స్వేచ్ఛను పొందినప్పుడు దాని పని వేరెక్కడో నున్నందున అది భూతలానికి తిరిగి రాకపోవచ్చు లేదా పునర్జన్మ నెత్తకుండా పూర్తిగా మానసిక చేతనలోనే ఉండిపోవడానికి మొగ్గు చూపవచ్చు, లేకపోతే అది కోరుకొన్నప్పుడు రావచ్చు. దాని కిష్టమైన రీతిగా రావచ్చు. ఎక్కడికి రావాలనుకుంటే అక్కడికి రావచ్చు. ఇదంతా పూర్తి ఎరుకతో జరిగే పని. ఇక ఒక విశ్వగత శ్రేణికి చెందిన శక్తులతోను, అధిమానస అస్తిత్వాలతోను జతగూడి కార్యనిర్వహణార్థం భూవాతావరణం లోనే ఉంటూ ఒకదాని తరువాత ఒక దేహాన్ని ధరించే వారుంటారు. దాని అర్థమేమి టనగా చైత్యపురుషసత్త పూర్తిగా రూపుదిద్దుకొని బేషరతుగా స్వేచ్ఛను పొందుతుంది. దానికిష్టమైన పనిని అది చేయగలదు. అది ఏది ఎన్నుకుంటుందో దానిని అందువలన అది ఏ విధంగా వర్తిస్తుందో ఎవరూ చెప్పలేరు. అది కోరుకున్నపనిని ఖచ్చితంగా చేస్తుంది. దానిని ప్రకటిస్తుంది కూడా (ఇది జరిగింది) శరీరం నిర్జీవమైన క్షణాన దాని తదుపరిజన్మ అది ఏమైఉంటుందో అది ఏమి చేస్తుందో అప్పుడు ఎన్నుకొని ఉంటుంది. అయితే ఈ స్థితి తరచుగా ఏర్పడదు. మానసిక చేతన ఏ మేరకు వృద్ధి చెంది ఉన్నదనే దానిపైన, జీవియొక్క సమగ్ర చేతన ఏర్పరచుకున్న ఆశపైన ఆధారపడి వుంటుంది. ఇంకా మానసిక, ప్రాణిక, భౌతికచేతన చైత్యపురుష చేతనతో ముడివడి వుంది. కాబట్టి ఆ క్షణంలో మరణించే క్షణంలో దేహత్యాగం జరిగే క్షణంలో శరీరం ఒక ఆశను లేక ఒక ఆకాంక్షను లేక ఒక సంకల్పాన్ని రూపొందించుకుంటుంది. సాధారణంగా భావి జీవితాన్ని ఇది నిర్ణయిస్తుంది.

CWM 7: 85-87

అనువాదం: అందుగులపాటి కైలాసపతి (9989251895)

పునర్జన్మ — ఆత్మ పరిణామం

పునర్జన్మ గురించి నిన్ను నీవు సామాన్యంగా ప్రజలందరిలోనూ వ్యాప్తిలో ఉన్న తెలివితక్కువ ఊహ నుంచి తప్పకుండా తప్పించుకోవాలి. బహుళ ఊహనుంచి తప్పకుండా తప్పించుకోవాలి. బహుళవ్యాప్తిలో ఉన్నదేమిటంటే, రోము జాతీయుడైన టైటస్ బాల్బస్ ఆంగ్ల జాతీయుడగు జాన్స్మిత్ అనే మనిషిగా తిరిగి అదే వ్యక్తిత్వంతో, స్వభావంతో, సాధించిన వాటితో జన్మించాడని. అతడు పూర్వజన్మలో ఎలా ఉన్నాడో

అదే మాదిరిగా కేవలం ఒకే ఒక్క తేడాతో, అధికార చిహ్నమైనటువంటి వదులైన ఉత్తరీయానికి బదులుగా కోటు, పాంటు వేసుకుని, జన వ్యాప్తమైన లాటిన్కు బదులుగా లండన్వాసుల వ్యావహారిక ఆంగ్లయాసతో మాట్లాడేవాడనే విషయం. అది అలా జరగదు. ఒకే విధమైన వ్యక్తిత్వాన్ని లేదా స్వభావాన్ని లక్షలసార్లు ఆద్యకాలంనుంచి కాలం అంత్యం వరకు పునరావృత్తం చేస్తే ఐహికంగా ఏం ప్రయోజనం ఉంటుంది? ఆత్మ తన అనుభవానికి, వృద్ధికి, పరిణామానికి, ఇంకా అది దైవాన్ని పదార్థంలో తేగలిగే పర్యంతం జన్మ పరంపరలోకి వస్తుంది. కేంద్ర అస్తిత్వమే జన్మిస్తుంది కాని బాహ్యవ్యక్తిత్వం కాదు. వ్యక్తిత్వం అనేది కేవలం, అది తన భావనల అనుభవానికి సృష్టించుకున్న ఒక నమూనా. మరొక జన్మలో అది తనకుతాను ఒక భిన్నమైన వ్యక్తిత్వాన్ని, భిన్న సామర్థ్యాలను, భిన్నమైన జీవితాన్ని, వృత్తిని ఎంచుకుంటుంది. వర్జిల్ గనక తిరిగి జన్మిస్తే, అతడు బహుశా పద్య కవితను ఒకటి లేక రెండు ఇతర జన్మలలో చేయవచ్చు, కాని అతడు కచ్చితంగా ఒక ఇతిహాసిక కావ్యాన్ని మటుకు వ్రాయడు. కాని బహుశా అతడు వ్రాయదలచుకున్నటువంటివి అతి చిన్నవే అయినా అందమైన గేయాలను తాను రోమ్ లో చేయలేని వాటిని చేస్తాడు. మరొక జన్మలో ఆయనకు ఏమాత్రమూ కవి అయ్యే అవకాశమేలేదు. ఒక తాత్వికుడు ఒక యోగిగా అత్యున్నత సత్యాన్ని చేరాలని, దానిని వ్యక్తీకరించాలని చూసే అన్వేషకుడు — కారణం, అది కూడా ఆ జీవితంలోఅతని చైతన్యంయొక్క సాక్షాత్కారించుకోని ధోరణే. బహుశా అంతకుముందు యేనియస్ లేదా అగస్టస్ లాగా పనులు చేస్తూ యోధుడుగా గాని లేదా రాజుగా గాని అయ్యుంటాడు, వాటిని గానం చేయడానికి పూర్వం ఆ విధంగా ఎన్నో — ఇటైనా గాని లేక అటైనాగాని కేంద్ర అస్తిత్వం ఒక కొత్త స్వభావాన్ని ఒక కొత్త వ్యక్తిత్వాన్ని, వృద్ధిని అభివృద్ధి చేస్తుంది, అన్ని రకాలైన ప్రాపంచిక అనుభవాలగుండా మారిపోతూ సాగిపోతుంది.

ఆ విధంగా పరిణమించే అస్తిత్వం ఇంకా ఎక్కువగా అభివృద్ధి చెందుతూ ఉండగా, ఎక్కువ సమృద్ధితోనూ సంక్లిష్టంగానూ తయారవుతూఉండగా, అది తన వ్యక్తిత్వాన్ని వాస్తవికమనేరీతిలో ప్రోగుచేసుకుంటుంది. ఒక్కొక్కప్పుడు అవి క్రియాశీలమైన మూలకాలకు వెనుకగా ఉంటాయి. ఏదో ఒక వన్నెను, ఏదో ఒక విశిష్ట లక్షణాన్ని అక్కడక్కడ ఏదో ఒక సామర్థ్యాన్ని ప్రకటిస్తుంటాయి — లేదంటే అవి ముందుండటం జరుగుతుంటుంది. అప్పుడక్కడ బహుముఖ వ్యక్తిత్వం, వైవిధ్య భరిత

స్వభావం లేదా అనేక -వైవిధ్యాలు ఒక్కొక్కప్పుడు ఒక సార్వజనీన సామర్థ్యం లాగానూ కనిపిస్తూ ఉంటుంది. కాని ఒకవేళ ఒక మునుపటి వ్యక్తిత్వం, ఒక మునుపటి సామర్థ్యం పూర్తిగా ముందుకు తీసుకురాబడినప్పుడు అది ఇంతకు మునుపు చేసిన దానిని తిరిగి చేయటానికి మాత్రం కాదు. కాని అదే సామర్థ్యాన్ని కొత్తరూపాలలో, కొత్త ఆకృతులలో పోతపోయటానికీ, అస్తిత్వం యొక్క కొత్త సామరస్యతలోకి మిశ్రితం చేయటానికే గాని ఇంతఃపూర్వం ఉన్నదానినే తిరిగి చేయటానికి కాదు. కనుక నీవు యోధుడుగా, కవిగా పూర్వం ఉన్న పద్ధతిలోనే ఉండాలని అవశ్యం ఆశించరాదు — ఏదో ఒకవిధమైన బాహ్యలక్షణాలు కనిపించవచ్చునేమోగాని అవి బాగా మార్పుచెందినవై, కొత్తమూసలో కొత్తమేళవింపుగా అవుతాయి. అది ఇతఃపూర్వం చేయని దానిని చేయటానికి శక్తులను కొత్తదిశలోకి మార్గ నిర్దేశనంచేయడం అవుతుంది. మరొక విషయం. పునర్జన్మలో వ్యక్తిత్వము స్వభావములే ప్రథమ ప్రాముఖ్యమైన విషయాలు కావు — ప్రకృతి పరిణామం వెనుకగా ఉంటూ దానిలో పరిణమించే అంతరాత్మిక అస్తిత్వం ప్రధానం.

దివ్య మౌలికతత్వం తనతో సారభూత అనుభవాన్ని కొనిపోతుంది.

అంతరాత్మికమైనది శరీరాన్ని వదిలిపెట్టిపోయేటప్పుడు, మానసిక, ప్రాణికాలను తాను తన విశ్రాంత ప్రదేశానికి పోయే దారిలో విడిచిపెట్టేసి, అనుభవాల సారాన్ని తన వెంట తీసుకువెళ్తుంది. — భౌతిక సంఘటనలనుకాదు, ప్రాణికగమనాలను కాదు, మానసిక నిర్మాణాలను కాదు, సామర్థ్యాలను లేక లక్షణాలను కాదు, కాని ఏదో వాటినుంచి ప్రోగుచేసుకొన్న అత్యావశ్యకమైనదానిని, దేనికోసమైతే తక్కినదంతా ఉనికిలో ఉన్నదో, దివ్యమూలకం అని దేనిని పిలువవచ్చో దానిని తీసుకుపోతుంది. అది శాశ్వతమైన కూర్పు, అది దైవం వైపు వృద్ధికి సహాయం చేస్తుంది. ఆ కారణంగానే సామాన్యతః గత జీవితాల బాహ్యసంఘటనలు, సందర్భాలు జ్ఞాపకం ఉండవు — ఆ జ్ఞాపకానికి అక్కడ తప్పకుండా మానసిక, ప్రాణికాలతోపాటు సూక్ష్మ భౌతికానిది కూడా ముక్కలు కాకుండా కొనసాగింపుకు ధృఢమైన అభివృద్ధి జరిగి ఉండాలి; అదంతా అక్కడ బీజరూపంలో స్మృతిలో ఉండి సాధారణంగా బహిర్గతం కాదు. ధీరోదాత్తుడైన యోధుడిలో ఏ దివ్య మూలకం ఉంటుందో విధేయతగా, ఔదార్యంగా, గొప్ప సాహసంగా యేది అభివ్యక్తమౌతుందో, కవియొక్క సామరస్యపూరకమైన

మనస్తత్వం ధారాళమైన ప్రాణికం వెనుక ఏ దివ్యమూలం ఉంటుందో, అది వారిలో తనకు తానుగా అభివ్యక్తమౌతుంది. అది కొనసాగుతుంది.


అది నూతన స్వభావపు పొందికలో ఒక నూతన వ్యక్తీకరణను సంతరించుకోవచ్చు లేదా, ఒకవేళ జీవితం దైవంవైపుకు మరలితేగనక, సాక్షాత్కారానికి లేక దైవకార్యానికి చేసే పనిలో ఆధిపత్యశక్తులుగా చేకొనబడవచ్చు.

CWSA 28: 544

దైవత్వం యొక్క ఈ మానవ అంశయందు
మహదాత్మ మహత్వమును నిలబెట్టునామె మహాకాలమందు
ప్రకాశమునుంచి ప్రకాశమునకు, ఆధిపత్యశక్తినుంచి ఆధిపత్యశక్తికి
ఉద్ధరించుటకై,
ఒక రాజువలె, స్వర్గశిఖరమున నిలుచుండుదనుక

Savitri p. 527 శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ (8639106913)



మహా అనంతపు ఆకృతుల ఈ శిల్పి,
గుర్తించబడని నివాసి ఈ తెరమాటున,
తన సొంత రహస్యాల ఉపదేశకుడు,
తన విశ్వతలంపు అత్యల్ప మూగబీజమందు దాగియుండు.

శ్రీఅరవిందులు (*Savitri* p. 230)

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

పునర్జన్మ ప్రక్రియ

పునర్జన్మకు ఉండే నియమాలు

పునర్జన్మ విషయంలో ఇదమిత్థమైన విధానాలంటూ ఏమీ పనిచేయవు. ఇంకొన్ని సందర్భాలలో చనిపోయినవారు మరల వెంటనే జన్మించవచ్చు. తల్లిదండ్రుల మనోభావాలు వారి పిల్లల మనస్తత్వాలను ప్రభావితంచేసిన సందర్భాలలోనూ వారి బిడ్డలతో వారికి అవినాభావ సంబంధం ఉన్న సందర్భాలలోనూ, త్వరలోనే పునర్జన్మ జరుగుతుంది. కొన్ని సందర్భాలలో మళ్లీ జన్మించటానికి వందల లేక వేల సంవత్సరాలు పట్టవచ్చు. వారు తమకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడిన దాకా పునర్జన్మకు ఎదురుచూస్తూనే వుంటారు.

యోగ చేతన ఉన్నవారిలో రాబోయే జన్మను గురించి కూడా అవగాహన ఉంటుంది. పునర్జన్మకు ముందే రాబోవు దేహాన్ని వారు రూపొందించుకో గలరు. నిజానికి వారి మరోజన్మకు వారే కర్తలు. వారికి తల్లి దండ్రులు నామమాత్రమైన ఉపాధి వంటి వారే అవుతారు.

పునర్జన్మ విషయంలో ఎవరికీ సరియైన అవగాహన లేదనే నా అభిప్రాయం. ప్రతి వ్యక్తీ మరల మరల తానే పునర్జన్మ పొందుతున్నానని భ్రమపడుతున్నాడు. ఇది సరియైన అవగాహన కాదు. నిజానికి వారికి ఉన్న లక్షణాలతోపాటు ఇతరుల స్వభావాలు కూడా వారి చేతనలో మిళితమై నూతన జీవిగా ఆవిర్భవించడం జరుగుతుంది. ఏ వ్యక్తీ సంపూర్ణంగా తానే పునర్జన్మను పొందదు. మనమంతా నేను అని వ్యవహరించే జీవి మన స్వంతఆస్తి లాంటిది కాదు. అది బయటకు కనబడే నామరూపధారి మాత్రమే. అదే జీవి వరుసగా రెండవ జన్మను, మూడవజన్మను పొందటం నిజం కాదు. అదే రకమైన చేతన ఇద్దరిలో ఉన్నా అది ఒకటిగానే జన్మించవచ్చు. శాశ్వతంగా నిలచి యుండేది మనలోని చైత్యపురుషుడు మాత్రమే! బయటకు కనబడి దేహధారి యైన "జీవుడు" మనం కాదు, జీవుడు అంటే రూప, నామాలు ఉన్న భౌతిక స్వరూపం కాదు.

CWM 3: 144-146

పూర్వపు వ్యక్తిత్వంలో కొంత భాగమైనా మిగిలి యుంటుందా?

సమా: సాధారణంగా "జీవుడు" రూప నామాలు ఉన్న దేహధారిగా మాత్రమే



చలామణి అవుతాడు. అందువలన దేహత్యాగంతో ఆ అధ్యయనం ముగిసినట్లే. అట్లాగని జీవిలో ఏ అంశమూ మిగిలిపోదని భావించకూడదు. ప్రాణిక, మానసిక, శక్తులు మరణంతో పూర్తిగా నశించవు. నిజానికి అవి దేహంతో ముడివడి యుండవు. దాటికి బాహ్యరూపంతో సంబంధం లేదు.

దేహం అనేక ధాతువుల, స్పందనల కోరికల భౌతిక సమాహారము మాత్రమే. అది తాత్కాలికంగా జీవధర్మాలను నిర్వర్తించే పరికరం. దేహసంబంధిత కార్యక్రమం ముగియంగనే ఈ కుహనా అస్తిత్వం అంతమౌతుంది. కొన్ని సందర్భాలలో, అది మనసుపై చెరగని ముద్ర వేసిన ప్రభావాల విషయంలో మనసుకూడా దానికి కట్టుబడి ఒక ప్రత్యేకతను సంతరించుకొంటుంది. అట్టి సందర్భాలలో జీవి తనకు తగిన రూపాన్ని ధరించి, తనలోని ఆదర్శాలను ప్రకటించటానికి వీలుగా తిరిగి పూర్వ జన్మ వాసనలతో జన్మిస్తుంది. ఇదే విధంగా కళాహృదయం ఉన్నవారు, శాస్త్రిజ్ఞులు వేదాంతులు, ఉన్నత మానసిక చేతనని సాధించినవారు వారి వ్యక్తిత్వాలను బట్టి, వారి ప్రాణిక శక్తులతో మళ్ళీ జన్మించారు. వారి భౌతిక దేహాలు సంతరించుకున్న మనోమయ వికాసం మానసిక శక్తులు దేహంతోపాటు నశించవు. అవి జీవి యొక్క అంతరంగానికి చెందినవి కావటంవలన మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ పరిపూర్ణత్వాన్ని పొందటంద్వారా దైవేచ్ఛను నెరవేర్చే ప్రయత్నంలో ఉంటాయి.

CWM 3: 144-146

పునర్జన్మ వలన చైత్యపురుషునిలో ఏ మేరకు అభివృద్ధి జరుగుతుంది?

సమా: ఇది వర్గ భేధానికి సంబంధించిన విషయం. చైత్యపురుషుని చేతనావికాసం కూడా ఇందుకు దోహదపడుతుంది. తన భౌతికదేహం మరణించటానికి ముందే చైత్యపురుషుడు బాగా అభివృద్ధి చెంది ఉంటే ఇది పూర్తిగా జరుగుతుందని అను కోవచ్చు. ఇది ఇప్పటికే మీకు వివరించాను. ఇతర సందర్భాలలోనూ అట్లా దానంతట అదే జరిగి పోతుంది. అటువంటి సందర్భాలలో చైత్యపురుషుని ఇచ్ఛ అంత పరి ణతి చెందకపోతే అది తను తానుగా నిర్ణయించుకోలేదు. ఇక నియమాలకు ఎలా అవకాశం ఉంటుంది?

ఇదంతా పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా చైత్యపురుషుడు ఏ దిశగా పయనిస్తోంది. అంతా దాని మూలాల్లో ఉంటుంది. కచ్చితంగా చెప్పలేము.

ఇక లైంగిక విషయాలు (స్త్రీగానా, పురుషుడుగానా అనేవి) కొంతకాలానికిగాని

బయటపడవు. చైత్యపురుషుడు తన చైతన్యం తగినంతగా అభివృద్ధి చెందిన తర్వాత తనకు తానే ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటుంది. ఇంతకు ముందు అనేక జన్మలలో నీవు స్త్రీగానో, పురుషుడుగానో జన్మించి యుండవచ్చు. ఇందువలననే కొందరు స్త్రీలకు పురుష లక్షణాలు, పురుషులకు స్త్రీలక్షణాలు రావటం కద్దు. ఇది నిర్ణయం కాకముందే సృష్టికర్త్రిణి లేదా జగద్రష్ట ప్రభావం ఉండి తీరుతుంది. ఇది కూడా ప్రారంభదశలోనే జరుగుతుంది.

అంతరాత్మ మరో దేహంలో జన్మించే సమయము

నేను అనేక జన్మలు ఎత్తినట్లునూ, ఇంకా ముందు ముందు ఎత్తనున్నట్లునూ చెప్పగలను. ప్రతిసారి విషయం మానసికమైన పరిస్థితిపై ఆధారపడి వుంటుంది. భౌతికంతో దానికి అంతగా సంబంధం ఉండదు. కాని, శారీరక అంశాలను కూడా త్రోసిరాజనలేము. అంతరాత్మ ఏ స్థాయిలో వుందో అదే కావలసిన పునర్జన్మను కూడా నిర్ణయిస్తుంది. ఇక్కడ ఆత్మ అంటే మనోమయ పురుషుడే అని భావించాలి. చుట్టూ ఉన్న వాతావరణాన్ని బట్టి నిర్వహించాల్సివున్న కర్తవ్యాన్ని బట్టీ ఆలోచించి తగిన విధంగా అంతరాత్మకు పునర్జన్మ వస్తుంది. ఇందుకు అనేక పరిస్థితులు తోడ్పడతాయి. తల్లిదండ్రుల మనోభావాలు, వారి చేతనయొక్క స్థాయి కూడా దీన్ని నిర్ణయిస్తుంది. బిడ్డను కనాలనే తీవ్ర ఆకాంక్షతో గర్భం ధరించటానికీ, దేహవాంఛ వలన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా గర్భం ధరించటానికి తేడా వుంటుందని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఆకాంక్షలేకుండా గర్భం ధరించిన సందర్భంలో అదే ఆత్మ మళ్ళీమళ్ళీ జన్మిస్తుందని కూడా నేను చెప్పలేను. శిశువు మాతృగర్భంలో తయారవుతున్నప్పటి నుండే మార్పు జరుగ నారంభిస్తుంది. గర్భధారణ సమ యంలోనే ఇది జరిగితే పుట్టబోయే శిశువుయొక్క చైతన్యం కూడా రూపొందు తుంది. దానికి తగినట్లుగానే మాతృగర్భంలో జీవపదార్థం పెరుగనారంభిస్తుంది. శిశువు ఎదుగుదలకు ముందే మనసులో ఈ నిర్ణయం జరుగుతుంది. దానికి అను గుణంగానే పుట్టబోయే శిశువు దేహావయవాలు రూపుదిద్దుకుంటాయి. బిడ్డ బయటకు రావటానికి ముందే ఇది సంపూర్ణంగా జరిగిపోతుంతుంది. ఇదేమీ అసాధారణమైన విషయంకాదు, కాని ఇలాగే జరుగుతుంది.

తరచుగా కొన్ని సందర్భాలలో శిశువు భూమి మీదకు వచ్చే సమయంలో

గట్టిగా ఏడ్చి, తన ఊపిరి తిత్తులను పనిచేయించటం ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియ పునర్జీవనాన్నివేగివంతంగా సమర్థవంతంగా చేస్తుంది.

కొన్ని కొన్ని సందర్భాలలో ఈ దశ రోజులు, నెలలు కొనసాగుతుంది. ఈ ప్రక్రియ నిదానంగాను, క్రమంగాను, మనం గ్రహించలేనంత అంతర్గతంగాను జరుగుతుంది.

మరికొన్ని సందర్భాలలో ఇంకా ఎక్కువ కాలం కూడా పట్టవచ్చు. ఆ సందర్భాలలో గర్భంలోని శిశువే తన గ్రహణశక్తివలన మరింతగా చైతన్యవంతమై ఊర్ధ్వ శక్తుల ప్రభావాన్ని గమనించ గలుగుతుంది. ఆ శక్తులు ఏమిటో తనకు తెలియకపోయినా వాటిని గ్రహించి తన అనుభవంలోనికి తెచ్చుకుంటుంది. ఈ ఆకాంక్ష ఆయా శక్తులను ఆకర్షించి శిశువుయొక్క చేతనను ఏర్పరస్తుంది. ప్రస్తుతానికి మీకు సర్వసాధారణమైన సంఘటనలను గురించి మాత్రమే చెపుతున్నాను. ఇంకా ఎన్నో వుంటాయి. ఈ ప్రక్రియ అనేక విధాలుగా జరిగే అవకాశం ఉంది.

మీకు వివరించినవన్నీ నా అనుభవంలోనికి వచ్చిన సందర్భాలే.

మళ్ళీ జన్మించాలని అనుకునే ఆత్మ కొంత కాలం ఊర్ధ్వ మానసంలో ఉంటుంది. అయినా భూవాతావరణానికి కూడా సమీపంలోనే ఉంటుంది. రాబోయే రూపాన్ని నిర్ధారించుకున్న తరువాతే రూపధారణ జరుగుతుంది. కొన్నిసార్లు ఇంకా దిగువకు వచ్చి ప్రాణిక లేక సూక్ష్మ భౌతిక తలాల్లోనుండి దేహ నిర్మాణాన్ని చేసుకుంటుంది.

అంతారాత్మిక అస్తిత్వం జీవి పునర్జీవించటానికి తగిన పరిస్థితులను ఏర్పాటు చేసుకుంటుంది.

దివ్యనిప్పురవ్వ తనలోని ఆకర్షణ వలన ఐతే నేమి, తన ఎంపిక కారణంగా ఐతేనేమి, దాని చుట్టూ తనకు అనువైన మానసిక చేతనను ఏర్పాటు చేసుకోవటం ప్రారంభిస్తుంది. ఇది జంతువుల్లో స్పష్టంగా గమనించవచ్చు. మనిషి కూడా జంతువే కదా! అందువలన మనకు మాత్రమే మానసిక అస్తిత్వం ఉంటుందనుకోవటం కేవలం భ్రమ. ఈ చేతన నిర్జీవపదార్థాలలోనూ ఉంటుంది. ఇది ఖనిజాలలో ప్రారంభం అవుతుంది. వృక్షజాలంలో అభివృద్ధి చెందుతుంది. జంతువులలో దాని ఉనికి స్పష్టంగా చూడవచ్చు. ఇక మానవులలో మరింతగా పరిణామం చెంది ఒక స్వీయ చేతనగాను, వ్యక్తిగత సంకల్పశక్తిగాను అభివృద్ధి చెందుతుంది. ఇట్లా అనేక జన్మలు జరుగగా,

అది మరింతగా వ్యక్తిత్వాన్ని సంతరించుకొని తన చేతనను తానుగా గ్రహించే స్థితికి చేరుకొంటుంది. ఆ స్థితిలో దాని గమనానికి కావలసిన వాతావరణం అది నిర్ణయించుకో గలుగుతుంది. ఆ గ్రహింపుకు వచ్చిన తరువాత రాబోయే జన్మకు కావలసిన పరిస్థితులపై దృష్టి సారిస్తుంది.

ఇక్కడ మీకు ఒక విషయం ప్రత్యేకంగా చెప్పాలి. చైత్యపురుషుడు కేవలం భౌతిక వాతావరణంలోనే అంటే దేహం ఉండగానే ఏర్పడుతుంది. అభివృద్ధి చెందుతుంది. దేహత్యాగం చేశాక అవసరమైతే కొంతకాలం విశ్రమించి — ఇంత కాలం అని చెప్పలేము — దాని పరిణితికి తగినట్లు రాబోవు జన్మలలో ఇంకా ముందుకు వెళ్లే మార్గాన్ని అన్వేషిస్తుంది. ఆ విధంగా ఒక జీవితాన్ని గడిపిన తరువాత దేహత్యాగం చేసి పునర్జన్మకు తనకు కావలసిన జీవన విధానానికి పుట్టబోయే ప్రదేశానికీ తగిన స్పష్టమైన కార్యక్రమానిక కావలసిన ఏర్పాట్లు చేసుకొంటుంది. ఏతా వాతా చెప్పేది ఏమిటంటే వ్యక్తిలోని చేతన పరిణితినే కోరుకొంటుంది. పునర్జన్మలు అందుకే!

CWM 14:143- 44

భావానువాదం: కె.ఆర్. ఎల్. నరసింహారావు (9848848291)

పురుషజన్మ లేక స్త్రీజన్మ

"ఎక్స్" నన్నడిగాడు జన్మ పరంపరలో ఒక స్త్రీ, పురుషుడు కావచ్చా, లేదా ఒక పురుషుడు స్త్రీగా జన్మించవచ్చా అని. అతడు తనలో కొన్ని స్త్రీత్వ లక్షణాలను గమనించాడు. వాటిని ఆ విధంగా అయితే వివరించవచ్చు అనుకొన్నాడు. అంతరాత్మకు లింగభేదం ఉంటుందా అనే విషయాన్ని నేను కూడా తెలుసుకోవాలనుకొంటున్నాను.

చైత్యపురుషలో ఉండేది లింగభేదం కాదు పురుషతత్వం లేదా స్త్రీతత్వం. ఒక స్త్రీ పురుషుడిగా జన్మించవచ్చా, లేదా ఒక పురుషుడు స్త్రీగాజన్మించవచ్చా అనేది కష్టమయిన ప్రశ్న. సాధారణంగా అది ఒక మార్గాన్నే అనుసరిస్తుంది. అనేది నా అనుభవం, సాధారణ అనుభవం కూడా. కాని లింగబేధమనేది అసాధ్యమయిన విషయమని చెప్పలేము. కొంత మంది ఒక జన్మ స్త్రీగాను, మరొక జన్మ పురుషుడుగాను తీసుకోవచ్చు. ఒక పురుషుడిలో స్త్రీత్వ లక్షణాలు కనిపించటానికి కారణం ముందు జన్మలో స్త్రీగా జన్మించి ఉండటం కానక్కరలేదు. క్రియాశక్తుల సాధారణలీలలో

మూర్తీభవించుటలో అలా జరగవచ్చు. కొన్ని లక్షణాలు ఇరులింగాలకు సమానంగా ఉండవచ్చు. ఒక మానసికవ్యక్తిత్వంయొక్క అంశం మరొకరితో అనుబంధం కావచ్చు. గతంలోని ఒక వ్యక్తి గురించి మీరిలా అనవచ్చు. అది నేను కాదు, నా మనస్తత్వ మూర్తి అంశ అతనిలో ఉంది అని. పునర్జన్మ అనేది ఒక సంక్లిష్టమయిన విషయం. జనులు సాధారణంగా అనుకునేంత సరళమయిన తతంగం కాదు.

CWM 28: 548- 49

మరణించబోయే వ్యక్తి అభిలాష

అవసానదశలో కోరిక కేవలం ఉపరితలం లోనిదే అది అంతరాత్మికమైన దానిచే నిర్ణయించబడి ఉండవచ్చు. భవిష్యత్తును రూపొందించుకోవటానికి ఉపకరించవచ్చు. కానీ అది అంతరాత్మికమైన దాని ఎన్నికను నిర్ణయించదు. అది తెరవెనుక జరుగు తుంది. బాహ్యచేతన చర్య అంతర విధానాలను నిర్ణయించదు. నిజానికి అంతరమే బాహ్యాన్ని నిర్ణయిస్తుంది. కొన్నిసార్లు అంతర్ చర్యల సూచనలు లేదా శకలాలు ఉపరితలం పైకి రావచ్చును. ఉదాహరణకు కొంత మందికి అవసాన సమయంలో తమ గతంలోని సంఘటనలన్నీ ఒక దృశ్యంలా కళ్ళముందు కదలవచ్చు. అది శరీరాన్ని విడిచేముందు చైత్యపురుష సమీక్ష.

*

కఠిన యంత్రాంగం కాదు.

చైత్యపురుష ఎన్నిక వలన తదుపరి జన్మలో వ్యక్తిత్వం రూపొందదు. అది నిర్ణయించవచ్చు. ఒకసారి అంతరాత్మిక లోకాలలో ప్రవేశించాక తన అనుభవాల సారాన్ని జీర్ణించుకోవటం ప్రారంభిస్తుంది. ఆ కారణంచేత ముందు నిర్ణయించుకొన్న ట్లుగా భవిష్యచైత్య పురుష వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుంది. ఈ జీర్ణించుకోవడం పూర్తి అయిన తరువాత కొత్తజన్మ తీసుకోవటానికి సంసిద్ధమవుతుంది. కానీ అంతగా పరిపూర్ణత చెందని జీవులు తమంత తాము స్వయంగా పూర్తిగా ఈ కార్యాన్ని నెరవేర్చలేవు. అందుకు ఉన్నత లోకాలకు చెందిన జీవులు శక్తులు ఉంటాయి. జన్మ తీసుకొన్నప్పుడు భౌతికప్రపంచశక్తులు తాను చేయాలను కున్నదానికి అడ్డు రావచ్చు. ఆ కార్యార్థమై తన నూతన ఉపకరణం శక్తివంతమయినది కాకపోవచ్చు.

ఎందుకంటే తన స్వీయశక్తులతో యిక్కడ విశ్వజనీన శక్తుల అంతర్మథనం ఉంటుంది. నిరాశ, దారితప్పటం అసంపూర్ణత ఏదైనా జరుగవచ్చు. అదంతా ఒక పటిష్ఠ యంత్రాంగం కాదు. కొన్ని సంక్లిష్టమైన క్రియాశక్తుల పనితనం చైత్యపురుష పరిణతి చెందినపుడు ఈ సంక్రమణం చైతన్యవంతంగా ఉండి, తానే నిర్వహించడం జరుగుతుంది. సమయం వ్యక్తియొక్క గతిపై, పరిణితిపై ఆధారపడి ఉంటుంది. కొంతమంది వెంటనే జన్మ తీసుకోవచ్చు. మరికొంతమందికి సుదీర్ఘమైన కాలం పట్టవచ్చు. కొంతమందికి కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. కానీ చైత్యపురుషుడు తగినంతగా పరిణితి చెందిన వారిలో తమగతిని, విరామాలను నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఉంటుంది.

సాధారణ కర్మ సిద్ధాంతము

సాధారణ కర్మసిద్ధాంతాలు మరీ యాంత్రికంగా ఉంటాయి. అదే విధంగా పాప పుణ్యాలు మరుజన్మలో వాటి ఫలితాలు కూడా. పూర్వజన్మ కర్మఫలాలు ఉంటాయి కానీ ఆ శైశవ మయిన సిద్ధాంతం ప్రకారం కాదు. ఒక మంచివ్యక్తి ఈ జన్మలో బాధ లనుభవించటానికి కారణం పూర్వజన్మలో అతను దుర్మార్గుడై ఉండటం అని. ఒక చెడ్డవ్యక్తి సంపన్నుడుగా ఉండటం అతను పూర్వం భూమిపై దేవతా గుణాలతో ఎన్నో సత్కర్మలాచరించి ఎన్నో సద్గుణాలను కలిగి ఉండటమే ఈ జన్మలో అదృష్టానికి కారణమని చెప్తుంటారు.

ఇది వినటానికి నిజమే అనిపిస్తుంది. జన్మ యొక్క ఉద్దేశ్యం అనుభవం ద్వారా ప్రగతి చెందటం. పూర్వకర్మలనుండి వచ్చినఫలితాలు ఆ వ్యక్తి మరింత నేర్చుకోవటానికి ప్రగతి చెందటానికి ఉద్దేశించబడ్డాయి. క్లాసులో మంచి పిల్లలకు లాలిపాప్‌లు, చెడ్డపిల్లలకు బెత్తపు దెబ్బలు లాగా కాదు. మంచి, చెడులకు అదృష్ట, దురదృష్టాలను కేటాయించటం కాదు. మంచి అనేది మనలను ఒక ఉన్నత స్వభావం వైపు నడిపించి,

---

చైత్యసత్తమరణ సమయంలో తాను తరువాతి జన్మలో ఏమి చెయ్యదలచుకుందో ఎంపిక చేసుకొని, తన కొత్త వ్యక్తిత్వపు లక్షణాలను, పరిస్థితులను నిర్ణయించుకుంటుంది. జీవితం అనేది వ్యక్తి ఉన్నతమయిన వెలుగుకు సంసిద్ధమయ్యేవరకు అజ్ఞాన పరిస్థితులలో అనుభవం ద్వారా పొందే పరిణామ ప్రగతి.

CWM 28: 532-33

చివరకు బాధలకు అతీతంగా పైకి లేవనెత్తుతుంది. చెడు అనేది నిమ్న స్వభావం వైపు క్రిందికి లాగి దుఃఖం దుష్టత్వాల వలయంలో పడవేస్తుంది.

CWM 28: 532-33 *అనువాదం: డా. ఆర్. సరోజాప్రసాద్ (9704198298)*

అంతరాత్మిక లోకంలో నెమరువేసుకొనుట

శరీరం విడిచాక ఆత్మ అనేక స్థితులు, తలాల గుండా ప్రయాణించి, తన తాత్కాలిక ఆచ్ఛాదనలను విడిచి పెడ్తుంది. చివరకు అంతరాత్మిక లోకంలో చేరుకొని అక్కడ ఒకవిధమైన నిద్రలో ప్రవేశిస్తుంది. అక్కడే తరువాత జన్మకు సంసిద్ధమౌతుంది. తనవద్ద ఉన్న మానవ అనుభవాల సారాన్ని మరుసటి జన్మలో తన అభివృద్ధి కొరకు ఉంచుకుంటుంది. ఇది సర్వ సాధారణంగా జరిగే పద్ధతి. కాని బాగా అభివృద్ధి చెందిన సత్తాలకు ఇది వర్తించదు. వారు, సాధారణ మానవులకంటె ఎక్కువ ఎరుకను చైతన్యాన్ని సాధించారు. తరువాతి జన్మలో తనకంటె తక్కువ లేదా హీన రూపాన్ని ధరించేది అంతరాత్మ (అంతరాత్మిక సత్తా కాదు). అలా చేసేది సాధారణంగా ప్రాణికంలో కొంతభాగం మాత్రమే. ఏదో ఒక కోరిక వల్ల ఒక అనుభవం యొక్క అవసరం వల్ల ఒక ఆకర్షణ వల్ల ఇలా జరుగుతుంది. తరచుగా సాధారణ మనుషులందరకు.

*

కొత్త జీవితానికి సిద్ధమగుట

దేహం విడ్చాక, కొన్ని అనుభవాలు ఇతర లోకాలలో పొందాక, తన ఆత్మ తన మానసిక వ్యక్తిత్వాన్ని విదళించివేస్తుంది.

తర్వాత అది విశ్రాంతిలో ప్రవేశించి, గతాన్ని నెమరువేసుకుంటూ, తరువాత జన్మకు సంసిద్ధమౌతుంది. కొత్తజన్మపరిస్థితులు, వ్యక్తిత్వ వ్యవస్థాపన దానికి కావల్సిన పరికరాలు, ఎంపిక చేయబడ్తాయి. నిర్ధారించబడ్తాయి. గతజన్మ అనుభవాలు, జ్ఞాపకాల సారాన్ని మాత్రమే, వివరాలను కాదు, నిష్క్రమించిన అంతరాత్మ ఉంచుకుంటుంది. (వాసనలు, అభిరుచుల రూపంలో) భవిష్యత్ లో వీటిని వ్యక్తపరచ వలసివచ్చినపుడు మాత్రమే వాటి వివరాలను జ్ఞాపకానికి తెచ్చుకుంటుంది. అలా కాకపోతే యోగదృష్టివల్ల ఇవి జ్ఞాపకానికొస్తాయి.

పరిణామక్రమంలో వెనుకంజ వేసే అంతరాత్మ పరిణామంలో కొన్ని చాంచల్యాలు ఉండవచ్చు. కాని ఇవి తాత్కాలిక వంకరటింకర చలనాలు మాత్రమే పూర్తిగా వెనుకకు పడిపోవడం కాదు. అది ప్రయత్నించినది ఏదో కొత్త దారిలో పురోగమించటానికే.

అంతరాత్మ పశుస్థాయికి పడిపోదు. కాని దాని ప్రాణిక వ్యక్తిత్వంలో కొంతభాగం విడిపోయి, పశుజన్మ పొంది, కావాల్సిన అనుభవాలు పొందుతుంది.

దురాశాపరుడు మరుసటి జన్మలో పామై పుడ్తాడనటంలో సత్యం లేదు. ప్రాచుర్యం గల అద్భుత మూఢనమ్మకాలు మాత్రమే.

CWSA 28:534

ప్రత్యేక ప్రజ్ఞలు- వ్యవస్థీకృత ప్రజ్ఞలు- వాని పునర్జన్మ

ప్రశ్న: ఈ సత్తాలు తిరిగి జన్మించినపుడు, గత జన్మలోని కోర్కెలనే నిల్పుకోగలమా?

సమా: కాదు. అది మొత్తం కాదు. కొన్ని ప్రత్యేక ప్రజ్ఞలు భూవాతావరణంలో ఉండిపోతాయి. తమను తాము అభివ్యక్తం చేసుకొనడానికి ఉండిపోతాయి. కాని చైత్య పురుషుడు అంతరాత్మిక లోకానికి తిరిగి వెళ్ళిపోతుంది. అదే మళ్లీ శరీరం తీసుకుంటుంది. నేనిదివరకు చెప్పినట్లు, శరీరాన్ని విడిచేముందే చైత్యపురుషుడు చాలా తరచుగా నిర్ణయించుకుంటుంది. తన తరువాత జన్మ ఏమిటో దాని పరిసరాలు వృత్తి, ఎలా ఉండాలో ఎందుకంటే దాని అనుభవాలకు ఒక క్షేత్రం కావాలి. అందుచే గొప్ప సంగీతజ్ఞులు, పెద్ద గ్రంథకర్తలు వారి తర్వాత జన్మలో తెల్వితక్కువగా అవివేకులుగా జన్మించవచ్చు. ఇది అసంభవం, అని మీరు చెప్పవచ్చు. ఎల్లప్పుడూ అలా జరుగదు. కాని జరగవచ్చు.

ఒక సందర్భంలో దీనికి వ్యతిరేకంగా జరిగింది. అతను వయెలిన్ విద్వాంసుడు. శతాబ్దిలోనే చాలా అద్భుతమైనవాడు. (మదర్ పేరు గుర్తు చేసుకొనే ప్రయత్నం చేశారు.) అ కొంచెం ఆగండి. అతని పేరు నాకు తెలుసు. కానీ మరచిపోయాను. అది గుర్తుకొస్తోంది. మళ్ళీ పోతోంది. అతని పేరేమిటబ్బా.... యేసయ్యే అతడు. బెల్జియన్. అతడు యధార్థంగా అత్యంత అద్భుత వాయులీన కళాకారుడు అతనిలో బెతావెన్ మళ్ళీ పుట్టాడు. బహుశా అది బెతావెన్ సంగీతప్రజ్ఞ. అతనికి బెతావెన్

తల, రూపము ఉన్నది. నేను అతనిని చూశా విన్నా. నేను పేరిస్ లో ఒక వయొలిన్ సంగీత కచేరిలో ఉన్నా, అది డి మేజర్ లో కచేరి. అతడు వేదిక మీదకు రావటం చూశా. నేను అన్నా. అత్యుద్భుతం. ఇతడు బెతావెన్ లాగే కనబడుతున్నాడు. అతని ముఖ చిత్రమే ఇతడు. కచేరీ ప్రారంభమైంది. వాతావరణం మారిపోయింది. ఏదీ కదల్లేదు. అంతా అద్భుతంగా ఉంది. మొదటినుండి చివరివరకు ఒక ప్రత్యేక పద్ధతిలో కచేరీ సాగింది. అతనిలో బెతావెన్ సంగీత ప్రజ్ఞ కనబడింది. కాని బహుశా బెతావెన్ చైత్యపురుషుడు, ఒక చెప్పులు కుట్టేవాని శరీరాన్ని తీసుకొని ఉండవచ్చు. అది వేరే రకం అనుభవాన్ని కోరింది.

అలా ఎందుకంటే నేను చూచిన మనిషి రూపం భూతలానికి సంబంధించినది అది మనోప్రాణికం. బెతావెన్ తన మానసిక ప్రాణిక, భౌతిక సత్తాలను క్రమశిక్షణలో పెట్టాడు. తన సంగీతప్రజ్ఞ చుట్టూ. అది అదే రూపంలో నివశిస్తూ, బెల్జియన్ లో ప్రవేశించాయి. బెతావెన్ చైత్యపురుషుడు వీటిని క్రమశిక్షణలో పెట్టి, వాటికి ఒక రూపాన్నిచ్చింది. బెతావెన్ చనిపోయాక అతని చైత్యపురుషుడు అక్కడే ఉండి పోయిందని చెప్పలేము.

అది పద్ధతిప్రకారం అంతరాత్మిక ప్రపంచంలోనికి తిరిగి వెళ్ళి ఉండవచ్చు.

అతని ప్రజ్ఞ చుట్టూ ఏర్పాటైన సత్తాకు స్వతంత్ర జీవితం, స్వతంత్ర అస్తిత్వం ఉంటుంది. దానికి తగిన ఉపాధి దొరికిన వెంటనే, అది దానిలో ప్రవేశించి వ్యక్త మౌతుంది తనకు తానుగా.

CWM 5: 262-263 *అనువాదం: ఎస్. వై. సోమయాజులు (6281730339)*

పునర్జన్మలోని అంశాలు, గత జీవిత స్మృతులు

సాధారణంగా పునర్జన్మని పిలువబడుతున్న సమస్యను సవ్యంగా అర్థం చేసు కోవడానికి రెండు అంశాలను పరిగణనలోనికి తీసుకోవాలని గ్రహించాలి. మొదటిది వ్యక్తీకరణ క్షేత్రమయిన విశ్వంలో ఊర్థ్వాన్నుండి వ్యక్తీకరించుకోవాలనుకుని ప్రత్యేకంగా తనకు చెందిన కొన్ని రూపాల వరుసను ఎత్తి పట్టుకొనే దివ్యచేతనాసరళి, రెండువది కాలక్రమంలో ఊర్థ్వాన్నుండి రానున్న శక్తిని అందుకునేవరకు అతిమానస సత్యముద్రను పొందేవరకు క్రింది నుండి ఉన్నతానికి వికసిస్తూఉన్న దివ్య బీజమయిన చైత్యపురుష. ఈ చైత్యపురుష చేతన మానవుని అంతరంగజీవి, తన ఆకాంక్షకు

స్పందిస్తూ స్థిరమయిన మూర్తిమత్వాన్ని ప్రసాదించడం కోసం ఏ అతిమానసం అవరోహిస్తుందో, దేనినుండి తన నిజ ఆత్మ లేక జీవి రూపుదిద్దుకోగలదో ఆ ద్రవ్యం. విశ్వజనీనప్రకృతి పదార్థంతో అన్ని రకాలయిన శక్తులు క్లిష్టమైన పరస్పర చర్యతో మానసిక, ప్రాణిక, భౌతికాలుగా తయారయిన అశాశ్వత నిర్మాణం మనిషి బాహ్యా అస్తిత్వం. చైత్యపురుష వివిధంగా రూపొందిన అనుభవాల వెనుక నిలచి వాటి సారాన్ని ఉన్న దున్నట్లు గ్రహిస్తుంది. కాని వీటితో నిరంతర సంపర్కంలో ఉండకుండా ఒక నేపథ్యాన్ని సమకూర్చినప్పటికీ, వారి జీవితాల గురించి పూర్తి స్మృతిని నిలుపు కోదు. అందువలన చైతన్యపురుష సంపర్కంతో తన ఉన్నత జీవితాలనన్నింటినీ పునరవలోకనం పేరిట సాధారణంగాతరచు జరిగేదేమిటంటే ప్రయత్నపూర్వకమైన వంచన లేదా లోనుండి ఓ పద్ధతి లేకుండా వస్తున్న సూచనల నందుకొని అల్లడము. చాలామంది వారి పశు జీవితాలుగూడా అంతే బాగా గుర్తొచ్చినట్లు వాదిస్తారు. ప్రపంచపటంలో ఈ భాగంలో ఆభాగంలోను జీవిస్తున్న ఆ యా కోతినన్నట్లు చెప్తారు. కోతికి చైత్యపురుష చైతన్యంతో యెట్టి విధమైన సంపర్కముండదు అని కచ్చితంగా చెప్పవచ్చు. కాబట్టి దానికి చెందిన అనుభవాలను లేశమాత్రమయినా ప్రసారం చేయలేదు. అతని బాహ్యమయిన కోతిస్వభావ ముద్రలు పశుదేహం పడిపోయిన వెంటనే లేకుండా పోతాయి. వాటి గురించి జ్ఞానమున్నట్లు నటించడం పరిగణనలోనికి తీసుకురావడమనేది సమస్యకు చెందిన యదార్థ వాస్తవాల గురించి తమ అజ్ఞానాన్ని తప్పుగా బయటపెట్టుకోవడమే, మానవజీవితాల విషయంలో గూడా కేవలం అంత రాత్మికమైనది ముందుకు వచ్చి ఉంటేనే కచ్చితమయిన జ్ఞాపకాలను మోసుకొచ్చి పరిరక్షిస్తుంది. అయినప్పటికీ అది నిరంతరం ముందుంటూ బాహ్యజీవితాలతో అస్తిత్వంతో ఒకటైఉంటే తప్ప కచ్చితమైన జీవిత వివరాలన్నింటినీ జ్ఞాపకముంచుకో లేదు. ఎందుకంటే భౌతికమనసు, భౌతిక ప్రాణికం ఒక నియమంగా జీవి మరణంతో లయించి పోతాయి. అవి శిథిలమయి, విశ్వప్రకృతికి చేరిపోతాయి. వారి అనుభవా లంటూ ఏవీ నిలిచి ఉండవు. అంతరాత్మికమైనదానితో ఐక్యమయ్యే వరకు అవి రెండు విభాగాలు గావు, ఒకే ఒక చైతన్యం కేంద్రదివ్య సంకల్పం చుట్టూస్వభావం మొత్తం ఒక్కటవుతుంది. ఈ కేంద్రీకృతమయిన జీవి ఊర్ధ్వంలోఉన్న చైతన్యపు దివ్యసరళితో ముడి బడుతుంది. ఇదంతా జరిగేవరకు ఆ చైతన్యాన్కి చెందిన జ్ఞానాన్ని అందుకోలేదు. క్రమక్రమంగా జరిగిన స్వీయవ్యక్తతకు తనకు పరంపరంగా

మాధ్యమాలయిన ఆకృతుల జీవితాల వరుస మొత్తం గుర్తించిన ఎరుక ఉండదు. ఇది జరుగకముందు తన గత జన్మల గురించి వాటికి చెందిన వివిధ సంఘటనలగురించి మాట్లాడడంలో అర్థంలేదు.

CWM 3:148-149

పలు దేహాలలో ఒకే ఆత్మ

చైత్యపురుష పరిణామ పలితం, అంటే పదార్థంలోనికి విస్తరించిన దివ్యచేతన నెమ్మదిగా పదార్థాన్ని ఉన్నతీకరించి అది తిరిగి దైవం చెంతకు రావడం కోసం వికసిస్తూ ఉండునట్లు చేయడం జన్మలన్నింటిద్వారా అభివృద్ధి చెందుతూ వచ్చిన ఈ దివ్య కేంద్రంతో చైత్య పురుషుడు రూపొందిఉంటుంది. ఒకరకమయిన పరిపూర్ణతకు, దాని అభివృద్ధితో నిర్మాణంలో పరిపూర్ణతకు చేరుకునే సమయమొస్తుంది. అప్పు డెంతో ఎక్కువగా సత్యసాక్షాత్కారం పట్ల ఆకాంక్ష ఉండడంవలన, మరింకెంతో గొప్ప దివ్యవ్యక్తీకరణకై ఓ పరిపూర్ణత కోసం ముకుళితమయి ఉన్న అస్తిత్వాన్ని సాధారణంగా తనవైపుకు మళ్ళిస్తుంది. అంటే శ్రీఅరవిందులు అధిమనసని దేని నంటున్నారో. ఆ దానికి చెందిన జీవులలో ఒకటిప్పుడు ఈ చైత్యపురుషలో పున రవతరించడంకోసం వస్తుంది. మనుషులు సాధారణంగా దేవతలని పిలిచే ఆ జీవులలో ఏదో ఒకటై వుంటుంది. ఈ కలయిక జరగినప్పుడు సహజంగా చైత్యపురుష ఘన తర మౌతుంది. పునరవతరించిన జీవి దాని స్వభావాన్ని పంచుకొంటుంది. అది అప్పుడు తనలాంటి వాళ్ళను పుట్టించి విడుదల చేయగలుగుతుంది. అది అప్పుడు తననుండి తనలాంటి అంటే అది వాటిలోనుండే ఒక భాగాన్ని ప్రతిక్షేపించడంవలన స్వతంత్రమయి పునరవతరించడంకోసం అది యితరులలోనికి వెళ్తుంది. కాబట్టి రెండు మాత్రమేగాక మూడు, నాలుగు లేదా ఐదు రూపాలు ఉండగలవు. ఎన్ని అనేది అలా ఇవ్వగలిగిన వాళ్ళ మీద ఆధారపడి వుంటుంది. చెప్పేదేమంటే తన ఆవిర్భావమూలం అదే అంతరాత్మిక దైవం కాగలదని చెప్పవచ్చు. సాధారణంగా పలుప్రసరణలు ఉన్న ప్పుడు ఆ జీవినన్న అనుభూతి విభిన్నవ్యక్తులకుంటుంది. అదే అధిదేవతకు చెందినదేదో వారిలో ఉన్నందువలన అది సవ్యమే. అధిదైవంలో

ఒక భాగం దాని నుండి బయటకు వచ్చి మరొక జీవిలో స్వతంత్రంగా ఉంటుంది.ఇది ఆత్మ రెట్టింపు అవ్వడంగాదు. ఒకరకమయిన స్వీయ ప్రతిక్షిప్తత.

CWM 5: 263- 64

గత జీవితం జ్ఞాపకముండకపోవడం

అంతరాత్మ భూతలానికి తిరిగి వచ్చినప్పుడు గతం జ్ఞాపకముండదు, అంతరాత్మ పుర్జన్మకు తిరిగి వచ్చినప్పుడు మరచిపోవడమనేది ఒక నియమంగాదు. గత జన్మకు చెందిన బలమయిన, తగినంత వివరంగానున్న ముద్రలెన్నో ప్రత్యేకించి బాల్యదశలో ఉంటుంటాయి. కాని స్థూలంగా అందించే విద్య, వాటి కంటే బలమయిన పరిసరాల ప్రభావాలు వాటి నిజస్వభావాన్ని గుర్తించకుండా ఎక్కువ నిరోధిస్తుంది. కాని ఎప్పుడూ అలాగే ఉండదు. కచ్చితమైన గత జీవిత స్మృతులున్నవారుకూడా ఎంతో మంది ఉన్నారు. కాని విద్య పరిసరాలు ఈ విషయాలను నిరుత్సాహ పరుస్తాయి. నిలిచిగాని, పెరుగుతూగాని ఉండలేవు. ఎంతోమంది విషయంలో బయట

నరకం, స్వర్గం అనేవి తరచు అంతరాత్మ ఊహాత్మిక స్థితులు, లేదా ప్రాణికజీవి అంతరించిన తర్వాత తనగురించి నిర్మించుకున్న ఓ ఊహాచిత్రం. నరకమంటే ప్రాణిక ప్రపంచంద్వారా సాగే ఏదో బాధాకరమయిన ప్రాంతం లేదా అక్కడ దుఃఖభూయిష్టంగా తిరుగాడుతూండేటట్లు చేసే ప్రాంతం. ఉదాహరణకు పలు ఆత్మహత్యల విషయంలో ఎక్కడ తాను అసాధారణంగా, హింసాత్మికంగా బయటపడి యీ ఘటన సృష్టించిందో అక్కడ బాధ, సంక్షోభాలు కల్పించిన వత్తిళ్లతో చుట్టుముట్టబడి ఉండడం, ఆహ్లాదకరమయిన లేదా చీకటిమయమయిన అనుభవాలు చొచ్చుకువచ్చే నిజమయిన మానసిక ప్రపంచాలు, ప్రాణిక ప్రపంచాలు గూడా ఉన్నాయి. అవసరమయిన సంబంధాలనేర్పరచే స్వభావంతో రూపొందిన విషయాల ఫలితంగా తాను వీటి ద్వారా వెళ్తుంటాడు. కాని అది బహుమానంగానో, ప్రతిఫలంగానో భావించడం ఓ మొరటయిన అసభ్యమయిన భావన, దానిని మనం కేవలం ఒక ప్రాచుర్యంలోవున్న తప్పిదంగా భావించి పట్టించుకోకుండా ఉండాలి.

CWM 28: 535- 36

పడకుండా అణగంతో ఉనికిలో ఉండవు. అదే సమయాన చైత్యపురుషుడు ప్రధానంగా తనతోపాటు మోసుకెళ్ళి తిరిగి వెనుకకు తీసుకువచ్చేది సాధారణంగా ముందు జీవితాలలోని తన అనుభవాలసారాన్ని ఫలితాన్ని మాత్రమేనని వివరాలను గాదని గుర్తించాలి కాబట్టి గతంలో తనకు సంభవించిన పొందికయిన అవే జ్ఞాపకాలను ప్రస్తుత ఉనికిలో ఆశింపలేవు. ఆత్మ అంతరాత్మిక ప్రపంచంలోనికి సూటిగా వెళ్ళగలదు గాని అది మరణించిన సమయంలోని చైతన్యస్థితి మీద ఆధారపడి ఉంటుంది. అంతరాత్మిక జీవి ఆ సమయంలో ముందుంటే ఈ తక్షణ బదలాయింపు సాధ్యం. మానసిక ప్రాణికాలతో పాటు అంతరాత్మిక జీవి అమృతత్వాన్ని పొందటం మీద యిది ఆధారపడదు. అది పొందిన వారికి భిన్న ప్రాంతాలలో తిరిగే శక్తి ఉంటుంది. భౌతికప్రపంచంమీద గూడా, దానికి కట్టుబడి ఉండకుండా పనిచేస్తాయి. మొత్తం మీద ఏమని చెప్పవచ్చునంటే వీటి విషయాలలో మార్పుండని ఏకైక కఠిన నియమమంటూ లేదు. మొత్తం మీద ఒక చట్రంలా, ఒక నమూనాలో అన్నీ అమరి పోయి, వాటివాటి స్థానాలను తీసుకున్నప్పటికీ చైతన్యంమీద, దాని శక్తులు, వైఖరులు, నిర్మాణాల మీద ఆధారపడి పలువిధాలుగా ఉండడం సంభవమే.

CWM 28: 536 అనువాదం: జి. అరుణామోహన్ *(9866117137)*

గత జీవితాల స్మృతులు

మనలో ఎంతమంది గతజన్మలు గుర్తు పెట్టుకుంటారు?

మన అందరిలో, మన చేతనలోని ఏ మూలలోనో, ఒక స్మృతి వుంటుంది. అయితే ఇది అతి జాగరూకతతో పరిశోధించాల్సిన విషయం ఎందుకంటే మానవ మనసు ఎల్లప్పుడూ భావుకతను ఎక్కువగా యిష్టపడుతుంది. తన పునర్జన్మ గురించిన ఏ చిన్న సత్యమైనా తెలియగానే అనేకానేక అందమైన కథలు దాని చుట్టూ అల్లాలి. అని అనుకొంటుంది. ప్రపంచమెలా నిర్మించబడ్డదీ అది భవిష్యత్తులో కెలా సాగుతుంది గతంలో నువ్వెప్పుడు ఎలా పుట్టావో ఇకపై నువ్వెలా వుంటావో కథలు చెప్తారు. ఆధ్యాత్మికజీవనానికి వీటితో సంబంధంలేదు. పూర్వజన్మల గురించిన నిజమైన స్మృతి సమగ్ర విజ్ఞానంలో కేవలం ఒక భాగమే. కాని దానిని ఊహాజనితభావనల మార్గంలో పొందలేము. ఒకవిధంగా అది విషయపరమైన జ్ఞానమయితే, మరొకవిధంగా అది ఎక్కువగా వ్యక్తిగత విషయపరమైన అనుభవంపై ఎంతగానో ఆధారపడి వుంటుంది. ఇక్కడ నూతన చిత్రీకరణకు, వక్రీకరణకు లేదా అసత్యపు అమరికకు అవకాశం ఉంది. ఈ విషయాల సత్యాన్ని చేరాలి అంటే నీ అనుభవం లేక ప్రాణికజోక్యం వుండకూడదు. వ్యక్తిగత ఊహలనుండి ఉద్వేగాలనుంచి తోచినట్లుగా విశ్లేషించి వ్యాఖ్యానించే మనస్సుకుండే అలవాటునుంచి విడివడాలి. గతజన్మల అనుభవాలు బహుశా నిజమే కావచ్చు. కానీ నువ్వు చూసిన దానికి నీ బుద్ధి దానిపై ఇచ్చే వివరణకు, అభిప్రాయానికి మధ్య తీవ్ర వ్యత్యాసముండి తీరుతుంది. నువ్వెప్పుడయితే సహజభావనల నుండి విడివడి నీ మనస్సు పరిధిని దాటిపోగలవో అపుడు సత్యాన్ని చేరుకొంటావు.

CWM 3:40- 41

చైత్యపురుష జీవితం

కొద్దిపాటి జ్ఞానం గలవారు, ఎంతో కొంత మార్మిక జ్ఞానం కలవారు, అమాయక ధోరణిలో పునర్జన్మని నమ్మేవారుంటారు. వారిలా నమ్ముతారు. అతిచిన్న వ్యక్తి ఒక దేహమనే వస్త్రాన్ని ధరించినవాడు ఎపుడయితే ఆ వస్త్రం పాడైపోతుందో,

అపుడు మరో వస్త్రాన్ని ధరిస్తాడు.... ఒక బొమ్మకి బట్టలెలా మారుస్తామో, వాళ్ళకది అలా వుంటుంది. దేహం మారటం అనేది బట్టలు మార్చుకోవడం లాంటిది. కొంతమంది వారు కోతులుగ వున్నప్పటినుండీ వారి జీవితం ఎలా ఉందో అన్నదానిని గురించి చాలా గంభీరమైన పుస్తకాలు వ్రాశారు. ఇది నిజానికి చిన్నపిల్లల మనస్తత్వం. ఎందుకనగా వెయ్యికి తొమ్మిదివందల తొంభైతొమ్మిది సందర్భాలలో అస్తిత్వంలో కేంద్రబిందువుగా నున్న చిన్నఅంతరాత్మిక నిర్మాణం మరణం తర్వాత కొనసాగు తుంది. మిగతాదంతా కరిగిపోయి ముక్కలుగా పడిపోయి ఇక వ్యక్తిత్వం అనేది వుండదు. మనిషి భౌతిక జీవితంలో భౌతిక అస్తిత్వం చేతనాపూర్వకంగా నెరవేర్చే పనుల్లో చైతన్యపురుష ఎంతవరకు పాలు పంచుకొంటుంది? నేను కొద్దిపాటి క్రమశిక్షణ కలిగి యోగం చేసే వారి గురించి మాట్లాడ్డం లేదు. నేను మాట్లాడేది సాధారణ జనుల్లో మానసికంగా ఇది వరకు ఎదిగి జీవితంలో జోక్యం చేసుకొని దానికి మార్గదర్శకం చేయగలరో వారిని గురించి. మానసిక జోక్యం లేకుండా సంవత్సరాల తరబడి గడిపేవారున్నారు. వారే దేశంలో పుట్టారో, వాళ్ళ అమ్మ- నాన్న ఎలా ఉండేవారో వారుండిన ఇంటిని గురించి, పైకప్పుగురించి, దాని ప్రక్కనే వున్న అరణ్యం గురించి వారి జీవితంలో జరిగిన సంఘటనల గురించి చెప్తారు. అది పూర్తిగా అవి వేకం. ఎందుకనగా ఆవి చెరిగిపోయాయి. వాటి ఉనికిని కోల్పోయాయి. అప్పటి కాలపు జ్ఞాపకం ఎవరి మనసులోనయినా ఇంకా వుండి వుండవచ్చు. అది జీవితంలో ఒక ప్రత్యేక క్షణంలో ఒక ప్రత్యేక పరిస్థితి ఏర్పడినప్పుడు చెప్పాలంతే. కీలక సమయాలు అనగా హఠాత్తుగా ఒక అంతః పిలుపు లేదా ఒక ఆవశ్యకస్థితి వలన అనుకోకుండా మానసికశక్తి జోక్యం చేసుకొన్నందున మానసిక స్మృతిపథంలో పరిస్థితుల సముదాయం ఆ క్షణాన క్రియాశీలమైన చేతనకు జ్ఞాపకం వస్తుంది. అప్పుడు అది కొన్ని సాంగత్యాలతో పాటు, నీ పరిసరాలలోపాటు బహుశా నువ్వు విన్న ఒక మాట లేదా ఒక పదబంధంతో పాటు నీ చేతనలోకి చేరుతుంది. కానీ అన్నిటికన్న ముఖ్యమైనది ఏమిటనగా ఆ క్షణాన, లోన అంతరాత్మ స్థితి. ఎందుకనగా అది నిజంగా స్పష్టంగా ముద్రించబడి వుంటుంది. ఇవన్నీ మానసిక జీవితపు ప్రత్యేక ఆనవాళ్ళు. దానిపై గాఢముద్రవేసి, అది రూపొందడంలో పాలు పంచుకొన్నవి. అందువల్ల చైత్యపురుషుడిని నీలో నీవు తిరిగి నిరంతరం యెడతెగకుండా స్పష్టంగా కనుగొన్నప్పుడు ఇలాంటి విషయాలన్నీ నీకు గుర్తొస్తాయి. మనిషి జీవితంలో హఠా

త్తుగా జరిగిన సంఘటనలు ఉండవచ్చు. ఎవరూ ఇలా చెప్పలేరు. నేను ఫలానా వ్యక్తిని నేనిలాంటి పని చేసాను. నన్నీ పేరుతో పిలిచేవారు. ఈ పని లేక ఆపని చేస్తూండేవాడిని అని లేనట్లయితే ఆ ప్రత్యేక క్షణంలో (ఒక అరుదైన క్షణంలో) పరిస్థితులు కొన్ని కలిసి కట్టుగా ఏర్పడి తాను పుట్టిన తేదీ. స్థలము, దేశము, చెప్ప గలిగే విధంగా వుండి వుండవచ్చు. అది జరుగవచ్చు.

CWM 5:32 - 35 — *అనువాదం: తుమ్మల లక్ష్మి (9014239277)*

గత జన్మల గురించిన ఊహాగాథలు, మానసిక స్మృతులు

ఇతరుల జీవితాలను గురించి చెప్పే వ్యక్తున్నారు. ఔను. నాకు చాలా విష యాలు తెలుసు. ఒకరు వినగలిగినన్ని నేనూ విన్నాను. నాకు కథలు కథలుగా చెప్పుతారు. వారు నిన్ను చూసి నేను ఫలానా జన్మలో ఫలానావాడిని నీవు ఫలాన పనిచేశావు. అని అంటారు. ఇది వాస్తవం కాదని గ్యారంటీగా అంటాను. ఎందుకంటే ఎక్కడనో ఒకవ్యక్తిని చూశానని అతను అప్పుడు అలా వుండేవాడు, ఇప్పుడు ఇలా వున్నాడు అని ఎలా తెలుసుకొనగలరో నాకు తెలుసు. ఇది పుస్తకంలో వ్రాయగలిగిన ఒక చిన్న కథ. జ్ఞానం నీకు తెలిసినప్పుడు ఆ అంతరాత్మికతను నీవు గుర్తించినపుడు అకస్మాత్తుగా ఒక దృశ్యాన్నో, ఒక ప్రతిమనో ఒక రూపాన్నో, చూడగలవు. ఆ సంసర్గం వలన వ్యక్తిలో గతజన్మ నుండి సంక్రమించిన ఆకర్షణలను పరితాపాలను చూడగలుగుతావు. అయితే నేను చెబుతున్నట్లు అవి జీవితంలో కొన్ని క్షణాలు మాత్రమే. అటువంటివాటిని చూడగలం గాని జీవితం యావత్తునూ వర్ణించలేము. వివరించలేము.

చరిత్రలో నిలిచిపోయినవారి పేర్లను షేక్స్పియర్లను ముఖ్యమైన వ్యక్తులను నెపోలియన్లను గొప్పవ్యక్తులను సీజర్లనెందరిగురించో హాస్యాస్పదంగా శ్రీఅరవింద మహాశయులు వ్రాశారని నా నమ్మకం.చరిత్రలో నిలిచిపోయిన యెందరో వందలకొలది వున్నారు. వారి కథలను నీవు విని వుంటావు. నేను ఇలాంటివాణ్ణి. ఇది చేశాను, అని ప్రేతాత్మలు వచ్చి నీతో మాట్లాడుతాయి.

చాలామంది ఆత్మలతో ఆడుకోవడంలో నిమగ్నమై వుంటారు. ప్రత్యేకించి ఆత్మలతో సంభాషించేటప్పుడు ఆటోమెటిక్ గా వ్రాయడం చేస్తుంటారు. ఇప్పుడు బహుభాషలలో మాట్లాడే ఆత్మలున్నాయి. నెపోలియన్ లాంటి ఆత్మలు ఎన్నో

ప్రదేశాలకు ఒకేసారి రాగలవు. (నెపోలియన్ అంటే పక్షపాతం ఎందుకు చూపిస్తారో తెలియదు.) ప్రతి చోటుకు నెపోలియన్ వచ్చి అసాధారణమైన, వివాదాస్పదమైన కథలన్నింటిని ఒకేసారి చెపుతుంటాడు. వాస్తవంగా ఇలాంటివారు చాలా చురుకుగా వుంటారు. ఇలా చెప్పడం వినోదకరమైన అసాధారణమైన విషయం.

నిజమేమిటంటే ఇవి చాలా చిన్న ప్రాణిక జీవులు. మనిషి చనిపోయినతరువాత తీరని కోరికలు ఒక రూపును దాల్చి అలాగే పేరుకొనిపోయి తిరిగి వ్యక్తమయ్యేందుకు ప్రయత్నిస్తూంటాయి.

ఈ ప్రాణిక ప్రపంచంలో అవి చాలా చిన్న జీవులు. సద్బుద్ధి లేనివి. ఆటోమెటిక్ గా వ్రాయడం, ఆత్మలతో సంభాషించడంలాంటివి చూసినపుడు అవివచ్చి ఆడుతూంటాయి. మానవాలోచనలను సులభంగా చదవగలిగే ప్రదేశంలో వుంటూ మీ శిరస్సులో ఏముండేది. అవి చాలా చక్కగా చెప్పగలుగుతాయి. నీవు ఆశిస్తున్నదానికి ప్రత్యుత్తర మిస్తుంటాయి. నీవు ప్రత్యేకమైన సమాధానాన్ని కోరుకుంటూవుంటే నీవు ప్రశ్న వేయకముందే సమాధానం చెబుతూంటాయి. సరైన వివరణలనిస్తుంటాయి. నీకు ఫలానాది జరిగిందని నీ కుటుంబంలో ఫలానా అని వాటికి బాగా తెలుసు కాబట్టి .... నీ ఆలోచనలను చక్కగా చదివి నిన్ను ఒప్పించేటట్లుగా చెపుతాయి. నాకు వివాహమయిందని ముగ్గురు కుమారులు, నల్గురు కుమార్తెలు ఉన్నారని నేను చెప్పలేదు. ఇవన్నీ అతనికెలా తెలుసు. ఎందుకంటే అవన్నీ నీ శిరస్సులో వుండేటటువంటివేకదా.

అంతరాత్మిక స్మృతులకు చాలా ప్రత్యేకమైన ఒక లక్షణం, అద్భుతమైన తీక్షణత లుంటాయి. కాని వాటిని ఈ విధంగా వివరించలేను. అవి మరచిపోలేని జీవితలక్షణాలు. చైతన్యం తీక్షణంగా, ప్రకాశవంతంగా, బలంగా, చురుకుగా, శక్తివంతంగా వున్నపుడు జీవిత దిశనే మార్చగల మలుపుతిప్పే క్షణాలవి. ఒకరు ఎటువంటి దుస్తులు ధరించింది ఎవరితో మాట్లాడుతున్నదీ పొరుగువారెవరో, ఏ క్షేత్రంలో వున్నారో చెప్పలేరు.

CWM 5:32-36

యోగాచరణగావించే పిల్లి పునర్జన్మ నొందుట

ఒక పిల్లి వుండేది. ... దాని పేరేమిటో నాకు తెలియదు. మీకు తెలుసు. నాకు చాలా పిల్లులు వుండేవని. ఇపుడు వాటి జ్ఞాపకాలు లేవు. కికీ పేరుండే పిల్లి వుండేది.

ఈ కికీ దాని ప్రథమ పుత్రుడు. తరువాత కొంత కాలానికి మరొక పుత్రుడు పుట్టాడు. ఈ రెండవదానిపేరు బ్రౌనీ. కుక్కలకు ఒక జబ్బు వచ్చినట్లే, పిల్లులకు ఒక జబ్బు వచ్చింది. ఆ జబ్బుతో ఆ పిల్లి చనిపోయింది. ఆ జబ్బు ఎలా వచ్చిందో నాకు తెలియదు. జబ్బువచ్చినప్పుడది అద్భుతంగా వుండేది. దాన్ని పసిపిల్లవానిని చూసుకొన్నట్లు చూసుకొనేదానిని. అది ఎప్పుడూ ఒక ఆకాంక్షను తెలియజేసేది. అది జబ్బు పడకముందు మేము గ్రంథాలయంలోని ఒక గదిలో ధ్యానం చేసేవారం. ఆ గది శ్రీఅరవిందమహాశయులవారి స్వంతగది. మేము నేలపై కూర్చునేవారం. ఆ గదిమూలలో ఒక కుర్చీ ఉండేది. మేము ధ్యానానికి సమావేశమైనపుడల్లా ఈ పిల్లి వచ్చి చేతులుగల ఆ కుర్చీలో తిష్టవేసి పారవశ్యంలోకి వెళ్ళేది. పారవశ్యంలో కదలికలువుండేవి. నిద్రించేది కాదు. నిజంగా పారవశ్యంలో వుండేది. పారవశ్యచిహ్నాలను కనబరుస్తూ, అద్భుత కదలికలు చేసేది. జంతువుల మాదిరి కలలుకంటూ పారవశ్యంలోనే వుండేది కాని బయటకువచ్చేదికాదు. బయటకువచ్చేందుకు తిరస్కరిస్తూ గంటలతరబడి పారవశ్యంలో వుండేది. అయితే మేము ధ్యానం ఆరంభించేవరకు లోనికి వచ్చేదికాదు. కుర్చీలోనే తిష్టవేసి మేము ధ్యానంచేస్తున్నంతసేపు అక్కడే వుండేది. మేము ధ్యానం ముగించినా అది అలాగే వుండేది. నేను వెళ్ళి ప్రత్యేకపద్ధతిలో పిలుస్తూ స్పృహలోకి తెచ్చే దానను. బయటకు పోవటానికి సమ్మతించేది. లేకుంటే ఎవరువచ్చి పిలిచినా కదిలేది కాదు. ఈ పిల్లికి మానవ జన్మ నెత్తాలనే కోరిక ఉండేది. వాస్తవానికి అది శరీరం వదిలినప్పుడు మానవ శరీరంలో ప్రవేశించింది. మానవ చైతన్యంలో ఇది ఒక చిన్న భాగం మాత్రమే.

ఇది ఒక మహిళ. యితరపిల్లి విషయానికి సంబంధించిన దానికి యిది వ్యతిరేకం అనిపించేటట్లు వుంది. ఇది ఎన్నో జన్మలను గైకొని అంతరాత్మిక దశలను దాటి మానవ శరీరంలో ప్రవేశించింది. ఇది దానికి తగినంత సామాన్యశరీరం మాత్రమే.

పిల్లి అభివృద్ధికి మానవాభివృద్ధికి తేడావుంటుంది.

అలా జరుగుతుంది..... ఇవి అరుదైన ప్రత్యేక సందర్భాలు, కాని జరుగుతాయి.

CWM 7:98-100 శ్రీమాత

అనువాదం: శ్రీ ఆకుల కృష్ణ (9980251895)